# కావ్య కళా పరిచయం

BRAOU

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0304

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
1995

ఐచ్ఛికాంశాలు : తెలుగు (మొదటి పాఠ్యాంశం)

CM - 0304
31-3-97

రచయితల బృందం

డా॥ చేకూరి రామారావు,
(సంపాదకుడు)
డా॥ నాయని కృష్ణ కుమారి
డా॥ మద్దూరి సుబ్బారెడ్డి
డా॥ కె. రామమోహన్‌రాయ్
డా॥ రావికంటి వసునందన్

సహాయ సంపాదకులు
డా॥ కేతు విశ్వనాథరెడ్డి
డా॥ రావికంటి వసునందన్
డా॥ కె. ఎస్. రమణ

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. CM - 0304
Date 31-3-97
Call No

ముఖచిత్రం
చంద్ర

BRAOU

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాదు
తృతీయ పరిష్కృత ముద్రణ. 1991
రీప్రింటింగ్ 1995

© డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం
అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలుచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతిపొందాల.

ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో ఒక భాగం. పాఠ్యప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు: డైరెక్టరు (అకడమిక్) డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం
జూబ్లీహిల్స్, హైదరాబాదు - 500 033

---

ముద్రణ: పద్మశ్రీ గ్రాఫిక్స్, 1-1-770/5, గాంధీనగర్, హైదరాబాదు. Ph : 761 22 83

BRAOU


| | | | |
|---|---|---|---|
| ఖండం | 1 | జానపద కవిత్వం | • |
| ఖండం | 2 | ప్రాచీన కవిత్వం | • |
| ఖండం | 3 | ఆధునిక కవిత్వం | • |

| | | | | | భాగాల క్రమం |
|---|---|---|---|---|---|
| ఖండం | 1 | **జానపద కవిత్వం (మౌఖిక సంప్రదాయం)** | | | **1 – 50** |
| భాగం | 1 | ఏనాది పాట | | .... | 1 |
| భాగం | 2 | మోటపాట | | .... | 12 |
| భాగం | 3 | ఏతం పాట | | .... | 18 |
| భాగం | 4 | కన్నీటిపాట | | .... | 23 |
| భాగం | 5 | నరసింహ్వారెడ్డి కథ (కథాగేయం - చారిత్రికం) | | .... | 28 |
| భాగం | 6 | ఎరుకనాంచారి కథ (కథాగేయం - జానపదం) | | .... | 34 |
| భాగం | 7 | సిద్దయ్య మార్మిక గేయం | | .... | 44 |
| ఖండం | 2 | **ప్రాచీన కవిత్వం (లిఖిత సంప్రదాయం)** | | | **51 – 146** |
| భాగం | 1 | మడివాలు మాచయ్య | | .... | 51 |
| భాగం | 2 | మూషికమార్జాల సంవాదం | – ఆచార్య నాయని కృష్ణకుమారి | .... | 65 |
| భాగం | 3 | ఆంధ్రదేశ వర్ణన | | .... | 76 |
| భాగం | 4 | కుచేలోపాఖ్యానం | | .... | 86 |
| భాగం | 5 | శివధనుర్భంగము | | .... | 94 |
| భాగం | 6 | మనుచరిత్ర | – ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి | .... | 103 |
| భాగం | 7 | యయాతి చరిత్ర | | .... | 114 |
| భాగం | 8 | శ్రీకాళహస్తీశ్వర శతకము | –డాక్టర్ రావికంటి వసునందన్ | .... | 122 |
| భాగం | 9 | వేమన | – ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి | .... | 130 |
| భాగం | 10 | భాస్కర శతకము | – డాక్టర్ రావికంటి వసునందన్ | .... | 136 |
| భాగం | 11 | అన్నమాచార్య సంకీర్తన | – ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి | .... | 141 |
| ఖండం | 3 | **ఆధునిక కవిత్వం (లిఖిత సంప్రదాయం)** | | | **147 – 280** |
| భాగం | 1 | దేశభక్తి | | .... | 147 |
| భాగం | 2 | ఆంధ్ర [illegible] | – ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి | .... | 156 |
| భాగం | 3 | వసంతర్తువు | | .... | 166 |
| భాగం | 4 | స్వేచ్ఛాగానము | | .... | 174 |
| భాగం | 5 | మాతృగీతాలు | | .... | 182 |
| భాగం | 6 | కలతనిదుర | | .... | 189 |
| భాగం | 7 | కష్టజీవి | | .... | 196 |
| భాగం | 8 | పానశాల | | .... | 204 |
| భాగం | 9 | ప్రతిజ్ఞ | | .... | 213 |
| భాగం | 10 | ఆర్తగీతం | | .... | 222 |
| భాగం | 11 | రెండులోకాలు | | .... | 231 |
| భాగం | 12 | నాకొంచెం నమ్మకమివ్వు | – డాక్టర్ కె. రామమోహన్‌రాయ్ | .... | 239 |
| భాగం | 13 | అయిదూ చిటిగొలుసూ | | .... | 244 |
| భాగం | 14 | ఉషస్సంధ్య | | .... | 248 |
| భాగం | 15 | కర్పూర వసంతరాయలు – లకుమనృత్యం | | .... | 253 |
| భాగం | 16 | నరుడు కక్కుతున్న విషం | – డాక్టర్ రావికంటి వసునందన్ | .... | 263 |
| భాగం | 17 | రహదార్లు | – ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి | .... | 268 |


BRAOU

# ఖండం 1 జానపద కవిత్వం (మౌఖిక సంప్రదాయం)

ఈ ఖండంలో మౌఖిక జానపద కవిత్వ సంప్రదాయానికి చెందిన ఏడు భాగాలను విద్యార్థులు అధ్యయనం చేస్తారు. మౌఖిక ప్రసారానికి సంబంధించిన ఆ ఏడు భాగాలు ఇవి : 1) ఏనాదిపాట 2) మోటపాట 3) ఏతంపాట 4) కన్నీటిపాట 5)నరసింహారెడ్డి కథ (చారిత్రిక కథాగేయం) 6) ఎరుక నాంచారి కథ (జానపద కథాగేయం) 7) సిద్ధయ్య మార్మిక గేయం. ఈ భాగాలద్వారా విద్యార్థులు తెలుగు జానపద గేయాల స్వరూప స్వభావాలను తెలుసుకుంటారు.

## భాగం 1 ఏనాదిపాట

విషయక్రమం


1.0 ఉద్దేశం
1.1 ప్రవేశిక
1.2 సూచనలు
1.3 మౌఖిక సంప్రదాయం అంటే
1.4 జానపద కవిత్వం
  1.4.1 జానపద కవిత్వ లక్షణాలు
  1.4.2 జానపద కవిత్వ విభాగాలు
  1.4.3 శ్రామిక గేయం అంటే
1.5 పాఠ్యం
  1.5.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  1.5.2 వ్యాఖ్యానం
  1.5.3 విశేషాంశాలు
1.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
1.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు
1.8 ఆకళింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


BRAOU

### 1.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- జానపద గేయాల్లోని మౌఖిక సంప్రదాయరీతి
- జానపద కవిత్వ లక్షణాలు, విభాగాలు
- శ్రామిక గేయం లక్షణాలు

### 1.1 ప్రవేశిక

నాగరికమైన భాషా సమాజాన్నిటిలోనూ రెండు సాహిత్య సంప్రదాయాలు కనిపిస్తాయి. 1. రాతలో కనిపించే సాహిత్యం. (దీన్నే లిఖిత సాహిత్యం అంటారు.) 2. నోటిమాట ద్వారా వినిపించే సాహిత్యం. (దీన్ని మౌఖిక సాహిత్యం అందాం.) రాత అలవాటు లేని భాషా సమాజాల్లో మౌఖిక సాహిత్యమే ఉంటుంది. కొన్ని నాగరక సమాజాల్లో అయినా రాతకోతలు చేతకాని వ్యవహర్తలు చాలామంది ఉండవచ్చు. వాళ్ళలో కూడా మౌఖిక సాహిత్యమే ప్రచారంలో ఉంటుంది. ఉదాహరణకు తెలుగు మాట్లాడే వ్యవహర్తల్లో చదువురాని వాళ్ళు చాలా మంది

ఉన్నారు. పల్లెల్లో అధిక సంఖ్యాకులకు చదువు రాదు. మౌఖిక సాహిత్యమే వాళ్ళకు ఎక్కువ అనుభవంలో ఉంటుంది. లిఖిత సాహిత్యమైనా పురాణ ప్రవచనం రూపంలోనో, హరికథా గానం రూపంలోనో, మౌఖిక పద్ధతిలో అనుభవం లోకి వస్తుంది. ఈ మౌఖిక సంప్రదాయ సాహిత్యానికి ఎన్ని పేర్లున్నా, జానపద సాహిత్యం అనే పేరు బాగా ప్రచారంలో ఉన్న మాట. ఆ మాట ఈ సాహిత్యానికి ఎంత వరకు సరిపోతుంది ? అనే చర్చ ఒకటుంది. అది అంత ముఖ్యం కాదు. ఆ మాట మనకవసరమైన అర్థస్ఫూర్తి కలిగిస్తే చాలు. నిజానికి పురాణ కవిత్వం. ప్రబంధ కవిత్వం, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం అనే మాటల గురించి అట్లాంటి చర్చలే పూర్వం జరిగినా, ఆ పేర్లు ఆయా కవిత్వాలకు రూఢమయినాయి. జానపద సాహిత్యం అనే మాటా అంతే.

అన్ని ప్రపంచ సాహిత్యాల్లోనూ రెండు ప్రధాన శాఖలను గుర్తించవచ్చు. అవి : 1. పద్య సాహిత్యం 2. గద్య సాహిత్యం. అయితే పద్యం అనేమాట నియతాక్షర గణాలున్న ఉత్పలమాల, చంపకమాలవంటి వృత్తాలకు, సూర్యేంద్ర చంద్రగణాలున్న సీస, గీత, అక్కరల వంటి వాటికి మాత్రమే తెలుగులో ఉపయోగిస్తున్నాం. అరుదుగా రగడలకు కూడా ఉపయోగిస్తున్నాం. కాని కీర్తనలకు, పదాలకు పాటలకు పద్యం అనే మాట వాడటంలేదు. లిఖిత సాహిత్యంలో భాగాలే అయినా, భావకవుల, అభ్యుదయకవుల గేయాలకు కూడా పద్యం అనే మాట వాడుకలో లేదు. గేయం అనే మాట ప్రచారంలో ఉంది. గేయం అంటే 'పాడేది' అని అర్థం. జానపద సాహిత్యంలో వచనం కాని సాహిత్యాన్ని గేయ కవిత్వం అనే అంటారు. నోటి మాట ద్వారా ప్రసారమయ్యే పాటలకు జానపద గేయాలు అనే మాట బాగా ప్రచారంలో ఉంది.

భారతీయ సంప్రదాయంలో కవిత్వం పద్య గద్య సామాన్యమయింది. అయితే ఈ కాలంలో పద్య, గేయరూపాల్లో ఉన్న దాన్నే ప్రధానంగా కవిత్వం అంటున్నాం. ఈ రెండూ కాని వచన కవిత్వం వచనంలో భాగంగా మనం అనుకోటంలేదు. పద్యానికి సన్నిహితమైనదిగానే భావిస్తున్నాం. కథ, నవల, నాటకం అనే రూపాలకు కవిత్వం అనే మాట ఈనాడు వాడుకలో లేదు. ఇవి రాసేవాళ్లని కవులని కూడా వ్యవహరించడంలేదు. అందువల్ల పద్యగేయ రూపంలో ఉన్నదాన్నే కవిత్వం అంటున్నాం. (వచన కవిత్వ విషయం వేరు.)

ఏ భాషలో అయినా వచనాని (గద్యాని) కీ, పద్యానికీ (అంటే గేయానికి కూడా) ప్రధానమైన భేదం ఉంది. వచనంలో మాటలకూర్పు, వాక్యాల పేర్పు ప్రధానం. పద్యంలో కూడా ఇవి ఉండవచ్చు. కాని వచనంలో లేని నియమితమైన అక్షరాల (Syllables) కూర్పు ఉంటుంది. ఆ అక్షర నియతే వాక్యాలకు పద్యత్వాన్ని కలిగిస్తుంది. ఆ అక్షర నియతి గురులఘు క్రమంలో సూర్యేంద్ర చంద్రగణాల క్రమంలో ఉంటుంది. గేయమైతే మాత్రాగణాల క్రమంలోనూ ఉంటుంది.

పద్యాల సంగతి వదిలేస్తే, గేయాలు ప్రధానంగా లయ బద్ధమైనవి. ఒకే పరిమాణం గల కొన్ని అక్షరాల గుంపులను ఒక క్రమంలో వాడటంవల్లా మాటల్లో కొన్ని అక్షరాల మీద ఊనికవల్లా, మాటకీ మాటకీ మధ్య ఉన్న విరామం వల్లా 'లయ' ఏర్పడుతుంది. నోటితో పాడే జానపద కవిత్వంలో లయ ముఖ్యమైంది. ఈ విషయాలను ఆకళింపు చేసుకుంటూ ఈ భాగంద్వారా మీరు శ్రామిక గేయ లక్షణాలను తెలుసుకుంటారు.

## 1.2 సూచనలు

ఈ ఖండంలో ఇచ్చిన జానపద కవితా భాగాలను చదవండి. ఇతర సంకలనాలనూ చూడాలి. మరీ ముఖ్యంగా అవసరంగా కవితలల్లే జానపద కవుల కథాగానాన్ని వినండి. రచనాలక్షణాలను పరిశీలించాలి. ఇతర కవితా లక్షణాలలో, మార్గాలతో పోల్చి విలువ కట్టాలి. జానపద కవిత్వంలోని సహజ కవితా రీతినీ, లయబద్ధమైన పదాల కూర్పునూ పరిశీలిస్తూ ఈ భాగంలోని 1.5 లో ఇచ్చిన 'ఏనాదిపాట' అనే శ్రామిక గేయాన్ని అధ్యయనం చెయ్యాలి. శ్రామిక గేయ స్వరూప స్వభావాలు చక్కగా బోధపడడానికి పాఠ్యానికి ముందుగా 1.4.1, 1.4.2, 1.4.3 లలోని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

## 1.3 మౌఖిక సంప్రదాయం అంటే

నోటి ద్వారా పాడుకుంటూ, ప్రచారానికి తెచ్చే జానపద కవిత్వ పద్ధతిని మౌఖిక సంప్రదాయం అంటారు. జానపద కవిత్వ పద్ధతుల్లో ఇది మౌలికమైన, అతి ముఖ్యమైన సంప్రదాయం. సంప్రదాయ కవిత్వం, ఆధునిక

BRAOU

కవిత్వం వంటివి పుస్తకాలద్వారా ప్రచారానికి వస్తాయి. కాబట్టి ఆ పద్ధతులు లిఖిత సంప్రదాయానికి చెందినవి. అక్షరాస్యులు కాని జానపద కర్షకులు, కార్మికులు, శ్రామికులు ఒకరి ద్వారా విని మరొకరు నేర్చుకునే ఈ భాగంలోని 'ఏనాదిపాట' వంటి కవిత్వ పద్ధతి మౌఖిక సంప్రదాయానికి చెందింది.

## అభ్యాసం – 1

(భాగం చివర ఇచ్చిన జవాబుతో మీ జవాబు సరిపోల్చుకోండి. మీ సౌకర్యం కోసం కొన్నిచోట్ల జవాబు విస్తృతంగా ఇవ్వడం జరిగింది).

మౌఖిక సంప్రదాయం అంటే ఏమిటో తెలపండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 1.4 జానపద కవిత్వం

నిరక్షరాస్యులైన జానపదులు అప్రయత్నంగా తమ సహజ భావాలను కవిత్వ రూపంలో వెలువరించినప్పుడు ఆవిర్భవించేది జానపద కవిత్వం. సంతోషం, విషాదం, కరుణ, శృంగారం మొదలైన మానసిక భావాలను వెలిబుచ్చడానికీ, పనిపాటలు చేసుకునేటప్పుడు కలిగే శ్రమను మరిచిపోవడానికీ, తీరిక సమయాల్లో, వేడుకల్లో, సంబరాల్లో పాడుకునే పాటలూ, కథాగేయాలూ వంటివి జానపద కవిత్వ శాఖలోకి వస్తాయి. నైసర్గికమైన భావప్రకటన ఆలంబనంగా వెలువడుతుంది కాబట్టి జానపదకవిత్వానికి ఛందోబంధాలూ, అలంకార సంప్రదాయాలూ అడ్డురావు. ప్రకృతి సౌందర్యం వంటి సహజ సౌందర్యంతో జానపద కవిత్వం ఉంటుంది.

BRAOU

### 1.4.1 జానపద కవిత్వ లక్షణాలు

మిగితా అన్నిటిలాగే జానపద కవిత్వాన్ని నిర్వచించటం కష్టమైన పని. ఏ నిర్వచనం ఇచ్చినా అసమగ్రమే అవుతుంది. అందువల్ల నిర్వచించటం మాని కొన్ని ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాలను గుర్తిద్దాం.

1. జానపద కవిత్వం ప్రధానంగా మౌఖికం.దీనిపుట్టుక నోటి మాటలోనే, వ్యాప్తి కూడా నోటిమాట ద్వారానే. అయితే అప్పుడప్పుడు కొన్ని కథా గేయాలు ప్రాచీన కాలంలో కూడా కొందరు రాసుకున్నారు. 'పల్నాటి వీర చరిత్రం' అట్లాంటిదే నంటారు. ఇటీవలి కాలంలో పరిశోధకులు సేకరించి ప్రచురిస్తున్నారు. అయినా దాని ప్రధాన ప్రసారం మౌఖికంగానే.

2. జానపద కవిత్వం ఆశువుగా పుడుతుంది. కవితారచన (పాటలో మాటల కూర్పు) కూ, పాట పాడటానికీ మధ్య విలంబం ఉండదు. రచించడం, పాడటం ఒకేసారి జరుగుతాయి. ఈ లక్షణాన్ని ఆశు లక్షణం అంటారు. పూర్వం కొంతకాలం కిందట అవధానాలు చేసేవారు. వృత్త గీత సీసాలను ఇట్లా ఆశువుగా చెప్పేవారు. నిజానికివి లిఖిత సాహిత్య రూపాలు అయినా అభ్యాసంవల్ల ఇట్లా చెయ్యగలిగేవారు. తిరుపతి వేంకటకవులు, కొప్పరపు కవులు ఈ విధంగా ఆశువుగా పద్యాలు చెప్పేవారు. జానపద సాహిత్యం ప్రధానంగా ఇట్లా ఉంటుంది.

ముఖ్యంగా కథాగేయాలకు ఈ లక్షణం ఉంటుంది. ఒక మూసలాంటి కథ ఉంటుంది. ఒక ప్రధానమైన బాణీ ఉంటుంది. మిగతాదంతా పాట పాడేవాడు పాడే సమయంలోనే అల్లుతాడు.

3. జానపద కవిత్వంలో పాద విభజన స్పష్టంగా ఉంటుంది.

లిఖిత సాహిత్యంలో పాద విభజన అన్ని చోట్లా ఉచ్చారణలో తెలీదు. అక్షరాల సంఖ్యనుబట్టో, గణాల సంఖ్యనుబట్టో తెలుసుకుంటాం. పాటలో మాత్రం పాద పాదానికి విరామం ఉంటుంది. జానపద కవిత్వం పాదాంత విరామం ఉచ్చారణబద్ధమైంది. లిఖిత సాహిత్యంలో ప్రధానంగా సంఖ్యాబద్ధమైంది.

4. జానపద కవిత్వం లయబద్ధమైంది. జానపద కవిత్వంలో పాదంలో మళ్ళీ అంతర్నిర్మాణం ఉంటుంది. పాదంలో ఒకే ఉచ్చారణ పరిమాణం కలిగిన కొన్ని అక్షరాల గుంపులు (ఒకే పరిమాణం అక్షరాలకు కాదు, గుంపులకు) ఒకే క్రమంలో రావటంవల్ల లయ ఏర్పడుతుంది. పునరావృతమైన ఏక పరిమాణంగల అక్షరాల గుంపుల క్రమోచ్చారణే లయ. పదాలకున్న ఊనిక, (ఒక మాటలో ఒక అక్షరానికి మిగతా అక్షరాలకన్నా ఉన్న ఉచ్చారణ ప్రాధాన్యాన్ని ఊనిక అంటారు) మాటకీమాటకీ మధ్య ఉన్న స్వల్ప విరామం లయను ప్రస్ఫుటం చేస్తాయి. త్రిశ్ర, చతురశ్ర, ఖండగతుల లయలు ఇట్లా ఏర్పడినవే. వీటినే మాత్రా ఛందస్సుగా వర్ణిస్తారు. లయకు మూలమైన అక్షరాల గుంపులను మాత్రా గణాలు అంటారు. అక్షరం అంటే రాతలో చూపించేదనికాదు.

ఒక అచ్చు ప్రధానాంగంగా ఉండి ముందు వెనకల హల్లులు కూడా ఉండే ఒక ధ్వని సమూహాన్ని అక్షరం అంటారు. ఇంగ్లీషులో దీన్ని సిలబుల్ (Syllable) అంటారు.

[మాత్రా గణాల గురించి, లయ గురించి తెలుగు మౌలిక అంశాలులో గేయ కవిత్వం అనే భాగం చూడండి].

అయితే పదాలలో అక్షరాలకున్న సహజ హ్రస్వదీర్ఘాలు పాట పాడేటప్పుడు లయ కోసం అటూ ఇటూ మారవచ్చు. అక్షరాలు తక్కువైనచోట రాగంలో పూరించుకోవచ్చు. అచ్చులోనూ, రాతలోనూ కనిపించేది ప్రధానం కాదు. చెవికి వినిపించేది ముఖ్యం.

BRAOU

5. కథాకావ్యాల్లో ప్రధానమైన ఒక మూస ఉంటుంది.

బొబ్బిలి కథ, కామమ్మ కథ, బాలనాగమ్మ కథ వంటి కథా కావ్యాల్లో కథ, బాణీ ముందే ఏర్పడే ఉంటాయి. కథకుడు పాడుతూ ఉన్నప్పుడు పాటలు అల్లుకుంటూ ఆశువుగా చెప్పుకుంటూ పోతాడు. ఒకసారి చెప్పింది ఇంకోసారి చెప్పిందానికి పునరావృత్తి కాదు. పునారచన, చిన్న చిన్న పాటలు పునరావృత్తి కావచ్చు.

6. జానపద కవిత్వం కాలానికి కట్టుబడదు.

జానపద కవిత్వం అప్పటికప్పుడు నోటితో ఆశువుగా అల్లేది కాబట్టి ఆ కవిత్వానికి రచనా కాలం పాడేవాడు పాడినప్పుడే. కథా కావ్యాల్లో చెప్పిన కథ చారిత్రకాంశం అయితే దాని తర్వాతది అని మాత్రమే చెప్పగలం. అంతేకాక కొన్ని భాషాంశాలనుబట్టి ఫలాని కాలం కన్నా తరవాతది అని చెప్పవచ్చు. అయితే కథ పాతదే అయినా పాడేవాడు అప్పటికప్పుడు ఆశువుగా చెప్పటంవల్ల అది సమకాలీన రచన అవుతుంది. ఆ పాట మూస బాణీ ఎంతోకాలం నుంచి తరతరాలుగా వచ్చి ఉండవచ్చు. అందువల్ల ప్రాచీనత కూడా ఉంటుంది. పాతదీ ఉంటుంది. కొత్తవీ చేరతాయి. కొన్ని తరాలు పాడిన అనుభవం పాట రూప కల్పనకు ఉపయోగిస్తుంది. అందువల్లనే జానపద సాహిత్యానికి ప్రసిద్ధుడైన ఒక రచయిత ఉండడని అనేది. జానపద సాహిత్యానికి ఇంకా గుర్తించదగిన లక్షణాలున్నాయి. పైన చెప్పినవి ముఖ్యమైనవి. మిగతా లక్షణాలను ఇతర గ్రంథాల ద్వారానూ, స్వయంగా పరిశీలనవల్లనూ తెలుసుకోవచ్చు.

జానపద సాహిత్యాన్ని లిఖిత సాహిత్య ప్రమాణాలతో విలువ కట్టగూడదు. ఏ సాహిత్యానికైనా అన్ని కాలాలకూ, అన్ని ప్రక్రియలకూ వర్తించే ప్రమాణాలు లేవు. ఏ సాహిత్యానికైనా దాని వాడకందార్లు మాత్రమే విలువ కడతారు. జానపద సాహిత్యమైనా అంతే.

## అభ్యాసం – 2

జానపద కవిత్వం ఎలా పుడుతుంది ? దాని లక్షణాలేమిటి ?

### 1.4.2 జానపద కవిత్వ విభాగాలు

జానపద కవిత్వంలో గేయశాఖ, వచనశాఖ అనే రెండు ముఖ్య విభాగాలున్నాయి. వాటిలో అనేక ఉపశాఖలు ఉంటాయి. కథారహితంగా, కథా సహితంగా ఉండే జానపద సాహిత్యంలోని వివిధ శాఖలను ఈ పట్టిక ద్వారా ప్రదర్శించవచ్చు.

**జానపద సాహిత్యంలో వివిధ శాఖలు**




[నాయని కృష్ణకుమారి (1977) తెలుగు జానపదగేయ గాథలు అనే పుస్తకంలోనుంచి]

BRAOU

### 1.4.3 శ్రామిక గేయం అంటే

పనిపాటలు చేసుకునే రైతులూ, కూలీలూ, కార్మికులూ పాడుకునే జానపదగేయాలు శ్రామిక గేయాలు. ఈ పాటలు పాడుకోవడం ద్వారా వారు పనిలో తాము పడుతున్న శ్రమను మరిచిపోతారు. ఈ పాఠంలో ఆహారాన్ని సంపాదించుకుంటూ ఏనాదులు తమ శ్రమను మరిచిపోవడానికి పాడుకునే 'ఏనాదిపాట' ఒక శ్రామిక గేయం.

### అభ్యాసం – 3

శ్రామిక గేయం అంటే ఏమిటి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 1.5 పాఠ్యం

| | | |
|---|---|---|
| చించెరువు కట్టకిందా | – | చిన్నాయన బాయికాడ |
| అర్దవో కుందేలి | – | అనుగూడ కుందేలి |
| రెడ్డెబ్బ పొదలోన | – | లేసిందే కుందేలి |
| టంగెత్తి బయటెయ్యి | – | టంగు పొరెత్తి బయటెయ్యి |
| ఎర్రబండల్లో | – | ఎలికలున్నాయి |
| తొవ్వుకుందాం | – | రాయె చిన్నదాన |
| టంగెత్తి బయటెయ్యి | – | టంగు పొరెత్తి బయటెయ్యి |
| గడ్డ తొవ్వుతుంటె | – | బిడ్డ పుడతుంటె |
| తేనె తీస్తుంటె | – | సెయ్యి నాకతుంటె |
| కాయ గాని | – | కాయ పేరేమయో |
| ఏరు గాని | – | ఏరు పేరేమయో |
| మామ గాని | – | మామ పేరేమయో |

### 1.5.1 కఠిన శబ్దాలకు అర్థాలు

చించెరువు = చిన్న + చెరువు – ఇది చింత చెరువు కూడా కావచ్చు. పాడుకలో ఉన్న ఇటువంటి నిర్మాణక్రమం కలిగిన కొన్ని పదాలను చూస్తే ఆ విషయం స్పష్టమౌతుంది. ఉదా : చిన్న + చెల్లి = చించెల్లి, చింత + చిగురు = చించిగురు. చిన్న + నాయన = చిన్నాయన (పినతండ్రి)

తీరాంధ్ర ప్రాంతంలో బాగా ముసలి వాళ్లను పెద్దాయన అని, నడివయసు వారిని చిన్నాయన అని అవతలివారు గౌరవప్రదంగా పిలవడం వినిపిస్తుంది. బహుశ ఈ 'చిన్నాయన' అటువంటి ప్రౌఢవయస్కుడూ, గౌరవ



BRAOU

భాజనుడూ ఊరికి మోతుబరి అయిన వ్యక్తిని ఉద్దేశించిన ప్రయోగం అయి ఉండవచ్చు. మోతుబరి పేర **ప్రచారంలో** ఉన్న బావి, చిన్నాయన బావి.

ఇక్కడి దీర్ఘం కేవలం లయకోసం. "రెడ్డెబ్బపాద" ఒక వ్యక్తి పేరుమీద పిలువబడే పాద. ఈ జాతి, తాము సంచరించే ప్రదేశాలకు చిత్ర విచిత్రాలయిన పేర్లు పెట్టుకుంటారు. సాధారణంగా ఆ పేర్లు విశేష నామాలయి ఉంటాయి. ఈ పాఠంలో కనిపించే రెడ్డెబ్బపాద, ఎర్రబండ అటువంటివి.

గడ్డ = గెడ్డ = కాలువ

కుందేలి = పాడుకునే ఏనాదిగారి యాసలో 'కుందేలు'

టంగు = మట్టినీ, గడ్డినీ చెక్కి, ఎత్తిపోసే పార

టంగుపార = పలుగు

ఎలిక = ఎలుక (యాసలో)

### 1.5.2 వ్యాఖ్యానం

మనదేశంలో ఎన్నో కులాలున్న విషయం మనందరికీ తెలిసిందే. కులాలకు తోడు తెగలూ, జాతులూ కూడా ఉన్నాయి. తెగ అంటే మనం ఇంగ్లీషులో వాడే (Tribe) అన్న పదానికి సమానార్థకం. కొండల మీదనే తొలుత నుండీ నివాసం కలిగి ఆటవిక సంపదనే తమ జీవితానికి ఉపాధిగా గ్రహించిన వారినీ; కొండల్లో ఉండే కొద్దిపాటి చదును ప్రదేశాలనూ ఏటవాలైన మెత్తని మట్టితో కూడిన ప్రదేశాలనూ గుర్తించి, అక్కడ పెరిగిన చెట్లను కూల్చి, పోడు వ్యవసాయం చేసుకునే వాళ్ళనూ కొన్ని తెగలుగా ప్రభుత్వం గుర్తించింది. వీళ్ళంతా గిరిజనులు. వీళ్ళుకాక తెగలుగా గుర్తింపబడిన వారిలో సంచార జాతులకు చెందిన వారుకూడా ఉన్నారు. ఈ జాతులకు స్థిరమైన నివాస స్థానం మనం స్పష్టంగా నిర్దేశించలేము. ఎప్పుడు, ఎక్కడ అన్నం దొరికితే అక్కడికి, తమ సంసారాలను, కావిళ్ళలోనో గంపలలోనో సర్ది, వీళ్ళు వెళ్లిపోతుంటారు. అనువైన కాళీప్రదేశం దొరికినప్పుడు, చిన్నచిన్న గూళ్ళలాంటి ఇరవుపట్లు (ఇళ్ళు) నిర్మించుకుంటారు. వీళ్ళు పూసలమ్ముతారు. వెదుళ్ళు మలచి తిరగళ్ళూ రోళ్ళూ వంటి వస్తువులు చేస్తారు. జంతువుల కొమ్ములతో దువ్వెనలూ, బొమ్మలూ చేస్తారు. ఇటువంటివే చిన్న చిన్న వృత్తులు చేపట్టి పొట్టపోసుకుంటారు. ఆ ప్రదేశం తమ సంపాదనకు అనువుగా లేదని తోస్తే మళ్ళీ సంసారమంతా కావిళ్ళలో సర్ది మరోచోటికి ప్రయాణం కడుతుంటారు.

BRAOU

ఈ సంచార జాతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు 1) ఏనాదులు 2) ఎరుకులు 3) లంబాడీలు. ఏనాదులు ఎక్కువగా తీర ప్రదేశంలో నెల్లూరు మొదలైన చోట్ల కనిపిస్తుంటారు. పందుల పెంపకం, బుట్టల అమ్మకం, కావలి మొదలైన పనులు వీరి ప్రధాన వృత్తులు. వీళ్ళ మాతృభాష తెలుగు.

ఏనాది అనే మాట 'అనాది' అనే మాటకు దగ్గరగా ఉంది. అంతమాత్రంచేత మొదటి మాట రెండవ మాట నుండి పుట్టింది అని చెప్పడానికి వీలుకాదు. 'ఏనాం' అనే మాట తెలుగులో సముద్రాన్ని సూచిస్తుంది. ఈ ఏనాదులు సాగరాంధ్రులు కాబట్టి, వీళ్ళ జాతివాచక శబ్దం సముద్రాన్ని సూచిస్తున్నదని ఊహ చేయవచ్చు. ఇది చాలా ప్రాచీనమైన జాతి.

ఇప్పుడు మనం చదివే యీ భాగం వాళ్ళ ఆహార సేకరణకు సంబంధించింది. వీళ్ళు ఇటువంటి పాటల్ని పనులు చేసేటప్పుడే పాడుతుంటారు. రోడ్లు వేసే పనిలో మట్టి తవ్వకాలు సాగిస్తూ ఈ పాట పాడినట్లు కనిపిస్తుంది. అంటే ఇటువంటి పాటలు జానపద వాఙ్మయ శాఖలో, శ్రామిక గేయాల విభాగం కిందకి వస్తాయి.

ఇటువంటి పాటలు పాటంతట అవిగా, అప్రయత్నంగా ఒకపాదం తరువాత మరొకటిగా రూపు చెందుతుంటాయి. ముఖ్యంగా శ్రామిక గేయాలు సమూహంగా పాడబడేవి. ప్రారంభంలో మొదటిపాదం ఒకరు చెప్పిన తరువాత, దాన్ని తిరిగి చెప్పమంటారు.

పాఠ్య భాగమైన ఈ పాటలో ఉన్న భావం ప్రధానంగా ఆహార సంపాదనకు సంబంధించినది – ఇది శ్రామికగేయం. సంచార జాతులకు సంబంధించిన ఏనాదులు, ఏదైనా పని దొరికినప్పుడు శ్రామికులు కూడా.

కాలువలు తవ్వడం వంటి ఉప్పరిపనులు వీరికి తెలును. తవ్వకం పనిముట్లు సమకూర్చుకుని కాలువలు తవ్వుతూ పాడే శ్రామికగేయం ఇది. ఇందులో వాళ్ళ ఆహార విషయాలైన కుందేళ్ళను ఎలుకలను పట్టడం, తేనెపెరల్ని పిండడం వంటి చర్యలు సూచింపబడ్డాయి.

చివరి మూడుపాదాలలోని విషయం, పాటపాడేవాడు దేన్ని ఉద్దేశించి ప్రకటించాడో అతడు సాక్షాత్తూ మన ఎదుట పాడుతున్నప్పుడు అడిగితే గాని తేలే విషయం కాదు. ఇటువంటి అజ్ఞాత లక్షణం ఈ గేయాల్లో తరచూ మనకు కనిపిస్తూ ఉంటుంది.

### 1.5.3 విశేషాంశాలు

జానపద గేయాలన్నీ లయ ప్రధానంగా సాగేవి. శబ్దలయను వాళ్ళు మాత్రల ద్వారా సాధిస్తారు. మాత్ర అంటే ఒక లిప్తకాలం ఉచ్చరించే శబ్దం. అది రెండు లిప్తలయితే ఆ శబ్దాన్ని గురువు అని పిలుస్తాము. ఉదాహరణకు క అనేది ఒక మాత్రకాలం ఉచ్చరింపబడి లఘువైతే, కా అనేది రెండు మాత్రల కాలం ఉచ్చరింపబడి గురువు అవుతుంది. గురు లఘువుల్ని మాత్రమే మనం లిపిలో చూపించగలం. రెండు మాత్రలకంటే ఎక్కువసేపు ఉచ్చరింపబడే శబ్దాన్ని మనం లిపిలో చూపించలేం. ఆ భేదాన్ని కేవలం వినడం వలన మాత్రమే మనం తెలుసుకోగలం.

జానపద గేయాలలో ఒక శబ్దంలో గాయకుడు లయకు అనుగుణంగా తానెన్ని మాత్రలు చేర్చదలచుకుంటే అన్ని మాత్రలు చేర్చవచ్చు.

ఉదాహరణకు,

" శ్రీరామ । భూపాలుడూ ।

పట్టాభి । షేకుడై । కొలువుండగా" అనే పాదాలను పరిశీలిద్దాం.

ఇందులో పాదం అయిదు మాత్రల లయలో నడుస్తుంది. చివర డూ, గా అనేవి అచ్చులో చూస్తే రెండు మాత్రల శబ్దాలుగా కనిపించవచ్చు. కాని అది నిజం కాదు. పాట పాడేటప్పుడు ఆ ఏకాక్షరాలను అయిదు మాత్రలంత కాలం సాగదీసి ఉచ్చరిస్తారు. అంటే ఈ పాట మొత్తం అయిదు మాత్రల కొకసారి లయను కోరుతూ సాగుతున్నట్లుగా మనం గుర్తించవచ్చు.

చూసిన పాదాలను బట్టి జానపద ఛందస్సుల విశ్లేషణ అచ్చులో చెయ్యడం కష్టం. కారణం పాటపాడేవాడు తాను తీసే దీర్ఘాల ద్వారా అదనంగా తెచ్చుకుంటున్న మాత్రల వివరాలు అందులో ఉండవు.

ఉదాహరణకు మీ పాఠ్యాంశమైన ఈ పాటను గమనించండి.

"చించెరువు కట్టకింద

చిన్నాయన । బావికాడ ।"

అని కేవలం దీన్ని లిపిలో చూసి విభాగం చేస్తే దీన్ని 5, 6/5, 6 మాత్రల కింద విడగొట్ట వలసి ఉంటుంది. కానీ పాడే పద్ధతిని బట్టి

చించెరువు । కట్టకిం । దా5

చిన్నాయన । బావికా । డా5

అని విరిచి చివరి దీర్ఘాలకు 5 మాత్రల ప్రతిపత్తిని కలిగించవచ్చు.

కాబట్టి మౌఖిక ప్రచారం కలిగి, లయాత్మకంగా సాగే జానపద గేయాలను, పాడే పద్ధతిని విని, గ్రహించకుండా కేవలం అచ్చులో చూసి ఛందో విభాగం చేయడానికి పూనుకోకూడదు. ఈ నియమం ఏ జానపద గేయానికైనా వర్తిస్తుంది.



BRAOU

ఈ గేయంలో ప్రత్యేకించి చెప్పుకోదగిన భావ చిత్రాలు గానీ, అలంకారాలు గానీ లేవు. కథ చెప్పడానికి కావలసిన సారళ్యమూ, సూటిదనమూ ఉన్నాయి. తమ జీవితాలకు సంబంధించిన సమాజ చిత్రణ కనిపిస్తుంది.

**అభ్యాసం – 4**

ఏనాది పాట శ్రామిక గేయమని ఎట్లా నిర్ధారించవచ్చు ?

---

---

---

---

---

---

## 1.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- జానపద కవిత్వ ప్రక్రియలను పరిచయం చేయడం ఈ భాగం ఉద్దేశం.
- ఒకరు పాడగా విని మరొకరు నేర్చుకునే కవిత్వ సంప్రదాయాన్ని 'మౌఖిక సంప్రదాయం' అంటారు.
- జానపద కవిత్వం ప్రధానంగా మౌఖిక సంప్రదాయానికి చెందిన సాహిత్యశాఖ.
- జానపద కవిత్వ లక్షణాలు ప్రధానంగా ఎనిమిది.
- జానపద కవిత్వం /సాహిత్యం–కథాసహితం, కథారహితం.

  1. దృశ్యశాఖ
  2. శ్రవ్యశాఖ – వంటి అనేక ఉపశాఖలుగానూ విస్తరించింది.
- పనిచేసుకునే జానపదులు తమ శ్రమను మరిచిపోవడానికో, లేదా ఆనందం కలగడానికో పాడుకునే పాట శ్రామిక గేయం.
- ఆహార సంపాదనలో ఏనాదులు పాడుకునే పాట 'ఏనాది పాట'
- ఈ శ్రామిక గేయం లిఖితరూపంలోని అక్షరక్రమంతో సంబంధం లేకుండా, జానపదుల బాణీలో లయప్రధానంగా సాగింది.

## 1.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. 'ఏనాది పాట' లోని కవిత్వ వస్తువును వర్ణించండి.
2. జానపద కవిత్వ లక్షణాలనూ విభాగాలనూ సోదాహరణంగా చర్చించండి.



BRAOU

II ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. 'ఏనాదిపాట'లోని అజ్ఞాత విషయాన్ని చర్చించండి ?

2. సంచార జాతులకు చెందిన ఆహారం ఎటువంటిదని ఈ పాట నిర్దేశిస్తున్నదో తెలపండి?

## 1.8 ఆకళింపు ప్రశ్నలు

- ఈ భాగంలోని భాషా విశేషాంశాలను పరిశీలించండి.
- ఇందులోని తెలుగుమాటలనూ, మాండలిక పదాలనూ ఒక పట్టికగా రూపొందించండి.
- అవసరమైతే ఆ మాటలకు అర్థాలను నిఘంటువు ద్వారా పరిశీలించండి.
- జానపద గేయాలను పాడేటప్పుడు మారే లయలోని మాత్రల సంఖ్యకూ, లేఖన పద్ధతిలో ఉన్న అక్షర క్రమానికి ఉన్న భేద సాదృశ్యాలను గమనించండి.

## అభ్యాసాలకు జవాబులు

1. 'మౌఖికం' అనే పదానికి నోటికి సంబంధించింది అని అర్థం. కేవలం నోటిద్వారానే ప్రచారం పొందే జానపదగేయకవిత్వం, సాహిత్యం మౌఖిక సంప్రదాయానికి చెందింది. ఒకరు పాడగా విని మరొకరు నేర్చుకోవడం ద్వారా ఈ సాహిత్యశాఖ అభివృద్ధి చెందుతుంది. జానపద సాహిత్యానికి చెందిన శ్రామిక గేయాలు, వీరగాథలు, చారిత్రక గేయాలు, జోలపాటలు, లాలి పాటలు మొదలైనవన్నీ మౌఖిక సంప్రదాయానికి చెందినవే. పుస్తకాలద్వారా ప్రసారం కలిగిన సంప్రదాయ, ఆధునిక కవిత్వశాఖలు లిఖిత సంప్రదాయానికి చెందినవి. సాహిత్యంలో మౌఖిక, లిఖిత సంప్రదాయాలకు చెందిన కవిత్వాలు - రెండు ప్రధాన శాఖలు.

2. జానపద కవిత్వాన్ని వెలువరించేవారు సామాన్యంగా నిరక్షరాస్యులైన జానపదులు, శ్రామికులు, కార్మికులు, కర్షకులు. రచనా విధానంలో ఉన్న ఈ ప్రత్యేకత జానపద కవిత్వం మొదటి లక్షణం. లయప్రధానంగా, మాత్రాగణబద్ధమై ఉండడం రెండో లక్షణం. ఇవికాక జానపద కవిత్వంలో సామాన్యంగా ఈ లక్షణాలు కూడా కనిపిస్తాయి.

   1. జానపద కవిత్వం ప్రధానంగా మౌఖికం
   2. జానపదులనోట ఇది ఆశువుగా ఆవిర్భవిస్తుంది.
   3. జానపద కవిత్వంలో పాద విభజన స్పష్టంగా ఉంటుంది. లయ, తూగు అక్షరక్రమంలో సంబంధం లేకుండానే సమంగా ఉంటాయి. అందుకే పాడేటప్పుడు జానపదులు (అచ్చులో) దీర్ఘంలేని చోటకూడా దీర్ఘంతీస్తూ పాడతారు.
   4. జానపద కవిత్వం కాలాతీతం. అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ, జానపదులెవ్వరి నోటనైనా ఇది ఆవిర్భవిస్తుంది.
   5. దీనిలో శ్రామికగేయాలు, కథాగేయాలు, చారిత్రక గేయాలు మొదలైన సాహిత్య ప్రధాన శాఖలు ఉంటాయి.
   6. ఆలంకారిక దృక్పథానికి, ఛందస్సుల బందోబస్తుకూ దూరంగా, నిసర్గరమణీయమైన, స్వభావ సిద్ధమైన రీతిలో జానపదకవిత్వం పుడుతుంది. స్వచ్ఛమైన స్వేచ్ఛా పద్ధతిలో ప్రసరిస్తుంది.

   ఎలాంటి సాహిత్య నియమాలూ లేకుండానే జానపదకవిత్వం పుడుతున్నా, సమగ్ర పరిశీలనద్వారా వివేచనద్వారా ఈ విధంగా మనం జానపద సాహిత్యానికి కొన్ని లక్షణాలు కూర్చుకోవచ్చు.

BRAOU

3. జానపదులు శ్రమచేస్తూ పాడుకునే పాటను 'పనిపాట' లేదా 'శ్రామిక గేయం' అంటారు. శ్రమలోని అలసటను పోగొట్టే సాధనంగా జానపదులు దీన్ని ఉపయోగించుకుంటారు.

4. ఈ పాటలో గడ్డ తవ్వడం యొక్క ప్రసక్తి కన్పిస్తుంది. ఏనాదులు కాలువలు తీసే పని చేస్తారు. మట్టి తవ్వడం వీరికి లొంగి వచ్చినపని, అట్లాగే తవ్వకం సాధనాలైన టంగుపార వంటి సాధనాల వాడుక ఇందులో ఉంది. దీనిని బట్టి ఇది శ్రామిక గేయంగానూ ఇందులోని విషయం ఆహార సంపాదనకు సంబంధించిన విషయం గానూ కన్పిస్తున్నది.

– ఆచార్య నాయని కృష్ణకుమారి

BRAOU

# భాగం 2 మోటపాట

విషయక్రమం

2.0 ఉద్దేశం
2.1 ప్రవేశిక
2.2 సూచనలు
2.3 పాఠ్యం
 2.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
 2.3.2 వ్యాఖ్యానం
 2.3.3 విశేషాంశాలు
2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
2.6 ఆకళింపు ప్రశ్నలు
 అభ్యాసాలకు జవాబులు

## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- 'పనిపాట' లక్షణాలు
- జానపద గేయాల్లోని సహజభావానుభూతి వ్యక్తి, కవిత్వాభివ్యక్తి.
- శ్రామిక గేయాల్లో ప్రతిబింబించే శృంగారం, కరుణా వంటి రస సంయోజన పద్ధతి

BRAOU

## 2.1 ప్రవేశిక

మోటపాట కూడా ఒక శ్రామిక గేయం. ఈ గీతంలోని నాయిక మోటకొట్టుకొని జీవించే తన ప్రియుని గురించి వెలువరించిన వివరాల్లో శృంగార కరుణ రసాలు కూడా ఉన్నాయి.

తెలంగాణాలోని నల్లగొండ జిల్లా నకిరెకల్లు గ్రామానికి చెందిన శ్రామిక గేయం ఇది. ఇందులో మోటకు సంబంధించిన వర్ణన కనిపిస్తుంది. స్త్రీ పాడిన ఈ పాటను చదివి వినిపించిన వారు తడిసిన పాపయ్య, సంకోజి భద్రయ్య, కొండ లింగయ్య, బొడ్డు వెంకులు అనే పురుషులు. ఈ భాగం ద్వారా మీరు శ్రామిక గేయాల్లో పరిమళించే సహజ భావానుభూతినీ, స్వతంత్ర కవిత్వాభివ్యక్తి పద్ధతినీ, వివిధ విభిన్న రసాల ప్రతిపత్తినీ తెలుసుకోగలుగుతారు.

## 2.2 సూచనలు

ఈ ఖండంలో ఇచ్చిన జానపద కవితా ఖండికలన్నీ చదవండి. మరీ ముఖ్యంగా ఆశువుగా కవితల్లే జానపదుల కథాగానాన్ని వినాలి. ఆ రచనా లక్షణాలను పరిశీలించాలి. ఇతర సంకలనాలు కూడా చూడండి. వాటితో ఈ భాగాలను పోల్చి విలువకట్టే ప్రయత్నం చెయ్యాలి. ఈ భాగంలోని 2.3.1, 2.3.2, 2.3.3 లలో ఇచ్చిన వివరాల సహాయంతో ఈ పాఠ్యం అధ్యయనం చెయ్యాలి.

## 2.3 పాఠ్యం

చింతకిందిరో మోట వాడరా
చిగురు యామంచి ఎడ్లజోడోయీ

నీ యెద్దుల మెడమీద మదిర కాడోయీ
నీ యెద్దుల మెడకున్నా బద్దెపలుపోయీ
నీ వలుపాటి ఎద్దూర వన్నెలాడోయీ
నీ దాపాటి ఎద్దోయీ ధర్మరాజోయీ
నీ వలుపాటి దారోయీ పిల్లబాటోయీ
నీ దాపాటి బాటోయీ దండు బాటోయీ
నీ మోకు పేరోయీ ఆకుతీగోయీ
నీ దండెడ తాడోయీ పెంజరగున్నోయీ
నీ తొండపు తాడోయీ కిన్నెర తీగోయీ
నీ మోట పేరోయీ మొగిలిగుమ్మోయీ
నీ బిళ్ళ పేరోయీ భీమరథమోయీ
నీ కదురు పేరోయీ కన్నెలాడోయీ
నీ బొక్కెన పేరోయీ బొడ్డు గిన్నోయీ
నిన్ను జూడరో నీళ్ళకొస్తిరా
నీళ్ళు లేవూరా నీవు లేవూరా

ఎక్కడ జూచిన ఎవరూ లేరోయీ
చెప్పరాని దుఃఖమొచ్చేనూ
కంటిశోకము కడుప నిండేనూ
కడువల నీరోయీ మడువ సాగేనూ
మడువ మలిపే మామ కొడుకూరా
ముత్తెమంతాదోయి ముక్కుతీగోయీ
మడువకేసి నువు మళ్ళగట్టోయీ
వంపు బట్టెను వరదలెల్లేనూ
మిట్ట పట్టెను మిగులు పారేనూ
జామతోటను జాములెల్లేనూ
నిమ్మతోటను నిలిచి పారేనూ
అరటితోటల అలుగులెల్లేనూ
మామిడితోటల మళ్ళి పారేనూ
చింతకిందిరో మోట వాడరా

### 2.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

వలుపటి యెద్దు = మోట తోలడానికి కుడివైపున కట్టిన యెద్దు.

దాపటి యెద్దు = ఎడమవైపు కట్టిన యెద్దు.

పిల్ల బాట = కాలి దారి.

దండు బాట = సేన నడిచే వెడల్పైన మార్గం.

మోకు = కాడి, నాగలు రెంటినీ కలిపి కట్టే లావాటి తాడు. కేవలం లావాటి తాడును కూడా 'మోకు' అని వాడుతుంటారు.

దండెడ తాడు = మోట బొక్కెన లాగే తాడు. దీన్నే కపిల మోకు, బిళ్ళ మోకు, మోట మోకు, బొడ్డు తాడు అని కూడా వ్యవహరిస్తారు.

పెంజరగున్న = 'పెంజెర' అనే జాతికి చెందిన చురుకుదనం కొంచెం తక్కువగా ఉండే పాము.

తొండపుతాడు = తొండం అంటే మోట బొక్కెన అడుగున కట్టిన తోలుతిత్తి. దాని ద్వారా నీళ్ళు ధారగా మడవలలోకి వస్తాయి. దానికి కట్టిన తాడు తొండపుతాడు. దీన్నే తొండాపి తాడు, తొండెపు తాడు అని కూడా పిలుస్తారు.

కిన్నెర = దండెకు తీగె బిగించి, దానిని మీటుతూ మధుర శబ్దాన్ని ఉత్పాదించే వాద్య విశేషం.

మోట = పశువులను కట్టి బావి నుండి నీరు పైకి తోడే సాధనం.

మొగిలిగుమ్మ = మొగలి పొద.

కదురు = మోట సామగ్రిలోని ఒక గిలక వంటి భాగం. తొండపు తాడు దీని మీదుగా వస్తుంది. దీన్ని 'దండెకదురు' అని కూడా అంటారు.

బొక్కెన = మోట గట్టి నీళ్ళు తోడే ఇనుపది గాని, తోలుది గాని అయిన సాధనం.

మడువ = కాలువ.

ముత్తెమంత = ముత్యమంత; కొద్దిగా

ముక్కుతీగె = ముక్కు పోగు.

అలుగులు = కాలువలో ఎక్కువై కట్టదూకి పారే నీళ్లు.

### 2.3.2 వ్యాఖ్యానం

స్థూలంగా ఈ పాటలో ఉండే ఇతివృత్తాన్ని చూడండి.



BRAOU

ఒక చింతచెట్టు నీడన మోట బావి. ఆ మోట కొట్టడానికి మంచి ఎడ్లజోడు. మోట గొట్టేవాడు పాట పాడుతున్న జానపద స్త్రీకి ప్రేమికుడు కావచ్చును. నీళ్ళు తేవాలన్న నెపం పెట్టుకుని ఆమె అతణ్ణి చూడాలని మోట దగ్గరికి తరలి వచ్చింది. కాని అక్కడ అతడు కనిపించలేదు. నీళ్ళు కూడా లేవు. ఆవిడ కంటి నిండా నీరు తెచ్చుకోగా కడవ నిండింది. కడవలో నీరు కాలువై పారుతుండగా, "మామకొడుకా నా ముక్కు తీగెను అడ్డంబెట్టి మడువ మలుపు" మన్నది. ఆ నీరు, "వంపుల్ని ముంచి వరదలు పారుతుంది. జామతోటలో ఒక జాము పారుతుంది. నిమ్మతోటలో నిలిచి పారుతుంది. అరటితోటలో అలుగులు విడిచి పారుతుంది. మామిడి తోటంటా మళ్ళీ పారుతుంది." – అని ఆక్రోశిస్తూ ఆమె తన ప్రియుణ్ణి పిలుస్తుంది.

ఈ పాటలో భావ సంపద పుష్కలంగా ఉంది. జానపదుల అలంకార సామగ్రి చాలా సహజమైనదిగానూ, వాళ్ళ జీవితాలలో వాళ్ళకు అనుభవ పూర్వకమైనదిగానూ ఉంటుంది. తమకు తెలియని ఉపమా సామగ్రిని ఎన్నుకోవడంగానీ, కేవలం శ్రుతపాండిత్యం మీద ఆధారపడి, అమూర్తాలయిన (Abstracts) ఉపమానాలను పేర్చుకోవడం కానీ వీళ్ళు చేయలేరు. అందుకు ఉదాహరణగా, ఇక్కడ వాడిన ఉపమా సామగ్రిని చూడవచ్చు.

మోకు అకుతీగెవలె ఉండడం, దండెడ తాడు పెంజెరపాములా ఉండడం, అట్లాగే తొండపుతాడు కిన్నెర తీగ లాగా, మోట మొగిలిపొద లాగా, బొక్కెన బొడ్డు గిన్నె లాగా ఉండడం–గమనిస్తే ఈ పాటలో పల్లీయమైన శృంగార చిత్రణ ఉంది. జానపద సాహిత్యంలో మోట పాటలు సాధారణంగా శృంగారంతో కూడిన పాటలై ఉంటాయి. మోట కొట్టడానికి ఇద్దరు మనుష్యులుండాలి. ఇద్దరూ మగవాళ్ళు కావచ్చు. లేదా స్త్రీ పురుషులు కావచ్చు. మోటతోలేవారు మగవారైతే మడవలు (కాలవలు) మార్చేవారు ఆడవారై ఉంటారు. అటువంటి సన్నివేశంలో ఇద్దరి మధ్యా శృంగార భావనకు ఆస్కారం ఉంటుంది.

ఈ పాటలోని శృంగార భావనలో కన్నీటి ప్రసక్తి కనిపిస్తూ ఉంది. అంతమాత్రంచేత, దీన్ని కన్నీటిపాట అనడం కుదరదు. ఈ కన్నీటి ప్రసక్తి వలన కరుణ ప్రకటితమౌతున్నదనడం కన్నా, పడుచు పిల్లలో ఉన్న కొంటెతనమూ, హాస్య స్ఫూర్తీ కనిపిస్తున్నాయనడం సబబు. సాధారణంగా జానపదుల్లో శృంగారానికీ, మాటకారి తనానికీ విడిపోని లంకె ఉంటుంది. ఇక్కడ కన్నీటి ప్రసక్తిని తెచ్చి, ఆ శోకంతో కడవల్ని నింపి, మడవలు మలిపి మిట్టపల్లాలను ఏకంచేసి, జామ, నిమ్మ, మామిడి, అరటి తోటలకు పారించడంలో మనం చూచి మెచ్చుకోవలసింది పడుచుపిల్ల దుఃఖాన్ని కాదు; ఆవిడ గడుసుతనాన్ని! తన ప్రియుడు తనకు కనపడకుండా పోయినందువల్ల గడుసుగా చేసిన ఎత్తి పొడుపులు అవి. పరిదేవనం కంటే, కొంటెతనమే మనకు కన్పిస్తుంది.

ఈ ఉపమా సామగ్రి అంతా వాళ్ళ అనుభవంలో నుండి వచ్చిందేనని స్పష్టమౌతుంది. ఈ ఉపమానాలు వాడడంలో సాదృశ్యం కూడా సరిపోయేటట్లు చూసుకుంటున్నారు జానపదులు. తొండపుతాడు సన్నగా ఉంటుంది గనుక అది కిన్నెర తీగెతో పోలుతున్నది. దండెడ తాడు లావుగా ఉంటుంది కాబట్టి దాన్ని పెంజర (గున్నపాము) తో పోల్చడం జరిగింది.

మోటసామాగ్రిలోని గిలకవంటి కదురు చలనంలో పడుచులేడి కదలికను జానపదుడు చూడగలుగుతున్నాడు. పోలికలన్నీ ఈ రకంగా మనోజ్ఞంగా కనిపిస్తాయి.

ప్రియుణ్ణి చూడాలన్న నెపంతో నీటి కోసం మోట బావి దగ్గరికి వచ్చిన ప్రియురాలికి ప్రియుడు కానీ, నీళ్ళు కానీ కనిపించక పోవడం చెప్పలేనంత నిస్పృహను కలిగించింది. "కంటి శోకం కడవ నిండడ"మన్న వాడుక జానపదులు వాడే పలుకుబళ్ళలో చాలా ఎక్కువగా కనిపిస్తుంటుంది. వాళ్ళు ఏదైనా ఒక సన్నివేశాన్ని వర్ణించే పద్ధతిలో వారానువర్తనాలు (common places) చాలా కనిపిస్తాయి. వారానువర్తనాలంటే, ఒక వర్ణనను ఆరంభించినప్పుడు, ఒక పాదం ఆకృతి తాల్చాక, అందులో సామాన్యంగా కనిపించే ఒక వస్తువు స్థానంలో, అటువంటివే ఎన్నో వస్తువులను ఒకదాని వెంట ఒకటి చేర్చుకుంటూ పాదాలు పెంచుకుంటూ పోవడం. ఉదాహరణకు

"మిట్ట పట్టెనూ మిగులబారెనూ
జామ తోటకూ జాము పారెనూ"

BRAOU

అన్నచోట జామతోట అనేది సామాన్య వస్తువు. ఈ పదాన్ని తోసి, దాని స్థానంలో నిమ్మతోట, అరటితోట, మామిడితోట వంటి సదృశ పదాలను ఉంచవచ్చు. అట్లా ఉంచడం వల్ల పాదం విరిగే చోట ఉండే పదాలు కూడా అందుకు అనుగుణంగా మారి, కొత్త కొత్త పాదాల సృష్టి జరుగుతుంది.

**నిమ్మ** తోటలో నిలిచి పారేనూ
**అరటి** తోటలో అలుగులెల్లేనూ
**మామిడి** తోటల మళ్ళి పారేనూ

ఈ విధంగా పాఠ్యం నిడివిని పెంచడం వారానువర్తనాల వల్ల సాధ్యమవుతుంది.

## అభ్యాసం – 1

'వారానువర్తనం' అంటే ఏమిటి ?

## అభ్యాసం – 2

'మోటపాట' లోని ఉపమా సామగ్రి ఎలాంటిది ?

## అభ్యాసం – 3

'మోటపాట' ఇతివృత్తాన్ని వర్ణించండి ?

Dr. BRAOU LIBRARY
Acc. No: CM-0304
Class No:



BRAOU

### 2.3.3 విశేషాంశాలు

ఒక ప్రేయసి హృదయకామన చక్కని ముగ్ధ శృంగార భావంతో ఈ గేయంలో సాక్షాత్కరించింది. శ్రామిక గేయంలోనూ ఉపమాసామగ్రి ప్రయోగాన్నీ, శృంగార రసస్ఫూర్తినీ జానపదులు వెలయించగలగడం ఈ గేయం ద్వారా గమనింపుకు వచ్చే మరో ముఖ్యమైన అంశం.

## 2.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకొందాం

- 'మోటపాట' జానపద కవిత్వరీతిలోని ఒక శ్రామిక గేయం.
- ఈ శ్రామిక గేయంలో శృంగార కరుణ రసాల స్పర్శ కూడా ఉన్నది. పాట మొత్తం ముగ్ధ శృంగారానికి ఉదాహరణ.
- మోటసామగ్రిని అనేక రకాల ఉపమాసామగ్రిలతో పోల్చడంతో ఈ పాట ఉత్తమ కవితా స్థాయినీ, సౌందర్యాన్నీ అందుకున్నది.
- ఈ పాటలోని శృంగార భావనలో కన్నీటి ప్రసక్తి కనిపిస్తున్నది. అది ఈ పాటలోని భావ సంపదలో ఒక భాగమే కాని, పాటను కరుణరసాత్మకంగా మార్చే అంశం కాదు.
- జానపదుల మనస్సుల్లో ఉండే ముగ్ధత్వాన్నీ, గడుసు మాటల ఎత్తిపొడుపు స్వభావాన్నీ, కొంటెతనాన్నీ, జానపద స్త్రీ తన ప్రియుని పట్ల వెలార్చే సహజ రమ్యమైన ప్రేమ భావాన్నీ ఈ పాట ప్రదర్శిస్తున్నది.
- జానపద మౌఖిక కవిత్వంలోని 'వారానువర్తనం' అనే రచనా పద్ధతిని ఈ పాట పోషిస్తున్నది. 'వారానువర్తనం' అంటే పాటలోని ఒక సామాన్య వస్తువు స్థానంలో అనేక విభిన్న వస్తువులను ఉంచి, పాటను పెంచుకుంటూ పోవడం.
- జానపదులు వాడే సజీవమైన పలుకుబళ్లకు ఈ పాట ఆస్పదంగా ఉన్నది.

BRAOU

## 2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. మోటపాటలోని జానపద స్త్రీ శోకం ఏ రకంగా పరిణమించిందో సోదాహరణంగా వివరించండి?
2. మోటపాటలోని ఉపమాసామగ్రిని వివరంగా చర్చించండి.

II. ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. మోటలోని వివిధ భాగాలను తెలపండి ?
2. మోటపాటలోని ఎత్తిపొడుపు మాటల్లో, పలుకుబళ్లలో ఉన్న జానపదుల స్వభావాన్ని వివరించండి?

## 2.6 ఆకళింపు ప్రశ్నలు

1. మోట భాగాల పట్టిక తయారు చేయండి.
2. వారానువర్తన పద్ధతిలో ఈ పాటలోని చరణాలు పెంచే ప్రయత్నం మీ రచన ద్వారా చెయ్యండి.
3. ఈ పాటలోని పలుకుబళ్లకు దగ్గరగా ఉన్న వాటిని మరికొన్ని సేకరించడానికి ప్రయత్నించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. మౌఖిక సంప్రదాయానికి చెందిన జానపద గేయ కవిత్వంలోని పాటల్లో - ఒక వస్తువును వర్ణించడం ప్రారంభించిన తర్వాత, ఆ వర్ణనను చరణాలుగా కొనసాగిస్తారు. అలాంటి చరణాల్లోని ఒక పాదంలో

సామాన్యంగా కనిపించే ఒక వస్తువు స్థానంలో మరెన్నో ఇతర వస్తువులను అమర్చుకుంటూ, వేరు వేరు పాదాలను పెంచుకుంటూ పోతే, ఆ పద్ధతినే 'హారానువర్తనం' (common place) అంటారు. మోటపాట లోని 'జామతోట' అనే సామాన్య వస్తువు స్థానంలో వరుసగా "నిమ్మతోట, అరటితోట, మామిడితోట" అని ప్రయోగించబడింది. ఈ పద్ధతినే 'హారానువర్తనం' అంటారు.

2. ఈ పాఠ్యంలో వాడబడిన ఉపమా సామగ్రి జానపదుల జీవితంలో అనుభవానికి వచ్చేదే. ఉపమాన వస్తువులుగా ఊహా కల్పితాలయిన వస్తువులేవీ లేవు - మోకు ఆకు తీగలాగా, దండెడ తాడు పెంజెరగున్నలాగా, తొండపు తాడు కిన్నెర తీగలాగా, మోట మొగిలి పాదలాగా, బొక్కెన బొడ్డు గిన్నె లాగా ఉన్నాయని చెప్పడంలో సహజత్వం కనిపిస్తుంది. ఆకు తీగె, పెంజెరపాము, కిన్నెర తీగె, మొగిలి పాద, బొడ్డుగిన్నె ఇవన్నీ జానపదుని జీవితంలో తారస పడుతుండే అతి సామాన్య వస్తువులు. ఇవేవీ అమూర్త పదార్థాలు కావు. కాబట్టి ఇక్కడ పేర్కొనబడిన ఉపమా సామగ్రి సహజ సామగ్రి అని చెప్పాలి.

3. 'మోటపాట' గ్రామిక గేయపద్ధతికి చెందిన ఒక జానపద గేయం. మోటకొట్టే మనిషికి ప్రేయసి ఐన ఒక జానపద వనిత పాడిన పాట ఇది. పాటలోని ఇతివృత్తం ఇలా ఉంది -

ఒక చింతచెట్టు నీడలో ఒక మోటబావి ఉన్నది. ఆ మోటను తోలడానికి ఒక బలమైన ఎడ్ల జత. వాటిలో కుడిపక్క కట్టే ఎద్దు 'పన్నెలాడి' లాంటిది, ఎడంపక్క ఎద్దు 'ధర్మరాజు' లాంటిది అని ఆ పాట పాడే స్త్రీ వర్ణిస్తుంది. ఆ మోట కుడిపక్కన పిల్లబాట, ఎడంపక్కన పెద్దబాట. మోటకు ఆకు తీగలాంటి మోకు. పెంజెర గున్న లాంటి దండెడతాడు. కిన్నెర తీగలాంటి తొండపుతాడు. మొగలి గుమ్మ లాంటిది ఆ మోట. భీమరథం లాంటి మోట బిళ్ల, బొడ్డుగిన్నె లాంటి బొక్కెన ఆమోట సామగ్రిలో ఉన్నాయని ఆ స్త్రీ వర్ణిస్తుంది.

నీళ్లు తెచ్చే వంకతో కడవ తీసుకుని అతన్ని చూడడానికి ఆమె వస్తుంది. అతనక్కడ లేడు. ఆమెకు దుఃఖం వస్తుంది. ఆమె కంటి నీటితో కడవ నిండుతుంది. నిండిపోయి పొంగి పారుతుంది. అప్పుడామె "ఓ మామకొడుకా! నా ముక్కు పోగులను అడ్డంపెట్టి మడువ మళ్లించు"మన్నది. ఆ నీరు "వంపుల్ని ముంచి పారుతుంది. మిట్టల్ని ఆక్రమించి పారుతుంది. జామతోటలో జాముసేపు పారుతుంది. నిమ్మతోటలో నిలిచి పారుతుంది. అరటి తోటలో అలుగులెత్తి పారుతుంది. మామిడితోటలో మళ్లీ మళ్లీ పారుతుంది" అంటూ ఇలా ఆమె వర్ణిస్తూ పోయిన ఈ పాటలో - ఆమె తన ప్రియుడు తనకు కనపడకుండా పోతే తాను అనుభవించే బాధ ఎలాంటిదో, తాను పలికే ప్రతి శబ్దంలోనూ స్పష్టం చేస్తుంది. పాటలో కన్నీళ్ల ప్రసక్తి వచ్చినా ఇతివృత్తం ప్రేయసీ ప్రియుల శృంగార భావసంపద చుట్టే పరిభ్రమిస్తున్నది కాబట్టి ఈ పాటలోని ప్రధాన రసం శృంగారమేనని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. నిష్కపటమైన ప్రేమభావానికి, అకళంకమైన సరళ ప్రవర్తనకూ అద్దంపట్టే జానపద ఇతివృత్తాన్ని చిత్రిస్తున్నది ఈ పాట.

**- ఆచార్య నాయని కృష్ణకుమారి**

BRAOU

# భాగం 3 ఏతంపాట

**విషయక్రమం**


3.0 ఉద్దేశం
3.1 ప్రవేశిక
3.2 సూచనలు
3.3 పాఠ్యం
  3.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  3.3.2 వ్యాఖ్యానం
  3.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
3.6 ఆకళింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 3.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- శ్రామిక గేయాల్లో నిక్షిప్తమైన కరుణరసం
- పనిపాటల్లోని స్వతంత్రమైన కవిత్వాభివ్యక్తి పద్ధతి

## 3.1 ప్రవేశిక

'ఏతంపాట' కూడా ఒక శ్రామిక గేయం. ఈ పాట పాడుకున్న రైతుకూలీ తన బాధలను వెలిబుచ్చే పద్ధతిలో కరుణరసం చిప్పిలుతున్నది కాబట్టి, ఈ గేయాన్ని కరుణరసాత్మక గేయంగా గుర్తించవచ్చు.

పంట పండించే రైతుకూలి పాడే పాట యిది. ఇతడు భూస్వామి కాడు. సొంత వ్యవసాయంలేని బడుగు కూలిరైతు. ఇతడు తన చేతుల మీదుగా పుట్లకొద్దీ పంటను పండించగలడు. రెక్కలు ముక్కలు చేసుకుని చెమటోడ్చి శ్రమించగలడు. కాని, అందుకు అతనికి దక్కే ప్రతిఫలం చాలా స్వల్పం. వెయ్యిపుట్లు పండించినా అతనికి గంజిలో మెతుకు కనిపించదు. ఒక్క పూటయినా వరి అన్నం తినగల భాగ్యానికి అతడు నోచుకోడు. ఇది ఒక్కటే అంశమైతే అతడు పట్టించుకోని ఉండక పోవచ్చు. కాని, తోడి వారి నుండి, పైవారి నుండి నిరాదరణ అతన్ని బాధిస్తుంది. కాకుల వంటి లోకులు, చిన్నా పెద్ద అనే వ్యత్యాసమైనా చూడకుండా అతన్ని అవమానించి వేధిస్తారు. పని మొత్తమూ పూర్తి చేసుకుని కాలూ చేయీ కడుక్కుని, కట్టమీద కూర్చున్న అతన్ని కాకులూ, వాటి పిల్లలూ కూడా తన్ని పోతాయి. ఇక్కడ కాకులు లోకులకు ప్రతీకలు. దీనికి తోడు ఇంట్లో కూడా అతడంటే గౌరవం లేదు. డబ్బు సంపాదించలేని దరిద్రుడు ఇంటి వారికి కూడా లోకువ. తన పెళ్ళామూ, పిల్లలూ కూడా తనను వేధించేవారే. అన్నిటినీ మించి దైవం సరిగా చూడడం లేదని అతని మనస్సులో క్షోభ. చుక్క పొద్దున లేచి బొక్కె నెత్తుకుని పొలానికి పోబోతుండగా, శరీరంలో శక్తి లేమి వల్ల బొక్కబోర్ల పడిపోయాడు. దురదృష్టకరమైన సంఘటనలు అన్నీ ఒక్కుమ్మడిగా ఎదురైతే ఆ బక్క ప్రాణి ఎంత అలమటిస్తాడో ఈ భాగంలో కరుణాత్మకంగా వెల్లడించబడ్డది. బక్క మనిషి అనుభవాలు జానపదుల నూటి అయిన తేట మాటల్లో గీచిన రేఖాచిత్రాల్లాగా ఈ భాగంలో మనకు కనిపిస్తాయి.

ఈ పాట వినిపించిన వారు శ్రీ గంగులు శాయిరెడ్డి. ఈయన జనగామ తాలూకా ఆలేరు నివాసి.

BRAOU

## 3.2 సూచనలు

ఈ విభాగంలో ఇచ్చిన జానపద కవితా ఖండికలతో పాటు ఇతర సంకలనాలు చూడాలి. జానపద కథాగానాలు వినాలి. ఇతర కవితా మార్గాలతో పోల్చి విలువ కట్టాలి. ముఖ్యంగా ఈ భాగం అధ్యయనానికి 3.3.1, 3.3.2, 3.3.3 లలో ఇచ్చిన అంశాలను సహాయంగా తీసుకోవాలి.

## 3.3 పాఠ్యం

ఏటి కేతం బెట్టి ఎయిపుట్లు బండించి
ఎన్నడో మెతుకెరుగరన్నా – నేను
        గంజిలో మెతుకెరుగరన్నా        ।ఏటి॥
కాళ్లేయి కడుక్కోని కట్టమీదగూసుంటె
కాకిదన్నీ పాయెరన్నా –
        కాకిపిల్ల దన్నీ పాయెరన్నా        ।ఏటి॥
పోరుకూ చాల్లేక పాయికాడ గూసుంటె
పోరిదన్నీ పాయెరన్నా –
        పోరి తల్లి దన్నీ పాయెరన్నా        ।ఏటి॥
చుక్కపొద్దున లేచి బొక్కె నెత్తుకపోంగ
బొక్కబోర్లా పడితిరన్నా –
        నేను పక్క లిరుగా పడితిరన్నా
వాదేటి బ్రతుకాయెరన్నా
నేను నాడె చావకపోతిరన్నా        ।ఏటి॥

### 3.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

ఏతం = పొలాలకు నీళ్ళు పెట్టడానికి ఉపయోగించే సాధనం. పారే కాలువల నుండి నీరు తోడడానికి దీన్ని ఉపయోగిస్తారు. కాలువల నీటికి ఏతాన్నీ, పెద్ద బావులలో నీటికి మోటనూ వాడుకుంటారు వ్యావసాయికులు.

| | | |
|---|---|---|
| ఎయిపుట్లు | = | వెయ్యిపుట్లు. పుట్టి అంటే 20 తూముల ధాన్యం |
| కాకి దన్నీ పాయె | = | కాకి తన్ని పోయింది |
| పోరి | = | ఆడపిల్ల |
| బొక్కెన | = | ఏతపు కర్రకు కట్టి నీళ్ళు తీసే పెద్ద పాత్ర |
| బొక్కబోర్ల | = | ముఖం భూమికి తగిలేటట్లు చాపకట్టుగా |
| పక్కలు | = | వెన్నెముక నుండి పక్కలకు వ్యాపించే ఎముకలు (Ribs) |

### 3.3.2 వ్యాఖ్యానం

ఈ పాటలో కొంత ప్రతీకాత్మక లక్షణం ఉంది. కాకి లోకులకు ప్రతీక. కాకిపిల్ల, కాకి చిన్న పెద్దా తారతమ్యాన్ని సూచించే కొలత బద్దలు. ఇక్కడ కాకి తాను సేద్యం చేసే భూమికి కామందు కావచ్చు. లేదా ఇరుగు పొరుగు వారెవరైనా కావచ్చు. అట్లాగే పోరీ, పోరి తల్లీ, తన కూతురూ, భార్యా కావచ్చును. మొత్తానికి వీరందరూ ఏదో విధంగా తనని పీడించి వేధించే వ్యక్తులు.

కవిత్వ లక్షణాలలో అన్యాపదేశంగా విషయాన్ని చెప్పడం కూడా ఒక లక్షణమే. ఇటువంటి అన్యాపదేశమే చికిలీ పని చేయబడి, ప్రౌఢంగా తీర్చిదిద్దబడితే అదే కావ్యానికి ఆత్మ అని భావింపబడే 'ధ్వని' అవుతుంది. ధ్వనికి, అన్యాపదేశానికీ, వ్యంగ్యానికి మధ్య చాలా తేడాలున్నాయి. విషయాన్ని గుప్తంగా చెప్పడం అనే



BRAOU

లక్షణం ఈ మూడింటిలోనూ ఉంటుంది-ఈ లక్షణం ఉండడం వల్లనే ఈ ఖండిక కవితా ఖండికగా నిలువ గలుగుతున్నది.

కవిత్వానికి మరో లక్షణం హృదయాన్ని ద్రవీ భూతం చేసే శక్తి. పంట పండించిన వాడికి మెతుకందక పోవడం, పని తీరిన వెనుక తీరుబాటుగా కూర్చుని విశ్రాంతి సుఖాన్ని అనుభవించాలనుకున్న వాడికి నిరాదరణ, అవహేళన ఎదురుకావడం, ఇంట్లో సుఖం లేక పోవడం, చివరికి విధి కూడా చిన్న చూపు చూడడం-ఇవన్నీ కథానాయకుని అశక్తినీ, దౌర్బల్యాన్నీ చాటుతూ, పఠితకు అతని మీద సానుభూతిని కలిగిస్తాయి. ఈ విధంగా జాలితనం జాలువారడం కరుణరసంలో ఒక భాగం. హృదయ ద్రవీకరణ శక్తి కరుణ రసానికున్నట్లుగా మరొకదానికి లేదు. ఈ పాటలోని ప్రతిపదంలోనూ కరుణరసం ఆవిష్కృతమైంది.

### 3.3.3 విశేషాంశాలు

ఈ పాటలో రైతుకూలీలు అనేక పరిస్థితుల్లో తమ పనిలోని అనేక దశల్లో ఎదుర్కొనే కష్టనష్టాలూ, బాధలూ తెలియవస్తున్నాయి. జమీందారీ వ్యవస్థలోని కర్షకుల, రైతుకూలీల దైన్య పరిస్థితిని కూడా ఈ శ్రామికగేయం చిత్రిస్తున్నది.

### అభ్యాసం – 1

'ఏతంపాట' అంటే ఏమిటి ?

BRAOU

### అభ్యాసం – 2

'ఏతంపాట'లోని రైతు ఎలాంటివాడు ?

### అభ్యాసం – 3

'ఏతంపాట'లోని రసాన్ని సమీక్షించండి ?

## 3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- 'ఏతంపాట' మౌఖిక కవిత్వ సంప్రదాయంలోని ఒక జానపదగేయం.
- ఈ గ్రామికగేయం కరుణరస పూరితం.
- 'ఏతంపాట' నెపంతో రైతుకూలీ దుస్థితిని వర్ణించే ఈ పాటద్వారా జమీందారీ వ్యవస్థలోని కర్షకుల పరిస్థితి తెలియవస్తున్నది.
- పాట ప్రతి చరణం చివరా తిరిగి పాడబడే పాటలోని మొదటిభాగం - పల్లవి ఈ పాటద్వారా పరిచయం చేయబడింది.
- సజీవమైన, సహజమైన జానపద భాషా స్వరూపం ఈ పాటలో పరిమళిస్తున్నది. ప్రతీకాత్మక (Symbolic) లక్షణాన్ని కూడా ఈ పాట పోషిస్తున్నది.

## 3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. దేశంలోని సగటు వ్యవసాయకూలీకి మీ పాఠ్యంలోని రైతు ఏ విధంగా ప్రతినిధో చర్చించండి.

II. ఈ కింది వాటికి పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఈ భాగంలోని ప్రతీకలు వివరించండి.
2. 'ఏతంపాట' లోని వర్ణనలను విపులీకరించండి.

## 3.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఈ భాగంలోని ప్రతీకల పట్టిక తయారుచేసి, నేటి సామాజిక పరిస్థితులకు అన్వయించి చూడండి.
2. ఈ పాటకూ, ఈ ఖండంలోని తక్కిన పాటలకూ పాడే పద్ధతిలో ఉన్న భేదాన్ని గుర్తించండి.

BRAOU

### అభ్యాసాలకు జవాబులు

1. పంట పండించే రైతుకూలీ ఏతం తోడుతూ పాడుకునే పాట 'ఏతంపాట'. ఇతడు భూస్వామి కాడు. రెక్కల కష్టం చేసుకుంటూ కూలిగింజలు సంపాదించుకునే స్వంత వ్యవసాయంలేని ఒక బడుగు కూలీరైతు. బావినుంచి పైరు పంటలకు ఏతం తోడుతూ ఆ శ్రమను మరిచిపోయేందుకు పాడుకునే పనిపాట 'ఏతంపాట'.

2. ఈ రైతుకూలి ఒక నిరుపేద. రెక్కలు ముక్కలు చేసుకుని యజమానికి పంట పండించి ఇచ్చినా, ఇతనికి తినడానికి గంజిలోకి ఒక్క మెతుకైనా ఉండదు. తీరిక దొరకదు. తీరిక దొరికిన వేళనయినా, దాన్ని అతడు అనుభవించనీయకుండా లోకులు కాకులై అవహేళనలు కురిపిస్తారు. కాసు సంపాదించ లేనివాడు గనుక ఇంటి ఇల్లాలూ పిల్లలూ అతణ్ణి నిరాదరణకు పాలు పరుస్తారు. ఈ పరిస్థితులకు తోడు శరీరం కూడా సహకరించని దుర్బలుడతడు. శక్తిహీనత వలన చేయవలసిన పనులు కూడా సక్రమంగా చేయలేని స్థితి అతనిది. ఈ బాధలు పడలేక చావును కోరుకునే దుస్థితి అతనిది.

3. రైతుకూలీ జీవన విధానంలో ఎదురయ్యే కష్టనష్టాలనూ, సామాజికంగా అతడు అనుభవించే నిర్భాగ్యాన్నీ కరుణ రసస్ఫోరకంగా వర్ణించే పాట ఇది. కరుణరసానికి శోకం 'స్థాయి' భావమని ఆలంకారికులు నిర్ణయించారు. స్థాయి అంటే ఏదైనా ఒక రసంలో ఉన్న ముఖ్యమైన మానసిక భావన. ఏతంపాటలోని కూలీరైతు తన కష్టాలను తలపోసి దుఃఖించడం ఈ పాటలోని ఇతివృత్తం కాబట్టి, శోక పూరితమైన ఈ గేయంలో ఉన్న రసం 'కరుణం'.

"ఎయిపుట్లు పండించి ఎన్నడూ మెతుకెరుగరన్నా!
కాకి దన్నీ పాయెరన్నా!

కాకిపిల్ల దస్నీ పాయెరన్నా!
పోరి దస్నీ పాయెరన్నా!
పోరి తల్లి దస్నీ పాయెరన్నా!
బొక్క బోర్లా బడితిరన్నా!
నాదేటి బతుకాయెరన్నా!
నేను నాడె చావకపోతిరన్నా!"

అంటూ కూలీరైతు తనకెదురైన విభిన్న విపత్కర పరిస్థితుల్లో దుఃఖించిన శబ్దాల్లో కరుణరసం ఉబికివస్తున్నది. హృదయ ద్రవీకరణ శక్తి కరుణ రసానికున్నట్టుగా మరే ఇతర రసానికీ లేదు కాబట్టి, ఈ పాట శ్రోతల గుండెలను ఊపివేస్తుందనడంలో సందేహం లేదు.

– ఆచార్య నాయని కృష్ణకుమారి

# భాగం 4 కన్నీటిపాట

## విషయక్రమం


4.0 ఉద్దేశం
4.1 ప్రవేశిక
4.2 సూచనలు
4.3 పాఠ్యం
  4.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  4.3.2 వ్యాఖ్యానం
  4.3.3 విశేషాంశాలు
అభ్యాసం – 1
అభ్యాసం – 2
అభ్యాసం – 3
4.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
4.6 ఆకలింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 4.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- జానపద గేయాల్లోని సహజసిద్ధమైన కవిత్వరీతి
- శ్రామిక గేయాల్లో కనిపించే జానపదుల దాంపత్య ప్రణయంలోని ప్రౌఢమైన అనుభూతి

BRAOU

## 4.1 ప్రవేశిక

ఈ పాటను కరీంనగర్ జిల్లా, సిరిసిల్లా తాలూకాలో, గూడూరి సీతారాంగారు సేకరించారు.

ఈ పాట కూడా శ్రామిక గేయమే. అయితే ఇందులో శృంగారానికి కాక కరుణాత్మక భావ చిత్రణకు స్థానం లభించింది. ఇందులో చనిపోయిన తన భార్యను తలచుకుని జానపద గాయకుడు విలపిస్తున్న వైనం కనిపిస్తుంది. సున్నపురాయి గోతులు తవ్వే సందర్భంలో కూలీ కార్మికుడు పాడుకున్న పాటగా దీన్ని గమనించవచ్చు.

## 4.2 సూచనలు

ఈ విభాగంలో ఇచ్చిన జానపద కవితా ఖండికలు చదవండి. ఇతర సంకలనాలు కూడా చూడండి. మరీ ముఖ్యంగా ఆశువుగా కవితలల్లే జానపదకవుల కథాగానాన్ని వినాలి. రచనా లక్షణాలను పరిశీలించండి. ఇతర కవితా మార్గాలతో పోల్చి విలువ కట్టాలి. జానపద కవిత్వ పద్ధతిలోని సహజ కవితా రీతినీ, లయబద్ధమైన పదాల కూర్పునూ పరిశీలిస్తూ ఈ భాగంలోని 4.3లో ఇచ్చిన 'కన్నీటిపాట' అనే శ్రామిక గేయాన్ని అధ్యయనం చెయ్యాలి. ఈ భాగాన్ని చదవడంలో 4.3.1, 4.3.2, 4.3.3 లలో ఇచ్చిన వివరాలను సహాయకాలుగా తీసుకోవాలి.

## 4.3 పాఠ్యం

సుద్ద బొందలకాడ
సుద్ది దియ్యంగానె

సద్ది దిన్నట్టాయెనే సిలకా - సిన్నారి సిలకా
ఇంతెల్లి మెడబాపెనే సిలకా
ఎంత పాపపు దేవుడే సిలకా
సమర్తయై నీవు సాటుకు కూకుంటె
సత్తెబామా వందురే సిలకా - సిన్నారి సిలకా
పసిద్దయి నివ్వొక్క పందిట్ల గూసుంటె
పార్వతీ దేవందురే సిలకా - సిన్నారి సిలకా
ముత్తైదువై నువ్వొక మూలకు గూకుంటె
ముద్దబంతీ వందురే సిలకా - సిన్నారి సిలకా
ఇద్దరము తినేటి ఆ బొడ్డు గిన్నెలా
ఒక్కనికి ఒనరాయెనా సిలకా - సిన్నారి సిలకా
ఇద్దరము కప్పేటి మద్దికాయల దుప్పటి
ఒక్కనికి ఒనరాయెనే సిలకా - సిన్నారి సిలకా

### 4.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

సుద్ద = సున్నపురాయి

సుద్దబొందలు = సున్నపురాళ్లకోసం తీసిన గోతులు, సున్నపురాయి దొరికే నేల ప్రాంతం

సుద్ది > స్మృతి అనే మాటకు వికృతి శబ్దం "ప్రస్తావన లేదా స్మరణ చేయు" అని అర్థం.

సద్ది = చద్ది అన్నం

ఇంతెల్లము = ఇంత + ఎల్లిము - వైళము అంటే 'త్వరగా' అనే అర్థం వచ్చే శబ్దానికి జానపద రూపాంతరం - ఎల్లిము. "ఇంత తొందరగా" అని ఆ పదబంధానికి అర్థం. (ఎల్లిమురా-అంటే తొందరగా రా! అని వాడుకలో ఉన్న ప్రయోగం గమనార్హం)

సమర్త అగు = రజస్వల అగు, ఈడేరు. ఇది "సమర్థ" పదానికి వికృతి. ఇక్కడ సమర్థ అగుట అంటే, గర్భధారణకు అర్హురాలు కావడం అని అర్థం.

సాటుకు = చాటుకు, నలుగురి మధ్య తిరగకుండా మూలకు
చకారానికి సకారం వాడడం జానపద భాషలో సాధారణ లక్షణం

పసిద్ధి = ప్రసూతి

ప్రసవము = కాన్పు

బొడ్డుగిన్నె = కింద మట్టు ఉండి, చుట్టూ అంచుకలిగి, లోతుగా ఉండే గిన్నె. సంకటి గటుక వంటి పదార్థాలను తాగడానికి అనువుగా ద్రవంలాగా చేసుకోవడానికి వీలుగా, లోతుగా ఉండే గిన్నె. కొన్ని జానపద కుటుంబాలలో ఇప్పటికీ ఇటువంటి గిన్నెలు వాడుకలో ఉన్నాయి. (అంబలివంటి ద్రవ పదార్థం ఈ గిన్నెలో చక్కగా త్రాగడానికి వీలుపడుతుంది.)

ఒనరు = వీలు

మద్దికాయల దుప్పటి = మద్దికాయల వంటి ఆకార విశేషాలను నేతలో చూపించే దుప్పటి.

### 4.3.2 వ్యాఖ్యానం

ఈ భార్యాభర్తల జీవితాలలో చాలా రసరమ్యాలయిన ఘట్టాలు ఉన్నాయి. అటువంటి ఘట్టాలను తలుచుకుంటూ ఇక్కడ భర్త విలపించడంలో ఔచిత్యం ఉంది. పల్లెటూళ్ళలో బాల్య వివాహాలు నిషిద్ధంకాదు. అయిదేళ్ళ వరునికీ ఏడాది వధువుకూ పెళ్ళిళ్ళు జరగడం సామాన్యమే.

జానపద స్త్రీల విషయంలో పెళ్ళి ముందు, "వ్యక్తురాళ్ళవడం" తరువాత జరగవచ్చు. ఇక్కడి భర్త, తన భార్య స్మృతిలో సమర్త అయిన నాటి సంఘటనను గుర్తుకు తెచ్చుకుని ఆనాటి ఆమెను సత్యభామగా చిత్రించుకున్నాడు. తరువాత మెట్టినింటికి కాపురానికి వచ్చి, తనను సంసార సుఖాలలో ఓలలాడిస్తూ,

BRAOU

ప్రసవించి బిడ్డనందించిన ఆమెను పార్వతీదేవిలాగా భావించుకున్నాడు. తామిద్దరూ ఒకే గిన్నెలో అన్నాలు తినడం, ఒకే దుప్పటికింద సరాగాలు నెరపడం, ఇవన్నీ అతని జీవితంలో తిరిగి రాని మధుర స్మృతులు. ఆ జానపదుని జీవితంలో ధ్వనించే విషాదం ఈ గీతం నిండా సన్నగా అల్లుకుని పోయి వినేవారిని విచలితుల్ని చేస్తుంది.

ఈ పాట కరుణాత్మకమైన లలిత భావాలతో నిండిన పాట. జానపదుని భార్య సత్యభామలాగా, పార్వతీదేవిలాగా పురాణ పాత్రలను తలపించడమే కాక ముద్దబంతిలాగా, చిలకలాగా ఉండడం భర్త భావనలో ఆవిడకు ప్రకృతితో ఉన్న తాదాత్మ్యాన్ని కూడా తెలియజేస్తున్నది.

భార్యాభర్తల అనురాగాన్నీ, ముగ్ధ శృంగారాన్నీ తెలియజేసే ఈ ఖండిక రసవంతంగా ఉంది. 'కరుణ' ను వెల్లి విరియించే సంఘటన జానపద జీవితానుభవాలకు అనుకూలమైనదిగా ఇక్కడ తీర్చిదిద్దబడ్డది. భావ ప్రకటనలో మనకు కనిపిస్తున్న లోతుదనమే ఈ ఖండికలో మనం చూసే కవిత్వ లక్షణం.

### 4.3.3 విశేషాంశాలు

ఆధునిక కవిత్వంలోని ముఖ్యభాగమైన స్మృతి కవిత్వాన్ని ఈ శ్రామికగేయం ప్రతిబింబిస్తున్నది. తక్కిన శ్రామిక గేయాల్లోలాగా శ్రామికుడు తాను చేసే పనికి సంబంధించి ఉండక - ఈ పాటలో పనిచేసే చోటు, చనిపోయిన తన భార్యను గుర్తుతేగా జానపదుడు పాడుకోవడంతో ఒక విభిన్నతను సంతరించుకొంటూ కరుణరస ప్రధానంగా ఉన్నది.

## అభ్యాసం – 1

'కన్నీటిపాట'లోని మాండలిక పదబంధాలు వివరించండి?

BRAOU

## అభ్యాసం – 2

'కన్నీటిపాట' ఇతివృత్తాన్ని తెలపండి?

**అభ్యాసం – 3**

'కన్నీటిపాట'లోని కరుణరస ప్రతీతిని చర్చించండి?

## 3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- 'కన్నీటిపాట' మౌఖిక కవిత్వ సంప్రదాయంలోని ఒక జానపదగేయం.
- కూలీకార్మికుడు పాడుకున్న ఈ పాట కరుణరసపూరితం
- ఈ పాట సుద్దబొందలు తవ్వే శ్రామికుని పనికి సంబంధించికాక, తాను పనిచేసే ప్రదేశాన్ని చూడడంవల్ల కలిగిన తన భార్య స్మృతులద్వారా ఉబికివచ్చిన శ్రామిక గేయం కావడం విశేషం.
- ఈ పాటలో జానపదుల ప్రగాఢమైన దాంపత్య ప్రణయానుభూతి ప్రతిఫలిస్తున్నది.
- సజీవమైన, సహజమైన జానపద భాషాస్వరూపం ఈ పాటలో పరిమళిస్తున్నది.

## 4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఈ భాగంలోని భాషా విశేషాలను చర్చించండి.
2. ఈ భాగంలో విషాదధ్వనించే సంఘటనలను పేర్కొని వివరించండి.

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. ఈ భాగంలోని ఉపమాసామగ్రిని వివరించండి.

## 4.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఈ పాటను తక్కిన శ్రామిక గేయాలతో పోల్చి చూసి వాటి నుండి ఇది ఎందుకు భిన్నమైందో గుర్తించండి.
2. ఇలాంటి పాటలనే మరికొన్ని సేకరించి, వాటిలోని స్మృతికవిత్వ లక్షణాలు పరిశీలించండి.

BRAOU

## అభ్యాసాలకు జవాబులు

1. ఈ పాటలో మాండలిక పదబంధాలు కొన్ని ఉన్నాయి.

సుద్దబొందలు = సున్నపురాయి దొరికేనేల

పసిద్దయి = ప్రసవమై బిడ్డనుకని

బొడ్డుగిన్నె = కింద మట్టుగా ఉండి, ద్రవపదార్థాలలో కలిసిన అన్నంతినే గిన్నె.

మద్దికాయలదుప్పటి = మద్దికాయలవంటి బొమ్మలు అద్దకం చేసిన దుప్పటి.

ఇంతెల్లము = ఇంతలొందరలో ఇవి ఈ పాటలోని భాషావిశేషాలుగా పరిగణించవచ్చు.

1. 'కన్నీటిపాట' లోని భర్త శ్మశాన భూమిలో కూర్చుని భార్యను తలపోస్తున్నాడు. తనకు పెళ్ళి జరిగాక తన భార్య వ్యక్తురాలై సత్యభామలాగా సుందరంగా శోభించిందనీ, ఆ తరువాత పందిట్లో కూర్చుంటే పార్వతీదేవిలాగా ఉండేదనీ, ముత్తైదువుగా ఉన్నప్పుడు ముద్దబంతిలాగా ఉండేదనీ గుర్తుచేసుకుని విలపించాడు. అంతేకాక, రోజూ ఇద్దరూ కలిసి అన్నం తినే గిన్నె ఇక మీదట ఒక్కరికి మాత్రమే ఉపయోగపడుతున్నది కదా అని వాపోయాడు. ఇద్దరూ కలిసి కప్పుకునే దుప్పటిని ఇక మీదట తను ఒక్కడే ఉపయోగించవలసి వస్తున్నది కదా అని దుఃఖపడ్డాడు.

3. మరణించిన భార్య స్మృతిలో జానపద గాయకుడు పాడిన కరుణరసాత్మకమైన శ్రామికగేయం ఇది. తమ పెళ్లి జరిగి ఎంతో కాలం కాకముందే పాపపు దేవుడు తమ ఇద్దరినీ ఎడబాపాడని తవ్వకంకూలిపని చేసే పురుషుడు సున్నపురాయి దొరికే నేలలో కూర్చొని విలపిస్తాడు. ఆమె విషయం తలుచుకుంటేనే చద్ది తిన్నట్టుందని అంటే ఆకలికి తాను అన్నంతింటున్నా అందులో సుఖమే లేదని బాధపడతాడు. తర్వాత వచ్చిన 'బొడ్డుగిన్నె' తన ఒక్కనికే ఒనరెంచే విలాపంలో ఈ భావం మరింత స్పష్టమైంది. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీలు పుష్పవతులు కాకముందే పెళ్ళికావడం సర్వసాధారణం. కాబట్టి ఆమె వ్యక్తురాలైన తర్వాత జరిగిన సంఘటనలన్నీ ఈ పాటలో జానపదుడు నెమరువేసుకోవడం జరిగింది. ఆమె సమర్తాడి చాటుకు కూర్చుంటే సత్యభామలాగా ఉందనీ, ప్రసూతికాగానే ఆమెకు పార్వతీదేవి కళ వచ్చిందనీ, ముద్దబంతిలాంటి ముత్తైదువ ఆమేననీ జానపదుడు ముగ్ధప్రణయంలో తలపోస్తాడు. అలాంటి ఆమె మరణంతో తనకు కలిగిన ఒంటరితనాన్ని తలుచుకుంటూ, ఆమె ఉన్నప్పుడు తామిద్దరూ కలిపితినే బొడ్డుగిన్నెలో తానొక్కడే ఇప్పుడు తినవలసి వచ్చినందుకు రోదిస్తాడు. ఇద్దరూ కలిసి కప్పుకొని నిద్రించే మద్దికాయల దుప్పటిని ఇప్పుడు తానొక్కడే ఉపయోగించవలసి వచ్చినందుకు బాధపడుతాడు. జానపదుల దాంపత్య జీవితంలోని ప్రేమానుభూతి ఎంత ప్రగాఢమైందో, వారి జీవన సరళిలో ఆత్మీయతా ఆర్ద్రతా ఎంతగా పెనవేసుకొని ఉంటాయో ఈ పాట కరుణరసాత్మకంగా నిరూపిస్తున్నది.

BRAOU

– ఆచార్య నాయని కృష్ణకుమారి

# భాగం 5 నరసింహ్వారెడ్డి కథ (కథాగేయం – చారిత్రికం)

విషయక్రమం

5.0 ఉద్దేశం
5.1 ప్రవేశిక
5.2 సూచనలు
5.3 పాఠ్యం
5.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
5.3.2 వ్యాఖ్యానం
5.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
5.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
5.6 ఆకలింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు

## 5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- బ్రిటిష్ వారి పరిపాలనలో దేశీయులు అనుభవించిన కష్టనష్టాలు.
- స్వతంత్ర ప్రతిపత్తి కోసం వివిధ ప్రాంతాల జాతీయ వీరులుచేసిన తిరుగుబాటు స్వభావం
- స్వాతంత్ర్య వీరుల పట్ల జానపదులకున్న భక్తి గౌరవాలు.

BRAOU

## 5.1 ప్రవేశిక

"నరసింహ్వారెడ్డి కథ" మౌఖిక సంప్రదాయంలోని చారిత్రిక కథాగేయ విధానానికి సంబంధించింది. ఈ గేయం అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకా, నూరేపల్లి గ్రామంలో దొరికింది. దీన్ని పాడిన వారు దూదేకుల బాబయ్య ఉరఫ్ సిద్రెప్ప.

## 5.2 సూచనలు

ఈ విభాగంలో ఇచ్చిన జానపద కవితాఖండికలు చదవండి. ఇతర సంకలనాలు కూడా చూడండి. మరీ ముఖ్యంగా ఆశువుగా కవితలల్లే జానపదకవుల కథాగానాన్ని వినండి. రచనా లక్షణాలను పరిశీలించాలి. ఇతర కవితా మార్గాలతో పోల్చి విలువ కట్టాలి. జానపద కవిత్వ పద్ధతిలోని సహజ కవితారీతినీ, లయబద్ధమైన పదాల కూర్పునూ పరిశీలిస్తూ ఈ పాఠంలోని 5.3లో ఇచ్చిన "నరసింహ్వారెడ్డి కథ" అనే చారిత్రిక గేయాన్ని అధ్యయనం చెయ్యాలి. ఈ పాఠ్యాన్ని చదవడంలో 5.3.1, 5.3.2, 5.3.3 లలో ఇచ్చిన వివరాలను సహాయకంగా తీసుకోవాలి.

## 5.3 పాఠ్యం

దొరవారి నరసింహ్వారెడ్డి ।దొర।
నీ దొరతనము కూలిపోయె రాజా నరసింహ్వారెడ్డి ।దొర।
రేనాటిసీమలోనా రెడ్డోళ్ళ కులములోనా
దొరవారీ వమిశానా ధీరుడే నరసింహ్వారెడ్డి ।దొర।

కోయిల్‌కుంట్లా గుట్టలెంటా కుందేరూ వొడ్డులెంటా
గుఱ్ఱమెక్కి నీవు వస్తే కుంపిణీకి గుండె దిగులూ ।దొర।
కాలికి సంకెండ్లు వేసి చేతికి బేడీలు వేసి
పారాతో పట్టి తెచ్చి బందికానులో పెట్టిరీ ।దొర।
కండ్లకూ గంతాలుగట్టి నోటినిండా బట్లు పెట్టీ
నిలువునా నీ తలా గొట్టీ కోట బురుజుకు గట్టిరీ ।దొర।
కాసిలోనా తల్లికేమో చావు సుద్దీ తెలిసినాదీ
కన్నకడుపే తల్లటించే గంగలోనా గంగ గలిసే
దొరవారి నరసింహ్వారెడ్డీ
నీ దొరతనము కూలిపోయె రాజా నరసింహ్వారెడ్డి.

### 5.3.1. కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| వమిశాన | = | వంశాన, వంశంలో |
| వొడ్డులెంటా | = | గట్ల వెంబడి |
| సంకెండ్లు | = | సంకెళ్ళు బహువచన ప్రత్యయానికి బిందు పూర్వక లకార శ్లిష్టడకారం వాడడం ప్రాంతీయ భాషా లక్షణం. |
| బేడీలు | = | సంకెళ్ళు - ఇక్కడ పదకర్త కాళ్ళకూ చేతులకూ రెండు పదాలను సూచించాడు. |
| పారా | = | కాపలా - ఇది 'పహరా' శబ్దానికి వికృతి. |
| బందికాను | = | బందిఖానా - చెరసాల. తెలుగులో చాలా పదాలు ఉకారాంతాలుగా ఉంటాయి. కనుక దీన్ని కూడా జానపదుడు ఉకారాంత పదంగా మార్చుకున్నాడు. |
| గంతలు | = | కళ్ళకు అడ్డంగా, కనపడకుండా తోలుతో గాని గుడ్డతోగాని తయారుచేసే దళసరి ఆచ్ఛాదనం |
| బట్లు | = | బట్టలు - బహువచన లుకారం అకారాంత రూపాలమీద శ్లిష్టం కావడం మాట్లాడే భాష లక్షణం. |
| నిలువునా తలగొట్టు | = | తక్షణమే చంపు - తెలుగు నుడికారం |
| చావుసుద్ది | = | మరణవార్త |
| తల్లటించె | = | తల్లడిల్లె |
| గంగలోనా గంగ గలిసే | = | కాశిలో ఉన్న తల్లి ఏడుపు ఒక గంగ; అది కాశిలో ఉన్న గంగానదిలో కలిసిపోవడమే "గంగలోనా గంగ" కలవడం. |

### 5.3.2. వ్యాఖ్యానం

చారిత్రిక గేయాలను, పిచ్చుకుంట్లు గొల్లలు, దాసరులు వంటి వృత్తి గాయకులు పాడతారు.

సాధారణంగా ఈ గేయ గాథలను ప్రవర్తించేవారు ముగ్గురుంటారు. అందులో ఒకడు పాట పాడుతూ కథను శ్రోతల ముందు ప్రవర్తించేవాడు కాగా మిగిలిన ఇద్దరూ వంత పాటగాళ్ల వలన శ్రోతలకు కలిగే ప్రయోజనాలు రెండు. అవి 1. కథకుడు పాటగా, రాగచ్ఛాయలో చెప్తున్న కథార్థాన్ని శ్రోతల సౌలభ్యం కోసం వచనంలో విడమర్చి చెప్పడం, 2. కథలో సందర్భానుసారంగా, హాస్య స్ఫోరకంగా, సమకాలిక సంఘటనలను జోడించి, శ్రోతలకు తెలియజేయడం. కథకుని చేతిలో అందెలు, తంబుర ఉంటాయి. ఒక్కొక్కసారి తోక తలపాగా చుట్టుకుని, మెడల మీద నుండి కండువా ఇరువైపుల కొనవరకూ జారవిడిచి, పంచెకట్టుతో కథకుడు హుందాగా కనిపిస్తాడు. వంతల చేతుల్లో గుమ్మెటలు ఉంటాయి. వంతల వేషం, మెడమీద నుండి రెండు పక్కలకు జారే కండువా మినహా, మిగిలినదంతా కథకుడి వేషం లాగానే ఉంటుంది. పంచెకట్టు చీలమండల



BRAOU

వరకూ ఉండకుండా కొంత పైకి ఉంటుంది.

చారిత్రిక గేయాలన్నీ సాధారణంగా వీర రస ప్రధానాలుగా ఉంటాయి. వీటిలో పెల్లుబికి కనిపించేది ఉత్సాహం. కథకుడు కూడా ఉత్సాహభరితుడై చెంగున గెంతుతూ మెరపు తీగలాగా ముందుకూ వెనక్కూ కదులుతూ కథ చెప్తాడు.

చారిత్రిక గేయాలలో స్పష్టంగానో, అస్పష్టంగానో చరిత్రాంశం కనిపిస్తుంది. కథలోని వీరుడు గత కాలంలో ఎప్పుడో బ్రతికి తన మనుషులకూ, జాతికి మేలు చేసే సాంస్కృతికమైన మార్పును (culture change) వాళ్ళమధ్యకు తెచ్చిన వాడై ఉంటాడు. ఆ విధంగా అతణ్ణి మనం సంస్కృతి (culture Hero) వీరుడు అని పిలువవచ్చు. జనులు ఆ వీరుణ్ణి కృతజ్ఞతతో గుర్తు చేసుకుంటూ అతని చర్యల్ని తీరు తీర్లుగా కథలుగా మలిచి పాడుకుంటారు. ఇలాంటి గేయాలనే కథాగేయాలు అంటారు.

ఈ చారిత్రిక వీరుల వృత్తాలను, వృత్తి గాయకులు కథా గేయాలుగా ప్రవర్తించడమే కాక, సమష్టి నృత్య ప్రక్రియలైన కోలాటం, చిరతల రామాయణం వంటి ప్రక్రియల ద్వారా ప్రదర్శించడం కూడా వాడుకలో ఉంది.

ప్రస్తుత పాఠ్యాంశం ఒక కోలాటపు పాట అని పాడినవారు చెప్పారు.

కోలాటాన్నే 'కోలాట' అని కూడా వ్యవహరిస్తారు. కోలాట ఆడేవాళ్ళు జట్లుగా కూడి, లయను పాటిస్తూ, గతి తప్పని విధంగా పద విన్యాసాన్ని ప్రదర్శిస్తూ, అందుకు అనుగుణంగా రెండు చేతులలో ఉన్న కోలల్ని తాటించి ధ్వని ఉత్పాదింపచేస్తారు. ఈ లయ, ధ్వని, ఆంగిక చాలనం, అడుగుల కదలిక అన్నీ ఒక దానితో ఒకటి పొందికగా కూడి మనోరంజకమైన ప్రదర్శన కళగా రూపు దిద్దుకుంటుంది.

కోలాటంలో రకరకాల భేదాలు కనిపిస్తాయి. అందులో మిక్కిలి ఆసక్తి కరమైంది జడకోలాటం. మనిషికి రెండు చొప్పున ఎంత మంది కోలాటం ఆడుతుంటే అన్ని తాళ్ళు ఒక కొక్కెం నుండి కిందికి జారేటట్లు అమర్చబడి ఉంటాయి. ఆడేవాళ్ళు వృత్తాకారంగా కూడి ఒక్కొక్కరు, కొక్కెం నుండి జారే రెండేసి తాళ్ళను తమ చేతుల్లో ఉండే కోలలతో అనుసంధానం చేసుకుని పాద విన్యాసం ఆరంభిస్తారు. పాటా, వారి శరీర చాలనమూ, పద విన్యాసమూ ముగిసే సరికి వాళ్ళ చేతుల్లో ఉన్న తాళ్ళు ఒక జడలా క్రమబద్ధంగా అల్లుకు పోతాయి. తిరిగి ఆట క్రమంలో రెండవ భాగాన్ని ఆరంభించి దాన్ని ముగించే సరికి అల్లుకున్న జడ క్రమంగా విప్పుకుని మొదటి స్థితికి వస్తుంది. ఇది చాలా రమ్యమైన దృశ్య ప్రక్రియ.

ఈ చారిత్రిక గేయం రాయలసీమ ప్రాంతానికి చెందినది. బ్రిటిష్ ప్రభుత్వం సాగుతున్న కాలంలో ఎందరో చిన్న **పాళెగాండ్రు** ప్రభుత్వానికి ఎదురు తిరిగారు. జనాన్ని కూడ గట్టుకుని, పితూరీలు రేపి, వీర మరణాన్ని పొందినవాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఇది క్రీ. శ. 1800-1825 ప్రాంతాలలో జరిగిన ఉదంతం.

ఉయ్యాలవాడ వీరానికేకాక దాన గుణానికి కూడా స్థానమే. 1886లో అక్షయనామ సంవత్సరంలో డొక్కల కరువు రాగా చేతికి ఎముక లేకుండా దానం చేసిన దానవీరుడు బుడ్డా వెంగళరెడ్డిది కూడా ఈ గ్రామమే. అతని పేరు ఈనాటికీ రాయలసీమ జానపద భిక్షుక గాయకుల నోట ప్రతిధ్వనిత మౌతూనే ఉంది. నరసింహారెడ్డిలాగా ఇతడు కూడా సంస్కృతి వీరుడే.

ఈ గేయంలో నరసింహారెడ్డికీ, కుంపిణీ ప్రభుత్వానికీ మధ్య జరిగిన పోరు నామ మాత్రంగా వివరింపబడ్డది.

ఈ ఖండిక చాలా చిన్నదిగా ఉండడం చేత దీనికి విషయ సమగ్రత లేదు. ఇందులో శబ్దార్థాలంకారాలు కూడా లేవు. ఇందులో కథనానికున్నంత ప్రాధాన్యం కవిత్వానికి లేదు.

### 5.3.3 విశేషాంశాలు

దీనికి ముందు చదువుకున్న నాలుగు పాఠాల్లో విభిన్న రకాల గ్రామిక గేయాలను విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ పాఠం కథా గేయాల రచనా పద్ధతినీ, చారిత్రికమైన దేశ పరిస్థితులనూ విద్యార్థులకు



BRAOU

పరిచయం చేస్తుంది. కుంఫిణీ పరిపాలనలో దేశీయులు అనుభవించిన కష్టనష్టాలను ప్రత్యేకంగా వెల్లడిస్తుంది.

**అభ్యాసం – 1**

జానపద కథాగేయాన్ని గురించి రాయండి.

**అభ్యాసం – 2**

చారిత్రిక కథా గేయం అంటే ఏమిటి?

**అభ్యాసం – 3**

నరసింహ్వారెడ్డి వీరత్వాన్ని వర్ణించండి?

BRAOU

## 5.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

- మౌఖిక సంప్రదాయంలోని ఒక కథాగేయం "నరసింహ్వారెడ్డి కథ"
- ఈ కథాగేయం చారిత్రికం కూడా
- ఈ చారిత్రిక కథాగేయం వీరరసోద్దీపకం
- ఈ పాట ఆంగ్లేయుల పరిపాలనలో దేశీయులు అనుభవించిన కష్టనష్టాలనూ, మానసిక వేదనలనూ చిత్రిస్తున్నది.
- ఈ చారిత్రిక కథా గేయంలోని చారిత్రిక వీరుడు - రాయలసీమకు చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి.

- అతని ఆత్మాభిమానాన్నీ, దేశాభిమానాన్ని, పౌరుషాన్నీ, ఈ కథాగేయం చిత్రిస్తున్నది.
- అతని మహావ్యక్తిత్వానికి జానపదులు ఎంతగా ముగ్ధులై ఆరాధించారో ఈ పాట వల్ల తెలియ వస్తున్నది.
- జాన పద కవిత్వంలోని సహజమైన భావ సంపద మొదలైన సాధారణ లక్షణాలతో బాటు, కథా గేయ లక్షణాలను కూడా ఈ పాఠ్యం పరిచయం చేస్తున్నది.

## 5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. చారిత్రిక కథా గేయ లక్షణాలను ఈ పాఠ్యానికి అన్వయించండి?
2. నరసింహారెడ్డిని బ్రిటిష్ ప్రభుత్వం హింసించిన పద్ధతిని వర్ణించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. నరసింహారెడ్డి కథలోని రసమేమిటో వివరించి, ఇలాంటి గేయాల్ని ఎవరు పాడతారో తెలపండి?

## 5.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఈ కథాగేయంవంటి ఇతర కథా గేయాలను సేకరించి పరిశీలించండి.
2. ఈ పాటలోని చారిత్రికాంశాలనూ, నుడికారాలనూ పట్టికగా తయారు చేయండి.
3. కథా గేయలక్షణాలను ఒక వరుసలో రాయండి.

## అభ్యాసాలకు జవాబులు

1. ఏదైనా ఒక కథను వస్తువుగా తీసుకొని రచించిన గేయాన్ని కథాగేయం అంటారు. జానపదుల విషయంలో ఆశుకవిత్వమే తప్ప, రచన లేదు కాబట్టి ఇలాంటి కథాగేయాలను జానపదులు ఒకపాట రూపంగానే పాడుకుంటారు. కోలాటం, చిరుతల రామాయణం, బుర్రకథ వంటి జానపద ప్రక్రియలన్నీ కథా గేయ ప్రవర్తకాలే. ఐతే ఇవి సమష్టిగానానికి సంబంధించిన ప్రక్రియలు. బుర్రకథ ఐతే ఒక కథకుడు, ఇద్దరు వంతలు ఉంటారు. తక్కిన ప్రక్రియల్లో అందరూ కలిసి పాడతారు. విభిన్న పాత్రల ద్వారా నాటకం పద్ధతిలో కథాగేయ ప్రవర్తనం ఉంటే, ఆయా పాత్రలు ధరించిన విభిన్న గాయకులు కథా గేయ భాగాలను పాడతారు. "ఒగ్గుకథ, పిచ్చుక గుంట్లకథలు, బహురూపులుకథలు" వంటి ప్రక్రియలు కూడా జానపదకథాగేయాలను ప్రదర్శించేవే.

BRAOU

2. జానపదవాఙ్మయంలో కథా సహితమైన శాఖ కిందికి వస్తుంది చారిత్రిక గేయం. నిడివి చిన్నదిగా, కథ సంక్షిప్తంగా ఉంటే దాన్ని శ్రామిక గేయంగానో, కోలాటపు పాటగానో జానపదులు పాడుకోవచ్చు. దీర్ఘమైన వర్ణనలతో పెద్దగా ఉన్న కథను జానపద కథాగాయకులు గేయగాథగా ప్రదర్శిస్తారు. అలాంటి వాటిలో ఒకటి ఈ "నరసింహ్వా రెడ్డి కథ" అనే చారిత్రిక గేయం. ఇలాంటి వాటిలో ఒక చారిత్రిక పురుషుని జీవితం కాని, జనజీవనానికి సంబంధించిన ఒక పెద్ద చారిత్రిక సంఘటన కానీ వర్ణిత మౌతుంది. ఇలాంటి గేయాల వల్ల చరిత్ర పఠనం కంటే జన జీవితంలో సంస్కృతిపరంగా వచ్చే మార్పుల అవగాహన ఎక్కువగా, స్పష్టంగా కలుగుతుంది. ఈ ఖండికలో ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించిన విప్లవాత్మక చర్య కథావస్తువుగా ఉంది.

3. ఈ చారిత్రిక కథా గేయం రాయలసీమ ప్రాంతానికి చెందింది. బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురు తిరిగిన విప్లవ వీరుడు, పాళెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తత్ఫలితంగా వీరమరణం పొందినవాడు. ఈ సంఘటన జరిగిన కాలం క్రీ. శ. 1800-1825 ప్రాంతం. ఈ గేయంలో నరసింహారెడ్డికి, బ్రిటిష్ ప్రభుత్వానికీ జరిగిన పోరాటం నామమాత్రంగానే వర్ణించబడింది. కాని, కథ విస్తృతి పూర్వకంగా లేదు. విషయ సమగ్రతనూ, సంఘటనల బాహుళ్యాన్నీ ఈ కథా గేయం సంతరించుకోలేదు. కథనానికున్న ప్రాధాన్యత కథకు లేదు. కోయిలకుంటగట్టు వెంబడి గుర్రమెక్కి వస్తున్న నరసింహారెడ్డిని బ్రిటిష్

సిపాయిలు మూకుమ్మడిగా ఎదిరించి, పడగొట్టి, కాళ్లకు సంకెళ్ళు, చేతులకు బేడీలూ వేస్తారు. చుట్టూ పహరా ఇస్తూ తీసుకొని పోయి, చెరసాలలో బంధిస్తారు. కండ్లకు గంతలు కడతారు. నోట్లో గుడ్డలు కుక్కుతారు. తలనరికి కోట బురుజుకు కడతారు. ఆ వార్త కాశిలో ఉన్న నరసింహారెడ్డి తల్లికి తెలుస్తుంది. ఆమె దుఃఖాశ్రువులు గంగలో కలిసిపోతాయి. అంతటితో నరసింహారెడ్డి వంశపు ప్రభుత్వం కూలిపోతుంది. ఈ అంశాలు మాత్రమే ఈ గేయంలోని ఇతివృత్తపరంగా ఉన్నాయి. నరసింహారెడ్డినే కాక, తదితర భారతీయులను కూడా బ్రిటిష్ వారు హింసించిన విధానం ఈ ఇతివృత్తంలో సూచింపబడుతున్నది. నరసింహారెడ్డిని బంధించడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఎదుర్కొన్న ఇక్కట్లను వర్ణించడంలో అతని వీరత్వం ద్యోతక మౌతున్నది.

**– ఆచార్య నాయని కృష్ణకుమారి**

BRAOU

# భాగం 6 ఎరుకనాంచారి కథ (కథాగేయం-జానపదం)

**విషయక్రమం**

6.0 ఉద్దేశం
6.1 ప్రవేశిక
6.2 సూచనలు
6.3 పాఠ్యం
6.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
6.3.2 వ్యాఖ్యానం
6.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
6.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
6.6 ఆకళింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు

## 6.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- జానపదుల దృష్టిలో స్త్రీ శీలానికున్న ప్రాముఖ్యం
- జానపద స్త్రీల పౌరుష గుణం
- జానపదుల దృష్టిలో కులవృత్తికున్న ప్రాముఖ్యత.

BRAOU

## 6.1 ప్రవేశిక

మౌఖిక సంప్రదాయంలోని జానపద కథాగేయాన్ని ఈ భాగంలో విద్యార్థులు చదువుతారు.

ఈ కథ స్త్రీప్రాధాన్యాన్ని వెల్లడించే జానపదకథ. జానపద వాఙ్మయ విభజనలో వృత్తి గాయకులు పాడే స్త్రీ సంబంధి కథా గేయాలకు సంబంధించిన కథ ఇది (పట్టిక చూడండి). ఇటువంటి కథ వృత్తి గాయకులు పాడే కథలలోనే కాక కథా సహితమైన శ్రామిక గేయాలలో కూడా ఉండడానికి ఆస్కారం ఉంది. వృత్తి గాయకులు పాడే కథ దీర్ఘంగా ఉంటుంది. అదే కథ నిడివి తగ్గి గేయగాథా ప్రవర్తకులు సమకూర్చుకునే హంగులేవీ లేకుండా క్లుప్తీకరణ పొంది శ్రామిక గేయంగా అవతరించవచ్చు.

స్త్రీ జీవన చిత్రణకు సంబంధించిన ఇటువంటి కథలలో ప్రాధాన్యం స్త్రీదే. కాని కథ అన్ని వేళల సుఖాంతంగా కనిపించదు. ఇటువంటి కథలు ఎక్కువగా విషాదాంతాలై ఉంటాయి. చెప్పే కథ స్త్రీ ప్రాధాన్యానికి సంబంధించినదే అయినా పురుషుడుకాని, సంఘం కాని ఆమెపై తమ అధికారాన్ని ప్రదర్శించుకునే ప్రయత్నాలే కనిపిస్తుంటాయి. స్త్రీ అధికారాన్ని గాని స్వేచ్ఛను గాని నిర్ద్వంద్వంగా అంగీకరించే విధానం ఆవిడ నివసించే సమాజంలో కనిపించదు. అందువలన ఆటంకాలకు, విపరీత పరిస్థితులకులోను అయినప్పుడు ఆవిడ వాటిని జయించగల్గితే ఆ కథ సుఖాంతం, అద్భుతావహం అవుతుంది. వాటిని ఎదుర్కొన లేకపోతే విషాదాంతమూ, కరుణాత్మకమూ అవుతుంది.

## 6.2 సూచనలు

ఈ విభాగంలో ఇచ్చిన జానపద కవితలు చదవండి. ఇతర సంకలనాలు కూడా చూడాలి. మరీ ముఖ్యంగా ఆశువుగా కవితలల్లే జానపదకవుల కథాగానాన్ని వినండి. రచనా లక్షణాలను పరిశీలించాలి. ఇతర కవితా మార్గాలతో పోల్చి విలువ కట్టాలి. జానపద కవిత్వ పద్ధతిలోని సహజ కవితారీతినీ, లయబద్ధమైన పదాలకూర్పునూ పరిశీలిస్తూ ఈ పాఠంలోని 6.3 లో ఇచ్చిన "ఎరుకనాంచారికథ" అనే జానపద కథాగేయాన్ని అధ్యయనం చెయ్యాలి. ఈ భాగాన్ని చదవడంలో 6.3.1, 6.3.2, 6.3.3 లలో ఇచ్చిన వివరాలను సహాయకంగా తీసుకోవాలి.

## 6.3 పాఠ్యం

ఎరికిలవాళ్ళు – ఏలలో
ఏటిగట్టున – 'ఏలలో
సిన్నలకు వేసిరి – సిన్ని గుడిసెండ్లే
పెద్దలకు వేసిరి – పెద్ద గుడిసెండ్లే
ఎరికెలమ్మి కేసిరి – బంగారు గుడిసె
అట్నుంచి సింగడు – యాటమార్గం పాయినాడు
అట్నుంచి ఎరికలమ్మ – అత్తమాలుకొచ్చింది

గజ్జల పీటమీద – గౌరిదేవి మాయత్త
నాకు సెల్విలిస్తె – గద్దెజెప్ప బోతాను
నీకేమి కొరవమ్మ – నీకేమి తక్కువమ్మ
గద్దెజెప్ప బొయ్యేకి – ఓసే ఎరుకలమ్మ
మాయింటి కులవరితి – ఇడరాదు ఓయత్త
నాకు సెల్విలిస్తె – గద్దెజెప్ప బోతాను
నన్నేమడిగేవుగాని – మీ మామనడుగు
పడు సాలిలోన – పట్టెమంచం మీద
వీపు దిండ్లనొరిగి – లేపు దిండ్లమీద
పండేటి మామ – నాకు సెల్విలిస్తే
గద్దెజెప్ప బోతాను – నాకు సెల్విలిస్తే
నీకేమి తక్కువమ్మ – నీకేమి కొరవమ్మ
కుండెడిస్తే మోనమ్మ – గాసగాళ్ళ బువ్వ
నీకేమి తక్కువమ్మ – నీకేమి కొరవమ్మ
మనయింటి కులవరితి – ఇడరాదు మామ
గద్దెజెప్ప బోతాను – నాకు సెల్విలిస్తే
నన్నేమడిగేవు గాని – మీయక్క నడుగు

గజ్జెల పీటమీద – గౌరిదేవి అక్క
ఎలమారి కైతేను – గద్దెజెప్ప బోతాను
నాకు సెల్విలిస్తే – గద్దెజెప్ప బోతాను
ఎలమారి కొడుకు – దుర్మార్గుడోయమ్మ
నీకేమి కొదవమ్మ – నీకేమి తక్కువమ్మ
కుండెడిస్తేమోనమ్మ – కుక్కలకే గాదు
గరుసడిస్తేమోనమ్మ – గాసగాళ్లకు గాదు
వద్దన్న పోతాను – పొమ్మన్న పోతాను
మనయింటి కులవరితి – మానరాదు అక్క



BRAOU

ఎలమారి కైతేను - గద్దెజెప్ప బోతాను
ఎలమారి కొడుకైనా - దుర్మార్గుడో చెల్లె
నీకేమి కొదవమ్మ - నీకేమి కొరుతమ్మ
నన్నేల అడిగేవు - మీ బావ నడుగు

రచ్చాకట్టల మించి - రాజేంద్ర బావ
ఎలమారి కైతేను - గద్దెజెప్ప బోతాను
.................................
నన్నేల అడిగేవు - నీ మరిది నడుగు
ఎద్దుల్ల గాసేటి - ముద్దుల్ల మరిది
ఎలమారి కైతేను - గద్దెజెప్ప బోతాను
.................................
నన్నేమి అడిగేవు - నీ చెల్లెనడుగు
ఇసర్రాతిలోకి పోసి - ఇసిరే నా చెల్లెలా
.................................
నన్నేల అడిగేవు - అనిందే సెల్లెలు
ఇంటికి వచ్చింది - వేడినీళ్ళు కాసె
వేడినీళ్ళు సన్నీళ్ళు - యాకము జేసెనే
ఉట్టుల్లో నూనె - మెట్లేసి దించె
మెట్లేసి దించుక - సిరిగిన్నెల కొంచె
సిరిగిన్నెల నూనె - తల సిరుసు కంటె
జాలాటి బండెక్కి - తానాలె జేసింది

జలకమాడి నంక - సీక్కాయ సిక్కం[illegible]
సీమకండి కల్ల - సీరకట్టి
పాము కండికల్ల - రైక దొడిగి[illegible]
ఆవర్ణ సొమ్ములెల్ల - [illegible]ండ బెట్టి
పగిరి సిక్కంటిలోన - [illegible]పరిచె
ఎండి సిక్కంటిలో[illegible] [illegible] సిక్కుదీసె
ఎంటి కెంటికి తప్ప[illegible]డ ముత్యాలేకూర్చె
ముత్యాలు ఒక వరుస పచ్చల్లు దాపె
పచ్చల్లు ఒక వరుస - పగడాలు దాపె
పగడాలు ఒక వరుస - రంగులే దాపె
రంగులే ఒక వరుస - ముడిసానె పూలు
ముడిసిన పూలతో - ఏసానె జడలు
ముత్యాల గద్ది బుట్ట - ఎత్తి ముద్దాడె
బాలునికి పాలిచ్చి - తొట్టిల్ల ఏసె
ముత్యాల గద్ది బుట్టకు - పూజల్లు సేసె
ఎవరిమాట లెక్క బెట్టక - గద్దె పయనంబాయె

కడపమానుదాటగానె - తలిదండ్రి తుమ్మె
అదేమీ లెక్కపెట్టక - ఊరిబయట కెళ్ళె
ఊరువాకిలి దాటగానె - ఊరుబిల్లి అడ్డమాయె
అదేమీ లెక్క పెట్టక - ఎరికలమ్మ పాయె
అట్నుంచి ఎరుకలమ్మ - ఆడవిబాట పట్టినాది.
అర్ధమాని అడవిలోన - ఎలమారి రెడ్డికొడుకు

BRAOU

పొలము షూడొచ్చ - పైరు షూడొచ్చ
ఎలిమారి రెడ్డికొడుకు - ఎరుకలమ్మని చూసెనే
ఏమంట పలికేను - ఎలిమారి రెడ్డికొడుకు
యాదేశమమ్మ - ఏ ఊరు ఎరుకలమ్మ
అడిగినంతా ఇచ్చేను - అడుగే దాటద్దు
కోరినంతా ఇచ్చేను - కోర్కైనా దీర్చవే
నిను జూసి మనసు - నిలువకుండా గంతులేసే
గడియ నిలువదే మనసు - గంట నిలవదే
గద్ది సెప్పల్లి ఎరుకలమ్మ - సుద్ది సెప్పల్లి ఎరుకలమ్మ
అట్నుంచి ఎరుకలమ్మ - ఊరుదాపల పోతాది
ముందు ఎరకలమ్మ - ఎనక రెడ్డికొడుకు
ఎరకలమ్మ ఊరిలోన - గద్దిజెప్ప బాయెనయ్యో
ఇక్కడైనా రెడ్డికొడుకు - ఆడి ఏస్కం గట్టినాడు
తెరగట్టినాడు రెడ్డికొడుకు - తెరలోన గూరుచుండె
ఆడేటి బాలలను - పిలుసుక రమ్మనెను
అమ్మా ఎరుకలమ్మ - మారాజు పిలుస్తాడు
మీ యింటికి నేనైతే - వచ్చిల్లేదు పో అమ్మ
కరసేటి కుక్కలని - కట్టేసినాము
పొడిసేటి ఎద్దులన్ని - పొలముకే పోయినాయి
అట్నుంచి ఎరుకులమ్మ - అందంగా వచ్చింది
రెడ్డింటి కయ్యాలె - సరాసరా వచ్చింది
కడపమాను అవతలకు - అడుగైనా ఎట్టింది
ఇంటోకి పోయింది - ముత్యాల గద్దెబుట్ట
కిందైనా దించింది - ముత్యాల గద్దెబుట్ట
తెరలోని రెడ్డికొడుకు - సెయ్యందినాదో
ఆడవారి సెయికాదే - మగవారి సెయ్యే
ముత్యాల గద్దెబుట్ట - తీసుకుంది ఎరుకలమ్మ
తలవాకిలి దాటుకోని - ఊరుదాటి పోయింది
ఇక్కాడ రెడ్డికొడుకూ - అద్దమాని అడివిలోను
ఆడ ఏస్కం ఇడిసేసి - మగేస్కం గట్టినాడు
అద్దమాని అడవిలోను - ఎరికలమ్మా వద్దకొచ్చా
నడిదావన పోతావు - ఎందుకైనా పోతావు
ఎక్కడికి పోతావు - ఎరికలమ్మా పోతావు
నన్నుగాదని పోతావు - నడిదావన పోతావు
ఎరికిలమ్మా అంటాట - ఏమేస్కం అతికినాది
సుట్టూర వనమేను - నిమ్మవనమూ నీడలాయె
చెట్టు దాపుకు వచ్చిందీ - పైట చెరగూ ఇచ్చినాదీ
ముత్యాల గద్దెబుట్ట - సంకన బెట్టినాది
ఒకటికి పోయొస్తా - పైటచెంగు పట్టికాయి
అంటవనముల దూరినాది - చెట్టుదాపుకు చేరినాది
కట్టుసెంగు విడిచి తాను - చెట్టుకైనా కట్టింది
పారివచ్చిన గంగ ఒడ్డున - ప్రార్తనాలూ చేసినాది
అక్కరో అక్క
    నను దాసుకో అక్క
        నేనొస్తా అక్క



BRAOU

గంగమ్మ మా అక్క

గంగమ్మ పారజూచి - దాసుకుందె సెల్లెలాని
ఇక్కడైనా రెడ్డికొడుకు - నిమ్మవనములో పారజూచె
కట్టు సెరుగు చూసినాడు - సెట్టుకైనా ఉన్నాది.
వానిదారి పట్టుకోని - ఎలమోరి రెడ్డికొడుకు
ఊరికైనా వచ్చినాడు - ఎలమోరి రెడ్డికొడుకు
యాటపోయిన సింగడైనా - ఇంటికొచ్చి చేరినాడు
మూనెల్ల బాలుడు - అరసి అరసి అలసిపోయె
అమ్మరో ఓ మాయమ్మ - నీ క్వాల్లెందు బోయెనమ్మ
తెలిసీ చెప్పుదునా అప్ప - తెలియక చెప్పుతాను
తెలిస్తేమి బయముంది - తెలిసీ చెప్పుతాను
ఎలమోరి కైతేను - గద్దెజెప్ప బోయింది
మేమైనా సెప్పినగాని - వద్దన్నా బోయింది
మా మాట యినకుండా - పోతనానీ పోయింది
గజ్జల పిడీబాకు - పుట్టగోసిలో దాసా
మూన్నెల్ల బాలుడు - అరసి అరసి పోతాడు
ఊరంతా దిరిగినాడు - ఎక్కడ జాడలేదు
వాళ్ళోదిన గంగమ్మ - కలలోకి వచ్చింది
ఒదినా వో గంగమ్మ - నీసెల్లెలొచ్చిందా
లేదప్ప సింగడా - యాడొస్తా దప్ప
నీ కొడుకు బాలుడు - అరసిపోతాడే
ఎంత సెప్పినగాని - నమ్మదు గంగమ్మ
ఆడు సింగడు - ఏమంట పలికె - యాలంట పలికె
ఏమప్ప సింగడ - ఏమనకుండుంటావ
మడిసంగ జూస్తావ - ఏమనకుండుంటావ
నువు బంపితే ఓ ఒదిన - తోలుకుపోతా
మూణ్ణెల్ల బాలుడు - అరిసీపోతాడు
అట్టంటె సెల్లెలూ - ఏడున్నా వచ్చె
సేతి బాసలతో - ఏమంట పలికె
నా సెల్లెలయితే - గంగమ్మయితే
సేసింటే మరిదీ - నువ్వయిన జంపితే
సేనూరుకుండేను - వినవయ్య మరిదీ
నా సెల్లెలు సెడకుంటే - నా సెల్లెల్ని జంపితే
రగతంగా నయితే - తప్పక వస్తా మరిదీ
మీ గుడిసెండ్లు - ఏటికి పోతాయి
సేతిబాసలు దీసుకోని - పంపినాది గంగమ్మయితే
ముందర సింగడు - ఎనకాల ఎరికిలమ్మ
దోవన పడతానే - అనరాని మాటలు
అనుకుంట వచ్చే - అనొద్దు సింగడ
వాదిచ్చు కుంటానే - యింటికైన వచ్చిరీ
మూణ్ణెల్ల బాలునికి - పాలిచ్చి పండబెట్టి
తొట్టెల్ల ఏసా - మాట మాటనుకుంటా
కొట్లాడినాదే - ఎంతెంత సెప్పినగాను
ఎట్ల బోతివే నీవు - గద్దెజెప్పేకి
ఎలమారి రెడ్డికొడుకు - బాగున్నాడా నీకు

పదే పదే అట్లాంటి మాటలు - అనొద్దు సింగడ
ఎంత సెప్పినగాని - ఎట్లబోతివె నీవు
గద్దె జెప్పేకి - ఎట్లబోతివె నీవు
పుట్టగోసి సింగడు - గజ్జెల్ల బాకుతో
రొమ్ముల్లి గుద్దేను - గొంతుల్ల గుద్దేను
విలవిల తండ్లాడీ - ప్రాణాలు విడిసింది
అక్కను తలుసుకోని - ప్రాణాలు విడిసింది
కారేటి రగతము - గంగమ్మవేపాయె
సెల్లెల రగతము - కాలవలు పారేను
అక్కడ గంగమ్మ - కళ్ళనెతే జూసేను
సెల్లెలి రగతమ్ము - చిక్కంగ జూసేను
మాడెమంత మబ్బులేదు - ముత్తెమంత మబ్బులేదు
మాడెమంత మబ్బుతునక - అరసెయ్యంత అయ్యింది
స్యాటంత మొగిలొడ్డె - కారెవర్ణము కూడుకొనె
దిక్కులంతా మొగిలొడ్డె - చీకట్లు దట్టమాయె
కురిపించె వానల్లు - గుడిసెండ్ల మీద
నూటొక్క గుడిసెల్లు - తెరగొట్టుకోని
తెప్పగొట్టుకొని - గంగమ్మ పాలాయె
యాడ జూసిన పీనుగులు - తెరగొట్టుకొనిపోయె

**6.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు**

| | | |
|---|---|---|
| ఏలిలో | = | ఇది పంత పదం. ప్రతి చరణం చివర వంతలు వాడడం జానపద గేయ సాహిత్యంలో సాధారణమైన లక్షణం. |
| గుడిసెండ్లు | = | గుడిసెలు బిందు పూర్వక డకారోత్వ 'లు' వర్ణకం బహువచన సూచకం. ఇది ప్రాంతీయ భాషా లక్షణం. |
| ఎరుకలమ్మి | = | ఎరుకల స్త్రీ) |
| యాట మార్గము | = | వేట, ఇది జానపదుల నుడికారం |
| మాలు | = | ( హి. మహల్) భవనము |
| అత్తమాలు | = | అత్త ఉండే ఇల్లు లేదా గది |
| సెల్విలిచ్చు | = | అనుమతించు, ఆజ్ఞ ఇచ్చు |
| గద్దెచెప్పు | = | సోది చెప్పు, భవిష్యత్తును చెప్పు |
| పొయ్యేకి | = | పోవడానికి |
| కులవరితి | = | కులవృత్తి |
| పడుసాల | = | పడకటిల్లు |
| లేపుదిండ్లు | = | పరుపులు, లేపులు అనే పదానికి కూడా పరుపులు అనే అర్థం. |
| గరుసడు | = | గరిసెడు - ధాన్యపు కొలత |
| గాసగాళ్ళు | = | జీతగాళ్ళు - గ్రాసము తీసుకునేవారు |
| ఎలమారు | = | వెలమవారు |
| రచ్చాకట్ట | = | రచ్చకట్టు అనగా కచ్చేరి చేసే స్థలం |
| ఇసర్రాతిలో | = | తిరుగలిలో |
| యాకముచేసి | = | ఏకముచేసి, ఒకటిచేసి |
| ఉట్లుల్లో నూనె | = | ఉట్టిమీది నూనె |
| మెట్లేసి | = | నిచ్చెనవేసి |
| సిరిగిన్నె | = | చిన్నగిన్నె |
| జాలాటిబండ | = | స్నానము చేసే చోట అనువుగా వేసిన బండ |
| సిక్కంటి | = | (<చిక్కంటి < చిక్కు + అంటు) దువ్వెన |



BRAOU

| | | |
|---|---|---|
| కండికలు | = | చారలు |
| పెయినిండా | = | ఒంటినిండా |
| పగిరి సిక్కంటి | = | బంగారు దువ్వెన |
| ఎంటికెంటికి | = | వెంట్రుక వెంట్రుకకు |
| తాపె | = | పొదివె, పొదిగెను |
| ముడిసానె | = | ముడిచెను |
| ఏసానె | = | వేసెను |
| గద్దిబుట్ట | = | సోదిబుట్ట |
| కడప మాను | = | గుమ్మం |
| అద్దమాని అడివి | = | నట్టనడి అడవి |
| సూడొచ్చు | = | చూడవచ్చె |
| ఊరుదాపల | = | ఊరికి దగ్గరగా |
| ఆడి ఏస్కం | = | ఆడువేషం |
| వచ్చిల్లేదు | = | వచ్చేది లేదు |
| సరాసరా | = | త్వరత్వరగా |
| నడిదావ | = | నడిత్రోవ |
| ఒంటికిపోవు | = | ఒకటికిపోవు, లఘుశంక తీర్చుకొనపోవు |
| ప్రార్తన | = | ప్రార్థన |
| క్యాల్లు | = | కోడలు |
| పోతనాసీ | = | పోతానని |
| దాసా | = | దాచెను |
| సేతి బాసలు | = | చేతిలో చేయి వేయించుకొని చేసే బాసలు, వాగ్దానాలు |
| కొట్లాడు | = | పోట్లాడు |
| తండ్లాడి | = | తన్నుకొని |
| స్యాటలంత | = | చేటంత |
| మొగులు | = | మబ్బు |
| పీనుగులు | = | శవాలు |

### 6.3.2 వ్యాఖ్యానం

ఈ గేయంలో కవిత్వ స్ఫూర్తి కొంతలో కొంత కనిపిస్తుంది. పాదం విరిగిన చోట కచ్చితంగా యతిని పాటించడం లేకపోయినా చాలా వరకు అదే అక్షరం ఆవర్తింపబడడం కనిపిస్తుంది.

చెప్పే విషయాన్ని కుదించి చెప్పడం కాకుండా, వర్ణనాత్మకంగా విపులీకరించి చెప్పడం ఇక్కడ కనిపిస్తుంది. ఎరుకల నాంచారి గద్దె చెప్పకోవడానికి ముందు ఆమె చేసిన సన్నాహమంతా ఇటువంటిదే.

ఈ గేయం సంభాషణాత్మకంగా ఉండి, నాటకీయ లక్షణాన్ని ప్రదర్శిస్తూ ఉంది. నాంచారికీ ఆమె బంధు వర్గానికి మధ్య జరిగిన సంభాషణ అటువంటిదే.

ఇందులో కథా గాయకుడు మన కళ్ళ ముందు రేఖా చిత్రాలను రూపు కట్టించే ప్రయత్నం చేశాడు. వాక్చాతుర్యంవల్ల అటువంటి చిత్రరచన సాధ్యం అవుతున్నది. కట్టుచెంగు చెట్టుకు కట్టడం. ఆకాశం మేఘావృతమై, చీకట్లు చిమ్మి, వానకురిసి ఎరుకుల గుడిసెలు వరద గలిసిపోవడం అటువంటి చిత్రాలే.

ఈ గేయ కవికి వర్ణనాపటిమ ఉంది. నాంచారు అలంకరించుకోవడం, నాంచారికి అపశకునాలు పొడసూపడం - వంటి చోట్ల వర్ణన చాలా విపులంగా కనిపిస్తున్నది.

మొత్తానికి ఈ గేయంలో కథా కథనానికే ఎక్కువ ప్రాముఖ్యం ఉన్నా ఆ కథనం కవితాత్మకంగా చెప్పబడింది.

ఇక్కడ ప్రధానంగా వర్ణించబడిన పాత్ర ఎరుకల నాంచారు.

ఆవిడను ఆత్మాభిమానం కలదానిగా కవి తీర్చిదిద్దాడు. సంఘ న్యాయానికీ పురుషాహంకారానికి ఆవిడ బలియై పోవడంవల్ల పఠితల హృదయంలో ఆవిడ కరుణాత్మకమైన పాత్రగా నిలిచిపోతుంది.

ఆవిడకు జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా గంగమ్మ కోపించి ఎరుకల పల్లెను వరద గలిపింది. ఈ చర్యవల్ల శ్రోతలు కూడా జరిగిన అన్యాయానికి మంచి శాస్తి జరిగిందనే హృదయ తృప్తిని పొందగలుగుతున్నారు.

జానపద కవి ఈ కథను చక్కగా ప్రారంభంచేసి ఉత్కంఠను ప్రేరేపించే విధంగా కథను నడిపి కరుణాత్మకమైన ముగింపును ఇవ్వడమేకాక జరిగిన అన్యాయానికి ప్రతీకార పరిష్కారాన్ని కూడా అందించాడు.

### 6.3.3 విశేషాంశాలు

ఈ భాగం ఎరుకల నాంచారి గాథలో పురుషునికి స్త్రీ శీలం మీద అపనమ్మకమూ, అతనికి ఆమెపై కల సాంఘిక న్యాయమిచ్చిన అధికారమూ కలగలిసి ఈ కథను విషాదాంతంగా తీర్చిదిద్దుతున్నాయి. ఈ రకంగా ప్రాణాలను బలిపెట్టిన స్త్రీలు పేరంటాండ్రై జానపదుల నుండి పూజలందుకుంటారు. "సతీకల్లు" లుగా వెలసి "వీరకల్లు" ల వలె జనంచేత గౌరవింపబడతారు.

ఈ కథలో ఎరుకల సానికకల ఆత్మ ప్రత్యయం చిత్రింపబడ్డది. ఆమె భయమెరుగని ఇల్లాలు. కుల వృత్తిపై గౌరవం కల వనిత, సంప్రదాయాన్ని దాటడానికి ఇచ్ఛగించని స్త్రీ. ఆపద సమయంలో ఉపాయంతో ఆపదను గడవ పెట్టగల చతుర. ఇన్ని మంచి గుణాలున్నా, అవి ఏవీ ఆమెను ఆమె భర్త బారి నుండి రక్షింపలేక పోయాయి. అందుకు కారణం ఆమె అసమర్థతాగాక, ఆమె భర్త వైపున ఉన్న సంఘ బలం. జానపద గాయకులు ఈ కథను మిక్కిలి కరుణాత్మకంగా, వినేవారి కళ్ళల్లో నీళ్ళు చిమ్మేటట్లుగా గానం చేస్తారు.

### అభ్యాసం – 1

ఎరుకనాంచారి కథలోని జానపద కథాగేయ లక్షణాలు వివరించండి ?

### అభ్యాసం – 2

ఎరుకనాంచారి ఎటువంటిది ?

BRAOU

**అభ్యాసం – 3**

"ఎరుకనాంచారి కథ" లోని ఇతివృత్తాన్ని చిత్రించండి ?

## 6.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- మౌఖిక సంప్రదాయంలోని ఒక కథాగేయం "ఎరుకనాంచారికథ"
- ఈ గేయం జానపద కథాగేయం.
- ఈ పాట జానపద స్త్రీల శీలసౌభాగ్యాన్నీ, పాతివ్రత్య నియమాన్నీ చాటి చెప్తున్నది.
- ఈ జానపద కథాగేయం జానపదస్త్రీలకు కులవృత్తి మీద ఉన్న గౌరవాన్నీ, వారి పౌరుషగుణాన్నీ, ఆత్మాభిమానం కాపాడుకునే తెంపరితనాన్నీ ప్రదర్శిస్తున్నది.
- జానపదుల సజీవభాషనూ, భావసంపదనూ, పలుకుబడినీ, కథాగేయస్వరూపాన్నీ కూడా ఈ గేయం ప్రదర్శిస్తున్నది.

## 6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఎరుకనాంచారి పాత్రను చిత్రించండి ?
2. ఎరుకనాంచారి అలంకరించుకున్న విధానం తెలపండి ?

II. ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఎరుకనాంచారికి ఎదురైన అపశకునాలను వివరించండి ?
2. కులవృత్తి పట్ల ఎరుకలనాంచారికున్న భావాలను తెలపండి ?

## 6.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఎరుక చెప్పడానికి ఉపయోగపడే వస్తువుల పట్టిక తయారు చెయ్యండి.
2. ఇది కథాగేయం కావడానికి గలకారణాలను ఒక వరుసలో రాయండి.
3. ఇంతకుముందు చదివిన గేయాలకూ దీనికీ ఉన్న భేదసాదృశ్యాలను గమనించండి.

BRAOU

## అభ్యాసాలకు జవాబులు

1. కథను ప్రారంభం నుండీ మొదలుపెట్టి సవివరంగా అన్ని సంఘటనలనూ వర్ణిస్తూ, ఉత్కంఠను ప్రేరేపించే విధంగా చెప్పుకుంటూ పోవడం జానపద కథాగేయం ముఖ్య లక్షణం. చెప్పే విషయాన్ని అతి విపులంగా విస్తరించి చెప్పడం రెండో లక్షణం. ప్రస్తు కథాగేయం "ఎరుకనాంచారి కథ" లోని కథాకథనంలో ఈ రెండు లక్షణాలతోపాటు - గేయరచనా పద్ధతి నాటకీయంగా, సంభాషణాత్మకంగా కూడా ఉన్నది. ఇది కథాగేయం మరొక లక్షణం. నాంచారికీ, ఆమె బంధువర్గానికీ; నాంచారికీ ఆమెభర్తకూ ఈ గేయంలో జరిగిన సంభాషణలు అందుకు ఉదాహరణాలు. ప్రకృతిని రమణీయంగా వర్ణించడం, పాత్రలను కళ్లకు కట్టినట్టు వివరించడంకూడా కథాగేయ లక్షణాలే. కథాగేయంలోని కథావస్తువు చారిత్రకమో, జానపదమో, ఆచారవ్యవహారాలకు సంబందించిందో అయి ఉండడం కథాగేయం మౌలికలక్షణం. ఈ జానపద గేయం "ఎరుకనాంచారికథ" పై మూడింటిలో చివరి అంశానికి సంబంధించిన గేయం.

2. ఎరుకనాంచారి భయమెరుగని ఇల్లాలు. కుల వృత్తి చేయాలనే దీక్ష కలిగిన స్త్రీ. సంప్రదాయ బద్ధమైన జీవితాన్ని గడపడంలో ఇచ్ఛకలది. కొండంత ఆపదను గుండె ధైర్యంతోనేకాక, సమయోచితమైన చాతుర్యంతో ఎదుర్కోగలిగిన ప్రజ్ఞావంతురాలు. తన సంతానం మీద మమకారాన్ని పెంచుకున్న తల్లి. పురుష ప్రధాన సంఘ నియమాలవల్ల జీవితాన్ని బలిపెట్టుకున్న స్త్రీ.

3. జానపదుల ఆచారవ్యవహారాలు, స్త్రీ శీలసంరక్షణం ప్రధానంగా సాగిన జానపద కథాగేయం "ఎరుకనాంచారికథ". ఈ కథలోని ప్రధానపాత్ర ఎరుకనాంచారి. ఈమె అభిమానవతి పతివ్రత. కులవృత్తి మీద అచంచల విశ్వాసం ఉన్న సదాచార పరాయణురాలు. అందుకే అత్త, ఆడపడుచులు, మొదలైన బంధువర్గం అభ్యంతరం తెలిపినా లక్ష్యపెట్టకుండా సోదిచెప్పడానికి వెళుతుంది. అడవిలో పంటపొలాలు చూసుకోవడానికి వచ్చిన రెడ్డికొడుకు ఎరుకలమ్మని అడ్డుకొని తనకోరిక తీర్చమంటాడు. అతన్ని తిరస్కరించి ఊరిలో ప్రవేశించి సాగిపోతూంటుంది నాంచారి. ఇంతలో రెడ్డికొడుకు వేరే మరొక దారిన వచ్చి, తన ఇంటిలో ప్రవేశించి, ఆడవేషం ధరించి, సోదె చెప్పడానికి రమ్మని ఎరుకలమ్మని పిలుచుకొని రావడానికి పిల్లలను పంపిస్తాడు. సోదె చెప్పడానికి వచ్చిన నాంచారి, పరదాచాటున కూర్చున్న రెడ్డి కొడుకు చెయ్యిపట్టుకొని చూసి, ఇది మగవాని చెయ్యికాని ఆడచెయ్యికాదని గ్రహించి ఎరుక చెప్పనని తిరిగిపోతుంది.

మళ్లీ తిరిగి అడవిలో అడ్డుతగిలి రెడ్డికొడుకు [illegible] వేధిస్తాడు. అప్పుడామె ఒక ఉపాయం పన్ని, "ఈ అడవిలో కొంచెందూరంగా ఒంటికి పోయివస్తాను. ఇక్కడేమీ చాటులేకుండా ఉన్నది. కనుక నన్ను, పోనీ, తిరిగి వస్తానో లేదోనని నా మీద అపనమ్మకం ఉంటే, ఇదిగో నా చీరచెంగు గట్టిగా పట్టుకో" అని చెప్పి కొంగు అతనికిచ్చి తప్పుకొని పోయి, ఒక చెట్టు మానికి రెండో చివర కట్టివేసి తన ఇంటికి క్షేమంగా వెళ్లిపోతుంది. శీలసంరక్షణమే అతి ప్రధానంగా భావించిన నాంచారి రెడ్డికొడుకు బారినుండి ఇలా తప్పించుకు పోవడాన్ని అత్యంత రమ్యంగా వర్ణిస్తున్నది ఈ కథాగేయం.

BRAOU

– ఆచార్య నాయని కృష్ణకుమారి

# భాగం 7 మార్మిక గేయం

## విషయక్రమం

7.0 ఉద్దేశం
7.1 ప్రవేశిక
7.2 సూచనలు
7.3 మార్మిక గేయం అంటే
7.4 పాఠ్యం
  7.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  7.4.2 వ్యాఖ్యానం
  7.4.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
7.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
7.7 ఆకళింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు

## 7.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- కులతత్వం, మతత్వం వల్ల మానవతకు జరుగుతున్న కీడు.
- జననమరణాల్లో, జీవన పరిణామదశల్లో మనుషులంతా ఒక్కటే.
- పారమార్థిక గేయాల్లోని జానపదుల కవితా రీతి.
- మార్మిక గేయం.

BRAOU

## 7.1 ప్రవేశిక

ఈ ఏడవ భాగంలో జానపద కవిత్వం (మౌఖిక సంప్రదాయం) అనే ఈ ఖండం ముగుస్తున్నది. ఇంతవరకూ ఈ ఖండంలో మీరు నాలుగు శ్రామిక గేయాలనూ, రెండు కథాగేయాలనూ అధ్యయనం చేశారు. ఈ భాగం, 'మార్మిక గేయం'. జానపద గేయ సాహిత్యంలో కథా రహిత గేయశాఖకు చెందిన గేయాలలో పారమార్థిక గేయ విభాగం ప్రముకమైంది. 1. తాత్విక గేయాలు 2. మార్మిక గేయాలు 3. భక్తిగేయాలు అనేవి ఆ మూడు తరగతులు. ఈ విషయంలో విద్యార్థులకు అవగాహన స్పష్టత కలగడం కోసం మొదటి పాఠం 'ఏనాది పాట' లోనే జానపద సాహిత్యంలోని వివిధ శాఖల విభాగ వివరణ పట్టికను ఇవ్వడం జరిగింది. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ముఖ్య శిష్యుడు దూదేకుల సిద్దయ్య రాసిన ఈ మార్మిక గేయం – పారమార్థిక గేయ విభాగంలో రెండవది.

## 7.2 సూచనలు

ఈ భాగం చదివే ముందు మొదటి భాగం 'ఏనాదిపాట' లో ఇచ్చిన "జానపదగేయ సాహిత్యంలో వివిధ శాఖలు" అనే పట్టిక మరొక్కసారి జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ విభాగంలో ఇచ్చిన జానపద కవితలన్నీ మరొక్కసారి చదవండి. ఇతర సంకలనాలు కూడా చూడాలి. మరీ ముఖ్యంగా ఆశువుగా కవితలల్లే జానపద కవుల కథాగానాన్ని వినాలి. రచనా లక్షణాలను పరిశీలించండి. ఇతర కవితా మార్గాలతో పోల్చి విలువకట్టాలి. జానపద కవిత్వ పద్ధతిలోని

సహజ కవితా రీతినీ, లయబద్ధమైన పదాల కూర్పునూ పరిశీలిస్తూ ఈ పాఠంలోని 7.5 లో ఇచ్చిన 'మార్మిక గేయం' అనే పాఠ్యాన్ని అధ్యయనం చెయ్యాలి. ఈ పాఠాన్ని చదవడంలో 7.4.1, 7.4.2, 7.4.3 లలో ఇచ్చిన వివరాలను సహాయకంగా తీసుకోవాలి.

## 7.3 మార్మిక గేయం అంటే

జానపద గేయాల్లో కథాసహితాలు, కథారహితాలు అని రెండు ప్రధాన విభాగాలున్నాయని ఇంతవరకే తెలుసుకున్నారు. కథావస్తువున్న గేయకవితలోని వస్తువు స్వభావం (దాని లక్షణం) మూర్తం (Subjective). మనుషులకో, జంతువులకో, జాతులకో ఏదో ఒక రకమైన ప్రాణికోటికీ, వారు చేసే పనులకూ, సంఘటనలకూ సంబంధించిన కథ. కథారహిత గేయాల్లోని తాత్త్విక, మార్మిక, భక్తి గేయాల్లోని (పారమార్థిక గేయశాఖకు చెందిన) వస్తువు ఒక తత్త్వాన్నో, ఉపదేశాన్నో, సిద్ధాంతాన్నో, సాధనామార్గాన్నో మాత్రమే ఆశ్రయిస్తుంది. కనుక, ఈ కథారహిత వస్తులక్షణం అమూర్తం (Abstract). అమూర్తవస్తువు అనభిజ్ఞతను (obscurity) పెంచుతుంది. పారమార్థిక గేయాల ప్రథమ లక్షణం ప్రతీకాత్మకత (Symbolism). ప్రతీకాత్మకతతో పాటు పారమార్థిక గేయాల్లోని తాత్త్విక గేయశాఖలో అనభిజ్ఞతకూడా ఉంటుంది. ఈ అనభిజ్ఞత మరీ ఎక్కువగా పెరిగిపోయినప్పుడు తాత్త్విక గేయమే 'మార్మిక గేయం'గా పరిణమిస్తుంది. అలాంటి వాటిలో ఒక గేయమే దూదేకుల సిద్దయ్య కులతత్త్వానికీ, మత మౌఢ్యానికి నిరసనగా చెప్పిన ఈ భాగంలోని మార్మిక గేయం (Mystic song).

## 7.4 పాఠ్యం

ఏ కులమనినను వివరంబడిగితే యేమని దెల్పుదులోకులకు
పలగాకులకూ దుర్మార్గులకూ యీ దుష్టులకూ । ఏ ।

హాలిభాగమున యీాలలు బాడుచు
భావముగన్నది నా కులము । ఏ ।

ముట్టున బుట్టినదీకులము ముట్టున బెరిగినదీకులము
ముట్టులోహరుడు ముట్టులో శివుడు ముట్టులో బ్రహ్మ
ముగ్గురు మూర్తులకు మూలము దెలిపిందీకులము । ఏ ।

అంగమేమూర్తా అనే బ్రహ్మలింగము ముందుబెట్టి
ప్రపంచమందు బూజలు నడిపిందీకులము । ఏ ।

అంగములోనే మేకనుబట్టి లింగముతోనే గొంతులుకోసి
శాస్త్రమనే పాళ్ళువేసి చతుర్ బ్రహ్మలకు పంచిపెట్టింది నాకులము । ఏ ।

యింటిలోపలను విల్లుగట్టుకొని
మంటలోపల రాట్నం బెట్టుక
కంటిలోపల కదురుబెట్టుకొని
ముక్కు లోపల యేకుబెట్టుకొని
చెవులోబారా చేతికి తీసుగ
నారాయణయను వరముతీసుకొని
అష్టాక్షరియను తడిక వేసుకొని
పంచాక్షరియను పంచదీసుకొని
తకధిమి తకధిమి గుబదెలగుబదెల
ఏకిన కులమే నా కులము । ఏ ।

ఏకిన ఏరులు పీకినపింజెలు
లోకమంతనొక పాకముచేసుక
ఏకినకులమే నాకులము । ఏ ।

రొమ్ము నలక్ష్మి చీరకట్టుకొని
చక్కగా సిరిసావడ దొడగి
ఆనందమై వీరబ్రహ్మ ఏ శాల్వగప్పుకొని
నిండియున్నదే నాకులము
ఒంటరిగాదే నాకులము ॥ ఏ ॥

గుడుజంట తిరుగుచు నాకులము
అండపిండ బ్రహ్మాండమెల్లను నిండియున్నది నాకులము ॥ ఏ ॥

### 7.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు

పలుగాకులు = దుష్టులు - ఉచితానుచిత జ్ఞానంలేకుండా నోటికివచ్చినట్లు మాట్లాడేవారు.

పాలభాగమున యాలాలు.... నాకులమూ = మనుష్యుని నుదుట కనుబొమల రెండింటి మధ్య ప్రదేశం త్రివేణీ సంగమం వంటిదని ఆధ్యాత్మికులు నిర్ధారించారు. ఇడ, పింగళ, సుషుమ్న అనే నాడీత్రయం అక్కడ కలుసుకుంటుంది. మనిషి అంతర్ముఖుడై తన మనస్సునూ కనుదృష్టినీ అక్కడ కేంద్రీకరిస్తే ఆతనికి బాహ్యజ్ఞానం నశించి, అంతరజ్ఞానం విస్మృతిని పొందుతుంది. ఆత్మ పరమాత్మల సంయోజనానికి అది ఒక మార్గంగా తాత్త్వికులుచెప్పారు. "భావము కనుట" అంటే పరమాత్మను కనుక్కోవటం అని అర్థం.

ముట్టున బుట్టినదీ కులము = ముట్టు 'అంటు', స్త్రీ రజస్సు, శోణితం అని అర్థం. స్త్రీ శోణితమూ, పురుష శుక్లమూ సంయోగం చెందడం వలననే పిండోత్పత్తి జరిగి జననక్రియ పరిణమిస్తుంది. అట్లా పుట్టిన మనుష్యునికి కుల ప్రాధాన్యం తొలుతగా లేదు. ఏ కులమైనా తొలుత ఈ ముట్టునుండి పుట్టినదే.

మేకను బట్టి.... పొళ్ళువేసి = మేకనుబట్టి, చంపడమనేది బ్రాహ్మణకృత యాగ విధానాన్ని సూచిస్తుంది. సోమయాజి కాదలచుకున్నవాడు యాగక్రియలో నల్లమేకనుతెచ్చి, నవరంధ్రాలూ మూసి బలిక్రియను నడపాలనేది శాస్త్రం. విల్లుగట్టుకుని = దూదిని ఏకడానికి [illegible] దూలంనుండి గానీ కొక్కెంనుండి గానీ తాడును వ్రేలాడదీసి దానికి దూదిని ఏకే సాధనాన్ని (విల్లు) [illegible]స్తారు.

ఇంటిలోపల.... ఏకిన కులమే నా [illegible] పాదాలలో దూదిని ఏకడం, కదురు మొన తిప్పి దారం తీయడం, నేత నేయడంవంటి చర్యలు [illegible]త్మ తత్త్వ ప్రతిపాదనకు ప్రతీకలుగా వాడబడ్డాయి.

కదురు = రాట్నం ఉప[illegible] దారాన్ని తీసేటప్పుడు, ఆ దారం చుట్టుకునే యినపపుల్ల.
ఏకు = పెద్దదైన దూది[illegible] దూదిని ఏకులుగా చేసి, ఏకుల నుండి దారం తీస్తారు.
బారా = నూలు వడికేటపుడు కదురునుండి చేతిపొడుగునా ఒకసారి తీసిన దారం.
వరము = దూది ఏకే పనిముట్టుకున్న తీగె.

తడిక = నేతకుపయోగించే సాధనాలలో ఒకటి. మరాసు మీద పడుగు తోడేటప్పుడు డబ్బాలకు ఉన్న నూలు ఒగ్గుల పట్టి వరకూ, సొపుగా పోవడానికి నిలువుగుంజలమీద అడ్డంగా బిగించిన కొయ్యలు.

ఏరులు = ఆరుబయట చాపిన నేతలో నిలువుకు వాడే నూలు దారాలు.
పేకిన పింజెలు = ఏకేటప్పుడు విచ్చుకుని అవతలకు చెదిరిన దూది.

### 7.4.2 వ్యాఖ్యానం

మనుష్యావతారానికి చెందిన ఆదిమదశలో సృష్టి ఉద్భవాన్ని గురించి, దాని స్వభావ స్వరూపాలను గురించి తొలిమానవుడు ఎన్నో ఆలోచనలతో ఎంతో విచికిత్సకు లోనయ్యాడు. సృష్టిలో ఉండే తనకు తెలియని తత్వాన్ని తనకు తెలిసిన విధంగాను, తెలియని ఊహాత్మక వస్తువుల్ని కళ్ళముందు కదలాడుతున్న వాస్తవ విషయాల సహాయంతోను, అర్థం చేసుకునే ప్రయత్నాలను విరివిగా చేసేడు. అటువంటి ప్రయత్నాలవల్ల జనించిందే పారమార్థిక లేదా ఆధిభౌతికజ్ఞానం. తన వశంలోలేని ప్రకృతి వైపరీత్యాలను ఆదిమానవశక్తికి అంటగట్టడం, తనకు భయాన్ని కలిగించే రుజామరణాలను దుష్టశక్తుల ప్రతిచర్యలుగా భావించడం తనకు స్పష్టంగా



BRAOU

వ్యక్తంకాని జననక్రియను ఆదిమానవశక్తి అనుగ్రహంగా భావించడం జరిగింది. తనకు చెరుపుచేసే శక్తుల్ని లొంగదీసుకోవడం తాంత్రిక చర్యగాను, తనకు మేలు చేసే శక్తులపట్ల కృతజ్ఞత చూపడం పూజాకలాపంగాను ప్రతిష్ఠాపింపబడింది. ఆ విధంగా దెయ్యము, దేవుడు రెండూ మానవ మహాప్రస్థానంలో ఉద్భవించి ఊపిరి పోసుకున్నాయి. ఇవే మనుష్యుడు సృష్టించుకున్న మతంలో ప్రధానాంగాలుగా మారాయి. ఈ రెండు శక్తుల చుట్టు మతం అనేది చిక్కగా అల్లుకుపోయింది.

మతాన్ని ఆధారంగా తీసుకుని మనుష్యుడు తన మెదడుకు పదును పెట్టుకోసాగాడు. తనకు ఆదిమానవ శక్తికి మధ్య గల సంబంధ బాంధవ్యాలను విశ్లేషింప పూనుకున్నాడు. మనిషి బ్రతికి ఉన్నపుడు అతనిలో ఉన్న పదార్థమేదో అతను చనిపోయిన తరువాత అతని నుండి బయటికి పోతున్నట్లుగా ఊహించుకున్నాడు. ఆ పదార్థానికి ఆత్మ అని పేరు పెట్టుకున్నాడు. కళ్ళ ఎదుట కనిపించే ప్రకృతి నిండా వ్యాపించి ఉన్న మహా పదార్థాన్ని పరమాత్మ అని పిలిచాడు. ఇవి సృష్టికంతటికి వెలిగా నిలిచి తిరిగి సృష్టి అంతట అంతర్యాప్తంగా వెలుగుతూ ఉండేటట్లుగా భావించాడు. ఈ ఆత్మ పరమాత్మల సంయోగమే "యోగము" అని నిర్ణయించాడు. అదే తత్త్వం. తత్త్వం అన్న పదానికి ముక్కకీముక్కగా విడదీసి అర్థం చెప్పుకుంటే, "అదే నీవు" అని తెలుస్తుంది. అని అంటే బ్రహ్మ పదార్థమైన పరమాత్మ అనీ, నీవు అంటే ఆత్మ అనీ అతడు నిర్ణయించుకున్నాడు.

మన దేశంలో ఈ తత్త్వాన్ని ఆశ్రయించిన గేయాలు ఏ భాషకు చెందిన జానపద సాహిత్యంలోనైనా కొల్లలుగా దొరుకుతాయి.

చెప్పదలచుకున్నది అమూర్త విషయం కావడం వలన, ఈ తత్త్వాలలో ప్రతీకాత్మకత (Symbolism) దానితో పాటు అనభిజ్ఞత (obscurity) చోటు చేసుకున్నాయి. అనభిజ్ఞత అనేది మరీ ఎక్కువగా పేరుకుపోయి నప్పుడు, తాత్త్వికగేయమే మార్మిక గేయంగా (Mystic song) మారుతుంది.

ఈ పాఠ్యాంశంలో తాత్త్వికతతో పాటు సుంత మార్మిక లక్షణం కూడా కనిపిస్తుంది.

జన వాక్యాన్ని బట్టి కాలజ్ఞాన తత్త్వాలకు కర్త పోతులూరి వీరబ్రహ్మం అనే యోగి. భూత భవిష్యద్వర్తమాన కాలాలకు సంబంధించిన సమాజ వ్యాప్తి, ఆత్మ పరమాత్మల సంయోగ వృత్తాంతం ఉండడం చేత బ్రహ్మంగారి వాక్య సముదాయానికి కాలజ్ఞాన మనే పేరు వచ్చింది.

బ్రహ్మంగారి జన్మస్థలం రాయలసీమలోని కందిమల్లయ్యపల్లె. అక్కడ ఆయన సమాధి ఉంది. ఆయన శిష్యులలో ముఖ్యుడు దూదేకుల సిద్దయ్య, ఇక్కడ కులప్రసక్తి ఉండడానికి కారణం ఉంది. దూదేకులవారు మహమ్మదీయులు. మహమ్మదీయులకు హిందూ మత విశ్వాసాలేమిటని తోటివారు పరిహసించగా, "కులమేమిటి దాని పుట్టుక ఏమిటి" అంటూ సిద్దయ్య ఈ తత్త్వం చెప్పాడని లోకవాక్యం. బ్రహ్మంగారి వాక్కులతో పాటు, ఆయన శిష్యుల ప్రవచనాలు కూడా ఈ కాలజ్ఞాన తత్త్వాలలో కలగలిసి పోయాయి. కవిత్వం నిగూఢంగానూ, ప్రతీకాత్మకతతోనూ ఉండవచ్చు.

### 7.4.3 విశేషాంశాలు

- ఈ పాఠ్యంలో భాష సరళంగాలేదు. నాగరకులు అపప్రయోగాలు అనుకునే ప్రయోగ విశేషాలు ఎన్నో ఇందులో ఉన్నాయి. విషయం పారమార్థికం కనుకా, అందులోనూ మార్మికతతో కూడినది కనుకా, ఇందులో కవిత్వ ప్రకాస్తికి అవకాశం తక్కువ. అప్పటికీ, రూపకాలంకారాన్ని రచయిత చక్కగా ఇందులో వాడుకున్నాడు.

## అభ్యాసం – 1

మార్మిక గేయం అంటే ఏమిటో తెలపండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________



BRAOU

## అభ్యాసం – 2

సిద్దయ్య మార్మిక గేయంలోని పారమార్థిక జ్ఞానం ఏమిటి ?

## 7.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం.

- మౌఖిక సంప్రదాయంలోని జానపద గేయ కవిత్వ శాఖకు చెందిన పారమార్థిక పద్ధతిలోని ఒక గేయం ఈ 'మార్మిక గేయం'.
- ఈ మార్మిక గేయం (Mystic song) రాసింది పోతులూరి వీరబ్రహ్మంగారి ముఖ్య శిష్యుడు దూదేకుల సిద్దయ్య.
- తాత్త్విక గేయంలోని ప్రతీకాత్మకత (Symbolism) లోని అనభిజ్ఞత (Obscurity) పెరిగి ఎక్కువైతే – తాత్త్విక గేయమే మార్మిక గేయంగా పరిణమిస్తుంది.
- ఈ మార్మిక గేయం కులతత్త్వం, మతమౌఢ్యం అనే సామాజిక దురాచారాలపై, అవివేక సంప్రదాయాలపై తిరుగుబాటు చేస్తున్నది.
- జనన మరణాల్లో, విభిన్న జీవన పరిణామ దశల్లో, భౌతిక – మానసిక – ఆధ్యాత్మిక శక్తి సంపదల్లో మానవులందరూ ఒక్కటేనని, తారతమ భేదం సృష్టిలో లేదనీ ప్రతిపాదిస్తున్నది ఈ గేయం.
- కులతత్త్వానికి అతీతంగా ఎదిగి, మానవుడు మతసాధనతో కేవలం తపోధ్యాన యోగ సమాధుల అభ్యాసం వల్ల పరమాత్మను తెలుసుకోవడానికే ప్రయత్నించాలిగాని, అస్పృశ్యతన్నూ, అసహనాన్నీ నిరాదరణనూ మానవతకు పులిమి, సంఘవిద్రోహి కాకూడదని ఈ గేయం ప్రబోధిస్తున్నది.
- ఆత్మ తత్త్వాన్నీ, ఆది పరమాత్మను అందుకోవడానికి సాగించే యోగ ప్రయత్నాన్నీ వివరిస్తున్నది ఈ గేయం.
- 'కావ్యకళాపరిచయం' అనే ఈ పాఠ్యాంశంలోని మౌఖిక సంప్రదాయానికి చెందిన 'జానపద కవిత్వం' అనే మొదటి ఖండంలో ఈ భాగం చివరిది.
- దీని తర్వాత విద్యార్థులు ఈ పాఠ్యాంశంలోని 2వ ఖండం "ప్రాచీన కవిత్వం (లిఖిత సంప్రదాయం)" అధ్యయనం చేస్తారు.

## 7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. దూదేకుల పనికీ, తాత్త్వికతకూ ఈ గేయకవి చేసిన సమన్వయాన్ని వివరించండి ?
2. జానపద గేయ సాహిత్యంలో మార్మిక గేయానికున్న స్థానాన్ని చర్చించండి ?

BRAOU

ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. మార్మిక గేయంలోని ఇతివృత్తాన్ని చర్చించండి ?

## 7.7 ఆకళింపు ప్రశ్నలు

1. మార్మిక గేయాలలోని ప్రతీకల పట్టిక తయారు చేయండి.
2. ఇలాంటి మార్మిక గేయాలు మరికొన్ని సేకరించి పరిశీలించండి.
3. కథా రహిత గేయ శాఖలను పట్టిక ద్వారా గుర్తించి, వాటిలో ప్రతి శాఖకూ ఒక్కొక్కటిగా గేయాలను సేకరించి మీ కౌన్సిలర్ సహకారంతో అధ్యయనం చెయ్యండి.

### అభ్యాసాలకు జవాబులు

1. జానపద గేయసాహిత్యంలో కథలేని గేయశాఖకు చెందిన గేయాల్లో పారమార్థిక గేయాలు ఒక శాఖ. ఇవి – 1. తాత్త్వికగేయాలు 2. మార్మిక గేయాలు 3. భక్తి గేయాలు అని మూడు విధాలు. భక్తిని ప్రతిబింబించేవి భక్తి గేయాలు. ఆత్మ పరమాత్మల సంబంధాన్ని, ఆయా ప్రవర్తనలనూ ప్రతిబింబించేవి తాత్త్విక గేయాలు. పోతులూరి వీరబ్రహ్మంగారి కాలజ్ఞాన తత్త్వాలు ఈ శాఖకు చెందుతాయి. తాత్త్విక గేయాల్లో చెప్పదలచుకున్నది అమూర్త (obstract) విషయం కావడం వల్ల వాటిలో ప్రతీకాత్మకత (Symbolism) తో పాటు అనభిజ్ఞత కూడా చోటు చేసుకుంటుంది. అనభిజ్ఞత అంటే ఒక విషయం ఎలా పుట్టిందో దాని స్వరూప స్వభావాలేమిటో ఖచ్చితంగా చెప్పడానికీ, నిర్వచించడానికి వీలుకాని స్థితి. తాత్త్విక గేయాలలోని ఈ అనభిజ్ఞత మరీ ఎక్కువగా పెరిగిపోయినప్పుడు – తాత్త్విక గేయమే మార్మిక గేయంగా మారిపోతుంది. ఇలాంటి మార్మిక గేయాల్లోని ఒక గేయమే ఈ పాఠ్యంలోని సిద్దయ్య రచన.

2. శుక్ల శోణితాల సంయోగం వలన మనుష్యుడు జనిస్తున్నాడు. అంటే అంటు నుండే అతడు పుడుతున్నాడు. అంటుకు అప్పుడు లేని కులం, తరువాత ఎక్కడ నుండి వస్తుంది ? త్రిమూర్తులకు లేని కులం వారు సృష్టించిన మనుష్యజాతికెందుకు ? అనేది సిద్దయ్య అభిప్రాయం.

3. మనిషి భ్రూమధ్యంలో ఎడమ ప్రక్కన ఇడ, కుడి ప్రక్కన పింగళ, ఆ రెంటి మధ్యగా సుషుమ్న అనే మూడు నాడులుంటాయి. ఇది త్రివేణీ సంగమంలాంటిదని యోగులు చెపుతారు. మనిషి అంతర్ముఖుడై, ఉచ్ఛ్వాస నిశ్వాసలను క్రమబద్ధం చేయటం ద్వారా తన మనస్సునూ, దృష్టిశక్తినీ ఆ సంగమ స్థానంలో కేంద్రీకరిస్తే అతనికి బాహ్య జ్ఞానం నశించి, ఆంతర జ్ఞానం అంటే ఆత్మ స్వరూపానికి సంబంధించిన జ్ఞానం పెంపొందుతుందనీ, ఆత్మ పరమాత్మల సంయోగానికి అది ఒక సాధనమనీ, అలా చూడటమే అచ్ఛమైన పారమార్థిక జ్ఞానమనీ ఒక భావన. సిద్దయ్య ఈ మార్మిక గేయంలో చెప్పిన పారమార్థిక జ్ఞానం ఇదే.

"ఫాలభాగమున యాలలు బాడుచు భావముగన్నది నాకులము" అనే మాటల్లోని "భావము" అనే శబ్దానికి పైన వివరించిన జ్ఞానమనే అర్థం.

BRAOU

### చదవదగిన పుస్తకాలు


కృష్ణకుమారి, నాయని (1977) తెలుగు జానపద గేయ గాథలు, ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్తు.

గంగప్ప, ఎస్ (1976) తెలుగుదేశపు జానపద గీతాలు, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధ శాఖ.

దీక్షితులు, చింతా (1955) ప్రజావాఙ్మయం, విజయవాడ, విశాలాంధ్ర ప్రచురణాలయం.

నారాయణరావు, వెల్చేరు (1978) తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. విజయవాడ : విశాలాంధ్ర ప్రచురణాలయం.

| | |
|---|---|
| రామరాజు, బి. | (1978 రెండో ముద్రణ) తెలుగు జానపదగేయ సాహిత్యము. హైదరాబాదు, జానపద విజ్ఞాన ప్రచురణలు. |
| రామరాజు, బి. | (1960) త్రివేణి, హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ (ఇతరులతో కలిపి సంపాదకత్వం). |
| లింగారెడ్డి, గోపు | (1982) తెలంగాణా శ్రామిక గేయాలు. కరీంనగర్, సుషమా పబ్లికేషన్స్. |
| సుందరం, ఆర్వీయస్ | (1976) జానపద సాహిత్య స్వరూపం, బెంగుళూరు, జానపద విజ్ఞాన సమితి. |
| సుబ్బారావు, టి.వి. | (1975) జానపద సాహిత్యము : వీరగాథలు, హైదరాబాదు; ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి. |


– ఆచార్య నాయని కృష్ణకుమారి

BRAOU

# ఖండం 2 ప్రాచీన కవిత్వం (లిఖిత సంప్రదాయం)

ఈ ఖండంలో విద్యార్థులు లిఖిత సంప్రదాయానికి చెందిన పదకొండు భాగాలను అధ్యయనం చేస్తారు. అవి 1. మడివాలు మాచయ్య 2. మూషిక మార్జాల సంవాదం 3. ఆంధ్రదేశ వర్ణన 4. కుచేలోపాఖ్యానం 5. శివధనుర్భంగము 6. మనుచరిత్ర 7. యయాతిచరిత్ర 8. కాళహస్తీశ్వర శతకము 9. వేమన శతకము 10. భాస్కర శతకము 11. అన్నమాచార్య సంకీర్తన. ఈ భాగాలు చదవడం ద్వారా మీరు ప్రాచీన కవిత్వంలోని వివిధ శాఖలనూ, ప్రక్రియలనూ అవగతం చేసుకోగలుగుతారు.

## భాగం 1 మడివాలు మాచయ్య

విషయక్రమం


1.0 ఉద్దేశం
1.1 ప్రవేశిక
1.2 సూచనలు
1.3 ప్రాచీనకవిత్వం అంటే
అభ్యాసం – 1
1.4 పాఠ్యం
1.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు
1.4.2 వ్యాఖ్యానం
1.4.3 విశేషాంశాలు
అభ్యాసం – 2
అభ్యాసం – 3
1.5 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
1.7 ఆకలింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు


BRAOU

### 1.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- 12వ శతాబ్దంలో ఆంధ్ర దేశంలో ప్రచలితంగా ఉన్న వీరశైవమత ప్రాధాన్యం – వీరశైవుల స్వభావం
- దేశికవితకు చెందిన ద్విపద లక్షణాలు
- దేశి కవిత్వ సాధారణ లక్షణాలు

### 1.1 ప్రవేశిక

ఇంతవరకూ మీరు మౌఖిక సంప్రదాయానికి సంబంధించిన ఏడు భాగాలను అధ్యయనం చేశారు. ఈ ఖండంలో వరుసగా ప్రాచీన కవిత్వ ప్రక్రియలను తెలుసుకుంటారు. వీరశైవమత ప్రాధాన్యాన్ని నిరూపించే దేశికవితా విభాగానికి చెందిన ద్విపదలో ఉన్న పాఠ్యం "మడివాలు మాచయ్య". ఈ భాగంలో మీరు అధ్యయనం చేస్తారు.

## 1.2 సూచనలు

లిఖిత సంప్రదాయానికి చెందిన ఈ ప్రాచీన కవిత్వ విభాగాన్ని అధ్యయనం చేసే ముందు తెలుగు భాష పద స్వరూపాన్నీ, సంధి స్వరూపాన్నీ, సమాస స్వరూపాన్నీ, అలంకార స్వరూపాన్నీ, ఛందస్సులోని వైవిధ్యాన్నీ తెలుసుకోవాలి. 1.4.1, 1.4.2, 1.4.3 లలో ఇచ్చిన వివరాల ఆసరాతో 1.4లో ఇచ్చిన పాఠ్యాన్ని చదువుకోవాలి. కేవలం ప్రస్తుత పాఠ్యం మాత్రమే కాక, లిఖిత సంప్రదాయం సమగ్రావగాహన కోసం ప్రాచీన కవిత్వంలోని విభిన్న కావ్యాలనూ వీలైనంత వరకూ పఠించండి.

## 1.3 ప్రాచీన కవిత్వం అంటే

తెలుగులో లిఖిత సాహిత్యం క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి శాసనాల్లో దొరుకుతున్నది. గుణగ విజయాదిత్యుని సేనానాయకుడైన పండరంగడు ధర్మపురంలో కొంత భూమిని ఆదిత్య భట్టారకుడు అనే ఆయనకు దానమిస్తూ వేయించిన అద్దంకి శిలా శాసనం (క్రీ.శ. 849-50) లో తరువోజ పద్యం దొరుకుతున్నది. (ద్విపదను రెట్టిస్తే తరువోజ అవుతుంది). ఈ శాసనంలో పద్యం, వచనం కలిసి ఉంది. సుమారు అదే కాలంనాటి కందుకూరు శాసనంలో పూర్తిగా దొరక్కపోయినా - సీసపద్యం ఉన్నట్టు తెలుస్తున్నది. యుద్ధమల్లుని బెజవాడ శాసనం (క్రీ.శ. 950) లో 'మధ్యాక్కర' పద్యం ఉంది. రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం, మళ్లీ రెండు ఇంద్రగణాలు ఒక సూర్యగుణం ఉన్న నాలుగు పాదాల పద్యం మధ్యాక్కర. 5వ గణం మొదటి అక్షరం యతిస్థానం. ఆ తరువాత మనకు దొరుకుతున్నది నన్నయ భారత రచన. (11వ శతాబ్దం)

నన్నయకు పూర్వరచనల్లో కనిపిస్తున్న శాసనపద్యాల్లో తరువోజ, మధ్యాక్కర, సీసంవంటి తెలుగు పద్యాలే ఉండటం విశేషం. నన్నయ భారతంలో కనిపించే వృత్తాల సంప్రదాయానికి నన్నయకు పూర్వపు ఆధారాలు దొరకలేదు.

నన్నయ భారతంలో కనిపించే గద్య పద్యాత్మక చంపూరచనా పద్ధతి, సంస్కృత సమాసభూయిష్ఠ భాషాశైలి, మధ్యాక్కరలో యతివేసిన పద్ధతి, సీస పద్యంలో వాడిన ప్రాస విశేషాలు- ఇవి శాసనాల్లోనూ కనిపిస్తుండటం వల్ల నన్నయ అవలంబించిన లిఖిత సాహిత్య పద్ధతి అప్పటికి చాలా కాలంనుంచే నలుగుడు పడి ఉంటుందని భాషా సాహిత్య పరిణామ దృష్ట్యా భావించవచ్చు. దొరక్కపోయినా వృత్త రచన కూడా పూర్వం నుంచే ఉండి ఉండవచ్చు. నన్నయ వాడిన వృత్తాలన్నీ సంస్కృతంలో ప్రసిద్ధాలు కావు. పాదాంతాన విరామం లేకపోవటం, యతిస్థానంలో అక్షరమైత్రి, ప్రాసమైత్రి సంస్కృత వృత్తాల సంప్రదాయం కాదు. తెలుగు పద్ధతే. అయితే ఈ పద్ధతి ఎంత కాలంనుంచి ఏర్పడి ఉన్నదీ చెప్పటం కష్టం.

BRAOU

నన్నయ ఆంధ్ర భారత రచనలో వాడిన భాషకూ ఆ కాలపు వచన శాసనాల భాషకూ భేదం ఉంది. వచనశాసనాల్లో భాష ఆనాటి వాడుకభాషకు దగ్గరగా ఉంటుందనుకోవటంలో తప్పులేదు. అందువల్ల నన్నయ తనకన్నా ముందే ఏర్పడిన ఒక సాహిత్య సంప్రదాయాన్ని అనుసరించే కావ్యరచన చేశాడని చెప్పవచ్చు. అయితే ఆ సంప్రదాయంలో ఒక్క పుస్తకమూ దొరక్కపోవటం చరిత్ర మనకు వదలిన ఒక జటిల సమస్య. దొరుకుతున్న లిఖిత గ్రంథాల్లో ఆంధ్ర భారతానువాదం మొదటి పుస్తకం. దానికర్త నన్నయ, ఆదికవి.

భారతం మొత్తం 18 పర్వాలు. అందులో నన్నయ రెండున్నర పర్వాలు ఆంధ్రీకరించాడు. తిక్కన (13వ శతాబ్దం) 15 పద్యాలు రచించాడు. ఎఱ్ఱన (14వ శతాబ్దం) అనువాదం కాకుండా మిగిలిపోయిన భాగాన్ని పూరించాడు.

సంస్కృతంలో భారత భాగవతాలు పురాణాలు. పురాణాల్లో ఒక ప్రధానోద్దేశమూ, ఒక ప్రధాన కథా ఉంటాయి. వాటిలో మధ్య మధ్య చెప్పదల్చుకున్న ఒక నీతికి గాని, ఒక సూక్తికి గాని సరిపోయే అవాంతర కథలు ఉంటాయి. ఇవన్నీ మొదట ప్రజలలో మౌఖికంగా ప్రచారంలో ఉండవచ్చు. తరవాత లిఖిత సాహిత్యానికి ఎక్కినాయి. పురాణాల్లో సజీవ పాత్ర చిత్రణ ఉంటుంది. కథాగమనం ఉంటుంది. అతిమానుషమైన సంఘటనలు వదిలేస్తే పురాణపాత్రల సంభాషణ, ప్రవర్తన మానవ జీవితానికి, మనస్తత్వానికి సన్నిహితంగా ఉంటుంది. పండితులు వీటిని చదువుకునేవారు. వ్యాఖ్యాతలు సభాముఖాన వీటిని చదువుతూ

తమ వ్యాఖ్య జోడించి, సామాన్య జనానికి అందించారు. పురాణ సాహిత్యంలో కథా కథనానికి ప్రాధాన్యం ఎక్కువ. రాసేది కవిత్వం కనుక వర్ణనలూ, అలంకారాలూ, కల్పనలూ ఉంటాయి. అయితే కథకు అడ్డు తగిలేంతగా ఉండవు.

సుమారు 15వ శతాబ్దందాకా ఈ పద్ధతి సాగింది. 16వ శతాబ్దం నుంచి వర్ణనా ప్రధానమైన ప్రబంధ సాహిత్యం వచ్చింది. ప్రబంధంలో పాత్రలు కథకోసం కాదు. కేవలం ప్రబంధ నిర్మాణం కోసమే. ఎక్కడో ఏదో పురాణంలో ఉందని చెప్పి, దానికి చిలవలు పలవలు కవి తన కవసరమైనట్టు చేర్చుకుంటాడు. కవి తన ప్రాగల్భ్యాన్ని, పాండిత్యాన్ని వర్ణనలలోనూ, పద్యనిర్మాణంలోనూ చూపిస్తాడు. శ్రీనాథుడు రచించింది పురాణాలే ఐనా వర్ణన మీద మోజు చూపించిన కవి. ప్రబంధ ధోరణి సాహిత్యంలో ఒక్కసారిగా వచ్చింది కాదని చెప్పటానికి ఈయన రచనలు ఆధారాలు. ఆధునిక కవితాయుగం ప్రారంభమయిందాకా ఈ ప్రబంధ ధోరణే సాగింది.

అయితే ప్రాచీన సాహిత్యమంతా ఇదే కాదు. ప్రక్రియాభేదం ఇంత స్పష్టంగానూ ఉండదు.

"మనుచరిత్ర"లోని వరూధిని ప్రవరాఖ్యుల ఘట్టంలో కథకు ప్రాధాన్యం ఉంది. "ప్రభావతీ ప్రద్యుమ్నం" వంటి సామాన్య ప్రబంధం రచించిన పింగళి సూరన "కళా పూర్ణోదయం" వంటి జిగిబిగి అల్లిక గలిగిన కావ్యాన్ని రచించాడు. పారిజాతాపహరణంలో మానవ సహజమైన సంభాషణా ధోరణి, సంఘటనల ప్రాధాన్యం ఉంది.

ఇవికాక ప్రాచీన సాహిత్యంలో శతకాలు చాలాకాలంనుంచి ఉన్నాయి. అచ్చ తెలుగు కావ్య రచన యయాతి చరిత్రతో ఆరంభమై మొన్న మొన్నటివరకూ సాగింది. జన సామాన్యానికి ప్రత్యక్ష గానం ద్వారా అందిన బసవపురాణం ఉంది. లిఖిత సాహిత్య సంప్రదాయంలో ఉన్న యతి, గణాల్ని పాటిస్తూ ప్రధానంగా మౌఖికంగానే ప్రసారమైన వేమన పద్యాలున్నాయి. భక్తిప్రధానమైన సంకీర్తనలూ, పదాలూ ఉన్నాయి. మౌఖిక లిఖిత సాహిత్య లక్షణాలు వీటిల్లో కలగలిసి పోయినాయి.

ప్రాచీన సాహిత్యంలో ఇంత వైవిధ్యం ఉంది. తెలుగు భాషా సాహిత్యాలను అభిమాన విషయాలుగా ఎంచుకున్నవారు ఈ సాహిత్య భేదాలన్నిటితోనూ పరిచయం ఏర్పరుచుకోవాలి. అయితే పాఠ్యప్రణాళికల పరిమితులతో ఏర్పడ్డ ఏ కోర్సు అయినా సాహిత్యంలో నేర్పవలసిందంతా నేర్పలేదు. పరిచయం చేయటం మాత్రమే కోర్సు చెయ్యగలిగింది. ఈ పరిచయం ద్వారా అభిరుచి కలిగితే ప్రాచీన సాహిత్యంలో అత్యధిక భాగం మీకు మీరే చదివి ఆనందిస్తారు.

సాహిత్యాభిరుచి పాఠ్య ప్రణాళికలో ఉన్న గ్రంథ భాగాలకే, గ్రంథాలకు పరిమితం కాకూడదు. సాధ్యమైనంతవరకూ ప్రక్రియా వైవిధ్యాన్నీ, రచనా భేదాలను పరిచయం చెయ్యాలని మేం ప్రయత్నించినా, అవసరమైనవన్నీ ఇక్కడ పరిచయం చెయ్యటం కుదరదు. ఈ పుస్తకంలో ఇచ్చిన పాఠ్యాంశాలున్న అసలు పుస్తకాలు సంపాయించి చదవటం ప్రాచీన సాహిత్య ప్రవేశానికి మొదటిమెట్టు. ఒకటీ అరా దొరక్కపోయినా చాలావరకు పుస్తకాల షాపుల్లోనూ, లైబ్రరీలలోనూ, సాహిత్యాభిలాష ఉన్న మిత్రుల దగ్గరా దొరుకుతాయి. ఈ కోర్సు అయిపోయేలోపున ఆ గ్రంథాలు సంపాయించి చదివే ప్రణాళిక పెట్టుకుంటే తెలుగు కవిత్వంలో మీకు మంచి ప్రవేశం ఏర్పడుతుంది. ఆ తరవాత ఇతర గ్రంథాలకు విస్తరించాలి. శ్రీనాథుడి భీమేశ్వర పురాణంతో ఆగకుండా "కాశీఖండం, హరవిలాసం" వంటి కావ్యాలు కూడా చదవాలి. మనుచరిత్రతో ఆగిపోకుండా "వసుచరిత్ర, విజయవిలాసం" వంటి కావ్యాలు కూడా చదవాలి. అచ్చ తెలుగులో కూడా కూచిమంచి తిమ్మకవి రచించిన రామాయణం, నీలా సుందరీ పరిణయం చదవాలి. అన్నమాచార్యుల సంకీర్తనలతో పాటు క్షేత్రయ్య పదాలు, రామదాసు కీర్తనలు చూడాలి. మంచి మంచి శతకాలు ఎన్నో ఉన్నాయి. "ఆంధ్రనాయక శతకం, దాశరథీ శతకం" చదవకుండా ఊరుకోవటం తెలుగు సాహిత్య విద్యార్థికి సాధ్యంకాని పని. ఇదంతా మన సాహిత్య సంపద. దాన్ని అనుభవించటం మన హక్కు. ప్రాచీన సాహిత్యంలో భాష ఈనాటిది కాదు. ముఖ్యంగా కవిత్వ భాషకూ, సామాన్య భాషకూ భేదం ఉంటుంది. ప్రాచీన కవిత్వ భాషకూ ఈనాటి భాషకూ వాక్య నిర్మాణంలో భేదాలు చాలా తక్కువ. అందువల్ల ప్రాచీన కవిత్వం చదివేటప్పుడు ప్రధానవాక్యాన్ని, ఉపవాక్యాల్ని ముందు వేర్పరచుకుంటే త్వరగా అర్థం అవుతుంది. సామాన్య వాక్యంలో ఉండే పదక్రమం, కవిత్వంలో వేరుగా ఉంటుంది. అందువల్ల పద్యంలో పద క్రమాన్ని సామాన్య వాక్యంలోలాగా ఏర్పరచుకుంటే వాక్యావగాహన తేలికవుతుంది.

BRAOU

ప్రాచీన సాహిత్యం చెప్పున అర్థంకాక పోవటానికి ఇంకో కారణం పదప్రయోగం. తెలుగు సాహిత్యంలో మొదటి నుంచీ సంస్కృత పదాలు విరివిగా ప్రయోగించబడుతూనే ఉన్నాయి. ప్రాచీన కవిత్వంలో వాడిన కొన్ని తెలుగు మాటలు కూడా ఇప్పటి వ్యవహారం నుంచి జారిపోయినాయి. ఆ మాటల అర్థాల్లో వచ్చిన మార్పులూ తక్కువ కాదు. ఈ విషయంలో నిఘంటువులు చాలా ఉపయోగిస్తాయి. నిజానికి తెలుగు నిఘంటువులు సాహిత్య భాషకే తయారయినాయి. సి.పి. బ్రౌన్, గెలెటి వంటి ఒకరిద్దరు మాత్రమే సాహిత్యేతర భాషా పదాలను గ్రహించారు.

ప్రాచీన భాషలో మనము ఇబ్బంది పెట్టే విషయం పద స్వరూపంలో, పద నిర్మాణంలో, సమాసంలో, సంధిలో జరిగే వ్యాకరణ కార్యాలు. ప్రాచీన భాషా లక్షణాన్ని వివరిస్తూ పరవస్తు చిన్నయసూరి బాల వ్యాకరణాన్నీ, బహుజనపల్లి సీతారామాచార్యులు ప్రౌఢ వ్యాకరణాన్నీ రచించారు. నిజానికి ఈ వ్యాకరణాలు చేసిన పని వివరించటం కాదు, సూత్రీకరించటం.

వ్యాకరణాన్ని ఒక కళగా ఆరాధించిన ఈ గ్రంథాలు చెప్పున అర్థంకావటం కష్టమే. ప్రస్తుతానికి అవి తప్ప మనకు వేరే సహాయక గ్రంథాలు లేవు. క్లేశమైనా ఈ వ్యాకరణాలను వ్యాఖ్యాన సహాయంతో అర్థం చేసుకుంటే ప్రాచీన భాషాలక్షణం కొంతైనా తెలుస్తుంది. ఈ రెండు వ్యాకరణాలకూ విడివిడిగా బులుసు వెంకటరమణయ్య, వంతరాం రామకృష్ణ రచించిన వ్యాఖ్యలూ, రెంటినీ కలిపి స్ఫూర్తిశ్రీ రచించిన వ్యాఖ్యా దొరుకుతున్నాయి. **A progressive grammar of Telugu** అని A.H. Arden రచించిన వ్యాకరణం ఒకటి Christian Literature Society వారు అచ్చువేశారు. అందులో చివరి అధ్యాయంలో ప్రాచీన భాషా వర్ణన చాలా తేలికైన ఇంగ్లీషులో ఉంది. మన వ్యాకరణాల తెలుగుకన్నా ఆ ఇంగ్లీషు కష్టమైంది కాదు. ముఖ్యంగా ద్రుత కార్యాలు, యడాగమాలు మొదలైన వ్యాకరణ కార్యాలు తెలుసుకొంటే ప్రాచీన భాషలో పదవిభాగం తెలుస్తుంది. పద విభాగం తెలిసిన తరవాత నిఘంటువు మనకు అక్కరకొస్తుంది.

ఈ పాఠ్య ప్రణాళికలో కవిపరిచయం, గ్రంథపరిచయం, కథాపరిచయం వంటివి ఐన తరవాతనే పాఠ్య భాగం వస్తుంది. పాఠ్యభాగాన్ని ముందు ఏ సహాయం లేకుండా స్వయంగా చదవటం మంచిది. పాఠ్య భాగ మంతా ఒక చోటనే ఉంది. ఆ తరవాత అర్థాలు పద్యాల వరసనుబట్టి ఉంటాయి. ఆ తరవాత భావ వివరణ, వ్యాఖ్య, విశేషాంశాలు ఉంటాయి. ప్రాచీన సాహిత్యంలో మీరు ప్రవేశించటానికి ఇవి పనికొస్తాయనే చేర్చాం.

ఆధునిక యుగంలో సాహిత్యాస్వాదన సమ్మిళగా జరిగే అవకాశం తక్కువ. (మౌఖిక ప్రసారం ఉన్న సాహిత్యంలో ఆ అవకాశం ఎక్కువ). అందువల్ల గ్రంథపఠనం ఎవరికివారే స్వయంగా చేసుకొంటారు. కోర్సులూ, వ్యాకరణాలూ, నిఘంటువులూ, ఉపాధ్యాయులూ కేవలం సహకారులు మాత్రమే. చదవాల్సిందీ, ఆనందించాల్సిందీ మీరే. మీ కృషే ప్రధానం.

చివరగా ఒక మాట. సాహిత్యాన్ని పరీక్షలకోసం చదవం. మన మానసిక వికాసం కోసం, స్పందనకోసం చదువుతాం. డిగ్రీలకోసం పరీక్షలు తప్పనిసరయినా సాహిత్య పఠనాన్ని పరీక్షలకు పరిమితం చేయకండి. సాహిత్యాన్ని – అది ప్రాచీనమైనా, ఆధునికమైనా, కథ అయినా, పద్యం అయినా, ఏ సాహిత్య ప్రక్రియ అయినా, సాహిత్యంగా చదవండి. మీ సొంత అనుభవాన్ని పెంచుకోండి. మీ సొంత అభిప్రాయాన్ని ఏర్పరచుకోండి. సాహిత్యాన్ని గురించి మీరు వినేవీ, చదివేవీ కేవలం సహకారులన్నమాట మరవకండి.

## అభ్యాసం – 1

ప్రాచీన సాహిత్యంలో మీ పాఠ్యభాగం స్థానాన్ని నిరూపించండి ?

BRAOU

శ్రీగురులింగ సుస్థిరదయాపాంగ !
యోగాత్మ ! భక్తి మహోత్తుంగ ! సంగ !
మఱియును మడివాలు మాచయ్య నాఁగ
నఱలేని వీరవ్రతాచారయుతుఁడు
శ్రేష్ఠుఁడు జంగమప్రష్ఠుఁడు న్యాయ
నిష్ఠురాలాప మహిష్ఠ మండనుఁడు
నిష్ఠితేంద్రియగుణాన్వితుఁడు లింగైక్య
నిష్ఠాపరుఁడు సుప్రతిష్ఠితకీర్తి
భవిజన సంసర్గపథ పరిత్యాగి
ప్రవిమలతత్త్వానుభవ సుఖాంబోధి
పరగు భాషావ్రతపాలనశాలి
దళితషడ్వర్గుఁ డాస్థానంబుజ్యోతి
రజకజాత్యావృత ప్రత్యక్షరుద్రుఁ
డజరామరుం డయోనిజుఁ డవ్యయుండు
శరణపదాంభోజ షట్పదుం డనఁగఁ
బరఁగి, హిప్పరిగె యన్పురవరంబునను
నుండంగ, బసవనియురుభక్తివార్ధి
నిండారి దెసలను నిట్టవొడుచుడుఁ
బొంగి లింగానందపూరితుం డగుచు
జంగమ దర్శనాసక్తి నేతెంచి
బసవనిచేఁ బ్రణిపత్తి గైకొనుచు,
నసమజంగమకోటి కర్ప లిచ్చుచును,
బంటింపకను వరువుఁబనులు సేయుచును,
గంటి నాచేతులకసివోవ ననుచు
బాస వట్రిల్ల సద్భక్తసంఘంబు
మాసినవస్త్రముల్ మఱి మోసికొనుచు
వేవుజామున నేఁగి వేఱొక్క రేవు
గావించి యుదుకుడు ఘట్టనల్ సేసి
శస్త్రసమేతుఁడై సద్భక్తవితతి
వస్త్రముల్ రజతపర్వతభాతిఁ దాల్చి
వరిగొనివచ్చుచోఁ బురవీథి "భవులు
శరణుల వస్త్రముల్ సంధిల్లి రేని
నోడఁ జాఁ బొడుతుఁ జుండో" యని ఘంట
నాడాడ వ్రేయుచుఁ గూడఁ జాటుచును
మఠమున కేతెంచి మఱుఁగు లన్నియును
గఠినముల్గాకుండ ఘట్టించి మడువ
వట్టిచో జంగముం బరుదెంచి యడుగ
నెట్టి కట్టం బైన నిచ్చి మ్రొక్కుచును
నావస్త్రముల వారలడుగవచ్చినను
లేవన కందిచ్చు లింగసంపదను.
అంత నద్భుతచిత్తుఁ డై బసవండు
సంతతంబును విని సంస్తుతుల్ సేయ
"నలిభక్తతతివలువ లుదుకుచాకి
విలసితభక్తియు నిలఁ జెప్పఁబడియె
నదిగాక యేకాకి యన్మడివాలు
సదమల భక్తి భాషయు నొప్పెఁ గాని
యిట్టి సద్భక్తియు నిట్టిమహత్త్వ
మిట్టి సామర్థ్యంబు నెఱుఁగ మే" మనుచు
సల్లీల ననిశంబు సంస్తుతుల్సేయఁ
దెల్ల గానటు గొన్ని దినములు సనఁగ,
బఱితెంచుచో ముట్టుపాటైన నొకని
నఱిమిఱిఁ జంపి మాచయ్య యున్నెడను-

**మాచయ్య లెరువరుని జంపెనని పొరులు బల్లహునకుఁ జెప్పుట**

వీరువారనకెల్లవారును గూడి
ధారుణీశ్వరు సభాస్థలి కేఁగి మ్రొక్కి
"బల్లహ! వినుము నీపట్టణంబునను
బ్రల్లదుఁడొకచాకి బత్తుండ ననుచు
మొలఁ గఠారము గట్టి తొలఁగండు ద్రోవ
తొలఁగించు నేబల్లిదుల బిఱుసనఁడు;
చాటుఁ "జీరలమూట సంధిల్లిరేని
పోటు ముందఱ" నని పోటుల మాట.
నంగళ్ళ నిలిపె బేహారము ల్మాన్చె;
సంగడి నిటఁ [illegible] యిరింపరాదు;
పురవీథి [illegible] బోయినఁ జూచి
పరిగొని [illegible] బాఱంగఁ దోలు;
నిదుర[illegible] గుజ్జు మేనుంగు బండి
[illegible]దియేమి సోద్దెమో కదియంగ వెఱచు
నల్లంతఁ బొడగని చల్లన నవసి
కల్ల వెల్లై పాఱుఁ గథ లేల? నేఁడు
వింత వాఁడొకఁడు మున్వినమిఁగాఁ జేసి
సంతకుఁ బోవుచో సంధిల్లినంతఁ
బొడిచి మీఁదికి జిమ్మెఁ; బొందియ నచటఁ
బొడలేదు; మ్రింగెనో; పోయెనో దివికి;
నట గార్య మెఱుఁగ మేమవనీశ! వినుము.
ఇట వచ్చితిమి నీకు నెఱిఁగింప" ననిన
బసవనిదెసఁ జూచి పార్థివేశ్వరుఁడు
కసిమసంగుచు మహోగ్రత నిట్టు లనియె;
"నిది యేమి విపరీత మింక నెవ్వరికిఁ
బ్రదుకంగవచ్చు నీ భక్తుల చేతఁ;
గోకలుదుకుచాకి గ్రొవ్వి యిప్పురము
లోకంబునెల్లఁ గల్లోలపూర్చెడిని
చాకికి నింతేల శ్రద్ధలు ? జనులఁ
జేకొనకడిచెడుఁ జేరంగనీక
యిట్టి చోద్యంబులేమెఱుఁగ మేనాఁట
ముట్టినఁ జీరలు మఱుఁగునే చెప్పుమ?

పురజనులకు మున్నె చరియింపరాదు
పరదేశి కింక రాఁబొసె మాపురికి?
నెంతబల్లిదుఁడొ నేఁడ్వింతవాఁ డొకఁడు
సంత కేఁగఁగఁ జంపె శవమును లేదు
ఆకసంబున కేఁగు నట్టులుఁ గలదె ?
చాకి రక్కసిక్రియ జనుల మ్రింగెడిని.
తిట్టఁడు వలుకఁడు ముట్టినమాత్ర
నిట్టు సంపఁగఁ గూడునే పెఱవాండ్రఁ?
బాడిఁ దలంపక బత్తుండ ననుచుఁ
బాడుగాఁ జంపు నీపౌరులనెల్ల"
ననుచుఁ బురోహితు లమమతంబునను
దనయామికులఁ జూచి ధారుణీశ్వరుఁడు
"చాకి నచ్చోటన చంపుండు; వొండు;
కాక మ్రింగిన వానిఁ గ్రక్కున రండు"
అనపుడు బసవఁడిట్లనియె నాతనికి
బసవఁడు బల్లహునకు మడివాలు
మాచయ్య మహిమఁ జెప్పుట
"విను మీఁదెఱుంగక వెడలనాడెదవు
లేకులు లోకుల కాకజవులకుఁ
"జాకి చా" కని యేల సందండించెదవు?
చాకియే యతఁడు? సాక్షాల్లింగమూర్తి

## 1.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు

శ్రీ గురులింగ = లింగ స్వరూపునివి, శ్రీ మహితునివి, గురు స్వరూపుడవైన బసవేశ్వరా ! అని సంబోధనం
సుస్థిర దయాపాంగ = స్థిరమైన దయతో కూడిన కటాక్ష వీక్షణాలు కలవాడా !
యోగాత్మ = పరమేశ్వరునితో పొందుపరచుకొన్న ఆత్మ కలవాడా !
భక్తి మనోత్తుంగ = భక్తి మార్గంలో ఉన్నతుడా !
సంగ = సంగయ్య అనేది బసవేశ్వరుడికి ఇంకో పేరు
అఱలేని = ఏమరికంలేని
వీరవ్రతాచారయుతుడు = వీర శైవ వ్రతాచారాన్ని పాటించేవాడు
జంగమ ప్రష్ఠుడు = జంగమ సమూహంలో పేరెన్నిక గన్నవాడు
న్యాయ నిష్ఠురాలాప = న్యాయముతో గూడిన నిష్ఠుర వాక్కుల యొక్క
మహిష్ఠమండనుడు = గొప్ప గుణంచేత అలంకరింపబడినవాడు
నిష్ఠితేంద్రియ గుణాన్వితుడు = నియమముచే ఉంచబడిన ఇంద్రియముల గుణములతో కూడు కున్నవాడు
లింగైక్య నిష్ఠాపరుడు = లింగమునందు కలసిపోవలయునను నిష్ఠతో కూడు కొన్నవాడు.
సుప్రతిష్ఠిత కీర్తి = స్థిరముగా ప్రతిష్ఠింపబడిన కీర్తి కలవాడు
భవిజన సంసర్గపథ పరిత్యాగి = శైవులు కాని భవులతో కలిసిమెలిసి తిరిగే మార్గాన్ని పరిత్యజించినవాడు
ప్రవిమల తత్త్వ = మిక్కిలి స్వచ్ఛమైన తత్త్వాన్ని
అనుభవ సుఖాంబోధి = అనుభవించడం వలన కలిగే సుఖమనే సముద్రము కలవాడు
భాషావ్రత పాలనశాలి = శివపరంగా మాట్లాడటం అనే వ్రతం పాటించేవాడు
దరిత షడ్వర్గుడు = కామ, క్రోధ, లోభ మోహ, మద, మాత్సర్యాలనే ఆరు శత్రు వర్గాలను దాటినవాడు.
ఆస్థానంబు జ్యోతి = శైవాస్థానానికి వెలుగు వంటివాడు
రజకజాత్యావృత = చాకలికులంచేత చుట్టబడి
ప్రత్యక్ష రుద్రుడు = సాక్షాత్కరించు శివుడు
అజరామరుండు = ముసలి తనము, చావు, లేనివాడు
అయోనిజుడు = సామాన్య మానవులవలె పుట్టనివాడు
అవ్యయుడు = అంతము లేనివాడు
శరణ = శివభక్తుల యొక్క
పదాంభోజ = పాదాలనే తామరపూవులలో (తిరిగే)
షట్పదుడు = తుమ్మెదవంటివాడు
నిట్టవొడుచుడు = వెల్లివిరియుట వలన

BRAOU

ప్రణిపత్తి = అభినందనపూర్వకమైన స్వాగతము
పంటింపక = సందేహింపక
వరువుపనులు = దాస్యమును
వేతుల కసివోప = వేతుల తీటతీర
వేవుజాము = వేగుజాము, వేకువన
రేవుగావించి = రేవుపెట్టి
శస్త్రసమేతుడై = ఆయుధముతో కూడినవాడై
రజత పర్వతభాతి = వెండికొండవలె
శరణుల వస్త్రముల్ = శివభక్తుల వస్త్రములు
సంధిల్లిరేని = ఎదురెదురై వచ్చినట్లైతే
చాబొడుతు = చంపుతాను
మణుగులు = మడుగులు, వస్త్రములు
కట్టంబైన = కట్టణమైన; కట్టుకొనుటకు తగిన వస్త్రమైనను
భక్తతతి వలువలు = భక్త సమూహమునకు చెందిన వస్త్రములు
చాకి = చాకలి
మడివాలు = చాకలి
భక్తిభాష = భక్తికి సంబంధించిన వాగ్వ్యాపారం
ముట్టుపాటు = అంటుకోవడం, తాకడం
ప్రల్లదుడు = నోటికి వచ్చినట్లు మాట్లాడువాడు
కఠారము = ఖడ్గము; పొడవైన కత్తి
పిఱుసనడు = లెక్కచేయడు, లక్ష్యపెట్టడు
చాటు = ప్రకటిస్తాడు
అంగళ్ళునిల్పె = కొట్లు మూసికోటానికి కారణమయ్యాడు
బేహారములు = వ్యాపారాలు
పరిగొని = చుట్టుచుట్టి, గిరున తిరిగి
పసి = పశువు, గొడ్డు
సొద్దెమో = ఆశ్చర్యమో, వింతగానో
వింతవాడు = ఊరికి కొత్తవాడు; పరదేశి
బొంది = శరీరం
కసిమసంగుచు = చాలా కోపంతో ఉద్రేకపడుతూ
ముట్టిన చీరెలు = ముట్టుకొన్న గుడ్డలు
మురుగునే = మురిగిపోతాయా?
అట్టలు = ప్రాణంలేని శరీరాలు
యామికులు = రక్షకభటులు
మీదెఱుగక = రాబోయేది తెలుసుకోలేక

BRAOU

### 1.4.2 వ్యాఖ్యానం

ఈ కథ పాల్కురికి సోమన రచించిన బసవపురాణం చతుర్థాశ్వాసం నుండి తీసుకున్నది. పాల్కురికి సోమన శివకవులని చెప్పబడే ముగ్గురు కవులలో ఒకరు. మిగిలిన ఇద్దరు నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు. పాల్కురికి సోమన, నన్నయ, తిక్కనలకు నడిమి కాలమువాడు. క్రీ.శ. 1190-1260 మధ్య కాలంలో ఈయన ఉండి ఉండవచ్చునని చారిత్రకుల అభిప్రాయం. ఈయన నివసించిన ఊరు తెలంగాణాలోని వరంగల్లు సమీపంలో జనగామ తాలూకాకు చెందిన పాలకుర్తి.

• ఇతడు పుట్టుకచేత బ్రాహ్మణుడని, వైదిక మత సంప్రదాయాల మధ్య పెరిగినవాడనీ ఇతరాలయిన ఆధారాల చేత తెలియవస్తున్నా, తాను మాత్రం తన కుల గోత్ర వివరాలు చెప్పుకోలేదు. వీరశైవమతాన్ని

స్వీకరించిన వాడు కనుక, ఆ సంప్రదాయాన్ననుసరించి, తను ఈశ్వర కులజుణ్ణనీ, భక్తి గోత్రుడననీ, పార్వతీ పరమేశ్వరులే తన తల్లిదండ్రులనీ చెప్పుకున్నాడు. ఈతనికి వీరశైవ దీక్షనిచ్చిన గురువు గురు లింగార్యుడు. విద్యాగురువు విశ్వనాథ వేమనారాధ్యుడు.

ఈయన చేసిన గ్రంథాలు చాలా ఉన్నాయి. అవి "అనుభవసారం, బసవపురాణం, వృషాధిపశతకం, అక్షరాంక గద్య, నమస్కార గద్య, చతుర్వేదసారం, బసవోదాహరణం, పండితారాధ్య చరిత్ర" మొదలైనవి. ఈ కవి తెలుగులోనే కాక సంస్కృతంలోనూ కన్నడంలోనూ కావ్యాలను వెలువరించాడు.

అన్నిటిలోనూ ఇతివృత్తం ఒక్కటే. వీరశైవమత విధానం మీద తనకుగల ప్రపత్తి. ఆ మతాన్ని పాదుకొల్పిన ప్రవక్త బసవేశ్వరునిమీద కవికి గల అప్రతిమాన (సాటిలేని) భక్తిప్రపత్తులు ఆయన రచించిన అన్ని గ్రంథాలలోనూ కనిపిస్తాయి. ముఖ్యంగా బసవ పురాణం వీరశైవ భక్తుల కథల సంపుటం. సోమన రచించిన మరొక కావ్యం పండితారాధ్య చరిత్ర. వీరశైవ మత ప్రచారమే జీవిత లక్ష్యంగా గల పండిత సంప్రదాయానికి చెందినవాడు మల్లికార్జున పండితారాధ్యుడు. ఈయన బసవేశ్వరునికి సమకాలికుడు. శిష్యగణం ఈయనకూ, శివునకూ అభేదం చెప్పుకుంటారు. సోమన రచించిన మరొక చెప్పుకోదగిన పుస్తకం వృషాధిప శతకం. ఈ శతకానికి "బసవా, బసవా వృషాధిపా" అనే మకుటం ఉంది., ఇది గణచ్ఛందంలో రచింపబడింది. సోమన బహుభాషా పండితుడు అని చెప్పడానికి ఈ శతకంలో సంస్కృత, తమిళ, మహారాష్ట్ర, అచ్చాంధ్ర భాషలలో రచించిన పద్యాలున్నాయి.

తొలుత ఈ కవి తన రచనను గణచ్ఛందంలోనే ప్రారంభించాడు. చంపక, ఉత్పలమాలల వంటి సామాన్య వృత్తాలే కాక త్రిభంగి, క్రౌంచపదం, వనమయూరం వంటి విశేష వృత్తరచన కూడా కావించాడు. కాని, మత ప్రచారమే తన ధ్యేయం కనుక, ఈ ప్రచారమనేది సామాన్య జనులకు పట్టేటట్లుగా సాగవలసినది కనుక, శబ్దార్థ క్లిష్టతను కలిగించే గణచ్ఛందాన్ని వదిలిపెట్టేశాడు. సంస్కృత సమాస భూయిష్ఠ రచనను విడిచి, స్వచ్ఛమైన తెలుగు మాటలతో రచన చేస్తానని ప్రతిజ్ఞ పట్టాడు. ఉరుతరమైన గద్యపద్యోక్తులకంటె సరసమై పరగెడి జానుతెనుగే తనకామోదయోగ్యమని ప్రకటించాడు. అందువలన ఆయన రచనలు ద్విపదచ్ఛందంలో నడుస్తాయి. ద్విపద లయప్రధానమై, మాత్రాచ్ఛందంలో నడిచే రచన. జానపద గేయసాహిత్యం, ఈ ఛందానికి దగ్గరగా ఉంటుంది. అనగా పాల్కురికి సోమన చేపట్టిన కవితా వాహిక సామాన్య జనులు ఆమోదించి అర్థం చేసుకోగలిగిన ఛందః ప్రసారాన్ని కలిగి ఉన్నది. ఈ ఛందస్సును ఆదరించండని సోమన జనులకు విన్నపం చేశాడు. "నేను చెప్పబోయే ఈ ద్విపదల్ని కేవలం తెనుగు మాటలనకండి, వీటిని వేదాలవలె చూడండి. అల్పాక్షరాలతో అనల్పార్థ రచన కల్పించడమే వివేకం" అని మనల్ని హెచ్చరించి, మన దృష్టిని దేశిరచన వైపుకు తిప్పగలిగాడు.

BRAOU

ఈయన కావ్యాలన్నిటికీ వీరశైవ మతప్రచారమే ప్రధాన లక్ష్యం. ఈ మతం వర్ణాశ్రమ ధర్మాలను తిరస్కరిస్తుంది. హైందవమతం ప్రతిపాదించే యజ్ఞయాగాది కర్మలనూ, వాటి మూలంగా పాతుకుపోయిన బ్రాహ్మణాధికారాన్నీ నిరసిస్తుంది. దీనికంటే ముందు పుట్టిన జైన, బౌద్ధమతాలవలె వీరశైవమూ బ్రాహ్మణాధికారాన్ని తగ్గించడానికి అవతరించిన మతం. ఇది దక్షిణదేశంలో తమిళ, కర్ణాటకాంధ్రాలలో ముమ్మరంగా వ్యాపించి, ఆ రాష్ట్రాల మత స్వరూపాన్నే చాలావరకు మార్చివేసింది.

వీరశైవం అన్న పేరులోనే దీని వీరతాస్ఫూర్తి కనిపిస్తుంది. ఈ మతానికి పరమత సహనం లేదు. శైవులు కాని వారందరూ ఈ మతస్థుల దృష్టిలో భవులు. భవులు శైవులకండ్ల పడకూడదు. శైవులు నడిచే దారికి అడ్డంగా రారాదు. అటువంటి భవులను హింసించే హక్కు శైవులు కలిగి ఉంటారు. భవులేకాక శివదూషకులు కూడా వీరికి శత్రువులే.

ఈ మతంలో ప్రధానమైన అంశం వీరతా స్ఫూర్తితో కూడుకున్న శివభక్తి. వీరికి శివునికన్నా శివభక్తులు మిన్న. వారి కొరకు భక్తుడు తన ధన, మాన, ప్రాణ, కుటుంబాదికాలను వేటినైనా అర్పించుకోవడానికి సంసిద్ధుడుగా ఉంటాడు. శివభక్తునికి కులగోత్రాలుండవు. అందరిదీ ఒకటే కులం. అది జంగము కులం. జంగములు అంటే అర్థం శివభక్తులని మాత్రమే. శివునికంటే శివభక్తునకేదైనా అపచారం జరిగితే వీరశైవుడు సహించలేడు. శిక్షణాదికారాన్ని తన చేతుల్లోకి తీసుకొని అపరాధిని దండించడానికి నిస్సంకోచంగా ముందు కురుకుతాడు.

అటువంటి ఇతివృత్తం చుట్టూ అల్లబడ్డదే మడివాలు మాచయ్య కథ.

వీర శైవ వ్రతాచారుడు, జంగమ సమూహంలో పేరెన్నిక గన్నవాడు, న్యాయాన్ని కఠిన హృదయంతో పాటించేవాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, లింగైక్యం చెందాలనే తపన కలవాడూ అయిన మడివాలు మాచయ్య శైవులు కాని భవిజనాన్ని సహించే వాడుకాదు. ఆయన చాకలి కులంలో పుట్టిన శివుడు. శివభక్తుల పాదాలనే తామరపువ్వుల చుట్టూ తిరిగే తుమ్మెద. 'హిప్పరిగె' అనే ఊళ్ళో నివసించే ఈయన బసవని దర్శనానికి వచ్చి ఆయనచే సత్కారాన్ని అందుకున్నాడు. శివభక్తవరుల వస్త్రాలను శుభ్రంచేసే పనికి పూనుకున్నాడు. వారికొరకే ప్రత్యేకంగా రేవు పెట్టి, ఉతికిన గుడ్డల్ని వెండికొండవలె పెద్దమూట కట్టి పురవీధిలో మోసుకుపోవడానికి ఉద్యమించాడు. దారిలో ఘంటానాదం చేస్తూ, శివ భక్తులు కానివారెవరైనా తనకు ఎదురైతే వారిని చంపుతానని ప్రకటించసాగాడు. శివభక్తులైనవారు తాము కట్టుకోవడానికి వస్త్రాన్ని యాచిస్తే వారికి తన మూటలోని వస్త్రాలను ఇచ్చేవాడు. తరువాత, ఆ గుడ్డల సొంతదార్లకు లింగప్రసాదంచేత, లేదనకుండా, తిరిగి గుడ్డల నందించేవాడు. ఇది గమనించి, అద్భుతం నిండిన మనస్సు కలవాడైన బసవన ఇట్లా అనుకోసాగాడు.

మాచయ్య ప్రతిజ్ఞ బసవణ్ణి ఆశ్చర్యంలో ముంచెత్తింది. భక్తుల గుడ్డలుతికే చాకలి కథలున్నాయి. ఏకాకి అనే పేరుగల చాకలి భక్తిని గురించి ఉదంతాలున్నాయి. ఏనాడూ ఇటువంటి సద్భక్తినీ, ఇటువంటి సామర్థ్యమూ మహత్త్యమూ ఎరుగం అని బసవేశ్వరుడు మాచయ్యను స్తుతింపసాగాడు. కొన్ని దినాలట్లా గడిచిన తరువాత శైవుడు కానివాడొకడు మాచయ్య మూటకు ఎదురొచ్చి దాన్ని ముట్టుకున్నాడు. వానిని తన ప్రతిజ్ఞ ప్రకారం మాచయ్య చంపివేశాడు. అప్పుడు వాళ్ళూ వీళ్ళూ అనక అందరూ పోగై రాజుగారి సభకు చేరి మ్రొక్కి, ఆయనతో మొర పెట్టుకున్నారు. "ఓ రాజా! నీ పట్టణంలో వాగుబోతైన చాకలి భక్తుడొకడు, మొలలో పెద్దకత్తి చెక్కుకుని, తాను తెచ్చే ఉదుకు వస్త్రాల మూటను ఏ భవి అయినా తాకితే చంపుతానని ప్రతిన పట్టాడు. దానితో నగరంలో ఉన్న అంగళ్ళన్నీ మూతపడ్డాయి. వర్తక వ్యాపారాలు ఏవీ జరగడంలేదు. వీధిలో ఎవరైనా పోతూ ఉంటే గిరికీలు తిరుగుతూ వాళ్ళను దూరాలకు వెళ్ళగొడ్తున్నాడు. ఎదురుగా పశువో, ఏనుగో, ఒంటో, గుర్రమో, ఏదీ రావడానికి వీలులేదు. జనులంతా అంతంత దూరంలో అతణ్ణి చూచి, పారిపోయే కథలెందుకుగాని, ఈ రోజు ఊరికి కొత్తవాడయిన పరదేశి ఒకడు ఇక్కడి విషయాలేమీ తెలియక, సంత చేయడానికి వచ్చి మాచయ్యకు ఎదురు వచ్చాడు. వెంటనే మాచయ్య వానిని పొడిచి, శరీరాన్ని పైకి ఎగజిమ్మాడు. దాని జాడ తెలియదు. అది అక్కడే ఆగిపోయిందో లేక అతడే దాన్ని మింగేశాడో తెలియకుండా ఉంది. ఈ సంగతి చెప్పడానికే మేమిక్కడికి వచ్చాం" అన్నారు.

అప్పుడు రాజు బసవేశ్వరునివైపు చూచి విస్మయ కోపంతో "ఇదేమి విపరీతం? ఇట్లా అయితే ఎవరైనా ఎట్లా బ్రతుకుతారు? కోక ఉదుకుకునే వాడు లోకాన్ని కల్లోలం చేస్తున్నాడు. చీరలు ముట్టుకుంటే అవి మురిగిపోతాయా? పురజనులు ఊరిలో తిరగడం లేదు. ఇక పరదేశి జనులు కూడా మన పురానికి వచ్చే వీలులేదు. వీడెంత బల్లిదుడో? చంపడమే కాక శవాన్ని కూడా మాయం చేశాడు. ఇతడు రాక్షసునికి మల్లే జనులను మింగుతున్నాడు. ఎవరైనా ముట్టుకుంటే నాలుగు మాటలనవచ్చు. తిట్టవచ్చు. కాని చంపుతారా ఎవరైనా? భక్తుణ్ణని పేరు పెట్టుకుని పౌరుల్నందరినీ చంపుతున్నాడు" అన్నాడు. అని తన పురోహితుల అనుమతి తీసుకుని రక్షకభటుల్ని పిలిచి, "ఆ చాకలిని అక్కడనే చంపేయండి. లేదా, ఆతడు మింగిన వానిని కక్కించి మరీరండి" అని ఆజ్ఞ ఇచ్చాడు.

ఆ మాట విని బసవడు, "నీ కొలది తెలుసుకోకుండా మాట్లాడుతున్నావు. అవివేకులూ, మూర్ఖులూ అయిన లోకులు అరిచే కాకి అరుపులకు లొంగి చాకి, చాకి అంటూ ఎందుకు సందడి చేస్తున్నావు? అతడు చాకలి కాదు, సాక్షాల్లింగమూర్తి" అని మడివాలు మాచయ్య మహిమలను వివరించడం మొదలు పెట్టాడు.

### 1.4.3 విశేషాంశాలు

ఈ భాగం వలన వీరశైవానికి కులమనే అడ్డుగోడ లేదన్న అంశం స్పష్టమైతున్నది. ఇప్పటికి ఏడెనిమిది వందల సంవత్సరాల వెనుకనే కులతత్త్వాన్ని కాదనే అభివృద్ధికర భావానికి నాందీ గీతం పాడిన మతాలలో వీరశైవ మత మొకటి.

BRAOU

సోమన కవిత్వంలో ఉన్న ధారాశుద్ధి, అందువలన కలిగిన వేగం, విషయాన్ని పాఠకుల మనఃఫలకం మీద స్పష్టంగా ముద్రింపగలుగుతున్నాయి. సోమన కలం పదునైనది. ఏ మాత్రమూ ఇతర మతాలతో రాజీకి రానని స్పష్టం చేసే ఔద్ధత్యం కలది. ఒక ఆశయానికి లోబడి చేసిన ఈయన రచనలలో, కవితాధ్యేయం స్పష్టంగా కనిపిస్తుంది. చదివే వారి గుండెలలో తీవ్ర స్పందనను కలిగిస్తుంది. పాల్కురికి సోమన కవితా లక్షణాలుగా మనం చెప్పుకోవలసినవి ఈ తీవ్రతా, తల్లీనమైన కవియొక్క ఆత్మీయతా ఈ రెండూ మాత్రమే.

ఈయన వాడే దేశ్య పదాలు రమ్యమైనవి. ఈనాడు తెలుగు భాషలో మరుగునపడిపోయిన ఎన్నో పదాలు బసవ పురాణంలో కనిపిస్తాయి. అంతేకాక, ఈయన పద భాండాగారానికి ఎన్నో కన్నడ పదాలు చేరి పుష్టి నివ్వడం మనం గమనించవచ్చు.

భారత భాగవతాలను పురాణ కవిత్వం అంటారు. ఇవి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండవు. సాధారణంగా ఒక వ్యాఖ్యాతతో శ్రోతలు ఆ పురాణ గాథలు చెప్పించుకుంటారు. ఈ గ్రంథాల్లో వాడిన భాష, వాక్య నిర్మాణం, పద్య రచనా పద్ధతి ఈ కథలు సామాన్యులకర్థం కాకుండా అడ్డుకుంటాయి. అందువల్ల వ్యాఖ్యాత అవసరం.

పురాణగాథలను ప్రత్యక్షంగా శ్రోతల కందించే ఉద్దేశంతో బసవ పురాణం రాయబడింది. శైవమత వ్యాప్తి దీని లక్ష్యం. ప్రచారం కోసం ఉద్దేశించిందేదీ ప్రజలకు దూరం కాగూడదు. ఆ ఉద్దేశంతో సోమనాథుడీ కావ్యాన్ని ద్విపద ఛందస్సులో రాశాడు.

ద్విపద లక్షణం గణాల్లో నిర్వచించినా దానిని పాటలాగా పాడటం వల్ల మాత్రా ఛందస్సు అవుతుంది. మూడు ఇంద్ర గణాలు, ఒక సూర్య గణం ప్రతి పాదానికీ ఉంటూ ప్రతి రెండు పాదాలకూ ప్రాస నియమం పాటిస్తే ద్విపద అవుతుంది. ఇంద్ర గణాల్లో భగణమూ (ఒక గురువూ, రెండు లఘువులు), నలమూ (నాలుగు లఘువులు) ఉన్నప్పటికీ వాటి లఘువులను ఉచ్చారణలో పొడిగించి ఉచ్చారణ కాలాన్ని అయిదు మాత్రల కాలం చెయ్యవచ్చు.

అప్పుడు దీనికి ఖండగతినడక వస్తుంది. చాలా జానపద గేయాలు ఈ ఛందస్సులో ఉన్నాయి.

శ్రోతల ప్రత్యక్ష గ్రహణానికుద్దేశించిన సాహిత్యం కావటంవల్ల జానపద కవిత్వంలో కనిపించే కొన్ని లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి. ఉపయోగించే భాష – ముఖ్యంగా పదాలు – ప్రజల భాషకు సన్నిహితం. కథాకథనంలో విస్తృతి ఎక్కువ. చదివితే లయ స్ఫుటంగా వినిపిస్తుంది. యతి స్థానం, పాదాంతం తేలిగ్గా తెలుస్తాయి. ఇతర కావ్య ప్రక్రియల్లో కనిపించే పాత్ర చిత్రణం, వర్ణనావైచిత్రి, అలంకార క్లిష్టత మొదలైనవి ఇక్కడ ఉండవు. కథాకథనం, [illegible]న్వయం, లయ గతి స్ఫూర్తి, భావతీవ్రత, భక్త్యావేశం బసవ పురాణంలో ప్రధాన లక్షణాలు. ఈ సందర్భంలో పింగళి లక్ష్మీకాంతంగారు అన్న ఈ మాటలు చూడండి, "ఆ కవిత్వమునకు భావావేశము జీవగఱ్ఱ. ఈతని కవిత్వమునకు అదియే పంచప్రాణ సారభూతమై యున్నది. మతమున భక్త్యావిష్టుడు కనుకను, కావ్యేతి వృత్తమంతయు శివభక్తి పరము గనుకను భావావేశ మతావేశములు ఒండొంటికి తోడై పరస్పర పోషకములైనవి. ఏ కథ చెప్పినను, శైవచిహ్నము వర్ణించినను, భక్తి ప్రవాహమున ఓలలాడుచు, శివమెక్కిన గణాచారివలె గంతులు వేయును. శాంతముగా గాని, చప్పగా గాని అతని నోటివెంట ఒక్క మాటయు వెలువడదు."

సోమనాథుడి బసవ పురాణంలో సమాస ప్రయోగం, ప్రాస లక్షణం వంటి లిఖిత సాహిత్య లక్షణాలూ ఉన్నాయి. సోమనాథుడు మౌఖిక సాహిత్య లక్షణాలను లిఖిత సాహిత్యంలో ప్రవేశ పెట్టాడు. అందువల్ల బసవపురాణంలో కవిత్వ కళను లిఖిత సాహిత్య లక్షణాలకు మాత్రమే పరిమితం కాక జానపద సాహిత్య లక్షణాలనుంచి కూడా పరిశీలించాలి.

పాల్కురికి సోమనాథుని బసవ పురాణంలో లిఖిత సాహిత్య లక్షణాలతో పాటు, మౌఖికాంశం ఉందన్నాం. ఈ విషయాన్ని గురించి తులనాత్మకంగా పరిశీలించటానికి మనకో అవకాశం ఉంది. ద్విపద బసవ పురాణాన్నే పిడుపర్తి సోమనాథుడనే కవి 15వ శతాబ్ది చివరి భాగంలో చంపూ కావ్యంగా రచించాడు. మీ పాఠ్య భాగంలో కథాభాగానికి సంబంధించిన కన్ని పద్యాలను ఉదాహరిస్తున్నాం.



BRAOU

మఱియు ధరనొప్పు మడివాలు మాచదేవు
డనగ నరలేని హరుభక్తు డతుల జంగ
మార్చనాసక్తచిత్తుడు న్యాయ నిష్ఠ
డప్రగల్భోక్తి హరుడు వీరవ్రతుండు

స్వవశగతాఖిలేంద్రియుడు శాంభవ నిష్ఠుడు సుప్రతిష్ఠితా
త్యవిరళ కీర్తి మండను డపాస్త పునర్భవ మార్గ వృత్తి స
త్య విమలతా నియామక దయాంబుధి చిత్కకచ ప్రకృత్త శా
త్రవ నివహుండు నిహ్నుత జరామరణుండు నయోనిజాతుడున్.

భాషా పాలకుడు రజక
వేషావృత రుద్రు డజాడనిగ్రహుడు జగ
త్తోషకర హర భక్తి వి
శేషా స్థానంబు వెలుగజేయు దివియయై.

వ. అట్ల ప్రతిహత ప్రభావుండై, హిప్పరిగె యన్పురంబునం బురభంజన భక్త పద పంకేరుహ మంజుల షట్పదుండై యుండు సమయంబున,

బసవన్న భక్తి వారిధి
యసలారగ నిండి కౌతుకాస్పదమగుచున్
దిసలందు నిట్ట పొడువగ
నసమానుడు మాచయోగి యతి హర్షితుడై.

జంగము దీక్ష మదిని ను
ప్పొంగగ నీ బసవ మంత్రి పుంగవు చేతన్
సాంగ సపర్యలు గొనుచున్
జంగము కోట్యర్చనములు సలుపుచు బురిలోన్.

ఉండుచు నివ్విధమున నహి
మండను సద్భక్త వితతి మాపిన కోకల్
నిండారు వేడ్కగొని వే
ఱొండొక రేవునకు నుఱక నుత్సాహమునన్.

చని చేతుల కసివో నుది
కి నిగిడిచియు నెండవైచి కేలను నవియొ
య్యన సంధించుక సద్భ
క్తనివహ ధౌతాంబరములు దాలిచి త్రోవన్.

తార ధరాధరంబు గతి రాజనుదెంచుచు బట్టణంబులో
వారలు శంభు భక్తతతి వస్త్రము లంటక పొందు దవ్వుగా
దూరకు డంటుకొన్న బొడుతుం బడనంచును జాటుకొంచు ఘం
టారభటీయుతుండయి నిజాలయ సీమకు నేగు నొక్కడున్.

చని తన తెచ్చిన మడుపుల
ననుపుగ ఘటియించి గడెలు నాల్కొలుపు నెడ
న్జని జంగమం బడుగ గొ
బ్బున మ్రొక్కుచు నిచ్చు నెట్టి పుట్టంబైనన్.

ఆ కోకలుదుక వైచిన
శ్రీకంఠుని భక్తులడుగ జిడిముడిపడ క
య్యా కొండని యందిచ్చును
బ్రాకటముగ శంభులింగ భక్తి నియుక్తిన్.

## అభ్యాసం – 2

"మడివాలు మాచయ్య"లో ప్రతిపాదించబడిన తత్త్వం ఏమిటి ?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## అభ్యాసం – 3

మాచయ్య పాత్రను చిత్రించండి ?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 1.5 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ప్రాచీన కవిత్వం శివ సంప్రదాయానికి చెందిన ప్రక్రియ.
- దేశీచ్ఛందానికి చెందిన ద్విపదలో పాల్కురికి సోమనాథుడు రాసిన 'బసవ పురాణం' అనే వీరశైవ మత స్థాపకమైన తెలుగు కవిత్వ గ్రంథంలోనిది "మడివాలు మాచయ్య" అనే ప్రస్తుత పాఠ్యం. ఇది ప్రాచీన కవిత్వ విభాగంలో మొదటిది.
- పాల్కురికి సోమన రాసిన కవిత్వమంతా వీరశైవమతానికే ప్రాధాన్యం ఇచ్చింది
- మడివాలు మాచయ్య కథ ద్వారా వీరశైవుల ఆచారాలూ, విశ్వాసాలూ, ప్రవర్తనా పద్ధతులూ, లక్షణాలూ తెలుస్తున్నాయి.
- ఎనిమిది వందల ఏండ్ల కిందటనే కులమతాల అడ్డుగోడలను మానవ సమాజంలో కూల్చివేయడానికి వీరశైవ మతం చేసిన ప్రయత్నం ఈ పాఠ్యం ద్వారా తెలియవస్తున్నది.
- దేశికవితా రీతులను, పాల్కురికి ప్రచారం చేసిన 'జాను తెనుగు' భాషా స్వరూపాన్నీ ఈ పాఠ్యం పరిచయం చేస్తున్నది.
- ఆనాటి సంఘంలో జంగములూ, వీరశైవులూ ఎంతటి నిరంకుశ ప్రవర్తన కలిగి ఉండేవారో కూడా ఈ పాఠ్యం ద్వారా బోధపడుతుంది.
- ప్రాచీన కవిత్వ విభాగానికి చెందిన వర్ణనా పద్ధతులూ, పదబంధ స్వరూపాలూ, సమాస ఘటనా పద్ధతీ, అలంకార రీతీ ఈ పాఠ్యం ద్వారా కొంతవరకు తెలియవస్తున్నాయి.



BRAOU

## 1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఈ భాగాన్ననుసరించి పాల్కురికి సోమన కవితా గుణాలను నిరూపించండి ?
2. బసవ పురాణంలోని వస్తుతత్వాన్ని నిరూపించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

వీరశైవ మతాచారాలెటువంటివి ?

## 1.7 ఆకళింపు ప్రశ్నలు

మడివాలు మాచయ్య కథలో మీకు నచ్చిన పాదాలను ఏరి, వాటికి కవితా విశేషాల పరంగా వ్యాఖ్య రాయండి.

పింగళి లక్ష్మీకాంతంగారు సోమనాథుడి కవిత్వాన్ని గురించి చేసిన ఈ వ్యాఖ్య చదవండి.

"పైసలు పొదుపు చేసి రూపాయలు విరజిమ్మిన సంసారివలె ఇతడు అక్షరములను పొదుపుచేసి ప్రకరణములను, వాక్యములను దుర్వ్యయము చేయుచుండును. భావమును నిగ్రహించుకొనలేక అతి చాలనము చేయు కవుల రచనలు అధిక ప్రసంగములయి ఔచిత్యమును కోల్పోవును. ఈ దుఃస్థితి సోమనాథుని గ్రంథములకు పట్టినది. ఈతని ద్విపద కావ్యములు రెండింటిలో ఈ అధిక ప్రసంగములను అతడు చాలవరకు సంగ్రహపరచి యుండినచో అర్థ హాని కలుగకుండగనే గ్రంథములు అధిక సమాదరణీయములయ్యేడివి."

సోమనాథుడి కవిత్వంలో పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పే లోపాలకు కారణాలు కనుక్కొని, వాటిని లోపాలనక్కర్లేదని ఎట్లా సమర్థించవచ్చునో విచారించండి.

జానపదులకు ప్రీతికరమైన కథా గేయసాహిత్య లక్షణాలను కొన్నింటిని బసవ పురాణంలో ఇమిడ్చినట్లు ముదిగొండ వీరభద్రశాస్త్రిగారన్నారు. ఆ లక్షణాలను మీ పాఠ్యభాగంలో గుర్తు పట్టండి.

పాల్కురికి సోమనాథుని కవిత్వానికీ, పిడుపర్తి సోమనాథుని కవిత్వానికీ గల భేదాలను, భాష, ఛందస్సు, కథాకథనం మొదలైన విషయాల నాధారం చేసుకొని తులనాత్మకంగా పరిశీలించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. చదువురాని జానపదులు తమ భావావేశాన్ని ఆశువుగా కవితాబద్ధం చేసినప్పుడు ఉద్భవించేది మౌఖిక సంప్రదాయానికి చెందిన జానపదకవిత్వం. అది సరళం, సహజం. మనిషిలోని పాండిత్యం, ఆలోచనా శీలం పెరిగి పెరిగి, మనస్సులో పుట్టే భావావేశం ఎంతో అంతర్మథనానికి గురై, ఛందోవ్యాకరణ అలంకార శాస్త్రబద్ధంగా కవిత్వ రూపం ధరించినప్పుడు ఆవిర్భవించేది లిఖిత సంప్రదాయానికి సంబంధించిన సాహిత్యం. ఆ సాహిత్యంలో తెలుగు భాషలోని మొట్టమొదటి ప్రక్రియా స్వరూపం 'ప్రాచీన కవిత్వం'. దీన్నే సంప్రదాయకవిత్వమని కూడా అంటారు. తెలుగులో వెలసిన భారత భాగవత రామాయణాలూ, కావ్య ప్రబంధాలూ, చిత్రకవితలూ మొదలైనవన్నీ ప్రాచీన కవిత్వ విభాగంలోకి వస్తాయి.

ప్రాచీన కవిత్వంలోని భాషా స్వరూపం సంప్రదాయ వ్యాకరణ బద్ధమై ఉంటుంది. సంధి, సమాస విధానాలు సాధారణంగా వ్యాకరణ నియమాలను అతిక్రమించవు. సమాస, అలంకార, రీతి, రస నిర్వహణ పద్ధతులు ప్రాచీనాలంకారిక దృక్పథాలకు ప్రతిబింబాలుగా ఉంటాయి. కథా నిర్వహణ మార్గం గద్య పద్యాత్మకమైన చంపూ పద్ధతికి సాధారణంగా లోబడి ఉంటుంది. వీటిలో పూర్తిగా గద్య కావ్యాలూ, పూర్తిగా పద్యకావ్యాలూ ఉన్నాయి. కేవలం దేశికవితా పద్ధతికే చెందిన 'ద్విపద' లో వచ్చిన

మహా కావ్యాలూ ఉన్నాయి. ప్రస్తుత పాఠ్యం "మడివాలు మాచయ్య" అలాంటి కవితా పద్ధతికే చెందిన ద్విపదకావ్యం. ఇది 'బసవపురాణం' చతుర్థాశ్వాసం నుంచి తీసుకోబడింది.

2. ఈ పాఠ్యంలోని కథ కులతత్త్వానికి వ్యతిరిక్తతను సూచించే అంశానికి ప్రాధాన్యాన్నిచ్చే కథ. మనుషులంతా ఒకటే ! సమాజంలో ఒక ఉద్దేశానికి కట్టుబడి, ఏక ముఖతను కలిగి, సమూహంగా చేరిన వారందరూ ఒకటే కులానికి చెందినవారు. ఆ కులం జంగమకులం అని చాటుతున్నది ఈ కథ. ఇందులో మనుష్యుడవలంబించే మతానికి ప్రాధాన్యమేకాని అతడు పుట్టిన కులానికి కాదు. దీనిలోని కులాతీత దృక్పథం ఎనిమిది శతాబ్దాల కిందటనే వీరశైవమతం ప్రారంభించిన సంఘసంస్కరణోద్యమాన్ని సూచిస్తున్నది.

3. వీరశైవమతతత్త్వం మూర్తీ భవించిన జంగమ స్వరూపుడు 'మడివాలు మాచయ్య'. బిజ్జలుని మంత్రి బసవేశ్వరుడు చెప్పిన మాటల్లో ఇతని వ్యక్తిత్వం ఈ విధంగా ప్రతిఫలిస్తున్నది. "హిప్పరిగె అనే ఊరిలో చాకలిగా జన్మించిన మాచయ్య వీరశైవ జంగమ సమూహంలో పేరెన్నికగన్నవాడు. శైవాచార న్యాయాన్ని కఠిన హృదయంతో అమలు పరిచేవాడు. ఇంద్రియ నిగ్రహం కలవాడు. లింగైక్యం చెందాలనే తపన కలవాడు. 'భవి', అంటే శివభక్తుడు కాని వాణ్ని సహించేవాడుకాడు. అతడు చాకి కాడు - సాక్షాల్లింగమూర్తి".

శివభక్తుల పాదాలనే పద్మాల చుట్టూ తిరిగే తుమ్మెద - మాచయ్య. శివభక్తుల గుడ్డలు చలువ చేయడం కోసమే ప్రత్యేకంగా ఒక రేవు పెట్టి, ఉతికిన బట్టలను ఒక కొండలాగా మూటగట్టి, ప్రతి నిత్యమూ మోసుకుపోయి ఇచ్చి, వారిని సేవించుకునే వాడు. దారిలో తనకు భవులెవరైనా ఎదురైతే వారిని సంహరించి వేస్తానని శపథం పట్టి, ఘంటానినాదంతో ఆ విషయాన్ని చాటి చెప్పుతూ మదించిన గజంలా పుర వీధుల్లో సాగిపోయేవాడు. అతని భక్తికీ, శక్తికీ పరవశులై, భీతులై పురజనులు అతని దారి నుండి వైదొలగి పోతుండేవారు. కథ ఇలా నడుస్తుండగా ఒకనాడు ఈ విషయం తెలియని భవియైన ఒక బాటసారి అతనికెదురుపడి కత్తి పోటు తిని ప్రాణాలు పోగొట్టుకుంటాడు. ఈ సంఘటన మడివాలు స్థిరప్రతిజ్ఞను ఋజువు చేస్తుండగా; మాచయ్య తన కత్తితో కుమ్మి ఆకాశానికి విసరివేసిన ఆ తెరువరి శవం కూడా కనపడకుండా మాయమై పోవడం - ఆ జంగమ భక్తుని వీరశైవ మత పారీణతనూ, మహా మహిమనూ చాటుతున్నది. ఈ సంఘటన మాచయ్యను "సాక్షాల్లింగమూర్తి" అని స్తుతించిన బసవేశ్వరుని మాటలకు ప్రత్యక్ష సాక్షీభూతంగా నిలుస్తున్నది. ఆనాటి నిరంకుశ వీరశైవమత వ్యవస్థకు ఒక ప్రతీక "మడివాలు మాచయ్య".

BRAOU

– ఆచార్య నాయని కృష్ణకుమారి

# భాగం 2 మూషిక మార్జాల సంవాదం

విషయక్రమం

2.0 ఉద్దేశం
2.1 ప్రవేశిక
2.2 సూచనలు
2.3 పాఠ్యం
2.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
2.3.2 వ్యాఖ్యానం
2.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం
2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
2.6 ఆకళింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు

## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- గద్య పద్యాత్మకమైన చంపూరచనా పద్ధతి
- లోకజ్ఞానానికి సంబంధించిన యుక్తాయుక్త విచక్షణ, మిత్రామిత్ర పద్ధతులు.
- విభిన్న పరిస్థితుల్లో సామాజికులు ప్రవర్తించే విధానాలు.

## 2.1 ప్రవేశిక

ఈ భాగం మార్గకవిత్వ పద్ధతికి చెందిన గద్యపద్యమయ చంపూరచనా విధానానికి సంబంధించింది. తిక్కన విరచితమైన ఈ పాఠ్యాంశం లౌకిక పరిజ్ఞానాన్నీ, యుక్తాయుక్త విచక్షణనూ ప్రతీకాత్మకమైన పాత్రల ద్వారా ప్రబోధిస్తుంది.

## 2.2 సూచనలు

లిఖిత సంప్రదాయానికి చెందిన ఈ ప్రాచీన కవిత్వపాఠ్యాన్ని అధ్యయనం చేసే ముందు తెలుగు భాష పదస్వరూపాన్నీ, సంధిస్వరూపాన్నీ, సమాసస్వరూపాన్నీ, అలంకారస్వరూపాన్నీ, ఛందస్సులోని వైవిధ్యాన్నీ తెలుసుకోవాలి. ప్రస్తుత పాఠ్యం మాత్రమేకాక, లిఖిత సంప్రదాయ సమగ్రావగాహనకోసం వీలైనంత వరకూ ప్రాచీన కవిత్వంలోని విభిన్న కావ్యాలను పరిశీలించాలి. 2.3.1, 2.3.2, 2.3.3 లలో ఇచ్చిన వివరాల ఆసరాతో 2.3 లో ఇచ్చిన పాఠ్యాన్ని అధ్యయనం చెయ్యాలి.

## 2.3 పాఠ్యం

సీ. అడవిలో నొకమఱ్ఱి యడుగున లాగలఁ
బలితుండు నా నొక్క యెలుక యుండు



BRAOU

నమ్మహీజము మీఁద ననిశంబు రోమశుం
డనుపిల్లి వసియించు; నాసమీప
మున సంజకడ నిత్యమును మృగంబుల కురు
లొడ్డి వేకువ వచ్చి యొక్కమాలి
దగపడ్డవానిఁ గొంచరుగు; నొకప్పు డా
హారంబునకుఁ బిల్లి యచటఁ దిరుగఁ

తే. బోయి యురిఁ బడియుండఁగఁ బొంచి చూచి
భయము దక్కి యచ్చోటన పలితుఁ డెరకుఁ
గ్రుమ్మరంగఁ జంద్రకుడను గూబపులుఁగు
హారికుఁడనుముంగియు నింతనంతఁ దోఁచె. 1

వ. ఎరలకై వచ్చి యిట్లు దోఁచిన నయ్యెలుక యారెంటిబారికిం దప్పిపోవరామి దలంచి
బెగ్గిలించుచు ధైర్యంబు కలిమిం గార్యం బూహించి యప్పిల్లిం గొండొక సేరం జనుచు
దానితో నిట్లనియె 2

క. ఉరి ద్రెవ్వ గొఱికి యిప్పుడు
వెరవారఁగ నీకు నేను విడుగర సేయం
దొరకొనుట నీదుభాగ్యం;
బరిత్వము దొఱంగి మైత్రి యలవఱుపు మదిన్ 3

క. ముంగికి గూబకు నగపడి
యంగంబులు వడఁకుచున్నయవి నాకిమ్మై
సంగతి గలిగిన నీయు
త్సంగంబున నుండి భయము దక్కుదు నేనున్ 4

చ. అనవుడుఁ బిల్లి యిట్టులను నార్తిశరణ్యుఁడ వయ్యె దిట్టి నీ
కనఘ! హితంబు సేయువఁడనయ్య? జగత్పతిసాక్షి గాఁగ ని
ప్పని దగఁ బ్రాలితిని వెఱవు బాచి ననుం గదియంగ రమ్ము వ
చ్చిన నకులంబు కాండయును జేరగ నేరవు నాకు నోడుటన్. 5

ఆ. అనిన నట్ల యగుట నాత్మ నెరింగియు
కాదె సంధియైన నాదుబ్రదుకు
నీదు విడుగరయును నిజమగుటూహించి
నిన్నుఁ జెందె బుద్ధి నిశ్చయంబు 6

క. అని పలికి పిల్లి పొదిగిట
ననయము నిశ్శంకవృత్తి నయ్యెలుక వసిం
చినఁజూచి యయ్యులూకం
బును నకులము నచటు వాసిపోయె నిజేచ్ఛన్ 7

క. నకులము నులూకమును బో
కకు సంతసమందియుండి గ్రక్కున నమ్మూ
షిక మయ్యురిచేరులు గొఱు
కక యలసత నల్లనల్లఁ గఱచుచు నుండెన్. 8

వ. అమ్మెయిఁ బలితుండు గొనకొని యయ్యురిం గొఱకకుండుట యెఱింగి
రోమశుం డిట్లనియె. 9

BRAOU

క. తగునే యిట్లు కృతార్థుఁడ
వగు నీకురి గొఱుకకిట్టు లాలస్యము సేఁ
త! గటా! కృతఘ్నతకు నెల
వగు టొప్పునె? కొఱుకు కడఁక నద్రోహుఁడవై. 10

క. ఉరిఁబాసి ఏమిదలఁతో
యరిత్వమున వినుము ప్రబలుఁడైన యతనితో
వెరవున సంధి యొనర్చియు
గరంబు నమ్మమియ నీతిగాఁ గొంద్రు బుధుల్ 12

ఉ. మాలనిరాక చూచి భయమర్దితమైన మనంబుతోడ న
క్కాలమునందు నీకుఁ జనగాఁ వలయున్ వెస మ్రానిపైకి; నా
యాలయముం జొరన్ సమయమప్పుడ నాకును; గాన యత్తఱి
న్మేలొనరింతు నమ్ము మిది నిక్కము గర్జము నీ వెఱుంగవే ! 13

క. అనవుఁడు నల్లెల తలఁప
వినుము, భవత్ప్రాణరక్ష వెసఁ జేసితి నే
ననఘా! నీవును నెమ్మెయి
నను నాపదఁ బాప వలదె నమ్మి రయమునన్. 14

ఆ. అనినఁ బిల్లి కిట్టులను నెల్క 'వేగిర
పడకు ముచితకాలభావ్యమైన
యత్నవిధి గదా సమగ్రఫలత్వంబు
నొందు; నొందు దలఁప కూరకుండు' 15

వ. అని యిట్లప్పలితుండును రోమశుండును నొండొరులతో మాటలాడుచుండ
వేకువయయ్యెనట్టియెడ. 16

క. తనతోఁ గొందఱు గుక్కల
గొని యేతేరంగఁ గేలఁ గ్రూరకృపాణం
బును భీకరభంగిన వెసఁ
జనుదెంచెన్ మాలఁడధిక సంరంభమునన్. 17

ఆ. పరిఘనాముఁడైన పాపాత్ముఁ గని భయ
మడరఁ బిల్లి యిట్టులనియె 'నింక
నేమి సేయువాఁడ నిదె వచ్చె జముదూత
వోలె సత్వరముగ మాల వాఁడు'. 18

క. అనిన విని 'యోడ కోడకు'
మనుచుం దెగఁగొరికె వేగ మయ్యురిఁ బలితుం
డనయముఁ జకితాత్ముండై
చనియెన్ రోమశుఁడు నవనిజముపైకి వెసన్. 19

చ. ఎలుకయు బొక్కలోపలికి నేఁగె ముదంబునఁ బొంచి చూడ సం
కులముగ నేఁగుదెంచి పరిఘుండురి నుగ్గగుటెల్లఁ జూచి ని
ష్ఫలతకుఁ జిత్త మెంతయు విషాదము నొందగబోయె; పిల్లియ
య్యెలుకకు నిట్లనుం జెవికి నింపగురీతి నుదాత్తభంగిగన్. 20

BRAOU

ఆ. మేలు సేసి తగినమిత్త్రినిఁ బడసి త
త్సుచరితముల వచ్చు సుఖము లనుభ
వింప ( జూచుటుడిగి వేర్పడి యుండుట
యరయ నీతివిదుల తెరువుగాదు. 21

### 2.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 1. | లాఁగ | = | బొఱియ, ఎలుక కన్నము. |
| | పంజకడ | = | సంధ్యావేళ |
| | మహీజము | = | భూమినుండి పుట్టినది, చెట్టు |
| | ఉరులు | = | ఉచ్చులు |
| | ఒడ్డి | = | పన్ని, ఏర్పాటు చేసి, |
| | దగపడ్డవాని | = | మోసపోయి ఉరులలో చిక్కినవానిని |
| | కొంచరుగు | = | తీసికొని వెడలు. |
| | ఎరకు | = | ఆహారమునకు |
| | క్రుమ్మరగ | = | తిరుగగా |
| | గూబపులుగు | = | గుడ్లగూబ |
| | మ్రింగి | = | ముంగిస. |
| | ఇంతనంత | = | ఇంతలో, ఈ క్షణమే. |
| 2. | బారికిందప్ప పోవరామి | = | బారినుండి తప్పించుకొని పోవుట కుదురక. |
| | బెగ్గలించి | = | భయపడి. |
| | ధైర్యంబు కలిమిన్ | = | ధైర్యమును కలిగియుండుట వలన |
| | కార్యంబూహించి | = | చేయబోవు పనిని మదిలో నిశ్చయించి. |
| 3. | త్రెవ్వగోరికి | = | తెగునట్లు కోరికి |
| | వెరవారగ | = | ఉపాయముచే |
| | విడుగర | = | విడుదల. |
| | దొరకొనుట | = | పూనుకొనుట |
| | మైత్రి కలవాటుపుమదిన్ | = | మనస్సును మిత్రత్వమునకలవాటు చేయుము. |
| 4. | అగపడి | = | కనపడి |
| | సంగతి | = | సాంగత్యం |
| | ఉత్సంగము | = | తొడ, ఒడి. |
| 5. | ఆర్తశరణ్యుడవు | = | ఆపద యందున్నవారికి శరణునిచ్చువాడవు. |
| | ఇప్పని దగ బూనితిన్ | = | ఈ పని చేయతలపెట్టితిని. |
| | వెఱపుబాసి | = | భయమును వీడి. |
| | కదియంగ రమ్ము | = | సమీపమునకు రమ్ము. |
| | నకులము | = | ముంగిస. |
| | నాకు నోడుటన్ | = | నాకు భయపడుటవలన |
| 6. | ఎఱుంగియు కాదె | = | తెలుసుకోవడం వలననే కదా ! |
| | నాదు బ్రదుకు | = | నా బ్రతుకు |
| | నీదు విడుగర | = | నీవు విడుదల యగుట |
| 7. | పొదిగిట | = | పొదిగిలిలో |
| | నిశ్శంకవృత్తి | = | సందేహరహిత ప్రవృత్తితో. |

BRAOU

| | | | |
|---|---|---|---|
| 8. | ఉలూకము | = | గుడ్లగూబ |
| | అచటు | = | ఆచోటు |
| | పాసిపోయె | = | విడిపోయెను. |
| | గ్రక్కున | = | వెంటనే |
| | ఉరి చేరులు | = | ఉచ్చునకు సంబంధించిన త్రాళ్ళు |
| | అలసతన్ | = | ఆలస్య భావముచే, మెల్ల మెల్లగా |
| | కొఱుకుటకు | = | కఱచుటకు ఉన్న అర్థభేదము |
| 9. | కొనకొని | = | పూని |
| 10. | కృతార్థుడు | = | నెరవేరిన పని కలవాడు |
| | ఆలస్యము సేత | = | ఆలస్యము చేయుట |
| | కొఱుకు | = | కొరుకు |
| | కృతఘ్నత | = | పాపం చేయడం., ముఖ్యంగా చేసిన మేలు మరిచిపోవడమనే పాపానికే దీన్ని ఉపయోగిస్తారు. |
| | అద్రోహుడవై | = | ద్రోహబుద్ధి లేనివాడవై |
| 11. | ఎల్క | = | ఎలుక పదమధ్యంలో ఉన్న బలహీనాచ్చుకు లోపం |
| | ఆశ్రితరక్షణశీలు | = | ఆశ్రయించినవారిని రక్షించు నడవడిక కలవానిని |
| | కీడున బొరయింతునే | = | కీడును కలుగ నిత్తునా |
| | చెడుగుందనము | = | చెడ్డతనం |
| | భీతిమానిన మదితోడ | = | భయము చెందిన మనస్సుతో |
| | నమ్మమిన | = | నమ్మక పోవుట వలన |
| | నెట్టన | = | శీఘ్రమే |
| | ఇయ్యురి త్రెంప నయ్యెడన్ | = | ఈ ఉచ్చును నేను తెంపుట లేదు. |
| | మనమున నెగ్గుగా గొనకు | = | దీనిని నీ మనస్సులో చెడుగా భావింపకు. |
| | మాలని | = | (ఉరులొడ్డిన) మాలవాని |
| | కాంచిన యప్డు | = | చూచిన సమయంలోనే |
| 12. | ఉరిబాసి | = | ఉచ్చునుండి వెలువడి |
| | ఏమి దలతో | = | ఏమని భావిస్తావో |
| | అరిత్వమున | = | శత్రుత్వంతో |
| | ప్రబలుడైన యతనితో | = | బలవంతుడైనవానితో |
| | వెరవున | = | నేర్పుచే |
| | నమ్మమియ | = | నమ్మకుండుటయే |
| | బుధుల్ | = | తెలివిగలవారు |
| 13. | మాలని రాకచూచి | = | బోయవాని రాకను చూచి |
| | భయమర్దితమైన | = | భయముచే పీడింపబడిన |
| | చనగా వలయున్ | = | వెళ్ళవలసియుండును |
| | మ్రానిపైని | = | చెట్టు మీదికి |
| | నా యాలయమున్ | = | నా యింటికి |
| | అత్తరిన్ | = | ఆ సమయమందు |
| | మేలొనరింతును | = | మేలు చేయుదును |
| | ఇది నిక్కము | = | ఇది నిజం |
| | కర్జము | = | (చేయదగిన) పని |

BRAOU

| | | | |
|---|---|---|---|
| 14. | ఆర్లేల తలప | = | ఆ విధంగా ఎందుకు ఆలోచించడం |
| | భవత్ప్రాణరక్షణ | = | నీ ప్రాణాలను రక్షించడం |
| | వెసచేసితి | = | శీఘ్రముగా చేసితివి |
| 15. | వేగిరపడకు | = | త్వరపడకు |
| | ఉచితకాల భావ్య | = | సరియైన సమయంలో చేయదగిన |
| | యత్నవిధి | = | ప్రయత్నము యొక్క ప్రకారం |
| | సమగ్ర | = | సంపూర్ణమైన |
| | ఫలత్వంబుపొందు | = | ఫలసిద్ధిని పొందును. |
| 17. | కేలన్ | = | చేతిలో |
| | క్రూర కృపాణము | = | బెడిదమైన కత్తి |
| | భీకర భంగిన్ | = | భయాన్ని కలిగించే పద్ధతిలో |
| | వెస | = | శీఘ్రంగా |
| | అధిక సంరంభమునన్ | = | మిక్కిలి ఆటోపంతో |
| 18. | పరిఘనాముడు | = | పరిఘుడు అనే పేరు కలవాడ |
| | జముదూతవోలె | = | యమభటునివలె |
| 19. | ఒడకోడకుము | = | భయపడకు భయపడకుము |
| | వేగము అయ్యురి | = | శీఘ్రముగా ఆ ఉచ్చును |
| | చకితాత్ముడై | = | రిచ్చపడిన మనస్సు కలవాడై |
| 20. | బొక్కలోపలికి | = | లాగలోపలికి |
| | పొంచిచూడ | = | తొంగి... |
| | చెవికి నింపగురీతి | = | కర్ణపేయమగునట్లు |
| 21. | సుచరితముల వచ్చు సుఖములు | = | ...మంచి నడవడిక వలన కలిగే సుఖాలు |
| | ఉడిగి | = | మానుకొని |
| | వేర్పడి యుండుట | = | వేరుగా ఉండుట |
| | తెరువు | = | మార్గము, పద్ధతి |

**2.3.2 వ్యాఖ్యానం**

ఈ పాఠ్యం తిక్కనసోమయాజి ఆంధ్రీకరించిన మహాభారతంలో శాంతి పర్వంలో, తృతీయాశ్వాసంలో ఉన్న ఒక కథ. చదువుకున్నవాళ్ళలో భారత కథను గురించి తెలియని వారెట్లా ఉండరో, తిక్కన పేరు వినని వారు కూడా అట్లా ఉండరు. భారతాంధ్రీకరణం చేసిన ముగ్గురు కవులూ ఉద్దండులు. భారతాన్ని ఆంధ్రీకరించడానికి ఆరంభించిన వాడు నన్నయ. ఆయన రెండున్నర పర్వాలు మాత్రమే తెనిగించి, ఏ కారణం వలననో అక్కడితో ఆగిపోయాడు. తర్వాత దాదాపు రెండువందల సంవత్సరాలు గడిచాక తిక్కన సోమయాజి భారతాంధ్రీకరణ కార్యాన్ని చేపట్టాడు. అయితే ఆయన, నన్నయ వదిలిపెట్టిన మూడవ పర్వాన్ని ముట్టుకోకుండా, నాలుగవ పర్వం నుండి చివరదాకా, తెలుగు చేశాడు. తర్వాత మరో యాభై యేండ్లకు సాహిత్య రంగంలో కాలుపెట్టిన ఎర్రాప్రెగడ నన్నయ వదలిపెట్టిన సగం పర్వాన్ని పూర్తిచేశాడు. ఆ విధంగా, పదకొండో శతాబ్దంలో నన్నయచే ఆరంభింపబడిన ఆంధ్రీకరణ కార్యం 14వ శతాబ్దంలోగానీ పూర్తికాలేదు.

అయినా తెలుగు భారతం తెలుగు సాహిత్యంలో అగ్రస్థానం పొందిన రచన. దీన్ని కావ్యమనీ, ఇతిహాసమనీ, మనిషి ఎంత మహాపురాణమనీ జనులు చెప్పుకున్నారు. ఇది ఒక విజ్ఞాన సరస్వం. మనిషి ఎంత ఉత్తముడు కాగలడో, ఎంత దుష్టుడు కాగలడో, ఎంత సామాన్యంగా జీవిస్తాడో, ఎంత ఉన్నతంగా ఆలోచిస్తాడో – ఆ జీవిత సంఘర్షణలన్నీ భారతంలో చిత్రీకరింపబడ్డాయి.

కవిత్రయం ముగ్గురిలో కథ చెప్పే పద్ధతి నన్నయగారికి బాగా తెలుసు. ఎంతో ప్రసన్నంగా, చెవికింపయిన మాటలతో గలగలలాడుతూ సాగిపోయే కథా కథన శిల్పం ఆయనది. ఈ పద్ధతిలో నన్నయను అద్వితీయుడుగా సాహితీ విమర్శకులు పరిగణిస్తారు.



BRAOU

భారతంలో అధిక భాగాన్ని అంటే సంపూర్ణంగా పదిహేను పర్వాలను ఆంధ్రీకరించిన తిక్కన ధోరణి వేరు. ఆయనకు సంస్కృత పదభూయిష్ఠమైన రచన చేయడం కన్నా తేట తెలుగు మాటలతో రచన సాగించడం ఇష్టం.

అట్లాగని, సంస్కృత సమాసాలతో కూడిన రచన చేయలేడని కాదు. ఈయన ఉభయ కవిమిత్రుడు, అంటే తెలుగు, సంస్కృతం రెండు భాషల్లోనూ సమానమైన ప్రజ్ఞతో రచన చేయగలిగినవాడు. కాని ఈయన అభిమానం ఎక్కువగా దేశ్యమైన తెలుగు తనం మీదనే, రచనా పరంగా ఈ తెలుగు తనం ఈయన భారతమంతా వెల్లివిరుస్తూ కనిపిస్తూ ఉంటుంది. ఈనాడు మన వాడుకలో లేకుండా మరుగుపడిపోయిన తెలుగు పదాలెన్నో తిక్కన భారతంలో కనిపిస్తాయి. తిక్కనకు తెలుగు పదాల శక్తీ, వాటి హృదయమూ తెలుసు. ఏ పదం ఎక్కడ వాడితే పఠితకు అవసరమై, బలమైన అర్థస్ఫూర్తి కలుగుతుందో ఆయనకు బాగా తెలుసు. చిన్న మాటలలో కొండంత బరువైన అర్థాన్ని పొదుగుతాడు. వేలెడంతలేని చిన్న కంద పద్యంతో, వీరావేశాన్నో, ఎత్తిపొడుపునో, జీవనసత్యాన్నో, అందమైన ఆకారాన్నో - ఆయన దేన్ని ఉద్దేశిస్తే దాన్ని స్పష్టంగా తీర్చిదిద్దుతాడు.

తిక్కన రచన నాటక ప్రదర్శనను స్ఫురింపజేస్తుంది. పాత్రల విషయాన్ని గూర్చి కవి కథ చెప్తున్నట్లుగా ఉండదు. ఆ పాత్రలే నాటక గత పాత్రలై, సమయోచితమైన అభినయ విశేషంతో, తమకు సంబంధించిన ఇతివృత్తాన్ని తామే సంభాషణాత్మకంగా మన ముందు అభినయిస్తాయి. కవి తన ఉనికిని మనకు తెలియనీయకుండా తెరవెనుక దాక్కునే సూత్రధారుడులాగా ఉండిపోతాడు. అందువల్ల ఈయన శైలిని నాటకీయశైలి అని మనం వ్యవహరిస్తాము.

వీరిద్దరి కంటే భిన్నంగా కనిపించేవాడు ప్రబంధ పరమేశ్వరుడైన ఎర్రన. ఆయనకు దేన్నైనా చక్కగా వర్ణించడమంటే యిష్టం. నన్నయ పూర్తి చేయకుండా విడిచిపెట్టిన భాగాన్ని పూరించేటప్పుడు మాత్రం ఎర్రన "తద్రచనయనన్" దాన్ని ఆంధ్రీకరించాడు. అందువల్ల అక్కడ మాత్రం నన్నయ కుండే కథా కథన శైలినే ఎర్రన పూర్తిగా స్వీకరించే ప్రయత్నం చేశాడు. కాని నిశితంగా పరిశీలిస్తే ఆయన ఇతర రచనలలో కనిపించే వర్ణనాత్మక లక్షణం ఇక్కడా కనిపిస్తూ ఉంటుంది.

ముగ్గురు ఉద్దండులైన మహా కవుల చేతుల్లో రూపుదిద్దుకుని, మూడు ప్రక్రియ రచనా మార్గాలకు తావలమైన గొప్ప కావ్యం తెలుగు మహాభారతం.

ఈ పాఠ్యభాగం ఇలా ఉన్నది -

అడవిలో ఒక మర్రిచెట్టు పాదప్రదేశంలో ఉన్న కలుగులో పలితుడు అనే పేరు గల ఎలుక నివసిస్తూ ఉండేది. ఆ చెట్టుమీదే రోమశుడు అనే పేరు కలిగిన పిల్లి ఉండేది. ఆ చెట్టు చుట్టుపట్ల సంధ్యవేళ, జంతువుల్ని పట్టుకునే నిమిత్తం ఒక మాలవాడు ఉచ్చులు పన్నేవాడు. తెల్లవారుఝామున ఆ ఉచ్చుల్లో మోసపోయి చిక్కుకున్న జంతువుల్ని తీసుకుపోతుండేవాడు. ఒకనాడు ఆహారం సంపాదించుకోవడానికి అక్కడ తిరుగుతూ పిల్లి ఉరులలో చిక్కుకుపోయింది. ఇది చూచి పిల్లివలన భయం లేకపోవడంచేత ఎలుక, ఆ పరిసర ప్రాంతాలలో ఆహారంకోసం తిరుగసాగింది. ఇంతలో ఆ ప్రాంతానికి చంద్రకుడనే పేరుకల గుడ్లగూబ, పాలికుడనే ముంగిస వచ్చి చేరుకున్నాయి. ఈ రెండూ ఎలుకకు భయాన్ని కలిగించేవి. కాని పిల్లి అంటే భయపడే జంతువులు.

ఆ రెంటి బారినుండి తప్పించుకుపోవడం కష్టమని గ్రహించిన ఎలుక భయపడి, ధైర్యంతో చేయవలసిన పనిని నిర్ణయించుకుని, పిల్లి దగ్గరికిపోతూ దానితో ఈ విధంగా అన్నది. "ఉచ్చును తెగకొరికి నేను నీకు విడుదల కలిగించడానికి పూనుకుంటాను. నేనట్లా నిర్ణయించుకోవడం నీ అదృష్టం. అందువల్ల నా మీద నీకు జన్మతో వచ్చే శత్రుత్వాన్ని విడిచిపెట్టి నీ మనస్సులో నా పట్ల స్నేహాన్ని అలవాటుచేసుకో.

ముంగికీ, గుడ్లగూబకూ కనపడి, వాటికి నేను లోకువ కనుక, నా శరీరం వణుకుతూ ఉంది. నీతో పొత్తు కుదిరితే నీ ఒడిలో చేరి నా భయాన్ని పోగొట్టుకుంటాను.

అని ఎలుక అనగానే, పిల్లి "ఆపద నుంచి కాపాడుతానన్న నీకు మేలు చేయవలసిందే. భగవంతుని సాక్షిగా, ఈ పని చేస్తాను. భయాన్ని అవతలకు నెట్టి నా చేరువకు రా. ముంగిస, గూబ నాకు భయపడేవి గనుక నీ జోలికి రావు" అన్నది.

BRAOU

అనగానే, "అట్లా జరగాలనే నేను ఆలోచించి నిశ్చయించుకున్నాను. సంధి మన యిద్దరికీ పొసగితేనే, నేను బ్రతికి ఉండడమూ, నీవు ఉచ్చులోనుండి తప్పించుకోవడమూ సాధ్యమవుతాయి."

అని ఎలుక పలికి, పిల్లి పొదిగిలిలో ఏమాత్రం జంకు లేకుండా చేరిపోయింది. ఇది చూచి, గూబ, ముంగిస (ఇక లాభంలేదనుకుని) తమ దారిన తాము పోయాయి.

ఆ రెండూ వెళ్ళిపోవడం చూచి, సంతోషపడి, వెంటనే ఆ ఉచ్చుతాళ్ళు తెగకొరకకుండా, మెల్లిమెల్లిగా, వాటిని నోటికి కరుచుకుంటూ జాప్యం చేయసాగింది.

పలితుడు ఇట్లా, పూనికతో ఉరితాళ్ళు కొరకకపోవడం చూచి రోమశుడు, "నీ పబ్బం గడుపుకుని, ఇప్పుడిట్లా ఉరి కొరకడంలో ఆలస్యం చేయడం బాగుందా? చేసినమేలు మరచిపోవడమనే పాపానికి నువ్వు తావలం కావడం తగదు. ద్రోహం చెయ్యకుండా ఉరి కొరికెయ్" అన్నాడు.

అప్పుడు ఎలుక, "ఆశ్రయించిన నన్ను రక్షించిన శీలం నీది. అటువంటి నిన్ను ఆపద పాలు కానిస్తానా? ఆ పని చాలా తప్పు. నా మనస్సులో నువ్వంటే భయం ఉంది. నిన్ను నేను నమ్మలేను కూడా. అందువల్ల వెంటనే ఈ ఉరి తెంపడం లేదు నేను. ఈ చేష్టవల్ల నేను నీకు ద్రోహం చేస్తున్నట్లుగా భావించకు. వేటగాడు రావడం చూచి, అప్పుడు తెంపుతాను."

"ముందుగా ఆ పని చేస్తే, ఆ ఉచ్చులో నుండి బయటికి రాగానే మనిద్దరికీ మధ్య ఉన్న సహజ శత్రుత్వాన్నిబట్టి ఏమని ఆలోచిస్తావో? తనకంటే బలవంతుడైన వానితో ఉపాయంగా, సఖ్యం కుదుర్చుకోవచ్చుగాని, అతనిని నమ్మకుండా ఉండడమే నీతి అని బుద్ధిమంతులు చెప్తుంటారు."

"వేటగాడు రావడంచూచి, నీ మనస్సు భయంతో పీడింపబడుతూ ఉంటుంది కనుక, (ఉరులు కొరకగానే) నీవు తొందరగా చెట్టుమీదికి ఎగబ్రాకుతావు. నేనూ నా కలుగులోనికి దూరిపోతాను. కాబట్టి ఆ సమయం చూసుకుని నీకు మేలు చేస్తాను. ఇదే చేయదగినపని అని నీకు మాత్రం తెలియదా?" అన్నది.

అంటే, "అట్లా ఎందుకనుకుంటావు? నీ ప్రాణాలు నేను (ఏ ఆలోచనా లేకుండా) వెంటనే కాపాడాను. నువ్వు అదే విధంగా నాకు కలిగిన కష్టాన్ని ఎందుకనే పోగొట్టవద్దా?" అన్నది పిల్లి.

ఆ మాటకు బదులుగా ఎలుక "తొందరపడకు సమయం, సందర్భం ఆలోచించి చేసే ప్రయత్నం వలననే పూర్తిగా ఫలితం లభిస్తుంది. ఇక ఈ విషయాన్ని గురించి నీవేమీ ఆలోచించకుండా గమ్మున ఉండు." అన్నది.

ఇట్లా ఆ రెండూ మాట్లాడుకుంటూ ఉండగానే తెల్లవారింది. అప్పుడు వేటగాడు, తనతోపాటు కొందరు కుక్కల్ని తీసుకుని వస్తుండగా, చేతిలో పెద్ద భయంకరమైన కత్తి పట్టుకుని ఎంతో సంబరంతో తొందర తొందరగా రాసాగాడు.

ఆ వేటగాని పేరు పరిఘుడు. ఆ పాపాత్ముని చూచి, "యమకింకరుడికి మల్లే ఇదుగో వేటగాడు వస్తున్నాడు. ఇంక నేనేంచేసేది" అని పిల్లి తత్తరపడసాగింది.

అది విని భయపడకు, భయపడకు అంటూ చకచక ఆ ఉచ్చును ఎలుక తెగకొరికింది. భయంతో మతిపోయినట్లుగా తయారైన పిల్లి వెంటనే చెట్టుమీదికి చేరిపోయింది.

ఎలుక కూడా కలుగులో చేరి (తాను చేసిన పనికి) సంతోషంగా, అక్కడనుండి పొంచి పొంచి చూడసాగింది. అంతలో వేటగాడు, అతని పరివారం బిలబిలమంటూ అక్కడికి వచ్చి ఉచ్చు మొత్తం నుగ్గునుగ్గయిపోయి ఉండడం చూచి, విచారంగా వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. తర్వాత పిల్లి ఎలుక దగ్గరకువచ్చి చెవికి ఇంపుకూర్చే మాటలతో "ఒక మేలుచేసి, సరియైన స్నేహితుణ్ణి పొందగలిగిన నువ్వు ఆ మిత్రుని మంచితనంవల్ల వచ్చే సుఖాలను పొందడం మానేసి, ఇట్లా వేరుగా ఎందుకుండి పోవడం? న్యాయం తెలిసిన వారెవ్వరూ ఈ పని చెయ్యరు" అన్నది.

BRAOU

2.3.3 విశేషాంశాలు

తిక్కన గారికి సంస్కృత సమాస భూయిష్ఠమైన రచన చేయడంకన్నా తేట తెలుగు పదాలతో దేశ్యమైన రచన చేయడమంటే చాలా యిష్టం. 'అలతి అలతి పలుకుల కాహళ సంధించిన విధంగా' కవిత్వం చిన్న చిన్న తెలుగు మాటలతో, అనంతమైన అర్థ గాంభీర్యాన్ని సంతరించుకునేదిగా ఉండాలని ఆయన అభిప్రాయం. అల్పమైన అక్షరాలతో అనల్పమైన రచన చేయడంమీద ఆయనకు ప్రీతి యెక్కువ.

ఈ లక్షణం ఆయన కవిత్వమంతటా పూసలలో దారం చొరబారినట్లుగా, వ్యాపించి ఉంటుంది.

ఈయనకు శబ్ద సౌందర్యంమీద కన్నా, అర్థ గాంభీర్యం మీద దృష్టి యెక్కువ. శక్తిమంతాలయిన సమకాలికాలయిన తెలుగు మాటలు ఈయన రచించిన భారతంనిండా కనిపిస్తాయి. 700 సంవత్సరాలు గడిచిన తరువాత, ఈనాడు మనకు తిక్కనగారు వాడిన స్వచ్ఛమైన దేశ్యమైన భాష మారుమూల పదాలతో కూడిన భాషగా కనిపించవచ్చు. కాని తెలుగు భాషకు గల తీయదనమంతా తిక్కనగారి భారతంలో కుప్పపోసి ఉందనడంలో అతిశయోక్తి లేదు.

తిక్కనగారి పద్యాలు చిన్న చిన్న వాక్యాలు సాగినట్లుగా సాగుతాయి. కవిత్వంలో అతి ప్రభావవంతమైన అంశంగా చాలా మంది కవులు భావించే విపుల వర్ణనా విధానం వీరి పద్యాలలో ఎక్కువగా చోటు చేసుకుంటుంది.

తిక్కన గారు ఒక విధంగా మానసిక తత్త్వవేత్త. సమయ సందర్భాలననుసరించి, ఒక్కొక్కరు ఎలా ప్రవర్తిస్తారో, అటువంటి ప్రవర్తనను ఆయన ఖచ్చితంగా దర్శించి, దాన్ని తన పాత్రలకు ఆరోపిస్తారు. భారతం వ్యాసముని ప్రణీతమైనదైనా, తిక్కన దాన్ని తెలుగు చేయడానికి పూనుకున్నా, తిక్కన తీర్చిన భారతం తెలుగు వారి మనస్తత్వాన్ని పొదుగుకున్న గ్రంథమే అనిపిస్తుంది. అట్లా అనిపించడానికి ముఖ్యకారణం తిక్కన అందులో చూపించిన సజీవ పాత్రావిష్కరణ పద్ధతి.

మీ పాఠ్య భాగంలోని పాత్రలు తిర్యక్కులు (జంతువులు) ఎలుక, పిల్లి, గూబ, ముంగిస. ఇవి నాలుగూ పాత్రలు! పిల్లికి ఎలుకకూ మధ్యనున్న జాతి వైరాన్ని బలాబలాలనూ ఆధారంగా చేసుకుని, రాజనీతిని బోధించిన కథ ఇది. బలహీనుడు, బలవంతుని సహాయాన్ని, అతడు తన శత్రువైనా చాకచక్యంగా పొంది, తన ఆపదను గడవపెట్టుకోవచ్చునన్నది ఆ నీతి.

BRAOU

**అభ్యాసం – 1**

చంపూ పద్ధతి అంటే ఏమిటి ?

**అభ్యాసం – 2**

ఆపదనుండి పలితుడు ఎలా తప్పించుకున్నాడు ?

## అభ్యాసం – 3

తిక్కన రచనావిధానం వివరించండి ?

---

## 2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత సంప్రదాయంలోని ప్రాచీన కవిత్వంలో గద్య పద్యాత్మకమైన చంపూరచనా పద్ధతికి చెందింది ప్రస్తుత పాఠ్యం.
- ఈ రచనా పద్ధతినే మార్గపద్ధతి అనికూడా అంటారు.
- ఈ పాఠ్యం తిక్కన సోమయాజి రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం నుండి గ్రహింపబడింది.
- ఈ పాఠ్యంద్వారా అలతిమాటల్లో అనల్పార్థాలను సంతరించే తిక్కన్నగారి రచనా పద్ధతి తెలియవస్తున్నది.
- సంభాషణాత్మకమైన కవితారచనద్వారా తిక్కన తన కవిత్వంలో వెలయించే నాటకీయమైన పద్ధతి ఈ పాఠ్యం ద్వారా గ్రహించవచ్చు.
- యుక్తాయుక్త విచక్షణా పూర్వకమైన లౌకిక జ్ఞానం, సంభాషణా చాతుర్యాన్ని ప్రకటించే రాజకీయ పరిజ్ఞానం, లోకంలోని విభిన్న వ్యక్తుల ప్రవర్తనల తీరూ ఈపాఠ్యం ద్వారా కవితాత్మకంగా ప్రస్ఫుటమౌతున్నాయి.

BRAOU

## 2.5 మాదిరి పరీక్షాప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. తిక్కన చిన్న చిన్న మాటల్లో ఎంతో గొప్ప భావాన్ని పొదుగుతాడన్న, విషయాన్ని మీ పాఠ్యం ద్వారా నిరూపించండి.
2. ఈ కథ ఇతివృత్తాన్ని నేటి సమాజానికి అన్వయించి చూపండి.

II. ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. సలితుడు ఉరి కొరకడంలో ఎందుకు జాప్యం చేశాడు.
2. ఈ పాఠ్యంలోని ఇతివృత్తం ప్రత్యేకత ఏమిటి ?

## 2.6 ఆకళింపు ప్రశ్నలు

1. తిర్యక్కులు పాత్రలుగా ఉన్న ఇతర ప్రాచీన కవిత్వ భాగాలను దీనితో పోల్చి చూడండి.

2. తిక్కన కవితా లక్షణమైన అలతి అలతి పదాల విన్యాసానికి మీ పాఠ్యం నుండి ఉదాహరణలను ఏరి ఒక చోట రాయండి.

### అభ్యాసాలకు జవాబులు

1. కవిత్వ రచనలోని శబ్ద సంయోజనంలో వ్యాకరణ మర్యాదలు పాటిస్తూ, అలంకార శాస్త్ర సమ్మతంగా, ఛందోబద్ధంగా, సాగిపోయే కవిత్వ పద్ధతిని మార్గ కవిత్వం అంటారు. అవసరమైన చోట వచనాన్ని వాడుకుంటూ గద్యపద్యమయంగా ఉండే ఈ పద్ధతికి 'చంపూ పద్ధతి' అనికూడా పేరు. ఆర్షమత సంప్రదాయ విశ్వాసాలనూ, ఆచారాలనూ పాటించే పౌరాణిక గాథలు ఇతివృత్తంగా ఉండటం కూడా మార్గకవిత్వ లక్షణమే. ఈ లక్షణాలతో కవిత్రయం నుండి ఆ తర్వాత ఎంతో కాలం వరకూ తెలుగు సాహిత్యంలో కొనసాగి వచ్చిన సంప్రదాయ కవిత్వమంతా మార్గపద్ధతికి చెందిందే.

2. పలితుడు ఒక ఎలుక. ఒక మర్రి చెట్టు తొర్రలో ఆ ఎలుక నివాసం. తమకు జన్మ శత్రువైన పిల్లి బోయవాని ఉరిలో తగుల్కున్నది గదా అని నిర్భయంగా ఎలుక తిరుగుతుండగా, దాని కోసం ఒక గూబ, ఒక ముంగిస సమీపించసాగాయి. వెంటనే చతుర మతి కలిగిన ఎలుక చిప్పున వలలోని పిల్లి దగ్గరకు చేరి, నన్ను నువ్వు ఈ శత్రువుల బారి నుండి రక్షిస్తే నేను నీకు ప్రత్యుపకారంగా వల కొరికి నిన్ను వేటకాని బారినుండి రక్షిస్తానన్నది. అందుకు పిల్లి సమ్మతించగానే శీఘ్రగమనంతో ఎలుక, పిల్లి పొదిగిటిలోనికి చేరింది. పిల్లికి భయపడి గూబ, ముంగి, నిరాశతో తిరుగుముఖం పట్టాయి. తన వల్ల ముందు ముందు పిల్లికి సహాయం కావలసి ఉండడం వలన - పిల్లి ఎలుకకు జాతి వైరం ఉన్నా హాని చేయలేక పోయింది. ఆ విధంగా పలితుడు తనకు రానున్న ఆపదను తప్పించుకొన్నాడు.

3. తిక్కనకు కఠిన సమాసభూయిష్ఠంగా రచనచేయడం కన్నా "అలతి అలతి పలుకులకాహళ సంధించిన విధంగా" తేటతెలుగు మాటలతో, నుడికారాలతో కవిత్వాన్ని రాయడం ఇష్టం. ఈ పద్ధతినే విమర్శకులు "అల్పాక్షరముల ననల్పార్థరచన" అన్నారు. ఎంతో గంభీరమైన, విస్తృతార్థం కలిగిన భావాలైనా చిన్న చిన్న మాటల్లోనే పొదగడం అని పై మాటలకు అర్థం. తెలుగు భాషలోని తియ్యదనమంతా తిక్కన భారతకవిత్వ భాగంలో జాలువారుతున్నది. ఈయనకు శబ్దాడంబరం కన్నా, అర్థగాంభీర్యమే ముఖ్యం. పిల్లి అండన చేరి ముంగిసనూ, గుడ్లగూబనూ తప్పించుకున్న ఎలుకతో ఈ పాఠ్యంలోని పిల్లి 'రోమశుడు' పలికిన ఈ అలతి పలుకుల్లో తిక్కన పాటించే అర్థగాంభీర్య దృష్టి వెల్లడౌతుంది.

"తగునే యిట్లు కృతార్థుడ
వగు నీకురి గొరుకకిట్టు లాలస్యముసే
తకటా ! కృతఘ్నతకు నెల
వగు టొప్పునె? కొఱుకు కడక నదొ్రిహుడవై."

ఈ చిన్న పద్యంలోనే కథను చెప్పుకుంటూ పోవడం మాత్రమే కాక, కథలోని పాత్రల మనోభావాలు చిత్రించడంతో పాటుగా, "కృతార్థుడైనవాడు మేలుచేసినవారిపట్ల కృతఘ్నత ప్రదర్శించడం తగని పని" అనే నైతిక సందేశాన్ని కూడా అందిస్తున్నాడు తిక్కన. ఈ లక్షణమేకాక అవసరం వచ్చినప్పుడు అతి దీర్ఘ సమాసాలతో విపుల వర్ణనాత్మకంగా కూడా రచిస్తాడు తిక్కన సోమయాజి. "ఆర్తశరణ్యుడవు, జగత్ప్రతి సాక్షిగాగ" వంటి ఈ పాఠ్యంలోని పదబంధాలు అందుకొక ఉదాహరణం.

– ఆచార్య నాయని కృష్ణకుమారి

BRAOU

Dr. BRAOU LIBRARY
Acc. No: CM-0 384
Class No:

# భాగం 3  ఆంధ్రదేశ వర్ణన

## విషయక్రమం


3.0 ఉద్దేశం

3.1 ప్రవేశిక

3.2 సూచనలు

3.3 పాఠ్యం

  3.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

  3.3.2 వ్యాఖ్యానం

  3.3.3 విశేషాంశాలు

**అభ్యాసం – 1**

**అభ్యాసం – 2**

**అభ్యాసం – 3**

3.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

3.6 ఆకళింపు ప్రశ్నలు

  అభ్యాసాలకు జవాబులు


## 3.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలను వివరించగలుగుతారు.

- తెలుగు కవిత్వంలోని ప్రౌఢ సాంప్రదాయ వర్ణనా పద్ధతి
- అలంకార, సమాస వైఖరుల పరిణతి
- శ్రీనాథుని వంటి పూర్వ్య మహాకవులకు జన్మభూమి మీదా, పుణ్యక్షేత్రాల పట్లా ఉన్న భక్తి గౌరవాలు.

BRAOU

## 3.1 ప్రవేశిక

వర్ణనా ప్రాధాన్యమైన ప్రాచీన కవిత్వ పద్ధతిని ఈ భాగం ద్వారా మీరు తెలుసుకుంటారు. ఈ పాఠ్య రచయిత కవిసమ్రాట్ శ్రీనాథ మహాకవి. అతని పద్యకావ్యం "భీమేశ్వర పురాణం" అనే గ్రంథంలోనిది ఈ భాగం.

## 3.2 సూచనలు

ప్రాచీన కవిత్వంలోని ఈ భాగాన్ని అధ్యయనం చేసే ముందు తెలుగు భాష పద స్వరూపాన్నీ, సంధి స్వరూపాన్నీ, సమాస స్వరూపాన్నీ, అలంకార స్వరూపాన్నీ, ఛందస్సులోని వైవిధ్యాన్నీ తెలుసుకోవాలి. ప్రస్తుత పాఠ్యం మాత్రమే కాక, లిఖిత సంప్రదాయ సమగ్రావగాహన కోసం వీలైనంతవరకూ ప్రాచీన కవిత్వంలోని విభిన్న కావ్యాలను పరిశీలించాలి. 3.3.1, 3.3.2, 3.3.3 లలో ఇచ్చిన వివరాల ఆసరాతో 3.3లో ఇచ్చిన పాఠ్యాన్ని అధ్యయనం చెయ్యాలి.

## 3.3 పాఠ్యం

మ. పరమర్షుల్ భృతరోమహర్షులయి లోపాముద్రయుం దారునం
బరమధ్యంబున నావహంబను జగ త్త్రాణప్రవాహంబుపై
బరిలంఘించిరి భుక్తిముక్తి రమణీ ప్రత్యగ్రలీలాస్పయం
వరసౌధంబగు భీమమండలము సర్వంబున్ విలోకింపగన్. 1

సీ. ఆంధ్ర భూభువన మధ్యము పుండరీకంబు, సప్తగోదావరీ జలము తేనె,
బ్రహ్మ సంవేద్యాది బహుతీర్థములు రేకులకరులు చారుదివ్యస్థలములు
నాళంబు లవణాబ్ధి వేలావిభాగంబు కళ్యాణ భోగమోక్షములు, తావి
దక్షవాటీ మహాస్థానంబు కర్ణిక, హంసంబు భీమనాయకుడు శివుడు

తే. గౌతమీ సింధు కౌంతేయ కణ్వనదులు తుల్యభాగయు వేలేరు తుమ్మికొనలు
భువన సంభావ్యమైన యీ పుణ్యభూమి యనఘ సంసార తాపశాంత్యౌషధంబు. 2

సీ. సర్వంసహకు గాసెసమకట్టు పుట్టంబు గగనంబునకు నల్లగలువసెజ్జ
యవటంబు మేఘవాహను గంధకరటికి నభ్యవహార మౌర్వాగ్ని శిఖకు
వంటిల్లు యామినీశ్వర కళామౌలికి   దరిచోటు నిఖిలబృందారకులకు
గూటకచ్ఛపనాయకునకు నిశాంతంబు మరుజనకునకును మనికిపట్టు.

తే. ఘనతరోద్దండ పాఠీన కమఠ నక్ర తిమి తిమింగల చక్ర విక్రమవిహార
ఘుమఘుమారంభ గంభీర ఘోషఘటిత రటదిశాప్రతిశబ్దోపలబ్ధి యబ్ధి. 3

సీ. జనమేజయారబ్ధసర్పాధ్వరాహూత చక్షుశ్శ్రవస్సహస్రముల బోరి
బ్రహ్మాండమండలప్రాసాద సంభార హరిమణిస్తంభసంహతులనంగ
జంభారిదోస్తంభదంభోళి ఖండితాంజనశైల శిఖరపుంజములనేసి
సంహారసమయ ఝుంఝూమారుతోద్ధూత కాలాంబువాహసంఘములగెలిచి

తే. యాడుచున్నవి తింత్రిణ్ణి యంబరమున శేషుమన్నవి త్రిభువనాశ్లేషకంబు
నబ్జనాభుని తూగుటుయ్యెలలుగంటె నేవేళ పయోరాశివీచిఘటలు. 4

BRAOU

శా. కాశిం జచ్చినయంతగాని పడయంగారాని కైవల్య మ
క్లేశంబై, సమవేద్యనాయకునిచే లీలాగతింజేరు రా
రో శీఘ్రంబున మర్త్యులారయను నారూపంబునన్మ్రోయునా
కాశాస్ఫాలన గౌతమీ జలధి సంగస్థానకల్లోలముల్. 5

మ. అదె సంవేద్యము, కోటిపల్లి యదె, దక్షారామ మన్పట్టణం
బదె యభ్రంకషసౌధకూట ఘనహేలావాస ముచ్చ్రాయసం
పద సొంపారెడు భీమలింగము మహాప్రాసాదభూమీధరం
బిదె సప్తర్షినదీప్రవాహ మిదె, సంవీక్షింపు మేకాగ్రతన్. 6

సీ. అదె పట్టిస స్థానమందుండు వీరభద్రేశ్వరస్వామి యర్ధేందుమౌళి
యదె పుండరీకాద్రి యచట మార్కండేయునిలవేల్పు ముక్కంటి వెలసె ద్రాక్షి
యదె కుమారారామ మాహర్మ్యరేఖయ చాళుక్యభీమేశుసదనవాటి
యదె కుక్కుటేశ్వరంబయ్యుపాంతమునేడ హుంకారిణీదేవి యోలగంబు

తే. వాడె మా యింటివేల్పు పల్వలపురమున గొప్పులింగంబు ఫణిరాజకుండలుండు
సప్తముని సింధుసంగమేశ్వరుడు వాడె కుండలాముఖమదె మౌనికులవరేణ్య. 7

కం. అని చూపి చెప్పి కుంభజు
డినుగనుగొని శుభముహూర్త మిదె యేతెంచెన్
మనము దిగవలయు ననుచును
మునిమండలి మ్రోల దిగిరి ముగురున్ ధరకున్. 8

### 3.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

1. పరమర్షుల్ = మహాఋషులైన వ్యాస, అగస్త్యులు
భృతరోమహర్షులయి = పులకించిన శరీరాలతో
తారు = తాము
అంబరమధ్యంబున = ఆకాశమధ్యంలో
అవహంబు = అవహమనే (పేరున్న)
జగత్ ప్రాణప్రవాహంబుపై = లోకాలకు ప్రాణమైన గాలి ప్రవాహం మీద
పరిలంఘించిరి = పైకెక్కిరి
భుక్తిముక్తిరమణీ = భోగమోక్షాలనబడే రమణుల
ప్రత్యగ్ర = నూత్నమైన, స్వచ్ఛమైన
లీలాస్వయంవరసౌధమగు = విలాసవంతమైన స్వయంవర భవనమైన
భీమమండలము సర్వంబున్ = భీమేశ్వర ప్రాంతం మొత్తాన్ని
విలోకింపగన్ = చూడటానికి

2. ఆంధ్రభూభవనమధ్యము = ఆంధ్ర ప్రాంత మధ్యభాగం
పుండరీకంబు = తెల్లతామరపువ్వు
తీర్థములు = పుణ్యస్నాన ఘట్టాలు
అకరులు = తామర దుద్దు మొదలైన వానిచుట్టూ ఉండేవి, కింజల్కాలు
చారు = అందమైన
లవణాబ్ధి = సముద్రం (బంగాళాఖాతం)
వేలావిభాగంబు = చెలియలికట్ట ప్రాంతం
కర్ణిక = తామర దుద్దు
సంభావ్యము = గౌరవింపదగినది
సంసార తాపహరణౌషధంబు = సంసారబాధను శాంతపరచే మందు

3. సర్వంసహకు = సర్వమును సహించు భూదేవికి
కాసె సమకట్టుపుట్టంబు = నడుముకు బిగించే కాసె వస్త్రం
గగనంబునకు = ఆకాశానికి
నల్లకలువసెజ్జ = నల్లకలువపూల శయ్య
అవటంబు = జలక్రీడాస్థలం
మేఘవాహను గంధకరటికి = మేఘవాహనుడైన ఇంద్రుని మదగజమైన ఐరావతానికి
అభ్యవహారము = ఆహారం, తిండి
ఔర్వాగ్ని శిఖకు = ఔర్వమనే పేరుగల అగ్నిజ్వాలకు
యామినీశ్వరకళామౌళికి = రేరాజైన చంద్రుని కళను శిరంపై ధరించిన ఈశ్వరునికి
తరిచోటు = చిలికే చోటు
నిఖిల బృందారకులకు = సకల దేవతలకు
కూటకచ్ఛపనాయకునకు = కపట కూర్మావతారానికి
నిశాంతంబు = విశ్రాంతి
మరుజనకునకును = మన్మథుని తండ్రి అయిన విష్ణువునకు
మనికి పట్టు = ఉండే తావు
ఘనతర = గొప్పదైన

BRAOU

| | | |
|---|---|---|
| ఉద్దండ | = | పొడవైన |
| పాఠీన | = | కొరమీనులు |
| కమఠ | = | తాబేళ్ళు |
| నక్ర | = | మొసళ్ళు |
| తిమి | = | పెద్దచేప |
| తిమింగలాలు | = | పెద్దచేపలను తినే జలచరాలు |
| చక్ర | = | జక్కవ పిట్టలు |
| ఘోషఘటితరట | = | (సముద్ర) ఘోషతో కూడిన ధ్వనివల్ల |
| దిశాప్రతిశబ్ద | = | దిక్కులకొనల్లో పుడుతున్న ప్రతిధ్వనిని |
| ఉపలబ్ధి అబ్ధి | = | పొందినదైన సముద్రం |

4\.

| | | |
|---|---|---|
| జనమేజయ + ఆరబ్ధ + సర్ప + అధ్వర + ఆహూత | = | జనమేజయుడు మొదలు పెట్టే సర్పయాగానికి ఆకర్షింపబడిన |
| చక్షుశ్శ్రవస్సహస్రముల | = | అనేక సర్పాలను |
| బ్రహ్మాండమండలప్రాసాద | = | బ్రహ్మాండమండలమనే పెద్ద భవంతిని |
| సంభార | = | బాగుగా భరించే |
| హరిమణి స్తంభసంహతులు | = | ఇంద్రనీలమణుల స్తంభసమూహాలు |
| జంభారిదోస్తంభదంభోళి | = | ఇంద్రుని యొక్క స్తంభాల వంటి భుజాలతో ప్రయోగించిన వజ్రాయుధంచే |
| ఖండిత + అంజనశైల శిఖర పుంజములు | = | ఖండించబడిన అంజనాద్రి శిఖరసమూహాలతో |
| సంహార సమయ | = | ప్రళయకాలంలో |
| ఝుంఝామారుత | = | సుడిగాలులతో |
| ఉద్ధూతకాల + అంబువాహ + సంఘముల | = | ఎగరగొట్టబడిన నల్లని మేఘాల సమూహాలతో |
| తీంద్రిల్లి | = | ప్రకాశించి |
| అంబరమున | = | ఆకాశాన |
| త్రిభువన + ఆశ్లేషకంబు | = | ముల్లోకాల్ని కౌగిలించుకోవడం |
| అబ్జనాభుని | = | విష్ణువు యొక్క |
| వేనవేలు | = | వేలకువేలు |
| పయోరాశివీచిఘటలు | = | సముద్రపు అలల గుంపు |

5\.

| | | |
|---|---|---|
| కైవల్యము | = | మోక్షం |
| అక్లేశంబై | = | ఏమాత్రం కష్టంలేకుండా, సునాయాసంగా |
| సమవేద్య | = | సంవేద్యపుణ్యక్షేత్రంలో ఉండే |
| నాయకునిచే | = | దేవునిచేత |
| లీలాగతి | = | అవలీలగా |
| మర్త్యులారా | = | మానవులారా |
| ఆకాశ + ఆస్ఫాలన | = | ఆకాశాన్ని చరిచే |
| గౌతమీ జలధి సంగస్థాన కల్లోలముల్ | = | గౌతమీ, సముద్రాల సంగమస్థానంలోని అలలు |

6\.

| | | |
|---|---|---|
| అభ్రంకష సౌధకూటఘన హేల | = | ఆకాశాన్నంటే భవనంలో విలాసంగా కాపురముండే నివాసము |
| ఉచ్చాశ్రియసంపద | = | గొప్పదైన సంపద |
| మహాప్రాసాద భూమీధరంబు | = | గొప్ప భవంతి అనే పర్వతం |



BRAOU

| | | |
|---|---|---|
| | సప్తర్షినదీ ప్రవాహంబు | = సప్తగోదావరీ ప్రవాహం |
| | సంవీక్షింపుము | = చూడండి. |
| 7. | అర్ధేందుమౌళి | = చంద్రవంక తలను దాల్చే శివుడు |
| | ఆ హర్మ్యరేఖయ | = ఆ భవంతి సమూహం |
| | సదనవాటి | = ఇండ్ల వరుస |
| | ఉపాంతము | = సమీపం |
| | ఓలగంబు | = ఆస్థానం |
| | మౌళికులవరేణ్య | = మునులలో శ్రేష్టుడా! |
| 8. | కుంభజుడు | = అగస్త్యుడు |
| | ఇనుగనుగొని | = పొద్దు చూసి |
| | శుభ ముహూర్త | = శుభ సమయం |
| | మ్రోల | = ఎదరు |

### 3.3.2 వ్యాఖ్యానం

శ్రీనాథుడు పండిత కవి (1385 - 1475). తర్వాతి తరాలవారికి కావ్యశైలిలో మార్గదర్శి.

తెలుగు సాహిత్యంలో ఉండే మూడు విధాలయిన కావ్యానువాదాలకు శ్రీనాథుడు గురువు. సంస్కృతంలో 'నైషధమ్ విద్వదౌషధమ్' అని పేరు పొందిన ప్రౌఢకావ్యాన్ని అనువదించాడు. శ్రీనాథుడు 'చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు' మరుత్తరాట్చరిత్ర; 'నూనుగు మీసాల నూత్న యవ్వనమున' శాలివాహన సప్తశతి;'నిండు జవ్వనంబునయందు' 'శృంగారనైషధం'; 'ప్రౌఢనిర్భరవయః పరిపాకమున' 'భీమేశ్వర పురాణం'; 'ప్రాయమంతకు మిగుల గైవ్రాల కుండ' 'కాశీఖండం' రచించాడు. హరవిలాసం ఇతని మరో రచన. శివరాత్రి మాహాత్మ్యం ఈయన తుది రచన అంటారు. క్రీడాభిరామం శ్రీనాథుడు రాసినాడనే అభిప్రాయం కూడా ఉంది.

శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో ఆంధ్రదేశంలోని పుణ్యస్థలాల వర్ణన చేశాడు. అందునా భీమ మండలం వర్ణన సమగ్రంగా చేశాడు. దక్షారామం, క్షీరారామం, అమరారామం, కుమారారామం, సోమారామం అనే పంచారామాలను; గోదావరి నుంచి పాయలైన తుల్యభాగ, వృద్ధగంగ వంటి వాటిని చిత్రించాడు. గోదావరిని 'గౌతమీ గంగ' అని ఎన్నోసార్లు పిలిచాడు.

దక్షారామాన్ని 'దక్షిణకాశి' గా చిత్రించాడు. నాటి ముక్తిప్రదమైన భీమమండాలాన్నే గాక భోగప్రదమైన దక్షారామ వార వనితల సౌందర్యాన్నీ, భుక్తిప్రదమైన గోదావరీ ప్రాంత సస్యశ్యామలత్వాన్నీ ప్రతిభావంతంగా చిత్రించాడు. శ్రీనాథుని కావ్యాల్ని పరిస్తే నాటి ఆంధ్రదేశంలో చాలా భాగం ఎలా ఉండేదో మనకు స్థూలంగా తెలుస్తుంది.

ఆంధ్రదేశంలోని భూముల్ని, అక్కడ లభించే కూరగాయలనీ, గోదావరీ మండలంలోని నదులు, కొండలు, గుడులు, క్షేత్రాలు, ఆరామాలు, తీర్థాలు మొత్తం రమణీయంగా ఆంధ్రతామ్రుద్రలో వర్ణించాడు. తెలుగు కవులలో స్వదేశాన్ని ఇంత మక్కువతో తనివితీరా వర్ణించిన ప్రాచీన కవి మరొకడులేడు. పాఠ్యభాగం ఇలా ఉన్నది -

మహర్షులైన వ్యాస అగస్త్యులు, రోమహర్షుని తమలో కలుపుకొని లోపాముద్రతో కూడా ఆకాశమధ్యాన ఆవహమనబడే వాయుమండలంపై అధిష్టించారు. వారు భోగమోక్షరమణులకు విలాస స్వయంవర సౌధమైన సర్వభీమ మండలాన్ని దర్శించడం కోసమే అలా చేశారు.

ఆంధ్రదేశ మధ్య భాగం తెల్లతామర పువ్వు, సప్తగోదావరీ జలం, మకరందం (తేనె). బ్రహ్మ సంవేద్యం మొదలైన పుణ్య తీర్థాలు పూరేకులు. అందమైన దేవాలయాలు కింజల్కాలు. తామర నాళం సముద్రపు చెలియలికట్ట. శుభప్రదాలైన భోగం, మోక్షం, సువాసనలు. దక్షవాటి మహాక్షేత్రం తామర దుద్దు. రాజహంస భీమనాయకస్వామి, గౌతమీ, సింధు, కౌంతేయ, కణ్వ, తుల్యభాగ, ఏలేరు నదులు స్వామి పూజకు



BRAOU

వినియోగించే తుమ్మి కొనలు. భూమండలంలో గౌరవార్హమైన ఈ భీమ మండల పుణ్యభూమి సంసార తాపాన్ని శాంత పరచేది.

కాశీ వియోగంతో సంతాపతప్తుడైన వ్యాసుడు దక్షిణ కాశికి వస్తున్నాడు. అగస్త్య దంపతులు ఆహ్వానించారు.

ఓంకారపుర ప్రాంతం నుండి నింగి కెగసి, కన్నుల పండువుగా భీమ మండల పుణ్యక్షేత్రం చూద్దామని అగస్త్యుడు చెపితే వ్యాసుడంగీకరించాడు.

లోపాముద్రాగస్త్యులు, వ్యాసుడు ఆకాశం నుండి గమనించిన భీమ మండలం చిత్రం ఈ సీస పద్యంలో విపులంగా చిత్రించాడు శ్రీనాథుడు.

ఈ సముద్రం భూదేవికి కాసె వస్త్రం. నింగికి నల్ల కలువల శయ్య. ఇంద్రుని ఐరావతానికి జలక్రీడాస్థలం. ఔర్వాగ్ని శిఖలకు తిండి. ఈశ్వరునికి వంటిల్లు. సకల దేవతలకు చిలికే చోటు. కూర్మావతారానికి విశ్రాంతి స్థలం. విష్ణువుకు నివాసం. గొప్పవి, పొడవైనవి అయిన క్రౌంచమీనులు, తాబేళ్ళు, మొసళ్ళు, తిమింగలాలు, జక్కవపిట్టల, విక్రమ విహారానికి తావు. ఘుమఘుమ వినిపించే గంభీర ఘోష దిక్కులకు తగిలి ప్రతిధ్వనిస్తుంది. అగస్త్యుడు, వ్యాసుడు, లోపాముద్ర ఆకాశానికెగసి భీమ మండలాన్ని చూస్తున్న సందర్భం ఇది. అగస్త్యుడు తమకు కనిపించే సముద్రాన్ని వర్ణిస్తున్నాడు.

"జనమేజయుని సర్పయాగానికి వచ్చిన వేలకు వేల పాములా అన్నట్లు" బ్రహ్మాండ మండలమనే భవంతిని నిలిపిన ఇంద్రనీలాలస్తంభాలో అన్నట్లు – ఇంద్రుని వజ్రాయుధంతో తెగగొట్టబడిన అంజనాద్రి శిఖరాల్తో పోటీపడి – ప్రళయకాల ఝంఝామారుతంతో ఎగరగొట్టబడిన నీలమేఘాల్ని గెలిచి విష్ణువుకు తూగుటుయ్యేలలయిన కడలి అలలు వేలకు వేలు ఆకాశమంత ఎత్తు ఎగసి ఆడుతున్నాయి.

కాశిలో మరణిస్తేనేగాని రానిముక్తి సులభంగా సంవేద్యనాయకుని వల్ల మీకు లభిస్తుంది. శీఘ్రంగా రండి, ఓ మానవులారా అన్నట్లుగా శబ్దిస్తూ గౌతమీ సముద్ర సంగమ స్థలంలోని అలలు ఆకాశాన్నంటుతూ ఎగుస్తున్నాయి.

వ్యాసమునీ, అదే సంవేద్యం. అదే కోటిపల్లి. దక్షారామమనే పట్టణమదే. ఆకాశాన్నంటే భవనంలో సంపదలతో సొంపారే భీమలింగం ఉండే పర్వతంలాంటి మహా ప్రాసాదం ఇదే. సప్తగోదావరం ఇదే. ఏకాగ్రతతో బాగుగా దర్శించు.

ఓ మునిశ్రేష్ఠా! అదే అందులో వీరభద్రేశ్వరస్వామి ఉన్నాడు. అదే కమలాద్రి. అచట మార్కండేయుని ఇలవేల్పు అయిన ముక్కంటి పూర్వం వెలిశాడు. అదే కుమారారామం. ఆ భవనాల వరుస చాళుక్య భీమేశ్వరుని నివాసస్థానం. అదే కుక్కుటేశ్వరం. ఆ సమీపంలోని మేడ హుంకారిణీదేవి ఆస్థానం. ఆ పల్వలపురంలో ఉండే కొప్పు లింగేశ్వరస్వామి మా యింటి ఇలవేల్పు. సప్తమునిసింధు సంగమేశ్వరుడు అతడే. అదే కుండలాముఖ తీర్థం." ఈ సీసపద్యంలో భీమమండలంలోని ముఖ్య దేవాలయాలు, దేవతలూ, పుణ్య తీర్థాలు ప్రస్తుతింపబడ్డాయి. శైలి సరళంగా ఉంది.

అగస్త్యుడు సూర్యుని చూచి శుభ ముహూర్తం సమీపించింది మనం భూమికి దిగవలెనని చెప్పగా, మునిమండలి ఎదుర లోపాముద్రాగస్త్యులు వ్యాసుడు ముగ్గురూ దిగారు.

### 3.3.3 విశేషాంశాలు

'ఆవహం' ఏడు విధాలైన వాయువుల్లో ఒకటి. భూలోకానికి సంబంధించింది. ఆవహం అంటే భూలోకస్వర్లోకాల మధ్య ఉండే ప్రాంతం అని కూడా అర్థం ఉంది. ఆ విధంగా గ్రహించినా అర్థం సరిపోతుంది.

**అలంకారాలు**

అభేదరూపకం: భీమమండలము – ఉపమేయము, భుక్తిముక్తి రమణీలీలా స్వయంవర సౌధము: ఉపమానము, ఎన్నోసార్లు శ్రీనాథుడు, భీమమండలాన్ని భోగ, మోక్షాలకాటపట్టుగా వర్ణించాడు. భక్తిని ముక్తిని రమణులకు అభేదంగా చెప్పడం అభేదరూపకాలంకారం.



BRAOU

ఉపమాలంకారం : "ఆంధ్ర భూభువన మధ్యము పుండరీకంబు, సప్త గోదావరీ జలముతేనె"

అనే ఈ పద్యమంతా ఉపమాలంకార సమన్వితమై ఉంది. సర్వావయవ సమగ్రమైన పోలిక. ఉపమానానికి ఉపమేయానికి చక్కని సమన్వయం ఉంది. ఈ పద్యంలోని ఉపమేయ ఉపమానాల్ని ఇలా వింగడించవచ్చు.

| ఉపమేయం | ఉపమానం |
| --- | --- |
| ఆంధ్రభూమధ్యం | పుండరీకం |
| సప్తగోదావరి జలం | తేనె |
| బ్రహ్మసంవేద్యాది తీర్థాలు | రేకులు |
| దివ్యస్థలాలు | కింజల్కాలు |
| కళ్యాణ భోగ మోక్షాలు | తావి (వాసన) |
| దక్షవాటి మహాస్థానం | కర్ణిక |
| భీమనాయకుడైన శివుడు | హంసము |
| గౌతమీ, సింధు, కౌంతేయ, కణ్వ, తుల్యభాగ, ఏలేరు | తుమ్మికొనలు |
| ఈ పుణ్యభూమి | సంసార తాప శాంతి చేసే ఔషధం |

**ఛందస్సు, ఔచిత్యం**

విషయ విస్తృతికి చిన్న చిన్న పద్యాలు సరిపోవు. అంతేగాక, చిన్న పద్యాలు వాడితే విషయం, భావం తెగిపోతాయి. అందుకే ఇక్కడ శ్రీనాథుని వర్ణనా విపులత, సర్వసంపూర్ణమైన పోలికల్తో చెప్పడానికి సీసం ఎంతో చక్కగా పనికివచ్చింది.

ఇందులో శైలి ధారాళంగాను, పాదార్థానికి తెగిపోతూ ఒక్కో అంశాన్ని విడదీసి చెప్పేట్లు ఉంది. ఒకటి అరాతప్ప కఠినపదాలే లేవు.

కవి సముద్రాన్ని అనేక వస్తువులతో పోల్చి వర్ణిస్తున్నాడు. భూదేవికి నడుముకట్టు (కాసె)గా, గగనానికి నల్లకలువ శయ్యగా ఉత్ప్రేక్షిస్తున్నాడు. కనుక ఉత్ప్రేక్షాలంకారం. సముద్రము భూమికి ఒక పాయలాగా ఉంటుంది. కనుక ఈ అలంకారం సమంజసంగా ఉంది.

ఘుమఘుమారంభ గంభీర ఘోషఘటిత అన్న చోట 'ఘ' కార ఆవృత్తి - వృత్త్యను ప్రాస.

అలలు నిరంతరంగా ఎగుస్తున్నాయి. పాములు నాలుకలు చాస్తున్నట్లుగా, అందునా సర్పయాగాగ్నిలో పడుతున్న పాములు అనడం, అసంఖ్యాకం వెంట వెంట అని చెప్పడానికి, ఎక్కడనుంచో లాగబడిన పాములు తలకిందులుగా యాగాగ్నిలో పడడం అలలు ఉవ్వెత్తుగా లేచి తలవంచినట్లు అణగిపోవడంలాగే ఉంటుంది.

బ్రహ్మాండమండలం సౌధం అయితే మోయడానికి చాలా స్తంభాలు కావాలి. నీళ్ళు నీలంగా ఉంటాయి. అందుకే ఇంద్రనీలమణి నీలం రంగుగల అలలు అంజనాద్రి (కాటుక కొండ) శిఖరాలకన్నా పెద్దవి. అవి భూమిని మోసే స్తంభాలు.

పాముల్తో పోరడం - అంజనశైల శిఖరాల్తో పెనగడం - మేఘాలను గెలిచి, బ్రహ్మాండానికి స్తంభాలా అన్నట్లున్నాయనడం ఉత్ప్రేక్షాలంకారం. కడలి అలలు త్రిభువనాశ్లేషం చేస్తున్నవని చెప్పడం అతిశయోక్తి. అలల్ని అబ్జనాథుని తూగుటుయ్యేలలు అనడం రూపకం.

మర్త్యులార : అనేది సాభిప్రాయ విశేషణం. మృతి పొందేవారు మానవులు. ఎలాగూ మరణం తప్పదు కాబట్టి బ్రతికుండగానే సంవేద్యనాయకుని భజించి ముక్తిని పొందండి అని చెప్పడంలో పరికాలంకారం ఉంది.



BRAOU

మహోన్నిహిపాద భూమిధరము : రూపకాలంకారం. భీమలింగం చాలా పొడవైనది. గుడి రెండంతస్తులు. రెండో అంతస్తుకు ఎక్కి వెళ్తేనే భీమలింగం దర్శనం. కాబట్టి గుడికూడా ఎత్తుగా ఉందని చెప్పడం.

## అభ్యాసం – 1

దక్షిణకాశి అంటే ఏమిటి?

## అభ్యాసం – 2

శ్రీనాథుడు చేసిన "ఆంధ్రదేశ వర్ణన" సమీక్షించండి.

BRAOU

## అభ్యాసం – 3

"భీమమండలం ఒక తెల్లతామర పువ్వు" అనే అంశాన్ని సమర్థించండి.

## 3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత సంప్రదాయంలోని ప్రాచీన కవిత్వంలో చంపూ పద్ధతికి చెందిన మార్గకవిత్వం ప్రస్తుత పాఠ్యాంశం.
- ఇది వర్ణనా ప్రధానమైన రచన.

- ఈ పాఠ్యం శ్రీనాథ మహాకవి రచించిన "భీమేశ్వర పురాణం" నుండి గ్రహింపబడింది.
- దీనిద్వారా ఆంధ్ర మహాకవుల వర్ణనాత్మక రచనా పద్ధతీ, ప్రధానంగా శ్రీనాథ మహాకవి రమణీయకవిత్వ మహత్వమూ వెల్లడౌతున్నాయి.
- సీసపద్యం మీద శ్రీనాథ మహాకవికున్న మక్కువా, అధికారమూ ఈ పాఠ్యంద్వారా తెలుస్తున్నాయి.
- కవిసమ్రాట్‌కు మాతృభూమిమీద ఉన్న మమకారం, పవిత్రక్షేత్రాలపట్ల ఉన్న భక్తిభావం ఈ కవిత్వంలోని వర్ణన ద్వారా ప్రస్ఫుట మౌతున్నాయి.
- తెలుగులో సమాసఘటనా, అలంకార వైచిత్రీ ఎంతటి ఉన్నతదశకు తీసుకుపోయే వీలున్నదో ఈ ప్రౌఢకవిత్వం ప్రకటపరుస్తున్నది.

## 3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పైపంక్తుల్లో జవాబు రాయండి.

శ్రీనాథుని వర్ణనా వైభవాన్ని విశదీకరించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

శ్రీనాథుని రచనలను క్లుప్తంగా వివరించండి ?

## 3.6 ఆకళింపు ప్రశ్నలు

1. తిక్కన పద్యరచనతో శ్రీనాథుని పద్యరచనను పోల్చిచూస్తే, మీకు కనిపించే విశేషాలేమిటో పరిశీలించండి.
2. సీసపద్యాన్ని తిక్కన, శ్రీనాథుడు వేరు వేరు ప్రయోజనాలకు వాడుకున్నారని చెప్పటానికి ఆధారాలు వెతకండి.
3. పద ప్రయోగంలోనూ, సమాస ప్రయోగంలోనూ తిక్కన, శ్రీనాథుల మధ్యభేదాన్ని గమనించండి.
4. తిక్కన, శ్రీనాథుల రచనాసంవిధానాల్లో తారతమ్యాల్ని పరిశీలించండి.
5. ఈ భాగంలో వచ్చిన అలంకారాల నిర్వచనాలను కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గారు నిర్వహించిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము ద్వితీయ సంపుటం నుంచి తీసి ఇస్తున్నాం. మీ సలహాదార్ల సహాయంతో మీ పాఠ్యభాగంలోని పద్యాలకు అన్వయించి చూడండి.

   అ) అతిశయోక్తి : లోకసిద్ధమై యున్న వస్తువుయొక్క స్థితి నతిక్రమించి చెప్పుట అతిశయోక్తి.

   ఆ) అప్రకృత (ఉపమాన) : గతములైన గుణక్రియాదుల సంబంధముచే ప్రకృతమును (ఉపమేయమును) అప్రకృతముగ (ఉపమానముగ) భావించుట ఉత్ప్రేక్ష.

   ఇ) పరికరాలంకారము : విశేషణములు సాభిప్రాయముగ జెప్పబడినచో పరికరము.

   ఈ) రూపకాలంకారము : ఉపమేయమును కప్పిపుచ్చక దానియందు ఉపమానము నారోపించిన యెడల రూపకము.



BRAOU

## అభ్యాసాలకు జవాబులు

1. విశ్వనాథుడు విశాలాక్షితో కలిసిఉన్న పుణ్యక్షేత్రం ఉత్తరభారతదేశంలోని కాశీనగరం. దాని ప్రక్కన ప్రవహిస్తున్నది సర్వపాపవిభంగ ఐన గంగానది. అక్కడ మరణిస్తే ముక్తి నిశ్చయమని భారతీయుల విశ్వాసం. ఈ విశ్వాసం ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని వివరించేదే. అలాగే దక్షిణ భారతదేశంలోని సప్తగోదావరీ తీరాన ఉండే 'కోటిపల్లి' దగ్గరి 'దక్షారామం' కూడా కాశీనగరంతో సమానమని భారతీయుల విశ్వాసం. ఇక్కడి స్వామి భీమనాయకుడు. దక్షిణ దేశంలో ఉన్న ఈ క్షేత్రం కాశీతో సమానమైంది కాబట్టి దీన్ని 'దక్షిణ కాశీ' అంటారు.

2. సముద్రం భూదేవి తన నడుముకు కట్టుకున్న కాసె వస్త్రం లాంటిది. ఆకాశానికి నల్లకలువ సెజ్జలాంటిది. ఇంద్రుని పట్టపుటేనుగైన ఐరావతానికి జలక్రీడా స్థలం; ఔర్వమనే అగ్నిశిఖకు తిండి, చంద్రమౌళీశ్వరునికి వంటిల్లు. సకల దేవతలకు చిలికేచోటు. అది కూర్మానికి ఇల్లు. విష్ణువుకు నివాస స్థానం. ఉద్దండమైన కొరమీనులు, తాబేళ్లు, మొసళ్ళు, తిమి, తిమింగల, జక్కవలు విహరించే స్థలం. ఘుమఘుమ అని గంభీరంగా ఘోషిస్తుండే ఆ శబ్దం దిగంతాలకు తాకి ప్రతిధ్వనిస్తోంది సముద్రం.

జనమేజయుడు చేసిన సర్పయాగానికి ఆహుతి కాబోతూ నాలుకలు చాచిన వేలాది పాములను మించి బ్రహ్మాండ మండలం అనే ప్రాసాదానికి ఇంద్రనీలమణి స్తంభ సమూహాలా అనేట్లు, ఇంద్రుడు భుజబలంతో ప్రయోగించిన వజ్రాయుధంచేత ఖండితమైన అంజనాద్రి శిఖరాల గుంపులతో పెనగి, ప్రళయ సమయంలో వీచే ఝంఝామారుతాల్తో ఎగురగొట్టేయబడిన నల్లని మేఘాల్ని గెలిచి, విజృంభించి ఆకసాన ఆడుతూ ముల్లోకాల్ని కౌగిలిస్తున్నట్లున్నాయి వేలకు వేలైన సముద్రపు అలలు. పద్మనాభుని తూగుటుయ్యేలలా ఒక సీసపద్యంలో సముద్రాన్ని మరో సీసపద్యంలో సముద్రతరంగాల్ని చిత్రించాడు శ్రీనాథుడు.

ఏ విషయాన్నైనా వివిధ దృక్కోణాల్నుంచి స్వయం సంపూర్ణంగాఉండేట్లు చిత్రించగలిగే శక్తి శ్రీనాథునిలో పుష్కలంగా వుంది. దానితో పాటు పురాణాల్లోని సంఘటనల్ని వర్ణనలకు వినియోగించుకొనడంలో శ్రీనాథునికి శ్రీనాథుడే సాటి. సముద్రం భూదేవికి నల్లని కాసెలాగా ఉంది. నింగి సుందరికి నల్లకలువ సెజ్జ. అబ్ది శబ్దం గొప్పదని చాటడానికి ఆ శబ్దం దిగంతాల దాకా వినవస్తోందని చెప్పడం జరిగింది.

రెండో పద్యంలో ముల్లోకాల్ని ఆశ్లేషించే కడలి ప్రకృతి వర్ణన. అలలు పాములు నాలుకలు చాస్తున్నట్లు చెప్పడంలో సర్వలోకాల్నుంచి ఆకర్షింపబడిన పాములు సందులేకుండా నాలుకలు చాస్తూ జనమేజయుని సర్పయాగకుండంలో పడడాన్ని సూచిస్తుంది.

అలలు ఉవ్వెత్తుగా ఎగసిపడడం చూస్తే బ్రహ్మాండం అనే భవనానికి ఇవి ఇంద్రనీలమణి స్తంభాల్లాగా కనబడడం వింతేమీకాదు. ఇంద్రుని వజ్రాయుధానికి భయపడి అంజనాద్రి సముద్రంలో దాక్కొన్నది. అయినా కొన్ని శిఖరాలు తెగకతప్పలేదు. అసలే అంజన శైలం అంటే కాటుక కొండ. దాని శిఖరాలు తెగిపడినందువల్లనేమో అన్నట్లు సముద్రం ముదురు నీలంలా ఉంది అన్న ఉత్ప్రేక్షలో సామంజస్యం కనిపిస్తుంది. తూగుటుయ్యేల ఎవరికైనా సుఖనిద్రను ప్రసాదించేలాగా కడలి అలలు. కమలనాథుని తూగుటుయ్యేలలైనవి. శ్రీనాథుని విషయ పరిజ్ఞానం, రచనా రామణీయకత, ఊహా వైభవం సముద్ర వర్ణనలో సంపూర్ణంగా కన్పిస్తుంది.

3. సప్తగోదావరీ వాహినుల స్వచ్ఛోదకం తేనె. బ్రహ్మ సంవేద్యమైన పుణ్యక్షేత్రాలు రేకులు. సౌందర్య నిలయాలైన దేవాలయాలు కేసరులు. సముద్రపు చెలియలికట్ట తామరతూడు. భోగమోక్షాలు తామర పువ్వు వాసనలు. దక్షవాటిక తామరదుద్దు. భోగమోక్షాలు తామర పువ్వు వాసనలు. వీటితో అలరారే ఆంధ్రదేశ మధ్యభాగమైన భీమమండలం ఒక తెల్లతామర పువ్వు. ఆ పావన సీమలో ప్రవహించే గౌతమి, సింధు, కణ్వ, తుల్యభాగ, ఏలేరునదులు స్వామి పూజకు ఉపయోగపడే తుమ్మికొనలు. ఆ భీమమండలంలో విహరించే భీమనాయకస్వామి ఒక రాజహంస – అంటూ ఈ విధంగా మనోహర రీతిలో భీమమండలాన్ని వర్ణించాడు శ్రీనాథ మహాకవి.

– ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి



BRAOU

# భాగం 4 కుచేలోపాఖ్యానము

## విషయక్రమం


4.0 ఉద్దేశం
4.1 ప్రవేశిక
4.2 సూచనలు
4.3 పాఠ్యం
    4.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    4.3.2 వ్యాఖ్యానం
    4.3.3 విశేషాంశాలు
4.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
4.6 ఆకలింపు ప్రశ్నలు
    అభ్యాసాలకు జవాబులు


## 4.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- ప్రాచీన కవిత్వ పద్ధతిలోని ఉపాఖ్యాన స్వరూపం
- పోతన కవితా రీతులు

## 4.1 ప్రవేశిక

భారత భాగవత రామాయణ మహారచనల్లో ఎన్నో ఉపాఖ్యానాలున్నాయి. ఉపాఖ్యానం ద్వారా ఆ గ్రంథాలు ధార్మిక సూత్రాలనూ, వ్యక్తి జీవితంలోని విభిన్న రంగాల్లోని వైశిష్ట్యాన్నీ, పురాణగాథలనూ, కథలనూ చిత్రిస్తాయి. అలాంటి వాటిలో ఒకటి ఆంధ్రమహాభాగవతంలోని ఈ "కుచేలోపాఖ్యానము". ఈ ఉపాఖ్యానం ప్రధానంగా భగవంతుని కరుణామయతత్వాన్ని ప్రతిపాదిస్తున్నది. ఇది సహజ పాండిత్యుడని ప్రతీతి వహించిన భక్త కవి పోతనామాత్యుని రచన.

BRAOU

## 4.2 సూచనలు

ప్రాచీన కవిత్వంలోని ఈ భాగాన్ని అధ్యయనం చేసే ముందు తెలుగు భాష పద స్వరూపాన్నీ, సంధి స్వరూపాన్నీ, సమాస స్వరూపాన్నీ, అలంకార స్వరూపాన్నీ, ఛందస్సులోని వైవిధ్యాన్నీ తెలుసుకోవాలి. ప్రస్తుత పాఠ్యం మాత్రమే కాక, లిఖిత సంప్రదాయ సమగ్రావగాహనకోసం వీలైనంత వరకూ ప్రాచీన కవిత్వంలోని విభిన్న కావ్యాలను పరిశీలించాలి. 4.3.1., 4.3.2., 4.3.3., లలో ఇచ్చిన వివరాల ఆసరాతో 4.3 లో ఇచ్చిన పాఠ్యాన్ని అధ్యయనం చెయ్యాలి.

## 4.3 పాఠ్యం

సీ. అనుడు వేదవ్యాసతనయుడా యభిమన్యుతనయుని జూచి యిట్లనియె బ్రీతి
జనవర గోవిందసఖుడు కుచేలుండు నా నొప్పు విప్రుండు మానధనుడు
విజ్ఞానరాగాది విరహిత స్వాంతుండు శాంతుండు ధర్మవత్సలుడు ఘనుడు
విజితేంద్రియుడు బ్రహ్మవేత్త దారిద్ర్యంబు బాధింప నొరులగార్పణ్యవృత్తి 1

తే. నడుగబోవక దనకు దానబ్బినట్టి కాసుపదివేల నిష్కముల్గా దలంచి
యాత్మ మోదించి పుత్రదారాభిరక్ష యొకవిధంబున నడుపుచునుండునంత

సీ. లలిత పతివ్రతాతిలకంబు వంశాభిజాత్య తద్భార్య దుస్సహ దరిద్ర
పీడచే గడునొచ్చి పెదవులు దడుపుచు శిశువులాకటిచిచ్చుచే గృశించి
మలమల మాడుచు మానసంబెరియంగ బట్టెడో రెము మాకుబెట్టుమనుచు
బత్రభాజన ధృతపాణులై తనుజేరి వేడిన వీనులు సూడినట్ల

తే. యైన నొకనాడు వగచి నిజాధినాథుజేరి యిట్లని పలికే నో జీవితేశ
తట్టుముట్టాడునట్టి పేదరికమిట్లు నొంప దీనికుపాయమూహింపవైతి 2

వ. అని మఱియు నిట్లనియె. 3

గీ. బాలసఖుడైన యప్పద్మపత్రనేత్రు గాన నేగి దరిద్రాంధకారమగ్ను
లయిన మము నుద్ధరింపుము హరికృపాకటాక్షరవిదీప్తినడసి మహాత్మ నీవు 4

వ. మరియును 5

చం. వరదుడు సాధు భక్తజన వత్సలు డార్తశరణ్యు డిందిరా
వరుడు దయాపయోధి భగవంతుడు కృష్ణుడు దా గుశస్థలీ
పురమున యాదవ ప్రకరముల్ భజియింపగ నున్నవాడు నీ
వరిగిన మిమ్ము జూచి విభుడప్పుడయిచ్చు ననూన సంపదల్ 6

మ. కలలోనందనుమున్నెఱుంగని మహాకష్టాత్ములై నట్టి దు
ర్బలు డాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబులుల్లంబులోన్
దలపన్నంతనె మెచ్చి యార్తిహరుడై తన్నైన నిచ్చున్ సుని
శ్చలభక్తిన్ భజియించువారికిడడే సంపద్విశేషోన్నతుల్ 7

కం. అని పలికిన నమ్మానిని, సునయోక్తులకలరి భూమిసురుడాకృష్ణున్
గననేగుట యిహపరసాధనమగునని మది దలంచి తన సతి తోడన్ 8

గీ. నీవు చెప్పినయట్ల రాజీవనేత్రు, పాదపద్మంబు లాశ్రయింపంగ నేట
పరమశోభన మా చక్రపాణికిపుడు, కానుకేమైన గొంపోవగలదె మనకు 9

గీ. అనిన నయ్యింతి యౌగాక యనుచు విభుని చినిగి వస్త్రంబు కొంగున బృథుకతండు
లముల నొక కొన్ని ముడిచి నెయ్యమున నొసగ, జనియెగోవింద దర్శనోత్సాహియగుచు 10

### 4.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| 1. వేదవ్యాస తనయుడు | = | శుకమహర్షి |
| అభిమన్యు తనయుడు | = | పరీక్షిన్మహారాజు |
| సఖుడు | = | స్నేహితుడు |
| మానధనుడు | = | అభిమానవంతుడు |
| విరహిత | = | లేని (పోగొట్టబడిన) |
| స్వాంతుండు | = | మనస్సుగలవాడు |
| విజిత + ఇంద్రియుడు | = | జయించిన ఇంద్రియములు గలవాడు, మనోనిగ్రహము గలవాడు |
| బ్రహ్మవేత్త | = | వేదములు చదివినవాడు (జ్ఞాని) |
| కార్పణ్య వృత్తి | = | యాచక వృత్తి |
| నిష్కముల్ | = | నాణెములు |
| మోదించి | = | సంతోషపడి |

| | | | |
|---|---|---|---|
| 2. | లలిత పతివ్రతా తిలకంబు | = | సుకుమారమైన ఆ పతివ్రతామణి |
| | వంశాభిజాత్య | = | గొప్పవంశములో పుట్టినది |
| | తద్భార్య | = | అతని భార్య |
| | దుస్సహ | = | భరింపరాని |
| | దరిద్ర పీడచే | = | లేమివల్ల కలిగే బాధచే |
| | కడునొచ్చి | = | మిక్కిలి బాధపడి |
| | శిశువులు | = | బిడ్డలు |
| | ఆకటి చిచ్చుచే | = | ఆకలి బాధతో |
| | మానసంబెరియంగ | = | హృదయ విదారకంగా (మనస్సుబాధపడేట్లుగా) |
| | పట్టెడోరెము | = | పిడికెడన్నం |
| | పత్రభాజన ధృతపాణులై | = | ఆకులు, గిన్నెలు చేతబట్టుకొని |
| | వీనులు సూడినట్లయ్యైన | = | చెవులు (ఆ దైన్యపు పలుకులు వినలేక) బాధపడగా |
| | నిజాధినాథుడు | = | తన భర్త |
| | తట్టుముట్టు + ఆడునట్టి | = | చుట్టుకొన్న |
| | పేదరికము | = | బీదతనము |
| | ఒంప | = | బాధపెట్టగా |
| | ఊహింపవైతి | = | ఆలోచించకున్నావు. |
| 4. | బాలసఖుడు | = | బాలస్నేహితుడు |
| | అప్పద్మపత్రనేత్రు | = | ఆ తామరేకులవంటి కనులు కలవానిని (కృష్ణుని) |
| | కాననేగి | = | చూచుటకు వెళ్లి (వెళ్లిచూచి) |
| | దరిద్రాంధకారమగ్నులయిన | = | లేమి అనే చీకటిలో మునిగిన |
| | ఉద్ధరింపుము | = | కాపాడు (పైకితీయుము) |
| | హరి | = | శ్రీ, కృష్ణుని యొక్క |
| | కృపాకటాక్ష | = | దయగల చూపులనే |
| | రవిదీప్తిపడసి | = | సూర్యకాంతిని పొంది |
| 6. | వరదుడు | = | వరమిచ్చేవాడు |
| | సాధుభక్త జనవత్సలుడు | = | ఉత్తములను, భక్తులను కరుణతో చూచేవాడు |
| | ఆర్తశరణ్యుడు | = | ఆపన్నులను కాపాడేవాడు |
| | ఇందిరావరుడు | = | లక్ష్మీపతి |
| | దయాపయోధి | = | సముద్రమంత విశాలమైన కరుణగలవాడు |
| | కుశస్థలీ పురమున | = | ద్వారకా నగరంలో |
| | యాదవ ప్రకరముల్ | = | యాదవ సమూహాలు |
| | భజియింపగ | = | కొలవగా |
| | నీవరిగిన | = | నీవు వెళ్లిన |
| | అప్పుడయిచ్చు | = | అప్పటికప్పుడే ఇచ్చును |
| | అనూన సంపదల్ | = | తక్కువగాని ఐశ్వర్యాలు (కోరినన్ని సంపదలు) |
| 7. | కలలో నందను మున్నెఱుంగని | = | కలలో కూడ తనను (కృష్ణుని) స్మరించని |
| | మహాకష్టాత్ముడైనట్టి | = | గొప్ప కఠినచిత్తుడైన |
| | ఆపత్సమయంబునన్ | = | కష్టకాలంలో |
| | నిజ పదాబ్జాతంబులు | = | తన పాదపద్మాలు |
| | ఉల్లంబులోన్ | = | మనస్సులో |
| | తలపన్నంతనె | = | తలచిన వెంటనే |
| | ఆర్తిహరుడై | = | బాధను పోగొట్టువాడై |



BRAOU

| | | | |
|---|---|---|---|
| | తన్నైన | = | తనను తానైనను |
| | నిశ్చల భక్తిన్ | = | చలించని భక్తితో |
| | భజియించువారికిడడే | = | కొలిచినవారికి ఇవ్వడా |
| | సంపద్విశేషోన్నతుల్ | = | విశిష్టమైన, ఐశ్వర్యపూర్వకమైన ఉన్నత స్థితి |
| 8. | అమ్మానిని | = | ఆ స్త్రీయొక్క |
| | సునయోక్తులకు | = | నీతిదాయకమైన మాటలకు |
| | అలరి | = | సంతోషపడి |
| | భూమిసురుడు | = | బ్రాహ్మణుడు |
| | కననేగుట | = | చూడటానికి వెళ్లటం |
| | ఇహపరసాధనమగునని | = | ఇహపరసుఖాలను పొందటానికి వీలవుతుందని |
| | తన సతితోడన్ | = | తన భార్యతో |
| 9. | రాజీవనేత్రు | = | పద్మదళాలవంటి కన్నులు గలవానిని |
| | పరమ శోభనము | = | మిక్కిలి శుభప్రదము |
| 10. | అయ్యింతి | = | (అ + ఇంతి) ఆ స్త్రీ |
| | ఔగాక | = | నిజమే |
| | విభుని | = | భర్తయొక్క |
| | శిథిల వస్త్రంబు | = | చినిగిన గుడ్డ |
| | పృథుక తండులముల | = | అటుకులను |
| | కొన్ని ముడిచి | = | కొన్నిటిని కట్టి |
| | నెయ్యమున ననుప | = | ప్రేమతో సాగనంపగా |
| | చనియె దర్శనోత్సాహి | = | కృష్ణుని చూడాలనే కోరిక గలవాడు |

### 4.3.2 వ్యాఖ్యానం

తెలుగునాట బహుళ ప్రచారాన్ని పొందిన మహాకవి బమ్మెర పోతన. ఇతని దేశకాలాలను గూర్చి వాదోపవాదాలున్నా, అతడు ఓరుగల్లు (నేటి వరంగల్) మండలంలోని బమ్మెర గ్రామానికి చెందినవాడని, పదునైదవశతాబ్ది ఉత్తరార్ధంలో జీవించినాడని, సాహిత్య చరిత్రకారులు సహేతుకంగా నిర్ణయించారు. భాగవతముగాక వీరభద్ర విజయము, భోగినీ దండకము, నారాయణ శతకము అనే మూడు కృతులను పోతన రాసినట్లు చెబుతారు. వీటిలో వీరభద్ర విజయము పోతన చిన్నతనపు రచన. భోగినీ దండకము రాజాశ్రితమైన ఒక నట్టువరాలి (నాట్యకత్తె) పై చెప్పినది.

పోతన కవిత్వం ఆపాత మధురమైంది. పదాలు కూర్చటంలోను, పద్యాలు నడపటంలోను పోతన చూపిన వైచిత్రి పాఠకులకు ఆశ్చర్యం గొల్పుతుంది. ఇతని కవితలో తెలుగు పదాలు, సంస్కృత పదాలు సమానంగా ఉంటాయి.

### కథా సందర్భం

భాగవతంలోని కథలన్నీ శుకమహర్షి, పరీక్షిన్మహారాజుకు చెప్పినట్లుంటాయి. శ్రీకృష్ణుని జీవిత ఘట్టాలన్నీ భాగవత దశమస్కందంలో ఉన్నాయి. శ్రీకృష్ణుని గుణగణాలు, అతను చేసిన అద్భుతకార్యాలు శుకుడు పరీక్షిత్తుకు చెపుతూ, గోవిందుని గుణమాహాత్మ్యాలను గుర్తించటం బ్రహ్మకు కూడా సాధ్యం కాదని చెపుతాడు. అందుకు పరీక్షిత్తు "గోవిందుని కథలు విన్న చెవులే చెవులు, అతనికి మ్రొక్కిన శిరస్సే శిరస్సు, కృష్ణపాదతీర్థ సేవాపరులైన వారే భాగవతులు. వారి జన్మ సార్థకమైంది. అట్టి మహాత్ముల చరిత్రలు వినవలెనని మనస్సు కుతూహలపడుచున్నది. విష్ణుభక్తుల కథలు చెప్పినన్ను ధన్యుణ్ణి చేయవలసిందని" కోరినాడు. ఈ సందర్భంలో శుక మహర్షి కుచేలుని కథ చెప్పాడు.



BRAOU

కుచేలుడు కృష్ణుని బాల్యస్నేహితుడు, సహాధ్యాయి. నిరుపేద., గంపెడు సంతానం. వారిని పోషించే శక్తిలేక, భార్య సలహామేరకు పిడికెడు అటుకులతో కృష్ణుని సహాయం కోరి ద్వారకకు వెళతాడు. అక్కడ కృష్ణుని ఐశ్వర్యం చూచి, తనకు జరిగిన మర్యాదకు మురిసి, తన దైన్యానికి వగచి, తన కోరికను బయటపెట్టేందుకు జంకుతాడు. కృష్ణుడు తనకేమి తెచ్చావని కుచేలున్ని ప్రశ్నిస్తాడు. కుచేలుడు నిశ్చేష్టుడుకాగా కృష్ణుడు ఆతని అంగవస్త్రపు కొంగున ఉన్న అటుకుల మూటను విప్పి కొన్ని తీసికొని అవి తనను తృప్తిపరచగలవని అంటాడు. తత్ఫలితంగా కుచేలునికి సర్వసంపదలు ఇస్తాడు. భక్తితో ఏది ఇచ్చినా భగవంతుడు గ్రహించి భక్తుని కోరికలు తీరుస్తాడని ఈ కథ వివరిస్తుంది.

కుచేలుడు జన్మతః దరిద్రుడు. కుచేల మంటే చినిగిన వస్త్రం అని అర్థం. ఇక్కడ వస్త్రం లౌకిక భోగాలకు చిహ్నం. ధనహీనులకు సంతానం మెండు. కుచేలుడికి మొత్తం 27 మంది బిడ్డలు. సర్వవిధాలా సమర్థుడే అయినా బహు సంతానంవల్ల దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు. బిడ్డలకు కావలసిన సదుపాయాలు చూడలేక పోవడమేకాదు కనీసం అన్నమైనా పెట్టలేకపోతున్నాడు. ఆ వ్యధ భరించలేక అతని భార్య దారిద్ర్య నివారణకు ఉపాయం ఊహించమంటుంది. అంతవరకు అతనికా విషయం తట్టనేలేదు. చివరికి భార్య ఆప్తోపదేశం వల్ల కార్యాచరణకు పూనుకున్నాడు. చివరకు పరమేశ్వరుడిగా భావించబడుతున్న శ్రీకృష్ణుని అనుగ్రహం కుచేలుని దౌర్భాగ్యాన్ని తొలగించింది.

ఈ పాఠ్యభావం పద్యాల వరుసలో ఇలా ఉన్నది:

1. అపుడు శుకుడు పరీక్షిత్తుతో ఈ విధంగా అన్నాడు. ఓ రాజా! కృష్ణుని, స్నేహితుడైన కుచేలుడు ఎంతో అభిమానం గల బ్రాహ్మణుడు. కామక్రోధాది అరిషడ్వర్గాలకు లొంగని ధర్మవర్తనుడు. మనో నిగ్రహం గలిగిన గొప్ప జ్ఞాని. దరిద్రం అనుభవిస్తున్నప్పటికీ ఇతరులను యాచించలేదు. తనకున్నదే పదివేలుగా భావించి, ఏదో ఒక రకంగా భార్యా పుత్రులను పోషించుకొనేవాడు.

2. కుచేలుని భార్య గొప్ప పతివ్రత (ప్రాచీన సమాజంలో పాతివ్రత్యం ఉన్నతమైన విలువ. భర్త ఎటువంటి వాడైనా భార్య ఎదురాడకుండా సేవ చెయ్యటం పాతివ్రత్యం). భరింపరాని లేమితో బిడ్డలు తిండిలేక ఆకలి బాధచేత నాలుకతో పెదవులు తడుపుకుంటూ శుష్కించిన శరీరాలతో, గిన్నెలు చేతబట్టుకొని పిడికెడు అన్నము పెట్టమని అడిగినపుడు ఆమె హృదయం బ్రద్దలైంది. చెవులు వ్రక్కలైనాయి. భర్త దగ్గరకు వెళ్ళి, దారిద్ర్యంతో బాధపడుతున్నా, దీన్ని నివారించే ఉపాయం ఆలోచించక ఊరకున్నావు గదా అని జ్ఞాపకం చేస్తుంది.

3. మరలా ఈ విధంగా చెప్పింది:

4. బాల్య స్నేహితుడయిన శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్లి ఆయన కృపకు పాత్రుడవై దారిద్ర్యమనుభవించే మమ్ములను కాపాడు (అంటే, సహాయం పొంది మా ఆకలి బాధను పోగొట్టు).

6. సాధు జనులను బ్రోచువాడు, ఆర్తులను రక్షించువాడు, వరదుడు ఐన కృష్ణుడు యదువీరులు కొలుచుచుండగా ద్వారకలో ఉన్నాడు. నీవక్కడికి వెళ్లినచో అప్పటికప్పుడే కోరిన సంపదలిచ్చును.'

7. కలలోగూడ కృష్ణుని ఎరుగని కఠిన మనస్కుడైనా ఆపదలో ధ్యానిస్తే అతని ఆపదను పోగొట్టడానికి శ్రీకృష్ణుడు తనను తానే సమర్పించుకొంటాడు. కాబట్టి నిశ్చల భక్తితో సేవించే నీ వంటి వారికి కోరిన కోర్కెలు తప్పక నెరవేర్చగలడు.

9-10. నీవు చెప్పినట్లు మన కష్టములు తీరుటకు కృష్ణుని ఆశ్రయించుటకు వెళ్ళుట మంచిది. కాని, వెళ్ళునపుడు ఆయనకు కానుకగా తీసికొనిపోదగిన వస్తువేదైనా మనకున్నదా?' అని కుచేలుడు అడుగగా అతని భార్య నిజమేనని తన భర్త చినిగిన వస్త్రపు కొంగున అటుకులు కొన్ని మూటగట్టి ప్రేమతో సాగనంపింది. కుచేలుడు కృష్ణుని చూడవలెనన్న ఉత్సాహంతో వెళ్లాడు.

### 4.3.3 విశేషాంశాలు

నాలుగో పద్యంలో రూపకాలంకారం ఉంది. దరిద్ర, అంధకారాలు ఉపమేయోపమానాలు. అలాగే హరికృపాకటాక్ష., రవిదీప్తులు ఉపమేయోపమానాలు. రవిదీప్తి అంధకారాన్ని రూపుమాపినట్లుగా హరికృపాకటాక్షం దారిద్ర్యాన్ని పోగొడుతుంది.

**అభ్యాసం – 1**

'కుచేలుడు' అన్న పేరును వివరించండి ?

**అభ్యాసం – 2**

కుచేలుని వ్యక్తిత్వాన్ని సమీక్షించండి ?

BRAOU

**అభ్యాసం – 3**

శ్రీకృష్ణుని స్వభావం ఏమిటి ?

## 4.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత సంప్రదాయానికి చెందిన ప్రాచీన కవిత్వంలో చంపూపద్ధతికి చెందింది ఈ పాఠ్యం.
- ప్రాచీన కవిత్వంలోని 'ఉపాఖ్యానం' అనే విభాగానికి చెందిన కవిత్వం ఇది.
- ఉపఖ్యానం ధర్మాన్నీ, జీవిత సారాంశాన్నీ, పురాణగాథలనూ చిత్రించే సంప్రదాయ కవితా ప్రక్రియ.
- ఈ ఉపాఖ్యానం ప్రధానంగా శ్రీకృష్ణ భగవానుని అపార కారుణ్యాన్ని చిత్రిస్తున్నది.
- మాధురీ కవితకు పేరొందిన సహజ పాండిత్యుడు బమ్మెర పోతనామాత్యుని సహజ కవితాలక్షణాలు ఈ పాఠ్యం ద్వారా విశదమౌతున్నాయి.
- కుటుంబవ్యవస్థలో వ్యక్తి, భార్య సలహాలకు ఇవ్వవలసిన సముచిత ప్రాధాన్యాన్ని ఈ పాఠ్యం అన్యాపదేశంగా ప్రబోధిస్తున్నది.
- అధిక సంతానం వల్ల సామాజికుడు అనుభవించే బాధలను కూడా ఈ కథ చిత్రిస్తున్నది.

## 4.5 మాదిరి పరీక్షాప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. కుచేలుని వ్యక్తిత్వాన్ని నిరూపించండి ?
2. పోతన కవితా గుణాలు సమీక్షించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

ఉపాఖ్యానం అంటే ఏమిటో తెలపండి ?

## 4.6 ఆకళింపు ప్రశ్నలు

1. పోతన భాగవతంలోని ఇతర ఘట్టాలను చదివి, ఈ ఉపాఖ్యానంతో పోల్చి చూడండి.
2. తిక్కన వాడిన ప్రయోజనం కోసమే పోతన ఈ ఉపాఖ్యానంలో సీస పద్యం వాడుకున్నాడేమో గమనించండి.
3. పోతన కవితా లక్షణమైన 'అంత్యప్రాస' స్వరూపాన్ని ఈ పాఠ్యం ద్వారా పరిశీలించే ప్రయత్నం చేయండి.

### అభ్యాసాలకు జవాబులు

1. కుచేలుని అసలు పేరు సుదాముడు. ఇతడు శ్రీకృష్ణుని బాల్య స్నేహితుడు. అతనితో కలిసి 'సాందీపని' వద్ద విద్యాభ్యాసం చేసినవాడు. అతణ్ణి ప్రాణాధికంగా ప్రేమించినవాడు. (27) మంది సంతానాన్ని కని దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ 'కుచేలము' అంటే చినిగిన ఒంటి వస్త్రంతో, తిరిగేవాడు. అతని దారిద్ర్యాన్ని 'కుచేలము' ప్రతిబింబిస్తుంది కాబట్టి అతనికి 'కుచేలుడు' అన్నపేరే రూఢిగా నిలిచిపోయింది.

2. కుచేలుడు నిరుపేద. విజ్ఞాన సంపన్నుడు అతనిలో రాగద్వేషాలు లేవు. శాంతచిత్తుడు. మానధనుడు. విజితేంద్రియుడు. బ్రహ్మవేత్త. బహు సంతానంవల్ల దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు. అయినప్పటికీ ఇతరులను నీచంగా యాచించడం అతడెరుగడు. తనకు లభించినది రవ్వంత అయినా సంతృప్తి పడి జీవితాన్ని గడిపేవాడు. భార్యాబిడ్డల్ని ఆ కొద్దిలోనే పోషించేవాడు.

అతని భార్యకూడా అభిమానవతి. పవిత్రమైన ఆలోచనలతో పతిని సేవించేది. ఒక రోజు బిడ్డలు ఆకలితో మల మల మాడుతూ అన్నం పెట్టమని ఆకులు, గిన్నెలు చేతబట్టుకొని వచ్చి చుట్టూచేరితే ఆమె మిక్కిలి దుఃఖంతో బిడ్డలను సమాధానపరచలేకపోయింది. భర్త దగ్గరకు వెళ్లి, పేదరికాన్ని నివారించే ఉపాయాన్ని ఆలోచించమని ప్రాధేయపడింది. 'బాల్యసఖుడైన కృష్ణుడున్నాడు, అతడి సహాయంకోరి మమ్ములను దారిద్ర్యాంధకారంనుండి రక్షించండి' అని కోరింది. 'కృష్ణుడు సాధుభక్త వత్సలుడు. ఆర్త శరణ్యుడు. దయాపయోధి. మీరు వెళ్లి అడిగితే అనూహ్యమైన సంపద లిచ్చి రక్షిస్తాడు' అని ప్రోత్సాహపరచింది. 'కలలో సైతం ఎప్పుడూ తలచని వారైనా సరే, ఆపత్సమయంలో మనస్సులో కృష్ణుని ఆరాధిస్తే తనను తానే సమర్పించుకుంటాడు. ఇక మీవంటి భక్తులకు సంపదున్నతిని కల్గించడా?' అని ప్రబోధించింది.
భార్య మాటలకు కుచేలుడు సంతసించాడు. కృష్ణుణ్ణి చూడబోవడం ఇహపరసాధకమని భావించాడు. భార్యతో, 'నీవు చెప్పినట్లే చక్రపాణిని చూడబోతాను. అయితే, వట్టిచేతులతో పోవడం న్యాయంకాదు కదా! ఏదైనా కానుక ఉందా? అంటాడు. ఆమె ఇంట్లోవున్న కొన్ని అటుకుల్ని భర్త చిరిగిన వస్త్రం కొంగులో ముడివేసి, సాగనంపింది. గోవిందుణ్ణి దర్శించవచ్చుననే ఉత్సాహంతో బయలుదేరాడు కుచేలుడు.

3. శ్రీ కృష్ణుడు ఆర్తులైన సాధువులపట్ల, భక్త జనుల యెడ కరుణవహించి వరాలు ఇచ్చేవాడు. సముద్రమంతటి దయాగుణం కలవాడు. భక్తులకే కాక; కలలోకూడా ఎన్నడూ తనను స్మరించి కూడా ఎరుగని వారికైనా సరే, ఆపదలో ఉండి కేవలం ఒక్కసారి తన పాదపద్మాలను స్మరించినంత మాత్రాన వారిని కరుణించి ఆపదలు తొలగించేవాడు. తనను తానైనా సరే భక్తులకు సమర్పించుకోగల కరుణామయుడు. ఆంధ్ర భాగవతంలోని 'కుచేలోపాఖ్యానము' లో కుచేలుని భార్యనోట ఈ అభిప్రాయాలను ప్రకటిస్తాడు. సహజ పాండిత్యుడు పోతనామాత్యుడు.

– ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి

BRAOU

# భాగం 5 శివధనుర్భంగము

## విషయక్రమం


5.0 ఉద్దేశం
5.1 ప్రవేశిక
5.2 సూచనలు
5.3 పాఠ్యం
  5.3.1 కఠినశబ్దాలకు అర్థాలు
  5.3.2 వ్యాఖ్యానం
  5.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
5.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
5.6 ఆకళింపు ప్రశ్నలు


## 5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- మొల్లకవితా రీతులు
- మొల్ల చిత్రించిన శ్రీరాముని బలపరాక్రమాలు

## 5.1 ప్రవేశిక

సంస్కృత రామాయణానికి కవయిత్రి మొల్ల చేసిన స్వతంత్రానువాదాన్ని మీరు ఈ భాగంలో అధ్యయనం చేస్తారు. రామాయణకథలో కీలకస్థానం వహించిన సీతారాముల కళ్యాణఘట్టానికి సంబంధించింది ఈ భాగం.

## 5.2 సూచనలు

ప్రాచీన కవిత్వంలోని ఈ భాగాన్ని అధ్యయనం చేసేముందు తెలుగు భాష పదస్వరూపాన్నీ, సంధి స్వరూపాన్నీ, సమాస స్వరూపాన్నీ, అలంకార స్వరూపాన్నీ, ఛందస్సులోని వైవిధ్యాన్నీ తెలుసుకోవాలి. ప్రస్తుత పాఠ్యం మాత్రమేకాక, లిఖిత సంప్రదాయం సమగ్రావగాహన కోసం వీలైనంతవరకూ ప్రాచీన కవిత్వంలోని విభిన్నకావ్యాలను పరిశీలించాలి. 5.3.1, 5.3.2, 5.3.3 లలో ఇచ్చిన వివరాల ఆసరాతో 5.3 లో ఇచ్చిన పాఠ్యాన్ని అధ్యయనం చెయ్యాలి.

## 5.3 పాఠ్యం

ఉ. కొంకక సావధానమతి గూర్చి వినుండిదె మత్కుమారికై
యుంకువ సేసినాడ వివిధోజ్జ్వలమైన ధనంబు గాక నీ
శంకరుచాప మెక్కిడిన సత్త్వఘనుండుగువాని కిత్తునీ
పంకజనేత్ర సీత – నరపాలకులార! నిజంబు సెప్పితిన్. 1



BRAOU

ఆ.వె. అనుచు బలుకుచున్న యవనీశతిలకుని
వాక్యములను నుబ్బి వసుమతీశ
సుతులు దాముతామె మతిలోన జెలగుచు
దగ్గఱంగబోయి ధనువు జూచి 2

కం. విల్లా యిది కొండా యని
తల్లడపడి సంశయంబు తలకొన మదిలో
బల్లిదులగు నృపనందను
లెల్లరు దౌదవుల నుండి రెంతయు భీతిన్. 3

సీ. ఇది పర్వతాకార మీవిల్లు కనివిచ్చి తేటిచూడగ రాదు దేవతలకు
నలుగాక మును శేషకటకునిధనువంట హరుడె కావలెగాక హరియుగాక
తక్కినవారికి దరమె యీ కోదండ మెత్తంగ దగుచేవ యెట్లు గలుగు
దీని డగ్గఱ నేల దీని కోడగ నేల పరులచే నవ్వులు పడగనేల.

తే. గుఱుతు సేసియు దమలావుకొలది దామె తెలియవలె గాక యూరకతివురనేల
యొరులసాముల్ తమకేలదొరకుననుచు దలగిపోయిరి రాజనందనులు గనుచు 4

క. కొందఱు డగ్గఱ నోడిరి
కొందరు సాహసము చేసి కోదండముతో
నందంద పెనగి పాటిరి
స్కందుల గొందులను దూఱి సత్త్వము లేమిన్. 5

సీ. గాలిదూలిన రీతిగా నెత్తజాలక తము దామె సిగ్గున దలను వంచి
కౌగిలించిన లోనుగాక వెగ్గలమైన భీతిచే మిక్కలి బీరువోయి
కరములనందంద పొరలించి చూచిన గదలక యున్న జీకాకున..ది
బాషాణమున్నట్టి పగిది మార్దవమేమి గానరాకుండిన గ...

తే. రాజసూనులు కొందరు తేజ ముడిగి జగతి రాజ... మో...చ్చంగ దలచి
జనకుడీమాయ గావించె జాలుసనుచు ద...యి దవ్వుగా ధనువు విడిచి. 6

వ. కదలకుమీ ధరాతలము కాశ్యపిబట్టు ...|ద ...గూవిషా
స్పదులనుబట్టు కూర్మమ రసాతలభ...గధ...కులీశులన్
వదలకపట్టు ఘృష్టిధరణీఫణికచ్ఛపపోత్రివర్గమున్
బొదువుచు బట్టుడీ కరులు భూవరుడీశుని చాపమెక్కిడున్. 7

క. ఉర్వీనందనకై రా
మోర్వీపతి యెత్తు నిప్పుడుగ్రుని చాపం
బుర్వింబట్టుడు దిగ్దం
త్యుర్వీధరకిటిఫణీంద్రు లూతగ గడిమిన్. 8

మ. ఇనవంశోద్భవుడైన రాఘవుడు భూమీశాత్మజాల్ వేడ్కతో
దను వీక్షింప మునీశ్వరుండలర గోదండంబు చేనంది చి
వ్వన మోపెట్టి గుణంబుపట్టి పటుబాహాశక్తితో దీసినన్
దునిగెన్ జాపము భూరిఘోషమున వార్ధుల్ మ్రోయుచందంబునన్. 9

ఆ. ధనువు దునిమినంత ధరణీశసూనులు
శిరములెల్ల వంచి సిగ్గు పడిరి
సీత మేను పెంచె శ్రీరామచంద్రుని
బొగడె నపుడు జనక భూవిభుండు. 10



BRAOU

### 5.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 1. | కొంకక | = | అనుమానించక, సంకోచింపక |
| | సావధానమతి గూర్చి | = | మనసు పెట్టి |
| | ఉంకువ | = | కన్యాశుల్కం |
| | ఉజ్జ్వల | = | అధికాధికమైన |
| | శంకరు చాపము | = | శివధనుస్సు |
| | ఎక్కిడిన | = | ఎక్కుపెట్టిన, ధరించగల్గిన |
| | సత్త్వఘనుండు | = | బలసంపన్నుడు |
| | పంకజనేత్ర | = | పద్మములవంటి కన్నులు కల్గిన సీత |
| 2. | అవనీశతిలకుడు | = | భూపాలోత్తముడు, రాజు (జనకుడు) |
| | ఉబ్బి | = | సంతసించి |
| | వసుమతీశ సుతులు | = | రాజపుత్రులు |
| | చెలగుచు | = | ఆరాటపడుతూ |
| 3. | ఇది విల్లా | = | ఇది ధనువా (లేక) |
| | కొండా | = | పర్వతమా |
| | తల్లడపడి | = | తత్తరపడి, చలించి |
| | సంశయంబు తలకొన | = | అనుమానము పొడచూపగా |
| | బల్లిదులు | = | పరాక్రమోపేతులు |
| | నృపనందనులు | = | రాకుమారులు |
| | దౌదవుల | = | దూరదూరంగా |
| 4. | శేషకటకునిధనువు | = | పాముకంకణము కల్గిన శివుని ధనుస్సు |
| | తివురు | = | ప్రయత్నించు |
| 5. | దగ్గర | = | దగ్గరకు పోయేందుకు |
| | ఓడిరి | = | భయపడ్డారు |
| | సత్త్వము | = | బలము |
| 6. | గాలిదూలిన | = | గాలికి తూలిపడినట్లు |
| | లోనుగాక | = | లోబడక, అధీనంకాక |
| | వెగ్గలమైన | = | మిక్కుటం, అధికం |
| | బీరువోయి | = | వ్యర్థమై, బలహీనమై |
| | మార్దవము | = | మృదుత్వం, మెత్తదనం |
| | కళవళించి | = | కలతపడి |
| | తేజము | = | కాంతి |
| | ఉడిగి | = | నశించి |
| | తలగిపోయిరి | = | తొలగిపోయారు |
| 7. | ధరాతలమ | = | ఓ భూమీ |
| | కదలకుమీ | = | కదలవద్దు |
| | ఫణీంద్ర | = | ఓ ఆదిశేషుడా |
| | కాశ్యపిన్ | = | భూమిని |
| | పట్టుము | = | పట్టుకో |
| | కూర్మమా | = | ఓ తాబేలా |
| | భూ | = | భూమిని |

BRAOU

విషాస్పదులను = సర్పాన్ని
పట్టు = పట్టుకో
ఘృష్టి = ఓ వరాహమా
రసాతల = భూమిని
భోగి = సర్పాన్ని
ధులీకులీశులన్ = కూర్మాన్ని (తాబేలును)
పట్టు = పట్టుకో
కరులు = దిగ్గజాల్లారా
ధరణి = భూమిని
ఫణి = పామును
కచ్ఛప = తాబేలును
పోత్రి = వరాహ
వర్గమున్ = సమూహాన్ని
పట్టుడీ = పట్టుకోండి
భూవరుడు = మహారాజు (రాముడు)
ఈశుని = ఈశ్వరుని
చాప మెక్కిడున్ = ధనుస్సును ఎక్కుపెట్టబోతున్నాడు.

8. రామోర్వీపతి = రాముడు
ఉర్వీనందనకై = భూసుత అయిన సీత కోసం
ఉగ్రుని చాపంబును = శివధనుస్సును
ఎత్తున్ = ఎక్కుపెట్టును
కడిమిన్ = బలంగా, గట్టిగా
ఉర్విన్ = భూమిని
ఉర్వీధర = కూర్మ
కిటి = వరాహ
ఫణీంద్రులు = సర్పము (శేషుడు)
ఊతగ = ఊతగానూ
పట్టుడు = పట్టుకోండి

9. ఇనవంశోద్భవుడైన = సూర్యవంశంలో పుట్టిన
రాఘవుడు = రాముడు
భూమీశాత్మజుల్ = రాకుమారులు
వేడ్కతో = ఉత్సాహంగా
మునీశ్వరుడు = విశ్వామిత్రుడు
అలర = సంతసించగా
కోదండంబు = ధనుస్సును
చేనంది = చేతితో పట్టుకొని
చివ్వన = వేగంగా, వెంటనే, త్వరగా
మోపెట్టి = ఎక్కుపెట్టి
గుణంబు = నారి
పట్టి = పట్టుకొని (సంధించి)
పటు = గొప్ప
బాహాశక్తితో = భుజబలంతో
తీసినన్ = లాగగా
భూరి ఘోషమున = గొప్ప గర్జారవంతో (శబ్దంతో)



BRAOU

| | | |
|---|---|---|
| వార్ధుల్ | = | సముద్రాలు |
| మ్రోయు చందంబునన్ | = | మోత పెట్టినట్లుగా |
| చాపము | = | ఆ శివధనుస్సు |
| తునిగెన్ | = | విరిగిపోయింది |

### 5.3.2 వ్యాఖ్యానం

మొల్ల తన కాలాన్ని గురించి చెప్పుకోలేదు. ఈమె శ్రీనాథుని తర్వాత కాలం నాటిదని కొందరు చరిత్రకారులూహిస్తున్నారు. శ్రీనాథుడు సుమారుగా 1365-1450 మధ్య జీవించినవాడు. మొల్ల తండ్రి ఆతుకూరి కేసయసెట్టి. నెల్లూరు మండలంలోని 'గోపవరము' వీరి గ్రామం.

మొల్ల రాసిన రామాయణానికి ఆంధ్రదేశంలో ప్రచార ప్రాచుర్యాలు అధికం. దానికి కారణాలివి :

1. కథలో ప్రధాన విషయాలను మాత్రమే చెప్పడం,
2. సరళమైన భాష కావడం,
3. మహిళా సహజమైన హృదయ మార్దవంతో, మాతృహృదయ సౌమనస్యంతో వ్రాయడం.

'విబుధుల మదికి వీనుల విందగునట్లు' రచిస్తానని చెప్పుకున్నది. 'తెలుగునకు పొందగునట్లుగా' సామెత లందముగా గూర్చి కందువ మాటలతో కవిత్వం చెప్పింది. హెచ్చుగా కందాలలో అందాలు చిందేట్లు పండిత పామరుల హృదయాకర్షకంగా మొల్ల రామకథను రచించింది. కావ్యరచనా పద్ధతులు అంతగా తెలియవు అని చాల వినయంగా చెప్పుకున్నది. అది మర్యాదకేగాని ఆమె గొప్ప ప్రజ్ఞాప్రాభవాలు కల్గిన కవయిత్రి.

కావ్యం ధ్వని పూర్ణంగా ఉండాలని కావ్య లక్షణాన్ని నిర్దేశించగలిగిన ప్రాజ్ఞురాలు. అంతేకాదు, ఏది రాసినా క్రొత్త రీతులతో వ్రాయాలనీ, కేవలం ఆడంబర శబ్దాలతో రాస్తే అందులో కావ్య లక్షణం పొందుపడదని కూడా ఆమె చెప్పింది. 'తేనె సోక నోరు తియ్యనగురీతి'గా ఉండాలంటుంది కవిత్వం అర్థం. కాని శబ్ద సమూహంతో కావ్యం జటిలంగా ఉండకూడదంటుంది. అలా రాస్తే అది 'మూగ చెవిటి వారి ముచ్చటౌతుంది' అంటుంది. అంటే, పండితుల కంటే సామాన్యుల మీద ఆమె దృష్టి కేంద్రీకరించిందని అర్థం. పామరులకు సైతం అందికలో ఉండాలంటే సరళంగా ఉండాలి. ఆ సరళత మీద మొల్లకు మక్కువ ఎక్కువ.

ఆమెకు ముందు కాలంలో తెలుగులో ఐదారు రామాయణాలున్నాయి. అవన్నీ సంస్కృత శబ్దమయాలుగా ఉండి ప్రజాసామాన్యానికి అందుబాటులో లేవని ఆమె అభిప్రాయం. ఆ పరిస్థితిలో తాను రామాయణ రచనకు పూనుకొన్నానని చెప్పుకున్నది. తన పాండిత్యాన్ని ప్రదర్శించుకోవాలనే ధ్యాస కంటె రామభక్తి ప్రదర్శనే ముఖ్యంగా భావించింది. 'రామచంద్రుడు చెప్పిస్తే భక్తితో నేనీ కావ్యాన్ని చెప్పుతున్నాను' అని స్పష్టంగా చెప్పింది. 'భక్తియె కారణమగు గాని చదువు కారణమగునే' అన్నది.

మొల్ల రామాయణం సంక్షిప్తమైంది. ప్రధాన కథకు భంగం రాకుండా అవసరమైన ఘట్టాలను మాత్రమే విరచిస్తూ పోయింది. విశ్వామిత్రుడు క్రతువు చేయాలని నిశ్చయించాడు. రాక్షసులు ఆటంకాలు కల్గిస్తున్నారు. వారిని శిక్షించగల వీరుడు రాముడొక్కడే అని తేల్చుకున్నాడు విశ్వామిత్రుడు. దశరథుని కొలువుకూటాని కొచ్చి ఆ విషయం చెప్పాడు. దశరథుడు బాధపడ్డాడు. అయినా తప్పలేదు. రాముణ్ణీ లక్ష్మణున్నీ విశ్వామిత్రుని వెంట పంపాడు. రాక్షస సంహారం జరిగింది. నిర్విఘ్నంగా క్రతువు పూర్తి అయింది. ఆ సమయంలో జనకమహారాజు సీత పరిణయ వార్తను చాటించాడు. విశ్వామిత్రుడు రాముణ్ణి సౌమిత్రిని వెంట బెట్టుకొని మిథిల చేరుకొన్నాడు. సీత స్వయంవర వార్తతో ఎక్కడెక్కడి రాజులో మిథిలకు వచ్చారు. నిండు సభలో జనకుడు 'హరుని శరాసనాన్ని' ఎక్కుపెట్టినవానికి నా కుమార్తె నిస్తానని ప్రకటించాడు. అదీ సందర్భం. ఇప్పుడు పాఠ్యభావం చూడండి.

కొందరు రాకుమారులు విల్లుదగ్గరకు పోవడానికే భయపడ్డారు. కొందరు సాహసం చేసి దాన్ని పైకెత్తడానికి కొంత తంటాలు పడ్డారు. చివరకు ఎక్కుపెట్టే బలం లేక కాలికి బుద్ధి చెప్పారు.



BRAOU

లక్ష్మణుడు ఈ విధంగా అంటున్నాడు : రాముడు ఈశ్వర చాపాన్ని ఎక్కుపెట్టబోతున్నాడు. ఓ భూమీ, కదలవద్దు, ఓ నాగేంద్రా, భూమిని పట్టుకో. ఓ కూర్మమా, భూమిని నాగేంద్రుని కదలకుండా పట్టుకో ఓ వరాహమా, భూమిని, సర్పాన్ని, కూర్మాన్నీ, కదలనీయకు, ఓ దిగ్గజాల్లారా, భూమి, ఆదిశేషుని, కూర్మాన్ని, వరాహాన్ని కదలనీకుండా పట్టుకోండి.

రాముడు శివధనుస్సును ఎక్కుపెడితే ప్రపంచమంతా గడగడలాడిపోతుంది. అలా కదిలిపోకుండా ఉండడానికి భూమికి ఆధారమైన నాగేంద్రాన్ని, ఆది కూర్మాన్ని, వరాహాన్ని, దిగ్గజాన్ని హెచ్చరిస్తున్నాడు.

సీతను వివాహమాడేందుకు రాముడు శివధనుస్సు ఎత్తబోతున్నాడు. భూమి ఊగిపోకుండా మీరంతా బలంగా పట్టుకోండి అని దిగ్గజాలను, కూర్మాన్ని, వరాహాన్ని, దిగ్గజాన్ని హెచ్చరిస్తున్నాడు లక్ష్మణుడు.

రాముడు శివధనుస్సును అవలీలగా చేతితో ఎత్తి నారిని సంధించాడు. రాజకుమారులు ఆశ్చర్యచకితులైనారు. విశ్వామిత్రుడు అమితానంద పరవశుడైనాడు. సముద్రాలు ఘోష పెడుతున్నట్లు శబ్దం చేస్తూ ఆ విల్లు పెళిల్లుమని విరిగిపోయింది.

శివధనుస్సు విరగగానే రాకుమారులు సిగ్గుతో తలవంచుకున్నారు. సీత ఆనందంతో ఉప్పొంగిపోయింది. జనకుడు శ్రీరాముని ఔన్నత్యాన్ని కొనియాడాడు.

### 5.3.3 విశేషాంశాలు

మొల్ల తన రామాయణాన్ని చాల సంగ్రహంగానూ, నిరాడంబరంగానూ రాసింది. కథాకథనమే ఇందులో ప్రధానాంశం. ఈ విషయాలు గ్రహించాలంటే ఇతర రామాయణాలతో పోల్చి చూడాలి. శివధనుస్సును రాముడు విరిచాడని మొల్ల ఒక పద్యంలో వర్ణించింది. అదే ఘట్టంలో భాస్కర రామాయణంలో ఎట్లా ఉందో చూడండి :

"కలభంబాతత చండతుండమున వీకన్ శేష నాగేంద్రునిన్
బలిమింబట్టిన భంగి రామధరణీపాలుండు కోదండమున్
బలుముష్టిన్ వడిబట్టియెత్తి తెగవిస్ఫారంబుగాజేసి ని
శ్చలుడై యల్లన అస్త్రకంబు వదలెన్ జాపంబు భగ్నంబు గన్.

నారుల బట్టనివారికి నారయ ధర్మములు గాయ..క నారిగరం
బారంగబట్టి రాముడు పౌరులు చూడంగ ధనువు భగ్నము సేసెన్.

ధనువుద్యద్గతి రాముడట్లు విఱువం దద్ఘోరఘోషంబొగిన్
ఘన నిర్ఘాత నిపాతజాత నినదోగ్రధ్వానమై మ్రోసినన్
వినియాస్థానము వారలెల్ల వడిబ్రధ్వంద్రెళ్ళి మూర్ఛిల్లి రా
జనకాధీశుడు రామలక్ష్మణులు విశ్వామిత్రుడుం దక్కగన్.

కుల గిరులెల్ల బెల్లగిలె గుంభిని యల్లలనాడె, దిగ్గజం
బులు బెదరెన్, భుజంగపతి దిమ్మరవోయెఁబయోధు లన్నియుం
గలగె దిగంతముల్ వగిలెఁ గన్కనితారలురాలె సూర్యచం
ద్రుల గతితప్పె మేఘములు దూలె నజాండము మ్రోసె నయ్యెడన్."

"రాకుమారులు వేడుకతో చూస్తుండగా విశ్వామిత్రుడు సంతోషించగా రాఘవుడు విల్లు అందుకొని 'చివ్వన' నారిపట్టుకొని భుజబలంతో సారించగా సముద్రాలు ఘోషిస్తున్నట్టుగా విల్లు విరిగింది" అని మొల్ల వర్ణించింది. పద్యమంతా జరిగిన సంఘటనను మాత్రమే వర్ణించింది. చిట్టచివర అర్ధపాదంలో మాత్రం ఒక చిన్న పోలిక ఉంది. భాస్కర రామాయణంలో రాముడు విల్లందుకోటానికి ఒక పోలిక ఉంది. ఆ తరవాత 'నారి' శబ్దం ఆధారంగా ఒక శ్లేష ఉంది. అప్పుడు రాముడు విల్లు విరిచాడని వర్ణించబడింది. ఆ తరవాత ఆ వింటి



BRAOU

మోతకు జనకుడు, రామలక్ష్మణులు, విశ్వామిత్రుడు తప్ప సభలో వాళ్ళంతా మూర్ఛిల్లారని చెప్పబడింది. అది నిజంగా జరగటానికి వీలున్నదని నమ్మినా ఆ తరవాత జరిగినట్లు చెప్పిన సంఘటనలన్నీ కవులు సాధారణంగా పట్టుబడిగా వర్ణించే అతిశయోక్తులే. "కుల పర్వతాలు కూలిపోయినాయి. భూమి వణికింది. దిక్కులను మోసే ఏనుగులు బెదిరిపోయినాయి. భూమిని మోస్తున్న ఆదిశేషుడు దిమ్మెరపోయాడు. సముద్రాలన్నీ కలతచెందినాయి. దిక్కులు పగిలిపోయినాయి. తారలు సంభ్రమంతో రాలిపడ్డాయి. సూర్యచంద్రులు తమ మార్గాన్ని తప్పారు. మేఘాలు కిందపడిపోయినాయి. బ్రహ్మాండం మ్రోగింది." ఈ సంఘటనలన్నీ కేవలం వర్ణన కోసం తెచ్చిపెట్టినవే.

ఒక మాటతో అనేకార్థాలను ప్రతిపాదించటాన్ని 'శ్లేష' అంటారు. "నారులను పట్టుకోనివారికి ధర్మాలుంటాయా?" అనే వాక్యంలో 'నారులు' అనే మాటకు వింటి అల్లె తాళ్ళు అనీ, స్త్రీలనీ; 'ధర్మాలు' అంటే విండ్లు అనీ, ధర్మాలనీ రెండర్థాలున్నాయి.

## అభ్యాసం – 1

శివుని విల్లు ఎలా ఉన్నది ?

## అభ్యాసం – 2

సీతా స్వయంవరాన్ని వర్ణించండి ?

## అభ్యాసం – 3

స్వయంవరానికి వచ్చిన రాజకుమారుల పరిస్థితి వర్ణించండి ?



BRAOU

## 5.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- లిఖితకవిత్వంలోని ప్రాచీన కవిత్వంలో మార్గ పద్ధతికి చెందిన పాఠ్యం ఇది.
- రామాయణేతిహాసానికి తెలుగులో వచ్చిన ఒక స్వతంత్రానువాద కావ్యం మొల్ల రామాయణం.
- పద్యపరిమితి దృష్ట్యా ఇది అతి సంక్షిప్తం.
- ఈ పాఠ్యంద్వారా రామాయణ కథలో అతి ముఖ్యఘట్టమైన సీతాకళ్యాణం వర్ణించబడింది.
- అవతార పురుషుడైన శ్రీరామచంద్రుని బలపరాక్రమాలను వెల్లడిచేసే ఘట్టం ఇది.
- ఈ పాఠ్యం వల్ల అతిమధురమైన మొల్ల రచనావిశేషాలు తెలియవస్తున్నాయి.

## 5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. రాముడు శివధనువును ఎత్తిన విధానం వర్ణించండి ?
2. శ్రీనాథుని కవిత్వంతో పోల్చి మొల్ల కవిత్వంలోని సరళగుణాన్ని నిరూపించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

వింటిని దర్శించిన రాజకుమారుల మనోభావాలు వర్ణించండి ?

## 5.6 ఆకళింపు ప్రశ్నలు

1. పోతన కవితారీతికి మొల్ల పదరచనా పద్ధతికి సంబంధం ఉన్నదేమో గమనించండి.
2. తెలుగులోని ఇతర రామాయణాలకూ మొల్ల రచనకూ ఉన్న భేదసామ్యాలు పరిశీలించే ప్రయత్నం చేయండి.

### అభ్యాసాలకు జవాబులు

1. సుదీర్ఘంగా, సుదృఢంగా ఉన్న శివకార్ముకం [illegible] విల్లా ? లేక కొండా ? అనే సంశయాన్ని కలిగిస్తున్నది. ఎత్తడానికి వచ్చిన రాకుమారులకు దాని ఆకార విశేషం చేత భయాన్నీ కలిగిస్తున్నది. అలాంటి ఆ మహాకార్ముకాన్ని సమీపించడానికే కొందరు రాకుమారులకు జంకు కలిగింది. ఎత్తడానికి సాధ్యపడక పరాజయాన్ని కలిగించింది.

2. జనకుడు సీత వివాహ విషయాన్ని దేశాల్లో చాటించాడు. దేశదేశాల రాకుమారులు ఆశతో మిథిలానగరానికి చేరుకున్నారు. విశ్వామిత్రుని యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగింది. రామలక్ష్మణులు కూడా విశ్వామిత్రుని వెంట మిథిలకు చేరారు. నిండుకొలువులో జనకుడు ఈ విధంగా ప్రకటించాడు : "నా కుమార్తె సీతను వివాహమాడదలచినవారు ఒక వీరోచిత కార్యం చేయాలి. ఇదే శివధనుస్సు. దీన్ని ఎక్కుపెట్టిన వీరునికే సీత దక్కుతుంది."

   అది వినగానే రాకుమారులంతా మనస్సుల్లో సంతసించారు. ఇదెంతపని అని ఉబ్బిపోయారు. ధనువు దగ్గరకు చేరారు. ఆశ్చర్యపోయారు. ఇది విల్లా, పర్వతమా అని సంశయించారు. కొందరు దగ్గరకు పోవడానికే భయపడ్డారు. కొందరు సాహసం చేసి కొంతవరకు దాన్ని ఎత్తడానికి పెనుగులాడారు.

   ఎత్తడానికి ప్రయత్నించి విఫలులైన కొందరు సిగ్గుతో తలవంచుకున్నారు. రెండు చేతులతో కౌగిలించి ఎత్తాలని ప్రయత్నించి వీలుగాక మరికొందరు వెనక్కి తిరిగారు. బలంగా చేతులతో విల్లును అటు ఇటు కదపడానికి ప్రయత్నించి, అది కదలక కొందరు చీకాకు పడ్డారు. ఇది పాషాణంలా ఉంది.



BRAOU

మృదువుగా లేదు అని ఇంకొందరు కలత చెందారు. జనకుడు మనందర్నీ మోసగించడానికి పన్నాగం పన్నాడని అనుమానించారు మరికొందరు.

ఈ విధంగా పరిపరివిధాల ప్రయత్నించి ఆ విల్లును ఎత్తలేక రాజకుమారులంతా దూరంగా తొలగిపోయారు. రాముడు సునాయాసంగా ఎక్కుపెట్టి ధనుస్సును విరిచి సీతాకరగ్రహణం చేశాడు.

3. పర్వతాకారంతో భీతావహంగా ఉన్న ఆ వింటిని చూచినంతలోనే అదలిపోయి అనేకమంది రాజకుమారులు దాన్ని ఎత్తే చేవ తమకు లేదని తిరిగిపోయారు. కొందరు గాలిసోకిన వారిలాగా ఉన్మత్తులై పోయారు. రెండుచేతులా పొదవిపట్టుకొని కొందరు రాజకుమారులు ఎత్తుదామని ఎంత ప్రయత్నించినా సాధ్యంకాకపోవడంతో విఫలులైనారు. భుజబలమంతా ప్రయోగించి చూచినా, కఠిన శిలలాగా ఉన్న ఆ కార్ముకం కదలక మెదలక రాజకుమారులందరికీ చికాకునూ, నిస్తేజాన్నీ, పరాభవాన్నీ కలిగించింది.

— ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి

BRAOU

# భాగం 6 మనుచరిత్ర

**విషయక్రమం**


6.0 ఉద్దేశం
6.1 ప్రవేశిక
6.2 సూచనలు
6.3 ప్రబంధం అంటే
**అభ్యాసం – 1**
6.4 పాఠ్యం
    6.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    6.4.2 వ్యాఖ్యానం
    6.4.3 విశేషాంశాలు
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
6.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
6.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
6.7 ఆకళింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు


## 6.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- ప్రబంధ రచనా పద్ధతి
- ప్రబంధంలో వర్ణనకున్న ప్రాధాన్యం

## 6.1 ప్రవేశిక

మీరు ఈ భాగంలో సాహిత్య చరిత్రలో ఒక [illegible]యుగాన్ని సృష్టించుకున్న ప్రబంధ ప్రక్రియా స్వరూపాన్ని అధ్యయనం చేస్తారు. 'మనుచరిత్ర' లోనిది ఈ భాగం.

## 6.2 సూచనలు

ప్రాచీన కవిత్వంలోని ఈ భాగం చదివే ముందు తెలుగు భాష పదస్వరూపాన్నీ, సంధిస్వరూపాన్నీ, సమాసస్వరూపాన్నీ, అలంకార స్వరూపాన్నీ, ఛందస్సులోని వైవిధ్యాన్నీ అధ్యయనం చేయాలి. ప్రబంధ లక్షణాలనూ, స్వరూపాన్నీ తెలిపే లక్షణ గ్రంథాలను పరిశీలించాలి. 6.4.1, 6.4.2, 6.4.3 లలో ఇచ్చిన వివరాల ఆసరాతో 6.4 లో ఇచ్చిన పాఠ్యాన్ని చదవాలి. ప్రబంధ ప్రక్రియకు సంబంధించిన ఇతర కవిత్వ గ్రంథాలను కూడా అధ్యయనం చెయ్యాలి.

## 6.3 ప్రబంధం అంటే

మనుచరిత్ర ప్రబంధం అనే ప్రక్రియకు సంబంధించిందిగా విమర్శకులు నిర్ధారించారు. సంస్కృతంలో అన్ని కావ్యాలనూ ప్రబంధం అనే పిలిచారు. తెలుగులో మాత్రం 16వ శతాబ్ది నుంచి ప్రచురమైన కావ్యప్రక్రియకే ఆ పేరు స్థిరపడిపోయింది. అయితే ఈ ప్రబంధ ధోరణిని అంతకు ముందటి కావ్యాల్లో కూడా గుర్తించారు. ముఖ్యంగా శ్రీనాథుడిలోనూ, ఇంకా ముందు నన్నెచోడునిలోనూ ఈ ధోరణులున్నాయి. "ఈ ప్రబంధమునకు ఆంధ్ర లాక్షణికులెవ్వరును సమగ్రమైన లక్షణము చెప్పినవారులే"రంటూ పింగళి లక్ష్మీకాంతంగారు ఈ కింది లక్షణాలను క్రోడీకరించారు :



BRAOU

1. ప్రబంధమునకు ఏకనాయకాశ్రయత్వము, దానితోబాటు వస్త్వైక్యము ప్రధాన ధర్మములు.
2. ప్రబంధము అష్టాదశ వర్ణనాత్మకమై యుండవలెను.
3. అందు శృంగారము ప్రధాన రసము; ఆవశ్యకతను తక్కిన రసములు గౌణములు కావచ్చును.
4. అలంకారికమైన శైలి ప్రబంధమునకు జీవము.
5. ప్రబంధము భాషాంతరీకరణము కాగూడదు.

దాదాపు ఇవే లక్షణాలను వేరు వేరు రూపాలలో ఇతర విమర్శకులు కూడా పేర్కొన్నారు. కాకర్ల వెంకటరామ నరసింహంగారు ప్రబంధాల్లో కథా ప్రాధాన్యం తగ్గటం ఒక ముఖ్యమైన విషయంగా గుర్తిస్తూ ఇట్లా అన్నారు :

"ఆంధ్రకవులలో కొందరు కథా కథనమునందే దృష్టి నిల్పిరి. కొందరు కథా కథనము కంటె కవితా శిల్పమునే విశేషముగా నాదరించిరి. కథా కథనమునందు దృష్టిని నిల్పి వ్రాసిన వ్రాతను పురాణధోరణి యనియు, కవితా శిల్పమునందు దృష్టిని నిల్పి వ్రాసిన వ్రాతను ప్రబంధ ధోరణియనియు స్థూలముగా వ్యపదేశింపవచ్చును."

ఈ లక్షణానికి సవరణను ప్రతిపాదిస్తూ వెల్చేరు నారాయణరావుగారు 'కవితా శిల్పము' అనే అస్పష్టమైన మాటకు బదులు 'వర్ణనము' అంటే ఈ లక్షణం సరిపోతుంది అన్నారు.

పైన చెప్పిన ప్రబంధ లక్షణాలు అన్ని ప్రబంధాలకూ పట్టకపోవటాన్ని అందరు విమర్శకులూ గుర్తించారు. ప్రబంధాల్లో వర్ణనా ప్రాధాన్యం ఎక్కువని కూడా గుర్తించారు. ఈ విషయాన్ని వివరిస్తూ నారాయణరావుగారు ఇట్లా అన్నారు.

"కథనం - వర్ణనం రెండు భిన్నమార్గాలు. రెండు తాత్విక దృక్పథాల ఫలితాలు. రెండు సామాజిక పరిస్థితుల పరిణామాలు. ఈ దృష్ట్యా చూస్తే పురాణానికీ, ప్రబంధానికి తేడా కేవలం వర్ణనల ఎక్కువ తక్కువలతో లేదని తెలుస్తుంది. ఆ తేడా కేవలం పరిమాణాత్మకమైనది కాదు; గుణాత్మకమైనది."

కావ్యశ్రోతల దృష్ట్యా ఈ విషయాన్ని పరిశీలిస్తూ నారాయణరావుగారిట్లా అన్నారు

"పురాణానికున్న ద్వికర్తృకత్వం ప్రబంధానికి లేదు. అంటే శ్రోతలకి చదివి వ్యాఖ్యానించవలసింది కాదు ప్రబంధం. శ్రోత పద్యంలో అందాన్ని మెచ్చుకోటం వింటాడు. ...నిజానికి ప్రబంధం శ్రవ్యకావ్యం కాదు. అచ్చులో, పుస్తకాలలో అనేక ప్రతులు సులభంగా దొరక్కపోవడంవల్ల తప్పితే అది యథార్థానికి అనాడే పాఠ్యకావ్యం అయిపోయి ఉండేది. శ్రవ్యకావ్యస్థితి నుంచి కవిత్వం పాఠ్య కావ్యస్థితికి నడుస్తున్న దశలలో తొలిదశ ప్రబంధానిది. (చరమ దశ వచన కవిత్వానిది)."

"పురాణ కవిత్వం నుంచి ప్రబంధ కవిత్వానికి మార్పు కథన మార్గం నుంచి వర్ణన మార్గానికి."

ఈ మార్పు పరిణామాత్మకంగా సాగి, పెద్దన మనుచరిత్ర నాటికి గుణాత్మకంగా మారిందని నారాయణరావుగారి పరిశీలన.

**అభ్యాసం - 1**

ప్రబంధం అంటే ఏమిటి ?

BRAOU

## 6.4 పాఠ్యం

చ. తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవుబారికి నగ్గము సేసి క్రూరుడై
యరిగె మహీసురాధము డహంకృతితోనని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణిదాల్చె కషాయదీధితిన్ 1

సీ. ఉరుదరీ కుహరసుప్తోత్థ శార్దూలముల్, ఖురవారి శోణిత శంకద్రావ
వనకుంజమధ్య శాద్వలచరన్మృగ పంక్తి, దావపావక భీతి దల్లడిల్ల
నాశ్రమాంతరభూరుహాగ్రముల్ మునికోటి, బద్ధకాషాయ విభ్రాంతిజూడ
ఘనసానుశృంగశృంగాటకంబులగాంచి యమరులు హేమాద్రియనుచు వ్రాల

తే. గాసె బేశలరుచి గింశుక ప్రవాళ, ఘుసృణ కిసలయ కంకేళికుసుమగుచ్ఛ
బంధుజీవ జపారాగ బాంధవంబు లన్నగంబున జరఠారుణాతపములు. 2

శా. శ్రేణుల్ గట్టి నభోంతరాళమున బాఱెం బక్షులుష్ణాంశు పా
షాణవ్రాతము కోష్ణమయ్యె మృగతృష్ణావార్ధులింకెన్ జపా
శోణంబయ్యె బతంగబింబము, దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణం బయ్యె సరోజషండములు నిద్రాణంబులయ్యెంగడున్. 3

సీ. ఏ విహంగము గన్న నెలుగించుచును సారెకును సైకతంబుల గూడబారు
దారి కన్గానియది తన జోడు గాకున్న మెడయెత్తి కలయంగ మింటనరయు
నరసి కన్నీటితో మరలి తామరయెక్కి, వదన మెండగ సరోవారి నద్దు
నద్దిత్రావగ సైపకట్టిట్టు గన్గొని, ప్రతిబింబ మీక్షించి భ్రమసి యుఱుకు

తే. నుఱికి యెలుకలు దడియ వేఁబొక్క తమ్మి కరుగ నరిగి రవంబుతో దిరుగుతేంట్ల
బొడుచుముక్కున మరియునుబోవువెదక సంభ్రమియగుచు వగనొక్క చక్రవాకి. 4

సీ. రవిబింబ పతన దీర్ణపయోధి గర్భనిర్గత శోణమణి ఘణారత్నరుచియొ
దివసావసాన సందీప్తాస్తగిరి శిఖాజోల్లసిత ప్రతానాతపంబొ
తపన ధూర్దండి నిర్దళిత దిక్తట ద్విరద, కుంభజాండకటాహకనకఘృణియొ
చండీశ తాండవోత్సవసంభృత క్షపాహస్తాగ్రదీప గభస్తిచయమొ

తే. ద్రాగ్విధావహచ్ఛిదావినిద్రాణమదవదంజనాలాన మూలశయ్యావిధాన
వారుణాధోరణాకల్పితోరుశోణ మృత్తికారాశియో యనమెఱసె సంధ్య. 5

### 6.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు

1. తరుణిన్ = పడుచు ప్రాయంలో ఉన్న ఆ వరూధినిని
అనన్యకాంతన్ = వివాహంకాని పడుచును
అతిదారుణ = మిక్కిలి భయంకరమైన
పుష్పశిలీముఖ = పూలబాణాల
వ్యథాభర = అధికమైన బాధచే
వివశ = స్మృతి కోల్పోయిన
అంగిన్ = శరీరం కలదానిని
అంగభవుబారికిన్ = మన్మథుని బారికి
అగ్గముచేసి = లోబరచి, అధీనంచేసి
క్రూరుడై = కఠినాత్ముడై

మహీసురాధముడు = ఆ నీచుడైన బ్రాహ్మణుడు (ప్రవరాఖ్యుడు)
అహంకృతితోన్ = గర్వంతో
అరిగెన్ = పోయెను (అవి)
రోషభీషణస్ఫురణన్ = రోషంతో భయంకరమైన తేజస్సును
వహించెనో = పొందెనేమో, తాల్చెనేమో
అనన్ = అనునట్లు
నభోమణి = సూర్యుడు
కషాయదీధితిన్ = ఎర్రనికాంతిని
తాల్చెన్ = వహించాడు

2. ఉరు = పెద్దవైన
దరీకుహర = బిలములవంటి కొండగుహలలో
సుప్త = నిద్రించి
ఉత్థ = లేచిన
శార్దూలముల్ = పెద్దపులులు
ఝరవారిన్ = సెలయేళ్లలోని నీటిని
శోణిత శంకన్ = నెత్తురనే భ్రాంతితో
త్రావన్ = త్రాగగా

(ప్రొద్దుకుంకుతుంది. పెద్దపులులు గుహల్లో నిద్రనుండి లేచి బయటకువచ్చాయి. సెలయేళ్ల లోని నీళ్ళు ఎర్రగా కనిపించాయి. నెత్తురనే భ్రమతో త్రాగడం ప్రారంభించాయి.)

వనకుంజమధ్య = అడవిలోని పొదరిండ్లమధ్య ఉన్న
శాద్వల = పచ్చికనేలల్లో
చరత్ = తిరుగుతున్న
మృగపంక్తి = జింకల గుంపు
దావ పావకభీతిన్ = కార్చిచ్చు వ్యాపించిందనే భయంతో
తల్లడిల్లి = కంగారుపడగా
ఆశ్రమాంతర = ఆశ్రమాల్లోని
భూరుహ = వృక్షాలయొక్క
అగ్రముల్ = కొనల్లో
మునికోటి = మునిసమూహం
బద్ధకాషాయ విభ్రాంతిన్ = అరగట్టిన కావివస్త్రాలనే భ్రమతో
చూడన్ = చూడగా
ఘన = గొప్పవైన
సాను = చరియలు
శృంగ = శిఖరాలు
శృంగాటకంబులన్ = చదుకములు (నాలుగు దారులు కలిసే చోట్లు)
కాంచి = చూచి
అమరులు = దేవతలు
హేమాద్రియనుచు = బంగారు కొండ (మేరుపర్వతం) అని
వాలన్ = దిగగా
అన్నగంబునన్ = ఆ మంచుకొండమీద
కింశుక = మోదుగ పూలయొక్క
ప్రవాళ = పగడముల
ఘుసృణ = కుంకుమపూల

BRAOU

| | | |
|---|---|---|
| కిసలయ | = | చిగుళ్ల |
| కంకేళికుసుమగుచ్ఛ | = | ఎర్రని అశోకపుష్పముల గుత్తుల |
| బంధుజీవ | = | మంకెన పువ్వుల |
| జపారాగ | = | దాసానిపువ్వుల ఎరుపుతో |
| బాంధవంబులు | = | చుట్టములు, బంధువులు (ఆ ఎరుపుతో పోలిన) |
| జరఠారుణాతపములు | = | వృద్ధుడైన సూర్యుని వెలుగులు (సంధ్యాకాలంలో ముదిరిన ఎండ ఎరుపుదనం) |
| పేశల రుచిన్ | = | లేత (తగ్గిన) కాంతితో |
| కాసెన్ | = | ప్రకాశించాయి |
| 3. నభోంతరాళమునన్ | = | (పక్షులు) ఆకాశమార్గంలో |
| శ్రేణుల్ గట్టి | = | బాగులు తీరి (వరుసగా) |
| పారెన్ | = | ఎగిరిపోయెను |
| ఉష్ణాంశుపాషాణ వ్రాతము | = | సూర్యకాంతశిలల సమూహం |
| కోష్ణము | = | కొంచెము వేడిగలది (అయింది) |
| మృగతృష్ణావార్ధులు | = | సముద్రాలవలె కనిపించే ఎండమావులు |
| ఇంకెన్ | = | వట్టిపోయెను, తొలగిపోయెను |
| పతంగ బింబము | = | సూర్యమండలం |
| జపాశోణంబు | = | దాసానిపువ్వువలె ఎర్రనైనది అయ్యెను |
| దిశాస్తోమంబు | = | దిక్సమూహం |
| శోభాదరిద్రాణంబు | = | కాంతిహీనమైంది |
| సరోజషండములు | = | కమల సమూహములు |
| కడున్ | = | మిక్కిలి |
| నిద్రాణంబులు | = | నిద్ర పొందినవి (అంటే ముకుళించుకుపోయినవి) |
| అయ్యెన్ | = | అయినాయి |
| 4. ఒక్క చక్రవాకి | = | ఒక ఆడ జక్కవపక్షి |
| సంజన్ | = | సంధ్యాసమయంలో |
| ప్రియున్ | = | ప్రియుని, భర్తను |
| పాసి | = | ఎడబాసి |
| వగన్ | = | విచారంతో |
| సైకతంబులన్ | = | ఇసుక తిన్నెల మీద |
| ఏ విహంగమున్ | = | ఏ ఇతర పక్షిని |
| కన్నన్ | = | చూచినప్పటికీ |
| ఎలుగించుచు | = | కూస్తూ, అరుస్తూ |
| సారెకున్ | = | మాటిమాటికి |
| కూడన్ | = | ఆ పక్షిని చేరుటకై |
| తారున్ | = | పోవును |
| తారి | = | ఆ విధంగా చేరి |
| కన్గొని | = | చూచి (ఆ పక్షి) |
| తన జోడు | = | తన జత (కాకపోగా) |
| మెడయెత్తి | = | మెడ పైకెత్తి |
| మింటన్ | = | ఆకాశంలో |
| కలయన్ | = | అంతటా |
| అరయున్ | = | వెదకి చూచి |

BRAOU

కన్నీటితో = దుఃఖంతో
మరలి = తిరిగి వచ్చి
తామర యెక్కి = తామర పువ్వుపై ఎక్కి
వదనము = నోరు
ఎండగా = తడి ఆరిపోగా (అరవడంవల్ల)
సరోవారిన్ = కొలనిలోని నీటిలో
అద్దున్ = ముక్కుముంచును
అద్ది = ఆ విధంగా తడుపుకొని
త్రావగన్ = ఆ నీరు త్రాగుటకు
సైపక = రుచింపక
అట్టిట్టు = ఇరువైపుల
కన్గొని = చూచి
ప్రతిబింబము = నీటిలోని తన నీడను
ఈక్షించి = చూచి
భ్రమసి = తన జత అయిన మగపక్షి అని భ్రాంతి చెంది
ఉరుకున్ = దానిపైకి దూకును
ఉరికి = ఆ విధంగా దూకి
ఎఱకలు = రెక్కలు
తడియన్ = తడిసిపోగా
వేరొక తమ్మికిన్ = వేరొక తామర పువ్వుమీదకు
అరుగున్ = పోవును
రావంబుతో = శబ్దం చేస్తూ
తిరుగు తేంట్లన్ = సంచరించే తుమ్మెదలను
ముక్కునన్ = ముక్కుతో
పొడుచున్ = పొడుస్తుంది
మరియున్ పోవు వెదక = వేరొకవైపు ప్రియున్ని వెదకడానికి పోతుంది.
5. రవిబింబ = సూర్యబింబం
పతన = ప్రతిబింబించడంచేత
శీర్ణ = పాయగా చీలిన
పయోధి = సముద్రము (యొక్క)
గర్భ = లోభాగము నుండి
నిర్గత = బయల్వెడలిన
శేషఫణిఫణారత్నరుచి = శేషుని పడగలమీది రత్నములకాంతియా (లేక)
దివసావసాన = పగటి తుదిని (సాయంకాలం)
సందీప్త = చక్కగా తేజరిల్లుతున్న
అస్తగిరి = పడమటి కొండయొక్క
శిఖా = శిఖరములలోని
జ్యోతిర్లతా = మెరుగుతీగలయొక్క
ప్రతాన = సమూహ,
ఆతపంబో = ప్రకాశమో
తపన = సూర్యునియొక్క
ధూర్దండి = రథానికి పూన్చిన నొగలచేత
నిర్దళిత = ఛేదింపబడిన
దిక్తట = దిగ్భాగాలలో
దృశ్య = కనపడునట్టి



BRAOU

| | | |
|---|---|---|
| కమలజాండ | = | బ్రహ్మాండమనే |
| కటాహ | = | భాండం యొక్క |
| కనకఘృణియో | = | బంగారు రంగా ? |
| చండీశ | = | శివుని యొక్క |
| తాండవోత్సవ | = | ఉద్ధతమైన తాండవనాట్యోత్సవంలో |
| సంభృత | = | పట్టుకోబడిన |
| క్షపా | = | రాత్రి అనే స్త్రీ యొక్క |
| హస్తాగ్ర | = | చేతికొనలోని |
| దీప | = | దివిటీయొక్క |
| గభస్తిచయమో | = | కాంతుల సమూహమా ? |
| ప్రాక్ | = | శీఘ్రంగా |
| విధాహ | = | విశేషమైన దప్పికను |
| చిరా | = | పోగొట్టటంలో |
| వినిద్రాణ | = | హెచ్చరికతో నుండెడి |
| మదవత్ | = | మదించిన |
| అంజన | = | అంజనమనే పేరుగల దిగ్గజంయొక్క |
| ఆలాన | = | కట్టుకంబం |
| మూల | = | మొదట |
| శయ్యావిధాన | = | పడక ఏర్పరచినట్లున్న |
| వారుణ | = | వరుణ సంబంధమైన |
| ఆధోరణ | = | మావటివానిచేత |
| ఆకల్పిత | = | చక్కగా చేయబడిన |
| ఉరు | = | విశాలమైన |
| శోణమృత్తికారాశియో | = | ఎర్రని మట్టికుప్పో, |
| అనన్ | = | అనేటట్లు |
| మెరసెన్ | = | (సంధ్యాసమయం) ప్రకాశించింది. |

### 6.4.2 వ్యాఖ్యానం

ఆంధ్ర సాహిత్య చరిత్రలో రాయల కాలం స్వర్ణయుగమని ప్రసిద్ధి పొందింది. రాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలవంటి ఎనిమిది మంది కవులుండేవారని ప్రతీతి. అందులో అల్లసానిపెద్దన ప్రముఖుడు.

పెద్దన రాసిన మనుచరిత్ర ప్రబంధ ప్రక్రియలో ప్రధానంగా లెక్కించదగింది. ఆంధ్ర సాహిత్యంలో భారత, భాగవతాల తర్వాత ప్రజల ఆదరాన్ని చూరగొన్న గ్రంథం మనుచరిత్ర.

ఈ ప్రబంధానికి వ్యాసుడు రాసిన మార్కండేయ పురాణం మూలం. అందులోని స్వారోచిషమనుసంభవమనే కథను తీసుకొని రసవంతమైన ప్రబంధంగా రాశాడు పెద్దన.

అరుణాస్పదమనే ఒక పట్టణం ఉంది. అందులో ప్రవరుడనే నిష్ఠాగరిష్ఠుడైన బ్రాహ్మణుడున్నాడు. అతడు సద్గుణ సంపన్నుడు. యజ్ఞయాగాది క్రతువులు చేసుకోవడం, శిష్యులకు పాఠాలు చెప్పడం, తలిదండ్రుల్ని సేవించడం, అతిథుల్ని ఆదరించడం ఆయన నిత్య కార్యక్రమాలు. అతని భార్య అతనికి అనుకూలవతి. ప్రవరుడికి తీర్థయాత్రలు చేయాలని ఒక కోర్కె బలంగా ఉండేది. ఒకనాడు ఒక సిద్ధుడు ఆ నగరానికొస్తే ప్రవరుడు అతనికి ఆతిథ్యమిచ్చాడు. తన కోర్కె బయటపెట్టాడు. ఆ సిద్ధుడు 'ఇది అది' అని చెప్పకుండా ఒక పసరిచ్చాడు. దాన్ని పాదాలకు పూసుకొని ప్రవరుడు హిమవత్పర్వతాలకు ఎగిరిపోయాడు. అక్కడ వింతలన్నీ చూశాడు. హిమవత్పర్వతాల్లో తిరిగితిరిగి ఇంటికి పోవాలనుకొన్నాడు. మంచువల్ల పాదాలకు రాసుకున్న పసరు కరిగిపోయిన సంగతి తెలిసి దిగులుపడ్డాడు. ఇంటికి పోయే మార్గం లేక తిరుగుతుంటే వరూథిని అనే గంధర్వకన్య కన్పించింది. దారి చెప్పమని ప్రాధేయపడ్డాడు. ఆమె అతణ్ని



BRAOU

# భాగం 7 యయాతి చరిత్ర

## విషయక్రమం


7.0 ఉద్దేశం
7.1 ప్రవేశిక
7.2 సూచనలు
7.3 అచ్చ తెలుగుకావ్యం అంటే
**అభ్యాసం – 1**
7.4 పాఠ్యం
  7.4.1 కఠినశబ్దాలకు అర్థాలు
  7.4.2 వ్యాఖ్యానం
  7.4.3 విశేషాంశాలు
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
7.5 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
7.7 ఆకలింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 7.0 ఉద్దేశం

ఈ భాగం చదవడం ద్వారా మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- అచ్చ తెలుగుకావ్య ప్రక్రియ స్వరూప స్వభావాలు
- అందులోని భాష, శైలి, అలంకార సమాసరీతులు
- 16వ శతాబ్దంలో ఆంధ్రదేశంలో హిందూ ముస్లింల మధ్యనున్న సుహృద్భావం

## 7.1 ప్రవేశిక

ఇంతవరకూ ప్రాచీనకవిత్వంలోని విభిన్నరీతులకు చెందిన (6) భాగాలు చదువుకున్నారు. ఈ భాగంలో అచ్చతెలుగు కావ్య సంప్రదాయానికి చెందిన మొట్టమొదటి అచ్చ తెలుగుకావ్యం 'యయాతి చరిత్ర' అధ్యయనం చేస్తారు. భాషాశైలి దృష్ట్యా, నవ్య సమాసకల్పనపరంగా కావ్యచరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న పొన్నిగంటి తెలగన్న ఈ కావ్యాన్ని రాశాడు.

## 7.2 సూచనలు

ప్రాచీన కవిత్వ సంప్రదాయంలోని ఈ భాగం చదివేముందు తెలుగుభాషలోని అచ్చతెలుగుకావ్య సంప్రదాయానికి చెందిన ఇతర కావ్యాలు 'సత్యావివాహము' వంటి వాటిని చదవాలి. అచ్చ తెలుగుకావ్యాల్లో కవుల భాషా ప్రయోగాన్నీ, సమాసాల కూర్పునూ, అవసరం వచ్చినచోట సంస్కృత సమాసాలను అచ్చ తెలుగుకవులు భాషాంతరీకరణం చేసే పద్ధతినీ గమనించాలి. అచ్చ తెలుగుకావ్యాల్లో కనిపించే వ్యాకరణ స్వరూపాన్నీ పరిశీలించాలి.

## 7.3 అచ్చ తెలుగుకావ్యం అంటే

తెలుగు సాహిత్యంలో అచ్చతెలుగు కావ్యప్రక్రియ విలక్షణమైంది. సంస్కృతం, తెలుగు అనే భేదం లేకుండా కావ్యాలు రచించటం తెలుగు సాహిత్యంలో స్థిరమైన సంప్రదాయం. దీనికి విరుద్ధంగా తత్సమ శబ్దాల్ని

వదిలేసి తెలుగుకావ్యాలు రచించటం అనే సంప్రదాయాన్ని పొన్నగంటి తెలగన్న ప్రారంభించాడు. అంతకు పూర్వమే దీనికి అంకురార్పణ జరిగింది. పాల్కురికి సోమనాథుడు రచించిన వృషాధిప శతకంలో ఈ పద్యం చదవండి :

"బలుపొడ తోలు సీరయును, బాప సరుల్, గిలుపారు కన్ను వె
న్నెల తల, సేదుకుత్తుకయు, నిండిన వేలుపుటేఱు వల్లు పూ
సలుగల ఱేని లెంకవని జానుతెనుంగున సన్నుతించెదన్
వలపు మదిందలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా."

సోమన దీన్ని జాను తెనుగని అనటం పైపద్యంలో గమనించవచ్చు. జానుతెనుగు అంటే జన సామాన్యమైన తేటతెనుగు. నిజానికి పైపద్యంలో భాషను అచ్చతెనుగు అనటమే సమంజసం.

అచ్చ తెనుగు కావ్యాల్లో కనిపించే భాషలో విశేషనామాలు మాత్రమే తత్సమ శబ్దాలుగా ఉంటాయి. యయాతి, శర్మిష్ఠ, దేవయాని వంటి పేర్లను యథాతథంగానే వాడతారు. అయితే, సంస్కృతంలో ఒక వస్తువును, మనిషిని, దేవతను సూచించే పేర్లు కొన్ని విశేషనామాలు (proper nouns) గా కాక గుణ విశేషాలను సూచించే నామాలుగా ఉంటాయి. బ్రహ్మను చతుర్ముఖుడని; శివుని పంచముఖుడనీ, త్రినేత్రుడనీ, గరళకంఠుడనీ అనటం ఇట్లాంటిదే. ఈ రకపు పేర్లను మాత్రం నలువ అనీ, అరపది మోముల వేలుపు, తిగకంటి, సేదుకుత్తుక గల ఱేడు అనీ తెలుగు చెయ్యవచ్చు.

అచ్చ తెలుగు కావ్యాల్లో తత్సమ శబ్దాలు వాడగూడదనే నియమంవల్ల కవులు అవసరమైనప్పుడు, బలవంతాన తద్భవాలు పుట్టించిన ఘట్టాలు కూడా ఉంటాయి. కబ్బము, నెయ్యము, మానికమువంటి మాటల్లో కొన్ని అయినా ఇట్లాంటివి అయి ఉంటాయి. సంస్కృత శబ్దాలను పరిహరించినా అన్యదేశీయ పదాల మీద ఆంక్షలేదు. తేజీ, రీవి, ఫౌజు వంటి ఇతర భాషాపదాలు ఈ కావ్యాల్లో కనిపిస్తాయి. అయితే వీటిని కూడా తద్భవప్రాయాలు (assimilated loan words) గా వాళ్ళు పరిగణించి ఉండవచ్చు. దానికి కారణం ఇది : సాంస్కృతిక ప్రభావంవల్ల సంస్కృత భాషాపదాలు తెలుగులో స్వేచ్ఛగా, నిరాటంకంగా ప్రవేశిస్తాయి. తెలుగు సాహిత్య రచనా మార్గంలో అది ఒక బలమైన సంప్రదాయం. ఇతర భాషాపదాలు జన సామాన్యంలో నుంచే వస్తాయి. ఈ ఉద్దేశంతోనే ఇటీవలికాలంలో సత్యావివాహమనే అచ్చ తెలుగుకావ్యం రచించిన జంగా హనుమయ్యగారు ఇంగ్లీషు మాటలు కూడా వాడారు.

అచ్చ తెలుగు కావ్యాలు వాడిన పదాలనుబట్టి కాక బలవంతాన పుట్టించిన తద్భవాలవల్ల, కృత్రిమంగా తయారుచేసిన సమాసాలవల్ల అర్థం చేసుకోవటం కష్టమవుతుంది. సంస్కృత శబ్దాలలోకి, సమాసాల్లోకి అనువదించుకోవలసివస్తుంది.

మెదడుకు పదునుబెట్టే అభ్యాసాలు (intellectual exercises) గా వీటిని చదువుకోవచ్చు.

ఏ సాంఘిక కారణాలవల్ల ఈ శాఖ విస్తరిల్లిందో చెప్పటం కష్టం.

## అభ్యాసం – 1

అచ్చ తెలుగు కావ్యం అంటే ఏమిటి ?



BRAOU

## 6.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత కవిత్వంలోని ప్రాచీన సంప్రదాయంలో ప్రబంధ ప్రక్రియకు చెందిన పాఠ్యం ఇది.
- ప్రకృష్టమైన బంధం కలిగింది ప్రబంధం
- 18 లేదా 21 వర్ణనలతో, సాంద్రమైన కవిత్వ శిల్పంతో, ప్రౌఢ పదబంధాలూ, సమాసాలంకారాలూ కలిగిఉన్న లక్షణమే ప్రబంధకర్తల దృష్టిలో ప్రకృష్టబంధం.
- ప్రబంధ ప్రక్రియలో అల్లసానిపెద్దన రచించిన 'మనుచరిత్ర' మొట్టమొదటి గ్రంథం.
- 'స్వారోచిషుడు' అనే మనువు జననాన్ని చెప్పింది కాబట్టి ఈ ప్రబంధానికి 'మనుచరిత్ర' అని పేరువచ్చింది.
- 'మనుచరిత్ర' లో వివిధ వర్ణనల ద్వారా విభిన్న కథాంశాలు సూచింపబడ్డాయి.
- ప్రవరాఖ్యుని దర్మనిష్ఠ, ఇంద్రియ నిగ్రహశక్తి ఈ పాఠ్యంద్వారా వెల్లడౌతున్నాయి.
- ఈ పాఠ్యం చదవడం ద్వారా విద్యార్థులకు ఆంధ్రసాహిత్యంలో ప్రబంధ ప్రక్రియాపరంగా ఒక యుగాన్నే సృష్టించిన కవిత్వ పరిణామ లక్షణాలూ, విశేషాలూ తెలియవస్తున్నాయి.

## 6.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. పెద్దన సూర్యాస్తమయాన్ని వర్ణించిన విధానాన్ని వివరించండి ?
2. పాఠ్యంలోని ప్రకృతి వర్ణన పద్ధతిని సమీక్షించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

ఈ భాగంలోని ఒక ఉత్ప్రేక్షాలంకారాన్ని లక్ష్య లక్షణ పూర్వకంగా వివరించండి ?

## 6.7 ఆకళింపు ప్రశ్నలు

1. పదప్రయోగంలోనూ, వాక్యరచనలోనూ, అలంకార నిర్వహణలోనూ పెద్దనకూ శ్రీనాథునికీ ఉన్న పోలికలను గమనించండి.

2. ఇక్కడ కొన్ని అలంకారాలకు నిర్వచనాలిస్తున్నాం. వాటిని ఈ పాఠ్య భాగంలోని పద్యాలతో సమన్వయించండి.

   అ. భ్రాంతిమంతము : సాదృశ్యం వల్ల ఒక వస్తువును ఇంకో వస్తువుగా భ్రమించటం.

   ఆ. స్వభావోక్తి : ఉన్నది ఉన్నట్లు స్వాభావికంగా వర్ణించటం. అసాధారణ పరిశీలనకు కనిపించే విశేష లక్షణాలను స్వభావానుగుణంగా వర్ణిస్తే స్వభావోక్తి అవుతుంది.

3. ఈ పాఠ్య భాగంలో నాలుగో పద్యంలో ఒక వాక్య నిర్మాణ వైచిత్రి ఉంది. ఈ రకమైన వాక్య నిర్మాణాన్ని మాట్లాడే భాషలో వాడే పద్ధతికి, ఈ పద్యంలో వాడిన పద్ధతికి ఏమైనా భేదం ఉందేమో పరిశీలించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. ప్రకృష్టమైన కవితాబంధం కలిగిన కావ్యప్రక్రియ ప్రబంధం అని సాహితీవేత్తల భావన. కావ్య శరీరానికి సంబంధించిన (18) లేక (21) వర్ణనలతో కూడి ఉంటుంది ప్రబంధం. సూర్యోదయం, జలక్రీడ,

BRAOU

సూర్యాస్తమయం, పెండ్లి, సంతానోదయం, వేట, చంద్ర, మన్మథ, మందానిల ఉపాలంభం, ప్రణయం, వంటివి సాధారణంగా ప్రబంధంలో వర్ణింపబడే అంశాలు. కొన్నిటిలో దండయాత్ర వర్ణనకూడా ఉంటుంది. తెలుగు సాహిత్యంలోని కావ్య సంప్రదాయాల్లో 16వ శతాబ్దంలో పొడసూపిన ప్రక్రియ ప్రబంధం. ఆ ప్రక్రియా పరంపరలో వచ్చిన మొట్టమొదటి ప్రబంధం అల్లసాని పెద్దన రచించిన 'మనుచరిత్ర'.

ప్రబంధం ఒకే నాయకుని చుట్టూ తిరిగే సంఘటనలతో, కథాంశాలతో కూడి ఉంటుంది. ప్రబంధంలో ఉండే ఈ లక్షణాన్ని 'వస్త్వైక్యత' (Unity of Plot) అంటారు. ప్రౌఢమైన పదబంధాలతో, సమాసాలతో, అలంకారాలతో, చిక్కని కవితాశిల్పంతో ప్రబంధంలోని రచనా శైలి ఉంటుంది. ప్రబంధం ఒకమొత్తంగా ఏ ఇతరభాషా గ్రంథానికి అనువాదం కాక, స్వతంత్ర కథానిర్వహణ పద్ధతిలో ఉంటుంది. అష్టాదశ వర్ణనలు అన్ని ప్రబంధాల్లోనూ కనీసానికి ఉంటాయి కాబట్టి, ప్రబంధ ప్రక్రియలోని వర్ణనా పద్ధతి, కవిత్వ శిల్పం దాదాపుగా ఒకే మూసలో పోసినట్టుగా ఉంటాయి.

2. ప్రవరుడు వరూధిని అనే గంధర్వ కన్యను తిరస్కరించిపోయిన సన్నివేశం. హిమవత్పర్వతం నుండి ప్రవరుడు అరుణాస్పదపురం బయలుదేరాడు. సూర్యుడు పడమటి దిక్కుకు బయలుదేరాడు. వరూధిని అవివాహిత. ఆమె ప్రవరుణ్ణి గాఢంగా ప్రేమించింది. ప్రవరుడు ఆమెను మన్మథుని బాధకు లోనుచేసి వెళ్ళినందుకు కోపగించుకొన్నాడా అన్నట్లు సూర్యుడు ఎర్రబారినాడట. సాయం సమయానికి సూర్యుడు ఎర్రబడడం ప్రకృతి సహజం. అట్టి సహజమైన విషయాన్ని కథతో సమన్వయించి విశేష ప్రతిభను కనబరచాడు పెద్దన. కర్మసాక్షి ఐన సూర్యుడు భూతదయ లేని ప్రవరుణ్ణి సహించలేకపోయాడు. అందుకే వరూధిని మీద సానుభూతి చూపినాడని ధ్వని వుంది ఈ సందర్భంలో.

వేరొక సన్నివేశమిది.

సాయంకాలమైంది. ఎవరు ఎవరో తెలియని స్థితి ఆవరిస్తుంది. ఒక ఆడు చక్రవాకం ప్రియుణ్ని ఎడబాసి, అతడు పోయిన జాడ తెలియక ఆ ప్రాంతంలో మెడ ఎత్తి ఆకాశంవైపు చూస్తుంది. ప్రియుడు అక్కడ కూడా కనబడకపోవడంతో దుఃఖిస్తుంది. కొలను వద్దకు వస్తుంది. తామరపువ్వుపై వాలుతుంది. గొంతు తడి ఆరిపోయేట్లు విలపిస్తుంది. మరలా నీళ్ళతో గొంతు తడుపుకుంటుంది. దిక్కులు చూస్తుంది. నీళ్ళలో తన నీడనే చూచుకొని ప్రియుడని భ్రమిస్తుంది. ఆ నీడపై దుముకుతుంది. తడుస్తుంది. నిజం తెలుసుకుంటుంది. మరలా తామరపువ్వులపై తిరిగే తుమ్మెదలమీద వివాదానికి తలపడుతుంది. వాటి ఝుంకారాన్ని సహించలేక అసూయతో ఉడికిపోతుంది.

ఈ వర్ణనలోని ప్రతి అంశమూ వరూధిని విరహాన్ని తెలియజేస్తుంది. ఇక్కడ వరూధిని ఆడ జక్కవ. దూరంగా వెళ్లిన మగ జక్కవ ప్రవరుడు. అతని జాడ తెలియక ఎవరిని చూచినా తనవాడే అనుకోవడం కూడా కథలో జరిగింది. ఈ విధంగా ప్రకృతి వర్ణనలో కథాంశాలను సమన్వయించి పాఠకులకు అందించాడు ఆంధ్ర కవితా పితామహుడు.

3. అల్లసాని పెద్దన రచించిన 'మనుచరిత్ర' అనే ప్రబంధం లోని ప్రధాన కథాఘట్టం – వరూధిని ప్రణయం. ధర్మబుద్ధి గలిగిన ప్రవరాఖ్యుడు ఆమె ప్రణయాన్ని తిరస్కరించడం ఈ ఘట్టంలోని ముఖ్యాంశం. ఐతే, 'స్వారోచిషుడు' అనే మనువు పుట్టుకను కూడా ఈ ప్రబంధం వర్ణిస్తున్నది. మానవ ధర్మాలను నెలకొల్పేది మనువు కాబట్టి ఈ ప్రబంధానికి 'మనుచరిత్ర' అని నామకరణం చేశాడు పెద్దన. వరూధినిని తిరస్కరించి ప్రవరాఖ్యుడు వెళ్లిపోయిన తర్వాత, ప్రవరునివేషం ధరించి వచ్చిన ఒక గంధర్వునికీ వరూధినికీ 'స్వరోచి' జన్మిస్తాడు. అతని కుమారుడే 'స్వారోచిషుడు'. అతని జననం – మనుధర్మసముద్ధరణం ఫలితాంశంగా వెలసింది కాబట్టి, ఈ ప్రబంధానికి 'మనుచరిత్ర' అనే పేరు సార్థకం.

**– ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి**



BRAOU

ప్రేమించింది. తన ప్రేమ ఫలించడానికి మార్గం చెప్పమని ఆమె కోరింది. తుచ్ఛ సుఖాలు తనకు వద్దని అతడూ, భూతదయ అన్నింటి కంటె గొప్పదని ఆమే వాదించుకున్నారు. ఎన్నో విధాల అతణ్ణి ప్రార్థించింది. భంగపోయింది. ఏదిఏమైనా ఆమెకు లొంగక ప్రవరుడు అగ్నిని ప్రార్థించి అరుణాస్పదపురానికి ఎగిరిపోయాడు. ఆ సందర్భంలోని సూర్యాస్తమయ వర్ణన ప్రస్తుత అంశం. ఈ పద్యాలు మనుచరిత్ర తృతీయాశ్వాసం ప్రారంభంలోవి. వాటి భావం ఇది.

నిండు యౌవనంలో ఉన్న సుందరాంగి ఐనా, వరూధిని తనకు పరస్త్రీ కాబట్టి ధర్మ నిష్ఠాగరిష్ఠుడైన ప్రవరుడు ఆమెనూ, ఆమె అభిలాషనూ తిరస్కరించి వెళ్లిపోయాడు. అలా తిరస్కరించడం ద్వారా ఆమెను మన్మథునికి అధీనం చేశాడు. అతణ్ణే స్మరిస్తూ, అతని విరహతాపంతో వేగిపోతూ స్పృహ కోల్పోయింది. మన్మథుని బాణాలకు ఎరవేసి క్రూరుడై ఆ నీచుడు వెళ్లినందుకు సూర్యుడు కూడా కోపగించుకున్నాడా ! అన్నట్లు ఆకాశంలో ఎర్రని కాంతులు అలముకున్నాయి.

ఇది అస్తమించబోతున్న సూర్యుని వర్ణన. ప్రకృతిలోని వస్తువుల్ని, సన్నివేశాల్ని కథలో అన్వయించుకోవడం ఒక కవితా పద్ధతి. అస్తమించే సూర్యుడు ఎర్రబడడం ప్రకృతిలో సహజం. ఇక్కడ ఆ ఎర్రబడడం అనేది ప్రవరుని మీద కోపంతో అనడంలో రామణీయకత వుంది. సానుభూతి ఇక్కడ గమనించదగింది. అడవిలో పొదరిండ్ల మధ్య పచ్చిక నేలల్లో మేస్తున్న జింకలు దట్టంగా వ్యాపించిన ఆ ఎరుపు చూసి కార్చిచ్చు అడవిని కాల్చివేస్తున్నదనే భయంతో కకావికలవుతున్నాయి.

ఆశ్రమ ప్రాంతంలోని చెట్ల కొమ్మల మీద ఎర్రదనాన్ని చూసి మునులు తాము ఆరగట్టిన కావి వస్త్రాలు విప్పడం మరిచామా అన్న భ్రాంతిని పొందుతున్నారు. హిమవత్పర్వతంమీద ఎర్రని కాంతులు ప్రసరిస్తున్నాయి. ఆకాశంలో విహరించే దేవతలు ఆచరియలు, శిఖరాలు, చరుకాలు చూశారు. బంగారు కాంతులీనుతున్నాయి. అది తమ నివాసమైన మేరు పర్వతమేననే భ్రాంతితో దిగుతున్నారు.

సూర్యాస్తమయ సమయం. మేత కొరకు పోయిన పక్షులు ఆకాశంలో బారులు దీరి గూళ్ళను చేరుతున్నాయి. వేడితో కాలిపోయిన సూర్యకాంత శిలలు, మెల్లగా చల్లబడుతున్నాయి. సముద్రంలాగా వ్యాపించిన ఎండమావులు మాయమవుతున్నాయి. సూర్యమండలం దాసానిపువ్వులాగా ఎర్రబడుతున్నది. దిక్కులు కాంతిహీనాలవుతున్నాయి. కమల సమూహాలు ముకుళించుకునిపోతున్నాయి.

ప్రకృతిలో స్వభావ సిద్ధంగా జరిగే పరిణామాల వర్ణన ఇది. దీన్ని స్వభావోక్తి అలంకారంగా చెపుతారు.

పొద్దు కుంకింది. ఎవరు ఎవరో తెలియని స్థితి ఏర్పడింది. ఒక ఆడ చక్రవాక పక్షి ప్రియుణ్ణి ఎడబాసి, అతడు పోయిన జాడ తెలియక ఏ పక్షి ఆ ప్రాంతంలో వాలినా అతడే అని దగ్గరకు చేరుతుంది. దగ్గరకు వెళ్ళి ప్రియుడు కాకపోవడంతో మెడ ఎత్తి ఆకాశంలోకి చూస్తుంది. ఆకాశంలో కూడా కనబడకపోవడంతో దుఃఖిస్తుంది. కొలను వద్దకు వస్తుంది. తామర పువ్వుపై వాలుతుంది. గొంతు ఎండేటట్లు అరుస్తుంది. మరలా నీళ్ళతో గొంతు తడుపుకుంటుంది. దిక్కులు చూస్తుంది. నీళ్ళలో నీడ చూస్తుంది. అదీ తన ప్రియుడే అని భ్రమిస్తుంది. ఆ నీడపై తిరిగే తుమ్మెదలమీద తలపడుతుంది తగాదాకు. వాటి ఝుంకారాన్ని సహించలేనితనంతో ఉడికి పోతుంది.

ఆడ జక్కవ తన మగ పక్షి కోసం చేస్తున్న అన్వేషణలో వరూధిని మనఃస్థితి పోలికను కూడా గ్రహించవచ్చు.

ఆడజక్కవ పక్షి తన్ను విడిచి వెళ్లిన జంటపక్షి కోసం వెతుకుతూ వివిధ వస్తువులను చూచి పడే భ్రమలను వర్ణించటంలో భ్రాంతిమదలంకారాన్ని గుర్తుపట్టవచ్చు. జక్కవ పిట్టలు ఎప్పుడూ జంట విడవకుండా తిరుగుతాయని తెలుగు కవులు కావ్యాల్లో వర్ణిస్తారు.

సాయం సమయం. సూర్యుడు పడమటి సముద్రంలో పడ్డాడు. ఆ సమయంలో సముద్రం పాయలుగా విడివడింది. పాతాళం నుంచి ఆదిశేషుని పడగల మీది రత్నకాంతులు పైకి ఉబికినట్లు కాంతులు ప్రసరిస్తున్నాయి.

BRAOU

పడమటి కొండమీద సూర్యకాంతులు పలుచబడుతున్నాయి. ఆ వెలుగు తగ్గిన కాంతి మెరుగు తీగల వెలుగా అన్న భ్రమకొల్పుతుంది. సూర్యుని రథం వెనక్కు తిరిగి వెళుతుంది. ఆ రథం నొగలు దిక్తటంలో గుచ్చుతున్నాయి. ఆ చీలిన దిక్తటం నుండి బ్రహ్మాండభాండం యొక్క సువర్ణకాంతులు ప్రసరిస్తున్నాయా అనిపిస్తుంది. శివుడు తాండవం చేస్తున్నప్పటి దివిటీ ప్రకాశమా అన్నట్లుంది. మదమెక్కిన పడమటి దిగ్గజానికి మావటివాడు పరచిన ఎర్రమట్టి పరుపో అన్నట్లు వుంది సంధ్యారాగం.

అలంకారం : ఉత్ప్రేక్ష.

### 6.4.3 విశేషాంశాలు

చాలా అలంకారాలకు మూలం ఉపమాలంకారం. ఈ అలంకారం తెలుసుకుంటే తప్ప మిగతావి అర్థం కావు. కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు "ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము" లో రాసిన వ్యాసం ఆధారంగా ఉపమాలంకార వివరణను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

ఉపమ లక్షణము : ఒక పదార్థమును మరియొక పదార్థముతో పోల్చి చెప్పుట.

ఉదా : "ఆ బాలుని ముఖము చంద్రునివలెనందముగనున్నది". ఉపమాలంకారంలో నాలుగు ప్రధానాంగాలుంటాయి.

1. ఉపమేయము : దీనికే వర్ణ్యము, ప్రస్తుతము, ప్రకృతము, విషయము అనే పేర్లు కూడా ఉన్నాయి. దేన్ని మనం వర్ణించదలచుకున్నామో అది ఉపమేయం.

2. ఉపమానము : దీనికే అవర్ణ్యము, అప్రస్తుతము, అప్రకృతము, విషయి అనే పేర్లు కూడా ఉన్నాయి. ఉపమేయాన్ని దేనితో పోలుస్తున్నామో అది ఉపమానం.

3. సమాన ధర్మము : ఉపమేయ, ఉపమానాల్లో ఉన్న సమానమైన గుణం.

4. ఉపమావాచకము : సమాన ధర్మాన్ని సూచించే శబ్దం.

ఉపమాలంకారాన్ని గురించిన విశేష చర్చ మన అలంకార శాస్త్ర గ్రంథాల్లో దొరుకుతుంది.

BRAOU

## అభ్యాసం – 2

మనుచరిత్రలోని వర్ణనలో స్ఫురించే కథాంశాలను వివరించండి ?

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

## అభ్యాసం – 3

"మనుచరిత్ర" అనే పేరులోని సార్థకత చర్చించండి ?

________________________________________

________________________________________

________________________________________

________________________________________

## 7.4 పాఠ్యం

క. ఆవీడేలున్ సొబగుల
పూవిల్తుఁడు, నిచ్చ చాగపుంబులి యనఁగా
దీవులకుఁ బాదుసాలకు
దేవర యిభరాముశాహు తేజఁడరంగన్. 1

చ. దురమున నోడిపోయి మఱి త్రోవలుగానక మార్తురెంతవే
ర్పరు, లిభరాముశాహువు తిరంబగునండను జేరి, తొంటియ
చ్చెరువగుసొమ్ము రాకొమరుచేఁ గడు మ్రొక్కులఁ గొంతురొగదా
వెరవరులైనవారలకు వింతయె యాసిరులెందు నుండినన్. 2

సీ. తెలివిసింగంపుగద్దియల రాతెఱగంటి
దొరలెల్ల మోడ్పుఁజేతులనె కొల్వఁ
బూని యేఁబదియాఱుమానిసినెలవుల
పుడమిఱేండ్లాడిగంబులకుఁ జొరఁగ
లీవి మున్నీటిలో దీవు లన్నియు నేలు
మన్నీలు మెట్టఁదామరల కెరగఁ
దనతేజు సుడిగట్టు వెనుక చీఁకటి వెల్ల
విరియించు తమ్మిలవిందు గాఁగ

తే. వెలయు మలికిభరామును గొలిచి మనుచుఁ
గలనఁ దనచెయ్యి మీఁదుగాఁ గడిమి మెఱసి
మేలు సిరులందునట్టి యమీనుఖాన
యొడయఁ డొకనాఁడు నిండు పేరోలగమునఁ. 3

చ. పొలఁతుల్ చుట్టలు రాయబారులు దొరల్ ప్రోడల్ చెలుల్ మన్నెవా
రలు మావంతులు దీవులేల[illegible]కుల్ రౌతుల్ మొదల్గాఁదనుం
గొలువన్ సంతసమంది [illegible]బ్బ్రయులు పేర్కోవింపఁ బిల్పించి న
న్నలరంగఁ దన[illegible]డ [illegible]ంచుకొని నెయ్యంబొప్ప మన్నించుచున్. 4

క. కలపము చేసిన [illegible]
బలఁదించిన వెనుక వన్నియలపచ్చడముల్
పలుమానికములసొమ్ములు
బలుతేజీ లిచ్చి కూర్మిపై పైఁ బర్వన్. 5

మ. తనకున్నిచ్చలు మ్రొక్కువారిని సిరుల్ దైవాఱఁగాఁ జల్లి చూ
పున నెల్లప్పుడుఁ జూచి మన్పఁగల పెన్ప్రోడన్ మఱింగంటియ
ప్పనగారిన్ మదిలోనిమాట దెలియం బాటించుచుం గాంచినన్
గని యామేటి తలంపెఱింగి పొసఁగంగా నన్ను మన్నించుచున్. 6

### 7.4.1 కఠినశబ్దాలకు అర్థాలు

1. నిచ్చ చాగపుంబులి = ప్రతిక్షణమూ దానంచేసే గుణం కలవారిలో శ్రేష్ఠుడు
   దీవులకు = విభిన్న రాజ్యాలకు
   పాదుసాలకు = ప్రభువులకు

2. మార్తురు = శత్రువులు
   వెరవరులు = నేర్పరులు

| | | |
|---|---|---|
| 3. | తెలిగంటి దొరలు | = అనిమిషులైన (రెప్ప వాల్చని) దేవతలు |
| | ఏబదియాఱు మానిసి నెలవులు | = 56 రాజ్యాలు (ఛప్పన్న దేశాలు) |
| | మెట్టదామరలు | = నేలపై మొలచిన (ఇభరాముని) పాదాలు అనే పద్మాలు |
| | తేజు | = కాంతి |
| | సుడిగట్టు | = అస్తాద్రి (అస్తమయ పర్వతం) |
| | తమ్ములు | = పద్మాలు, అనుచరవర్గం |
| 4. | మన్నెవారలు | = పాళెగాండ్రు |
| | మావంతులు | = మావటీలు |
| 5. | కలపము చేసిన గంధము | = కస్తూరి మొదలైన తదితర సుగంధ ద్రవ్యాలచేత కలిపి తయారుచేయబడిన శ్రీచందనం |
| | తేజీలు | = గుర్రాలు |
| | మానికములు | = రత్నమాణిక్యాదులు |
| 6. | సిరుల్దైవారగా | = సంపదలు కలిగేటట్టుగా |

### 7.4.2 వ్యాఖ్యానం

'కులీ' వంశీయులు పర్షియా రాజవంశంలో జన్మించి మధ్య ఆసియాలోని తబ్రీజ్, హందం నగరాలను పాలించారు. శత్రువులచే పరాజితులైన ఈ రాజులు క్రీ.శ. 15వ శతాబ్ది చివరి భాగంలో భారతదేశానికి వలస వచ్చారు. శ్రీకృష్ణదేవరాయలకు సమకాలీనులైన బహమనీ సుల్తాన్‌లను ఆశ్రయించారు. వారిలో ప్రముఖుడు "సుల్తాన్ కులీ". బహమనీ ప్రభువు మహమ్మద్ షా ఆయనకు "కుతుబ్-ఉల్-ముల్క్" అనే బిరుదు ఇచ్చి, వరంగల్ సుబాకు చెందిన తెలుగుదేశంపైన అధికారిగా నియమించాడు. 1518లో మహమ్మద్ షా మరణించిన తర్వాత సుల్తాన్ కులీ "కుతుబ్ షా" అన్న బిరుదు వహించి స్వతంత్రుడయ్యాడు. అంతేకాక, బిరుదుకు తగ్గట్టుగా తన సామ్రాజ్యాన్ని వరంగల్లు నుంచి మచిలీపట్టణందాకా విస్తరింపజేసి, గోల్కొండ కేంద్రంగా పాలించాడు. ఐనా మత భేదాలను పాటించక, తాను ఏలేది తెలుగునేలనే సత్యాన్ని విస్మరించక, అర్హులైన వారందరికీ ఉన్నతోద్యోగాల నిచ్చాడు. ఈ విషయానికి కొట్టొచ్చినట్టు కానవచ్చే నిదర్శనం – శ్రీకృష్ణదేవరాయల అల్లుడైన ఆరవీటి (అళియ) రామరాయలు మొట్టమొదటిసారిగా ఈ కులీ కుతుబ్‌షా కొలువులో ఉండటమే. కులీ కుతుబ్‌షా తెలుగు సంస్కృతికీ, సాహిత్యానికీ ఇక్కడి ఆచార వ్యవహారాలకూ ఎంతో ప్రాధాన్యం ఇచ్చాడు. అళియరామరాయలు కూడా కవనానికీ, ఆశ్రిత పోషణకూ అంత విలువా ఇచ్చాడు. ఈ రెంటినీ చవి చూసినవాడు కాబట్టే తర్వాతి ఇబ్రహీం కులీ కుతుబ్‌షా ఉభయ సంస్కృతులనూ జీర్ణించుకుని, తెలుగు సాహిత్య వికాసానికై కృషిచేసి, తెలుగు కవులతో "ఇభరాముడు"గా కీర్తించబడ్డాడు. అద్దంకి గంగాధర కవి తన "తపతీ సంవరణోపాఖ్యానం" ఇతనికే అంకితం చేశాడు. ఆయన మహమ్మదీయుడైనా "హైందవ దేవతలు" అతణ్ణి రక్షించాలని తెలుగు కవులు తమ కవితల్లో ప్రార్థించడాన్నిబట్టి, అతని సమన్వయ దృక్పథం తెలుస్తుంది.

BRAOU

ఇలాంటి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యంతో అళియ రామరాజు ఆశ్రయంలో మతసామరస్యంతో బాటు తెలుగు సాహిత్యాన్నీ, సంస్కృతినీ ఒంటపట్టించుకున్న 'మల్కిభరామ్" ఆస్థానంలో ఉన్నత పదవిలో ఉన్న అమీర్‌ఖాన్ తనకు పరమాప్తుడైన మరింగంటి అప్పన్న ద్వారా "యయాతి చరిత్ర" కృతికర్త తెలగన్నను (క్రీ.శ. 1575 ప్రాంతం) –

"పిలిచి పొన్నికంటి తెలగన్న, నీచేయు
నచ్చ తెలుగు కబ్బమన్ని యెడల
మంచి వెలయగా నమీరుఖానునకిచ్చి
పుడమిలోన సిరుల, పొగడు గనుము"

(కబ్బం = కావ్యం; పొగడు = కీర్తి)

అని అభ్యర్థించాడు.

ఇలా హైందవ ముస్లిం మతసామరస్యానికి చిహ్నంగా నిలవడమే కాక; ఇలాంటి "కృతి సమర్పణ కార్యక్రమాలు" ముస్లిం పరిపాలనలో కూడా ఎలా నిర్విఘ్నంగా కొనసాగాయో- మన ప్రస్తుత పాఠ్యాంశం "యయాతి చరిత్ర" లోని కృతి సమర్పణ పద్యాలు 4 నుంచి 9 వరకూ నిరూపిస్తాయి.

క్రీ.శ. 16వ శతాబ్దం హిందూ ముస్లిం సమైక్యతకూ; సాహిత్య, సాంస్కృతిక వినియమానికీ తెలుగు నేలలో తోడ్పడిన కాలం. హిందువైనా ముస్లిమైనా పై జీవితదృక్పథంతోనే జీవితాలను గడిపిన సమయం. అందుకే కులమత భేదాలను పాటించక మల్కిభరామ్, అమీర్‌ఖాన్‌ల వంటి వదాన్యులకు తెలుగు కవులు తమ కృతులు అంకితం చేశారు. ఇలాంటి ఘట్టాలు ఆనాటి సాంస్కృతిక జీవితానికే కాక, సాంఘిక దృక్పథానికి దర్పణాలు.

"యయాతి చరిత్ర" లోని అవతారిక 4-9 పద్యాల్లో రచయిత మల్కిభరాముని ప్రాభవాన్నీ; హైందవ మత సామరస్యాన్నీ వివరించాడు. తెలుగు సాహిత్యం పట్ల అతనికీ, అతని అనుచరులకూ ఉన్న అభిమానాన్ని ప్రకటించాడు. తన కృతిని అమీర్‌ఖాన్‌కు అంకితం ఇచ్చిన సంగతి సందర్భాలను వివరించాడు.

పొన్నగంటి తెలగన్న కేవలం తన కావ్యాన్ని ప్రకాశింపజేయటమే కాక, అచ్చ తెలుగు పట్ల తనకు గల అభిమానాన్ని ఈ కావ్య రచన ద్వారా ప్రకటించాడు. పాఠ్యంలోని పద్యాల భావం ఇది.

1. గోల్కొండ నగరంలో అనేక సామంతరాజులకు ప్రభువై మన్మథుని మారురూపు దాల్చినట్టుగా, త్యాగబుద్ధికి నిధానమైన మల్కిభరాం రాజ్యం చేస్తున్నాడు. ఈ వాక్యాలతో ఈ భాగం ప్రారంభమౌతుంది.

'యయాతి చరిత్ర' కృతిపతి ఐన అమీన్‌ఖాన్‌కు ప్రభువు మల్కిభరామ్. కాబట్టి ఈ అచ్చతెలుగు కావ్యం మొదట్లోకవి అతని కళాపోషణ పరత్వానికీ, హిందూ ముస్లిం సమైక్యతకూ కృతజ్ఞతగా మొట్టమొదట మల్కిభరామ్‌నే స్తుతిస్తూ ఈ పద్యాలు రాశాడు.

2. మల్కిభరామ్ చేతిలో యుద్ధరంగంలో ఓడిపోయిన శత్రువులు వేరే దిక్కులేక, ఎంతో నేర్పుతో, తిరిగి ఆయననే ఆశ్రయించి సకల సంపదలూ పొందుతున్నారు. ఈ విధంగా వర్ణించడంలో మల్కిభరామ్ ప్రభువు శత్రువులనైనా సరే, శరణువేడితే రక్షించి తీరతాడని, ఆయన ఔదార్యగుణాన్ని ప్రశంసిస్తున్నాడు కవి. తమను ఓడించిన రాజునే శరణు పొందిన శత్రువులు తిరిగి సకల సుఖాలూ అనుభవిస్తున్నారు కాబట్టి, నేర్పరులైన వారికి ఏ పరిస్థితుల్లోనైనా కష్టనష్టాలు కలుగవంటూ ఒక అర్థాంతరన్యాసాలంకారంతో ఈ పద్యాన్ని ముగిస్తున్నాడు.

3. మల్కిభరామ్ పాదుషాను 56 దేశాల ప్రభువులూ, సామంతులూ సేవిస్తున్నారు. నేలపై మొలిచిన పద్మాలవంటి అతని పాదాలను పూజిస్తున్నారు. అతని తేజస్సు అస్తాద్రి వెనుక ఉన్న చీకటిని కూడా చీల్చివేసేటంతటి కాంతి గలది. అలాంటి మల్కిభరామ్ చేత అనేక సన్మానాలు పొందే అమీర్‌ఖాన్ అనే సర్దారు ఒకనాడు (తర్వాతి పద్యంతో అన్వయం).

4. తన ఆస్థానంలో అనేక వీరులు, సామంతులు, వారాంగనలు, రాయబారులు, పురప్రముఖులు తనను పరివేష్టించి ఉండగా, కావ్యగోష్ఠిలో మునిగిఉండి, పొన్నగంటి తెలగన్నను పిలిపించి తన ప్రక్కన సముచితాసనంలో కూర్చుండబెట్టి గౌరవించాడు.

5. చందనచర్చలతో, అమూల్య వస్త్రాభరణాది బహుమానాలతో, రత్నమాణిక్యముల కానుకలతో ఆదరించాడు.

6. ఆ తర్వాత తనను ఆశ్రయించిన వారికి ఇష్టసిద్ధిని కలిగించే వాడూ, తెలగన్నకు అప్పుడూ ఐన మరింగంటి అప్పన్నను - తన మనస్సులోని మాట తెలగన్నకు తెలపవలసిందని సూచిస్తూ అమీన్‌ఖాన్ ప్రసన్న వీక్షణాలను ప్రసరింపజేశాడు. ఆ చూపులను అవగతం చేసుకున్న అప్పన్న తెలగన్నతో ఇలా అన్నాడు.

ఈ పద్యంతో ఈ భాగం ముగుస్తున్నది. తర్వాత వచ్చే పద్యాల్లో ఆంధ్ర సాహిత్య ప్రపంచంలో మొట్టమొదటి అచ్చ తెలుగు కావ్యమైన 'యయాతి చరిత్ర'ను అమీన్‌ఖాన్‌కు అంకితం చేయమని అప్పన్న అడగటం, తెలగన్న సమ్మతించి కృతి సమర్పణ చేయడం ఉంటుంది.



BRAOU

### 7.4.3 విశేషాంశాలు

1. లయ – ఛందస్సు :

రాసింది అచ్చ తెలుగు కావ్యమే ఐనా లయకూ, ఛందస్సుకూ సంబంధించిన **పోకడలు** పూర్వకవులవే. జాతులూ, ఉపజాతుల్లో నడిచిన ఈ కృతిలోని ఛందో విధానం పాఠ్యంలోని పద్యాలను గమనిస్తే సుబోధకమౌతుంది. ఉదాహరణకి 7వ పద్యం ఎత్తుగడ **"పొలతుల్ చట్టలు రాయబారులు దొరల్ ప్రోడల్ చెలుల్"** అనేది – పూర్వకవులెందరో అనుసరించిన పద్ధతే. ప్రస్తుత పాఠ్యంలోని పద్యాలు అంకితానికి చెందినవి కాబట్టి, అంతగా 'లయ'ను గమనించలేము.

2. పద చిత్రాలు

| | | |
|---|---|---|
| వాగపుంబులి | : | దానరాధేయుడు లాంటి సమాసం. దాన శార్దూలుడని అర్థం. (దానం చేయడంలో పులిలా విజృంభించేవాడు) – రూపక సమాసం |
| తెరగంటి దొరలు | : | రెప్పపాటు లేని (తనముకల) వారు – దేవతలు – బహువ్రీహి సమాసం |
| ఏబది ఆరు మానిసి నెలవులు | : | 50 రాజ్యాలు – ద్విగు సమాసం |

## అభ్యాసం – 2

'అర్థాంతరన్యాసం' అనే అలంకారాన్ని వివరించండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## అభ్యాసం – 3

తెలగన్న రచనలోని తెలుగు మాటలు పరిచయం చెయ్యండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

BRAOU

## 7.5 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత కవిత్వంలోని ప్రాచీన సంప్రదాయంలో అచ్చతెలుగు కావ్య ప్రక్రియకు చెందిన పాఠ్యం ఇది.
- తత్సమ శబ్దాలను వాడక కావ్య శిల్పాన్ని ఆద్యంతమూ తెలుగు భాషా పదాలతోనే నిర్వహించే ప్రక్రియ అచ్చ తెలుగు కావ్య ప్రక్రియ. అన్యదేశ్యాల మీద ఆంక్ష లేదు.
- అచ్చ తెలుగు కావ్య ప్రక్రియలో పొన్నిగంటి తెలగన్న రాసిన 'యయాతి చరిత్ర' మొట్టమొదటి కవిత్వ గ్రంథం.
- ఈ కావ్యం ద్వారా మల్కిభరామ్ ప్రభువు పాటించి, అమలు పరచిన మతాతీత దృక్పథం, అతని కళాపోషణ పరత్వం తెలియవస్తున్నాయి.
- అచ్చ తెలుగుకావ్యంలోని భాషా స్వరూపం, తెలుగు మాటలతో కూడిన శైలీ విధానం ప్రకటమౌతున్నాయి.

## 7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. యయాతి చరిత్ర రచన ద్వారా కవి విశదపరచిన మల్కిభరామ్ మతాతీత దృక్పథాన్ని చర్చించండి?
2. యయాతి చరిత్రలోని అచ్చ తెలుగు భాషాతత్వాన్ని విశదపరచండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

అచ్చ తెలుగుకావ్యం అంటే ఏమిటో తెలపండి ?

BRAOU

## 7.7 ఆకళింపు ప్రశ్నలు

1. తిక్కన్న పదప్రయోగ విన్యాసానికీ, తెలగన్న భాషా విన్యాస పద్ధతికీ ఉన్న పోలికలను గమనించండి.
2. ఆంధ్ర సాహిత్యంలో ఉన్న కొన్ని అచ్చ తెలుగు కావ్యాలను వీలైనంత వరకు పరిశీలించి, 'యయాతి చరిత్ర'తో పోల్చి చూడండి.

### అభ్యాసాలకు జవాబులు

1. తెలుగు ప్రజల నిత్యవ్యవహారంలో ఉపయోగింపబడే తెలుగు శబ్దాలనే ప్రయోగించి కవిత్వం రాసిన కావ్యాన్ని అచ్చ తెలుగుకావ్యం అంటారు. ఈ భాషా ప్రయోగ విధానంలో అన్యదేశ్యాల ప్రయోగంపై ఆంక్షలేదు. సంస్కృత సమాసాలను కూడా తెలుగు సమాసాలుగా అనువదించి అచ్చ తెలుగు కావ్య నిర్మాతలు గ్రంథాలు రాయడం వల్ల ఈ ప్రక్రియలోని శైలీ విధానం తత్సమ శబ్దాలను స్వీకరించలేదని తెలుస్తున్నది. ఒక్క నామవాచకాల్లో మాత్రం తత్సమ శబ్ద స్పర్శ ఉంటుంది. ఈ లక్షణాలతో ఉన్న కావ్యం అచ్చ తెలుగుకావ్యంగా ఆంధ్ర సాహిత్యంలో ప్రసిద్ధికెక్కింది.
2. "సామాన్యముచే విశేషమునుగాని, విశేషముచే సామాన్యమునుగాని సమర్థించుట" అర్థాంతర న్యాసమనే అలంకార లక్షణం. యుద్ధంలో మల్కిభరామ్ చేతిలో ఓడిపోయిన శత్రువులు, తిరిగి అతణ్నే ఆశ్రయించి సకల సంపదలూ పొందుతారని 'యయాతి చరిత్ర' రచించిన కవి వర్ణిస్తున్నాడు. అలా వర్ణించబడిన విశేషం కాబట్టి ఇది విశేషం. ఈ విశేషాన్ని "నేర్పుగలవారికి ఎక్కడైనా సుఖ సంతోషాలు లభిస్తూనే ఉంటాయి కదా?" అనే లోకసామాన్యధర్మంతో సమర్థిస్తున్నాడు కవి. ఈ పాఠ్యంలోని రెండో పద్యంలో పై విశేషాంశం- "వెరపరులైనవారలకు వింతయె యాపిరులెందునుండినన్" అనే సామాన్యాంశంతో సమర్థించబడింది కాబట్టి, ఇది 'అర్థాంతరన్యాసం" అనే అలంకారం.

3. "వీడు-పూవిల్తుడు-చాగపుంబులి-మెట్టదామరలు-ఏబది ఆరు మూనిసినెలవులు" మొదలైన అచ్చ తెలుగు పదాలతో, పద చిత్రాలతో యయాతి చరిత్ర రాశాడు తెలగన్న. తెనిగించడానికి వీలుగా మల్కిభరాంను 'ఇభరాముడు' అని రాశాడు. తెనిగించరాని చోట 'అమీనుఖానుడు' అనే వాడుకున్నాడు. అచ్చ తెలుగులో కావ్యం రాస్తానని సాహసించి పూనుకొని 737 గద్య పద్యాలలో నిర్వహించాడు. మల్కిభరామ్ వైభవాన్ని వర్ణిస్తూ "పాలతులు, చుట్టలు (చుట్టములు), కబ్బములు (కావ్యములు)" మొదలైన పదాలే వాడాడు. తనకు చేసిన సన్మానాన్ని వర్ణిస్తూ "పలువన్నియు పచ్చడముల్ (చిత్రవర్ణ శాలువలు), బలుతేజీలు" (బలవంతమైన గుర్రాలు) తనకు ఇచ్చాడని చెప్పాడు.

ఈ రకంగా ఈ భాగంలో ఇచ్చినవి ఆరు పద్యాలే ఐనా ఇన్ని విధాల తేట తెలుగు మాటలను ప్రయోగించి తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నాడు పొన్నగంటి తెలగన్న

– డాక్టర్ రావికంటి వసునందన్

BRAOU

# భాగం 8 శ్రీ కాళహస్తీశ్వర శతకము

విషయక్రమం

8.0 ఉద్దేశం
8.1 ప్రవేశిక
8.2 సూచనలు
8.3 శతకం అంటే
**అభ్యాసం – 1**
8.4 పాఠ్యం
8.4.1 కఠినశబ్దాలకు అర్థాలు
8.4.2 వ్యాఖ్యానం
8.4.3 విశేషాంశాలు
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
8.5 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
8.7 ఆకలింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు

## 8.0 ఉద్దేశం

ఈ భాగం చదవడం ద్వారా మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- శతక కవిత్వ లక్షణాలు
- ధూర్జటి స్వాతంత్ర్య ప్రవృత్తి, భగవంతునిమీది భక్తి తాత్పర్యాలు

BRAOU

## 8.1 ప్రవేశిక

ఈ భాగంలో మీరు శతక కవిత్వ సంప్రదాయానికి చెందిన కవిత్వభాగాన్ని అధ్యయనం చేస్తారు. "నిరంకుశాఃకవయః" అన్న నానుడికి ప్రతి స్వరూపమైన అష్టదిగ్గజ కవులలోని 'ధూర్జటి' "కాళహస్తీశ్వర శతకము" లోనివి ఈ పద్యాలు.

## 8.2 సూచనలు

ఈ భాగం చదివే ముందు విద్యార్థులు ప్రాచీనాంధ్ర సాహిత్యంలోని శతక కవిత్వ లక్షణాలను సమగ్రంగా అధ్యయనం చెయ్యాలి. ఇతర శతక కావ్యాలను పఠించి, ఆ అవగాహనతో ఈ భాగాన్ని చదవాలి.

## 8.3 శతకం అంటే

'శతకం' అంటే వంద అని అర్థం. ఒకే రకమైన నూట ఒకటిగాని, నూట ఎనిమిది గాని పద్యాల సంపుటిని శతకంగా వ్యవహరిస్తున్నాము. నీతి, దైవస్తుతి, అధిక్షేపం, దురాచార నిరసనం మొదలైన అంశాలు శతకానికి వస్తువులు. శతకంలోని ఒక పద్యానికీ మరో పద్యానికీ సంబంధం ఉండనవసరం లేదు. ఏకసూత్రతలేని ఈ లక్షణాన్ని 'ముక్తకం' అంటారు. ముక్తకమనే ఈ ప్రక్రియే శతకంగా మారి ఉంటుంది. పై సంఖ్యను దాటి కొన్ని వేల వేమన పద్యాలు (ముక్తకాలు) 'శతకం' గా పిలవడం గమనిస్తే పై విషయం స్పష్టమౌతుంది. "కాళహస్తీశ్వర శతకం" శ్రీ కాళహస్తిలోని శివుణ్ణి సంబోధించి రాసింది. ఈ సంబోధన ప్రతి పద్యం చివరా ఒకే రకంగా ఉంటుంది. దాన్నే 'మకుటం' అంటారు.

## అభ్యాసం – 1

'శతకం' అంటే ఏమిటో వివరించండి ?

## 8.4 పాఠ్యం

శా. రాజుల్మత్తులు, వారిసేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం
భోజాక్షీ చతురంతయాన తురగీ భూషాదులాత్మవ్యథా
బీజంబుల్, తదపేక్షచాలుఁ బరితృప్తింబొందితిన్ జ్ఞానల
క్ష్మీ జాగ్రత్పరిణామమిమ్ము దయతో శ్రీ కాళహస్తీశ్వరా ! 1

శా. రాజై దుష్కృతి జెందెఁ జందురుడు రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబునఁగాంచె దుఃఖము కురుక్ష్మాపాలుఁడామాటనే
యాజింగూలె సమస్త బంధువులతో నారాజశబ్దంబు ఛీ,
ఛీ జన్మాంతరమందు నొల్లనుజుమీ శ్రీ కాళహస్తీశ్వరా ! 2

శా. రాజర్థాతురుఁడైనచో నెచట ధర్మంబుండు నేరీతి నా
నాజాతి క్రియలేర్పడున్ సుకము మాన్యశ్రేణికెట్లబ్బు యా
పాజీవాళికి నేది దిక్కు ధృతి నీభక్తుల్ భవత్పాదనీ
రేజంబుల్ భజియింతురే తెలుఁగుఁన్ శ్రీ కాళహస్తీశ్వరా !

మ. తరగల్ పిప్పలి పత్రముల్ మెఱుఁగుటద్దంబుల్ మరుద్దీపముల్
కరికర్ణాంతము లెండ మావులతతుల్ ఖద్యోత కీట ప్రభల్
సురవీధీ లిఖితాక్షరంబు లసువుల్ జ్యోత్స్నా పయఃపిండముల్
సిరులందేల మదాంధులౌదురు జనుల్ శ్రీ కాళహస్తీశ్వరా ! 4

మ. మదమాతంగము లందలంబులు హరుల్మాణిక్యముల్పల్లకుల్
ముదితల్, చిత్రదుకూలముల్పరిమళంబుల్మోక్షమీఁజాలునేఁ
మదిలో వీని నపేక్షసేసి నృపధామద్వారదేశంబుఁ గా
చి దినంబుల్ వృథపుత్తురజ్ఞులకటా ! శ్రీ కాళహస్తీశ్వరా ! 5

### 8.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| మత్తులు | = | మదించినవారు |
| అంభోజాక్షులు | = | పద్మాలవంటి కన్నులు గల విలాసవతులు (బహువ్రీహి సమాసం) |
| చతురంత యానము | = | పల్లకి |
| తురగీ భూషాదులు | = | గుర్రాలు, నగలు మొదలైనవి |

BRAOU

| | | |
|---|---|---|
| ఆత్మవ్యథ | = | మానసిక వేదన |
| బీజంబులు | = | కారణాలు |
| జ్ఞానలక్ష్మి | = | నిజమైన తెలివి అనే సంపద |
| జాగ్రత్పరిణామము | = | జాగ్రత్తపడే మార్పు |
| రాజు | = | ప్రభువు, చంద్రుడు |
| రారాజు | = | రత్నాలకు (రాళ్లకు) సంపదలకు అధిపతి. |
| దుష్కృతి | = | దుర్గతి. |
| దృక్ + రాజీవము | = | దృగ్రాజీవము = కన్ను అనే పద్మం |
| అర్థాతురుడు | = | ధనం మీద ఎంతో ఆశ కలవాడు. |
| మాన్యశ్రేణి | = | పూజింపదగిన మహనీయుల సమూహం. |
| రూపాజీవ | = | వేశ్య (రూపంవల్ల - డబ్బు గడించి - జీవించేది). |
| ధృతి | = | ధైర్యం, చెక్కుచెదరనితనం. |
| నీరేజము | = | (నీటిలో పుట్టినది) పద్మం (సప్తమీ తత్పురుష సమాసం) |
| పిప్పలపత్రము | = | రావి ఆకు |
| కరికర్ణాంతము | = | ఏనుగు చెవికొన. |
| మరుద్దీపము | = | మెరుపుతీగ, గాలిలోని దీపం |
| ఖద్యోతకీటప్రభ | = | మిణుగురుపురుగుకాంతి |
| సురవీధి | = | ఆకాశం |
| అసువులు | = | గాడ్పులు (ప్రాణాలు) |
| జ్యోత్స్న | = | వెన్నెల |
| పయఃపిండము | = | పాల (వెన్న) ముద్ద. |
| మదాంధులు | = | మదంచేత గుడ్డివారైనవారు. |

(ధనలోభాన్ని నిరసిస్తూ పై పద్యం రాసి, సంపద ఎంత చంచలమో వివరిస్తున్నాడు కవి. అలాంటి అశాశ్వత సంపదలచేత లోకులు ఎందుకు మదించి పోతారో అని అధిక్షేపిస్తున్నాడు)

| | | |
|---|---|---|
| మదమాతంగము | = | మదించిన ఏనుగు. |
| అందలము | = | ప్రక్కల మరుగులేని పల్లకి - పురుషులే ఉపయోగించేది. |
| హరులు | = | గుఱ్ఱాలు |
| దుకూలము | = | వస్త్రం |
| పరిమళములు | = | కస్తూరి, శ్రీగంధం మొదలైనవి. |
| నృపధామము | = | రాజసౌధం. |
| ద్వారదేశము | = | వాకిలి. |

### 8.4.2 వ్యాఖ్యానం

శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లోని ఒక కవి 'ధూర్జటి'. (క్రీ. శ. 1530 ప్రాంతం) "శ్రీకాళహస్తీశ్వర శతక" రచనకు పూర్వమే ఈయన 755 గద్య పద్యాలతో "శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం" అనే చంపూ కావ్యం రచించాడు.

ఈ కావ్యం శంకరునికే అంకితం. "శ్రీ కాళహస్తీశ్వర శతకం" ముఖ్యంగా రాజదూషణం చేసింది. ధూర్జటిలోని శివభక్తినీ, ఆత్మార్పణ భావాన్నీ పోషించింది. ఎన్నో యుద్ధాలు కనీ, వినీ, రాయల మరణం (1630) తర్వాత విజయనగరాన్ని పాలించిన అచ్యుత రాయలూ, అళియ రామరాయలూ కూడా కళాపోషకులే అయినా ఏ సంఘటనల ద్వారానో నొచ్చుకున్న ధూర్జటి "రాజుల్మత్తులు" వంటి పద్యాలను రాసి ఉంటాడని చరిత్రకారులు ఊహిస్తున్నారు. ఈ పాఠ్యంలోని ఐదు పద్యాలూ రాజదూషణంచేస్తూ, వైరాగ్యాన్ని ప్రతిపాదించేవే. ఒకరిని చంపి వేరొకరు తామే నేలనంతా ఏలాలనే రాజ్యకాంక్షతో రాజులంతా యుద్ధోన్మాదులై ఉన్న కాలం అది. బహమనీ సుల్తానుల నిరంతర ప్రయత్న ఫలితంగా విజయనగర



BRAOU

సామ్రాజ్యం విచ్ఛిన్నమైన సమయం అది. వీటి మధ్య జరిగిన దారుణ కృత్యాలూ, ధరాధిపతుల దర్పాంధకారాలూ, "శ్రీకాళహస్తీశ్వర శతకము" నేపథ్యాలు. ఏ శతకమైనా ఈనాడు మనం అనుకుంటున్న 'ఆత్మాశ్రయ' ధోరణికి అనుబంధించిందే అని అనుకోవచ్చు.

"శ్రీకాళహస్తీశ్వర శతకము" లోని పద్యాల భావం ఇది :

1. రాజులు మదించి ఉంటారు కాబట్టి, వారిని సేవించడం నరకయాతనతో సమానం. ఆ సేవకు ప్రతిఫలంగా వారిచ్చే సంపదలూ, పల్లకులూ, గుర్రాలూ, విలాసినులూ చివరికి మానసిక వేదనకే దారి తీస్తాయి. ఓ శ్రీకాళహస్తీశ్వరా! నాకు వాటి మీద అపేక్ష లేదు. నిన్ను తెలుసుకునే జ్ఞానాన్నీ, జాగ్రత్తనూ నాకు కలిగించు అని ఈ పద్యానికి అర్థం. ఈ పద్యంలో ధూర్జటి వాడిన శబ్దాలనుబట్టి అతనికి రాజసేవపై ఎంతటి విరక్తి కలిగిందో తెలుస్తుంది.

2. ఈ పద్యంలోని రాజు-రారాజు అనే పదాలు శ్లేషాలంకారాలు. రాజు అంటేనే తనకెంత అసహ్యమో వివరిస్తూ ఈ పదాలను వాడుకున్నాడు ధూర్జటి. రాజు అనే పేరు ఉండడం వల్లనే చంద్రుడు క్షయ రోగి ఐనాడు. (కృష్ణపక్షంలో చంద్రుడు దినదినమూ క్షీణిస్తాడు కనుక క్షయరోగి). రారాజు కాబట్టే కుబేరుడు ఎప్పుడూ ధనాగారాలను కాపాడడమే జీవిత ధ్యేయంగా ఏడుస్తున్నాడు. రారాజు కాబట్టే బంధువులందరితో కలిసి దుర్యోధనుడు రణోర్వికి బలైపోయినాడు. ఓ కాళహస్తీశ్వరా! అలాంటి రాజ శబ్దాన్ని ఈ జన్మంలోనే కాదు. మరు జన్మలో కూడా వినజాలను అని ఈ పద్యం భావం.

3. రాజే ధనలోభి ఐతే రాజ్యంలో ధర్మం ఎలా ఉంటుంది? వివిధాశ్రమ ధర్మాలు ఎలా నిర్వహింపబడతాయి? గౌరవనీయులకు సుఖమెలా దక్కుతుంది? సౌందర్యమే జీవనోపాధిగా ఉన్న వేశ్యలు ఎలా పొట్టగడుపుకుంటారు? చెదరని మనస్సుతో నీ భక్తులు ఎలా నిన్ను పూజిస్తారు? అని దీని భావం. "రాజానుమతోధర్మః-యథా రాజా తథా ప్రజా" అన్న రెండు సూక్తుల ఛాయలు ఈ పద్యంలో కన్పిస్తున్నాయి. ధన లోభంతో ధర్మాన్ని విడిచిన రాజు రాజ్య వ్యవస్థ నాశనమౌతుందనే సూచన ఈ పద్యంలో ఉంది.

4. సిరి సంపదలు నీటి అలలలాగా క్షణంలో పొంగికుంగేవి. గాలి అలలాగా ఎప్పుడూ అల్లాడేవి. మెరుగుటద్దాలలాగా చేయి జారితే నాశనమయ్యేవి. గాలిలోని దీపాల్లాగా ఎప్పుడు ఆరిపోతాయో తెలియనివి. ఏనుగు చెవి చివరల్లాగా ఎప్పుడూ అస్థిరంగా కొట్టుకునేవి. ఎండమావుల్లాగా మోహభ్రాంతులను కలిగించేవి. మిణుగురు పురుగుల కాంతిలాగా అంతలోనే మిణుక్కుమని ఆరిపోయేవి. ఎప్పుడే మబ్బు కమ్ముతుందో తెలియని ఆకాశంలో రాసిన అక్షరాల్లాంటివి. గాడ్పుల్లాగా ఎటుపడితే అటు ఒక్క దిక్కనకుండా తిరిగిపోయేవి. వెన్నెల అనే పాలలో తీసిన వెన్నముద్దల్లాంటివి. ఓ కాళహస్తీశ్వరా ! ఇలాంటి క్షణభంగురాలైన సంపదలకు భ్రమించి లోకులెందుకు మదమెక్కి గ్రుడ్డివారౌతారో కదా ! అని దీని భావం. "సురవీధీ లిఖితాక్షరంబులు" అనే పద చిత్రం - నీటి మీది రాతలు లేదా నీటిమూటలు అనే భావంలో కొత్తగా వాడబడింది.

'అనువులు' అనే మాట ప్రాణానికి పర్యాయంగా రూఢిలో ఉన్నా దాని మూలార్థం గ్రహించి 'గాడ్పులు' అని వాడాడు.

'మరుద్దీపము' అనేది మెరుపుతీగ అనే అర్థంలో ఉన్నా ఈ పదచిత్రానికి "గాల్లో పెట్టిన దీపం" అనే అర్థం కూడా చెప్పుకోవచ్చు.

5. ఈ చివరిపద్యంలో లోకులు ఏఏ అపేక్షలతో మోక్షాన్ని దూరం చేసుకుంటున్నారో వివరిస్తున్నాడు ధూర్జటి. మత్త గజాలు, పల్లకులు, గుర్రాలు, రత్నమాణిక్యాలు, అంతఃపుర కాంతలకై ప్రత్యేకంగా తయారు చేసిన పల్లకులు, విలాసినులు, చిత్రవిచిత్ర వస్త్రాలు, సుగంధ పరిమళద్రవ్యాలు మోక్షాన్ని ప్రసాదిస్తాయా? అజ్ఞానులు వీటిని కోరి రాజసౌధాల వాకిట పడిగాపులుపడి కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు కదా? ఓ శ్రీకాళహస్తీశ్వరా! నీ వొక్కడివే మోక్షప్రదాతవు. శరణ్యుడవు" అని ఈ పద్యం భావం.

BRAOU

'అందలము', 'పల్లకి' అనే మాటలను పర్యాయాలుగానే ఎందరో వాడుకున్నారు. తనకాలంలో ఆ రెంటిలోని భేదాన్ని కనిపెట్టి వాడుకున్నాడు ఈ పద్యంలో కవి. అందలానికి పక్క, చాటు తెరలుగానీ, మరుగుపరిచే కర్రలుగానీ ఉండవు. అది పురుషులే వాడుకునేది. పల్లకి అంటే చాటుదనం ఉండి, స్త్రీలకోసం తయారు చేయబడింది.

### 8.4.3 విశేషాంశాలు

తెలుగులో ఇప్పుడు దొరుకుతున్న వాటిలో పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకమే మొదటిది.

శతకంలో కథ ఉండదు. పద్యాలన్నిటికీ సామాన్య వస్తువుండవచ్చు. ఏ పద్యానికా పద్యమే విడివిడిగా ఒక భావాన్ని వ్యక్తం చేస్తుంది. ఒక్కోసారి ఆ భావం, ఒక పద్యాన్ని దాటి విస్తరించవచ్చు.

తెలుగు శతకాలకు మకుటం ఒక ప్రధాన లక్షణంగా కనిపిస్తున్నది. మకుటమంటే పద్యం చివర ఉండే సంబోధన. "సుమతీ, దాశరథీ, కుమారా, భాస్కరా, దాశరథీ కరుణాపయోనిధీ, శ్రీ కాళహస్తీశ్వరా" అనేవి మకుటాలు. సంస్కృతంలో శతకాలకు ఈ నియమం లేదు.

తెలుగు శతకాల్లో మకుట నియమం వల్ల పద్యాల ఎన్నిక కూడా నియమిత మవుతుంది. సుమతీ శతకం కంద పద్యాల్లో ఉంది. దాశరథీ శతకం ఉత్పల, చంపకమాలల్లో ఉంది. కాళహస్తీశ్వర శతకం మత్తేభ శార్దూల వృత్తాల్లో ఉంది. ఆంధ్ర నాయక శతకం సీస పద్యాల్లో ఉంది. ఉత్పల చంపకమాలా వృత్తాలకు భేదం మొదటి అక్షరంలోనే ఉంది. మత్తేభ శార్దూలాలకూ అంతే. ఉత్పలమాలలో మొదటి గురువుకు బదులు చంపకమాలలో రెండు లఘువులుంటాయి. శార్దూలంలో మొదటి గురువుకు బదులు మత్తేభంలో రెండు లఘువులుంటాయి. రెండు రకాల పద్యాల్లోనూ ఒకే మకుటం ఇముడుతుంది.

శతకాల్లో భక్తిపరమైనవే ఎక్కువ ఉన్నాయి. భగవంతుణ్ణే గానీ, ఇష్ట దైవాన్నిగానీ సంబోధిస్తూ రచించిన శతకాల్లో భగవంతునితో ఆత్మీయత, తాత్వికత, ఐహిక సుఖ నిరాసమూ, ముక్తికాంక్షా, భావావేశమూ కనిపిస్తాయి. ఈ గుణాల వల్లనే శతకాలు ఇతర కావ్యాల కన్నా వేరుగా నిలబడతాయి. కథను వదిలేయటం వల్ల ఆత్మ భావ వ్యక్తీకరణకు శతకాలు మంచి వాహికగా నిలిచాయి.

## ఛందస్సు :

మీ పాఠ్యంలో వరుసగా మూడు శార్దూల విక్రీడితాలు, రెండు మత్తేభ విక్రీడితాలు ఉన్నాయి. వీటి ఛందస్సు ఇలా ఉంటుంది:

శార్దూలం - మ - స - జ - స - త - త - గ. గణాలుంటాయి. 13 వ అక్షరం యతిస్థానం.

మత్తేభం - స - భ - ర - న - మ - య - వ గణాలుంటాయి. 14 వ అక్షరం యతిస్థానం.

రెండు వృత్తాలకూ ప్రాసమైత్రి ఉంటుంది.

## అభ్యాసం - 2

రాజులు ఎలాంటి వారని ధూర్జటి అభిప్రాయం ?

**అభ్యాసం – 3**

ధూర్జటి వ్యక్తిత్వాన్ని మీ పాఠ్యం ఆధారంగా చిత్రించండి ?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 8.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత కవిత్వంలోని ప్రాచీన సంప్రదాయంలో తెలుగు శతక కవిత్వ ప్రక్రియకు సంబంధించిన పాఠ్యం ఇది.
- శతకం అంటే వంద పద్యాల పరిమాణం కలిగిన కవిత్వ గ్రంథం.
- శతకంలోని అన్ని పద్యాల చివరా ఏదో ఒక సంబోధన విధిగా ఉంటుంది. దానికి 'మకుటం' అని పేరు.
- కవితావస్తువుకు సంబంధించి పద్యానికీ పద్యానికీ నడుమ కథాసంబంధం ఉండదు. శతకంలోని నూరు పద్యాలూ దేనికదే విడివిడి అన్నమాట. ఇలా ఉండే పద్యాలస్వభావాన్ని ముక్తక కవితా పద్ధతి అని పిలుస్తారు. శతకం ముక్తక కవితా శాఖకు చెందిన ప్రక్రియ.
- ఈ పద్యాలు ధూర్జటి రచించిన "శ్రీకాళహస్తీశ్వర శతకము" లోనివి. ఈ శతకానికి మకుటం "శ్రీ కాళహస్తీశ్వరా!" అనే సంబోధన. ఈ సంబోధన కేవలం "మత్తేభ – శార్దూల" విక్రీడితాల్లో మాత్రమే ఇముడుతుంది కాబట్టి – ఈ శతక పద్యాలన్నీ ఈ రెండు వృత్తాల్లోనే ఉన్నాయి.
- ఈ శతకం ద్వారా ధూర్జటి భక్తీ, ఐహిక సుఖభోగవిరక్తీ, నిర్భయ చిత్తవృత్తీ తెలియ వస్తాయి.

## 8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్ఫై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ధూర్జటి దృష్టిలో రాజులెటువంటివారో వివరించండి ?
2. ధూర్జటి భక్తి విరక్తులను మీ పాఠ్యం ఆధారంగా నిరూపించండి.

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్ల జవాబు రాయండి.

శతక లక్షణాలు చర్చించండి.



BRAOU

## 8.7 ఆకళింపు ప్రశ్నలు

1. "అంధేందూదయముల్, మహాబధిరశంఖారావముల్, మూకస
ద్గ్రంథాఖ్యాపనముల్, నపుంసక వధూకాంక్షల్, కృతఘ్నావళీ
బంధుత్వంబులు, భస్మ హవ్యములు, లుబ్ధద్రవ్యముల్, క్రోడ స
ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సంసారముల్."

ఈ పద్యం పోతనగారి భాగవతంలోని అష్టమస్కంధంలోది. హరి భక్తిలేని వారి జీవితాలు ఎట్లాంటివో చెప్పటానికి వరుసగా ఎనిమిది పోలికలు చెప్పారు.

ఈ పద్యానికి మీ పాఠ్యభాగంలోని "తరగల్, పిప్పల పత్రముల్" అని మొదలయ్యే పద్యానికి పోలికలను వివరించండి.

2. వేరు వేరు మార్గాలకు చెందినా పాల్కురికి సోమనాథుడు, పోతన, ధూర్జటి రచనలలో కొన్ని పోలికలుండటానికి అవకాశం ఉంది. ఆ పోలికలేమిటో గుర్తుపట్టి అందుకు కారణాలూహించండి. [ అవసరమైతే మీ పాఠ్యాంశాల పరిమితిని దాటి చూడండి ]

3. రాచరికపు పరిపాలనలో ఉంటూనే రాజులను దూషించే ధైర్యం శతక కవులకు, భక్త కవులకు ఎట్లా వచ్చిందో కారణాలు అన్వేషించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. శతకం అంటే నూరు పద్యాల పరిమితి గల ముక్తక కావ్య ప్రక్రియ 'ముక్తకం' అంటే - కావ్యంలో ఆద్యంతం అనుస్యూతమైన కథాబంధం లేకుండా దేనికదే విడివిడిగా ఉండే పద్య కవిత్వ ప్రక్రియ. శతకంలోని వంద పద్యాల్లోని ప్రతి పద్యం చివరా ఒకే విధమైన సంబోధన ఉంటుంది. దీన్నే 'మకుటం' అంటారు. "సుమతీ ! కృష్ణా ! భాస్కరా ! శ్రీకాళహస్తీశ్వరా !" వంటివి వివిధ శతకాల్లోని మకుటాలకు ఉదాహరణలు. శతకంలోని వంద పద్యాలకూ ఒకే విధమైన ఛందస్సు - సాధారణంగా ఉంటుంది. మకుటం రెండు విధాల ఛందస్సులకు ఒదిగే వీలు ఉన్నచోట్ల కొందరు కవులు రెండు విధాల పద్యాలను కూడా వాడుకున్నారు. "కాళహస్తీశ్వర శతకము" పై పద్ధతికి ఒక ఉదాహరణం. భక్తినీ, నీతినీ, అనేక సామాజిక వ్యవస్థల విజ్ఞానాన్నీ బోధిస్తూ శతకాలు అనేక రకాలుగా తెలుగు కవిత్వంలో ఉన్నాయి. (101) గానీ (108) గానీ పద్యాలు శతక ప్రక్రియలోని సాధారణ సంఖ్య.

2. రాజులు మదించినవారు. వారిచ్చే సంపదలన్నీ చివరికి దుఃఖాన్నే కలిగిస్తాయి తప్ప ఆనందాన్నీ, ఆత్మగౌరవాన్నీ అందించవు. ఈ నిర్ణయాలతో రాజశబ్దమే తన చెవిని పడకూడదని పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తాడు ధూర్జటి. రాజుల కాలంలో జీవించి, వారి సమ్ముఖంలోనే రాజదూషణకు పాల్పడిన ధూర్జటి ధైర్యం ఆయన విరక్తిని చక్కగా ప్రతిబింబిస్తున్నది. మత్తగజాలూ, అందలాలూ, చీని చీనాంబరాలూ, పరిమళ ద్రవ్యాలూ భవతారకాలు కావని తెలిసి; మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించమని కేవల నిష్ఠతో ఈశ్వరుణ్ణి ప్రార్థించడం ధూర్జటిలోని మహాభక్తిని వెల్లడిస్తుంది.

3. ధూర్జటి ఐహిక సుఖాలపై విరక్తుడై శ్రీకాళహస్తీశ్వరుని మీదనే నిశ్చల భక్తియుక్తుడై ఉన్న కాలంలో రచించిన గ్రంథం 'శ్రీకాళహస్తీశ్వర శతకము". కాబట్టే నిరంకుశులైన రాజుల పరిపాలనలో కొనసాగుతున్న తరుణంలోనే ధైర్యంగా రాజదూషణం చేయగలిగాడు. పతీ గతీ పరమేశ్వరుడే నన్న భావమే ఈ రాజదూషణ వెనుక ఉన్న బలం. ప్రభువులు ప్రసాదించే సంపదలు పనికిరావనీ, శ్రీకాళహస్తీశ్వరుడొక్కడే ప్రసాదించగలిగే మోక్ష సంపదమాత్రమే నిజమైన సంపద అనీ ఎలుగెత్తి చాటి చెప్పాడు. ఈయన దృష్టిలో ఐహిక భోగాలు కొరగానివి. సంపదలు మనిషిని 'మదాంధుణ్ణి చేసే మాయావాగురల వంటివి' అని ఈయన దృఢ విశ్వాసం. అందుకే వాటిని ఇలా వర్ణిస్తాడు ధూర్జటి- భౌతిక సంపదలు అప్పుడే పుట్టి, అంతలోనే నశించే నీటి బుడగల వంటివి. రావిరేకుల వలె,



BRAOU

కిందపడినంతనే పగిలే మెరుగుటద్దాలవలె, మెరుపుతీగల్లాగా, కదిలే ఏనుగు చెవులకొనల్లాగా చంచలమైనవి. అశాశ్వతమైనవి. ఎండమావుల్లాగా, మిణుగురు కాంతుల్లాగా, ఆకాశం మీదరాసిన అక్షరాల్లాగా, వెన్నెల అనే పాలలోంచి తీసిన వెన్నముద్దల్లాగా కేవలం భ్రమనే కలిగిస్తూ, మాయకప్పుతూ మురిపింపజేసేవి. అంతేకాని మనిషికి శాశ్వత శాంతి సౌభాగ్యాలను ఎంతమాత్రమూ ప్రసాదించేవి కావు. ప్రభువులిచ్చే మదమాతంగాలూ, మాణిక్యాలూ, పల్లకులూ, వస్త్రాభరణాలూ మోక్షాన్ని ప్రసాదిస్తాయా? వీటి మోహంలో పడి ప్రజలు అనవసరంగా రాజసేవలో కాలం వృధా చేసుకుంటున్నారే ? అని చింతిస్తాడు ధూర్జటి. ఈ పద్యాలద్వారా ధూర్జటి విరక్తి భావమేకాక, సిరిసంపదల అనిశ్చల స్వభావం కూడా ద్యోతకమౌతున్నది.

– డాక్టర్ రావికంటి వసునందన్

BRAOU

# భాగం 9 వేమన

## విషయక్రమం


9.0 ఉద్దేశం

9.1 ప్రవేశిక

9.2 సూచనలు

9.3 పాఠ్యం

9.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

9.3.2 వ్యాఖ్యానం

9.3.3 విశేషాంశాలు

**అభ్యాసం – 1**

**అభ్యాసం – 2**

**అభ్యాసం – 3**

9.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

9.6 ఆకళింపు ప్రశ్నలు

అభ్యాసాలకు జవాబులు


## 9.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- వేమన సామాజిక దృక్పథం, మూఢాచారాలపై తిరుగుబాటు
- 'ఆటవెలది'కి వేమన అందించిన శక్తి
- శతక కవిత్వ లక్షణాలు

BRAOU

## 9.1 ప్రవేశిక

ఈ భాగం కూడా తెలుగు శతక కవిత్వ సంప్రదాయానికి చెందిందే. ప్రజలలో జీవించి, పలు దేశాలు పర్యటించి, వారి అంతరంగాల్లో, జీవనవిధానాల్లో చొచ్చి పరిశీలించి చూచిన వేమన రాసిన పద్యాలివి. పదపదంలోనూ గాఢమైన సామాజిక అవగాహనా, దురాచారాలపట్ల నిరసనా ప్రకటించేవి వేమన పద్యాలు.

## 9.2 సూచనలు

ఈ భాగం చదివేముందు విద్యార్థులు తెలుగు సాహిత్యంలోని శతకవిత్వ పద్ధతులనూ, సంప్రదాయాలనూ అధ్యయనం చెయ్యాలి. తదితర శతక కావ్యాల పరిశీలనను ఈ పాఠ్య అధ్యయనానికి జతపరుచుకోవాలి.

## 9.3 పాఠ్యం

అల్పబుద్ధివాని కధికారమిచ్చిన
దొడ్డవారినెల్ల తొలఁగ గొట్టు
చెప్పుదినెడి కుక్క చెరకు తీపెరుగునా
విశ్వదాభిరామ వినురవేమ..

భూపతి కృపనమ్మి భూమి చెరచువాడు
ప్రజల ఉసురు తాకి పడును పిదప
ఎగురవేయ బంతి ఎందాక నిలుచురా
విశ్వదాభిరామ వినురవేమ. 2

భూమిలోన పుట్టు భూసారమెల్లను
తనువులోన పుట్టు తత్వమెల్ల
శ్రమములోన పుట్టు సర్వము తానౌను
విశ్వదాభిరామ వినురవేమ. 3

కులము గల్గువారు గోత్రము గలవారు
విద్యచేత విఱ్ఱవీగు వారు
పసిడి గల్గువాని బానిస కొడుకులు
విశ్వధాభిరామ వినురవేమ. 4

కుడువ ముడువలేక కూడబెట్టగలేక
విడున నుడువలేక విద్యలేక
నడువ నేరని వాని నడపీనుగందురు
విశ్వదాభిరామ వినురవేమ. 5

బడుగు నెరుగలేని ప్రాభవం బదియేల
ప్రోది యిడని బంధుభూతియేల
వ్యాధి తెలియలేని వైద్యుడు మరియేల
విశ్వదాభిరామ వినురవేమ. 6

గ్రాసమింతలేక కడుకష్టపడుచున్న
విద్యయేల నిలుచు వెడలుగాక
పచ్చికుండ నీళ్ళు పట్టిన నిలుచునా
విశ్వదాభిరామ వినురవేమ. 7

కరుకుకాయలు తిని కాషాయ వస్త్రముల్
బోడినెత్తి గలిగి బొరయుచుండ్రు
తలలు బోడులైన తలపులు బోడులా
విశ్వదాభిరామ వినురవేమ. 8

### 9.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

1. అల్పబుద్ధివాడు = నీచుడు, హీనుడు, మంచిమనసులేని లుబ్ధుడు.
   దొడ్డవారు = పెద్దబుద్ధిగలవారు, ఎదుటివాడి గొప్పతనాన్ని అంగీకరించే మంచి మనసున్న వారు, నిజాయితీపరులు.

2. భూపతి = రాజుయొక్క
   కృపను = దయను
   భూమి చెరచువాడు = భూమిని పాడుబెట్టువాడు
   ఉసురు = ప్రాణం, నిట్టూర్పు, బలం, దుఃఖం, చెడుఫలితం అని చాలా అర్థాలున్నాయి. (చేసిన చెడుపనికి అనుభవించే చెడు ఫలితం అనే అర్థం సరిపోతుంది. ఇతరులకు అపకారం చేసినపుడు వాళ్లపాపం నీకు తగుల్తుంది అంటాం. అలాగే వాళ్ల ఉసురు తగులుతుంది అనికూడా అంటాం).



BRAOU

3. కుడువ = తినడానికి
ముడువ = దాచుకోడానికి
నడపీనుగ = జీవచ్ఛవం, బ్రతికి చచ్చినవారితో సమానమైనవాడు

4. బడుగు = పేదవాడు
ప్రాభవము = వైభవం, సంపద, అధికారం
ప్రోది = ప్రోపకం, సహాయం
భూతి = సంపద

5. గ్రాసము = తిండి

6. కరకుకాయలు = కరక్కాయలు. సర్వరోగాల్ని పోగొట్టే కాయలు లేదా పచ్చి కూర గాయలు
కాషాయవస్త్రముల్ = కావిబట్టలు
పొరయు = మసలు, తిరుగు

### 9.3.2 వ్యాఖ్యానం

వేమన్న 17వ శతాబ్దిలో పుట్టాడు. ఇది స్థూలమైన కాలనిర్ణయం మాత్రమే. సురవరం ప్రతాపరెడ్డి, వేమన 1600-1752 మధ్య వాడన్నాడు. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ 18వ శతాబ్ది ప్రారంభం అన్నాడు. ఎన్. గోపాల్ 1650 అంటాడు. ప్రభుత్వం 1672 అని నిర్ధారించి ఆయన స్మృత్యంకంగా తపాలా బిళ్లను కూడా వెలువరించింది. వేమన్నను సాహిత్య లోకానికి ప్రప్రథమంగా పరిచయం చేసింది ఫ్రెంచి మతగురువు జె.ఎ. దుబాయ్. తరువాత వేమన్న పలుకులకు ఆకర్షితుడై బ్రౌన్ వేమన్న పద్యాల ప్రతుల సేకరణను ప్రారంభించాడు. దాదాపు 18 సంవత్సరాలు వేమన్న పద్యాలలో మునిగి తేలాడు.

సంఘ వ్యవస్థలోని కుళ్ళును బయట పెట్టిన కవుల్లో వేమన ప్రథముడు. ఆయన వాడిన భాష నేరుగా ప్రజల నుండి సేకరించింది. భావాలు అనుభవం నుండి పుట్టినవి. మూఢాచారాలను, అంధ విశ్వాసాలను కవిత్వం ద్వారా గట్టిగా నిరసించిన సంస్కర్త వేమన.

ఆయన కవిత్వంలో సూటిదనం ఒక ప్రధాన గుణం. ఆనాడు వాడుకలో ఉన్న చాటువులు, సామెతలు, నీతి సూక్తులు ఆయన కవిత్వం ద్వారా ప్రాణప్రతిష్ట చేసుకున్నాయి. వేమన వెలువరించిన సత్యాలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి.

వేమన నాటి సామాజిక పరిస్థితులాలోచిస్తే ఆయన తిరుగుబాటు మీద మనకపార గౌరవం కలుగుతుంది. అగ్రజాతుల వారు, పీఠాధిపతులు మత రహస్యాలను మరుగుపరుస్తున్న కాలం, పారలౌకిక అధికారం దుర్వినియోగమవుతున్న కాలం, ఆనాటికి ఆంధ్ర సాహిత్యం కూడా కృత్రిమమైన అలంకారాల బరువుతో కుంగిపోతున్నది. సహజ సౌందర్యాన్ని కోల్పోతున్నది. సాహిత్యం సామాన్య ప్రజలకు దూరమవుతున్నది. అలాంటి పరిస్థితిలో తెలుగు నాటికి వేమన పద్యాలు కవిత్వాన్ని ప్రజలకు సన్నిహితం చేశాయి. మతం పేరు మీద ప్రచారం ఔతున్న మూఢాచారాల్ని, అన్యాయాల్ని విమర్శించి, తిట్టి, గేలిచేసి, చులకనచేసి, ప్రజలకు మార్గదర్శకుడయ్యాడు. ఆయన పద్యాల భావం ఇది.

ఒక సమాజం యొక్క బాగోగులకు బాధ్యత వహించేవాడు, వహించవలసినవాడు ఏలిక. అంటే ఒక వ్యవస్థలో రాజు కావచ్చు. ఉన్నతస్థితిలో ఉన్న అధికారి కావచ్చు. ఉన్నత స్థితిలో ఉండే రాజుగాని, అధికారి గాని నీచుడు కాకూడదు. అతడు హీనగుణం కల్గిన వాడైతే వ్యవస్థ మొత్తం దెబ్బతింటుంది. అల్పబుద్ధి కల్గిన వాడికి అధికారం ధారాదత్తం చేస్తే అతని ఆలోచనలన్నీ వక్రంగానే సాగవచ్చు. చెప్పు తిని బతికే కుక్కకు చెరుకు తీపి రుచించదు గదా! మూర్ఖుడికి మంచి వారి మాటలు రుచించవు. మంచి చెప్పిన వారిని దూరం చేసుకుని నీచంగానే ఆలోచించి నీచులకే ఆశ్రయం ఇస్తాడని వేమన అంతరార్థం.

వేమన ఆటవెలది పద్యాన్ని ఆహ్లాదమయంగా నడిపించగలడు. యతిగణాలకు ప్రయత్నించడం అనేది లేదు. సహజంగానే తమ తమ స్థానాల్లో ఔచిత్యంతో నిలిచిపోవడం కన్పిస్తుంది. అందుకే పద్యం సహజ సుందరంగా నడిచింది.

నిత్యజీవితంలోని సన్నివేశాలు, వస్తువులు, పరిస్థితులు దృష్టాంతాలుగా చెపుతాడు వేమన. ఈయన ఉపమానాలన్నీ నిత్యం అందరికీ అందికలో ఉండేవే. చెప్పు దినెడి కుక్క చెరకు తీపెరుగునా? అనేది సూటైన ఉపమానం. అల్పబుద్ధి వానికి ఘాటైన సమన్వయం. ఈ సరళత, సూటిదనం, సహజతలవల్లనే వేమనకి లోక వ్యాప్తి వచ్చింది.

ఒక్కొక్కసారి పెద్దవాళ్ళ మాటలు నమ్మి చిన్నవాళ్ళుచెడిపోవడం సహజం. ఇక్కడ పెద్దవాళ్ళంటే వయసులోకాదు. ఆస్తిలో, అంతస్థులో అధికులైన వారి అండ లభించిందని చంకలెగరేస్తూ వాళ్ల వెంటబడి పరుగెత్తకూడదు. స్వీయ కర్తవ్యాన్ని మరచి పోయి ప్రవర్తిస్తే ఫలితం అనుభవిస్తాం. తన పనిని తాను చేసుకొని, అంటే కృషి చేసి తన ప్రజల్ని రక్షించుకోగలగాలి. అంతేగాని, అందని ఎత్తుకు ఎగిరిపోవాలని ఆరాటపడకూడదు. నమ్మిన ప్రజల్ని నట్టేట్లో ముంచి తానే బాగుపడాలనుకోరాదు. అలా అనుకుంటే వారి ఉసురు తగిలి మరలా కింద పడతారు. రాజుల చేయూత బంతిని ఎగరవేయడం వంటిది. బంతి ఎంత విసురుగా పైకి పోతుందో అంతే విసురుగా కిందకు వస్తుంది.

భౌతిక ప్రపంచంలో భూమి, శరీరం, శ్రమ ఈ మూడుముఖ్యాతి ముఖ్యమైనవి. భూమిలోని సారాన్ని పిండాలి. అప్పుడే ప్రాణికోటికి కడుపునిండా తిండి దొరుకుతుంది. ఆ సారాన్ని పిండడానికి శారీరకమైన పుష్టి కావాలి. మానవ సమాజ పురోగతికి ప్రధానమైంది శ్రమ. ఆ శ్రమశక్తి తెలుసుకున్నప్పుడే ప్రగతి. సర్వం శ్రమశక్తిలోనే వుంది. సంపదలకు మూలం భూమి. అది ముఖ్యమైన ఉత్పత్తి స్థానం. శ్రమసాధనం శరీరం. ఈ రెంటి ఘర్షణ ఫలితం ప్రగతి. ఆ ఘర్షణకు కారణభూతం శ్రమ. అందుకే శ్రమ అన్ని ప్రగతులకూ మూలం. శ్రమ విలువలను తెలుసుకున్నప్పుడే మానవులకు మంచి జరుగుతుంది.

కులం, గోత్రం, విద్య, అన్నీ ధనం ముందు దిగదుడుపే. ఎంత గొప్ప కులంలో పుట్టినా, గొప్ప గోత్రంలోంచి వచ్చినా, గొప్ప విద్యావంతులయినా డబ్బున్నవాడికి వంగి వంగి నమస్కారాలు చేస్తారు. (పసిడిగల్గువాడు = డబ్బున్నవాడు, ధనికుడు, బానిస కొడుకు = దాసి కొడుకులు అంటే లొంగిపోయినవారని అర్థం). కులం, గోత్రం అని అరిచేవారు డబ్బున్నవాడైతే అధముడికైనా మొక్కడం చూస్తున్నాం. ఎంత విద్యావంతుడయినా అభిమానాన్ని వదిలి డబ్బున్నవాడిమీద స్తోత్రపాఠాలు వల్లించడం చూస్తున్నాం. 'ధనమూలమిదంజగత్' అనే సూక్తిని వేమన **సూటిగా సామాన్యుల గుండెల్లో నాటుకునేటట్లు చెప్పగలిగాడు.**

తినడానికి తిండి లేదు. దాచుకునే డబ్బు లేదు. పెళ్ళాం బిడ్డలకు పెట్టేందుకు అసలే లేదు. తనను విడిచిపెట్టి వెళ్ళిపొమ్మని వారికి చెప్పే స్తోమతా, మానసిక ధైర్యం అసలే లేవు. అలా చెప్పేందుకు కావలసిన మానసిక వికాసాన్ని కల్గించే విద్య అంతకంటే లేదు. ఒక మార్గాన్ని [illegible]ంచి ప్రవర్తించలేనివాణ్ణి నడపీనుగ అనడం సబబు. అలాంటి వారిని జీవచ్ఛవాలు అంటాం.

పేదవాణ్ణి ఆదరించని సంపద, వైభవం వృథా. [illegible]ంగా సన్నిహితుల్ని ఆదుకోలేని బంధువుల సంపద కూడా వృథా. వ్యాధి నిర్ణయం చేయలేని వైద్యుని వైద్యం వృథా.

### 9.3.3. విశేషాంశాలు

వేమన పద్యాలకు ఛందం ఆటవెలది. వేమన అంటే ఆటవెలది అని, ఆటవెలది అంటే వేమన కవీంద్రుడని సామాజికులు ప్రస్తుతించేటంత ప్రభావవంతంగా ఈ దేశిచ్ఛందాన్ని దిద్ది తీర్చాడు వేమన్న. "కొండ అద్దమందు కొంచెమై ఉండదా" అని తానే అన్నట్టుగా, అతిచిన్న పద్యంలో, అలతిపద్యాల్లోనే అనల్పార్థాన్ని సంతరించాడు. అధిక్షేపకవితతో అడుగడుగునా సమాజాన్ని మంచి కోసం నిలదీసి ప్రశ్నించాడు. సామాజిక స్పృహకు వేమన ఆటవెలదులు ఆటపట్టులు.

## అభ్యాసం – 1

వేమన దృష్టిలో ఎలాంటివాడు ఉత్తమాధికారి?



BRAOU

## అభ్యాసం – 2

శ్రమశక్తిని గురించి వేమన అభిప్రాయాలేమిటి?

## అభ్యాసం – 3

వ్యక్తి వికాసాన్ని వేమన ఎలా ప్రబోధించాడు?

## 9.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

BRAOU

- తెలుగు లిఖిత కవిత్వంలోని ప్రాచీన సంప్రదాయంలో, శతక కవిత్వ ప్రక్రియకు సంబంధించిన పాఠ్యం ఇది.
- ఈ పాఠ్యం 'ఆటవెలది' అనే దేశిచ్ఛందస్సుకు సంబంధించిన పద్యాల్లో ఉన్నది.
- ఈ శతక పద్యాలకు మకుటం "విశ్వదాభిరామ వినురవేమ" అనేది.
- ఈ పద్యాల ద్వారా వేమ వ్యక్తిప్రగతినీ, సామాజికాభ్యుదయాన్నీ, మానవత్వ వికాసాన్నీ ప్రతిపాదించాడు.
- సాంఘిక దురాచారాలనూ, మూఢనమ్మకాలనూ, కులంపేరిటా, మతం పేరిటా, ధర్మం పేరిటా జరుగుతున్న అన్యాయాలనూ, అక్రమాలనూ వేమన తన పద్యాల ద్వారా ధ్వనిమంతంగా కవితాత్మకంగా తీవ్రంగా ఖండించాడు.

## 9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

వేమన పద్యాల్లోన్ని రచనా శిల్పాన్ని వివరించండి?

II. ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. అల్పబుద్ధులవల్ల వచ్చే చేటు ఎటువంటిదని వేమన చెప్పాడు?
2. వేమన దృష్టిలో రాజులు, అధికారులు, పండితులు ఎటువంటివారు?

## 5.6 ఆకళింపు ప్రశ్నలు

1. వేమన ఆటవెలది పద్య లక్షణాలు పరిశీలించండి.
2. వేమన పద్యాలు శతక పద్యాలు అనవచ్చునో కూడదో గమనించండి.
3. వేమన పద్యాల్లో మౌఖిక సాహిత్య లక్షణాలు ఏమైనా కనిపిస్తున్నాయేమో చూడండి.

### అభ్యాసాలకు జవాబులు

1. ప్రజల అభ్యుదయాన్నీ, దేశాభ్యుదయాన్నీ సాధించవలసిన వాడు రాజు. ఒక వ్యవస్థలో ఆ వ్యక్తి రాజు కావచ్చు. వేరొక దానిలో ఉన్నత స్థితిలోని అధికారి కావచ్చు. మరొక దానిలో రాజకీయ నాయకుడు కావచ్చు. అతడెవరైనా నీచుడు కాకూడదు. అల్పబుద్ధి కలవాడు కాకూడదు. అతడు హీనగుణం కలవాడైతే మొత్తం సామాజిక వ్యవస్థే దెబ్బ తింటుంది. అల్పబుద్ధి కలవానికి అధికారం ఇస్తే అతని ఆలోచనలన్నీ వక్రంగానే సాగి, సమాజాన్ని భ్రష్టు పట్టిస్తాయి. అభ్యుదయం కుంటుపడుతుంది. ఈ అభ్యుదయాంశాన్ని చెరకు తీపితో పోలుస్తూ వేమన్న - దాన్ని సాధించడానికీ, అందులోని మాధుర్యాన్ని ఆస్వాదించడానికీ నాయకుడిలో ఉత్తమ సంస్కారం, సంస్కృతి ఉండాలంటాడు.

2. మానవ సమాజపురోగతికి ప్రధానమైంది శ్రమ. ఆ శ్రమశక్తి తెలుసుకున్నప్పుడే ప్రగతి. సర్వం శ్రమశక్తిలోనే ఉంది. సంపదలకు మూలం భూమి. అది ముఖ్యమైన ఉత్పత్తిస్థానం. శ్రమసాధనం శరీరం. ఈ రెంటి ఘర్షణ ఫలితం ప్రగతి. ఆ ఘర్షణకు కారణభూతం శ్రమ. అందుకే అది అన్ని ప్రగతులకూ మూలం. శ్రమ విలువను తెలుసుకున్నప్పుడే మానవులకు మంచి జరుగుతుంది.

3. దేశకాల పరిస్థితులకు అతీతంగా వ్యక్తిత్వ వికాసాన్ని వేమన పద్యాలు బోధిస్తాయి. అధికారి అండచూసు కొని ఎగిరే అల్పుడు తన వ్యక్తిత్వానికీ, పరుల అస్తిత్వానికీ హాని కలిగిస్తాడని బోధిస్తాడు వేమన. బాహిర కారణాలవల్ల కాక, స్వయంపూర్ణమైన వ్యక్తిత్వం వల్లనే మనిషి గొప్పతనాన్ని సంపాదించాలని వేమన పద్యాల్లో ఒకటి బోధిస్తుంది. మరొక పద్యంలో సమాజంలో ఉన్నత స్థితిని కాంక్షించే మనిషి విద్యావంతుడు కావాలనీ, ఆర్థికంగా బలపడి ఉండి, ఇతరులకు సహాయం చేసే స్వభావంతో ప్రవర్తించాలనీ ఉపదేశిస్తాడు. లౌకిక లంపటత్వం తగ్గించుకోవాలనీ, కేవల సుఖోపభోగాల్లో మనిషికి ఔన్నత్యం సిద్ధించదనీ వేరొక పద్యంలో వ్యంగ్యంగా బోధిస్తూ, సుఖలాలసతను వదులు కోవడానికి భౌతిక మార్గాలను అనుసరించడం సరియైన పద్ధతి కాదంటాడు. మనిషి జీవితానికీ, మానసిక వికాసానికీ సంబంధించిన వివిధ సామాజిక రంగాల్లో మనిషి తన నిర్మల ప్రవర్తన ద్వారా పరిపూర్ణుడై వ్యక్తిత్వ ప్రగతిని సాధించాలని బోధిస్తాడు వేమన్న.

– ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి

BRAOU

# భాగం 10 భాస్కర శతకము

## విషయక్రమం


10.0 ఉద్దేశం

10.1 ప్రవేశిక

10.2 సూచనలు

10.3 పాఠ్యం

  10.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

  10.3.2 వ్యాఖ్యానం

  10.3.3 విశేషాంశాలు

అభ్యాసం – 1

అభ్యాసం – 2

అభ్యాసం – 3

10.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

10.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.6 ఆకలింపు ప్రశ్నలు

అభ్యాసాలకు జవాబులు


## 10.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- శతక కవిత్వ లక్షణాలు
- 'మారవి'కి సూర్య భగవానుని పట్ల భక్తి
- 'మారవి'లో ఉన్న సామాజిక దృక్పథం

BRAOU

## 10.1 ప్రవేశిక

ఈ భాగంకూడా శతక కవిత్వ సంప్రదాయానికి చెందిందే. సూర్యభక్తితో రాసినా, ఈ శతక కవిత్వకర్త 'మారవి'లో ఉన్న సామాజిక దృక్పథాన్ని ఈ పాఠ్యాంశం వెల్లడిస్తుంది.

## 10.2 సూచనలు

ఈ భాగం చదివే ముందు విద్యార్థులు తెలుగు సాహిత్యంలోని శతక కవిత్వ పద్ధతులనూ, సంప్రదాయాలనూ అధ్యయనం చెయ్యాలి. తదితర శతకకావ్యాల పరిశీలనను ఈ పాఠ్య అధ్యయనానికి జతపరచుకోవాలి.

## 10.3 పాఠ్యం

చ. సిరిగలవారి కెయ్యెడలఁ జేసిన మేలది నిష్ఫలంబగున్
నెఱి గుఱి గాదు పేదలకు నేర్పునఁ జేసిన సత్ఫలంబగున్
వఱపున వచ్చి మేఘుఁ డొకవర్షము వాడిన చేలమీదటం
గురిసినఁ గాక యంబుధులఁ గుర్వఁగ నేమిఫలంబు భాస్కరా ! 1

చ. సిరివలెనేని సింహగుహచెంత వసించినఁజాలు సింహముల్
కరుల వధింపఁగా నచటఁ గల్గును దంతచయంబు ముత్యముల్

హరువుగ నక్క బొక్కకడ నాశ్రయ మందిన నేమి గల్గెడుం
గొరిసెలు దూడతోకలును గొమ్ములు నెమ్ములుగాక భాస్కరా ! 2

చ. స్థిరతర ధర్మవర్తన ప్రసిద్ధికి నెక్కినవాని నొక్కము
ష్కరుఁ డతినీచవాక్యములగాదనిపల్కిన నమ్మహాత్ముఁడుం
గొఱత వహింపఁడెయ్యెడ నకుంఠిత పూర్ణసుధాపయోధిలో
నరుగుచుఁ గాకి రెట్ట యిడినందున నేమి కొఱంత భాస్కరా ! 3

చ. సిరి గలవాఁడు లభ్యమగు చిత్తమునందుఁ దలంచి నంతనే
నరులకు నెట్టి కార్యమయినన్, జత కాదు బహుప్రయత్నముల్
జరిపిన నైన లేమియెడ, సత్యము సువ్మిది 'చేతికందు పం
డరయఁగ నోటి కందదు గదా' యను సామ్యముపోల్కి భాస్కరా ! 4

### 10.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

1. నిష్ఫలము = వ్యర్థము
   నెఱి గుఱి = నేర్పుతో చేయదగినపని
   వఱపున = విజృంభణతో
   అంబుధులు = సముద్రములు

2. వలెనేని = కావలసినచో
   చయము = ప్రోగు
   హరువుగ = నేర్పుతో
   గొరిసెలు = పశువుల కాలి గిట్టలు

3. స్థిర తరము = మిక్కిలి దృఢమైనది
   ధర్మవర్తనన్ = ధర్మమైన పద్ధతిలో ప్రవర్తించుటచేత
   ముష్కరుడు = మూర్ఖుడు
   అకుంఠిత = తరుగులేని
   పూర్ణసుధాపయోధి = నిండైన పాల సముద్రము

4. లభ్యమగును = సమకూరును
   జతకాదు = సమకూడదు
   లేమియెడ = దరిద్రంలో ఉన్నప్పుడు

### 10.3.2 వ్యాఖ్యానం

'భాస్కరశతకం' (క్రీ.శ. 1550 - 1660 ప్రాంతం) రచన గురించి రెండు మూడు వివాదాలున్నాయి. వాటిలో ప్రాధాన్యం వహించింది 'భాస్కరుడు' అనేకవి తనపేరుతోనే వేమన్నలాగా 'భాస్కరా!' అనే మకుటంతో ఈ శతకం రాశాడనేది. కాని "ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం"లోని భాస్కర శతక ప్రతిలో "ఇది సూర్యనారాయణ వరప్రసాద లబ్ధ కవితా మాహాత్మ్యంబున మారవి కృతంబగు భాస్కర శతకము అష్టోత్తర (శత) వృత్తములు సంపూర్ణం" అని ఉన్నది. దీన్నిబట్టి 108 సంఖ్యగల ఈ శతకం సూర్య భక్తుడైన 'మారవి' అనే పేరుగల కవి రచించాడని నిర్ణయించవచ్చు. అన్ని శతకాల్లో లాగానే - రాజకీయ, మత, నైతిక, సాంఘికాంశాలు ఈ శతకంలో చోటు చేసుకున్నాయి.

ఈ పాఠ్యంలోని నాలుగు వృత్తాలూ చంపకమాలలే. "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలతో 11వ అక్షరం యతిగా ఈ వృత్త పద్యం ఉంటుంది. ప్రాస మైత్రి ఉంటుంది.

BRAOU

1. ధనవంతునికి చేసే మేలు నేర్పరి ఐనవాడు చేసేపనికాదు. అది నిష్ఫలం ఆ మేలే పేదలకు చేస్తే అది సత్ఫలం. మేఘుడు ఎండిన చేలమీద వరదతో కురిస్తేనే లాభం కాని, ఓ భాస్కరా! సముద్రాల్లో ఎంత విజృంభించి వర్షిస్తే మాత్రం ఏం లాభం?

2. సంపదలే కావలసివస్తే సింహపు గుహల దగ్గర మాటువేసి ఉంటే చాలు. అవి ఏనుగులను చంపితినగా విలువైన గజదంతాల ప్రోగులూ; వాటి కుంభస్థలాల నుండి జారిపడిన ముత్యాలూ దొరుకుతాయి. అంతేకాని ఎంతో నేర్పరితనంతో నక్క బిలం దగ్గర కాచుకుంటే పశువుల గిట్టలూ, దూడల తోకలూ, కొమ్ములూ, బొక్కలూకాక ఓ భాస్కరా! ఇంకేమి లభిస్తాయి? శుభ పరంపరకై అధికులను ఆశ్రయించాలి. కాని నీచుల చెంతకే పోకూడదు.

3. అచంచలమైన ధర్మ ప్రవర్తనచేత పేరు గడించిన వానిని ఎవడో ఒక మూర్ఖుడు నిందించినంత మాత్రంలో మహాత్మునికి ఏ లోపమూ రాదు. ఇంకిపోని పాలసముద్రంమీద ఎగిరే కాకి దానిలో రెట్ట వేసినంత మాత్రాన సముద్రానికేం కొరత? లోకంలోని సజ్జన పద్ధతినీ, దుర్జన పద్ధతినీ వివరించడం; నీచుడు నిందించినంతమాత్రాన ధర్మాత్ముడికి లోపమేదీ కలుగదని ఉపదేశించడం ఈ పద్యం ఉద్దేశం. లోకంలో అలా జరుగుతుంది కూడా. అలాంటప్పుడు ధర్మ పరాయణుడు కలత పడకూడదని ఉపదేశం.

4. ఈ పద్యం ధనశక్తిని వివరిస్తుంది. ధనం కలిగినప్పుడు మనస్సులో అనుకున్నంత మాత్రాన్నే ఏ పనైనా జరుగుతుంది. ఓ భాస్కరా! అదే వ్యక్తి దరిద్రంలో ఉంటే ఎన్ని ప్రయత్నాలు చేసినా చేతికందిన పండు నోటి కందదుగదా! అనే సామెత సార్థకమయ్యేటట్లుగా ఏ కార్యమూ జరగదు. ఇది సత్యం.

**10.3.3 విశేషాంశాలు**

ఈ శతకం దేశివృత్తాల్లో కాకుండా మొత్తం జాతివృత్తాల్లోనే ఉన్న శతకం. సూర్యుని మీది భక్తితో పాటు కవికి ఉన్న సామాజిక, మత, నైతిక దృక్పథాలను ప్రతిబింబించే శతకం.

## అభ్యాసం – 1

భాస్కర శతకంలోని 'దానపద్ధతి'ని వివరించండి?

BRAOU

## అభ్యాసం – 2

'మారవి' దృష్టిలో ఎవరు ధర్మాత్ముడు?

## అభ్యాసం – 3

"ఉపమానోపమేయ వాక్యములయందు భిన్న ధర్మములు బింబ ప్రతిబింబ భావమున సమాన ధర్మత్వమును జెందియున్న యెడల దృష్టాంతాలంకారము" అనీ; "సహజముగ భిన్నములయినను సాదృశ్యముచే నభిన్నములుగను వేరువేరుగను చెప్పుట బింబ ప్రతిబింబ భావము" అనీ నిర్వచనాలున్నాయి. ఈ నిర్వచనాల ప్రకారం ఈ పద్యంలో అలంకారం గుర్తించండి.

సిరిగలవానికెయ్యెడల జేసిన మేలది నిష్ఫలంబగున్
నెఱిగుఱిగాదు పేదలకు నేర్పున జేసిన సత్ఫలంబగున్
వఱపునవచ్చిన మేఘుడొక వర్షము వాడినచేల మీదటన్
గురిసిన గాక యంబుధుల గుర్వగనేమి ఫలంబు భాస్కరా!

## 10.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- తెలుగు లిఖిత కత్వంలోని ప్రాచీన సంప్రదాయంలో, శతక కవిత్వ ప్రక్రియకు సంబంధించిన పాఠ్యం ఇది.
- ఈ పాఠ్యం జాతివృత్తమైన 'చంపకమాల' ఛందంలో ఉన్నది.
- ఈ శతక పద్యాలకు 'భాస్కరా!' అనే సూర్య సంబోధన మకుటం.
- ఈ పద్యాలద్వారా కవికి సూర్యునిపట్ల ఉన్న భక్తి మాత్రమేకాక, కవికి ఉన్న సామాజిక స్పృహ, నైతిక, మత, సాంఘిక రంగాల అభ్యుదయ విషయంలో అతనికి ఉన్న నిబద్ధత, సంస్కరణ దృష్టి కూడా ప్రకటితమౌతున్నాయి.

BRAOU

## 10.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. భాస్కరశతకాన్ని అనుసరించి సజ్జన దుర్జన పద్ధతులు తెలపండి ?
2. ధనసంపాదన పద్ధతిని భాస్కరశతకం ఎలా వివరిస్తుంది ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేనుపంక్తుల్లో జవాబు రాయండి.

భాస్కర శతకంలోని భాషాశైలీ పద్ధతులు వివరించండి ?

## 10.6 ఆకళింపు ప్రశ్నలు

1. మీ పాఠ్యగ్రంథంలో ఇచ్చిన వివిధ శతక పద్యాల్లో సంప్రదాయం, తాత్త్వికదృక్పథం అనే అంశాల్లో కనపడే భేదసామ్యాలు పరిశీలించండి.
2. భాస్కర శతకం కేవల భక్తి శతకమేనా ? గమనించండి?

## అభ్యాసాలకు జవాబులు

1. పాత్రతను పాటించి దానం చేయాలి. ధనికునికి చేసే దానం నిష్ఫలం. పేదకిచ్చిన ఈవి సఫలం. కాలమేఘుడు వాడిన చేలపై కురిస్తే ప్రయోజనం ఉంటుంది కాని, జలనిధి ఐన సముద్రం మీద ఎంతకురిస్తే మాత్రం ఏం లాభం? అంటూ చక్కగా దానపద్ధతిని బోధిస్తున్నది 'భాస్కర శతకము'.

2. ధర్మ ప్రవర్తన గలవాడు తన నడవడిచేతనే ప్రసిద్ధి పొందుతాడు. కీర్తిని సంపాదిస్తాడు. ఆ కీర్తి ఇతరులు అతణ్ని మెచ్చుకోవడంచేత వచ్చిందికాదు. కాబట్టి అతణ్ని, అతని ప్రసిద్ధినీ ఓర్వలేని నీచుడెవరైనా అతణ్ని నిందించినంత మాత్రంచేత అతని వ్యక్తిత్వానికి ఎలాంటి లోటూ కలుగదు. సమాజంలో సాధారణంగా జరిగే ఈ ఘర్షణను ఒక సామ్యంతో పోలుస్తూ ఈ కింది భావాన్ని దృష్టాంతాలంకార బంధురం చేస్తున్నది భాస్కర శతకం. తెల్లని పాలతో పరిపూర్ణమైన పాల సముద్రం మీద ప్రయాణించే కాకి ఒకటి, ఒక రెట్ట వేసినంత మాత్రాన ఆ సముద్రానికి లోటు కలుగుతుందా? అనేది భాస్కర శతకం చిత్రించిన ఒక దృష్టాంతాలంకార భావం. కాబట్టి ధర్మాత్ముడు తన ధర్మాన్నేకాని, తదితరాలను లెక్కించకూడదనే భావాన్ని తెలుపుతూ ధర్మాత్ముని లక్షణాన్ని చిత్రిస్తున్నది. 'భాస్కర శతకము!'.

3.
   1. డబ్బున్న వాడికి చేసేమేలు నిష్ఫలమౌతుంది. పేదలకుచేస్తే సత్ఫలమౌతుంది. ఇది ఉపమేయ వాక్యం.
   2. మేఘం వాడిన చేలమీద కురవాలిగాని, సముద్రాలమీద కురిస్తే ఫలితమేమిటి? - ఇది ఉపమాన వాక్యం.
   3. "మేలు చెయ్యటం, వానకురవటం" అనేవి రెండూ భిన్న ధర్మాలు. ఈ రెంటి సాదృశ్యంవల్ల బింబ ప్రతిబింబ భావం కల్పించబడుతుంది. అందువల్ల ఇది దృష్టాంతాలంకారం.

**– డాక్టర్ రావికంటి వసునందన్**

BRAOU

# భాగం 11 అన్నమాచార్య సంకీర్తన

**విషయక్రమం**

11.0 ఉద్దేశం
11.1 ప్రవేశిక
11.2 సూచనలు
11.3 పాఠ్యం
    11.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    11.3.2 వ్యాఖ్యానం
    11.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
11.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
11.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
11.6 ఆకళింపు ప్రశ్నలు
    అభ్యాసాలకు జవాబులు
    చదవదగిన పుస్తకాలు

## 11.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- సంకీర్తన కవిత్వ పద్ధతి
- పదకవితా లక్షణాలు
- అన్నమాచార్యుని సమతాదృష్టి, భక్తితత్త్వం

BRAOU

## 11.1 ప్రవేశిక

ఇంతవరకూ మీరు తెలుగు ప్రాచీన కవిత్వ సంప్రదాయంలోని (10) భాగాలు చదువుకున్నారు. సంప్రదాయ కవిత్వంలోని విభిన్న ప్రక్రియల స్వరూప స్వభావాలను ఆ భాగాల ద్వారా అధ్యయనం చేశారు. ఈ భాగం ప్రాచీన కవిత్వం పాఠ్యాంశాలలో చివరిది. దీని ద్వారా మీరు తెలుగు పదకవిత్వం స్వరూప స్వభావాలను తెలుసుకుంటారు. ఈ పాఠ్యాంశంలో సంక్తీరన సాహిత్యం మూల స్వభావమైన భక్తితో పాటు ఈ కవికి కులమతాల పట్ల ఉన్నభేదరాహిత్యాన్నీ, అతనికి ఉన్న లోతైన సామాజిక దృక్పథాన్నీ కూడా మీరు అవగతం చేసుకుంటారు.

## 11.2 సూచనలు

తెలుగు పదకవిత్వంలో అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య, దీక్షితారు వంటి వారు సుప్రసిద్ధులు. ఈ భాగం చదివే ముందు విద్యార్థులు ఆ వాగ్గేయకారుల సంకీర్తనలు అధ్యయనం చెయ్యాలి. ఆ విభిన్న భక్త కవుల పోకడలను ఈ పాఠం అధ్యయనానికి జతపరుచుకోవాలి.

## 11.3 పాఠ్యం

పల్లవి

తందనాన ఆహి – తందనాన పురె
తందనాన భళా – తందనాన

|తంద| ...141

1. బ్రహ్మమొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ।తంద।

2. కందువగు హీనాధికము లిందులేవు
అందరికి శ్రీహరే - అంతరాత్మ
ఇందులో జంతుకుల మంతానొకటే
అందరికి శ్రీహరే - అంతరాత్మ ।తంద।

3. నిండార రాజునిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు - మెట్టుభూమి యొకటే
ఛండాలుండుండేటి సరి భూమి యొకటే ।తంద।

4. అనుగు దేవులకును - అల కామ సుఖమొకటే
ఘనకీటపశువులకు కామ సుఖమొకటే
దినమహోరాత్రములు తెగి ధనాఢ్యునకొకటే
వొనర నిరుపేదకును వొక్కటే అవియు ।తంద।

5. కొరలి శిష్టాన్నములు గొను నాకలొకటే
తిరుగు దుష్టాన్నములు తిను నాకలొకటే
పరగ దుర్గంధములపై వాయువొకటే
వరుస బరిమళముపై వాయువొకటే ।తంద।

6. కడగి యేనుగు మీద గాయు యెండొకటే
పుడమి శునకము మీద బొలయు నెండొకటే
కడు బుణ్యులను బాపకర్ములను సరిగా
జడియు శ్రీవేంకటేశ్వరునామమొకటే ।తంద।

### 11.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| తందనాన | = | పాటేటప్పుడు లయను సూచించే రాగాలాపన |
| ఆహి, పురే, భళా | = | ఆశ్చర్యాన్ని తెలిపే పదాలు |
| కందువగు | = | తెగలుగా ఉన్న |
| మెట్టు | = | త్రొక్కు |
| అహోరాత్రములు | = | పగలు, రేయి |
| శునకము | = | కుక్క |
| జడియు | = | ప్రకటమగు |

### 11.3.2. వ్యాఖ్యానం

కడపజిల్లా రాజంపేట తాలూకాలో తాళ్ళపాక అనే గ్రామం ఉంది. అన్నమయ్య ఆ ఊరిలో లక్కమాంబ, నారాయణసూరి అనే బ్రాహ్మణ దంపతులకు లేక లేక పుట్టిన పుత్రుడు. క్రీ.శ. 1408వ సంవత్సరం వైశాఖ మాసం విశాఖా నక్షత్రంలో పుట్టాడని చెపుతారు. అన్నమయ్య కాలం 1424 - 1530 అని విమర్శకుల అభిప్రాయం.

చిన్నప్పటినుండి తల్లినేర్పడం వల్ల అన్నమయ్యకు పాటలు పాడడం, పాటలు కట్టడం అలవాటయ్యింది. శ్రీ వేంకటపతి మీద వింత వింత కీర్తనలు పాడసాగాడు. సాంప్రదాయికమైన కుటుంబంలో పుట్టి సామాన్యమైన అల్లాయి పదాలు అల్లడాన్ని బంధువులు ఈసడించుకున్నారు. అన్నమయ్యకు ఆ వాతావరణం నచ్చలేదు. భక్తులు గుంపులుగా తిరుపతి కొండకు వెళుతుంటే వారితోపాటు తిరుపతికి చేరాడు.



BRAOU

తిరుపతిలో అశువుగా వేంకటేశ్వరశతకం చెప్పాడు. తర్వాత పన్నెండు శతకాలు రచించాడు గాని అవి దొరకడం లేదు. తిరుపతి నుండి అహోబిలం చేరి **ఆదివన్ శఠగోపయతి** దగ్గర వైష్ణవమతరహస్యాలు తెలుసుకొని దేశసంచారం మొదలుపెట్టాడు. తమిళంలో అళ్వారులు పాశురాలు పాడి వైష్ణవాన్ని ప్రచారం చేశారు. అన్నమయ్య అదేవిధంగా పాటలు పాడుతూ వైష్ణవాన్ని ప్రచారం చేశాడు. అన్నమయ్య పాటలకు సామాన్యుల్లో గొప్ప ప్రచారం కల్గింది. అతణ్ణి గురించి సాళ్వ నరసింగరాయలు విన్నాడు. నరసింగరాయలు తాళ్ళపాక సమీపంలో ఉన్న టంగుటూరుకు దండనాథుడు. రాజుగారి ఆస్థానంలో ఉంటూనే అతణ్ణి గురించి పాటలు కట్టమంటే అన్నమయ్య నిరాకరించాడు.

'నరహరి కీర్తనవానిన జిహ్వ
పరులనుతింపగనోపదు జిహ్వ'

అన్నధీరుడు అన్నమయ్య. దాదాపు 32వేల సంకీర్తనలు రచించాడని ప్రతీతి. దురదృష్టవశాత్తు చాలా వరకు అలభ్యాలు. సంస్కృతంలో వేంకటాచల మహాత్మ్యం రచించాడు. తెలుగులో రామాయణాన్ని ద్విపదగా చెప్పాడు.

అన్నమయ్య ప్రశస్తికి ప్రధానంగా నాలుగు కారణాలున్నాయి.

1. తెలుగులో మాత్రమే కాకుండా సంస్కృతంలో సంకీర్తనలు రచించడం.
2. కేవల ఆధ్యాత్మిక సంకీర్తనలే కాక మధుర భక్తికి ప్రాధాన్యం కల్పించడం.
3. జానపద గేయరీతుల్ని గ్రహించి ఆ బాణీలో పాటలు అల్లటం.
4. పామరులు కూడా సులభంగా గ్రహించేటటువంటి భాషను పాటల్లో ప్రయోగించడం.

ఈ సంకీర్తనంలోని ప్రత్యేకత అన్నమయ్య సమదృష్టి; హరిభక్తి. ఆయన ప్రకారం :

భిన్న భిన్న స్వరూప స్వభావాలతో సదా పరిణామం పొందే లోకంలో ఎలాంటి మార్పూ లేక నిలకడ అయినది బ్రహ్మమొకటే. బ్రహ్మమయిన ఈ సృష్టిలో వేరు వేరుగా విడదీసి చూపడం కుదరదు. పైగా వాటిలో హెచ్చు తగ్గులు అసలే లేవు. అందరికీ శ్రీహరియే అంతరాత్మ. అందుచేత ప్రపంచంలోని ప్రాణి వర్గమంతా ఒకటే గాని వాటిలో భేదమేమాత్రం లేదు.

బ్రహ్మజ్ఞానం కలిగిన బ్రాహ్మణుడు, చెప్పులు కుట్టే చండాలుడు తిరిగే భూమి ఒకటే.

దేవతలకు గాని, పశువులకుగాని కామేచ్ఛలలో గాని ఆ అనుభవంలోగాని తేడా లేదు. డబ్బున్న వానికి గాని, పేదవానికి గాని దినమనేది (రాత్రింబవళ్ళు) ఒకటేగాని వాటిలో హెచ్చు తగ్గులు అసలే లేవు.

షడ్రసోపేతమయిన ఆహారం సేవించే వానిలో గాని, ఏదో దొరికింది తినే పేద వానిలో గాని ఆకలి సమానంగానే ఉంది.

కంపుకొట్టే పదార్థాల మీద వీచేగాలి, సువాసనలు వెదజల్లే వస్తువులమీద వీచేగాలి ఒకటే గాని తేడాలేదు.

ఏనుగు మీద కాసే ఎండ, కుక్క మీద కాసే ఎండలో తేడా లేదు. అలాగే పుణ్యాత్ముల్ని, పాపాత్ముల్ని సమానంగా కాపాడడానికి శ్రీ వేంకటేశ్వర నామం తప్ప దానికి సాటి వచ్చేది మరొకటి లేదు.

**11.3.3. విశేషాంశాలు**

ఈ సంకీర్తనలో సర్వసమతాభావం ద్యోతకమవుతుంది. అణువు మొదలు అజాండం వరకు పరబ్రహ్మం సర్వత్రా వ్యాపించి ఉంది. జాతి వర్ణ కుల మత భేదాలు పామరమైనవి. అందరిలోనూ అంతరాత్మలా వెలుగొందేవాడు శ్రీహరియే. తరతమ భేదాలు మరచి అతణ్ణి భజించి తరించమని అన్నమయ్య ప్రబోధం.

సుప్రసిద్ధమైన దేశిరాగాలలో, సుగ్రాహ్యమైన లయ, తాళాలలో నిబంధించిన సులభ రచనలే పదాలు. ఈ పదాలకు రెండు అంగాలున్నాయి- పల్లవి, చరణం అని. పదం మొత్తానికి ప్రధానమైన అర్థం పల్లవిలో ఉంటుంది. దాని విస్తరణ, వివరణ చరణంలో ఉంటుంది. కడపటి చరణంలో కర్త ముద్ర కనిపిస్తుంది. అవన్నీ ఖచ్చితంగా యథాతథంగా అనుసరించాలనీ, అనుసరిస్తారనీ చెప్పలేం. ఉదాహరణకు ప్రస్తుత పాఠ్యమైన

పదంలో పల్లవి అర్థరహితం. కేవల తాళలయాత్మకం. మొదటి చరణం ప్రధానభావాన్ని పొదివిపట్టుకుంది. మిగిలిన చరణాలు ఆ ప్రధానార్థాన్ని సమర్థిస్తూ విపులమైన వివరణలో ఉన్నాయి.

సంగీత దృష్టితో చూస్తే తాళ, లయలు 'పదం'లో ఆద్యంతం ఒకే రీతిగా కన్పిస్తాయి. పల్లవిలో పాటమరించిన రాగభావమే చరణాల్లో విస్తరిస్తుంది. ఎన్ని చరణాలున్నా వాటి రాగ స్వర సంచారక్రమం ఒకే తీరుగా ఉంటుంది.

స్వరానికి శ్రుతి చాలా ముఖ్యం. ఇదే విధంగా తాళానికి లయ ముఖ్యం. ఆ పదంలో ఆ లయను కాపాడి, వినేవారికి ఇంపుగొలిపే పని యతిప్రాసల్ది. పదంలో పూర్వ, ఉత్తర ఖండాలు పొందికగా ఉండాలి.

ఉదా: కందువగు హీనాధికములిందులేవు
అందరికి శ్రీహరే - అంతరాత్మ
ఇందులో జంతుకుల మంతానొకటే
అందరికి శ్రీహరే - అంతరాత్మ

అనే చరణాలు చూడవచ్చు. అన్నమయ్య పదాల్లో ఉద్రేక ప్రాధాన్యత, స్వతంత్ర ప్రీతి అధికం. వీరి పదాలలో వైవిధ్యం హెచ్చు.

**అభ్యాసం - 1**

'సంకీర్తన' అంటే ఏమిటి?

**అభ్యాసం - 2**

అన్నమయ్య పాటలకు అధిక ప్రచారం రావడానికి కారణాలేమిటి?

**అభ్యాసం - 3**

అన్నమయ్య సర్వసమతాభావాలను వివరించండి?



BRAOU

## 11.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- తెలుగు లిఖిత కవిత్వంలోని ప్రాచీన సంప్రదాయంలో 'సంకీర్తన' పద్ధతికి చెందిన పాఠ్యం ఇది.
- ఈ పాఠ్యం జానపదబాణీలో దేశి పద్ధతికి సంబంధించిన రాగంలో తాళ, లయ బద్ధంగా ఉన్నది.
- ఈ సంకీర్తన రచయిత పదకవితా పితామహుడు అనే ప్రఖ్యాతి వహించిన సంకీర్తనాచార్యుడు "తాళ్ళపాక అన్నమాచార్యుడు".
- పదకవితలన్నీ సాధారణంగా భగవంతుని మీది భక్తితో, స్తోత్ర రూపకంగా ఉంటాయి. కాని ఈ సంకీర్తన కుల మతరాహిత్యాన్ని ప్రబోధిస్తూ తాత్త్వికంగా, సామాజిక స్పృహతో ఉండడం ఒక విశేషం.

## 9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.
2. ఈ పదం ఆధారంగా అన్నమయ్యవ్యక్తిత్వం వివరించండి.

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. అన్నమయ్యకీర్తనలోని సర్వసమత్వాన్ని క్లుప్తంగా వివరించండి.

## 11.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఈ సంకీర్తనలోని జానపద బాణీని గుర్తించండి.
2. అన్నమయ్యపాటలకు గల ప్రచారానికి కారణాలేమిటో పరిశీలించండి.
3. త్యాగయ్యవంటి తదితర వాగ్గేయకారులతో అన్నమయ్యకు గల భేదసామ్యాలను పరిశీలించటానికి ప్రయత్నించండి.

BRAOU

### అభ్యాసాలకు జవాబులు

1. 'సంకీర్తన' అనే ప్రక్రియ దేశిరాగాలలో, లయతాళాలతో, మాత్రాచ్ఛందస్సులో నిర్మించబడినపాట. దీనికి "పల్లవి - చరణం" అనే రెండు విభాగాలున్నాయి. ప్రతి చరణం చివరా పల్లవి తిరిగి తిరిగి ఆవృత్తి చెందుతుంది. భాష సులభంగా, సుశ్రావ్యంగా ఉంటుంది. భగవంతుని మీది భక్తితో ఈ పాటలు రచించేవారిని "వాగ్గేయకారులు లేదా సంకీర్తనాచార్యులు" అంటారు. సంకీర్తన 'పదం' అనే అర్థంలో కూడా వాడుకలో ఉన్నది. ఇలాంటి పాటలు రాసిన అన్నమయ్యకు పదకవితా పితామహుడు అని పేరు. అన్నమయ్య పదాల్లో కుల మతాలవంటి సామాజిక రంగాలు కూడా ఉండి, ఇతని సాంఘిక దృక్పథాన్ని వెల్లడిస్తాయి.

2. అన్నమయ్య పాటలు సుమధురరీతిలో లయతాళబద్ధంగా, శ్రుతి మధురంగా ఉండి జనాకర్షణను పొందాయి. తెలుగులోనే కాక సంస్కృతంలో కూడా అన్నమయ్య కీర్తనలు రాశాడు. అందువల్ల, పామర జనంలోనేకాక, పండిత లోకంలో కూడా అతని ఖ్యాతి వ్యాపించింది. కేవలం ఆధ్యాత్మిక సంకీర్తనలేకాక అన్నమయ్య మధురభక్తిని సంబంధించిన పదాలు కూడా అల్లడంతో ఆబాలగోపాలానికి ఆ పాటలు సుబోధకంగా, సుగమంగా ఉంటాయి. సులభశైలిలో, జానపద బాణీల్లో ఉన్న ఈ పాటలు పామర, పాటక జనానీకాన్ని అలరిస్తూ అందరికీ గానయోగ్యంగా ఉంటాయి. ఈ కారణాలవల్ల సమాజంలోని అన్ని వర్గాల్లోనూ సంకీర్తనాచార్యుడుగా అన్నమయ్య ఖ్యాతి వ్యాపించింది.

3. తాళ్లపాక అన్నమయ్య గొప్ప విష్ణుభక్తుడు. అతి సామాన్యమైన వాడుక భాషలో సంకీర్తనలు కట్టి భక్తి ప్రబోధం చేసిన పదకవి. అన్నమయ్య రాజాశ్రయాలను కోరలేదు ప్రజాశ్రేయస్సునే కోరినాడు. ఆయన ఆధ్యాత్మికతత్త్వం ప్రజలకు చాలా సన్నిహితమైంది. లోకం భిన్న భిన్న స్వరూపాలతో పరిణామం పొందుతూ ఉంటుంది. పరబ్రహ్మ మొక్కటే నిలకడ అయింది. అందరిలో ఉండేది శ్రీహరి రూపమే. ఒకడు హీనుడని, ఒకడు ఉన్నతుడని తారతమ్యం లేదు. మానవుల్లోనేకాదు, జంతువుల్లో సైతం హరిని చూడగలగడం గొప్ప.

కన్నారా నిద్రించే మహారాజుగారి నిద్రకూ పక్కనే కటికనేలమీద పడుకున్న సేవకుడి నిద్రకూ తేడాలేదు. ఉత్తమ కులంలో పుట్టామని చెప్పే బ్రాహ్మణుడూ భూమ్మీదనే నివసిస్తున్నాడు. చండాలుడని పిలువబడుతున్న పేదవాడూ భూమిమీదనే నివసిస్తున్నాడు. కామసుఖం దేవతలకూ, పశుకీటకాదులకూ సమానమే. పగలు రాత్రి అనేవి ధనవంతునికీ, దరిద్రుడికీ ఒకే విధంగా ఉంటాయి. పంచభక్ష్య పరమాన్నాలు తిన్నా పట్టె కూడుతిన్నా ఆకలి ఒకటే. గాలికి ఇది దుర్గంధమనిగాని, పరిమళమనిగాని తారతమ్యంలేదు. అన్నింటిపైనా ఒకేవిధంగా వీస్తుంది. ఎండకు ఏనుగయినా ఒకటే కుక్కయినా ఒకటే. అదే విధంగా వేంకటేశ్వరుని కరుణ కూడా పాపులమీదా పుణ్యాత్ములమీదా ఒకే విధంగా ప్రసరిస్తుంది. ఆ దైవానికి భేదం లేదు. ఈ విధంగా అన్నమయ్య జాతి, వర్ణ, కుల, మత భేదాలకతీతమైన సమత్వాన్ని ప్రబోధించి, ఆదర్శప్రాయుడైనాడు.

## చదవదగిన పుస్తకాలు


1. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు, ఆంధ్ర సారస్వత పరిషత్ : హైదరాబాద్, 1957, 3 వ ముద్రణ (1981)
2. ఆంధ్ర మహాభారతోపన్యాసముల, ఆంధ్ర సారస్వత పరిషత్ : హైదరాబాద్, 1957, 5 వ ముద్రణ (1981)
3. ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం, యం. శేషాచలం అండ్ కో : సికింద్రాబాద్, (1965)
4. నాగయ్య జి., తెలుగు సాహిత్య సమీక్ష, నవ్య పరిశోధక ప్రచురణలు : తిరుపతి (1983)
5. నారాయణరావు వెల్చేరు, తెలుగులో సాహిత్య [illegible]వాల స్వరూపం (1978)
6. రంగనాథాచార్యులు కె. కె. (సం), తెలుగు సాహిత్యంలో మరో చూపు, ఆంధ్ర సారస్వత పరిషత్ : హైదరాబాద్, (1981)
7. రంగనాథాచార్యులు కె. కె. (సం) తెలుగులో తొలి సమాజకవులు, ఆంధ్ర సారస్వత పరిషత్ : హైదరాబాద్, (1983)
8. లక్ష్మణరావు కొమర్రాజు (సం) ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము, ద్వితీయ సంపుటం, ఆంధ్రపత్రిక ముద్రణాలయం : మద్రాసు, (1934)
9. లక్ష్మీకాంతం పింగళి, ఆంధ్ర సామిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ : హైదరాబాద్, (1974)
10. సోమశేఖర శర్మ మల్లంపల్లి (సం), తెలుగు విజ్ఞాన సర్వస్వము, 3 వ సంపుటం తెలుగు భాషాసమితి : హైదరాబాద్, (1982)


(కందుకూరి వీరేశలింగంగారి కవుల చరిత్ర మొదలుకొని ఇటీవలి జి. నాగయ్య గారి తెలుగు సాహిత్య సమీక్ష వరకు ప్రాచీనాంధ్ర కవిత్వం మీద చాలా గ్రంథాలు వచ్చినాయి. పత్రికల్లో సంకలనాల్లో, వ్యాసాలసంఖ్య అపారం. వీలునుబట్టి ఆ వ్యాసాలూ, పుస్తకాలూ దొరికినంత వరకూ చదవటం మంచిది. అంతేకాక అసలు కావ్యాల్ని సొంతంగా చదివి ఆనందించటం ముఖ్యం. వాటిని గురించి సొంత అభిప్రాయాలు ఏర్పరచుకోవడం అవసరం).

– ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి

# ఖండం 3 ఆధునిక కవిత్వం (లిఖిత సంప్రదాయం)

ఈ ఖండంలో 17 భాగాలను మీరు అధ్యయనం చేస్తారు. అవి 1. దేశభక్తి 2. ఆంధ్రోద్యమం 3. వసంతర్తువు 4. స్వేచ్ఛాగానము 5. మాతృగీతాలు 6. కలత విదుర 7. కష్టజీవి 8. పానశాల 9. ప్రతిజ్ఞ 10. ఆర్తగీతం 11. రెండు లోకాలు 12. నాక్కొంచెం నమ్మకమివ్వు 13. అయిదూ చిటిగొలుసూ 14. ఉష స్సంధ్య 15. కర్పూర వసంతరాయలు – లకుమ నృత్యం 16. నదుడు కక్కుతున్న విషం 17. రహదార్లు. ఈ భాగాల ద్వారా ఆధునిక కవిత్వానికి సంబంధించిన భావ, అభ్యుదయ కవిత్వ దృక్పథాలనూ వాటికి అనుబంధించిన వివిధ ప్రక్రియలనూ మీరు అవగతం చేసుకుంటారు.

## భాగం 1 దేశభక్తి

విషయక్రమం


1.0 ఉద్దేశం
1.1 ప్రవేశిక
1.2 సూచనలు
1.3 ఆధునిక కవిత్వం అంటే
1.4 పాఠ్యం
 1.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు
 1.4.2 వ్యాఖ్యానం
 1.4.3 విశేషాంశాలు
అభ్యాసము –1
అభ్యాసము –2
1.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
1.7 ఆకలింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు


### 1.0 ఉద్దేశం

అద్యతనాంధ్ర యుగకర్త గురజాడ అప్పారావుగారి ఈ రచన చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- అప్పారావుగారి రచనలోని దేశభక్తి, జాతీయ భావపరంపర.
- భావకవిత్వ విధానం.

### 1.1 ప్రవేశిక

ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యం అనేక ముఖాలుగా వికసించింది. భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, గేయకవిత్వం, ఖండకావ్యం ఆ విభాగాల్లో ప్రధానమైనవి. ఆయా శాఖలకు సంబంధించిన పాఠ్యాలు ఈ ఆధునిక కవిత్వ విభాగంలో మీరు అధ్యయనం చేస్తారు. ఆధునిక కవిత్వ సంప్రదాయాలనూ, లక్షణాలనూ తెలుసుకుంటారు. వాటిలో మొదటి భాగం ప్రస్తుతం మీరు చదువుతున్న 'దేశభక్తి' గేయం. ఇది భావకవిత్వ శాఖకు చెందిన రచన.

BRAOU

## 1.2 సూచనలు

ఈ భాగం చదివేముందు మీరు ఆధునిక కవిత్వయుగ లక్షణాలనూ, సంప్రదాయాలనూ, ఆవిర్భావ వికాసాలనూ అధ్యయనం చెయ్యాలి. 1.3 లో ఇచ్చిన అంశాలను క్షుణ్ణంగా పఠించండి. ప్రత్యేకంగా భావ కవిత్వ పద్ధతులను తెలుసుకోవాలి.

## 1.3 ఆధునిక కవిత్వం అంటే

సుమారు ఒక నూరేళ్ళ కాలంనుండి ఇప్పటి వరకూ వచ్చిన సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యం అంటాం. ప్రాచీనుల జీవిత విధానాలకూ ఇప్పటి వారి పద్ధతులకూ భేదం ఉన్నట్టే పూర్వపు సాహిత్యానికీ ఇప్పటి సాహిత్యానికీ భేదం ఉంది.

కాలంలో సంవత్సరాలూ, నెలలూ, తారీకులూ లెక్కల్ననుసరించి సమాజంలోనూ, సాహిత్యంలోనూ మార్పులురావు. అందువల్ల ఫలాని రోజునుంచి ఆధునికయుగం అని నిర్దేశించలేం. సమాజంలోనూ, సాహిత్యంలోనూ కాల విభజన (దీన్నే యుగవిభజన అనికూడా అంటారు) స్థూలంగా చేస్తాం.

ప్రాచీన సమాజంలో స్థైర్యం ఎక్కువ. ఆధునిక సమాజం సంచలన శీలమైనది. అందువల్ల ప్రాచీన సమాజంలో మార్పులు చాలా నెమ్మదిగావస్తే ఆధునిక సమాజంలో త్వరితగతిని వస్తున్నాయి.

ఉత్పత్తి సందంధాల్లో వచ్చిన మార్పులు సామాజిక భావజాలంలో మార్పులకు మూలభూతమవుతాయని ఆర్థిక, సామాజిక శాస్త్రవేత్తలంటారు. ఈ మార్పులు సాహిత్యంలోనూ కనిపిస్తాయి.

విదేశీయ పరిపాలన మనదేశంలో మార్పులకు ప్రధాన కారకంగా పనిచేసింది. ఆర్థిక సంబంధాల్లోనూ, రవాణా రహదారీ సౌకర్యాల్లోనూ, భావ ప్రకాశ సాధనాల్లోనూ, పాలనా యంత్రాంగంలోనూ అత్యంత గుణాత్మకమైన పరిణామాలు వచ్చినాయి. ఈ పరిణామాలు పాశ్చాత్య దేశాల్లో చాలాముందే జరిగినాయి. అక్కడి వేగం మన వేగంకన్నా ఎక్కువ. అందుకే దాన్ని 'విప్లవం' అనే పదంతో సూచిస్తారు. ఈ మార్పులన్నిటినీ కలిపి పారిశ్రామిక విప్లవమని కూడా అన్నారు. అట్లాంటి విప్లవకర పద్ధతిలో కాకపోయినా మనదేశంలో అన్ని సామాజిక రంగాల్లోనూ స్ఫుటమైన రీతిలో మార్పులు కనిపిస్తాయి.

ప్రాచీన సమాజపు ఆర్థిక విధానం అతిక్లిష్టమైనది. సామాజిక సంబంధాలు అసంకీర్ణమైనది. పాలనవ్యవస్థ అశ్లిష్టమైనది. ఆధునికకాలంలో ఇవన్నీ అత్యంత విస్తరించి సంక్లిష్ట, సంకీర్ణ, సంశ్లిష్ట తరాలయినాయి.

సామాజికుల ఊహలకూ, భావాలకూ, ఆశలకూ, ఆశయాలకూ, వ్యక్తరూపమైన సాహిత్యంలో కూడా సామాజిక పరిణామాలకు ప్రతిస్పందన ఉంటుంది. ఆ ప్రతిస్పందన గుణాత్మకమైన మార్పులను కలిగిస్తే దాన్ని ఆధునిక సాహిత్యం అంటాం.

BRAOU

ప్రాచీన లిఖిత సాహిత్యానికి చదువరులు తక్కువనీ, అసలు విద్యాధికుల సంఖ్యే ఆనాడు తక్కువనీ మనకు తెలుసు. అందువల్ల చాలా తక్కువమందికి ఉద్దేశించిన సాహిత్యం వాళ్ళకు మాత్రమే అర్థమయ్యే భాషాశైలిలో ఉండేది. మరీ మధ్యకాలపు సాహిత్యంలో అయితే పద్యరచనా ప్రౌఢిమ, వర్ణనా ప్రాగల్భ్యం, రసాలంకార నిర్మాణ చాతుర్యం విజృంభించినాయి. చిత్రకవితా రీతులు విస్తరిల్లినాయి. మధ్యలో అచ్చతెలుగు కావ్యాలు అవతరించినాయి. ఇవన్నీ ప్రాచీన సాహిత్యంలో మన కవులు చేసిన సాముగారిడీలు. ఇవి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి కాని స్పందనను కలిగించలేవు.

ఆధునికకాలంలో విద్యావ్యాప్తి క్రమక్రమంగా పెరిగింది. సాహిత్య పాఠకులు పెరిగారు. జీవిత విధానంలో మార్పులు వచ్చినాయి. అభిరుచులు మారటమేగాకుండా వైవిధ్యంకూడా ఏర్పడింది. ఎక్కువ మంది చదువరుల అభిరుచి వైవిధ్యానికి సరిపడా సాహిత్య ప్రక్రియా వైవిధ్యమేర్పడింది. అంతకు పూర్వం లేని కథ, నవల, వ్యాసం వంటి వచన సాహిత్య రూపాలేర్పడ్డాయి. (వాటి పరిణామ రీతులను ఇంకో పుస్తకంలో మీరు చదివే ఉన్నారు).

సాహిత్యంలో శైలీ కాఠిన్యం మరీ ముఖ్యంగా పద కాఠిన్యం తగ్గుముఖం పట్టింది. సాహిత్యం ఎక్కువ మందికి ఉద్దేశించినప్పుడు ఇది తప్పని సరిగా జరిగే మార్పు. కవిత్వం కన్నా నవల, కథ ఎక్కువ మంది చదువుతారు. అందువల్లనే ఆ ప్రక్రియల్లోవాడే భాష చాలా మందికి అందుబాటులో ఉండే భాష, కనీసం అర్థమయ్యే భాష.

కవిత్వంలో కూడా శైలి సరళీకృతమయింది. కవుల పాండిత్య ప్రదర్శనకు ప్రాధాన్యం తగ్గి, పాఠకుల అభిరుచులకు అనుగుణంగా భావావేశానికి కళా స్పందనకు ప్రాముఖ్యం పెరిగింది.

ఆధునిక కవిత్వంలో రూపంలోనూ, వస్తువులోనూ, వ్యక్తీకరణలోనూ పద ప్రయోగంలోనూ ఇంకా ఇట్లాంటి వాటిల్లో వచ్చిన మార్పులను ఈ కిందివిధంగా పరిగణన చేయవచ్చు.

### 1. భాషాశైలి క్రమక్రమంగా తేలికయింది

సరిగ్గా ఇంతకు క్రితమే పేర్కొన్నట్టుగా ఆధునిక కవిత్వంలో ఎక్కువ మందికి అర్థమయ్యే భాషా ప్రయోగం ఒక ముఖ్యమైన మార్పు. ప్రాచీనభాషలో మాత్రమే కనిపించే విభక్తి ప్రత్యయాలు, సర్వనామ ప్రయోగం, దీర్ఘ సమాస పరికల్పన, సంస్కృతాంధ్ర విరళ శబ్ద ప్రయోగం ఆధునిక వచన రచనలో క్రమ క్రమంగా అదృశ్య మయ్యాయి. ఆధునిక కవిత్వంలో ఇవి తగ్గుముఖం పట్టాయి. అయితే ప్రాచీన ధోరణిలో ప్రౌఢ ప్రబంధాలు రాయాలనుకొని రాసిన గ్రంథాల్లో ఇవి కనిపిస్తాయి. ప్రాచీన కావ్యాలకులాగే వీటికి పాఠకుల సంఖ్య పరిమితం.

అయితే ఇప్పటికీ తెలుగు కవిత్వంలో ప్రాచీన ధోరణులు విరివిగానే కనిపిస్తాయి. ముఖ్యంగా సంస్కృత సమాస ప్రీతి తెలుగు కవులకు వదలలేదు. వాక్య పద్ధతి మాత్రం ఆధునికం అయింది. అందువల్ల నిఘంటు సాయంతో శబ్దార్థాలు గ్రహిస్తే కావ్య పఠనం తేలికవుతుంది.

అత్యాధునిక కవితా రీతుల్లో మాత్రం వాక్య నిర్మాణ సూత్రాతిక్రమణ జరిగి అర్థావగతితో సంబంధంలేని అనుభూతి ప్రధాన ధోరణి అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ ధోరణి ఇంగ్లీషు ఎక్కువ చదువుకున్న వారిలో మాత్రమే కనిపిస్తుంది.

### 2. కథా ప్రాధాన్యం తగ్గింది; ఖండకావ్య రచన పెరిగింది

ప్రాచీన సాహిత్యంలో ముక్తకాలు, చాటువులు, శతకాలు తప్ప మిగతా కావ్యాలన్నిటిలోనూ కథా నిర్వహణ కవి ప్రతిభకు గీటురాయిగా ఉండేది. దాన్ని అనుసరించి రస నిర్వహణ చర్చ జరిగేది. ప్రాచీనాలంకారికులు చెప్పే రస నిష్పత్తి జరగాలంటే కథ అవసరం.

కథా కథనం, సన్నివేశ నిర్మాణం, పాత్ర చిత్రణం వంటి వాటి కోసం నవల, కథానికా రీతులు ఏర్పడ్డాయి. కవిత్వానికి ఆ బరువు తొలగటంవల్ల కావ్య పరిమితి కూడా తగ్గింది. ప్రాచీన పద్ధతి ప్రబంధాలకు బదులు చిన్న చిన్న కావ్య ఖండికలతో ఖండ కావ్య సంకలనాలు వచ్చాయి. అయితే తొలి రోజుల కవిత్వంలో కథా ప్రాధాన్యం కొంత ఉంది. రాయప్రోలు సుబ్బారావుగారి లలిత, తృణకంకణ, కష్టకమల, స్నేహలత కథాకావ్యాలే. గురజాడ అప్పారావుగారి కన్యక, లవణరాజు కల, పుత్తడిబొమ్మ లాంటి లఘుకావ్యాల్లో కథ ఉంది. కట్టమంచి రామలింగారెడ్డిగారి ముసలమ్మ మరణం, దువ్వూరి రామిరెడ్డిగారి కడపటి వీడ్కోలు కథా కావ్యాలే. అయితే వీటిల్లో కథా పరిమాణం తగ్గటం మనం గ్రహించవచ్చు.

మరీ ఇటీవలి కాలంలో కథాకావ్యాలు రచించిన వారిలో సి. నారాయణరెడ్డిగారు ముఖ్యులు (కర్పూర వసంతరాయలు కావ్యంనుంచి తీసి ఇచ్చిన లకుమ నృత్యం మీ పాఠ్యాంశాల్లో ఉంది).

గుర్రం జాషువా, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, కవి కొండల వెంకటరావు, శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర వంటి కవులు ప్రధానంగా ఖండ కావ్య రచయితలు. కథా కావ్యాలు రచించిన కవులుకూడా ఖండ కావ్యాలు విరివిగా రాశారు.

### 3. కథాకావ్యాల కథల్లో వాస్తవికతకు ప్రాధాన్యం పెరిగింది

ప్రాచీన ప్రబంధాల్లో అతిమానుషమైన సంఘటనలు ఎక్కువ ఉండేవి. అవిలేని కావ్యాలు అసలుండేవే కావు. రాయప్రోలు గురజాడల ఒరవడిలో వచ్చిన కావ్యాలు కేవలం మనుషుల కథల్నే చిత్రించినాయి. ఇంతకు పూర్వం పేర్కొన్న ఆధునిక కావ్యాల్లోని కథలు మానవేతివృత్తాలే.

ఇటీవలి కాలంలో పాత్రలు లేకుండా కొన్ని కథాకావ్యాలు వచ్చినాయి. నైజాం పరిపాలనలో తెలుగువారు తిరగబడ్డ కథను కందుర్తి ఆంజనేయులుగారు 'తెలంగాణ' అనే కావ్యంగా రచించారు. ఇది కథా కావ్యమే. కాని ప్రజలే పాత్రలు. వ్యక్తి ప్రాధాన్యం లేదు.



BRAOU

**4. మూఢాచార నిరసనా, హేతు దృష్టి ఆధునిక కవిత్వంలో ఒక ముఖ్య ధోరణి**

గురజాడ అప్పారావుగారి పూర్ణమ్మ కావ్యం బాల్య వివాహాన్ని నిరసిస్తుంది. కన్యక రాచరికపు దుర్మా చిత్రిస్తుంది. లవణ రాజుకల వర్ణాశ్రమ ధర్మాల్ని వ్యతిరేకిస్తుంది. త్రిపురనేని రామస్వామి చౌదరిగారి సూత పురా భగవద్గీత అనే కావ్యాలు పౌరాణిక కథల్లోని తర్కాన్ని అవహేళన చేస్తాయి.

**5. జానపద కవిత్వమనీ, ప్రజాసాహిత్యమనీ వేరువేరు పేర్లతో ఉన్న మౌఖిక సాహిత్య ధోరణులు నాగరక కవిత్వంలో చోటు చేసుకున్నాయి.**

నాగరిక కవిత్వం అంటే లిఖిత కవిత్వం. చదువుకున్న వాళ్ళకుద్దేశించింది నాగరిక కవిత్వం. మౌఖిక సాహిత్యం నోటి మాట ద్వారా ప్రసారమవుతుంది. ఈ సాహిత్య లక్షణాలు ఖండం 1లో మీకిప్పటికే పరిచయమయినాయి.

జానపద కవిత్వం లయ బద్ధమైనది. పాడుకోటానికి అనువైనది. దాని ఛందః పద్ధతిని మాత్రా ఛందస్సు అంటారు. (దీన్ని గురించి తెలుగు మౌలిక అంశాలలో మీరు నేర్చుకున్నారు) ప్రాచీన కవిత్వంలో రగడలు లయబద్ధమైనవి. మాత్రా గణబద్ధమైనవి. అయితే ఇవి ఎక్కడో కొన్ని రకాల వర్ణనల్లో మాత్రమే కనిపించేవి.

ఆధునిక కవిత్వంలో మాత్రా బద్ధమైన 'గేయం' ప్రధాన కవితారూపంగా ప్రచారం లోకి వచ్చింది. గురజాడ అప్పారావుగారి కావ్యఖండికలన్నీ గేయాలే. భావ కవుల్లో కవి కొండల వెంకటరావుగారు, బసవరాజు అప్పారావుగారు, నండూరి సుబ్బారావుగారు ఎక్కువగా గేయాలు రాశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావుగార్ల గేయాలు వారి పద్యాలతో పాటు ప్రసిద్ధికెక్కినాయి.

అభ్యుదయ కవులు ప్రధానంగా గేయాల్లోనే రాశారు. శ్రీ శ్రీ, ఆరుద్ర, అనిసెట్టి సుబ్బారావు, కె.వి. రమణారెడ్డిగార్ల ప్రధాన కవిత్వమంతా గేయరూపమే.

దాశరథి, నారాయణరెడ్డిగార్లు అన్ని కవితారూపాల్లోనూ రాశారు. నారాయణరెడ్డిగారి పద్యాలకన్నా గేయకావ్యాలకే ప్రసిద్ధి ఎక్కువ. గేయాలకు పద్యత్వం కల్పించిన గౌరవం నారాయణరెడ్డి గారిది. పద్యంలో గణవిభజన పాదమధ్య పాదాంత విరామాలు కనపడకుండా రాయటం తెలుగు కవుల అలవాటు. నారాయణరెడ్డిగారు గేయాలు కూడా అట్లా రాశారు. అప్పుడు గేయం పద్యంలాగా చదవవచ్చు.

**6. ఆధునిక కవిత్వంలో సామాజిక ప్రగతి కోసం చేసే ప్రబోధం ప్రధాన ప్రయోజనంగా ముందుకొచ్చింది.**

ప్రాచీన కవిత్వంలో కూడా సామాజిక ప్రగతి అనే లక్ష్యాన్ని కష్టపడి చూపించవచ్చు. "విశ్వశ్రేయః కావ్యం" అని ఆంధ్ర శబ్ద చింతామణి నిర్వచించింది. 'ఆంధ్రావళిమోదముంబొరయ' తాను భారతాన్ని తెలుగు జేస్తున్నా నన్నారు తిక్కనగారు. కాని సామూహికంగా ప్రజలను ప్రబోధించే లక్ష్యం ఆధునిక కవిత్వానిదే. ఈ ఖండికల్లో "దేశమును ప్రేమించుమన్నా" అనేది అట్లాంటిది. అభ్యుదయ కవులలో ఈ సామాజిక ప్రగతి అత్యంత ప్రధాన లక్ష్యంగా ముందుకు వచ్చింది. శ్రీ శ్రీ, ఆరుద్రల కవితా ఖండికలను చదివితే ఈ విషయం గ్రహించవచ్చు. వర్గ రహిత స్వర్గ స్థాపన తమ లక్ష్యమన్నారు అభ్యుదయ కవులు.

**7. ఆధునిక కవిత్వంలో వస్తువైవిధ్యం, ప్రక్రియావైవిధ్యం ఎక్కువ.**

ప్రాచీన కవిత్వంలో ఒక ప్రధాన ధోరణి కొన్ని శతాబ్దాల వరకు అమలులో ఉండేది. ప్రబంధ ధోరణి సుమారు మూడు శతాబ్దాలపాటు (16, 17, 18) ప్రచారంలో ఉండింది.

ఆధునిక కాలంలో మార్పులు త్వరత్వరగా వస్తాయి. అందువల్ల అతితక్కువ కాలంలో ప్రక్రియలు మారి రకరకాల ధోరణులు ప్రచారంలోకి వచ్చినాయి. 1920 - 40 సంవత్సరాల మధ్య కాలంలో ప్రకృతికవిత్వం. ప్రణయ కవిత్వం, స్మృతి కవిత్వం, దేశభక్తి కవిత్వం ప్రవర్తిల్లినాయి. వీటినన్నిటినీ కలిపి కాల్పనికధోరణులంటారు. 1935 - 1955 మధ్య కాలంలో అభ్యుదయ కావ్యాలు ప్రచారమయినాయి. ఇవికాక మధ్యలో కృషిక కవిత్వం, అధివాస్తవిక కవిత్వం, అధిక్షేప కవిత్వం, ప్యారడీ కవిత్వం, దిగంబర కవిత్వం ఇంకా ఎన్నో రకాల కవితా ధోరణులు ఈ కాలంలో ప్రవర్తిల్లినాయి.



BRAOU

ఇటీవలి కాలంలో పద్యగేయాల ప్రాబల్యం తగ్గి ఛందస్సును, లయను వదిలేసిన వచన కవిత్వం అనే ధోరణి వెలామణిలోకి వచ్చింది. కుందుర్తి ఆంజనేయులుగారు ఎక్కువభాగం వచనకవిత్వమే రాశారు. గేయకావ్య రచయితగా ప్రసిద్ధి చెందిన నారాయణరెడ్డిగారు వచనకావ్య సంపుటులను కొన్నిటిని ప్రకటించారు.

వచనకవిత్వంలో 'మినీకవిత్వం' అని ఒకటి ప్రచారంలోకి వచ్చింది. ఒక చిన్న భావాన్ని ఒకటి, రెండు వాక్యాల్లో మాత్రమే చెప్పటం మినీకవిత్వ పద్ధతి.

జానపద కళారీతులలో పాటలు మళ్ళీ ఇప్పుడు వ్యాపిస్తున్నాయి. అభ్యుదయ కవితా యుగంలో బుర్రకథల మాదిరి ఆధునిక భావాలతో తెలంగాణం నుంచి ఒగ్గు కథలు వ్యాపిస్తున్నాయి. ఈ ప్రయోగాలన్నీ ఆధునిక కవిత్వానికి వైవిధ్యాన్ని సంతరించి పెడుతున్నాయి.

## 1.4 పాఠ్యం

దేశమును ప్రేమించుమన్నా
మంచిఅన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయి.

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయి
తిండికలిగితే కండకలదోయి
కండకలవాడేను మనిషోయి

యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయి?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయి.

అన్ని దేశాల్ క్రమ్మవలెనోయి
దేశి సరుకుల నమ్మవలెనోయి
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపద లబ్బవోయి.

వెనుక చూపిన కార్యమేమోయి?
మంచిగతమున కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనుకపడితే వెనకేనోయి.

పూను స్పర్థను విద్యలందే
వైరములు వాణిజ్యమందే
వ్యర్థ కలహం పెంచబోకోయి
కత్తివైరం కాల్చవోయి.

దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయి
పూని యేదైనాను వొకమేల్
కూర్చి జనులకు చూపవోయి.

ఓర్వలేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయి
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి.

పరుల కలిమికి పొర్లియేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయి?
ఒకరి మేల్ తనమేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయి.

స్వంతలాభం కొంత మానుకు
పొరుగువానికి తోడుపడవోయి,
దేశమంటే మట్టికాదోయి
దేశమంటే మనుషులోయి.

చెయ్యిపట్టాల్ పట్టుకొని దే
శస్థులంతా నడువవలెనోయి
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి.

మతం వేరైతేను యేమోయి?
మనసు లొకటై మనుషులంటే
జాతమన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయి.

దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయి
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయి.

ఆకులందున అణగి మణగి
కవిత కోకిల పలుకవలెనోయ్
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయి.

BRAOU

### 1.4.1 కఠిన శబ్దాలకు అర్థాలు

ఈసురోమని = నిరాశనిస్పృహలతో
కత్తివైరం = పోట్లాడే మనస్తత్వం
జాతము = సమాజం, రాష్ట్రం, దేశం.

### 1.4.2 వ్యాఖ్యానం

గురజాడ అప్పారావు (1862 - 1915) గారిని ఆంధ్ర సాహిత్యలోకంలో కొత్తయుగానికి ప్రారంభకులుగా గుర్తిస్తారు. సాహిత్యం కొందరి "సొంత సొమ్ము" అనుకుంటున్న ఆ కాలంలో ప్రజాపరం చేసిన సాహితీవేత్త అతడు.

1882 నుంచే గురజాడ ఇంగ్లీషులో రచనలు చేయసాగాడు. మొదట మొదట కేవల సంప్రదాయ రీతిలో, ప్రాచీన వృత్తాల్లో "మాటలమబ్బులు, పుష్పలావికలు, మెరుపులు, సుభద్ర, ఋతు శతకము" వంటి ఖండ కావ్యాలు రాశారు. అవేవీ ఆయన్ను సంతృప్తి పరచలేదు. ఆయనలో నిద్రాణంగా ఉన్న ప్రతిభా బీజం 1892లో "కన్యాశుల్కం" నాటక రచనగా అంకురించింది. దీని మొదటి ప్రతి 1897లో, విస్తృత ప్రతి 1909లో అచ్చయినాయి.

అవి భారత జాతీయోద్యమం బలపడుతున్న రోజులు. ఆంధ్రప్రదేశంలో అప్పుడప్పుడే దానికి బీజావాపనం జరుగుతున్నది. అప్పటికి బిపిన్ చంద్రపాల్ రెండుమార్లు ఆంధ్రదేశమంతటా తిరిగి యువకుల్లో 'జాతీయ' భావాన్ని రేకెత్తించాడు. "వందేమాతరం" ఉద్యమం యువకుల్ని గంగ వెర్రులెత్తిస్తుంది. ఆ స్థితిలో కాలంతో సమంగా పరుగుతీయడానికి పూనుకున్న ధీరవిచారుడు గురజాడ. ఎల్లలు దాటిన దేశభక్తిని ప్రబోధించడానికి 1910లో "దేశభక్తి" అనే గేయం రాశాడు. ఆ గేయంలోని భావాలివి :

1. దేశాన్ని ప్రేమించు. ఆ దేశానికి మంచిని కలిగించే భావాన్ని పెంచుకో. కల్లిబొల్లి మాటలు చెప్పడం మాని నిక్కచ్చిగా మానవులకు మంచి చేసే పనిని తలపెట్టు.
2. శ్రమ విలువ తెలుసుకో. పనిపాటలు నేర్చుకో. దేశం సుభిక్షంగా ఉండాలంటే పాడిపంటలు పొంగి పొరలాలి. మానవుని కృషి వల్లనే అవి అభివృద్ధి అవుతాయి. పాడిపంటలు అధికం చేస్తే ప్రజలకు తిండి ఉంటుంది. ఆ తిండి ఉన్నప్పుడే మనిషి బలసంపన్నుడవుతాడు.
3. మనిషి బలసంపన్నతల మీదనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంది. మనుషులు సోమరిపోతులయితే దేశం బాగుపడదు. మనిషి ఉత్సాహం వల్లనే కళాభివృద్ధి, పరిశ్రమల అభివృద్ధీ జరుగుతుంది. దేశి సరుకులు నిండినప్పుడే స్వయం పోషకత్వమబ్బుతుంది.
4. దేశంలో తయారైన వస్తువుల్ని ఆ దేశంలో మాత్రమే వినియోగించుకుంటే చాలదు. ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలు పెంచుకొని డబ్బు గడించాలి. ఆర్థికంగా స్తోమత కల్గిన దేశం పరదేశాల్లో కీర్తి ప్రతిష్ఠల్ని అందుకుంటుంది.
5. మన తాతలు నేతులు తాగారని జబ్బలు చరచడం అవివేకం. వర్తమానంలో మన కర్తవ్యం నిర్వహించడం గొప్ప. అందుకే ముందు చూపు అలవరచుకోవాలి. ఒకసారి వెనకపడితే ఎప్పుడే వెనకే ఉంటాం.
6. నేను గొప్ప అంటే, నేను గొప్ప అని తన్నుకోవడం వృధా. స్పర్థవహించదగిన సమయాలు సందర్భాలు కొన్ని ఉన్నాయి. చదువులో స్పర్థ ఉండవచ్చు. వాణిజ్యంలో వైరముండవచ్చు. అవి అభివృద్ధికి దోహదకారులు. వ్యర్థమైన తగాదాలతో కాలం వెళ్ళబుచ్చరాదు. ఒకర్నొకరు చంపుకొనే వైరమనేది అసలే పనికిరాదు.
7. నాకు దేశంమీద ప్రేమ ఉన్నదని గొప్పలు చెప్పడం మానివేయాలి. దేశీయులకేదైనా ఒక మేలు చేసి చూపించు. అదే నీ దేశభక్తిని ప్రకటిస్తుంది.
8. అనైక్యత, అసూయ అనేవి పిశాచాలవంటివి. దేశం సత్తాను, బలాన్ని అవి పీల్చివేస్తాయి. అందుకే పక్కవాణ్ణి ప్రేమించడం నేర్చుకో. వాడికి ఏదైనా మేలు జరిగితే ఓర్చుకో. ఆవిధంగా వాడితో ఐకమత్యంగా ఉండడం నేర్చుకో.

BRAOU

9. పక్కవాడు బాగుపడుతున్నాడని ఏడ్చేవారికి ఎప్పుడూ సుఖం లేదు. పరులకు మేలు జరుగుతుంటే అది తన మేలుగా భావించే ఉత్తముడికి ఎప్పుడూ మేలు జరుగుతుంది. ఈర్ష్య, అసూయలు మానవునికి శత్రువులు. ఓర్పు, ప్రేమ స్నేహితులు. పరుల మేలుకు సంతోషిస్తే ఆనందం. తద్వారా ఆరోగ్యం.

10. సొంతలాభం కొంతైనా మానుకొని పొరుగువానికి తోడ్పడాలి. దేశం అంటే మట్టికాదు, మనుషులు.

11. దేశంలోని మనుషులంతా ఐకమత్యంగా మెలగాలి. చేయీ చేయీ కలిపి నడవాలి. ఏ జాతి అయినా, ఏ కులం అయినా, ఏ మతం అయినా అన్నదమ్ముల్లా మెలగగలగాలి.

12. మతం మారినంత మాత్రాన మనిషి వేరుగాడు. మతం కంటె మనసు గొప్పది. మనసు కలిపి మనుగడ సాగిస్తే లోకంలో పేరూ ప్రఖ్యాతీ నిలుస్తుంది.

13. దేశమనేది ఒక పెద్ద వృక్షంలాంటిది. అది ప్రేమ అనేపూలు పూయాలి. పరస్పర అవగాహనతో ప్రేమతో స్పందిస్తే, శ్రమిస్తే సంపదలు కలుగుతాయి. చెమట బిందువులు స్రవిస్తే పంటలు పండుతాయి.

14. కవిత్వ ధ్యేయం ప్రజల్లో దేశాభిమానాన్ని రగిలించడం. ప్రత్యక్షంగాకాక పరోక్షంగా కవి తన పలుకులలో దేశీయుల్లో జాతీయాభిమానాన్ని పెంపొందించాలి.

గురజాడకు ముందే వెలువడ్డ బంకించంద్రుని 'వందేమాతరం' గేయం జాతీయోద్యమ స్ఫూర్తిని కల్గిస్తూ వచ్చింది. అందులో కొండలు, నదులు, వృక్షాలు, నా మాతృదేవతలు అంటాడు బంకిం. గురజాడకది నచ్చలేదు. అందుకే ఆ గేయానికి సవరణగా 'దేశమంటే మట్టికాదోయ్' అన్నాడు. ఉదాత్తమైన వ్యక్తుల గుణగణాలు, జాతీయజీవితం వర్ణింపదగిన మన్నాడు. ప్రజల్లో చైతన్యం కల్గించేవి ఇవేనాన్నాడు.

ఈ గేయం అందిస్తున్న సాంఘిక సందేశమిది : భౌతిక సంపత్తి, కళావిలసనం, వ్యాపార వాణిజ్యాల ఇతోధిక అభివృద్ధి, ప్రగతి దృష్టి, సార్వత్రికమైన శాంతి, పరస్పర సహకారవైఖరి, జాతుల మైత్రి, మతాల సంయమన పూర్వకమైన ఒద్దిక, సమాజంలోని అడ్డుగోడలకూల్చివేత, దేశమంతా ఒకే ఆర్థిక విధానం అమలు, స్వదేశ పరిశ్రమల స్థాపన, పర దేశాలతో వర్తక వాణిజ్యాలు సాగిస్తూ దేశాల నడుమ వైరుధ్యాలను తొలగించడం. ఈ ఒక్కొక్క భావం ఒక్కొక్క చరణంలో విపులంగా గుదిగుచ్చబడింది.

### 1.4.3 విశేషాంశాలు

గురజాడ చేసిన కొత్తప్రయోగాల్లో "ముత్యాలసరం" ఒకటి. ఈ పేరు గురజాడ కల్పించుకున్నదే. ముత్యాల సరంలో నాలుగు పాదాలుంటాయి. సాధారణంగా మొదటి మూడు పాదాల్లో 3 + 4, 3 + 4 = 14 మాత్రలుంటాయి. నాలుగో పాదంలో 7 నుంచి 12 మాత్రల వరకూ ఉంటాయి. గురజాడ చేసుకున్న నియమమిది. ఒక జాతి ఫార్సీగజల్ నడకను ముత్యాలసరాల్లో తేవడానికి ప్రయత్నించాడని ఆయనే చెప్పారు. మిశ్ర గతిలో నడిచే "వృషభగతి రగడ"కు ఇది దగ్గరగా ఉంటుంది. రగడల్లో అంత్యప్రాస ఉంటుంది.

యతి ప్రాసల నియమం ఉంటుంది. యతి ప్రాసలకు నియమంగా కాక అలంకారప్రాయంగా వాడుకున్నారు అప్పారావుగారు.

ఉదాహరణకు :

| | | | |
|---|---|---|---|
| దేశ | మున్నపే | మించు | మన్నా |
| 3 | 4 | 3 | 4 |
| మంచి | అన్నది | పెంచు | మన్నా |
| 3 | 4 | 3 | 4 |
| వొట్టి | మాటలు | కట్టి | పెట్టోయ్ |
| 3 | 4 | 3 | 4 |
| గట్టి | మేల్తల | పెట్ట | వోయ్ |
| 3 | 4 | 3 | 2 |



BRAOU

ముత్యాల సరాలు అన్నీ ఒకే పద్ధతిలో రాయలేదు. పాఠకులకు విసుగు కలగకుండా ఉండడానికై గతిలో మార్పులు చేశాడు.

ఉదాహరణకు :

| | | | | |
|---|---|---|---|---|
| దే | శాభి | మానం | నాకు | కద్దని |
| 2 | 3 | 4 | 3 | 4 |
| వొట్టి | గొప్పలు | చెప్పు | కోకోయ్ | |
| 3 | 4 | 3 | 4 | |

ఈ ముత్యాల సరంలో పాదం ప్రారంభంలోనే రెండు అధిక మాత్రలు వేసి వైచిత్రని కలిగించాడు.

## అభ్యాసం – 1

ఆధునిక కవిత్వాన్ని నిర్వచించి, దాని స్వరూప స్వభావాలను విపులీకరించండి?

## అభ్యాసం – 2

'దేశభక్తి' గేయంలోని విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని వివరించండి?

BRAOU

## 1.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- లిఖిత సాంప్రదాయానికి చెందిన ఆధునిక కవిత్వఖండంలోనిది ఈ పాఠ్యం.
- ఆధునిక కవిత్వ మంటే నేటి సామాజిక స్పృహతో, సర్వమానవాభ్యుదయాన్ని ప్రతిపాదించే కవిత్వం.
- ఈ గేయ రచయిత గురజాడ అప్పారావు. ఆధునికాంధ్ర కవిత్వ యుగకర్తలలో మొదటివాడు.
- ఈ గేయం 'ముత్యాలసరాలు' అనే ఆధునిక కవిత్వ ప్రక్రియకు చెందింది.
- దేశభక్తి గేయం విశ్వమానవ సౌభాతృత్వాన్ని ప్రబోధిస్తున్నది. ఎల్లలు దాటిన, కులమతాలను లెక్కించని సర్వమానవ సంక్షేమాన్ని ప్రతిపాదిస్తున్నది.
- దేశీయులలో జాతీయత పట్ల అభిమానాన్నీ, దేశం మీది భక్తినీ, సత్కర్మాచరణ దీక్షనూ రేకెత్తిస్తున్నది.
- జాతీయ సమైక్యతను ప్రబోధిస్తున్నది ఈ 'దేశభక్తి' అనే గేయం.

## 1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

1. "గురజాడ - అభ్యుదయవైతాళికుడు" అనే అంశాన్ని మీ పాఠ్యం ద్వారా నిరూపించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. 'ముత్యాలసరం' ఛందస్సును వివరించండి?

## 1.7 ఆకళింపు ప్రశ్నలు

1. ముత్యాలసరం గణవిభజన చేసి చూడండి.
2. రవీంద్రుడు, బంకించంద్ గేయాలకూ 'దేశభక్తి' గేయానికి ఉన్న భేద సాదృశ్యాలను మీ కౌన్సిలర్ సహాయంతో పరిశీలించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. "హేతుబద్ధమైన ఆలోచనలతో వ్యక్తి ప్రగతినీ, సమాజపురోగతినీ, దేశాభ్యుదయాన్నీ ప్రతిపాదించే కవిత్వం" ఆధునిక కవిత్వం అని నిర్వచించవచ్చు. ఈ కవిత్వంలో భాషాడంబరానికీ, పాండిత్యానికీ, అలంకారవైచిత్రికీ అంతగా ప్రాధాన్యం ఉండదు. కథానుగతికంగా ప్రాచీనకవిత్వంలాగా ఒక ప్రణాళికా బద్ధమైన కావ్యత్వ దృష్టితో ఆధునిక కవిత్వం సాగదు కాబట్టి దీనిలో ఖండకావ్యరచన, విడివిడి కవితల రచన, రానురాను "మినీపోయమ్" ల ఆవిర్భావం ప్రాధాన్యం వహించాయి. ఒకవేళ కథా కావ్యంగానే ఆధునిక కవిత్వం ఉన్నా, రచనలో వాస్తవికతా దృష్టి, నేటి సమాజం యొక్క స్పృహ, మూఢాచారాల నిరసనం, హేతువాదం వంటి అభ్యుదయ భావాలు చోటు చేసుకున్నాయి. సామాన్య మానవుడు, అతని పరిస్థితులు చిత్రించడం, అతని అభ్యుదయం ద్వారా సామాజిక ప్రగతిని నిర్దేశించటం ఆధునిక కవిత్వ పద్ధతిలో కొట్టవచ్చినట్టు కన్పించే లక్షణాలు. ఈ విధమైన రచనా ప్రణాళిక ద్వారా ఆధునిక కవిత్వ శిల్పంలో భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవకవిత్వం, దిగంబర కవిత్వం వంటి శాఖలెన్నో ఆవిర్భవించాయి. క్రమక్రమంగా రచనా విధానం పద్యాన్నీ, గేయాన్నీ పక్కన పెట్టి సర్వజన సుబోధమైన వచన మార్గాన్నే అనుసరించింది. వచన పద్యం, వచనగేయం వంటి నూతన ప్రక్రియలు మరింత సులభతర రూపాన్ని సంతరించుకోగా నేటి 'మినీకవిత' అవతరించింది.

2. గురజాడ అప్పారావుగారిది ఎల్లలులేని విశాల దృక్పథం. ఆయనది ప్రాంతీయ, దేశీయ దురభిమానం లేని దృష్టి. ఆయన దేశభక్తిలో విశ్వమానవ ప్రేమ ఉంది. అందుకే గురజాడవారి "దేశభక్తి" గేయం విశ్వమానవ జాతీయ గీతంగా పరిగణింపబడింది.

   బంకించంద్రుని "వందేమాతరం", రవీంద్రుని "జనగణమన", ఇక్బాల్ "హిందుస్థాన్ హమారా" అనే గేయాలు గొప్ప జాతీయ గీతాలు. అయినా వాటిలో భారతదేశ సంకీర్తనయే ప్రధానం. దేశాన్నీ అందులోని నదీనదాల్నీ, కొండల్నీ కోటల్నీ విశేషంగా స్మరించడం కన్పిస్తుంది. కాని గురజాడ గేయంలో దేశమంటే మనుషులనే విషయాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. మనుషుల్ని ప్రేమించడమే నిజమైన దేశప్రేమ అంటారు గురజాడ.

   అప్పారావుగారి గేయం ఒక వైపు స్వదేశీయుల్లో జాతీయాభిమానాన్ని నూరిపోస్తూనే, మరొక వైపు సమస్త జాతుల్నీ పలకరిస్తుంది. ఈ గేయంలో ఎక్కడా, ఒక్క భారతదేశాన్నే కీర్తించడంలేదు. ఫలానాదేశమన్న నిర్ధారణే లేదు. పరజాతుల సరసన నిలబడడానికి కావలసిన ఆర్థిక స్తోమతను సముపార్జించుకునే మార్గాల్ని ఈ గీతంలో బోధించాడు. మనిషి మనిషికీ మధ్య ఉండే అంతరాల్ని తొలగించుకోమన్నాడు. సాన్నిహిత్యాన్ని పెంచుకోమన్నాడు. మానవుడి భౌతిక క్రమ వికాసానికి శ్రమశక్తి విలువ ఎంతటిదో గుర్తు చేస్తున్నాడు. ఈ విధంగా గురజాడ గేయానికున్న ప్రశస్తి ఏ జాతీయ గీతానికీలేదని చెప్పవచ్చు.

# భాగం 2 ఆంధ్రోద్యమం

## విషయక్రమం

2.0 ఉద్దేశం
2.1 ప్రవేశిక
2.2 సూచనలు
2.3 పాఠ్యం
  2.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  2.3.2 వ్యాఖ్యానం
  2.3.3 విశేషాంశాలు
అభ్యాసం
2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
2.6 ఆకలింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు

## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- భావకవిత్వ పద్ధతి
- రాష్ట్రభక్తిని ప్రేరేపించే రచనా విధానం.

## 2.1 ప్రవేశిక

భావ కవిత్వం ఆధునికాంధ్ర కవిత్వంలో ప్రభవించిన మొదటి శాఖ. అతివేల శృంగార వర్ణనలకూ, క్షీణప్రబంధ సాహిత్య వికారాలకూ వెలిసిపోయిన కళాజగత్తు ప్రసరించిన కొత్త చూపు 'భావ కవిత్వం'. దీనికి ప్రారంభకుడు రాయప్రోలు సుబ్బారావుగారు. ఆ దృక్పథంతో రాయప్రోలు రచించిన పద్యాలే ఈ భాగంలోని పాఠ్యం. ప్రకృతి ప్రీతి, స్వాభావస్మరణం, దేశభక్తి, భక్తి, స్మృతి వంటి అంశాలతో పరిపుష్టమైన భావకవిత్వంలో ఈ పద్యాలు 'రాష్ట్రభక్తి' శాఖ కిందికి వస్తాయి. ఈ అంశాల పరిజ్ఞానాన్ని ఈ భాగం చదవడం ద్వారా మీరు అవగతం చేసుకుంటారు.

## 2.2 సూచనలు

ఈ పాఠం చదివే ముందు విద్యార్థులు భావకవిత్వ లక్షణాలనూ, సంప్రదాయాలనూ, విభాగాలనూ విపులంగా అధ్యయనం చెయ్యాలి. దేశభక్తికి సంబంధించిన ఇతర కవితలను కూడా చదివి ఈ పాఠ్యంతో పోల్చి చూసుకునే పద్ధతిలో ఈ పాఠం అధ్యయనాన్ని కొనసాగించాలి.

## 2.3 పాఠ్యం

శ్రీలింపొందగ యావదాంధ్ర జనమాతృక్ష్మాతలీ సూత్నతే
జోలీనామృత మాని, తద్బలవదౌత్సుక్యంబునన్ తావకో
ద్వేల ప్రాక్తనకీర్తి గీతముల వర్ధిన్ పాడు నీ పుత్రపు
త్రీలోకమ్మునకేమి దెల్పెదవు సందే ంబు నాంధ్రవనీ!

ఆశల్ కౌతుక పూర్ణచంద్రికలు పూయఁ న్ ము నాచ్చాగ మా
కాశమ్మున్ విడిపోవ, నూతనకళోత్కర్షాప్తి ప్రై
జా శోభల్ దయివారు నీ శుభదినోత్సాహంబు స్వ
యాశీర్వాదము లిమ్ము పుత్రకుల కంబా! యాంధ్రదేవీమణీ!

BRAOU

తేటల్ దేరెడు కాంతిపూరముల నుద్దీపించు ముత్యాల ము
ప్పేటల్ వోలె త్వదీయ కంఠమున శోభింపుల్ నిగారించు, చే
నాటన్ జీవనశోషణల్ గనని కృష్ణా గౌతమీ భద్రలన్
గాటంపుం దమి త్రావు వారలిదె కాంక్షాక్షి రమాంధ్రావనీ

ఆ చాళుక్య నృపాల రత్నముల వియ్యమ్మంది, శ్రీ కాకతి
క్ష్మాచక్రేశుల లాలనల్ వడసి, కృష్ణప్రాజ్య సామ్రాజ్య పీ
ఠీ చంచజ్జయకన్యతో సరసగోష్ఠిన్ ప్రొద్దువోబుచ్చునీ
ప్రాచీనాభ్యుదయమ్ము నెన్నెదరు గర్వస్ఫూర్తి తల్లీ! సుతుల్.

ఉద్యన్మోహనమై, కుమారజన గర్వోద్రేకమై, ఈ త్రిలిం
గోద్యానాప్తమధూదయమ్మగు నవీనోత్సాహపున్ వేళ, నా
విద్యారణ్య యుగంధరాదుల యశోవీర్య ప్రభావమ్ము లీ
విద్యాస్నాతకు లాసచేసెదరు, దేవీ! సంప్రసాదింపవే

జాఱిన దేశ గర్వమును చక్కన దిద్ది, మహాంధ్రమండలీ
భారము శ్లాఘనీయముగ పాలనచేసి, సమాన రాష్ట్రముల్
కూరిమి నాసజేయ తెనుగుం బుడమిన్ గయిసేయరయ్య, దీ
క్షారతి నాంధ్రపుత్రులు, జగజ్జన ధర్మమె దృష్టి నిల్పుచున్

ఉల్లాసమ్మున మాతృసేవ పయిపై నుఱ్ఱూత లూగంగ నా
పల్లీ పక్కణ దిగ్దిగంతరతటీపర్యంత వేంగీ భువిన్
చల్లుండాంధ్ర మహోద్యమ ప్రథమ పూజా పుష్పముల్, ప్రేమపుం
ద్రాళ్ళంగట్టుడు యావదాంధ్ర జనసంతానమ్ము నాపై హితుల్

రణ రక్త బంధురారుణమైన ఖడ్గతి
క్కన కత్తి కడిగిన కదన భూమి
అమృతాక్షర వికాసమయిన యాసుకవి పో
తన లేఖిని ప్రశాంతి గనిన చోటు,
భాషాకుమారి కద్రపు పెండ్లియిల్లైన
కృష్ణరాజ్యము వెలింగిన తల్లమ్మ
నానావిదేశ నౌకానీక విపులాశ్ర
యంబైన రేవు రూపఱినతావు.

పాడయి, శిలావిశిష్టమై, ప్రాప్తకాల
మనుభవించుచు నుండియు నక్కటకట!
బ్రతికిచెడ్డ యాంధ్రుల పూర్వవైభవములె
చాటుచున్న వాలింపుడు శాంతమతుల

కలదంధ్రోద్యమ వల్లరీ కుసుమ రక్షాబంధ నైపథ్యతుం
దిలబాహాబహులాంజలుల్ భరతధాత్రీ ఛత్రసింహాసన
స్ఖలితచ్ఛాయల నుజ్జ్వలింపగల భాగ్యంబింక, ఆసాంగ మం
గళ కళ్యాణము పాడ పుత్రికలె వేడ్కన్ వత్తు రానాటికిన్

సంతోషింపగదమ్మ ఆంధ్ర జననీ సారస్వత స్నాన వి
శ్రాంతి ప్రీతుల, నీదు పుత్రకుల, దీక్షాబద్ధులం జూచి, ని
శ్చింతన్ సోదరులార, ఈ జనని పూజింపుడు బ్రహ్మర్పణో
దంతవ్యక్త మనోబలమ్మున తథాస్తంచున్ బుధుల్ పల్కగన్

BRAOU

### 2.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

1. శ్రీలింపొందగ = సంపదలు కలిగిన
యావదాంధ్ర = విశాలమైన ఆంధ్ర
జన = ప్రజలయొక్క
మాతృక్ష్మాతలీ = జన్మభూమి వల్ల
నూత్న తేజోలీనామృత = నూత్న ఉత్సాహమనే అమృతాన్ని
ఆని = తాగి
తద్బలదౌత్సుక్యంబునన్ = ఆ బలవత్తరమైన ఉత్సాహంతో
తావక = నీ యొక్క
ఉద్వేల = ఆవేశపూరితమైన
ప్రాక్తన = పురాతనమైన
కీర్తి గీతములు = వైభవ గీతాలు
అర్థిన్ = ఇష్టంతో

2. ఆంధ్రదేవీమణీ = ఆంధ్రభూమీ!
ఆశల్ = ఆశలు
కౌతుక పూర్ణచంద్రికలు పూయన్ = ఉత్సాహమనే నిండు వెన్నెలలు వికసిల్లగా
దుర్దినచ్ఛాదనముల్ = చెడురోజులనే ముసుగులు
విడిపోవ = విరిసిపోగా
నూతన కళోత్కర్షాప్తిమై (మాతృపూజా శోభల్) = నూతనమైన తేజస్సును, ఉత్సాహాన్ని పుంజుకొని
దయివారు = తేజరిల్లు
శుభ దినోత్సాహంబు = ఇది మంచిరోజు అనే ఉత్సాహం
ఈక్షించి = చూచి (నీ పుత్రులకు)
అంబా = తల్లీ
ఆశీర్వాదములిమ్ము = దీవనలివ్వు

3. తేటల్దేరెడు = స్వచ్ఛమైన
కాంతిపూరములు = కాంతిసమూహాలను
ఉద్దీపించు = ప్రసరింజేసే
ముప్పేటల్ = మూడు పేటలు (వరుసలు)
త్వదీయ = నీయొక్క
శోభింపుల్ = కాంతులు
నిగారించుచు = వెదజల్లుచు
ఏనాటన్ = ఏరోజుకూడా
జీవన శోషణల్ = నీటి కరువు
గానని = పొందని
గాటంపు = మిక్కుటమైన
తమిన్ = కోర్కెతో
కాంక్షా క్షీరము = కోర్కెలనే పాలను

4. నృపాల రత్నములు = రాజుల్లో రత్నాలవంటి శ్రేష్ఠులైన
క్ష్మాచక్రేశులు = రాజులు
చంచత్ = చలించే, చేతులుమారే

5. ఉదృన్మోహనమై = ఉదాత్తమైన సౌందర్యంతో కూడి
కుమారజన గర్వోద్రేకమై = ఆంధ్రపుత్రులయొక్క ఉద్రేకంతోకూడి



BRAOU

| | | |
|---|---|---|
| | త్రిలింగ + ఉద్యాన + ఆప్త | = తెలుగుదేశమనే ఉద్యానవనం పొందిన |
| | మధూదయమ్మగు | = వసంతమ్మగు |
| | నవీనోత్సాహపువేళ | = కొత్త ఉత్సాహాలు మొదలయ్యేవేళ |
| | యశోవీర్య ప్రభావమ్ములు | = కీర్తి, ప్రతాప ప్రభావాలు |
| | విద్యాస్నాతకులు | = విద్యార్థులు |
| | సంప్రసాదింపవే | = ప్రసాదించవలసింది. |
| 6. | జారినదేశగౌరవము | = క్షీణించిన దేశఖ్యాతి |
| | శ్లాఘనీయముగ | = ప్రసంశలు పొందేటట్లు |
| 7. | పల్లీ పక్కణా | = పల్లెలు, పట్టణాలు |
| | దిగ్దిగంతర తటీపర్యంత | = దిక్కుల చివరల వరకు వ్యాపించిన |
| 8. | రణరక్త బంధురారుణమైన | = యుద్ధంలో రక్తంతో తడిసి ఎర్రనైన |
| | అమృతాక్షర | = అమృతప్రాయమైన రాతలతో |
| | వికాసమయిన | = వ్యాపిపొందిన |
| | అబ్రపు | = ఆశ్చర్యకరమైన |
| | నౌకానీకము | = నౌకలసమూహం |
| | రూపరిన | = రూపునశించిన |
| | శిలావశిష్టమై | = శిలలు మాత్రమే మిగిలి. |
| 9. | ఆంధ్రోద్యమ | = ఆంధ్రోద్యమమనే |
| | వల్లరీ | = లేతకొమ్మ (పూగుత్తిలోని) |
| | కుసుమ | = పూలయొక్క |
| | రక్షాబంధ | = రక్షాబంధనం చేత |
| | నైపథ్య | = అలంకరించబడిన |
| | బాహాబాహుల | = అనేకమైన బా[illegible] |
| | అంజలుల్ | = చేమోడ్పులు [illegible]సిళ్ళు |
| | భరతధాత్రీ | = భారతభూమియొక్క |
| | ఛత్రసింహాసన | = సింహాసనం నుండి |
| | స్ఖలితచ్ఛాయల | = ప్రసరించే కాంతుల |
| | ఉజ్జ్వలింపగల | = ప్రకాశించగల |
| | భాగ్యంబు | = అదృష్టం |
| | ఆసాంగ | = అడుగుముందిడి |
| | మంగళ కల్యాణము | = శుభప్రదమైన గీతికలు |
| | సారస్వత స్నానవిశ్రాంతిప్రీతుల | = సారస్వతంలో స్నానంచేసి [అంటే రసతరంగాల్లో ఊగి విశ్రాంతి పొందిన] |
| | బ్రహ్మార్పణ | = చేసే పని బ్రహ్మార్పణమనే |
| | ఉదంత | = విషయాన్ని |
| | వ్యక్త | = స్పష్టం చేసే |
| | మనోబలంతో | = మానసికమైన ధార్డ్యంతో. |

### 2.3.2 వ్యాఖ్యానం

రాయప్రోలు సుబ్బారావుగారు (1892 - 1984) తెలుగులో నవ్యధోరణి కవిత్వానికి ప్రారంభకులు. "లలిత, తృణకంకణం" వీరి ప్రసిద్ధ కావ్యాలు. ఇవికాక "ఆంధ్రావళి, జడకుచ్చులు, అనుమతి, కష్టకమల" అనే ఇతర కావ్యాలు రచించారు. ఉమర్ ఖయ్యాము రుబాయత్తులను "మధుకలశము" అనే పేరుతో ఇంగ్లీషు నుంచి అనువదించారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా ఆంధ్రోద్యమం కూడా 1910 ప్రాంతంలో

ప్రారంభమయింది. ఆంధ్రాభిమానాన్ని ప్రకటిస్తూ రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన పాటలు, పద్యాలు, తెలుగువారిలో ఆత్మాభిమానాన్ని కలిగించటానికి తోడ్పడ్డాయి.

**1913**లో మద్రాసులో జరిగిన ఒక సభలో ఆంధ్రుల సమానత్వాన్నీ, ఏకత్వాన్నీ కోరుతూ రాయప్రోలు సుబ్బారావుగారు ఈ పద్యాలు చదివారు. పద్యాలలోని భావాలివి :

1. ఓ నా ఆంధ్రభూమీ! సర్వాంధ్ర ప్రజానీకం తాము పుట్టిన దేశం అందించే మాతృ తేజోమృతాన్ని సేవించి బలం పుంజుకొని ఆనందతరంగితమయింది. జన్మభూమి కీర్తిగానం చేస్తున్న నీ ప్రజానీకానికి ఏ సందేశమందిస్తావు?

2. ఆశలు మోసులెత్తుతున్నాయి. కారుమబ్బుల్లా కమ్మిన దుర్దినాలు కకావికలవుతున్నాయి. మాతృమైన ఆవేగంతో ఆంధ్రులు మాతృపూజకు ముందు కురుకుతున్నారు. ఈ శుభప్రదమైన ఉత్సాహానికి తగినట్లు, ఓ ఆంధ్రీ! నీ పుత్రుల్ని దీవించు తల్లీ.

3. ఓ ఆంధ్రభూమీ, కృష్ణా, గౌతమీ, తుంగభద్రా నదులు నీ మెడలో మూడు పేటల ముత్యాల హారంగా వెలుగొందుతున్నాయి. అవి నిత్యం నీటితో నిండి ఉంటాయి. ఆ నీటిని కాంక్షతీరా అమృతంలా సేవిస్తున్న ఈ ఆంధ్రుల్ని దీవించు.

4. తల్లీ! ఈ దేశాన్ని కొంతకాలం చాళుక్యులు పాలించారు. కొంతకాలం కాకతీయులు అవక్రపరాక్రమంతో ఏలికలైనారు. మరికొంతకాలం విజయనగరాధీశులు పాలించారు. అటువంటి మహారాజుల పాలనలో ఊపిరిపోసుకొన్న నీ ప్రాచీన అభ్యుదయాన్ని భావించి నీ పుత్రులు గర్వస్ఫూర్తి పొందాలి.

5. ఓ దేవీ! (ఆంధ్రమాతా), ఆంధ్రదేశమనే ఉద్యానవనం, సౌందర్యోపేతంగా గర్వస్ఫూర్తిగా వసంతోదయవిరాజమానంగా కన్పిస్తుంది. ఈ ఉత్సాహసమయంలో విద్యార్థులంతా కీర్తి ప్రతాపచంద్రికల్ని వెదజల్లిన విద్యారణ్య యుగంధరాదుల్ని స్మరిస్తున్నారు. వారిని దీవించండి.

6. ఆంధ్ర పుత్రులారా! క్షీణిస్తున్న దేశంయొక్క గొప్పదనాన్ని మరలా నిలపండి. ఆంధ్రదేశమంతా ఒకటే అనే విశ్వాసాన్ని దృఢంగా పెంపొందించుకోండి. తెలుగు నేల కొక ప్రత్యేక ప్రతిపత్తి లభించే సమాన రాష్ట్రాన్ని కోరండి. దీక్షాబద్ధులు కండి. సర్వ జనుల ధర్మాన్ని రక్షించండి. క్షేమాన్ని కోరండి.

7. ఆంధ్రులారా! మాతృదేశాభిమానంతో ఆంధ్రసౌహార్దమాన్ని దిక్కులకు వ్యాపించిన వేంగీ దేశంలో ప్రజ్వలింపజేయండి. ప్రేమపాశాలతో ఆంధ్రులందర్నీ బంధించండి.

8. ఖడ్గతిక్కన రణరంగంలో రక్తంలో తడిసిన తన ఎర్రని కత్తిని కడిగిన యుద్ధభూమి ఒకవైపు. అమృతమయమమైన కవితావాహినిని పారించిన పోతన ఘంటం విశ్రమించిన చోటు మరొకవైపు. తెలుగు భాషకు పెండ్లి యిల్లుగా భాసిల్లిన విజయనగరసామ్రాజ్యం కాలగర్భంలో కలిసినచోటు ఒకవైపు. దేశదేశాలలో వాణిజ్య వ్యాపారాలను సాగించి ప్రొడుబడ్డ తెలుగు రేవులు మరోవైపు. అన్నీ శిథిలమయినాయి. కాని ఆ శిథిలాలు నేర్పే పాఠాలు పూర్వాంధ్ర వైభవాల చరిత్ర. ఆ చరిత్రలను విని సావధానంగా ఆలోచించండి.

9. ఆంధ్రోద్యమమనే పూగుత్తిలోని పూవులను రక్షాబంధాలుగా ధరించిన బాహువులు భరతధాత్రి ఛత్రసింహాసన ప్రాంతంలో వెలుగుల్ని విరజిమ్మేకాలం వస్తుంది. ఓ ఆంధ్రమాతా! ఆ నాటికి నీ పుత్రికలు మంగళగీతాలు పాడుతూ నీ మ్రోలకు వస్తారు.

10. ఓ ఆంధ్ర జననీ! నీ పుత్రులు సారస్వతంలో మునిగి తేల్చినవారు. దీక్షాబద్ధులు. వారిని చూసి సంతోషించు. ఓ ఆంధ్ర సోదరులారా! మీరు చేపట్టిన కార్యాన్ని భగవదంకితం చేసి నిర్వహించండి. కర్మాచరణే మీది. ఫలప్రదాత ఉండనే ఉన్నాడు. మీ కార్యం సఫలమయ్యేందుకు పుణ్యాత్ముల దీవనలు ఎప్పుడూ ఉంటాయి.

BRAOU

### 2.3.3 విశేషాంశాలు

ప్రత్యేకమైన ఆంధ్రరాష్ట్ర స్థాపనకోసం ప్రజలు ఉవ్విళ్ళూరుతున్న కాలమది. పుట్టుకనిచ్చిన భూమి మీద అపారమైన గౌరవం వుంది. తమ భవిష్యత్తు మీద విశ్వాసంవుంచి ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకోవడంలో తప్పులేదు. పూర్వ వైభవాన్ని గుర్తుచేసి కర్తవ్యాన్ని ప్రబోధించడం కవుల బాధ్యత. ఇక్కడ రాయప్రోలు రెండు విషయాలు స్పష్టంగా చెబుతున్నాడు. ప్రస్తుతం యావదాంధ్రులు నూత్న తేజోవిలసితులై తమకు ప్రత్యే ప్రతిపత్తి కోరుతున్నారు అనేది ఒకటి. అందుకోరకు పూర్వవైభవాన్ని గుర్తు చేసుకొని అందరూ ఏకంగా శ్రమిస్తున్నారు అనేది రెండోది. అలా శ్రమించేవారికి చేయూత నివ్వడం అందరి బాధ్యత అని ప్రబోధిస్తున్నాడు.

అనైక్యంగా ఉన్న ఆంధ్రుల్ని ఏకంచేసే ప్రయత్నం సాగింది. ఏదో ఒక కొత్త ఉత్సాహం వారిని ఏకం చేస్తుందనే ఆశవుంది. ఇది నా దేశం, నా ప్రజలు, వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలనే తపన పొడసూపింది. ఈ సమయంలో కవి ఆంధ్ర జాతీయతను అలవరచుకోమని కర్తవ్యబోధ చేస్తున్నాడు.

దేశ సౌభాగ్యం నీటి సమృద్ధిమీద ఆధారపడి వుంది. ఆంధ్రదేశంలో కృష్ణా, గౌతమీ, తుంగభద్ర జీవ నదులు. అయితే వాటిని ఉపయోగించుకొని సస్యశ్యామలం చేసుకోవాలంటే నదులపై ఆనకట్టలు కట్టుకోవాలి. అలా చేసేందుకు ప్రత్యేకమైన రాష్ట్రం అవసరం. ఆర్థిక దుస్థితి తొలగిపోవాలంటే పంటలు సమృద్ధిగా పండాలి. నీరుంటే ఆంధ్రదేశంలో రైతులు కేదారాల్లో బంగారాలు పండిస్తారు.

ఇక్కడ పురావైభవ కీర్తనం జరుగుతుంది. చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు అందునా కృష్ణరాయలు ఈ ఆంధ్రదేశాన్ని పరిపాలించి దాని అభ్యుదయానికి పాటుపడ్డారు. వారిలోని శక్తియుక్తుల్ని గుర్తిస్తే వర్తమాన ఆంధ్ర ప్రజానీకానికి ఉత్సాహం కలుగుతుందని కవి ఆకాంక్షిస్తున్నాడు. పూర్వ చరిత్రను జ్ఞప్తికి తేవడం ద్వారా ఉత్సాహాన్ని రగిలించడం కవి ధ్యేయం. నా వాళ్ళు ఇంతటి వాళ్ళు అని భావించుకుంటే శరీరం గగుర్పొడుస్తుంది. కర్తవ్యం బోధపడుతుంది.

ఈ పద్యాలు రాయప్రోలు చదివింది మద్రాసులో జరిగిన విద్యార్థి సమావేశంలో అన్న విషయం జ్ఞప్తి పెట్టుకోవాలి. విద్యారణ్య యుగంధరులు చాకచక్యంగా రాజ్యప్రతిష్ఠాపనలు జరిపిన మహామంత్రులు. మహా విజ్ఞానవేత్తలు. బాహుబలం కంటె బుద్ధిబలం మిన్న అని చెప్పిన యశోమతులువారు. ముందటి పద్యంలో శౌర్యాదుల్ని జ్ఞప్తిచేశారు. ఈ పద్యంలో బుద్ధి ప్రజ్ఞాప్రాభవాల్ని జ్ఞప్తికి తెస్తున్నారు. త్రిలింగ దేశం ఉద్యానవనం అని అనడంలో సొగసుంది. వసంతసమయంలో ఉద్యానవనం చూడముచ్చటగా ఉంటుంది. ఉత్సాహపూరితమైనపుడు దేశం కూడా అలానే ఉంటుందని భావం.

BRAOU

అనైక్యతవల్ల నల్గురిలో నగుబాట్లవుతున్న ఆంధ్రజాతికి ఇదొక హెచ్చరిక. అన్ని ప్రాంతాలు ఏకం కావాలనడం కనిపిస్తుంది. అందుకే 'మహాంధ్ర మండలి' అనడం. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్న సమయం. అందుకే 'సమాన రాష్ట్రముల్ కూరిమి నాపజేయ' అనడం. మన రాష్ట్రాన్ని సాధించుకోవాలనుకోవడం తప్పుకాదు. అదే సమయంలో మన వాంఛ ఇతరులకు అపకారం చెయ్యరాదు. అందుకే 'జగజ్జన ధర్మము దృష్టి నిల్పుచున్' అన్నాడు.

మాతృదేశ సేవాతత్పరులకు ఉత్సాహం సహజం. ఆ ఉత్సాహం ఉధృతమైనపుడు పల్లెపల్లెల్లో తిరిగి ఆంధ్రోద్యమాన్ని వ్యాపింపచేసిన నాయకులున్నారు. 1911-13 ప్రాంతాల్లో ఉన్నవ లక్ష్మీనారాయణ వంటివారు ప్రత్యేక రాష్ట్రపటాన్ని తయారుచేసి ఊరూరూ తిరిగారు. ఉద్యమ వ్యాప్తికి ఊపిరిపోశారు. ఆంధ్రోద్యమ వ్యాప్తికి ప్రథమ బీజాలు పడుతున్న కాలాన్ని స్మరిస్తున్నాడు కవి. మనిషిమనిషికీ మధ్య బంధం వేసేది ప్రేమ. ఆ ప్రేమపాశంలో ఏకమై దేశానికి మేలు చేయాలన్న కాంక్ష కన్పిస్తుంది.

ఆంధ్రుల ప్రాచీన వైభవం కీర్తించబడింది. అరివీరభయంకరుడైన ఖడ్గతిక్కన, అమృతాక్షరాలతో ఆంధ్రుల్ని పునీతం చేసిన పోతన, కవితకు పెండ్లి పందిళ్ళు కప్పిన రాయలువారు ఆరాధ్యులు, ఆదర్శ ప్రాయులు. ఆంధ్రుల వ్యాపార పారీణత కొనియాడదగింది. జావా, బోర్నియో, సుమిత్రా మొదలైన

దేశాలలో వ్యాపారం సాగించిన ఘనులు ఆంధ్రులు. పూర్వవైభవాలన్నీ గంగలో కలిసి పరుల పంచల్లో ప్రాణాలుగ్గబట్టుకొని బ్రతుకు గడపవలసి వచ్చింది. ఆ దుస్థితి తొలగి సుస్థితి కలగాలని ఉద్బోధిస్తున్నాడు కవి.

కవి ఆశాసంగీతం ఆలపిస్తున్నాడు. భారతభూమిలో ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సమకూరుతుందని ఆశిస్తున్నాడు. ప్రతి ఆంధ్రుడూ ఉద్యమంలో చేరతాడని ధ్వని. కర్లెత్తిన ఎన్నో చేతులు కలుస్తాయని చెబుతున్నాడు. ఆనాడు అంతా శుభప్రదంగానే ముగుస్తుందని, మంగళగీతాలాపన జరుగుతుందని అంటున్నాడు.

సామ్రాజ్య వాదంతో అవతరించిన ఒక భావన దేశభక్తి. ఒక ప్రాంతంవారు మరో ప్రాంతాన్ని ఆక్రమించి అక్కడి ప్రజల సిరిసంపదలను దోచుకున్నపుడు, ఆ దోచుకోబడ్డ ప్రజలను చైతన్యవంతులను చెయ్యటానికి ఈ దేశభక్తి భావన పనికొచ్చింది. ప్రాచీన వైభవ స్మరణ, ప్రస్తుత దుస్థితికి వేదన ఆ దేశభక్తిలో ప్రధానాంశాలు. ఒక ప్రాంతాన్ని కొన్ని సాంస్కృతిక, చారిత్రకాంశాల ఆధారంతో రాజకీయంగా కూడా ఏకత, స్థైర్యం ఉన్న ప్రాంతంగా పరిగణిస్తే అది దేశమవుతుంది. ఆ దేశంపై అభిమానం ప్రబోధిస్తే అదే దేశభక్తి, దేశాభిమానం. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఈ దేశభక్తి ముఖ్యమైన పాత్రను నిర్వహించింది.

భారతఖండంలో చాలా జాతులున్నాయి. ఏక భాషా వ్యవహారం, కొన్ని అలవాట్లలో సమత్వం, ఒక నిర్దిష్ట ప్రాంతంలో నివాసం ఈ జాతుల లక్షణాలు. ఆంధ్రజాతి లేక తెలుగుజాతి ఇట్లాంటిది. స్వాతంత్రోద్యమంలో భాగంగా ఆంధ్రోద్యమం ఈ శతాబ్దపు రెండో దశాబ్దంలో ప్రారంభమయింది. తెలుగు మాట్లాడేవారు నివసించే ప్రాంతమంతా ఒక రాష్ట్రప్రభుత్వం కిందికి రావాలనేది దీని లక్ష్యం. పొరుగు జాతులు తమ సిరిసంపదలకు దోచుకుంటున్నాయన్న భావన దీనికి మూలం. ఇక్కడ కూడా ప్రాచీన వైభవ స్మృతి, ప్రస్తుత దుస్థితికి వేదన కలిపిస్తాయి. దేశభక్తి కన్నా రాష్ట్ర భక్తి సంకుచితమైనది.

దేశభక్తినీ రాష్ట్రభక్తినీ ప్రబోధించే సాహిత్యం తెలుగులో విస్తృతంగా ఉంది. భారత దేశాన్నీ, ఆంధ్ర ప్రదేశాన్నీ వేరు వేరుగా మాతృ భావన చేసి కీర్తించిన పద్యాలూ గేయాలూ కొల్లలుగా ఉన్నాయి. ప్రాచీన చరిత్రలోనుంచి వీరగాధలను తవ్వితీసి ఆధునికులలో ఉత్సాహాన్ని కలిగించటానికి ఈ సాహిత్యం ప్రయత్నించింది. జాతీయ, ప్రాంతీయ దురభిమానాన్ని కొంత ప్రోత్సహించిన ఘట్టాలున్నాయి.

> "లేదురా మన వంటి వీరులింకెందు"
> అని రాయప్రోలు సుబ్బారావుగారంటే
>
> "చెన్న పురము మందేరా
> చెంగల్పట్టు మందేరాబొ
> కాదని వాదుకు వస్తే
> తంజావూరు మనదేరా"
> అని త్రిపురనేని రామస్వామిగారన్నారు.

దేశాభిమానం, రాష్ట్రాభిమానం మితిమీరితే చారిత్రక వాస్తవ దృష్టి లోపిస్తుంది. వీటిని అసందర్భంగా సంకుచిత రాజకీయ ప్రయోజనాలకు వాడుకొనే ప్రమాదం లేకపోలేదు. అభిమానం దురభిమాన స్థాయికి చేరకూడదు. ప్రాచీన వైభవ స్మృతి చారిత్రక యదార్థ తత్త్వ గ్రహణకు అడ్డు రాగూడదు. రాష్ట్రాభిమానం, దేశాభిమానం వసుధైక భావనకు విరుద్ధం కాగూడదు.

తెలుగులో అతి విస్తృతంగా వచ్చిన రాష్ట్రాభిమాన సాహిత్యంలో విద్యార్థులకు పరిచయం అవసరం. రాయప్రోలు సుబ్బారావుగారి కృతులతోపాటు విశ్వనాథ సత్యనారాయణగారి ఆంధ్ర పౌరుషము, ఆంధ్ర ప్రశస్తి, కొడాలి సుబ్బారావుగారి హంపీ క్షేత్రము, త్రిపురనేని రామస్వామిగారి సూతాశ్రమ గీతాలు, తుమ్మల సీతారామమూర్తి రాష్ట్ర గానము ముఖ్యంగా చదవవలసిన కావ్యాలు. ఆ కవిత్వంపై అభిరుచి కలిగించటంకోసం ఈ కింద ఇచ్చిన పద్యాలు ముందుగా చదవండి :



BRAOU

గోదావరీ పావనోదారవాః పూర
మఖిల భారతము మాదన్ననాడు
తుంగభద్రాసముత్తుంగ రావములోడ
కవుల గానము శ్రుతి గలయు నాడు
పెన్నా నదీ సముత్పన్న కైరవదళ
శ్రేణిలో తెన్గు వాసించునాడు
కృష్ణా తరంగ నిర్ణిద్ర గానము తోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు
అక్షరజ్ఞాన మెరుగదో ఆంధ్ర జాతి
విమల కృష్ణా నదీ సైకతముల యందు
కోకిలపు పాట పిచ్చుక గూండ్లు
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు.

[విశ్వనాథ సత్యనారాయణ 'ఆంధ్ర పౌరుషము' నుంచి]

శిలలు ద్రవించి యేడ్చినవి; జీర్ణములైనవి తుంగభద్ర లో
పల; గుడిగోపురంబులు సభాస్థలులైనవి కొండ ముచ్చు గుం
పులకు; చరిత్రలో మునిగిపోయిన దాంధ్ర వసుంధరాధి పో
జ్జ్వల విజయ ప్రతాప రభసంబొక స్వప్న కథా విశేషమై.

[కొడాలి సుబ్బారావు 'హంపీ క్షేత్రము' నుంచి]

వీరగంధము తెచ్చినారము
వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదుము; మెడను వైతుము
పూలదండలు భక్తితో

తెలుగు బావుట కన్ను చెదరగ
కొండవీటను నెగిరినప్పుడు
తెలుగు వారల కత్తి దెబ్బలు
గండి కోటను కాచినప్పుడు

తెలుగు వారల వేడి నెత్తురు
తుంగభద్రను కలిసినప్పుడు
దూర మందుననున్న సహ్యజ
కత్తి నెత్తురు కడిగినప్పుడు

ఇట్టి సందియ మెన్నడేనియు
బుట్టలేదు రవంతయున్
ఇట్టి ప్రశ్నలనడుగు వారలు
లేకపోయిరి సుంతయున్

[త్రిపురనేని రామస్వామి చౌదరి 'సూతాశ్రమ గీతాలు' నుంచి]

కలము ఖడ్గము పట్టగల నేర్పు పడసిన
రెడ్డినాగమ్మ నీ బిడ్డ యటలె
జగమగంటిమి నాంధ్ర జగతి బాలించిన
గరిత రుద్రమ్మ నీ కన్నె యటలె
గండికోటను మల్కు దండుపై దూకిన
గోవిందమాంబ నీ కూతు రటలె
మానంబుకై నిజప్రాణంబు బలియిచు,
మల్లాంబ నీదు కొమార్తె యటలె

వీగివచ్చిన హృదయేశు వెక్కిరించి
పోరి కంపిన చాన నీ పుత్రి యటలె
ఎంత తేజస్వినివి తల్లి! యెరుక లేక
నీ మహత్యంబు తెలిసికోలేము గాని–

[తుమ్మల సీతారామమూర్తి చౌదరి 'రాష్ట్ర గానము' నుంచి]

**అభ్యాసం**

రాయప్రోలు 'రాష్ట్రభక్తి' ని నిరూపించండి?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో దేశభక్తినీ, రాష్ట్రభక్తినీ ప్రతిబింబించే భావకవిత్వ శాఖకు చెందినవి ఈ పద్యాలు.
- ఆధునికాంధ్ర కవిత్వ యుగకర్తల్లో రెండవ మహాకవిగా పేరెన్నికగన్న రాయప్రోలు సుబ్బారావుగారు ఈ పద్య రచయిత.
- కేవలం రాష్ట్రభక్తినేకాక, ఆంధ్రుల ఆత్మాభిమానాన్నీ, ఉన్నత సంస్కారాన్నీ, భాషాభిమానాన్నీ, జాత్యాభిమానాన్నీ కూడా ప్రతిపాదిస్తున్నాయి ఈ పద్యాలు.
- రాష్ట్రం పట్ల, స్వజాతి పట్ల అనురక్తిని కూడా ఈ పద్యాలు ప్రబోధిస్తున్నాయి.

BRAOU

## 2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

1. రాయప్రోలు ఆంధ్రోద్యమ కవిత్వాన్ని సమీక్షించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. రాయప్రోలు ఆంధ్రుల ప్రాచీన వైభవాన్ని ఏ విధంగా కీర్తించారు?

## 2.6 ఆకళింపు ప్రశ్నలు

1. దేశాభిమానం, రాష్ట్రాభిమానం అనే వాటి మధ్యగల భేదసామ్యాలను పరిశీలించండి.
2. దేశభక్తి కవిత్వంలో వివిధ కవుల మధ్యగల పోలికలు గుర్తించండి.

## అభ్యాసానికి జవాబు

భారతదేశంలో జాతీయతా భావాలకు బీజాలుపడుతున్న కాలంలో జన్మించాడు రాయప్రోలు సుబ్బారావు. రాయప్రోలు సహజ ప్రతిభాసంపన్నుడు. దానికి తోడు 1909 నుండే చిలకలూరి వీరభద్రరావు, అత్తిలి సూర్యనారాయణ వంటి మేధావుల సాంగత్యం లభించింది. 'ఆంధ్రకేసరి' పత్రికలో 'జాతీయోద్ధారకులు' అన్న వ్యాసం ప్రకటించాడు. తర్వాత కొమర్రాజు లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ మొదలైనవారి సాహచర్యం లభించింది. అన్నిటి కంటె ముఖ్యంగా 1914 నాటికి గురుదేవులు రవీంద్రుని సాన్నిధ్యం లభించడం అయిన అదృష్టం. 1917లో గురుదేవుల సన్నిధిలో ఉండగానే గోఖలే నిర్యాణం రాయప్రోలును కదిలించింది. గోఖలే స్మృత్యంకంగా దేశభక్తి ప్రపూరితాలైన పద్యాలు రాశాడు.

రాయప్రోలు 'దేశభక్తి' ఖండికలో ప్రత్యేకతలున్నాయి. ఆ ప్రత్యేకతలివి :

1. మాతృ భూమిని కీర్తించడం
2. దేశంలోని ప్రధానమైన ప్రాంతాల్ని స్తుతించడం
3. దేశంలోని నదీ నదాల్ని ప్రస్తుతించడం
4. మన ప్రాచీనుల గొప్పదనాన్ని తెలియజేయడం
5. మన ఏలికల శౌర్య, పరాక్రమాదుల్ని స్తుతించడం
6. జాతి, భాషా గౌరవాన్ని జ్ఞప్తికి తేవడం
7. ఆంధ్రుల ఐక్యతను ఉద్దేశించడం
8. ఆంధ్రుల వ్యాపార నౌకా, వ్యాపార దక్షతలను కొనియాడడం
9. నిరాశను పోగొట్టి ఆశాసంగీతాన్ని విన్పించడం

పైన చెప్పిన అంశాలన్నీ ప్రస్తుత పాఠ్యంలో చోటు చేసుకొన్నాయి. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్న ఆంధ్రుల్లో ఉత్సాహాన్ని రగిలించడం ధ్యేయంగా కన్పిస్తుంది. మాతృభూమి స్తవంతో ప్రారంభించి, కృష్ణా, గౌతమీ, తుంగభద్రల్ని పొగడాడు. తర్వాత మహా వీరపురుషులైన చాళుక్య, కాకతీయ విజయనగర రాజుల్ని జ్ఞప్తికి తెస్తాడు. ఇదంతా ప్రాచీన అభ్యుదయాన్ని చెప్పి, ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించడానికి చేసిందే. మహాకవులైన పోతనాదుల్ని, మంత్రిపుంగవులైన విద్యారణ్య యుగంధరాదుల్ని వేంగి మొదలైన ప్రాంతాల్ని ఖడ్గతిక్కన యుద్ధ నైపుణ్యాన్ని విదేశ వ్యాపారం సాగించడానికి అర్హమైన రేవుపట్టణాల్ని స్మృతి పథంలో నిలిపాడు.

BRAOU

దీక్షాబద్ధులైన దేశభక్తి ప్రపూరితులై ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకొనవలెనని ఆంధ్రుల్ని ఉద్బోధిస్తున్నాడు. యావదాంధ్ర ప్రాంతం ఏకమవుతుందన్న ముందు చూపు కన్పిస్తుంది. స్వరాష్ట్రం మీద భక్తినీ స్వజాతి మీద అనురక్తినీ కల్గించడంలో రాయప్రోలుకు మించిన వారు కన్పించరు.

– ఆచార్య మద్దూరి సుబ్బారెడ్డి

# భాగం 3 వసంతర్తువు

**విషయక్రమం**


3.0 ఉద్దేశం
3.1 ప్రవేశిక
3.2 సూచనలు
3.3 పాఠ్యం
  3.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  3.3.2 వ్యాఖ్యానం
  3.3.3 విశేషాంశాలు
అభ్యాసం – 1
అభ్యాసం – 2
3.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం
3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
3.6 ఆకళింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 3.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- ప్రకృతిప్రీతి అనేది భావకవిత్వంలోని ఒక శాఖ
- ఋతువర్ణన భావకవిత్వంలోని ఒక భాగం

BRAOU

## 3.1 ప్రవేశిక

ఆధునికాంధ్ర కవిత్వ యుగంలోని మహాకవుల్లో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఒకరు. ప్రాచీన కవిత్వ సంప్రదాయానికి శిఖరాయమానంగా ఇప్పటి కవుల్లో ఈయన ఎన్నిక ఐనారు. వీరి "ఋతు సంహారం" అనే కవిత్వ గ్రంథంలోని వసంత ఋతువుకు సంబంధించిన వర్ణనలు ఈ భాగంలో మీరు అధ్యయనం చేస్తారు.

## 3.2 సూచనలు

ఆధునిక కవిత్వ యుగంలోని కథా కావ్యాల్లో కొన్ని చోట్ల ఋతువర్ణనలున్నాయి. కావ్యగతంగా క్వాచిత్కంగాకాక ఋతువర్ణనే ప్రధానంగా వెలసిన కావ్యాలూ కొన్ని ఉన్నాయి. డా.సి. నారాయణ రెడ్డి "ఋతుచక్రం", గుంటూరు శేషేంద్రశర్మ "ఋతుఘోష" అలాంటి కావ్యాలు. ఈ పాఠానికి వచ్చే ముందు విద్యార్థులు ఋతువర్ణన కవిత్వంలోని సంప్రదాయాలు ఒంటబట్టించుకోవడానికి ఆ కావ్యాలు అధ్యయనం చెయ్యాలి. ఆ అవగాహనతో ప్రస్తుత పాఠ్యంలోని అంశాలను సమన్వయ పూర్వకంగా చదువుకోవాలి.

## 3.3 పాఠ్యం

సీ॥ కించిదుషః పూర్వకించిదతఃపర
ప్రాలేయబిందు సంపాద వశత
మధ్యాహ్న వేళా క్రమప్రాప్త తీక్ష్ణతా
కలితాతపోగ్ర సంక్రాంతి వశత
సాయం సమాగత స్వచ్ఛ చంద్రాతప
కుల్యా ప్రసారణాకూత వశత
మధుర నిశార్ధ భాగధునీ విధాప్రయా
హేలిమనోజ్ఞ సాహిత్య వశత

తే.గీ  శిశిర హేమంత శుచిశరత్సేవ్యమానుఁ
డై మహారాజ వైభవోద్దామ మూర్తి
కూడి ఋతురాట్ప్రభానలకూబరుండు
మాధవుఁడు వచ్చెసుమ సుకుమార మూర్తి

సీ  విరియఁగాచిన పండ్ల బరువుచే వంగి ర
సాలమ్ము వాలివెఁజూలాలువోలె
కోకిల జిగిగొంతు కోలెత్త ప్రలపించె
వనవీధి భార్యాప్రవాసి వోలె
పరులకై పువుఁబువుఁదిరిగి తేనియ బోట్టు
లుగఁగూర్చె భృంగమ్ము లోభివోలె
తొలచి కొబ్బరి మొవ్వ గోల నిక్కి యుడుత హో
లారుచినో మరఁగెఁ గలాలివోలె

ఆ.వె  బ్రదికి చెడినవాని చిదుగు గుండియవోలె
నేల యెండఁబగిలి నెఱియలు పడె
ఒకఁటఁజూపి మఱియు నొకటఁగొట్టు సురియ
కాఁడువోలె నుఱియగాలి వీచె

సీ  పానీయ మంచు జల్వలటంచు వినియోగ
పఱచుకొందురు జనుల్ వట్టి వేళ్ళు
తాపశాంతులని శీతలములంచుమ ద్రావ
సక్తులౌదురు జనుల్ చల్లనీళ్ళు
చలువలటంచు వాసనలంచుఁబైపూఁత
గ్రమ్ముకొందురు జనుల్ గంద వొళ్ళు
దాహమటంచు శైత్యమ్ము లటంచునా
నెదరు జనమ్మెడ నీరములను

తే.గీ  స్వేద బాధానివారణా పాదు[illegible]ంచు
జనములు ధరించుకొం[illegible]ర
లర్థమెఱుఁగని జన[illegible]నోద
కృతప్రయత్నమ్ము [illegible]రీరమయ్యె.

### 3.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| కించిత్ | = | కొంచెము |
| ఉషఃపూర్వ | = | తెల్లవారడానికి ముందు |
| అతఃపర | = | అంతకంటె తర్వాత |
| ప్రాలేయబిందు | = | మంచు బిందువును |
| సంపాదవశత | = | సంపాదించుకోవడం చేత |
| మధ్యాహ్నవేళా | = | మధ్యాహ్న సమయంలో |
| క్రప్రాప్త | = | వరుసగా వచ్చి |
| తీక్ష్ణతాకలిత | = | తీవ్రమై వ్యాపించిన |
| ఆతప | = | ఎండయొక్క |
| ఉగ్ర | = | తీవ్రతచేత |
| సంక్రాంతివశత | = | మార్పు |
| సాయంసమాగత | = | సాయంకాలసమయంలో బాగా వచ్చిన |
| చంద్రాతప | = | చంద్రుని కాంతి |
| కుల్యాప్రసరణ | = | గొప్పగా ప్రసరించడం |

ఆకూత వశత = వేడుకకు లోబడి
నిశార్ధ = అర్ధరాత్రి సమయంలో
భాగధునీ విధా = నదిప్రవహించే విధంగా
ప్రియహేలా = ప్రియమై, విలాసవంతంగా ఉన్న
మనోజ్ఞ = మనస్సునకు ఇంపుగొలిపే
సాహిత్యవశత = సాహిత్యంవలె
శిశిర హేమంత = శిశిర, హేమంత ఋతువులు
శుచి శరత్ సేవ్యమానుడై = శుభ్రమైన శరదృతువు చేత సేవింపబడిన వాడైన
మహారాజవైభవోద్దామమూర్తికూడి = మహారాజవైభవంతో ఉన్న వరుణునితో కూడి
ఋతురాట్సభానలకూబరుండు = ఋతురాజు సభలోని నలకూబరుడు
సుమ సుకుమారమూర్తి = పువ్వువంటి సుకుమార రూపుడు
రసాలము = మామిడి చెట్టు
జిగిగొంతు = పసగల కంఠం
ప్రలపించె = కూసెను
వనవీధి = ఉద్యానవనం లోపల
భార్యాప్రవాసివోలె = భార్యకు దూరమై, దూరప్రదేశంలో ఉన్న విరహిలాగా
భృంగము = తుమ్మెద
లోభి = పిసినారి
హాలారుచిన్ = సారాయి రుచిచేత
కలాలి = కల్లు, సారాయి అమ్మేవాడు
సుఱియకాడు = చిరుకత్తిని ఆయుధంగా చేసుకొనినవాడు
ఉఱియగాలి = విసరుగాలి

### 3.3.2 వ్యాఖ్యానం

BRAOU

ఈ శతాబ్దపు కవులలో విశ్వనాథ సత్యనారాయణగారు (1895-1976) బహుముఖ ప్రతిభావంతులు. కావ్యం, ఖండకావ్యం, పద్యం, గేయం, కథ, నవల నాటకం - ఇట్లా అన్ని ప్రక్రియలలోనూ తన విశిష్టముద్రను వేసిన సాహితీ స్రష్ట ఈయన. అమేయమైన భావనాశక్తి, అమితవేగవంతమైన ధారాశుద్ధీ, అద్వితీయమైన లోక పరిశీలనాశక్తి వీరి రచనలలో కనిపించే వెలుగులు.

వీరు శతాధిక గ్రంథకర్తలు. దాదాపు అన్ని గ్రంథాలూ ప్రశస్తి పొందినవే. భావ కవిత్వపు రోజుల్లో "గిరి కుమారుని ప్రేమగీతాలు" రచించారు. గోదావరి నదికి ఉపనది అయిన కిన్నెరసాని మీద "కిన్నెరసాని పాటలు" కూర్చారు. దేశభక్తి ప్రేరితులై "ఆంధ్రపౌరుషము, ఆంధ్రప్రశస్తి" అనే కావ్యాలు రచించారు. భార్య చనిపోయినపుడు "వరలక్ష్మిత్రిశతి" అనే మూడువందల పద్యాల ఆత్మ విషాద కావ్యం రచించారు. "ఏకవీర, మాబాబు, చెలియలి కట్ట" అనే నవలలు ప్రసిద్ధమైనవి. అంతరించిపోయే పాతవిలువలను వేయిపడగలు అనే పెద్ద నవలలో పొందుపరచారు. వీరి అత్యుత్తమ కావ్యంగా ఎన్నదగింది "రామాయణ కల్పవృక్షము". ఆరు కాండల గ్రంథమిది. ఈ కావ్యంలో ఎన్నో శిల్పరహస్యాలను నిక్షిప్తం చేసినట్లు విమర్శకులంటారు.

ఇంత సాహిత్య సృష్టి చేసిన కవి వివాదాలకు గురి కావటంలో అసహజం లేదు. ఈయన రచనలమీద వాద ప్రతివాదాలు అనేకం అచ్చయినాయి. ఇటీవలే వీరి వేయిపడగలకు స్వర్ణోత్సవం జరిగింది. ఆ సందర్భంగా ఆ నవలమీద కొన్ని గ్రంథాలే ప్రకటితమయినాయి. నిత్యచర్చలకు గురి అయ్యే ముఖ్య కవులలో ప్రముఖులు వీరు.

భారతీయ సంప్రదాయానికి ఆధునిక కాలాన విఘాతం ఏర్పడిందనీ, దాన్ని పునరుద్ధరించటం ఈనాటి విద్యావంతుల కర్తవ్యం అనీ వీరు గట్టిగా నమ్మారు. సంప్రదాయ ప్రియులకు వీరు ఇందువల్ల అత్యంత ప్రియులు. వీరి అభిప్రాయాలతో ఏకీభావం లేకపోయిన సాహితీప్రియులుకూడా వీరి రచనలను అత్యంతాసక్తితో చదువుతారు.

నవ్య కవిత్వ వికాస దశలో శ్రీ విశ్వనాథ "ఋతుసంహారం" రచించారు. పూర్వ కవిత్వ రీతులన్నిటినీ పుణికి పుచ్చుకున్నట్లున్న పద్యరచనలో అత్యద్భుతమైన లోక పరిశీలనా, ప్రకృతి సౌందర్య చిత్రణా, వినూత్న భావవ్యక్తీకరణా ఋతుసంహారంలో కన్పిస్తాయి. ఈ కావ్యమంతా సీస పద్యాలలోనే రచించి నన్నయ, శ్రీనాథ మహాకవుల సీస పద్యరచనా శిల్పాన్ని సొంపుగా ప్రదర్శించారు. లోతైన భావన, ఇంపైన శబ్ద విన్యాసమూ ఈ కావ్యానికి పెట్టని సొమ్ములుగా అమిరాయి. మెట్ట, మాగాణి పొలాలలో ఆయా ఋతువులలో కన్పించే ప్రకృతి దృశ్యాలను విశ్వనాథ ఈ కావ్యంలో రమణీయంగా చిత్రించారు.

భారతదేశంలో ప్రకృతిలో కన్పించే మార్పులను ఆరు ఋతువులుగా గుర్తిస్తారు. ఒక్కొక్క ఋతువులో కన్పించే ప్రకృతి సౌందర్యాన్ని కాళిదాస మహాకవి ఋతుసంహార కావ్యంలో రమణీయంగా వర్ణించాడు. రామాయణంలో వాల్మీకి, కథకు అనుగుణమైన ఋతువర్ణనలు చేసి, ప్రకృతికీ మానవ ప్రకృతికీ అవినాభావ సంబంధం కల్పించాడు.

తెలుగు కవిత్వంలో ఆదికవి నన్నయ్య మొదలుగా ఎందరో కవులు ఋతు వర్ణనలు చేశారు. వీటిలో నన్నెచోడుడు, శ్రీ కృష్ణదేవరాయలు చేసిన వర్ణనల్లోని లోక పరిశీలనలో, భావుకత్వంలో ఒక వైశిష్ట్యం గోచరిస్తుంది. ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో మెట్ట, మాగాణి పైర్లు పండించే ప్రదేశాలలో కన్పించే అందమైన ప్రకృతి దృశ్యాలను శ్రీ విశ్వనాథ "ఋతుసంహారం" లో మనోజ్ఞంగా తీర్చిదిద్దారు.

వసంతర్తు శోభను శ్రీ విశ్వనాథ వర్ణించిన తీరును పై మూడు పద్యాల్లో చూడవచ్చు.

శిశిరం గడిచిపోయాక లోకంలోకి వసంతర్తువు ప్రవేశించటాన్ని శ్రీ విశ్వనాథ మొదటి పద్యంలో వర్ణించారు.

వసంత ఋతువు ప్రవేశించే సమయంలో ప్రకృతిలో వచ్చే మార్పులు – ఉషోదయానికి పూర్వమే, తూర్పు ఎర్రబడ్డ తొలిజాములోనే గడ్డిపోచలపై మంచు బిందువులు ముత్యాలలాగ మురువు గొలుపుతాయి. మధ్యాహ్న సమయానికి క్రమంగా – వ్యాపించిన ఎండ తీక్షణమై తోస్తుంది. సాయంసమయంలో స్వచ్ఛమైన చంద్రకాంతి ప్రసరిస్తుంది. అర్ధరాత్రి సమయంలో హృద్యమైన సాహిత్యంలాగ ఆనంద వాహిని మనస్సుకు ఇంపు గొలుపుతుంది. శిశిర, హేమంత, శరదృతువుల సేవలందుకొని వసంతం ఠీవిగా ప్రవేశిస్తుంది. ఋతురాజు సభలో వరుణునితో కూడి మహారాజు వైభవాన్ని ప్రదర్శించే నలకూబరుని లాగా, పువ్వు వంటి సుకుమార రూపుడు, వసంతుడు ప్రవేశిస్తాడు. వసంత ఋతువుకు అధిపతిగా వసంతుని వర్ణించటం పూర్వకాలం నుంచీ వస్తున్న సంప్రదాయమే. అట్లాగే పురుషుల్లో సౌందర్యానికి నలకూబరుణ్ణి, స్త్రీలో సౌందర్యానికి రంభను ప్రతీకలుగా వాడటం కవి సంప్రదాయం.

ఈ పద్యంలోని వర్ణన ప్రౌఢమైనది. భావుకులు ఆలోచించుకుని, ఆనందాన్ని పొందవలసినది. మామిడి చెట్టు విరియగాచిన పండ్ల బరువుచేత వంగిపోయి గర్భవతిలాగ కన్పిస్తుంది. ప్రవాసంలో ఉన్న భార్యా వియోగిలాగా కోయిల గొంతెత్తి, ఆర్ద్రంగా మధురంగా కూస్తున్నది. పైసా పైసా కూడబెట్టే పిసినారిలాగా తుమ్మెద పూవు పూవుకూ తిరిగి తేనెను కూడబెట్టింది. కల్లు, సారాయి అమ్మేవాడు మద్యం రుచి మరిగినట్లు ఉడుత కొబ్బరి మొవ్వ తొలుస్తూ గుజ్జు రుచి మరిగింది. బ్రతికి చెడినవాడి గుండె చితికి పోయినట్లు ఎందుకు పగిలిననేల నెర్రెలు పడింది.

మూడవ పద్యంలో శ్రీ విశ్వనాథ పద్యనిర్మాణంలో చక్కని శిల్పనైపుణ్యం కనబరచారు. "పానీయ మంచు, చల్వలటంచు; తాపశాంతులని, శీతలము లంచును; చలువలటంచు, వాసనలంచు; దాహమటంచు, శైత్యములటంచు; అని రెండు విధాలైన తలపులతో ప్రజలు తమ తాపంలో అలమటించే శరీరాలకు హాయిని కూర్చుకునే ప్రయత్నం చేస్తారని వర్ణించారు.

వసంత ఋతువులో తగినంత చల్లనిగాలి సోకక శరీరానికి తాపం హెచ్చుగా ఉంటుంది. జనులు ఆ తాపం నుంచి తట్టుకోవటానికి శీతలోపచారాలు చేసుకుంటారు. 'వట్టివేళ్ళు' కలిపిన నీటిని పానీయంగా, చల్లని తాపోపశమనం కలిగించే జలంగా సేవిస్తారు. తాప శాంతి కోసం, చల్లదనం కోసం జనులు చల్లని నీళ్ళు తాగుతారు. గంధపుపొడిని చల్లదనం కోసం, సువాసన కోసం పై పూతగా పూసుకుంటారు. లేత బొంకాయ నీటిని దాహార్తిని బాపుకోవటానికి, చల్లదనానికి సేవిస్తారు. చెమట బాధను తొలగించుకోవటానికి ప్రజలు సన్నని

వస్త్రాలు ధరిస్తారు. తాపోపశమనానికి జనులు పడే పాట్లను విశ్వనాథ వారీ పద్యంలో స్వభావోక్తిరమ్యంగా తెలిపారు.

అనంత ముఖ్యమైన జీవన వైవిధ్యాన్ని విశ్వనాథ వారు ఋతుసంహారంలో ప్రదర్శించారు. కాళిదాసు ఋతుసంహారంలో వర్ణనలు ఎక్కువగా శృంగార రసాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి. ప్రాచీనాంధ్రకవుల ఋతు వర్ణనలను పరికిస్తేవారు వర్ణిస్తున్నది తమకు పరిచితమైన ఆంధ్ర ప్రకృతి అనిపించదు., ప్రాచీనాంధ్ర కావ్యాలు, ప్రబంధాలలోని ఋతువర్ణనలు భారత దేశంలో ఏ ప్రదేశానికి చెందినవైనా కావచ్చు. దీనికి కారణం ఆ కవులు సంస్కృత కావ్యాలలో వర్ణనలను అనుసరించటమే.

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ ఋతుసంహారంలో వర్ణనలు ఆంధ్రదేశపు ప్రకృతిని అద్దంపట్టి చూపిస్తాయి. మెట్టపొలాలు, మాగాణిపొలాలు, తోటలు అన్నీ సుందర ఆంధ్రప్రకృతిని వర్ణించేవే.

లోక పరిశీలనలో విశ్వనాథవారు మిక్కిలి నైపుణ్యం గలవారు. ప్రకృతిలోని సూక్ష్మదృశ్యాలు కూడ ఆయన వర్ణనలో రసవంతమై నిలుస్తాయి. "తొలిచి కొబ్బరిమొవ్వ అనిక్కి యుడత హాలారుచికో మరగెగెలాలి వోలె" అనే వర్ణన ఆయన నిశిత పరిశీలనకు చక్కని నిదర్శనం.

భోగుల జీవితమూ, దీనుల జీవితమూ రెండూ సరిసమానంగానే విశ్వనాథ పరికించారు. సంపన్నులు తాపోపశమనానికి చేసుకొనే శీతలోపచారాలు, భార్యాప్రవాసి విరహమూ, బ్రతికి చెడినవాని చిదుగు గుండియవెత ఆయనకు బాగా తెలుసు.

**3.3.3. విశేషాంశాలు**

1. లయ, ఛందస్సు : ఋతుసంహారంలో పద్యాలు సీసపద్యాలు. ఇవి గొంతెత్తి చదవటానికి, శ్రావ్యంగా ఆలపించటానికి కూడ అనువైనవి. మొదటి పద్యంలో పదాల కూర్పు తత్సమ, తద్భవాలలో జిగిబిగీ ఉన్న ఆభరణంలా మిరుమిట్లు గొలుపుతుంది.

BRAOU

రెండవ పద్యంలో ప్రకృతి దృశ్యాలకు కల్పించిన ఉపమానాలు ఇంపుగా తోస్తాయి. మూడవ పద్యంలో "పానీయమంచుఁజల్వలటంచు" అంటూ అంత్యప్రాసలతో కూర్చిన పద్య రచనా శిల్పం హృద్యంగాతోస్తుంది. మొత్తం మీద మూడు పద్యాలలోను మూడు విధాలైన పద్య శిల్పం గోచరిస్తుంది.

సీస పద్యానికి నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలోను వరుసగా ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలు ఉంటాయి. మొదటి గణం మొదటి అక్షరానికి మూడవ గణం మొదటి అక్షరానికి ఒక యతి; ఐదవగణం మొదటి అక్షరానికి ఏడవ గణం మొదటి అక్షరానికి మరొక యతి ఉంటాయి. నాలుగు పాదాలు ముగిసిన తర్వాత 'ఆటవెలది' గాని, 'తేటగీతి' గాని ఉంటాయి. ఈ పద్యానికి ప్రాసయతి చెల్లుతుంది. ప్రాసనియమం ఉండదు.

ఋతు సంహారంలో శ్రీ విశ్వనాథ ఛందోనియమాలను అనుసరించారు.

2. అలంకారాలు : వసంత ఋతు వర్ణనలో మొదటి పద్యంలో శ్రీ విశ్వనాథ 'అంత్యానుప్రాస' అనే శబ్దాలంకారాన్ని పాటించారు. నాలుగు పాదాలలోను 'వశత' అనేమాట సమానంగా వచ్చింది.

రెండవ పద్యంలో మొదటి నాలుగు పాదాలలో నాలుగు ఉపమాలంకారాలను తర్వాత చేర్చిన ఆటవెలదిలో రెండు ఉపమాలంకారాలు మొత్తం ఆరు ఉపమాలంకారాలను కూర్చారు. విరియగాచిన పండ్ల బరువుచే వంగిన రసాలాన్నిచూలాలితోను; గొంతెత్తి ప్రలాపించే కోకిలను భార్యా ప్రవాసితోను; పువ్వు పువ్వుకు తిరిగి తేనెను సేకరించే తుమ్మెదను పరులకై కూడబెట్టేలోభితోను; కొబ్బరి మొవ్వుతొలిచి గుజ్జు రుచిమరగిన ఉడుతను హాలా రుచి మరిగిన కలాలితోను, ఎండపడి పగిలి నెర్రెలు పడిన నేలను బతికి చెడినవాని చిదుగు గుండెతోను, ఒక పక్క వీస్తూ మరొక పక్క సుడులు తిరిగే విసురుగాలిని ఒకపక్క చూపి మరొక పక్క దెబ్బతీసె సురియకానితోను పోలిక చెప్పి శ్రీ విశ్వనాథ ఉపమాలంకార రచనలో తమ నేర్పుచూపారు.

3. పద చిత్రాలు : కొన్ని కొన్ని పదబంధాల ద్వారా దృశ్యాన్ని కళ్ళకు కట్టించటమో, మనస్సుకు పట్టేట్టు చేయటమో 'పదచిత్రాల' ప్రత్యేకత. ఒకనాటి వివిధసమయాలలోని వసంతర్తు శోభను మొదటి నేపథ్యంలో పదచిత్రాలు తెలుపుతాయి. అయితే ఇవి చాలా వరకు ఆలోచిస్తే గాని అర్థంకానివి.

రెండవ పద్యంలో ఉపమానాల ద్వారా వ్యక్తమయ్యే పదచిత్రాలు మరింత మనోజ్ఞకరమైనవి. కొబ్బరి మొవ్వు తొలిచి గుజ్జు మరగిన ఉడుత, యెండపడి నెఱియలు పడ్డనేల కళ్ళకు కట్టినట్లుండే పద చిత్రాలు.

వసంత ఋతు వర్ణనలో విశ్వనాథ వారి లోకపరిశీలనాశక్తి, ఉక్తివైచిత్రీ, భావనలో సున్నితత్వమూ, మిక్కిలి నైపుణ్యంతో కూడిన భావ వ్యక్తీకరణమూ, సుందరమైన ప్రకృతి దృశ్యాల వర్ణనా రమణీయంగా కన్పిస్తాయి.

## అభ్యాసం – 1

వసంతర్తువులోని కొన్ని పదచిత్రాలు వివరించండి?

## అభ్యాసం – 2

వసంత ఋతువర్ణనలో తెలియవచ్చే జీవిత దృక్పథాన్నీ, కవిత్వ దృక్పథాన్నీ అభివర్ణించండి?

BRAOU

## 3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలోని భావ కవిత్వ శాఖకు చెందిన ప్రకృతి ప్రీతి, అంటే ఋతు వర్ణనకు సంబంధించిన పద్యాలు ఇవి.
- ఆధునికాంధ్ర మహాకవుల్లో సంప్రదాయ కవిత్వ శాఖకు మూలస్తంభం వంటి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన కవితలు ఇవి.
- కేవలం ఋతువర్ణననే కాక, వాటి ద్వారా మానవ జీవన దృక్పథాన్ని కూడా ప్రతిబింబింపజేశారు కవి.
- ఆధునికమైన పోకడలూ, పలుకుబళ్ళూ, నుడికారాలు మాత్రమే కాక ప్రాచీన కవిత్వ సంప్రదాయధోరణులు కూడా ఈ పాఠ్యం ద్వారా అధ్యయనం చెయ్యవచ్చు.

## 3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. విశ్వనాథ సత్యనారాయణ కవిత్వదృక్పథాన్ని వివరించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

1. ఋతువర్ణనలో స్ఫురించే మానవ జీవన దృక్పథం ఏమిటి?

## 3.6 ఆకళింపు ప్రశ్నలు

1. కాళిదాసు రచించిన "ఋతుసంహారం" కావ్యాన్ని అర్థతాత్పర్యాలున్న ప్రతి సహాయంతో చదవండి. కాళిదాసు కావ్యానికీ, విశ్వనాథవారి ఋతుసంహారానికి పోలికలున్నాయేమో పరిశీలించండి.

2. ఈ కింది పద్యం "ఆముక్తమాల్యద" లోని వసంత ఋతువర్ణనలోనిది. ఈ పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ, విశేషాలను వివరించండి.

ఆవని నపుడు నవోదితుండైన యట్టి
మరునకుం గుసుమర్తువన్మంత్రసాని
బొడ్డుగోసిన కొడవలిదోలె విరహి
దారకంబయ్యె గింశుక కోరమ్ము — ఆ.మా. - 5-112

కుసుమర్తువు = వసంత ఋతువు
దారకంబయ్యె = ఛేదకం ఐంది, చీల్చేది ఐంది
కింశుక కోరకము = మోదుగ మొగ్గ

3. ఈ కింది పద్యం నాయని సుబ్బారావుగారి "జన్మభూమి" అనే కావ్యంలోని వర్షర్తు వర్ణన. దీన్ని మీ పాఠ్యభాగంలోని పద్యాలతో పోల్చి సామ్యవైషమ్యాలను కనిపెట్టండి.

సీ॥ అగ్గికి కొఱత రానట్టి కొయ్యల తడి
 [illegible] యన్నము పొందుదప్పె
నాలుక [illegible] నంజుకో నమరిన
 తీయ బెల్లపుటచ్చు నీరు కారె
కరకరల్పోవ దూదిగతి మెత్తనై చెడె
 చిరుతిండి కేర్పడ్డ బొరుగు లెల్ల
నప్పుడప్పుడు నోటి త్రుప్పు డుల్లగజేయు
 పండురేగడ త్రుప్పుబట్టిపోయె

తే.గీ॥ నా నిరంతర వర్షధారా నిశాత
శీతలత్వోపహతి కుప్పుసెనగలెన
లేక, తలబైటబెట్టంగరాక, తిండి
తిప్పలకు నగచాట్లయి తెరలె జనము — జన్మభూమి - ధరణీధర - 47.

BRAOU

## అభ్యాసాలకు జవాబులు

1. అపారమైన లోకానుభవంతో, అనుపదమైన జీవనదృక్పథ చిత్రణంతో రచించిన పద్యాలు 'వసంతర్తువు' పాఠ్యంలో ఉన్నాయి. ఉషస్సుకు కొంచెం ముందూ, ఆ తర్వాత కొంచెం వెనుకా ఉన్న మంచునీటి బిందువులను 'కించదుషః పూర్వ కించిదతః పరప్రాలేయ బిందువులు" అంటారు. విశ్వనాథ పద్యాన్ని ఎత్తుకోవడంలోనే దీనిలో సంస్కృతం మీద ఆయనకున్న అధికారమూ, మహాప్రయోగ శక్తి ద్యోతకమౌతున్నాయి. అలాగే సంక్రమించడాన్ని 'సంక్రాంతి' అనడంలో

ప్రౌఢప్రయోగరీతి స్ఫురిస్తున్నది. వసంతుని "ఋతురట్ప్రభానలకూబరుడు" అనడంలో చక్కని రూపకం ఉన్నది. కోకిల గొంతును 'జిగిగొంతు' అనడంలోనూ, 'కొబ్బరి మొవ్వ గాలి, బ్రతికి చెడిన వాని చిదుగు గుండియ, ఒకట జూపి మఱియు నొకట గొట్టు," వంటి తెలుగు పద బంధాల ప్రయోగాల్లోనూ, పదచిత్ర నైపుణ్యం, ఉభయ భాషా ప్రయోగం పట్ల కవికున్న శక్తి విస్పష్టమౌతున్నాయి.

2. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'ఋతుసంహారం' ఆధునిక కావ్యాలలో విశిష్టమైనదిగా ఎన్నదగినది. కాళిదాసు 'ఋతుసంహారము' కావ్యానికి ఇది ఆంధ్రీకరణం కాదు. ఇది స్వతంత్రకావ్యం. సుందరమైన ఆంధ్ర దేశప్రశస్తిని, ఆంధ్రుల చిత్తవృత్తిని రమణీయంగా ప్రదర్శించిన కావ్యమిది. వసంత ఋతువర్ణనలో విశ్వనాథ చూపిన కవిత్వ శిల్పంలో ఎంతో వైవిధ్యం కన్పిస్తుంది.

'రామాయణ కల్పవృక్షము' రచించి 'భారతీయజ్ఞానపీఠం' వారి సత్కారం అందుకొన్న మహాకవి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. కిన్నెరసాని పాటలు, ఆంధ్ర ప్రశస్తి, శృంగార వీధి, గిరికుమారుని ప్రేమగీతాలు మొదలైనవి వీరి ప్రసిద్ధమైన కృతులు. ఆంధ్రసాహిత్యంలో దరిదాపు అన్ని ప్రక్రియలలోను ప్రథమశ్రేణిలో గణించదగిన రచనలు వీరివి. పూర్వాంధ్ర కావ్యాలు పెక్కింటిలో ఋతువర్ణనలున్నప్పటికీ విశ్వనాథ వారి ఋతువర్ణనలు ప్రత్యేకంగా ప్రస్తుతించదగ్గవి. వీటిలో నిశితమైన ప్రకృతి పరిశీలనాశక్తి, భావుకవైచిత్రి కమనీయంగా ద్యోతకమైనాయి.

వసంత ఋతువర్ణనలో మొదటి పద్యంలో శైలి సంస్కృత పద భూయిష్ఠమై గంభీరంగా తోస్తుంది. ఒక రోజులో ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంసమయం, అర్ధరాత్రి వేళలలో వసంత ఋతువులో ప్రకృతిలో కన్పించే మార్పులను తెలిపారు.

రెండవ పద్యంలో లోకంలో కానవచ్చే ప్రకృతి దృశ్యాలను మనుష్యుల చిత్త వృత్తితో సామ్యం కల్పించారు. ఉపమాలంకారాన్ని మిక్కిలి నేర్పుతో ఉపయోగించారు. విరగకాచిన మామిడిచెట్టు కవి దృష్టికి చూలాలివలె తోచింది. జిగిగొంతుతో కూజితాలు చేసే కోకిల విరహంతో వేగిపోయే భార్యా ప్రవాసిలా కన్పించిది. పువ్వుపువ్వుకూ తిరిగి తేనెను సేకరించే తుమ్మెద పరులకోసం ధనం కూడ బెట్టే లోభివానిలాగ కవికి గోచరించింది. కొబ్బరి మొవ్వ గాలి రుచులారగించే ఉడుత మద్యం రుచి మరిగిన తాగుబోతుగా కన్పించింది. ఎండకు ఎండిబీటలు వారి నెర్రలు కొట్టిన నేల బ్రతికి చెడిన వాని చిదుగు గుండెగా అనిపించింది. విసురు గాలి చూస్తే ఒక చోటు చూపించి మరొక చోట దెబ్బతీసే సురియకాని చేష్టగా ఉన్నది. ఈ పద్యంలో కవి ప్రకృతి దృశ్యాలకూ లోకంలోని చూలాలు, భార్యా ప్రవాసి, లోభి, బ్రతికి చెడినవాడు మొదలైనవారి చేష్టలకూ పోలికతెచ్చి తనజీవిత దృక్పథాన్ని వెల్లడించాడు. చూలాలిని పంట తల్లిగా, కోకిలారావాన్ని ప్రవాసి ప్రలాపంగా, లోభివాడు తాననుభవించ కుండా ఇతరుల కోసం ధనం కూడబెట్టే నైజాన్ని, బ్రతికి చెడినవాని గుండెవెతను, ఒకచోటు చూపించి మరొక చోట దెబ్బతీసే తత్వాన్ని కవి ప్రతిభావంతంగా ప్రదర్శించారు.

ఉన్నవారికే అన్ని సుఖాలు. వసంత ఋతువులో కలిగే శరీరతాపాన్ని దాహార్తిని చల్లార్చుకోవటానికి సంపన్నులు వట్టివేళ్ళను, చల్లని నీళ్ళను, లేత కొబ్బరిపాలను, చల్లని మంచి గంధాన్ని, సన్నని వస్త్రాలను సమకూర్చుకొని యీ ఋతువును ఏ విధంగా ఆహ్లాదకరంగా మార్చుకొంటారో విశ్వనాథ వారు మూడవ పద్యంలో తెలిపారు.

ప్రకృతి పరిశీలన కేవల ప్రకృతి పరిశీలనకు గాక దానికి మానవ జీవితంతో సంబంధం కల్పించి వర్ణించటంలో విశ్వనాథ మిక్కిలి సమర్థులు. ఇది ప్రాచీనులలో గాని, నవ్యులలో గాని మిక్కిలి అరుదుగా కన్పించే సామర్థ్యం.

– డాక్టర్ కె. రామమోహన్ రాయ్

BRAOU

# భాగం 4 స్వేచ్ఛాగానము

## విషయక్రమం


4.0 ఉద్దేశం
4.1 ప్రవేశిక
4.2 సూచనలు
4.3 పాఠ్యం
  4.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  4.3.2 వ్యాఖ్యానం
  4.3.3 విశేషాంశాలు
అభ్యాసం – 1
అభ్యాసం – 2
4.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
4.6 ఆకళింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 4.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- స్వేచ్ఛా ప్రియత్వం
- స్వేచ్ఛా ప్రియత్వం భావకవిత్వంలో ఒకటి.

BRAOU

## 4.1 ప్రవేశిక

ఆధునికాంధ్ర కవిత్వయుగంలో మధురకవిగా, గేయ మహాకవిగా ప్రసిద్ధులు దేవులపల్లి కృష్ణశాస్త్రి. మధురమైన కవితారీతికీ, లలిత పదప్రయోగానికీ పెట్టిందిపేరు కృష్ణశాస్త్రి. కృష్ణశాస్త్రిగారి 'కృష్ణపక్షం' అనే కావ్యం లోనిది ఈ పాఠం దీన్ని చదవడం ద్వారా స్వేచ్ఛా ప్రియత్వం ఆధునిక కవిత్వానికి ఒక లక్షణమని మీరు గ్రహిస్తారు.

## 4.2 సూచనలు

కృష్ణశాస్త్రిగారి కృతులు "కృష్ణపక్షం, ప్రవాసము, ఊర్వశి, పల్లకి, మహతి" వంటి వాటిని ఈ పాఠ్యం కంటె ముందుగా వారు అధ్యయనం చెయ్యాలి. దానివల్ల కృష్ణశాస్త్రి కవిత్వంలోని భావుకత, పదప్రయోగ శిల్పం, రచనావైఖరి అవగతమౌతాయి. ఈ పాఠ్యాన్ని దానితో సమన్వయించుకొంటూ, నిశితమైన అవగాహనతో ఈ భాగాన్ని పరిశీలించాలి.

## 4.3 పాఠ్యం

తిమిరలత తారకా కుసుమముల దాల్ప
కర్కశ శిలయు నవజీవ కళలదేర
మోడుమోక చివురులెత్తి మురువుసూప
జగమునిండ స్వేచ్ఛాగాన ఝురులనింతు.

క్రౌర్య కౌటిల్య కర్కశ కఠిన దాస్య
శృంఖలములు తమంతనె చెదిరిపోవ
గగన తలము మార్మోగగ కంఠమెత్తి
జగమునిండ స్వేచ్ఛాగాన ఝురులనింతు.

చిత్తమానందమయ మరీచికలపోల
హృదయమానంద భంగమాలికలదేల
కనులనానంద జనితాశ్రుకణములూర
జగమునిండ స్వేచ్ఛాగాన ఝురులనింతు.

యుగయుగంబుల నీశ్వర యోధులగుచు
స్వేచ్ఛకై ప్రాణసమము లర్పించువారి
అమల జీవితఫలము ధన్యతను గాంచ
జగమునిండ స్వేచ్ఛాగాన ఝురులనింతు.

భయము గలిగించు కష్టాతపంబు మరచి
కరము కలగించు వంత చీకట్లు మరచి
విశ్వమే పరవశమయి వెంటబాడ
జగము నిండ స్వేచ్ఛాగాన ఝురులనింతు.
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

నాయిచ్ఛయేగాక నాకేటి వెరపు?
కలవిహంగము పక్షముల దేలియాడి
తారకామణులలో తారనై మెరసి
మాయమయ్యెదను నా మధుర గానమున !
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

మొయిలు దోనెలలోన పయనం బొనర్చి
మిన్నెల్ల విహరించి మెరుపునై మెరసి
పాడుచు చిన్కునై పడిపోదు నిలకు
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ
జతగూడి దోబూచి సరసాలనాడి
దిగిరాను దిగిరాను దివినుండి భువికి
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

శీకరంబుల తోడ చిరుమీలతోడ
నవమౌక్తికములతో నాట్యమ్ములాడి
జలధి గర్భమ్ము లోపల మున్గిపోదు
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

పరువెత్తి పరువెత్తి పవనుని తోడ
తరుశాఖ దూరి పత్రములను జేరి
ప్రణయ రహస్యాలు పల్కుచునుందు
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

అలరుపడంతి జక్కిలిగింత వెట్టి
విరిచేడె పులకింప సరసమ బాడి
మరియొక్క నన తోడ మంతనం బాడి
వేరొక్క సమకాంత వ్రీడబోగొట్టి
క్రొందేనె సోనల గ్రోలిసోలుటకు
పూవు పూవునకు పోవుచునుందు
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు?

పక్షినయ్యెద చిన్ని ఋక్షమయ్యెదను
మధుపమయ్యెద చందమామ నయ్యెదను
మేఘమయ్యెద వింతమెరుపు నయ్యెదను
అలరునయ్యెద చిగురాకు నయ్యెదను
పాటనయ్యెద కొండవాగు నయ్యెదను
పవనమయ్యెద వార్ధిభంగమయ్యెదను
ఏలకో ఎప్పుడో ఎటులనో గాని
మాయమయ్యెద నేను మారిపోయెదను
నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు
నా యిచ్ఛయేగాక నాకేటి వెరపు?

### 4.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| తిమిరలత | = | చీకటి అనే తీగలాగ |
| తారకా కుసుమముల దాల్ప | = | నక్షత్రాలనే పువ్వులను ధరించగా |
| కర్కశ శిల | = | కఠినమైన పాషాణము |
| నవజీవనకళల దేర | = | నూతనమైన జీవకళలను ప్రసరింపగా |
| మ్రోడుమోక | = | ఎండిపోయిన మొద్దు |
| చివురు లెత్తి | = | చిగుళ్ళు తొడిగి |
| మురుపు నూప | = | సౌందర్యాన్ని ప్రదర్శింపగా |

### 4.3.2 వ్యాఖ్యానం

శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి (1897 - 1980) భావ కవితోద్యమంలో శిఖరప్రాయుడైన కవి. భావ కవిత్వానికొక నూతనస్ఫూర్తినీ, ఆవేశాన్నీ కల్గించిన కవి. ఈయన ఉత్తమ భావుకుడు. శబ్దార్థాల రహస్యాన్ని బాగా అవగతం చేసుకున్న శిల్పి. మహోన్నత మానవతావాది.

"కృష్ణ పక్షము, ప్రవాసము, ఊర్వశి, పల్లకి, మహతి, కన్నీరు" మొదలైనవి వీరు రచించిన కావ్యాల్లో మిక్కిలి ప్రసిద్ధి పొందాయి. ఇవేకాక ఎన్నో గేయనాటికలు, వాక్చిత్రాలు, వ్యాసాలు, ప్రసంగ వ్యాసాలు రచించారు. రచనలో క్లుప్తత, గుప్తత వీరి సొత్తు. కవిత్వంలో శబ్ద సౌందర్యానికి, అర్థ గాంభీర్యానికి ప్రాముఖ్య మిచ్చారు. కాలంతోపాటు ఎదిగి కదలివచ్చిన కవి కావటంచేత భావకవులే గాక అభ్యుదయ భావుకులు కూడా వీరి కవిత్వాన్ని ఆదరించారు.

BRAOU

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా చంద్రం పాలెంలో జన్మించారు. కృష్ణశాస్త్రిగారి తండ్రి వేంకట కృష్ణశాస్త్రిగారూ, పెత్తండ్రి సుబ్బారాయ శాస్త్రిగారూ పీఠికా పురాస్థాన విద్వత్కవులు. తండ్రి, పెద తండ్రుల శిక్షణలో చిన్ననాటనే కవిత్వ రహస్యాలు తెలుసుకున్నారు. పిఠాపురంలోను, కాకినాడలోను చదివి బి.ఏ. పట్టభద్రులయ్యారు. బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడుగారికి శిష్యులై విశాల దృక్పథం ఏర్పరచుకున్నారు. "సారస్వత ప్రియత్వమేకాక లోకమంతటినీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకునే అనురాగ బంధం ఆయన శిష్యరికంవల్ల లభ్యమయింది. జీవితంలోని ప్రతి అల్పానుభవాన్ని ఒక ఉదాత్త దృష్టితో అనుభవించే శక్తి ఆయన వల్ల కలిగింది" అని వెంకటరత్నం నాయుడిగారి ప్రభావాన్ని కృతజ్ఞతతో తలచుకున్నారు కృష్ణశాస్త్రి.

కాకినాడ, పెద్దాపురం, మిషన్ హైస్కూళ్ళలోను, కాకినాడ కళాశాలలోను శ్రీ కృష్ణశాస్త్రి కొంత కాలం ఉపాధ్యాయులుగా పనిచేశారు. మరికొంత కాలం ఆకాశవాణిలో సారస్వత కార్యక్రమాల ప్రయోక్తగా ఉన్నారు. సినిమాలకు పాటలు రాసి తెలుగు సినిమా పాటలకు కావ్య గౌరవం కల్పించారు. ఆకాశవాణి కోసం రచించిన శ్రవ్య రూపకాలు, ప్రసంగ వ్యాసాలు చాలా ఉన్నాయి. "బహుకాల దర్శనం, పుష్పలావికలు" "అప్పుడు పుట్టి ఉంటే," "ధనుర్దాసు", "పల్లకి", "శర్మిష్ఠ" మొదలైన రచనలు ఆయన ఆకాశవాణి ఉద్యోగిగా ఉండగా రచించినవి. ఎనభై మూడేళ్ళ నిండైన జీవితంలో తుదిదాకా రసవద్రచనలు చేసి ఆంధ్ర సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

**భావకవిత్వం :** ప్రణయం, దేశభక్తి, ప్రకృతి, స్మృతి కవితలు భావకవిత్వంగా పేరొందాయి. కథకన్నా భావం ప్రధానమైన కవిత్వం భావకవిత్వం. ఇందులో భావం, అనుభూతి ప్రధానం. భావంలేని కవిత్వ ముంటుందా? భావకవిత్వం అనడం పునరుక్తి దోషమని కొందరు పండితులు ఆక్షేపించారు. కాని, అనుభూతి ప్రధానమైన ప్రణయం, భక్తి, ప్రకృతి, స్మృతి కవితలకు "భావకవిత్వ"మనే పేరును రసజ్ఞలోకం ఆమోదించింది. రాయప్రోలు, దేవులపల్లి, బసవరాజు, నండూరి, నాయని, వేదుల మొదలైన భావకవితా రంగంలో ప్రసిద్ధులు.

**స్వేచ్ఛాప్రియత్వం :** కృష్ణశాస్త్రిగారి కృష్ణ పక్షం సంపుటాన్ని మొదట 1925లో సాహితీ సమితి పక్షాన శ్రీ తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి ప్రచురించారు. ఆ సంపుటంలో "స్వేచ్ఛాగానము - ౧; స్వేచ్ఛాగానము - ౨" అని రెండు ఖండ కావ్యాలున్నాయి.

స్వేచ్ఛాప్రియుడైన కృష్ణశాస్త్రి "నవ్య కవులకు స్వేచ్ఛ ప్రాణము. వీరు ప్రాణమైనఁ గోల్పోవుదురు కాని శృంఖలముల ధరింపరు. వీరికిఁ బ్రాణము కన్న గానము తీపు-సంకెలలో సంగీతమా! కట్టుఁబాటులోఁ గవిత్వమా?" అని వేంకట పార్వతీశ్వర కవుల ఏకాంత సేవ పీఠికలో ప్రకటించారు. సంఘంలో ఎన్నో కట్టుబాట్ల నుండి ఆనాటి కవులు స్వేచ్ఛకై పరితపించారు. కులమతాల కట్టుబాట్ల నుండి, రాజకీయ నిరంకుశత్వం నుండి స్వేచ్ఛ; క[illegible] సాంఘికాచారాల నుండి స్వేచ్ఛ; కఠినమైన భాషా నియమాల నుండి స్వేచ్ఛ - ఈ విధంగా ఎన్నో విధాల స్వేచ్ఛకోసం అలమటించారు.

"నవ్య కవులకు స్వేచ్ఛ ప్రాణము" అని చాటిన కృష్ణశాస్త్రిగారు కృష్ణ పక్షంలో ఈ స్వేచ్ఛను ప్రదర్శించారు. భావనలో, భాషలో, చందోరీతులలో, చివరకు కావ్యాన్ని అచ్చువేయటంలో కూడ స్వంత పోకడలు పోయారు.

కృష్ణపక్షానికి 'సింహావలోకనము' రచించిన శివశంకరశాస్త్రి "ఆధునిక లోకములో సర్వతోముఖముగా విజృంభించుచున్న స్వాతంత్ర్య భావతరంగము లీ కవి హృదయమున అఘాతముచేసి, కవితలో బహువిధముల వ్యక్తమయినవి. స్వేచ్ఛాగానము అను కావ్య శీర్షికయే దీనికి నిదర్శనం" అన్నారు. "ఈ స్వేచ్ఛా ప్రియత్వము బహు విషయముల గానవచ్చుచున్నది. సంప్రదాయానుగతములైన ఛందస్సులనేగాక నూతన చ్ఛందములను గూడ గ్రహించి వానిలో భావములను బాగుగా పలికించి రసమొప్పించుట, పాదభాగములో ఖండిక ప్రారంభించుట పాదాంతము కాకుండనే కావ్యము ముగించుట; నూతన ప్రయోగములు చేయుటలో వెనుదీయకుండుట; కొన్ని ఖండికలకు నామముంచకుండుట ఇత్యాది విశేషములు సహృదయులకు నవ్యకళ లాపాదించు గుణములుగా గోచరించు" నని శివశంకరశాస్త్రి కృష్ణ పక్షములోని స్వేచ్ఛా ప్రియత్వాన్ని విశదీకరించారు. పాఠ్యంలోని భావాలివి:



BRAOU

మనస్సు ఆనందమయమైన గాలులలో సోలిపోగా, హృదయము ఆనందభరితమైన కెరటాలలో తేలిపోగా, కళ్ళలో ఆనంద బాష్పాలు ఊరగా, లోకంలో స్వేచ్ఛాగాన ప్రవాహాన్ని నింపుతాను.

యుగయుగాల్లో భగవంతుని సేవలో వీరులై స్వేచ్ఛకోసం ప్రాణాలు అనే పుష్పాలను అర్పణ చేసేవారి జీవితఫలం ధన్యత చెందగా లోకంలో స్వేచ్ఛాగాన ప్రవాహాన్ని నింపుతాను.

భయం కలిగించే కష్టమనే ఎండను మరచి, కష్టం కలిగించే, దుఃఖం కలిగించే చీకట్లు మరచి, లోకమే పారవశ్యంతో నాతో కలిసి పాడుకొనేటట్లు స్వేచ్ఛాగానాన్ని ఆలపిస్తాను.

స్వేచ్ఛాగానం చెయ్యటంలో కవి ఈ లోకాన్ని లెక్కచేయనంటున్నాడు. తన కోర్కెకు మించి తనకే భయమూ లేదంటున్నాడు. సంకుచితమైన పరిహద్దును దాటి వినువీధులలో విహరిస్తానంటున్నాడు. ఇంకా కలకూజితాలు చేసే పక్షుల రెక్కలలో తేలిఆడి, నక్షత్రాలలో తానూ ఒక నక్షత్రమై మెరసి, తన మధురమైన గానంలో మాయమౌతాను అనీ, మబ్బులదొన్ని ప్రయాణంచేసి, ఆకాశమంతా విహరించి, మెరుపుగా మారి మెరిసి, పాట పాడుతూ వానలలో చినుకుగా భూమి మీద పడిపోవాలనుకుంటున్నాను.

తెల్లని స్వచ్ఛమైన మబ్బును తెరచాటు చేసుకొన్న చందమామ చెలితో జతగూడి, దోబూచులాడి, సరసాలాడి ఎన్నటికీ ఆకాశంలోనే ఉండిపోతాను. భూమిమీదికా దిగిరానేరాను.

చల్లని గాలులతో, చిన్న చేపలతో, క్రొంగొత్తముత్యాలతో నాట్యాలు చేసి సముద్ర గర్భంలో మునిగిపోతాను.

గాలిలో కలిసి పురుగెత్తి, పరుగెత్తి, చెట్టుకొమ్మలలో దూరి, ఆకులలోచేరి ప్రణయ రహస్యాలు పలుకుతాను.

పూలబాలకు చక్కలిగింతపెట్టి, మరొక విరిబేడె పులకింపగా సరసనచేరి పాటపాడి, మరొక చిగురుతో మంతనాలు చేసి, వేరొక సమకాంత సిగ్గు తొలగించి, తేనెలారగించటానికి పూవు పూవు దగ్గరకుపోతాను.

పక్షినౌతాను, చిన్న నక్షత్రాన్నౌతాను, తుమ్మెదనౌతాను, చందమామనౌతాను, మేఘమౌతాను, వింత మెరుపునౌతాను, చిగురాకునౌతాను, పాటనౌతాను, కొండవాగునౌతాను, గాలినౌతాను, సముద్ర కెరటాన్నౌతాను, ఎప్పుడో ఏదోవిధంగా మారిపోయి మాయమౌతాను.

– లోకము నవ్వితే నాకేం? నా యిచ్ఛయేకానీ నాకేమి భయం.

కవి తన స్వేచ్ఛ ప్రవృత్తిని పరిపరి విధాల వెల్లడించటం ఈ స్వేచ్ఛాగానంలో కన్పిస్తుంది.

లోకమంతటినీ స్వేచ్ఛాగానమనే ప్రవాహంతో నింపివేస్తాననీ, క్రూరమైన, కుటిలమైన, కఠినమైన బానిసత్వపు సంకెళ్లు తమంతటతామే చెదిరిపోగా, ఆకసమంతా మారుమ్రోగేటట్లు కంఠమెత్తి స్వేచ్ఛాగానమనే ప్రవాహంతో లోకాన్ని నింపుతాననీ కవి పలుకుతున్నాడు.

**4.3.3 విశేషాంశాలు**

"తారకామణులలో తారనై మెరిసి; తెలిమబ్బు తెరచాటు చెలి చందమామ; తరుశాఖ దూరి స్తనములను జేరి, అలరు పడంతికి చక్కిలిగింతపెట్టి" మొదలైనవి చక్కని పదచిత్రాలు. వీటిని తలుచుకోగానే ఆ దృశ్యం హృదయంలో అందంగా రూపుదిద్దుకుంటుంది.

"తిమిరలత తారకా కుసుమములను దాల్చు" అనే ఊహ రమ్యమైంది. కర్కశశిల జీవకళలదేరటం, మ్రోడు చివురులెత్తటం, లోకంలో స్వేచ్ఛాగానం ప్రవహించటమూ సాధ్యమని భావించిన కవి ఊహ స్వతంత్రమైనది. ప్రాచీన కవిత్వంలో కన్పించనిది.

బానిసత్వాన్ని క్రూరమైన కఠినమైన కుటిలమైన సంకెళ్ళతో పోల్చటం కవి స్వేచ్ఛా ప్రియత్వానికి చక్కని నిదర్శనం. 'గగనతలము మ్రోగగ' అనేచోట కవిగళం నిర్భరమైన ఆక్రోశాన్ని వినిపిస్తుంది. మాతృదేశ స్వాతంత్ర్య పరిరక్షణకోసం ప్రాణాలర్పించిన వారిని ఈశ్వరయోధులని కొనియాడటం కవి స్వాతంత్ర్య



BRAOU

కాంక్షను గాఢంగా వెల్లడిస్తుంది. జాతిమతాల సరిహద్దులను దాటి, కవివాక్కు విశ్వమే పరవశమయి వెంట పాడగా స్వేచ్ఛాగానాన్ని ఆలపించటానికి పూనుకొంది.

లోకాన్ని ధిక్కరించి బంధనాలు తెంచుకొని స్వేచ్ఛగా విహరించాలనేది కవి లక్ష్యం. సంకుచిత వలయానకు అతీతంగా పక్షులరెక్కలలో తేలి ఆడి, నక్షత్రాలలో తానూ ఒక నక్షత్రమై, తన మధురగానంలో తాను లీనం కావాలనే కోర్కెను వెల్లడించాడు. తన వింత ఊహకు లోకులు నవ్వినా తనకేమి లక్ష్యం లేదంటాడు.

"పాడుచు చిమ్మనై పడిపోదునిలకు; జలధి గర్భమ్ములోపల మున్గిపోదు, ప్రణయ రహస్యాలు పల్కుచునుందు" అంటూ ప్రకృతిలో తాదాత్మ్యాన్ని ప్రకటించి వినువీధిలో నిలిచిపోయి "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అంటారు. ఈ ఖండకావ్యం మిక్కిలి సంచలనం రేకెత్తించింది. "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అనే భావాన్ని తర్వాత వచ్చిన అభ్యుదయకవులు ఆక్షేపించారు. "ఆహపు సుడిలో గిజ గిజలాడి సమాజ దుఃఖంచూడలేదు" అని కృష్ణశాస్త్రి స్వేచ్ఛాగానాన్ని కె.వి. రమణారెడ్డి దుయ్యబట్టారు.

జమీందారీయుగంలో వచ్చిన చిత్రబంధ కవిత్వాలను తెంచుకొని గురజాడ రాయప్రోలు మొదలైనవారు ప్రసాదించిన నవ్యకవిత్వరీతులలో 'స్వేచ్ఛాగానము' నిస్సందేహంగా ఒక మైలురాయి. భావనలో పదచిత్రాలలో కొత్తపోకడలు స్వేచ్ఛాగానంలో ఉన్నాయి.

ఆధునిక కవులు ఉపమ రూపకాలంకారాలకు ఎక్కువ ఆదరించారు. శబ్దాలంకారాలపై మోజు తగ్గించుకున్నారు.

"తిమిరమనెడు లత తారక అనెడు కుసుమములను దాల్చి" అన్నచోట రూపకాలంకారం ఉంది. ఉపమేయోపమేయాలకు అభేదాన్ని కల్పించటం రూపకం.

**అభ్యాసం – 1**

స్వేచ్ఛా ప్రియత్వం అంటే ఏమిటి?

**అభ్యాసం – 2**

స్వేచ్ఛా ప్రియత్వాన్ని మీ పాఠ్యానికి అన్వయించండి?

## 4.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలోని స్వేచ్ఛా ప్రియత్వం అనే భావకవిత్వశాఖకు చెందింది ఈ పాఠ్యం.
- ఆధునికాంధ్ర మహాకవుల్లో గేయకవిత్వశాఖకు చెందిన మధురకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన కవిత ఈ పాఠం.
- ఈ కవితల్లో శతకంలోని 'మకుటం'లాగా "నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు" అనే ఒక పాదం ప్రతి భాగం చివరా ఉన్నది. ఈ పాదం కవిలోని స్వేచ్ఛా ప్రవృత్తిని సూచిస్తున్నది. "జగమునిండ స్వేచ్ఛాగాన ఝురులనింతు" అనే ప్రతిజ్ఞను నిరూపిస్తున్నది.
- ఈ పాఠ్యం ద్వారా కృష్ణశాస్త్రి వెలువరించిన స్వతంత్రతా భావాలు సారస్వతంలో పేరుకొనిపోయిన మూఢ విశ్వాసాలనూ, ఆచారాలనూ, సాంప్రదాయాలనూ ఎదిరించడానికి తోడ్పడుతున్నాయి.

## 4.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

స్వేచ్ఛా ప్రియత్వాన్ని దృష్టిలో ఉంచుకొని మీ పాఠ్యం ద్వారా వ్యక్తమయ్యే భావ కవిత్వరీతులను వివరించండి?

II. కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

'స్వేచ్ఛాగానము'లో కృష్ణశాస్త్రి దర్శించిన ప్రకృతి దృశ్యాలను వివరించండి.

## 4.6 ఆకళింపు ప్రశ్నలు

BRAOU

1. నవ్యకవిత్వ రీతులను తెలుసుకోవటానికి గురజాడ అప్పారావు, బసవరాజు అప్పారావు నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావు, రాయప్రోలు సుబ్బారావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, అబ్బూరి రామకృష్ణారావు మొదలైన కవుల కావ్యాలను సంపాదించి చదవటం అవసరం. భావకవులలో కొందరి పద్యాలనూ, గేయాలనూ ముద్దుకృష్ణ 'వైతాళికులు' అనే సంపుటంలో సంకలించారు. అది చదవండి.
2. కృష్ణశాస్త్రిగారి మీద చాలా మంది వ్యాసాలు రాశారు. అవన్నీ దొరక్కపోవచ్చు. దొరికే వాటిలో ఎన్. నిర్మలాదేవిగారు రచించిన "దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహితీ సౌరభం" (1995), కడియాల రామమోహన్ రాయ్ రచించిన "కృష్ణశాస్త్రి కవితా వైభవం" అనే పుస్తకాలు ఉపయోగకరమైనవి. మొదటి పుస్తకం ఆయన జీవితాన్నీ, పుస్తకాల్నీ పరిచయం చేస్తుంది. రెండోది ఆయన కవితా శిల్పాన్ని వ్యాఖ్యానించి చూపుతుంది.
3. భావకవిత్వంపై వచ్చిన ఆక్షేపణలను సమగ్రంగా తెలుసుకోవటానికి అక్కిరాజు ఉమాకాంతవిద్యాశేఖరుల "నేటికాలపు కవిత్వము" అనే విమర్శ గ్రంథాన్నీ, అనంత పంతుల రామలింగస్వామి రచించిన "శుక్ల పక్షము" అనే అధిక్షేపకావ్యాన్నీ చదవండి.
4. 'స్వేచ్ఛాగానము'లో వ్యక్తమైన స్వేచ్ఛా ప్రవృత్తి కృష్ణశాస్త్రి ఇతర కృతుల్లో ఏ విధంగా ఉన్నదీ పరిశీలించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. ఆధునిక కవిత్వంలోని మొదటి దశలో పాటమరించిన భావకవిత్వ శాఖలో "స్వేచ్ఛాప్రియత్వం" ఒక ప్రధాన లక్షణం. ఇది కేవలం కవిత్వ సంప్రదాయాలకూ, భావ స్వాతంత్ర్యానికీ మాత్రమే పరిమితం కాదు. దాస్యపంకిలంలో కూరుకుపోయిన ఆనాటి జాతీయతా పద్మం వెదజల్లిన సువాసనలు కూడా

భావకవిత్వ శాఖలోని ఈ స్వేచ్ఛా ప్రియత్వాన్ని ప్రభావితం చేశాయి. స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతీయ వీరుల స్వేచ్ఛా భావాలు నాటి కవిత్వంలో ఈ విధంగా ప్రతిఫలించాయి. సంఘంలోని ఎన్నో కట్టుబాట్లనుండి వ్యక్తికోరిన స్వేచ్ఛ ఈ స్వేచ్ఛా ప్రియత్వం మొదటి బాగం. కులమతాలు, రాజకీయం, సాంఘికాచారాలు, సంప్రదాయాలు, కఠినమైన బాషా నియమాలు, ప్రాచీన కవిత్వ సంప్రదాయాలు, ఛందో నిబంధనలు వంటి అనేక నిర్బంధ విషయాలనుండి – స్వేచ్ఛనే ప్రాణంగా భావించిన నవ్యకవులు కోరిన విముక్తి సూత్రాలు స్వేచ్ఛా ప్రియత్వంలోని తక్కిన విభాగాలు. "నవ్య కవులు శృంఖలముల ధరింపరు" అని ప్రబోధించిన కృష్ణశాస్త్రి "స్వేచ్ఛాగానము" కవితల్లో ఆ స్వాతంత్ర్య భావాన్ని సమగ్రంగా పోషించారు.

2. శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి భావకవులలో మహోన్నత శిఖరం. గురజాడ రాయప్రోలు ప్రారంభించిన నవ్యకవిత్వానికి ఎనలేని గౌరవం కల్పించింది కృష్ణశాస్త్రి కవిత్వం. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అన్నట్లు కృష్ణశాస్త్రి కవిత్వపు కాంతి భావ కవిత్వ సౌధమంతా వ్యాపించింది. "కలికిపాటల కోయిల కులము" వారిది. కన్నీటి కెరటాల వెన్నెలలతో వికాసాన్ని కలిగించారు.

"నాకు కవిత్వం పుట్టలోని పాములాగ, తెల్లవారి తలుపులు తట్టి వచ్చిపడే అతిథిలాగా రేకులు విచ్చుతున్న పూవులాగ రకరకాలుగా వస్తుంది. గళద్వారపు గడియ తీస్తే వస్తుంది" అని తమ కవిత్వా విర్భావాన్ని గూర్చి కృష్ణశాస్త్రిగారే ఒక సందర్భంలో అన్నారు. స్వేచ్ఛాగానములో వారి కవితాసెలయేటి ప్రవాహం గులకరాళ్ళమీద ప్రవహించినట్లు శ్రావ్యంగా హృద్యంగా సాగింది.

శ్రీ కృష్ణశాస్త్రి హృదయవాది. ఆధునికయుగంలో బయలుదేరిన మానవోద్యమంలో ప్రముఖపాత్ర వహించినవారు. "నడిచేప్రతి మనిషి దైవం, ఎగిరే ప్రతి పురుగు దైవం" అని భావించినవారు. కులమతాల సరిహద్దుల్ని త్రోసిరాజని, జాతుల అడ్డుగోడల్ని కూల్చివేసి "విశ్వమంతా ప్రాణవిభుని మందిరమే, వీధి వాకిలి ఏది వెల్తైలా!" అని పలవరించారు. సర్వ స్వతంత్రుడైన కవి స్వేచ్ఛాభావన 'స్వేచ్ఛాగానము'లో వీనుల విందుగా, కమనీయంగా విన్పిస్తుంది.

చీకటిలతలు తారకాకుసుమములు ధరిస్తుంటే, కఠినశిలలు జీవకళలు ప్రసరిస్తుంటే, మోడు మోక చివురులెత్తి మురుపు చ[illegible]టే లోకమంతటిని స్వేచ్ఛాగాన ప్రవాహంతో నింపివేస్తానని కవి పల్కటం ఆయన స్వేచ్ఛా ప్రవృత్తిని చక్కగా వెల్లడిస్తుంది. క్రూరమూ, కఠినమూ, కుటిలమూ అయిన బానిస సంకెళ్ళు చెదిరిపోయేటట్లు గగనతలము మారుమ్రోగేటట్లు స్వేచ్ఛాగాన మొనరిస్తానని ఎలుగెత్తిచాటారు.

స్వేచ్ఛా ప్రవృత్తిని తలుచుకోగానే కవిహృదయం ఆనందంలో తేలిపోతుంది. కళ్ళల్లో ఆనంద భాష్పాలూరుతాయి.

యుగయుగాలనుండి మాతృదేశ విముక్తికోసం ప్రాణములర్పించిన వారిని కవి ఈశ్వర యోధులని స్తుతించాడు. స్వేచ్ఛలభించిన తర్వాత విశ్వమే పారవశ్యంతో తనవెంట పాటపాడుతూ కదిలి వస్తుందని ఊహించారు.

స్వేచ్ఛను కోరిన కృష్ణశాస్త్రి లోకానికి వెరవటంలేదు. "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు" అని లోకాన్ని ధిక్కరించి పలికారు. పక్షులరెక్కలలో తేలియాడి నక్షత్రాలలో తానొక తారనై మెరసి తన మధుర గానంలో మాయమౌతానంటారు. మబ్బుదొన్నెల్లో ప్రయాణంచేసి మెరుపులా మెరసి చినుకులాగమారి నేలపై పడిపోతానంటారు. చందమామతో దోబూచులాడి, వినువీధిలో నిలిపోయి దివినుండి భువికి దిగిరానంటారు.

చల్లగాలులతో, చిరుమీలతో, నవమౌక్తికాలతో నాట్యమాడి, జలధిగర్భం లోపల మునిగిపోతా నంటారు. పవనునితో పరుగెత్తి, తరుశాఖ పత్రాలలోదూరి, పత్రాలలో చేరి ప్రణయ రహస్యాలు పలుకుతాననీ, పూపడతితో సరసాలాడి, వేరొక సమకాంత సిగ్గులొలగించి, పూవుపూవుకూ సంచారం చేస్తానంటారు. ప్రకృతిలో లీనమైపోతానని ప్రకటించి కవి తన స్వేచ్ఛాస్వరూపాన్ని వెల్లడించారు.

BRAOU

ఆశయాలలో అనుభవాలలో కొత్తదనం కోసం తపించినకవి కృష్ణశాస్త్రి. కృష్ణశాస్త్రి కవితా తత్వాన్ని వివరిస్తూ ముద్దుకృష్ణ "పాటలతో ఈయనను దరిజేరగలవారు లేరు. బ్రాహ్మమతం కల్పించిన స్వేచ్ఛా పక్షబలాన్ని కూర్చినా, అంతకు ఎక్కువైన స్వేచ్ఛకై పక్షాలను కదిపాడు. వైష్ణవ గీతాలలోని హృదయ పక్వత, మెదడునకు పట్టించుకున్నాడు. కళాసంపత్తి ఎక్కువ. కవిత్వం కోసం బతుకుతాడు. రుచిగలవాడు"అన్నారు.

స్వేచ్ఛా కుమారుడైన కృష్ణశాస్త్రిని విశ్వవిఖ్యాత కవి షెల్లీతో పోల్చవచ్చు. కృష్ణశాస్త్రి ప్రసరించిన స్వేచ్ఛావాయువులు సారస్వతంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలను ఎదిరించటానికి తోడ్పడ్డాయి.

– డాక్టర్ కె. రామమోహన్‌రాయ్

BRAOU

# భాగం 5 మాతృగీతాలు

విషయక్రమం


5.0 ఉద్దేశం
5.1 ప్రవేశిక
5.2 సూచనలు
5.3 పాఠ్యం
 5.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
 5.3.2 వ్యాఖ్యానం
 5.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
5.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
5.6 ఆకలింపు ప్రశ్నలు
 అభ్యాసాలకు జవాబులు


## 5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- స్మృతి కవితా పద్ధతులు
- స్మృతి కవిత్వం భావకవితలో ఒక శాఖ

## 5.1 ప్రవేశిక

ఆప్తుల మరణంతో కలిగిన దుఃఖంతో వారి స్మృత్యంకంగా రాసిన కవిత్వానికి స్మృతి కవిత్వమని పేరు. మాతృస్మృతికి చిహ్నంగా శ్రీ నాయని సుబ్బారావు రచించిన స్మృతిగీతాలు ఈ భాగంలో మీరు అధ్యయనం చేస్తారు.

BRAOU

## 5.2 సూచనలు

తెలుగులో స్మృతికవితలు చాలా ఉన్నాయి. ఈ పాఠ్యం అధ్యయనానికి అనుబంధంగా; ముందుగా విద్యార్థులు వాటిని పరిశీలించాలి. వడ్డాది సుబ్బారాయకవి 'సతీస్మృతి', వసురాయకవి 'సుతస్మృతి', విశ్వనాథ సత్యనారాయణ 'వరలక్ష్మీత్రిశతి' చదవ వలసిన పుస్తకాల్లో కొన్ని. నాయని సుబ్బారావుగారే రచించిన 'విషాద మోహనము' కూడా వాటిలో ఒకటి. ఈ కావ్యాల పఠనాన్ని ప్రస్తుత పాఠ్యంతో అన్వయపూర్వకంగా విద్యార్థులు ఉపయోగించుకోవాలి.

## 5.3 పాఠ్యం

ఏను స్నానమ్మునకు బావికేగునపుడు
లేత సూర్యుని బంగరు పూతలందు
మురియుచును తల్లియొడ్డను ముద్దుగొనుచు
'అమ్మయేదిరా' యన్నవా యలలను నన్ను.

పైని వేంచేసి యూపిరి పట్టుకొనుచు
చిన్ని తాబేలు నన్ను వీక్షించి జలము
త్రవ్వుకొనుచేగె కూపగర్భమున దాగ
పైనలము కొన్న ముళ్ళు నాపాల విసరి
'నీకు లేదమ్మ' యన్నది నీటిపాము
పైకెగసి యొక్క కప్పను పట్టుకొనుచు
'నాకు లేదమ్మ' యన్నాను శోకవహ్ని
తప్తహృదయుండనై యింటిదారిపట్టి

### 5.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

కూపము = బావి
శోకవహ్ని = దుఃఖమనే అగ్ని
క్షతహృదయుడు = బాధపడిన మనస్సు గలవాడు

### 5.3.2 వ్యాఖ్యానం

ఆప్తుల మరణానికి వగచి, వారి స్మృతి సూచకంగా కవులు రచించిన శోక గీతాలను 'ఎలిజీ' అంటారు. కీట్సు కవి మరణానికి దుఃఖించి షెల్లీ రచించిన 'ఎడోనిస్' (Adonois) విశ్వసాహిత్యంలో పేరెన్నికగన్న ఎలిజీ. ఇంకా మిల్టన్ రచించిన లిసిడస్ (Lycidas), టెన్నిసన్ రాసిన ఇన్ మెమోరియమ్ (In Memorium) అనేవి కూడ ప్రసిద్ధి పొందిన ఎలిజీలు.

ఎలిజీ అంటే మిత్రస్మృతి రూపమైన కవిత్వమని మొట్టమొదట ఆంగ్ల సాహిత్యవేత్తలు పలికినప్పటికీ తర్వాత ఆప్తులెవరి గురించి శోక గీతాలు రచించినా వాటిని కూడ 'ఎలిజీ'లుగానే పరిగణించారు.

ఎలిజీకి సమానార్థకంగా తెలుగులో శోకగీతమనీ, శోక కావ్యమనీ, కారుణ్యమనీ, స్మృతి గీతమనీ, స్మృతి కావ్యమనీ పదాలు వాడుకలోకి వచ్చాయి. వీటిలో 'స్మృతి గీతం' అనేది ఎక్కువ ప్రచారంలో ఉంది. అయినప్పటికీ ఎలిజీ అనేపదానికి 'స్మృతిగీతం' సరియైన అనువాదమని చెప్పలేము. బ్రతికి ఉన్న వాళ్ళను గూర్చి రాసిన ప్రశంసా గీతాలు స్మృతిగీతాలలో ఎవరూ చేర్చరు. మరణించిన వారిని గురించి రాసిన స్మృతిగీతాలనే ఎలిజీలంటారు.

1910-30 సంవత్సరాల మధ్యకాలంలో తెలుగు కవిత్వంలో వచ్చిన నవ్యరీతులను భావ కవిత్వమని సాహిత్యవేత్తలు తలచారు. భావకవిత్వం ప్రధానంగా అనుభూతి ప్రధానమైంది. ఆత్మాశ్రయ రీతిలో ఉంటుంది. భావకవిత్వంలో ప్రకృతి, ప్రణయం, ప్రబోధం ప్రాధాన్యం వహించాయి. "కవియొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడినచో" అది భావకిత్వమని శ్రీ విశ్వనాథ సత్యనారాయణ నిర్వచించారు. ('లిరికల్ పొయెట్రీ' వ్యాసము 'భారతి'; అక్టోబరు 1939). కవి అంతర్నిగూఢ తాపం బాగా వ్యక్తమయ్యే కావ్యం 'ఎలిజీ'.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ప్రత్యేకంగా స్మృతి కావ్యాలు లేవుగాని కొన్ని చాటువులు, స్మృతి కావ్యాలవంటివి ఉన్నాయి. జీవితావసాన దశలో తన దుస్థితికి విచారిస్తూ శ్రీనాథుడు పలికిన "కాశికా విశ్వేశుగలసె వీరారెడ్డి" అనే పద్యమూ; శ్రీకృష్ణదేవరాయల మరణానంతరం అల్లసాని పెద్దన పలికిన "ఎదురైనచో తన మదకరీంద్రము డిగ్గి" అనే పద్యమూ స్మృతి గీతాలుగా తలచవచ్చును.

స్మృతి గీతమొక ప్రత్యేక కావ్యంగా అవతరించింది ఆధునిక యుగంలోనే. వడ్డాది సుబ్బరాయకవి "సతీస్మృతి" (1902) ఆధునిక యుగంలో వెలసిన తొలిస్మృతి కావ్యం. వసురాయకవి "సుతస్మృతి" (1908) అనే ఎలిజీ, కవి తన కుమారుని మరణానికి శోకించి కావ్యరూప మిచ్చినది. వసురాయ కవి భావన సంప్రదాయ రీతికి చెందినది.

### కవి జీవిత రచనా విశేషాలు

శ్రీ నాయని సుబ్బారావు (1899-1978) ప్రకాశం జిల్లా పొదిలి గ్రామంలో జన్మించారు. తల్లి ఉదయమ్మ, తండ్రి కృష్ణారావు. పొదిలి, ఒంగోలులో విద్యాభ్యాసం తర్వాత బందరు నోబుల్ కాలేజీలో ఇంటర్మీడియేట్‌లో చేరారు. 1921లో సహాయ నిరాకరణోద్యమంలో కొంతకాలం చదువు మానేశారు. తిరిగి నోబుల్‌కాలేజీలో చేరి 1925లో బి.ఏ. పట్టంపొందారు. 1924లో సుబ్బారావుగారి తల్లి ఉదయమ్మ మరణించింది. 1924-26 మధ్య కాలంలో 'మాతృగీతాలు' రచించారు. ప్రొబేషనరీ సబ్‌రిజిస్ట్రార్‌గా, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఎల్.డి.సి.గా కొంతకాలం పనిచేశారు. తర్వాత ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించి నరసరావుపేట, శ్రీకాకుళం, తిమ్మసముద్రంలో అధ్యాపకునిగా పనిచేశారు. 1955లో ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగవిరమణ చేశారు. 1959-64 సంవత్సరాల మధ్య ఆకాశవాణి హైదరాబాదుకేంద్రంలో 'స్క్రిప్ట్‌రైటర్'గా పని చేశారు.

"సౌభద్రుని ప్రణయయాత్ర, ఫలశ్రుతి, వేదనావాసుదేవము, భాగ్యనగరకోకిల, జన్మభూమి, విషాద మోహనము" వీరి ఇతర కృతులు.



BRAOU

... మాతృగీతాలు(1926), విషాదమోహనము (1969) అనేవి స్మృతి కావ్యాలు. ... మాతృగీతాలు (1926). నాయని యౌవనంలో రాసింది కాగా రెండవది పరిణతమైన జీవితానుభవంతో రాసింది. దేని ప్రత్యేకత దానిదే. ఒకటి ప్రారంభ

"మాతృగీతాలు" రచించిన నాయని సుబ్బారావుగారికి 24 ఏళ్ళ వయస్సున్నప్పుడు ఆయన తల్లి "ఉదయమ్మ" మరణించింది. తనను కంటికిరెప్పలా చూచుకొంటున్న తల్లి మరణం సుబ్బారావుగారికి దిగ్భ్రాంతి కలిగించింది. లోకం అంధకారబంధురంగా తోచింది. రోజులు గడిచేకొద్దీ దుఃఖభారం తగ్గకపోగా తల్లిలేని వెలితి ఆయనకు మిక్కిలి బాధాకరమైంది. ఆ వ్యథ మనస్సును తుక తుక ఉడికించగా వేదనాభరితమైన ఆయన గళం నుండి 'మాతృగీతాలు' వెలువడ్డాయి. తనను తల్లిలేని బిడ్డను చేసినందుకు సుబ్బారావుగారు

"ఎవ్వడానిర్దయ స్వాంతుడెవడు! నన్ను
కంటక నిగూఢ విపిన మార్గముల తల్లి
లేని బిడ్డను గావించి మానసంపు
టాసలన్నియు నడుగంట గోసివాడు"

అని విధిని నిందించారు.

బాల్యంలో తల్లి ఉదయమ్మ కవిని గారాబం చేసిన ముచ్చటలు మాతృగీతాలలో ఉన్నాయి. చిన్నప్పుడు తల్లితో కలిసి బావి దగ్గరకు స్నానం చెయ్యటానికి వెళ్ళేవాడు. తల్లి చనిపోయాక కవి మళ్ళీ అదే బావి దగ్గర స్నానం చెయ్యటానికి వెళ్ళాడు. బావిలోకి తొంగి చూస్తే లేత సూర్యుని బంగారు కాంతులలో నీరు తళతళలాడింది. చిరుగాలికి కదిలిన నీటి అలలు "తల్లి ఒడ్డును" ముద్దుగొంటున్నాయి. ఆ అలలు కవిని "అమ్మయేదిరా" అడిగాయి.

బావి నీళ్ళలో సూర్యకాంతి ప్రతిబింబించి బంగారు పూలపూసినట్లున్నదనటం రమ్యమైన వర్ణన. నీటి అలలు ఒడ్డుకు తగలటం సహజం. కాని ఒడ్డును 'తల్లి ఒడ్డు' అనటం నాయని ఆధునిక భావచేతనను వెల్లడిస్తున్నది. అలలు కవిని 'అమ్మయేదిరా' అని అడగటం కూడ భావప్రకటనలో నవ్యతను సూచిస్తున్నది.

తల్లిలేని బాలుడు మిగిలిన పిల్లలతో కలిసి ఆడుకోలేడు. బెరుకు బెరుకుగానే ఉంటాడు. ఏకాంతాన్ని తానై కోరుకుంటాడు. తల్లితో కలిసి వెళ్ళిన బావి దగ్గరకే, బావిలోకి తొంగి చూస్తే అక్కడా శూన్యమే ఎదురయింది. చిన్న తాబేలు ఒకటి నీటిపైకి వచ్చి ఊపిరి బిగబట్టి పైకి చూసింది. తర్వాత నీటిని తప్పుకుంటూ నీటి లోపలికి వెళ్ళి దాక్కున్నది. తాబేలు లోపలికి వెళ్ళిపోగా నీటిపైన అలముకొనిన సుడులు గుండ్రంగా సున్నాలాగ వ్యాపించి కవికి శూన్యాన్ని మిగిల్చాయి. ఈ పద్యంలో భావౌన్నత్యాన్ని విశ్వనాథ సత్యనారాయణ గారు "ఈ బావి [illegible] కొండక్రింద నున్నది. ఆ నూతిలోనున్న తాబేలు ఇతనిని చూచుచు నీటిలోనికి త్రవ్వుకొ[illegible]నది. నీటిపైన సుడులు సున్నలు చుట్టినవి. సున్న చుట్టుటయనగా నీకు తల్లిలేదని తాబేలు చెప్పినట్లు అర్థము. ఈ భావమును నేను 'వేయిపడగలు'లో వ్రాసితిని. ఇతని వద్ద నుండియే అప్పుతెచ్చితిని. పరీక్షాధికారులలో నాకరు 'వేయిపడగ'లలో నీ భావము వ్రాసినచోట రమ్యముగా నున్నదని ఇంగ్లీషులో షరా వ్రాసిరి. ఇదియంత రమ్యమైన భావము" అని ప్రస్తుతించారు.

బావిలోకి తొంగిచూస్తున్నప్పుడు కవికి ఒక నీటి పాము కనిపించింది. ఆ నీటి పాము పైకెగరి ఒక కప్పను పట్టుకొంటూ "నీకు లేదమ్మ" అని పలికినది. అమ్మలేని ప్రాణి దిక్కు లేనిదని కవి భావం. కప్ప నిస్సహాయంగా పాము నోట్లో చిక్కింది. శోకమనే అగ్నిలో కాలిన హృదయంతో కవి "నాకు అమ్మలేదు" అని పలికి యింటిదారి పట్టాడు. ఇంక ఈ లోకంలో నాకు ఏ దిక్కూ లేదు. ఒంటరిని, నిస్సహాయుడిని, తల్లిని పోగొట్టుకున్న నాకు ఈ లోకమే శూన్యం అని కవి తపించిపోయాడు.

నీటిపామును లోకపు విషమ పరిస్థితిగా, కప్పను తల్లిని పోగొట్టుకున్న తనకు ప్రతినిధిగా కవి ఊహించుకొన్నాడు. 'నాకు అమ్మ లేదు' అని బిగ్గరగా అనుకోవటం నాకింక ఏది కూడ లేదని విలపించడమే. అమ్మను మనిషికి సమస్తమైన ఆపదల నుండి రక్షించే అపూర్వ శక్తిగా కవి భావించాడు.

BRAOU

### నాయని కవిత్వ పద్ధతి

నాయని కవిత్వం జీవిత సంఘటనల నుండే వచ్చింది. "పద్యాలు జీవితాన్ని చీల్చుకొని వస్తవి. అందుచేతనే అంత బాధాకరంగా ఉంటవి. గుండెలకు తగిలేటట్లు చెబుతాడు. యత్నంలేకుండా పద్య నిర్మాణానికి పాటుబడినట్లు కనిపించడు. అదే ఈయన కళ. కవిత్వం ఈయనని వరించింది. వలపులో, విరహంలో, వేదనలో, మాతృప్రేమలో ఈయన కవిత్వానికి హృదయం గీటురాయి. ప్రియురాలి యెడబాటు పిచ్చివాణ్ణి చేసింది. తల్లి మరణం భోరుమనిపించింది. ఆనందంలో స్వర్గ వీధులలో విహారం చేయిస్తాడు, బాధలో హృదయాన్ని బద్దలు కొడతాడు; బ్రతుకులో కవిత్వం ఏరుకుంటాడు. ప్రతి పాదం జీవించే పలుకుతాడు. ఈయన గీతాలు ఉజ్జ్వలములూ, ఉన్నతములూ" అని ముద్దుకృష్ణగారు నాయని వారి కవిత్వతత్వాన్ని వ్యాఖ్యానించారు.

మాతృగీతాలలో కవి చెప్పదలచుకొన్న ప్రధానమైన భావం, తాను ఈ లోకంలో ఒంటరినని, దిక్కులేని వాడనని. చిన్ని అలలు, చిన్ని తాబేలు, నీటి పాము కూడ తనను, అమ్మ లేదని వెక్కిరించినట్లు తోచింది మనస్సుకు. మాతృప్రేమకు మించినది ఏదీ ఈ లోకంలో లేదు. మాతృవియోగానికి వగచి ఆమెను తలచి ఆమెతో జ్ఞాపకాలను పరిపరి విధాల తలపోశాడు.

భావావేశంతో హృదయాన్ని ఈడ్చుకుపోయే శైలి నాయని సుబ్బారావు గారిది. భావం నిశితమై గుండెల్లో గుచ్చుకొంటుంది. ఎంతటి క్లిష్ట సమాసమైన అన్వయ కాఠిన్యం లేక హాయిగా మనస్సుకి పట్టుతుంది. నాయని వారి పద్యాలు పింగళి సూరన్న, నాచన సోమన్నల మార్గంలో ఉంటాయని శ్రీ విశ్వనాథ భావించారు. నాయని వారి పద్యాలు తెలుగుదేశపు సంస్కృతిని ప్రతిబింబిస్తాయని కూడా విశ్వనాథ తలచారు.

### 5.3.3 విశేషాంశాలు

సుదీర్ఘమైన సమాసాలను చిన్న గీత పద్యాలలో ఇముడ్చటం నాయని ప్రత్యేకత. నవ్య కవులలో రాయప్రోలు, వేదుల సత్యనారాయణశాస్త్రి గారలు మక్కువపడి రచించిన తేట గీతులు నాయని వారి రచనలో కొత్త సొగసులు దిద్దుకొన్నాయి.

తిక్కన కంద పద్యాన్నీ, శ్రీనీథుడు సీస పద్యాన్నీ ఆదరించినట్లు నాయని తేటగితి పై మక్కువ చూపాడు.

"ఎవ్వడా విరసాత్మకుండెవడు, సాంధ్య
రాగమంజుల రేఖా విరాజమాన
మంగళాకాశసీమాంత రంగమందు
కారుచీకట్ల రాసులు గ్రక్కినాడు"

అనే పద్యంలో దీర్ఘసమాసం చిన్నగీతంలో ఇమిడిపోయి, అన్వయ క్లిష్టత లేకుండ, అనుభూతిని సహృదయులకు అందిస్తుంది.

మాతృగీతాలలో మూడు పద్యాలూ స్వభావోక్తిరమ్యమైనవి. వర్ణ్యవస్తువును ఇంద్రియ గోచరమయ్యే విధంగా స్వభావ రమ్యంగా వర్ణించటాన్ని ఆలంకారికులు స్వభావోక్తిగా ఎంచుతారు.

లేత సూర్యుని బంగారు పూతలలో మురిసిపోతూ బావిలో నీటి అలలు తల్లి ఒడ్డును ముద్దుగొనటమూ, కవిని "అమ్మ యేదిరా" అని అడగడమూ స్వభావరమ్యమైన దృశ్యం.

చిన్ని తాబేలు నీటిపైకి వచ్చి ఊపిరి బిగబట్టుకుంటూ చూచి, నీటిని త్రవ్వుకొంటూ లోపలికి వెళ్ళటమూ, నీటిపైన సుడులను నిలపటమూ మిక్కిలి సహజమైన దృశ్యం.

నీటిపాము పైకెగసి కప్పను పట్టుకోవటమూ, "నీకు లేదమ్మ" అని పలకటమూ కవి భావనలో వాస్తవ దృశ్యాలే.

'తల్లి ఒడ్డు'; తాబేలు జలము 'తవ్వుకొనుచు' కూపగర్భమున కేగటమూ చక్కని పద చిత్రాలు.

### అభ్యాసం – 1

స్మృతి కవిత్వం అంటే ఏమిటి?

### అభ్యాసం – 2

'మాతృగీతాలు' పాఠ్యం ద్వారా అవగతమయ్యే కవి మనోభావాలను వివరించండి?

## 5.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలోని 'స్మృతికవిత" అనే భావకవిత్వ శాఖకు సంబంధించిన పాఠ్యం "మాతృగీతాలు".
- ఆధునికాంధ్ర మహాకవిత్వంలో స్మృతి కవిత్వం రాసిన వారిలో ఒకరు ఈ పాఠ్య రచయిత శ్రీ నాయని సుబ్బారావు.
- ఆప్తుల మరణంతో కవి వెల్లడించే భావ సంపుటిని స్మృతి కవిత్వం అంటారు.
- ఈ పద్యాల ద్వారా కవి తమ తల్లిపట్ల తమకున్న ఆర్ద్రభావాలను వెల్లడించారు.
- స్మృతి కవిత్వాన్ని ఆంగ్లంలో Elegy అంటారు.
- ఈ పద్యాల్లో తేట తెలుగు పదాల ప్రయోగరీతి సుమధురంగా కనిపిస్తున్నది.

## 5.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

'మాతృగీతాలు' లో గోచరించే స్మృతి కవిత్వం లక్షణాలను చర్చించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

'మాతృగీతాలు' లోని శైలిని వివరించండి?



BRAOU

## 5.6 అకలింపు ప్రశ్నలు

1. నాయని సుబ్బారావుగారు రచించిన మరో విషాద స్మృతి కావ్యం "విషాద మోహనము". ఏకైక కుమారుడు (1933-1968) చనిపోగా రచించిన కావ్యమిది. అందులో నుంచి తీసిన ఈ ఖండిక చదవండి. ఇవి మధ్యాక్కరలు.

    మనికట్టు గడియారమొకటి మును కొంటి మనసిచ్చగించి
    కని దానిగొనె బావమఱది యిది నాకు కావలెనంచు
    మనికట్టునకు నలంకారమున నేను మరియొండు కొనగ
    పనివాడు కొని దాని కానరాకుండ పారెనెందేని.

    మని కట్టు గడియార మచ్చిరాదురా మనకంచుమరల
    కొనిపెట్టుకొన్ననెతి నంత సంపాదకుడవైన నీవు
    కొని పెట్టెదను పెట్టుకొందురాయంచు కోరియడ్గితివి
    పనియేమి నాయనా! దానితో నింక వలదంటి నేను.

    ఈనాడు ఈ గడియార మిట్లు ధరించి నా తండ్రి!
    ఆనాటి నీకోర్కి తీర్చగంటిరా యశ్రువుల్ తొరుగ
    దీనిని ధరియించలేను వలదంచు తీయను లేను
    దీని యగని కొట్టుకొనుట నీ గుండె తీరైె ధ్వనించి

   'మాతృగీతాలు' పద్యాలలో ఈ పద్యాలకున్న పోలికలనూ, భేదాలనూ గుర్తించండి.

2. తెలుగులోని ప్రసిద్ధమైన స్మృతి గీతాలను సంపాదించి చదవండి. ముఖ్యంగా విశ్వనాథ సత్యనారాయణగారి "వరలక్ష్మీ త్రిశతి", కృష్ణశాస్త్రిగారి "ఓ మానవోత్తమా!" బసవరాజు అప్పారావుగారి గీతాల్లోని "చలిపిడుగు, నిర్వాణ సుఖము" అనే ఖండికలు, శ్రీశ్రీ గారు తమ మహాప్రస్థాన గీతాల్ని కొంపెల్ల జనార్దనరావుకు అంకితమిస్తూ రచించిన గీతం తప్పకుండా చదవవలసినవి.

3. స్మృతి గీతాల గురించి వివరంగా తెలుసుకోవడానికి డా. సి. నారాయణరెడ్డి "ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు, ప్రయోగములు" అనే పుస్తకం చదవండి.

4. నాయని సుబ్బారావుగారి కవిత్వం మీద పొట్లపల్లి రామారావు, కోవెల సంపత్కుమారాచార్య, చేకూరి రామారావు భారతి, స్రవంతి, అరుణతార సంచికల్లో వ్యాసాలు రాశారు. అనుమాండ్ల భూమయ్య రచించిన నాయని సుబ్బారావు కృతులు పరిశీలన (1981) చదవండి.

BRAOU

### అభ్యాసాలకు జవాబులు

1. ఆప్తుల మరణంతో వ్యక్తులకు బాధ కలగడం సహజం. ఆ బాధను కళాకారుడు తన కళారూపాల్లో విన్యసించడం అత్యంత సహజం. ఈ విధంగా తనకు దగ్గరివారు చనిపోయినపుడు కవులు తమ వేదనను కవిత్వం ద్వారా వెలిబుచ్చినప్పుడు ఆ కవిత్వాన్ని స్మృతికవిత్వం అంటారు. దీనికి ఆంగ్లంలో Elegy అని పేరు. తెలుగులో వడ్డాది సుబ్బరాయ కవి, వసురాయ కవి, విశ్వనాథ కవి వంటి వారు స్మృతి కవితలు రాశారు. అలాంటి కవుల్లో ఒకరు నాయని సుబ్బారావుగారు. మాతృ వియోగ దుఃఖంతో ఆయన రచించిన పద్యాలే "మాతృగీతాలు" అనే పాఠ్యం.

2. శ్రీనాయని సుబ్బారావు కాల్పనికోద్యమ కాలంలో కలం పట్టిన కవి. భావ కవిత్వం ఉన్నత స్థితిలో ఉన్న 1910-30 సంవత్సరాల మధ్య కాలంలో సమకాలిక కవుల మాదిరిగానే శ్రీ సుబ్బారావు ప్రణయభావాలలో కవిత రచించాడు. ఊహా ప్రేయసిని గురించి ప్రణయ కావ్యం రచించటం గాక తన జీవితానుభవాన్నే ఆధారం చేసుకొని 'సౌభద్రుని ప్రణయ యాత్ర' రచించాడు.

   1924లో నాయని సుబ్బారావు గారి తల్లి ఉదయమ్మ మరణించింది. మాతృశోకం కవి హృదయాన్ని తీవ్రంగా గాయపరచింది. లోకమంతా కారు చీకటిగా తోచింది. కవి తనకు తాను 

దిక్కులేనివాడిగా, ఏకాకిగా భావించుకొన్నాడు. జీవితంలో ప్రతి సంఘటన తల్లిని జ్ఞాపకం
చేయసాగింది. తల్లితో కలిసి గడిపిన తన బాల్యజీవితం నెమరుకు రాసాగింది. ఫలితంగా రెండేళ్ళపాటు
ఆయన అనుభవించిన వేదన 'మాతృగీతాలు' కావ్యరూపం ధరించింది. ఆధునిక కవిత్వంలో 'ఎలజీ'
అని చెప్పదగిన ఒక కవితా పద్ధతిని నాయని మార్గదర్శకులయ్యారు.

"జననీ జన్మభూమిశ్చస్వర్గాదపి గరీయసి" అని పెద్దలంటారు. నాయనివారు జనని గురించి,
జన్మ భూమిని గురించి కావ్యాలు రాసిన ధన్యజీవి. 'అమ్మ' అనే మాటలో ఉన్న మాధుర్యమంతా
నాయని మాతృగీతాలలో లభిస్తుంది.

తల్లికీ తనకూ ఎడబాటు కల్పించిన విధిని నాయనివారు నిర్దయుడని, కఠినాత్ముడని
తూలనాడారు. తల్లితో తాను గడిపిన మధుర క్షణాలను తలచుకొని, తల్లిలేని ప్రస్తుతస్థితికి తీవ్రంగా
విలపించారు.

కవి బాల్యంలో తల్లితో కలిసి బావి దగ్గరకు స్నానానికి వెళ్ళేవాడు. తల్లిచనిపోయాక మళ్ళీ అదే
బావి దగ్గరకు ఒంటరిగా వెళ్ళాడు. ఏదో శూన్యం మనస్సును బాధించసాగింది. బావిలోకి తొంగి చూడగా
లేత సూర్యుని బంగారు కాంతులు నింపుకొని బావిలో నీళ్ళు తళతళలాడేయి. చిరుగాలికి నీటి అలు
కదిలి "తల్లి ఒడ్డు"ను ముద్దుపెట్టుకుంటున్నాయి. ఆ నీటి అలలు కవిని చూచి "అమ్మయేదిరా" అని
అడిగినట్లు కవికి తోచింది.

నీటి అలలు హాయిగా ఒడ్డుకు తగలటం సామాన్యదృశ్యమే. కాని ఆ ఒడ్డును 'తల్లి ఒడ్డు'
అనటం నాయని ప్రతిభకు నిదర్శనం. కవి దిక్కుతోచక మళ్ళీ బావిలోకి తొంగిచూస్తే ఒక చిన్న
తాబేలు నీటిపైకి వచ్చి ఊపిరిబిగబట్టి తననే చూస్తున్నట్లనిపించింది. తర్వాత ఆ తాబేలు నీటిని
తప్పుకొంటూ లోపలికి వెళ్ళిపోయింది. లోపలిక వెళ్ళిపోగా నీటిపైన సుడులు వలయాకారంగా
ఏర్పడ్డాయి. సున్నాలాగ ఏర్పడిన ఆ దృశ్యం తనకిక తల్లి లేనేలేదని తెలియజెప్పినట్లనిపించింది.

ఆ బావిలోనే నీటిపాము ఒకటి పైకెగసి కప్పనొకదాన్ని ఒడిసిపట్టుకోవటం కవికంటబడింది. ఆ
పాము తనతో 'నీకమ్మలేదు' అన్నట్లుగా కవికి తోచింది. గుండెలు చిక్కబట్టుకొని శోకవహ్నితప్త
హృదయుడై కవి "నాకమ్మలేదు" అనుకొని ఇంటిదారి పట్టారు.

ఇంకా మాతృగీతాలులో తల్లిలేని బిడ్డకు లోకంలో విలువలేదనీ, పండుగలన్నీ విషాదపు
జ్ఞాపకాలనే కలిగిస్తాయనీ పరిపరివిధాల తన దుఃఖాన్ని నాయని సుబ్బారావు వెల్లడించారు. తల్లినొక
దేవతగా భావించి శ్రీ నాయని "చిన్ని నీ విగ్రహము ప్రతిష్ఠింతును, నాదునంత రంగమ్ము నీకు
దేవాలయమ్ము" అని పలికి ఆమె ఆరాధనలో శాంతిని పొందారు.

– డాక్టర్ కె. రామమోహన్‌రాయ్

BRAOU

# భాగం 6 కలత నిదుర

## విషయక్రమం


6.0 ఉద్దేశం
6.1 ప్రవేశిక
6.2 సూచనలు
6.3 పాఠ్యం
- 6.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
- 6.3.2 వ్యాఖ్యానం
- 6.3.3 విశేషాంశాలు

అభ్యాసం – 1
6.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
6.6 ఆకళింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు


## 6.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- ప్రణయ కవిత్వ రీతులు
- ప్రణయకవిత్వం భావకవిత్వంలో ఒకశాఖ

## 6.1 ప్రవేశిక

BRAOU

పాశ్చాత్య కాల్పనిక కవులు కీట్స్, షెల్లీ, బైరన్ వంటి వారి ప్రభావముద్రతో ఆధునికయుగంలో భావకవిత్వ శాఖగా ప్రణయకవిత్వం బయలుదేరింది. ఊర్వశి, శశికళ వంటివి. ఈ కోవకు చెందిన కావ్యాలు. జానపద బాణీకి చెందిన ప్రణయ కావ్యం శ్రీ నండూరి సుబ్బారావు "ఎంకిపాటలు". ప్రబంధ కవిత్వయుగంలోని ప్రణయకవిత్వానికీ, భావకవులు [illegible]యించిన ప్రణయ కవిత్వానికీ భేదాన్ని ఎంకి పాటలలోని "కలత నిదుర" అనే ఈ భాగంలో మీరు గమనిస్తారు.

## 6.2 సూచనలు

ఈ పాఠ్యం చదివేముందు విద్యార్థులు భావకవిత్వంలోని ప్రణయకవిత్వ లక్షణాలను పరిశీలించాలి. రాయప్రోలు ప్రారంభించిన అమలిన శృంగారానికీ, ప్రబంధ కవిత్వంలోని ప్రణయతత్వానికీ భేదాన్ని గమనిస్తూ విద్యార్థులు అధ్యయనం కొనసాగించాలి.

## 6.3 పాఠ్యం

ఈ రేయి నన్నొల్ల నేరవా? రాజా!
ఎన్నెలల సొగసంత యేటి పాలేనటర!

ఆకాశమేమూలొ
అణగిపోయిన రేయి
ఏటి సెందురుడల్లె
సాటు సూపుల కులికి

ఈ రేయి నన్నొల్ల నేరవా? రాజా!
ఎన్నెలల సొగసంత యేటి పాలేనటర!

ఆకాశమో తీరు
అడిలిపోయిన రేయి
మాటలెరుగని పాప-
ఏటి గిలిగిల సూపి-

ఈ రేయి నన్నొల్ల నేరవా? రాజా!
ఎన్నెలల సొగసంత యేటి పాలేనటర!

ఆకాశమా వొరస
అవులించిన రేయి

మిసమిసలతో యేటి
పసలతో నమనుట్టి

ఈ రేయి నన్నొల్ల నేరవా? రాజా!
ఎన్నెలంల సొగసంత యేటి పాలేనటరా!

యెలుతురంతా మేసి
యేరు నెమరేసింది
కలవరపు నా బతుకు
కలత నిదరయ్యింది -

ఈ రేయి నన్నొల్ల నేరవా ? రాజా !
ఎన్నెలంల సొగసంత యేటి పాలేనటరా !

ఒక్కతెను నాకేల
ఓపజాలని సుకము !

ఈ రేయి నన్నొల్లనేరవా ? రాజా !
ఎన్నెలంల సొగసంత యేటి పాలేనటరా !

### 6.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| అడలిపోయిన | = | బెంగపడిన |
| ఓపజాలని | = | భరించలేనంత |

### 6.3.2 వ్యాఖ్యానం

శ్రీ నండూరి వేంకటసుబ్బారావు ఏలూరులో జన్మించారు. ఏలూరులో విద్యాభ్యాసం తర్వాత మద్రాసు క్రైస్తవ కళాశాలలో చదివి బి.ఏ. పట్టం పొందారు. మద్రాసు 'లా' కాలేజీలో చేరి బి.ఎల్. పాసై 1926 లో న్యాయవాద వృత్తిని చేపట్టారు. జీవితాంతం న్యాయవాదిగానే గడిపారు.

1918 లో మొదటి సారిగా 'ఎంకి పాటల' రచనకు పూనుకొన్నారు. కొద్ది సంవత్సరాలలోనే మిత్రుల వల్ల ఈ పాటలు మిక్కిలి ప్రచారం పొందాయి. ఆంధ్రపత్రిక, భారతి, సాహితి, అనసూయ, జనరంజని, జ్యోతి, సుజనరంజని పత్రికలలో ఎంకి పాటలు ప్రచురితమయ్యాయి. దేశంలో పెద్దసంచలనం రేగింది. దూషణ భూషణ తిరస్కారాలతో చివరికి ఎంకి పాటల గాలి దుమారం చెలరేగింది.

1925 లో శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ ఎంకి పాటలను సమర్థిస్తూ కొన్ని సందర్భాలలో ప్రసంగించారు. అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు, పాకుర్లూరి లక్ష్మీనారాయణ ఎంకి పాటలలో శృంగారాన్నీ, భాషనూ ఆక్షేపించారు. శ్రీయుతులు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వేదాల తిరువేంగళాచార్యులు ఎంకి పాటలను అలంకార పద్ధతికనుగుణంగా సమర్థించి ఆంధ్ర సాహిత్యంలో ఈ పాటలకు గౌరవస్థానం కల్పించారు. బెల్లంకొండ రాఘవరావు ఒక్కొక్క ఎంకి పాటపై ఒక్కొక్క వ్యాసం చొప్పున వాటిలో అందచందాలను వివరిస్తూ వ్యాసాలు రాశారు.

శ్రీ అడవి బాపిరాజు ఎంకి పాటలలో భావాలకు చిత్రాలు రచించారు. శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య ఎంకి పాటలను స్వరపరచి రాగతాళాలు ఏర్పరచారు. శ్రీ నటరాజ రామకృష్ణ ఎంకి పాటలను అభినయంతో జోడించి ప్రదర్శనలిచ్చారు. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి తమ సాహిత్య యాత్రలలో ఎంకి పాటలను సభలలో గోష్ఠులలో పాడి విశేష ప్రచారం కల్పించారు. ఎంకి పాటలలో అందాలను చలంగారు తమ మ్యూజింగ్స్‌లో పరిపరి విధాల ప్రశంసించారు. (ఎంకిపాటలు ఆధారంగా) బుచ్చిబాబు, రుక్మిణీనాథ శాస్త్రి, కాంతారావుగారలు నాటికలు రచించారు. శ్రీ ఎమ్. చలపతిరావు ఎంకి పాటలను ఇంగ్లీషులోనికి అనువదించారు.

శ్రీ శ్రీ ఎంకి పాటలలో సొగసులను గూర్చి వ్యాసాలు రచించారు.

1925 లో ఎంకి పాటల మొదటి ముద్రణ వెలువడింది. ఆ తర్వాత అప్పుడప్పుడూ రాసిన ఎంకి పాటలకు, శ్రీ మంచాల జగన్నాథరావు (సుప్రసిద్ధ వైణికులు) ప్రోత్సాహంతో రచించిన పాటలను చేర్చి 'కొత్త పాటలుగా' 1953లో సరికొత్త ఎడిషన్ వెలువరించారు. ఆధునికాంధ్ర సాహిత్యంలో ఎంకి పాటలు ప్రణయ కవిత్వంలో పారవశ్యపుటంచులు ముట్టిన రస గీతాలుగా ప్రసిద్ధికెక్కాయి.

ఎంకి పాటల కవి శ్రీ నండూరి తన జీవితంలో ఇంకే సాహితీ ప్రక్రియలోనూ రచనలు చేయలేదు. ఇంత ఏకాగ్ర చిత్తంతో ఒకే విధమైన కావ్య రచనకు తన జీవితాన్ని అంకితం చేసిన కవులు అరుదు.



BRAOU

భావకవిత్వంలో ప్రేయసికి గౌరవస్థానం లభించింది. స్త్రీ అంగాంగ సౌందర్యాన్ని గాక భావకవులు ఆమె ఆత్మ సౌందర్యాన్ని ఆరాధించటం మొదలుపెట్టారు.

పాశ్చాత్య కాల్పనిక కవులు (Romantic Poets) భావకవులకు కొంత కవితా ప్రేరణ కలిగించారు. కీట్స్ షెల్లీ, బైరన్ కవుల ప్రణయ కవితా భావాల ప్రభావం భావ కవుల ప్రణయకావ్యాలపై కొంత ప్రసరించింది. ఇంగ్లీషు భాషలో కాల్పనిక కవుల కావ్యాలను చదివి మనస్సుకు పట్టించుకొన్నప్పటికీ తెలుగుదనం ఏమాత్రమూ వీడని కవి నండూరి. తెలుగుజాతి సంస్కృతి యెంకి పాటలలో గుబాళించింది.

నవ్య కవుల ఊహాసుందరులకు ఎంకికి కూడ భేదం ఉంది. శ్రీ సి. నారాయణరెడ్డి గారి మాటలలో చెప్తే "ఊర్వశి, శశికళ మున్నగు వారు వెన్నెలమరుగులు, పోతపోసిన మూర్తులు. వారికి ఎంకికి పోలిక ఎక్కడలేదు. ఎంకి అడవి మల్లె వంటిది." "తెలుగు పస, తెలుగుమడి, తెలుగునాదం, తెలుగు రుచి తెలిసికొని మనజాతి సాంప్రదాయాలలో గల సొగసు, జీవనమూ" తెలిపే పాటలు ఎంకి పాటలు. అందువల్లనే పండిత పామరుల మెప్పు పొందగలిగాయి. ఎంకి పాటల ప్రాశస్త్యం గురించి విమర్శకులలో వివాదం చెలరేగినప్పుడు శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి "ఎంకి పాటలు ఈ ఇరువదవ శతాబ్దిని మన యీ ఆంధ్ర వాఙ్మయ కల్పశాఖికను ప్రసవించిన సర్వాంగ పరిపూర్ణ పరిణతి విలసితంబులగు దివ్య ప్రసూన రాజములు గాని, పూప బెడంగులు పచరించు పసరు మొగ్గలు కావు" అని ఎంకి పాటల ఔన్నత్యాన్ని వివరించారు.

నాయుడుబావ ఎక్కడో దూరంగా ఉన్నప్పుడు, ఎడబాటు సహించలేని ఎంకి మనసులోని తలపులు 'కలతనిదరలో' సున్నితంగా వ్యక్తమైనాయి. అది వెన్నెలరాత్రి, ఏటి ఒడ్డున ఎంకి సంకేత స్థలాన్ని చేరుకొని, నాయుడు బావకై ఎదురుచూసి, విసిగిపోయి, దీనంగా తనను ఆదరించమని నాయుడుబావను ఉద్దేశించి పలుకులోంది.

"ఓ రాజా! ఈ రాత్రి నన్ను ఏలుకోవా? దూరమై వెన్నెల సొగసునంతా ఏటిపాలు చేస్తావా?" అని మాటిమాటికి బావనుద్దేశించి అంటూంది. ఇక్కడ 'రాజా' అనేది ఆమె ప్రియుని గురించి చేసిన సంబోధన, జానపదులలో నాయిక ప్రియుణ్ణి 'రాజా' అని సంబోధించే సంప్రదాయం ఉంది. 'రాజా' అంటే చంద్రుడనే అర్థం కూడా ఉంది.

భూమ్యాకాశాల నడిమి ప్రదేశమంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రకృతిలో ఎటువంటి సవ్వడులూ లేవు. ఈ రాత్రి ఆకాశం ఏమూలో నిశ్శబ్దంగా అణగిపోయి ఉంది. ఏటి కెరటాలలో చిరుగాలికి కదులుతూ దోబూచలాడే చంద్రుడిలాగ చాటు మాటుగా నిలిచి చిలిపి చూపులతో కులికి ఈ రాత్రి నన్నేలుకోవా? అని ఎంకి అడిగింది.

ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోవటానికి కేవలం శబ్దార్థజ్ఞానం సరిపోదు- కవితో సహానుభూతి పొందటానికి. ఆతని భావాలకు అనుగుణంగా సహృదయులు ప్రతిస్పందించాలి. గీతంలో శబ్దాలను ఆధారం చేసుకొని కవి హృదయాన్ని అర్థంచేసుకోవాలి. శబ్దం దీపం లాంటిది. దీపం వెలుగులో వస్తువును వెతుక్కున్నట్లు శబ్ద సహాయంతో కవి భావాల్ని అర్థం చేసుకోవాలి. ఈ అభిప్రాయాన్ని శ్రీ ముద్దుకృష్ణ "చీకటిలోనికి దీపికను తీసుకొని రాగలరు కాని ఎవ్వరూ చీకటినే వెలుతురుగా మార్చలేరు. దీపానికి యెంత చేరువగా రాగలిగితే అంత వెలుతురు లభ్యమౌతుంది. కానీ దీపానికి వీలున్నంత దూరంలో నిలిచి, వెలుతురు చాలదని నిందించే వారిని చూసి విచారపడడం కన్న వేరేమీ చేయలేము" అనే మాటలలో వైతాళికులు 'కావ్య సంకలనానికి ముందుమాట రాస్తూ తెలిపారు. కవి హృదయంతో సహానుభూతిపొందే ప్రయత్నం చేయకుండ కేవలం శబ్దార్థ చర్చచేసి ప్రయోజనంలేదు.

ఈ దృష్టితో 'కలతనిదుర గీతాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. ఆకాశ మొక తీరుగా యీ రాత్రి అడిలిపోయింది. మాటలెరుగని పాప అడిలిపోయినట్లు ఆకాశం దిగాలుగా వుంది. ఏటి గిలిగిలచూసి పాపను అలరించినట్లు ఈ రాత్రి నన్నేలుకోవా అని తన కోర్కెను నాయుడుబావకు తెల్పుతున్నది.

ఆకాశం ఎదురుచూసి చూసి నిద్ర ముంచుకొనిరాగా ఆవులించింది. రేయి గడిచిపోతున్నది. యేటి మిసమిసలతో, పసలతో నను చుట్టి ఈ రాత్రి నన్నేలుకోవా? రాజా! వెన్నెలల సొగసునంతా యేటిపాలుచేసి వ్యర్థం చేస్తావా? వెన్నెలలో మన ప్రేమను పండించేటట్లు చేయవా? అని ఎంకి అడుగుతున్నది.

వెన్నెల వెలుగు ఏటిమీద ప్రతిఫలిస్తోంది. వెన్నె[redacted]ను మేసి ఏరు నెమరు వేస్తోంది. ఏరు వెన్నెలను మేసి నెమరు వేస్తున్నది అన్నప్పుడు 'మేసి' 'నెమరు' [redacted]ంటుపుల్లో ఉన్న అర్థంలో భావాన్ని స్వీకరించ కూడదు. ఏటి కెరటాలమీద వెన్నెల తెరలు తెరలుగా ఎగసిపడుతున్నది అని అర్థంచేసుకుంటే సరిపోతుంది. వెన్నెల వెలుగుల్లో పావశ్యంతో తాను సొక్కిపోతే నాయుడుబావ తలపులతో తన బతుకు కలతనిద్దరైనదని వాపోతున్నది ఎంకి.

ఏటి ఒడ్డున వెన్నెలరాత్రి ఎంతో సుఖంగా ఉంది. నాయుడుబావ లేకుండా ఆ సుఖం తనకొక్కదానికే అక్కరలేదంటూంది. ఓపజాలని సుఖము తాను భరించలేనంటుంది. వెన్నెల సొగసు ఏటిపాలు కాకుండ యీ రాత్రి తననేలుకొమ్మని ఎంకి నాయుడుబావను కోరుతూంది.

ప్రియురాలి విరహబాధను శ్రీ నండూరి యీ గీతంలో రమణీయంగా వర్ణించారు. ప్రబంధాల్లో నాయిక విరహవర్ణనలకు ఎంకి విరహానికి చాలా వ్యత్యాసం ఉంది. రెండిటిలోను విప్రలంభశృంగారమే వర్ణితమైంది.

'కలతనిదుర'లో భావాలు భావుకుడైన నండూరి సుబ్బారావు గారివి. భాష మాత్రం పామర జనుల యాస. ఈ రెండిటికీ వ్యత్యాసం ఉండటం వలన విమర్శకులలో ఈ గీతాల్ని గురించి భిన్నాభిప్రాయాలు న్నాయి. ఎంకి పాటలు రచిస్తున్న తొలిదశలోనే నండూరి వారి మిత్రులు శ్రీ బసవరాజు అప్పారావు "నీవు నిత్యం వాడే భాష కాదిది. ఈ భాష సాయమున సత్యాన్వేషణ చేయలేవు" అని కవిని హెచ్చరించారు. కాని నండూరి ఎంకి పాటలను జానపద రీతిలోనే కొనసాగించారు. కొత్త పాటలలో కొన్ని, పూర్వపు పాటల స్థాయిలో లేకపోయినా, ప్రణయ కవిత్వంలో ఆయన ఆవలిగట్టు చేరుకొన్నారు.

"పాటక జనుల జీవితంలో లీనము కాకుండా పైపైన దేవులాడినంత మాత్రనే విశేష ప్రయోజనముండదు. అట్లా లీనమైపోవటానికి మనకు లీనతా సంబంధమైన అహంకారము యావత్తు పటాపంచలు కావలసి ఉంటుంది." అది సాధ్యం కానప్పుడు "కవిస్వకీయ భావములను వర్ణించుటయే వీలయిన కార్యము" అని బసవరాజు వారు హితవు చెప్పారు. కాని నండూరి వారు జానపదరీతిలోనే తమ భావాలను వెల్లడించాలనే దీక్షను విడిచిపెట్టలేదు.

ఎంకి పాటలకు పెక్కు విధాలైన ప్రశంసలు లభించాయి. ఎంకి నాయుడు బావలను కేవలం జీవేశ్వరులుగా అభివర్ణించారు శ్రీ పురాణం సూరిశాస్త్రి. పంచాగ్నుల వారి జంటను రతీమన్మథులతో పోల్చారు. రంభానలకూబరులు అలంకార శాస్త్ర విరుద్ధంగా శృంగార సల్లాపం చేయటంవల్ల కలియుగంలో ఎంకి నాయుడుబావలుగా జన్మించారని వేదము వెంకటరాయశాస్త్రి గారు చమత్కరించారు.

'కలతనిదుర' లో ఎంకి స్థితి అలంకార శాస్త్ర పరిభాషలో చెప్పే అష్టవిధనాయికలలో 'విప్రలబ్ద'.

శ్రీ నండూరి సుబ్బారావు భావనలో ఎంకి నాయుడుబావలు అపురూపమైన ప్రేమికులు. ఒకరంటే ఒకరికి గాఢమైన, ఒకరినొకరు విడిచి ఉండలేని ప్రగాఢమైన ప్రేమ వారిది. నాయుడుబావ ఎడబాటును సహించలేని ఎంకి గుండెవెత 'కలతనిదుర' గీతంలో వ్యక్తమైంది. "ఈ రాత్రి నన్ను ఏలుకోవా? రాజా! వెన్నెలల సొగసును ఏటిపాలు చేయక నన్ను స్వీకరించు" అనే కోరికను ఆమె పరిపరివిధాల వ్యక్తం చేసింది.

### 6.3.3 విశేషాంశాలు

'ఎంకి పాటలు' శీర్షికకు తగినట్లు పాటలే. గానయోగ్యమైనవి. వీటిలో ఇంపుగొలిపె లయవిన్యాసం మనస్సుకు హాయి గొలుపుతుంది. ప్రతి పాటా రాగతాళయుక్తంగా పాడటానికి అనువుగా రాసిందే. 'కలతనిదర' లో జాలిని గొలిపే విరహిణి వేదన లయబద్ధంగా గానం చేయదగిందిగా ఉన్నది.

ఎంకి పాటలలో చాలా భాగం ద్విపద మాత్రకగా, పునాదిగా కలిగిన ఛందోరీతులలో రచింప బడింది.

చాటు చూపులకులికిన ఏటి చందురునిలాగ నాయుడుబావను రమ్మని ఆహ్వానించటంలో ఉపమాలంకారం ఉంది.

BRAOU

**అభ్యాసం – 1**

'కలత నిదుర' లోని ఎంకి వియోగ దుఃఖాన్ని వర్ణించండి ?

________________________________________

________________________________________

________________________________________

________________________________________

________________________________________

## 6.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలోని "ప్రణయ కవిత్వం" అనే భావకవితా శాఖకు సంబంధించిన పాఠ్యం "కలత నిదుర"
- భావకవిత్వంలోని ప్రణయ కవిత్వ పద్ధతికీ, ప్రబంధ కవిత్వంలోని ప్రణయ కవిత్వ పద్ధతికీ భేదం ఉన్నది. ప్రబంధ కవితలో శృంగార వర్ణనలే ప్రణయంగా ఉంటే, భావకవిత్వంలోని ప్రణయం ఆరాధనా పూర్వకమైన భావాలకు దారితీసింది.
- భావకవిత్వ యుగంలో ప్రముఖులైన నండూరి సుబ్బారావు రచించిన "ఎంకి పాటలు" అనే కావ్యం లోనిది ఈ పాఠ్యం.
- ఈ పాటలు జానపద గేయాల బాణీలో తాళలయాత్మకంగా, సంగీత సంప్రదాయాలకు అనుగుణంగా ఉన్నాయి. అందుకే ఈ పాటలకు శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య వంటివారు ఎంకి పాటలకు రాగతాళాలను స్వరపరచ గలిగారు.

BRAOU

## 6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

'కలత నిదుర' లోని ప్రకృతి దృశ్యాలకూ, ఎంకి మనోభావాలకూ ఉన్న పోలికను చర్చించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

ప్రణయ కవిత్వ రీతులను మీ పాఠ్యం ద్వారా నిరూపించండి?

## 6.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఎంకి పాటలపై సాగిన సాహిత్య చర్చల సారాంశాన్ని "ఎంకిపాటల గాలి దుమారము" అనే వ్యాసం బసవరాజు అప్పారావు రచించినది. (ఆంధ్ర పత్రిక – సంవత్సరాది సంచిక – అక్షయ – 1926 – సారస్వత వ్యాసములు – ప్రథమ సంపుటము, సంపాదకులు డా. జి. వి. సుబ్రహ్మణ్యం) చదవండి.
2. "కలత నిదుర" వంటి విరహ గీతాలు ఎంకిపాటలలో ఏవేవి ఉన్నాయో పరిశీలించి, వాటన్నింటిలో ఉన్న విప్రలంభ శృంగారాన్ని గురించి తెలుసుకోండి.
3. ఈ కింద పద్యం చేమకూర వేంకటకవి రచించిన విజయ విలాసమనే ప్రబంధంలోది. సుభద్ర అర్జునునిపై విరహాన్ని వ్యక్తం చేస్తున్నది. దీన్నే విప్రలంభ శృంగారం అంటారు.

దిగ్గునలేచి వన్నతడతి ప్రమదంబున చందమామ ఊా
నిగ్గుటరంగు మీదికయి నెమ్మి గరాబ్జము వట్టి యీడ్చినన్
బిగ్గ గవుంగిలించి సుఖనీరధి తేలగనీకనా కయో !
సిగ్గను పేర వెంటబడ జెల్లినాకో ప్రతిబంధమయ్యెడన్
(వి. వి. 3 - 21)

ఇట్లాగే మనుచరిత్ర, వసుచరిత్రవంటి ప్రబంధాల్లోనూ సుమారుగా 3 - 4 అశ్వాసాలు వెతికితే నాయిక నాయకుణ్ణి తలచుకునే పద్యాలు దొరుకుతాయి. ఆ పద్యాల ఆధారంగా భావకవుల దృష్టిలో స్త్రీకి, ప్రబంధ కవుల దృష్టిలో స్త్రీకి ఉన్న భేద సామ్యాలను గుర్తించండి.

4. ఈ కింది ఎంకి పాట చదవండి.

"ఎనక జల్మంలోన
యెవరినో నంటి
సిగ్గొచ్చి నవ్వింది
సిలక నాయెంకి,
ముందు మనకే జల్మ
ముందోలె నంటి
తెల్ల తెల బోయింది
పిల్ల నా యెంకి
ఎన్నాళ్ళు మనకోలె
ఈ సుకములంటి
కంట నీరెట్టింది
జంట నాయెంకి"

పై పాటలో నాయుడుబావ అన్న మాటలకు ఎంకి మాటల్లేకుండా సమాధానం చెబుతుంది. ఈ పాటను ఇంకా పరిశీలించి మీ సొంత వ్యాఖ్యానం రాయండి. మూడు చరణాల్లోనూ భావపరంగా, వాక్యనిర్మాణ పరంగా సామ్యాలున్నాయి. భేదాలున్నాయి. మీ వ్యాఖ్యానంలో ఈ విషయాలను గుర్తించండి.

BRAOU

## అభ్యాసానికి జవాబులు

శ్రీ నండూరి వేంకట సుబ్బారావు రచించిన యెంకి పాటలలో యెంకి నాయుడుబావలు ఆదర్శ ప్రేమికులు, జానపదులు. నిసర్గసుందరమైన ప్రణయ జీవితాన్ని శ్రీ సుబ్బారావు అత్యద్భుతంగా చిత్రించారు. ఆంధ్రప్రబంధాలలో వర్ణితమైన నాయికానాయకుల విరహ వర్ణనలకు ఎంకినాయుడుబావల విరహవర్ణనకూ ఎంతో వ్యత్యాసం వున్నది. 'అమలిన శృంగార' భావాలు శ్రీ సుబ్బారావు రచనలో కొత్త సొబగులు సంతరించుకున్నాయి.

ఎంకినాయుడు బావలు పల్లెలో జీవించే దంపతులు. నాయుడు బావ కోసం ఎందురుచూస్తూ ఏటి వొడ్డున ఒక వెన్నెల రాత్రి ఎంకి పొందిన వియోగబాధను శ్రీ నండూరి 'కలతనిదుర' లో వర్ణించారు. "ఈ రాత్రి నన్నేలుకోవా రాజా! ఎన్నెలల సొగసంతా ఏటిపాలు చేయక నన్నేలుకో!" అని ఎంకి నాయుడు బావను వేడుకొంటూన్నది. ప్రకృతి అంతా నిశ్శబ్దంగా వుంది. ఆకాశం అణిగి పోయినట్లుంది. ఏటికెరటాలలో చంద్రుడు దోబూచులాడినట్లు చాటు చూపుల కులుకుతూ వచ్చి నన్నేలుకోవా! అని ఎంకి నాయుడు బావను వేడుకొంటూంది.

"ప్రియా వియోగంతో ఆకాశం, బిక్కమొఖంపెట్టి అడలిపోయిన పాపలాగ మాటలు లేక మౌనంగా వున్నది. ఏటి గిలగిల చూపి పాపను అలరించినట్లు ఈ రాత్రి నన్నేలుకోవా? రాజా వెన్నెలల సొగసంతా ఏటిపాలు చేయక వచ్చినన్నేలుకో!" అని ఎంకి నాయుడు బావను బతిమాలుకొంటూంది.

"ఎదురు తెన్నులు చూసి విసిగిపోయిన ఆకాశం ఆవులించింది. ఏటి కెరటాల మిస మిసలలో నన్నేలుకోవా? ఈ రాత్రి వెన్నెలల సొగసును ఏటిపాలుచేయక వచ్చి నన్నేలుకో!" అని ఎంకి నాయుడు బావతో తన నిరీక్షణను తెల్పుకుంటూంది.

"వెలుతురంతా మేసి ఏరు నెమరేసింది. కలవరపు నా బతుకు కలతనిదరయ్యింది. ఈ రాత్రి నన్నేలుకో! వెన్నెలల సొగసును ఏటిపాలుచేయకు" అని ఎంకి దీనంగా నాయుడు బావతో అంటూంది.

"ఓప జాలని సుఖము నాకెందుకు? ఈ ఒంటరివేళ ఆ వెన్నెలల సుఖాన్ని ఓపలేను. ఓ రాజా ఈ రాత్రి నన్నేలుకోవా? వెన్నెలల సొగసునంతా ఏటిపాలు చేయక వచ్చి నన్నేలుకో!" అని ఎంకి పరిపరివిధాల నాయుడు బావను వేడుకుంటూంది.

'కలతనిదుర'లో ఎంకి వియోగబాధ సహృదయులకు జాలిగొలుపుతుంది. ఈ గీతంలో విప్రలంభ శృంగారం రమణీయంగా పోషింపబడింది.

నాయుడుబావతోనే ఉండి అతని మాటేవింటూ, అతడు మర్మమిడిపి మనసిస్తే చాలు, అతడు సల్లగంటే చాలు అతని నీడలోనే మేడ కట్టి కాపరం చేయవలెనని సంకల్పించుకొన్న పతివ్రతకాలపు ఇల్లాలు ఎంకి. ఈమె నాయుడుబావ వియోగాన్ని సహించలేదు. అతడు అన్నరోజుకు, రాక మాట తప్పినప్పుడే నీళ్ళు తెచ్చేటప్పుడూ, అద్దంలో చూస్తూన్నప్పుడూ, చల్లని వెన్నెల్లో చాపేసి కూర్చున్నప్పుడూ అతడు తన వద్దనే వున్నట్లు భావించి వికారం పొందుతుంది. ఏటి నురగల చూపి అతడు అనుకూలునే అనుకుంటుంది. చంద్రవంక పోగానే అతడు తిరిగి వస్తాడనుకుంటుంది. దూరాన తన రాజు కేరాయిడౌనో, ఈ రోజు తన రాతలేరాలపాలో అని గుబులు బిగులుపడుతుంది. చీమచిటుక్కుమన్నా, ఆవులింబా అన్నా, తులిసెమ్మ వొరిగినా, తొలిపూస పెరిగి భర్త క్షేమం గూర్చి భయపడుతుంది. "ఇయంగేహేలక్ష్మీరియమమృతవర్తిర్నయనయోః" అన్న భవభూతి వాక్యానికి ప్రమాణంగా ఎన్నదగిన ఇల్లాలు ఎంకి.

ఆంధ్రుల హృదయాల్ని ఇంతగా చూరగొన్న "ఎంకి ఎవరు?" అని అడిగిన వారికి కవి నండూరి సుబ్బారావు గారు

"ఎంకెవ్వరని లోక
మెపుడైన కదిపితే
వెలుగు నీడలవైపు
వేలు సూపింతు!" అని ప్రణయ స్వరూపిణి ఎంకిని ప్రకృతిలో భాగంగా చూపించారు.

– డాక్టర్ కె. రామమోహన్ రాయ్

BRAOU

# భాగం 7 కష్టజీవి

## విషయక్రమం


7.0 ఉద్దేశం
7.1 ప్రవేశిక
7.2 సూచనలు
7.3 పాఠ్యం
- 7.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
- 7.3.2 వ్యాఖ్యానం
- 7.3.3 విశేషాంశాలు

**అభ్యాసం**

7.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం
7.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
7.6 ఆకళింపు ప్రశ్నలు
అభ్యాసానికి జవాబు


## 7.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- జాషువా లక్షించిన సామాజికాభ్యుదయం
- జాషువా అభ్యుదయ కవిత్వ దృక్పథంలోని వర్ణ వర్గరహిత మానవతావాదం.
- జాషువా కవిత్వరీతులు

## 7.1 ప్రవేశిక

వర్ణవర్గ విద్వేష పూరిత సమాజంలోని దుష్ఫలితాలను తన జీవితకాలంలో ప్రత్యక్షంగా రుచి చూచిన మహా కవి జాషువా, సంఘంలోని దుస్సంప్రదాయాలను ఖండిస్తూ రాసిన కావ్యం 'గబ్బిలము'. అనేక సామాజిక దురాచారాలకు నిష్కారణంగా బలిపోతున్న అస్పృశ్యుని అభ్యుదయాన్ని 'కష్టజీవి' లోని పద్యాలు కాంక్షిస్తున్నాయి. సర్వమానవ సంక్షేమాన్నీ, ఆర్థిక సమానత్వభావాన్నీ, సహజీవన విధానాన్నీ, ఈ పాఠ్యంలో జాషువా ఎంత తీవ్రంగా ప్రతిపాదించాడో ఈ భాగం ద్వారా మీరు గ్రహిస్తారు.

BRAOU

## 7.2 సూచనలు

ఈ పాఠ్యం చదివేముందు విద్యార్థులు అభ్యుదయ కవిత్వ లక్షణాలను, ముఖ్యంగా వాటిలోని "సామాజిక స్పృహ" స్వభావాన్ని అధ్యయనం చెయ్యాలి. సర్వమానవ సంక్షేమాన్ని ప్రతిపాదించే 'ఫిరదౌసి' వంటి జాషువా కృతులను పరిశీలించాలి. ఆ అధ్యయనాన్ని సమన్వయ పూర్వకంగా ఈ పాఠ్యానికి జోడిస్తూ, జాషువా కవిత్వ రీతులను పఠించాలి.

## 7.3 పాఠ్యం

చిక్కిన కాసుచేఁ దనివిఁ జెందు నమాయికుఁడెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మఱచిపోవు క్షుధానల దగ్ధమూర్తుల న
ల్దిక్కులఁ గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కఁడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డఁడై. 1

పూవ వయస్సులో వలసపోయిన చక్కని తెల్గుకేతకున్
బ్రాపకమిచ్చినట్టి రఘునాథ నృపాలకుఁడేటియున్న తం
జాపురి మండలంబునకుఁ జక్కగ దక్షిణభాగ భూములన్
గాపురముండె నప్పరమ గర్భ దరిద్రుఁడు నీతిమంతుఁడై. 2

మువ్వు ఘటించి వీని కులమున్ కలిమిన్ గణించి దేహమున్
బిప్పి యొవర్పు వీ భరతవీరుని పాదము కందకుండఁగాఁ
జెప్పులు గుట్టి జీవనము సేయుమగాని నిరాకరింపలే
దెప్పుడు నప్పునద్దది మమీ భరతావని వీని సేవకున్. 3

వాని తొక్కల కష్టంబు లేనివాఁడు
నన్యరమ పండి పులకింప వంశయించు
వాఁడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁబెట్టు వానికి భుక్తిలేదు. 4

వాని తలమీఁదఁ బులిమిన పంకిలమును
గడిగి కరుణింప లేదయ్యె గగన గంగ
వాని నైవేద్యమున వంటువడినవాఁడు
మూఁడుమూర్తులకును గూఁడ గూడులేదు. 5

పాములకుఁ బాలు చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిం జనించు
ప్రాక్తనంబైన ధర్మ దేవతకుఁగూడ
నులికిపడు జబ్బుగలదు వీఁడున్నచోట. 6

వానినుద్ధరించు భగవంతుఁడే లేఁడు
మనుజాఁడెట్లు వానిఁ గనికరించు
వాఁడు జేసికొన్న పాపకారణమేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు. 7

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుప గజ్జెల తల్లి జీవనముసేయుఁ
గసరి బుసకొట్టు నాతని గాలిసోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు. 8

కులములేని నేను కొడుకులఁ బుట్టించి
యీ యఘాతమందె త్రోయవలెనె
భార్యయేలఁ బుట్టు బానిస కనివాఁడు
జరుపసాగె బ్రహ్మచర్య దీక్ష. 9

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దుః
ఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పది మూఁడు కోట్లదే
వతలెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులాఱునే. 10

**7.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు**

1. చిక్కిన కాసుచే = లభించిన కాసుచేతనే, 'కాసు' స్వల్పమైన ధనానికి సంకేతం.
   తనివి జెందు = సంతృప్తి చెందడం.
   బొక్కెడు బువ్వ = కొద్దిపాటి అన్నం.

క్షుధానల దగ్ధమూర్తి = ఆకలి బాధచే దహించుకుపోయిన వ్యక్తి
దిక్కరి = దిక్కులేక
అరుంధతీ సుతుడు = అరుంధతి కుమారుడు; అరుంధతీ వశిష్ఠుల కుమారులు పంచములని సంప్రదాయం
భరతోర్వర = భారతదేశం
కడగొట్టు బిడ్డడు = చిన్న పిల్లవాడు; నాలుగు వర్ణాల వారు జన్మించిన తర్వాత జన్మించిన వాడని భావం. కడగొట్టు బిడ్డ అయినా ముద్దూ ముచ్చటకు నోచుకోలేదని వ్యంగ్యం.

2. పూపవయస్సులో = లేత వయస్సులో
ప్రాపకము = ఆశ్రయం
ఏలియున్న = పరిపాలించుచున్న
అప్పురమ గర్భదరిద్రుడు = మిక్కిలి దరిద్రుడైన అతడు

3. ముప్పు ఘటించి = ఆపదలు కల్పించి
కలిమిన్ = సంపదను
నిరాకరింపలేదు = తిరస్కరింపలేదు

4. సస్యరమ = పంట అనే లక్ష్మి
భుక్తి = భోజనం

5. పులిమిన = రుద్దిన
పంకిలము = బురద
గగనగంగ = ఆకాశగంగ
అంటుపడినవాడు = అం[illegible]పడిన రోజున
మూడు మూర్తులకును = త్రిమూర్తులకు; బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు
కూడు = నైవేద్యం

8. ఆహరించి = ఆరగించి
ఇనుపగజ్జెల తల్లి = దరిద్రదేవత; జేష్ఠాదేవి అని పురాణాల కల్పన
నాల్గుపడగల హైందవ నాగరాజు = నాలుగు పడగలతో ఉన్న హిందూమతమనే సర్పరాజు; నాలుగు వర్ణాలతో ఉన్న హిందూ మత మనే విషసర్పం అని భావం.

9. అఖాతం = గొయ్యి
పుట్టుబానిస = బానిసగానే పుట్టినవాడు
బ్రహ్మచర్య దీక్ష = అవివాహితునిగా ఉండడమనే దీక్ష

10. ప్రతిమల = బొమ్మల
వ్యయించు = ఖర్చుపెట్టు
దుఃఖితమతులైన = శోకంతో ఉన్న
భరతమేదిని = భారతభూమి
క్షుత్తు = ఆకలి.

### 7.3.2 వాఖ్యానం

గుర్రం జాషువా (1895 - 1971) గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. లింగమాంబ, వీరయ్యలు వీరి తల్లిదండ్రులు. అంటరానివాడుగా అవమానాలకు గురి అవుతూనే జాషువా బాల్యంలో విద్యాభ్యాసం చేశారు. 'పాదిరి బడిలో క్రమముగ యైదవ తరగతిని గెలిచి యస్పృశ్యతకున్ గాదిలి చెలియగు

BRAOU

హిందూ సోదరుల కళాలయము'లో ప్రవేశించారు. (నా కథ : ప్రథమ భాగము) ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడు సాహిత్య లోకంలో సంచలనం కలిగిస్తున్న తిరుపతి వెంకటకవులు, కొప్పరపు కవుల విద్యావివాదాలు వీరిని ఆకర్షించాయి.

హైస్కూల్ చదువు పూర్తయిన తర్వాత 1919 నుండి తొమ్మిదేండ్లు గుంటూరు ట్రెయినింగ్ స్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేశారు. తర్వాత 'ఉభయభాషా ప్రవీణ' చదివి పదిహేనేళ్ళు గుంటూరు జిల్లా బోర్డు పాఠశాలల్లో పండితులుగా పనిచేశారు. మూడేళ్ళు యుద్ధ ప్రచారశాఖలోను, కొన్నాళ్ళు రేడియోలో 'ప్రొడ్యూసర్' గా కూడ పనిచేశారు. జీవిక కోసం ఎన్ని ఉద్యోగాలు చేసినా కవిత్వంలో తనకుతానే ఒక ఉద్యమంగా సంఘసంస్కార ప్రబోధకమైన కవిత్వం రచించారు. పెక్కు బిరుదులు, సన్మానాలు పొందారు.

సమకాలిక సాహిత్యాన్ని ఉర్రూతలూపిన భావకవిత్వోద్యమం గాని, అభ్యుదయ కవిత్వోద్యమంగాని జాషువాను ప్రభావితం చెయ్యలేదు. సంఘంలో దురాచారాలు సమసిపోయి, అందరూ సహజీవనం చేయాలనే తలపుతో జాషువా కవిత రచించారు. సాంఘిక విప్లవాన్ని కోరిన జాషువా కవి, భాషలో విప్లవాన్ని కోరలేదు. ఈయన రచనలలో భాషాచ్ఛందస్సులు సాంప్రదాయికాలే.

కవిగా మిక్కిలి ప్రసిద్ధులైన శ్రీ జాషువా తమ సాహిత్య జీవిత ప్రారంభదశలో పెక్కు నాటకాలు రచించారు. "రుక్మిణీ కల్యాణము; చిదానంద ప్రభాతము; ధ్రువవిజయము; వీరాబాయి; తెరచాటు" నాటకాలు రచించారు. ఇవి ఏవీ జాషువా ప్రతిభకు నికషోపలమైనవి కావు. అట్లాగే ఆయన ఆశు కవితాసాధన దశలో రచించిన "హిమధామార్కధర పరిణయము, కన్యాకాపరమేశ్వరి, కుశలవోపాఖ్యానము" ఆయన కవితా శక్తిని నిరూపించేవికావు.

"ఖండకావ్య సంపుటులు - ఏడుభాగాలు. ఫిరదౌసి; గబ్బిలము; ముంటాజమహలు;స్వప్నకథ; అనాథ; కాందిశీకుడు; బాపూజీ; నేతాజీ; స్వయంవరం; కొత్తలోకము; ముసాఫరులు; నాగార్జునసాగరము; క్రీస్తుచరిత్ర; నా కథ" లలో జాషువా కవితాశక్తి పరిపూర్ణంగా వికసించింది. వీటిలో "ఫిరదౌసి; గబ్బిలము; ముంటాజమహలు" అనే కావ్యాలు ఖండకావ్యాల సంపుటాలు ఎక్కువ ప్రచారమయినాయి.

'కష్టజీవి' అనే ఈ పాఠ్యభాగం 'గబ్బిలము' అనే కావ్యం నుంచి గ్రహించింది.

అంటరానితనం దురాచారమని కవులెంతమంది కావ్యాలు రచించినా జాషువా కవి కావ్యంలో తీవ్రత వాటిలో వ్యక్తంకాలేదు. గబ్బిలము (1941) కావ్యంలో కథానాయకుని కష్టాలు జాషువా జీవితానుభవంలోని కావటం వల్ల కావ్యనికి మరింత విశిష్టత చేకూరింది. స్వానుభూతితో పలకటం కాక కావ్యంలో వర్ణించిన కష్టాలు నిజజీవితంలో ఎదుర్కొని పలవించిన తీరువేరు. "కాళిదాసుని మేఘసందేశము మనస్సులో నుంచుకొని నేనీ కావ్యమును రచించితిని. గ్రంథనామము గబ్బిలము. శ్రోతలకిది కటువుగాఁ దోచవచ్చును. కాని యందలి కథానాయకుఁడు ప్రణయ సందేశము నంపును. ఇతఁడంపునది టుకటుక నుడుకునశ్రు సందేశము. అతని శిక్షాకాలపరిమితి యొక్క సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము. తరతరములు దీని కవధి లేదు. అతడు మన్మథాగ్నితప్తుడు. ఇతడు క్షుదాగ్ని పీడితుడు. ఇరువురిలో నితడు దయనీయుఁడు" అని శ్రీ జాషువా సహృదయులకు విజ్ఞప్తి చేశారు.

"గబ్బిలం కావ్యం తాను చేసుకొన్న పాపకారణమేమిటో తనకే తెలియని ఒక అభాగ్యుని అశ్రువులగాథ. దానిలో అతని బాష్పసందేశం ప్రధానం; దేవవర్ణనగౌణం, అనుషంగికం; పరమ నికృష్టాంధకారం నుంచి హిమధవళ కైలాసోన్నతులలో నివసించే పరమశివుని వరకూ పాకిన గాథ అది. కవి కరుణాహృదయం కుమ్మరించిన కథ అది." గబ్బిలం శాశ్వతంగా ఉంటుందని నా నమ్మకం" అని జాషువా గారు అభిప్రాయపడ్డారు. (మరుపురాని మనీషి; తిరుమల రామచంద్ర; యువభారతి ప్రచురణ).

1941 లో శ్రీ జాషువా రచించిన 'గబ్బిలము' ప్రథమభాగం వెలువడింది. అప్పటికీ ఇప్పటికీ అంటరానితనం ఘోరమైన దురాచారమని చెప్పిన కావ్యాలలో 'గబ్బిలము' శ్రేష్ఠమైనది దీనుడైన ఒక నిమ్నజాతి మనుష్యుని కథను శ్రీ జాషువా 'గబ్బిలము'లో వర్ణించారు. కథలో అతణ్ణి ప్రవేశపెడుతూ అతడు అమాయకుడని తెల్పారు. అతడు తనకు లభించిన కొద్ది ధనంతోనే తృప్తిపడి, బొక్కెడు బువ్వతో ఆకలి

BRAOU

తీర్చుకొని, అన్ని కష్టాలను మరిచిపోయే మనిషి. ఆకటి బాధకు నానాటికి దహించుకుపోతున్న బడుగుజీవి. భారత భూమికి కడగొట్టు బిడ్డడుగా జన్మించిన ఆ అరుంధతీ సుతుడు నాలుగుదిక్కులున్న ఈ లోకంలో ఏ దిక్కూ లేనివాడుగా పుట్టాడు.

లేత వయస్సులో వలసపోయిన చక్కని తెలుగు కవితకు ఆశ్రయమిచ్చిన రఘునాథ భూపాలుడు తంజావూరు మండలాన్ని పరిపాలిస్తున్నప్పుడు, తంజావూరికి దక్షిణ దిక్కున ఉన్న భూములలో ఆ గర్భదరిద్రుడు నీతిమంతుడై కాపురమున్నాడు.

ఆ అభాగ్యుని కులమును, సంపదను దొంగిలించి, వానిదేహాన్ని పిప్పిచేసిన భారత వీరుల పాదాలు కందిపోకుండ అతడు వారికి చెప్పులు కుట్టి ఇచ్చి జీవనం గడుపుకుంటున్నాడు. ఏనాడు కూడా తన పనిని తిరస్కరించలేదు. భరతభూమి వీనిసేవకు అప్పుపడ్డది.

ఆ కష్టజీవి రెక్కల కష్టము లేనినాడు పంటలు పండవు. భూమి పులకించి పంటనివ్వటానికి సంశయిస్తుంది. వాడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెడతాడు. కాని వాడికే భోజనానికి గతిలేదు.

ఆ దీనుని తలమీద పంచముడని పులిమిన బురదను ఆకాశగంగైనా సరే కడిగి, ఆ మలినాన్ని తొలగించలేదు. వాడు పెట్టిన నైవేద్యం వల్ల అంటుపడినట్లయితే త్రిమూర్తులకు కూడా నైవేద్యం ఉండదు.

పాముకు పాలు, చీమకు పంచదార మేపుకుంటున్న కర్మభూమిలో పుట్టిన ప్రాచీన ధర్మదేవతకు కూడా వీడంటే భయమే. అంటుపడతానేమోనని ఉలికిపడుతుంది.

వాడిని ఉద్ధరించడానికి భగవంతుడే పూనుకోకపోతే మనుష్యులు వాడిని కనికరిస్తారనుకోవడమెట్టా? వాడు చేసుకొన్న పాపకారణమేమిటో ఇంతవరకు వాడికే తెలియదు. పంచముడిగా పుట్టడమే వాడు చేసుకొన్న పాపమని భావం.

ఆ అభాగ్యుని రక్తంతాగి దరిద్రదేవత తాండవిస్తున్నది. ఆతనిగాలి సోకితేనే నాలుగు పడగలెత్తి హైందవ నాగరాజు కసరి బుసకొడుతున్నాడు. ఆ పంచముని నీడను చూచిన మాత్రాన్నే హిందూమతంలోని నాలుగు వర్ణాల వారూ కసరికొడతారని భావం.

కులములేని నేను కొడుకులను పుట్టించి వాళ్లను కూడా ఈ అఖాతంలో తోయడమెందుకు? అని ఆలోచించి, అతడు పెళ్ళి చేసుకోవటం మానివేసి బ్రహ్మచర్య దీక్షతో ఉన్నాడు.

బొమ్మలకు పెళ్లిళ్ళు చేయడానికి వందలూ వేలూ ఖర్చుపెడుతుంది. కాని ఈ భరతభూమి శోకార్తులైన పేదలకు, పకీరులకు వాళ్ల భిక్షాపాత్రలలో ఒక్క మెతుకైనా విదల్చరు. ముప్పైమూడు కోట్ల దేవతలు నైవేద్యం కోసం ఎగబడిన ఈ దేశంలో అభాగ్యుల ఆకలి చల్లారుతుందా ? బొమ్మలకు పెళ్ళిళ్ళు చేయడం అంటే సీతారామకల్యాణోత్సవాల వంటివి. ముప్పైమూడు కోట్ల మంది దేవతలున్నట్లు హిందువుల పురాణాలలో పేర్కొన్నారు.

### జాషువా కోరిన సాంఘిక విప్లవ స్వరూపం

జాషువా కవి కోరిన విప్లవం అహింసాత్మకమైనది. కష్టజీవి తిరగబడాలని ఆయన ఏ సందర్భంలోనూ భావించలేదు. గాంధీజీ బోధించిన "ధర్మకర్తృత్వ" సిద్ధాంతాన్ని ఆయన విశ్వసించారు. ధనవంతులు, బలవంతులు హృదయ పరివర్తనం కలిగి, పేదలు, బలహీనుల పట్ల జాలిని చూపితే సమాజం బాగుపడుతుందని ఆయన నమ్మారు.

హిందూమతంలోని మూఢాచారాలను, మూఢనమ్మకాలను ఆయన దుయ్యబట్టారు. పంచములు హిందూమతం నుండి వేరొక మతంలోకి మారినంత మాత్రాన సమస్యకు పరిష్కారం లభించదని ఆయన భావించారు. మతం పేరిట అధర్మం కొనసాగకూడదని ఆయన అభిప్రాయం.

BRAOU

### 7.3.3 విశేషాంశాలు

జాషువా కవిత్వం ప్రసన్న గంభీరమైనది. సుదీర్ఘమైన సమాసాలను ఆయన ఉపయోగించరు. ఏమాత్రం శబ్దార్థ జ్ఞానం కలవారైనా ఆయన కవిత్వాన్ని అర్థం చేసుకోగలరు. రసానందం పొందగలరు. ఆయన పద్యాలు గొంతెత్తి చదవటానికి, పదే పదే తలచుకోవటానికి వీలైన పదబంధాలతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ఔచితీ శోభితమైన పదప్రయోగంలో ఆయన అందెవేసిన చేయి.

'కష్టజీవి' పాఠంలోని పద్యాల్లో 1, 2, 3 ఉత్పలమాలలు; 4, 5, 6 పద్యాలు తేటగీతులు; 7వ పద్యం ఆట వెలది, 8వ పద్యం తేటగీతి; 9వ పద్యం ఆటవెలది; 10వ పద్యం చంపకమాల.

ఛందోవేత్తలు ఏర్పరచిన లక్షణాలను జాషువా అనుసరించారు. 'బొక్కెడు బువ్వ' పూప వయస్సు; గర్భ దరిద్రుడు; ఈక్కల కష్టము; చెమ్మట లోడ్చుట; మెతుకు విదుల్చుట. మొదలైన జాతీయాల నుపయోగించి జాషువా కవి దేశీయమైన పలుకుబడులలో తమ నేర్పు చూపారు.

### అభ్యాసం – 1

'కష్టజీవి' లో జాషువా ప్రతిపాదించిన సామాజికాభ్యుదయాంశాలను సమీక్షించండి ?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 7.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలోని అభ్యుదయ కవిత్వ దృక్పథానికి చెందింది ఈ పాఠ్యం.
- ఈ పాఠ్య రచయిత జాషువాలోని సామాజిక అనాచారాలమీది తీవ్ర నిరసనభావం ఈ పద్యాల్లో ప్రస్ఫుటమౌతున్నది.
- సహజీవన విధానాన్నీ, సర్వమానవ సమానత్వాన్నీ ప్రబోధించే మానవతావాద దృక్పథం ఈ పద్యాల్లోని సిద్ధాంతం.
- సామాజిక స్పృహతో నేటి సమాజంలోని అస్పృశ్యతా గుణానికి పరిష్కారాన్ని స్పష్టంగా నిర్దేశించక పోయినా, ఆ దుస్సంప్రదాయాన్నీ తీవ్రంగా ఖండించడం ద్వారా ఈ పాఠ్యంలో అభ్యుదయ దృష్టిని ప్రదర్శించారు కవి.

## 7.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

జాషువా కవిత్వం ప్రతిపాదించే సామాజికాంశాలు ఏవి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

జాషువా కవితా గుణాలను సమీక్షించండి ?



BRAOU

## 7.6 ఆకళింపు ప్రశ్నలు

1. హరిజనుల దీన స్థితిని గురించి జాషువా కంటె పూర్వులు కూడా కవిత్వంలో వర్ణించారు. వాటిలో కొన్నింటిని చదవండి.

**గురజాడ అప్పారావు**

"మలిన దేహుల మాల లనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మ మ
ధర్మ ధర్మంబే.
మంచి చెడ్డలు మనుజులందున
ఎంచి చూడగ రెండె కులములు
మంచియన్నది మాలయైతే
మాలనే యగుదున్.

– లవణరాజు కల (1910)

**మంగిపూడి వేంకటశర్మ**

"పంచములార! యంతరిత భవ్యగుణోత్కరులార! గర్భిలో
దంచిత శక్తులార! యసమర్థులె మీరలు! గొర్రె మందలో
వంచితమై చరించు నల వ్యాఘ్ర కిశోరము రీతి బూర్తిగా
వంచితులైతి రాత్మ బలవైఖరి నెంచుడు! పేర్కొనుండికన్

– విరుద్ధ భారతము (1915)

**వేంకట పార్వతీశ్వర కవులు :**

"మమత దప్పిన యాతడు మాల గాక
మాట దప్పిన యాతడు మాల గాక
అన్నెమును బున్నెమెరుగని యట్టి మాల
మాలయే? దేవుమెడ పూలమాల గాక

– పంచ మాభినందనము

ఈ పద్యాలలోని భావాలను జాషువా కవి భావాలతో పోల్చి చూడండి.

2. జాషువా జీవిత విశేషాలను తెలుసుకోవటానికి 'నాకథ' (జాషువా స్వీయ చరిత్ర) చదవండి.

**అభ్యాసానికి జవాబు**

సుప్రసిద్ధ కవి జాషువా రచించిన 'గబ్బిలము' కావ్యంలో కథానాయకుడు అరుంధతీసుతుడు, అంటే సంఘంలో పంచమునిగా పరిగణింపబడి బాధలకు గురి అవుతున్న పంచముడు. ఇతడు కష్టజీవి; అమాయకుడు. తనకు లభించిన కొద్ది ధనంతోనే సంతృప్తిపడి జీవనం సాగిస్తున్నవాడు. ఆకటి బాధ తీరక అలమటించిపోతున్నాడు. తనను ఆదుకునే వారెవ్వరూ లేక దిక్కులేనివాడైనాడు.

రఘునాథరాయలు తంజావూరును పరిపాలిస్తున్న కాలంలో భరత భూమికి కడగొట్టు బిడ్డడుగా అంటే 'పంచముడి'గా ఇతడు జన్మించాడు. దారిద్ర్యం చేత అలమటించిపోతున్నా నీతి మార్గం విడువక ఇతడు జీవిస్తున్నాడు. చెప్పులు కుట్టి జీవించటం ఇతని వృత్తి. తమ పాదాలు కందకుండ ఇతని చేత చెప్పులు కుట్టించుకొని సౌఖ్యమనుభవిస్తున్న జనులీతణ్ణి దయతలచటంలేదు. ఏనాడూ తన వృత్తి ధర్మాన్ని మరువని

BRAOU

ఇతని ఋణాన్ని భారత భూమి తీర్చుకోలేదు. వీని రెక్కల కష్టంతో పంటలు పండుతున్నాయి. ఇతడు చెమటోడ్చి ప్రజలకు అన్నం పెడుతున్నాడు గాని ఇతనికి మాత్రం తినటానికి తిండిలేదు.

అంటరాని వాడని యీ లోకం ఇతడి తల మీద బురద పులిమింది. ఆ బురదను ఆకాశ గంగ కూడ కడిగి శుభ్రం చేయ్యలేదు. ఇతడి స్పర్శ సోకితే మైల పడ్డట్టే! త్రిమూర్తులకు గూడ ఇతని మైల సోకితే నైవేద్యం పెట్టటానికి వీలులేదు. పాముకు పాలు, చీమకు పంచదార పెట్టే ఈ లోకం ఇతడిని కాల్చుకుతింటున్నది. పంచముడిగా జన్మించటం తప్ప ఇతడు చేసిన పాపమేమీలేదు. ఈ అభాగ్యుని రక్తాన్ని తాగి దరిద్ర దేవత ఇతని నట్టింట నాట్యం చేస్తున్నది. ఇతని గాలి సోకితేనే 'నాల్గు పడగల హైందవ నాగరాజు' కసరి బుసకొట్టుతున్నాడు. సంతానాన్ని గూడ తన వంటి పుట్టు బానిసలను చేయటం ఇష్టం లేక ఇతడు పెళ్ళి చేసుకోవటం మానుకొన్నాడు.

దేవతల బొమ్మలకు పెళ్ళిళ్ళు చేయటానికి వందలూ వేలూ ఖర్చుపెట్టే జనులు పేదల భిక్షాపాత్రలలో మెతుకు విదల్చరు. ముప్పైమూడు కోట్ల దేవతలు నైవేద్యంకోసం ఎగబడిన ఈ భారత భూమిలో పేదల ఆకలి తీరదు.

ఈ కష్టజీవి దుస్థితి తీరటానికి సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని జాషువా భావించారు. హిందూ మతంలో మూఢనమ్మకాలూ, విగ్రహారాధనలూ సంఘానికి తీరని హానిచేస్తున్నాయని ఆయన తలచారు. అస్పృశ్యునిగా బాధలనుభవిస్తున్న ఒక అభాగ్యుని దీన గాథను 'కష్టజీవి' లో వర్ణించారు. సంఘాన్ని విమర్శించటంలో జాషువా కవి వ్యంగ్యాన్ని పదునైన ఆయుధంగా ఉపయోగించారు. "భరతోర్వరకుం గడగొట్టు బిడ్డడు; మూడు మూర్తులకును గూడఁ గూడు లేదు - పామునకుఁబాలు చీమకఁబంచదార మేపుకొనుచున్న కర్మభూమి; ధర్మదేవతకుఁగూడ నులికి పడు జబ్బు; నాల్గుపడగల హైందవ నాగరాజు ముప్పది మూఁడు కోట్ల దేవతలెగవడ్డ దేవము" మొదలైన పదబంధాలలో జాషువా కవి ప్రయోగించిన పదునైన వ్యంగ్యం ద్యోతకమౌతుంది.

సాంఘిక విప్లవాన్ని కోరిన జాషువా ఆధునికాంధ్ర కవులలో ప్రముఖంగా పేర్కొనదగినవారు. అంటరాని తనం ఘోరమైన దురాచారమని నొక్కి చెప్పే 'గబ్బిలము' కరుణరసభరితమైన ఉత్తమ కావ్యం.

**- డాక్టర్ కె. రామమోహన్ రాయ్**

BRAOU

# భాగం 8 పానశాల

విషయక్రమం


8.0 ఉద్దేశం
8.1 ప్రవేశిక
8.2 సూచనలు
8.3 పాఠ్యం
  8.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  8.3.2 వ్యాఖ్యానం
  8.3.3 విశేషాంశాలు
అభ్యాసం – 1
అభ్యాసం – 2
8.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
8.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
8.6 ఆకలింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 8.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- ఉమర్ ఖయ్యాం రుబాయిల్లోని తాత్త్వికత.
- తెలుగు అనువాదంలోని స్వతంత్రతా గుణం.
- తాత్త్విక కవిత్వం భావకవిత్వంలో ఒక [illegible]

BRAOU

## 8.1 ప్రవేశిక

ఆధునికాంధ్ర మహాకవుల్లో ప్రముఖ భావ కవిగా, కవికోకిలగా ప్రఖ్యాతి వహించిన గాంధేయవాది దువ్వూరి రామిరెడ్డిగారు రచించిన 'పానశాల' కావ్యంలోనిది ఈ పాఠ్యాంశం. ఇది ఉమర్ ఖయ్యామ రుబాయీలకు అనువాదమే అయినా ఆంధ్ర భాషలోని తీపితనాన్నీ, రాష్ట్రీయతాగుణాన్నీ రంగరించుకొని స్వతంత్ర కావ్యస్థాయిలో ఆవిర్భవించిన ఒక మధురకృతి. ఈ కవికి కీర్తి పతాకగా చిరస్థాయిగా నిలిచిపోయిన అంశాన్ని ఈ భాగంలోని ఈ పాఠ్యం అధ్యయనంద్వారా మీరు గ్రహిస్తారు.

## 8.2 సూచనలు

ఈ పాఠ్యం చదివేముందు విద్యార్థులు రామిరెడ్డిగారి "గులాబితోట, పండ్లతోట" అనే అనువాద కావ్యాలను కూడా చదవాలి. దానివల్ల రామిరెడ్డిగారి అనువాద పద్ధతీ, నైపుణ్యం అవగాహనకు వస్తాయి. వాటితో పాటుగా రాయప్రోలు సుబ్బారావు "మధుకలశము", దాశరథి, ఎల్. మాలకొండయ్య వంటి అద్యతన కవులు అనువదించిన రుబాయీలు కూడా పరిశీలించి, ఈ పాఠ్యం అధ్యయనానికి బలపరచుకోవాలి.

## 8.3 పాఠ్యం

లెమ్మోయీ మదిరా తపస్వి! దిశ లాలేఖ్యంబుగా మాఱెఁ; బా
త్రమ్మున్ నింపుము గోస్తనీరసమునన్ రాగోదయ శ్రీలు పైఁ
గ్రమ్మన్ జీవిత భాజనంబు పరిపూర్ణం బౌటకున్ మున్నె; కా
లమ్మోనన్న రవంబు వింటి మధుశాలన్ మొన్నలేఁ బ్రొద్దునన్ 1

అరుణుఁడు యామినీ విభవమంతయు గెల్చి జయాంకమట్లు క
ర్బుర రమణీయ కేతనముఁ బూర్వదిశం జయికెత్తెలెమ్మ; ని
ద్దుర విడి తమ్మి పూపులటు తొంగలి ఱెప్పల వెత్తిచూడు; నీ
వెఱుఁగవొ తొయ్యలీ, చిరము నియ్యలఁ గన్నులు మూయ కట్టడన్ 2

పారదమట్లు జీవితము పట్టిన నిల్వదు; శీఘ్రగామి; ద్రా
క్షారసమిమ్ము, తాపమునఁ గందెను జిత్తము; జాగరూక సం
చారము నిద్రదౌలకు వశంబయి రూపఱు; యౌవనంపు టం
గారము నీటఁ జల్లపడుఁ; గన్నుల నెత్తుము, లెమ్ము వెచ్చెలీ. 3

పొలముల పూల గాలి వలపుల్ కలఁబోయుచు వీచె, గాజు గి
న్నెలఁ జీఱు చేదు పానకము నింపుము; నశ్వరమైన ఈ స్థితిం
దెలియును యీ క్షణం బెరపుదెచ్చిన సొమ్మని; జాఱఁ బుచ్చినం
గలికి, మఱెప్పుడిట్టి తరి క్రమ్మఱ రాదు; నిజమ్ము; నమ్ముమా ! 4

కనుగొమ్మా నినుబోలె రాగవతియై కాంతిల్లెఁ బూర్వాశ, మో
మున నీలాలక రేక లొత్తుచు, నిశాభుక్తావశేషాసవం
బును సీసాలకు నింపి యొక్క సరకంబున్ ముంచి యందిమ్ము; ద
క్కని యీ రేపటి మాటలేటి కనుభోగ్యంబైన నేఁడుండఁగన్. 5

### 8.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| 1. మదిరాతపస్వి | = | మద్యపానమే తపస్సుగా భావించే వాడా ! |
| ఆలేఖ్యము | = | చిత్ర పటము |
| పాత్రమ్మున్ | = | పానపాత్రను |
| గోస్తనీరసమున్ | = | ద్రాక్షారసముతో |
| రాగోదయశ్రీలు | = | ప్రేమ సంపదలు |
| జీవిత భాజనంబు | = | జీవితమనే పాత్ర |
| రవంబు | = | ధ్వని |
| మధుశాల | = | పానశాల |
| 2. అరుణుడు | = | సూర్యుడు |
| యామినీ విభవము | = | రాత్రి వైభవం |
| జయాంకము | = | జయానికి చిహ్నం |
| కర్బుర రమణీయ | = | బంగారు కాంతులతో సొగసైన |
| కేతనము | = | జెండా |
| పూర్వదిశన్ | = | తూర్పు దిక్కున |
| తొంగలి రెప్పలు | = | వాలిన రెప్పలు |
| తొయ్యలి | = | స్త్రీ |
| చిరము | = | ఎక్కువ కాలం |
| కట్టడన్ | = | నియమాన్ని |
| 3. పారదము | = | పాదరసం |
| శీఘ్రగామి | = | తొందరగా కదలిపోవునది. |
| అంగారము | = | నిప్పు |
| రూపఱు | = | నాశనమై పోవు |
| దౌలతు | = | ప్రాభవం |

BRAOU

4. నశ్వరమైన = నాశనమై పోవునట్టి
తరి = సమయం
కలికి = స్త్రీ

5. పూర్వాశ = తూర్పు దిక్కు
నీలాలక రేఖలు = నల్లని ముంగురులు
నిశాభుక్త = రాత్రి తాగగా
అవశేష ఆసనంబును = మిగిలిన పానీయాన్ని
సరకంబునన్ = పాన పాత్రలో

### 8.3.2 వ్యాఖ్యానం

అపూర్వమైన తాత్త్విక చింతనతో, అపురూపమైన కవిత్వంతో జగద్విఖ్యాతి గడించిన గొప్ప విజ్ఞాని ఉమర్ ఖయ్యాం. ఈతని రుబాయిలు అనువాదం పొందని నాగరక భాష లేదనటం అతిశయోక్తి కాదు.

పారసీక దేశంలో నైషాపూర్ అనేచోట క్రీ.శ. 1048 లో ఉమర్ ఖయ్యాము జన్మించాడు. అపరిమితమైన విజ్ఞానము, సాటిలేని జ్ఞాపకశక్తి గల ఖయ్యాం కీర్తి పారసీ దేశపు ఎల్లలు దాటి అన్ని దిక్కులా వ్యాపించింది. 'ఖయ్యాము' అనేది తఖల్లుసీ (కలంపేరు). అసలు పేరు గియాసుద్దీన్ అబుల్ ఫతేహ్ ఉమ్రమిన్ ఇబ్రహీమ్. ఖయ్యాం సహాధ్యాయి అయిన ఒక వజీరు ఖయ్యాముకు గొప్ప ఉద్యోగం ఇవ్వజూపినా అతడు తనకు ఉద్యోగాపేక్ష లేదని చెప్పాడు. ఆ వజీరు ఖయ్యాముకు 1200 తోమానులు ఆదాయం వచ్చే జాగీరును నిషాపూర్‌లో ఇచ్చాడు.

ఖయ్యాముకు బాల్యంనుండీ గణితశాస్త్రంలో ప్రావీణ్యం హెచ్చుగా ఉండేది. జ్యోతిశ్శాస్త్రంలో కూడ ఆయనకు గొప్ప పాండిత్యం ఉన్నది. అప్పటి పంచాంగాన్ని సంస్కరించటానికి ఆ దేశపు రాజు ప్రసిద్ధ జ్యోతిష్కులను సమావేశ పరచినపుడు, ఖయ్యాము వాళ్ళకు నాయకత్వం వహించి ఆ సంస్కరణను ప్రశంసనీయంగా నెరవేర్చాడు.

ఖయ్యాం అరబ్బీ భాషలో అక్షరగణితం రచించాడు. ఇదిగాక రసాయనశాస్త్రం, యూక్లిడ్‌జామెట్రీకి వ్యాఖ్యానం - ఒక తత్త్వశాస్త్రం, రుబాయత్ అన్నీ కలసి తొమ్మిది గ్రంథాలు రచించాడు.

నిజాముల్ ముల్క్ ప్రసాదించిన జాగీరులవల్ల, మాలిక్‌షా ఆదరణవల్ల ఖయ్యాము మధ్యవయస్సు సుఖంగా గడిచింది. రాజాస్థానంలో పండితగోష్ఠులలో, సరససల్లాపాలాడుతూ, శిష్యులకు పాఠాలు చెపుతూ, ప్రకృతి రామణీయకాన్ని తనివార గ్రోలుతూ, ఇష్టం ఉన్నప్పుడు ఒక్కొక్క రుబాయి శిష్యులకు ఆశువుగ చెపుతూ, సాకీ అందించే ద్రాక్షాసవం సేవిస్తూ, పచ్చికబయలుల విహరిస్తూ, సెలయేటిపాటలను ఆలకిస్తూ, వనభోజనాలారగిస్తూ, వెన్నెల గోష్ఠులు నలుపుతూ నిర్విచారంగా శాంతంగా జీవితం గడిపాడు.

మాలిక్‌షా మరణానంతరం పారసీదేశం అంతఃకలహాలతో చిన్నాభిన్నమయింది. చివరిదశలో ఖయ్యాం నిరాశ్రయుడై సామాన్యునిగానే క్రీ. శ. 1123 లో నిషాపూరులో మరణించాడు; తన గోరీపైన వృక్షాలు, లతలూ, పువ్వులూ, ఆకులూ రాల్చాలనీ, అక్కడ ఏడాదికి రెండుమార్లు వసంతం రావాలనీ ఆయన కోరుకున్నాడు. నిషాపూర్‌లో ఖయ్యాం గోరీ అటువంటి సుందర ప్రదేశంలోనే ఉన్నది.

ఖయ్యాం రచించిన రుబాయీలు వేమన పద్యాల వంటివి. తత్త్వాలు, నీతులు వేటికవే ముక్తకాల్లోలాగ ఉంటాయి. రుబాయత్‌లో ఒకటి, రెండు, నాలుగు పాదలకు అంత్యనియమం ఉంటుంది. ఖయ్యాం రుబాయిలలో పునరుక్తి ఎక్కువగా కన్పిస్తుంది. పారసీక కవులు పునరుక్తిని దోషంగా పరిగణింపరు.

ఖయ్యాం రచించిన రుబాయీలు ఎన్నో సరిగా తెలియవు. నూటేభై మొదలు వేయి వరకు పెరిగాయి. వీటిలో కొన్ని ఇతరులు రచించి ఖయ్యాం పేరుపెట్టి ఉండొచ్చు.

క్రీ.శ. 1859 లో ఎడ్వర్డ్ ఫిట్‌జెరాల్డు రుబాయత్‌లను ఇంగ్లీషులోకి అనువదించాడు. దీని ద్వితీయ ముద్రణ వెలువడేటప్పటకి ఉమర్ ఖయ్యాం ఖ్యాతి పాశ్చాత్య దేశాలకు గూడ పాకింది.



BRAOU

ఖయ్యాం కాలం నాటికి సూఫీ మతం బాగా వ్యాపించి ఉంది. సూఫీ మత పరిభాషలో 'ద్రాక్షాసవం'_ బ్రహ్మానందానికి సంకేతము. ఖయ్యాము వర్ణించిన 'ద్రాక్షాసవము' భౌతిక సుఖాలనే సూచిస్తుంది. ఖయ్యాం మతం చిత్రమైనది. ఈశ్వరుడున్నాడని, ఆత్మ లేదని ఆయన బోధించాడు. "దృష్టి కాలబద్ధము, విధి అనివార్యము, గతం కన్నులకు కట్టదు, భవిష్యదర్థము సంశయాంధసంవృతము. వర్తమాన మొక్కటే అవశ్యభోగ్యము. స్వర్గ నరకాలు లేవు. మనిషికి ఆనందదాయకాలయిన వస్తువులే స్వర్గంలో ఉన్నట్లు ఊహింపబడుతున్నాయి. వాటిని యీ లోకంలోనే అనుభవించు' అనేది ఖయ్యాము బోధనల సారాంశం. పచ్చికబయళ్ళు, సెలయేళ్లు, ఒక్క క్షణం విశ్రాంతి, అచ్చరవంటి నెచ్చెలి, రసాంకితకావ్యం, మదిర ఉంటే పరలోకంతో పనిలేదని ఖయ్యాము భావించాడు.

### రుబాయత్ అంశాలలో పానశాల

ఎడ్వర్డ్ ఫిట్‌జెరాల్డ్ అనువాదం ప్రసిద్ధి పొందిన తర్వాత తెలుగు భాషలోకి దీన్ని అనువాదం చేయాలనే కోరిక మొట్టమొదటిసారిగా రాయప్రోలు సుబ్బారావుగారికి కలిగింది. ఫిట్‌జెరాల్డు ఇంగ్లీషు అనువాదానికి తెలుగు అనువాదాన్ని శ్రీ రాయప్రోలు 'మధుకలశమ్' అనే పేరుతో 1924 లో 'భారతి' పత్రికలో ప్రకటించారు. వీరు చంపక, ఉత్పలమాలలను, శార్దూల మత్తేభాలను ఉపయోగించి ఉమర్‌ఖయ్యాం రుబాయత్‌ను తెనుగుచేశారు.

శ్రీ దువ్వూరి రామిరెడ్డి పారసీ రాష్ట్ర భాషలోని రుబాయత్ గ్రంథాన్ని 1926 పానశాల పేరుతో ఆంధ్రీకరించి 1928 లో 'భారతి' లో ప్రకటించారు. "పారసీ కన్న శ్రావ్యమయి పల్లవ కోమలమై సుధారసంబూరెడు" తెనుగు నుడికారంలో 'పానశాల' రమణీయంగా రూపొంది హృదయుల మెప్పు పొందింది. ఆ తర్వాత రుబాయత్ కి ఎన్నో అనువాదాలు వెలువడ్డాయి.

మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి, రామచంద్ర అప్పారావు, డాక్టరు పి. శ్రీదేవి, గుడిపాటి వెంకటచలం మొదలయినవారు ఇంగ్లీషు నుండి రుబాయత్‌ను అనువాదం చేశారు. పారసీ భాషనుండి శ్రీ బూర్గుల రామకృష్ణారావు ఉమర్ ఆలీషా కవి 'రుబాయత్' ను తెలుగులోకి అనువదించారు. శ్రీ ఆదిభట్ల నారాయణదాసు రుబాయత్‌ను పారసీనుండి అచ్చతెలుగులోకి, సంస్కృతంలోకి అనువదించారు. ఎన్ని అనువాదాలు వచ్చినా తెలుగులో 'పానశాల' కు వచ్చిన ప్రసిద్ధ మరి దేనికీ రాలేదు.

శ్రీ దువ్వూరి రామిరెడ్డి 'రామిరెడ్డి' కవిగా ప్రఖ్యాతులయ్యారు. అసలు అనువాదం అంటేనే కత్తిమీది సాము. ఎంత జాగ్రత్త పడినా మూల భాషలో సొగసులు అనువాదంలోకి అన్నీ రావటం కష్టం. రంగురంగుల తివాచీని తిరగవేసి చూపినట్లు ఒక భాషలో రసవంతమైన గ్రంథాన్ని మరొక భాషలోకి అనువదించినప్పుడు దాని సొగసు కన్పించదు. ఉమర్ ఖయ్యాము ఉజ్జ్వలమైన భావుకతకు రామిరెడ్డిగారి రసవంతమైన అనువాదం మేలు బంతిగా నిలిచింది; తెలుగుతోటలలో పచ్చికబీళ్ళలో పానశాలా ప్రతిష్ఠలు గావించి రసికాంధ్ర ప్రీతి గావించింది.

### దువ్వూరి రామిరెడ్డి జీవిత కవితా విశేషాలు

శ్రీ దువ్వూరి రామిరెడ్డి (1895 - 1947) నెల్లూరు జిల్లా గూడూరులో క్రి. శ. 1895 లో జన్మించారు. లక్ష్మీదేవమ్మ సుబ్బారెడ్డి వీరి తల్లిదండ్రులు. శ్రీ రామిరెడ్డి గూడూరు, పెమ్మారెడ్డి పాళెంలలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. తండ్రి చనిపోవటంచేత చిన్న వయస్సులోనే చదువుకు స్వస్తి చెప్పారు. "థర్డ్ ఫారం గ్రాడ్యుయేట్" గా మిగిలిపోయారు. కాని స్వయంకృషితో రామిరెడ్డి పెక్కు విద్యలు నేర్చుకున్నారు. "పాఠశాలలో నేను నేర్చిన విద్య చాల కొద్ది. నన్ను గృహ విద్యాలయ శిక్షితుడనుట యొప్పగును (a product of home university). నా వృత్తి వ్యవసాయము. ఇష్ట విషయములు విజ్ఞాన శాస్త్రములును, మెకానికల్ ఇంజనీరింగ్‌యును, కవిత్వం రచనను ప్రకటించుటకు ముందు కొన్ని నాళ్లు నేను చిత్రలేఖనమును, మృత్తి విగ్రహ నిర్మాణమును చేయుచుంటిని" అని రామిరెడ్డిగారే తెలిపారు (కవికోకిల డైరీలు). జోతిష్యం, వశీకరణం ఆయన అభిమాన విద్యలు. కెమేరా, రేడియో వంటి ఆధునిక యంత్రాలను ఆయన స్వయంగా తయారుచేశారు. చలన చిత్రాలకు రచన, సినేరియో దర్శకత్వం నెరపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ రామిరెడ్డికి ఆయన 19వ ఏట కవిత్వం రచించాలనే కోరిక కలిగింది. తొలి దశలో పద్య విద్యను సాధన చేస్తూ ఆయన "రసిక జనానందము స్వప్నాశ్లేషము, అహల్యానురాగము,

కృష్ణ రాయబారము, ఋతుసంహారము, పుష్ప బాణ విలాసము" అనే కావ్యాలు రచించారు. వీటిలో కొద్ది భాగం మాత్రమే వెలుగులోకి వచ్చాయి.

తమ తల్లిగారి వంశానికి చెందిన 'నంజారమ్మ' అనే త్యాగశీలి చరిత్రను పద్య కావ్యంగా రచించి రామిరెడ్డి పండితుల మెప్పు పొందారు. కృషీ వలుల జీవితంలో కష్ట సుఖాలను చిత్రించే 'కర్షకవిలాసము' అనే నాటకాన్ని ఆ తర్వాత రచించారు. శ్రీ రామిరెడ్డి రచించిన 'వన కుమారి' కావ్యం విజయనగర మహారాజా స్థానంలో జరిగిన కావ్యస్పర్థలో బహుమతి పొందింది.

"కృషీవలుడు; జలదాంగన; యువక స్వప్నము; కడపటి వీడుకోలు; ఫలిత కేశము"; 'కవి; రవి' వీరు రచించిన కావ్యాలు. ఇంకా "కుంభరాణా; మాధవ విజయము; కాంగ్రెసువాలా; సీతా వనవాసము" అనే నాటకాలు గూడ వీరు రచించారు. పారసీ భాష నుండి పానశాలనేగాక "గులాబి తోట; పండ్ల తోట" అనే అనువాద కావ్యాలనుగూడ రచించారు.

రామిరెడ్డిగారి రచనలలో "పానశాల, కృషీవలుడు, ఫలితకేశము" మిక్కిలి ప్రసిద్ధి పొందాయి.

శ్రీ రామిరెడ్డి ఇంగ్లీషుభాషలో కూడా కవిత్వం రచించారు. వీరి ఇంగ్లీషు కవిత్వాన్ని జేమ్స్. జి. కజన్సీ అనే ఆంగ్ల పండితులు, కళా విమర్శకులు మెచ్చుకున్నారు. ఇంకా రామిరెడ్డిగారనేక సారస్వత వ్యాసాలు రచించారు. ఈ గ్రంథాలన్నీ కవి కోకిల గ్రంథావళి శీర్షిక కింద అచ్చు అయ్యాయి.

పానశాల 'రామిరెడ్డి'గారి కీర్తిని చిరస్థాయిగా నిల్పగల అనువాద కావ్యం.

జీవిత సౌఖ్యాలను అనుభవించటానికి ఉన్న కాలం స్వల్పమేననీ, ఆలసింపక ఆ సౌఖ్యాలను పొందమనీ ఉమర్‌ఖయ్యాం ఉద్బోధిస్తున్నాడు.

"ఓయీ మదిరా తపస్వీ! లే! దిక్కులు చిత్ర పటాలుగా మారినవి. ద్రాక్షా రసంతో పానపాత్రను నింపుకో! జీవితపు పాత్రలో ప్రేమ సంపదలు నిండటానికి ముందే కాలం పూర్తి అయిపోతున్నదనే హెచ్చరికను మొన్న ప్రాతఃకాలంలో పానశాలలో విన్నాను" అని ఖయ్యాము జనులను మేల్కొల్పుతున్నాడు.

"సూర్యుడు రాత్రి వైభవాన్నంతా తోలిచి, విజయ చిహ్నంగా బంగారు కాంతులు వెదజల్లే పతాకాన్ని తూర్పు దిశలో పైకి ఎత్తాడు; ఓ యువతీ! కమ్మ పూవుల వంటి నీ వాలిన కనురెప్పలను పైకెత్తిచూడు. చిర కాలం కన్నులు మూసుకొని వుండటానికి మిటలేని కట్టడిని నీవెరుగవా?" బ్రతుకు తాత్కాలికమైనదనీ ఎక్కువ కాలం నిద్రలో గడిపి కాలం వ్యర్థం చెయ్యవద్దనీ ఉమ్మర్‌ఖయ్యాం హెచ్చరిస్తున్నాడు.

"జీవితం పాదరసంగా పట్టుకొని ఆపితే ఆగేది కాదు. త్వరగా గడచిపోతుంది. తాపంతో మనస్సు కందింది. నెచ్చలీ! ద్రాక్షారసం ఇవ్వు. చైతన్యవంతమైన కాలమంతా నిద్రాదేవి వశమై నాశనమైపోతుంది. యౌవన జ్వాల చల్లబడుతుంది. లే! కళ్ళువిప్పి చూడు" అని సాకీతో అంటున్నాడు.

పొలాలలో నుండి వలపులు కలబోస్తూ పూలగాలి వీచింది. గాజుగిన్నెల్లో చిరు చేదు మద్యం నింపు. ఈ శరీరస్థితి నశించి పోయేదే. ఈ క్షణం ఎరుపు తెచ్చిన సొమ్మని తెలుసుకో. ఈ క్షణాన్ని జారవిడిస్తే మరెప్పుడూ ఇలాంటి సమయం తిరిగిరాదు. నా మాట నిజం, నమ్ము" అని ఖయ్యాము జీవిత సౌఖ్యాలను అనుభవించమని ప్రబోధిస్తున్నాడు.

"నెచ్చలీ! నీవలె అనురాగవతియైన తూర్పు దిక్కు కాంతివంతమయింది. ముఖంపైన నల్లని ముంగురులు కదలాడుతూ ఉండగా, రాత్రి సేవించిగా మిగిలిన పానీయాన్ని ఒక పానపాత్రలో ముంచి అందివ్వు. అనుభవించటానికి యోగ్యమైన ఈ రోజు ఉండగా, దక్కని రేపటి మాటలెందుకు?" అని ఖయ్యాము జీవితానందాన్ని తొందరగా అనుభవించమని ఉద్బోధిస్తున్నాడు.

**8.3.3 విశేషాంశాలు**

పానశాల తత్వం : 'పానశాల'లోని పై పద్యాలలో రామిరెడ్డిగారు ఉమర్‌ఖయ్యాం తత్వాన్ని చక్కగా తెలుగుచేశారు. జీవితపుపాత్ర ప్రేమ సంపదలతో నిండటానికి కాలం తక్కువగా ఉన్నదనీ, జీవనపాత్రను



BRAOU

ద్రాక్షాసవంతో నింపి అనుభవించమనీ ఖయ్యాం ప్రబోధం. జీవితం పాదరసం లాగ జారిపోయే స్వభావం గలదనీ, పట్టుకుని ఆపితే ఆగదనీ చెప్పాడు. కాబట్టి యౌవనాన్ని సార్థకం చేసుకొమ్మని హెచ్చరించాడు. నశించిపోయే ఈ శరీరం మరల తిరిగిరాదనీ, ఈ క్షణమనేదే ఎరువు తెచ్చిన సొమ్మనీ, ఈ క్షణాన్ని వ్యర్థం కానివ్వక ఆనందించమనీ ఆయన ఉద్బోధించాడు. దక్కని రేపటి కోసం ఈ రోజును వ్యర్థం చేసుకోవద్దనీ ఖయ్యాం హెచ్చరించాడు.

**పానశాల రచనా పద్ధతి**

రుబాయీలను ఆంధ్రీకరించబూనుకున్న రామిరెడ్డి మూలాన్ని యథాతథంగా అనువదించ దలచలేదు. "నా ఆంధ్రీకరణము మూలమునకు టీకవలె నుండదు, తిక్కన శ్రీనాథుడు మున్నగు అనువక్తలు వహించిన స్వాతంత్ర్యమును నేనును వహించితిని. అట్లనుట వలన నా తర్జుమా మూలమున కంటె భిన్నముగ నుండునని చెప్పుటకాదు. పారసీక జాతీయములలో ప్రకటింపబడిన భావము తెలుగులో అట్లే స్ఫురించుటకు అవశ్యకములైన మార్పులను రసపోషణమునకు వలయు కూర్పులను కావించితిని" అని 'పానశాల' ఉపోద్ఘాతంలో తెలిపారు.

"జలజల మంజులార్భటుల జార్చొను నీ సెలయేటి కోనలన్ మొలచిన లేత పచ్చికల మోటుగ గాలిడ బోకు"; "గతము గతంబె యెన్నటికి గన్నులగట్టదు", "జీవిత సార్థవాహము విచిత్రగతిం బయనించు"; "అంతములేని యీ భువనమంత పురాతన పాంథశాల"; "మరణ భయంబు నాకు నణుమాత్రము లేదు; మదీయ జీవ సంభరణ భయంబె"; "పరమొ గిరమ్మొ దాని తలపై నొక దోసెడు మన్ను చల్లి సుందరి మెలుగుంగపోలములు దాచిన ముద్దులు దొంగిలించి సంబరముగ శీధువానుము" మొదలైన పద్యాలలో రామిరెడ్డి రచన మిగిలిన అనువాదకుల కంటె ప్రశస్తమై రాణకెక్కింది.

నాలుగైదు రుబాయిలలో విపులంగా వదులుగా ఉన్న భావాన్ని ఒక చిక్కటి పద్యంలో కుదించి రామిరెడ్డి 'పానశాల'ను మిక్కిలి ఆస్వాదయోగ్యం చేశారు.

'పానశాల'లో పద్యాలు ధారాశుద్ధితో శ్రావ్యంగా ఉంటాయి. 'రుబాయి' తేటగీతి వంటిదని రామిరెడ్డిగారు పేర్కొన్నారుగాని 'పానశాల'లో వృత్తాలే ఎక్కువగా రాశారు. 'పానశాల' మొదటిపద్యం శార్దూలవృత్తం; రెండవది చంపకమాల, మూడవది ఉత్పలమాల, నాల్గవది చంపకమాల, ఐదవది మత్తేభవృత్తం. ఒకే భావాన్ని విపులీకరించి చెప్పే రుబాయీలను ఒక పద్యంలో కుదించటంవల్ల రామిరెడ్డిగారికి వృత్తరచన అనువుగా తోచింది.

"మదిరా తపస్వి; జీవిత భాజనంబు; నిద్రదొంగలు; యౌవనంపుటంగారము" మొదలైన పదబంధాలు రామిరెడ్డి భావనాశక్తికి చక్కని నిదర్శనాలు.

## అభ్యాసం – 1

'రుబాయత్' అంటే ఏమిటో వివరించండి?

## అభ్యాసం – 2

పానశాల' ఆధారంగా ఉమర్‌ఖయ్యాం కవిత్వతత్వాన్ని నిరూపించండి?

## 8.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో అనువాద కవిత్వ పద్ధతికి చెందిన రచన ఇది.
- అనువాదమైనా భావకవిత్వ పద్ధతిలో ఆంధ్రభాషా సంప్రదాయాలను గుబాళిస్తూ, స్వతంత్ర కావ్యస్థాయిలో వెలువడిన 'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి 'పానశాల' కావ్యంలోనిది ఈ పాఠ్యం.
- ఉమర్‌ఖయ్యామ్ రుబాయీలకు రాయప్రోలు నుండి నేటివరకూ అనేకుల అనువాదాలు వచ్చాయి. వాటిన్నిటిలో ప్రముఖస్థానం వహించింది 'పానశాల'.
- ప్రణయ కవిత్వ పద్ధతిలో, సూఫీతాత్విక దృక్పథంతో ఆవిర్భవించిన ఉమర్ రుబాయీలకు, ఆయన భావాలకు ఒక అందమైన కవితా దర్పణం, దువ్వూరి అనుసృజనమైన 'పానశాల'.

## 8.5 మాదిరి పరీక్షాప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

'పానశాల' పాఠ్యంలోని కవిత్వ గుణాలను సమీక్షించండి ?

BRAOU

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

దువ్వూరి రామిరెడ్డి కవితా విశేషాలను వివరించండి ?

## 8.6 ఆకళింపు ప్రశ్నలు

ఫిట్ జెరాల్డ్ అనే కవి చేసిన ఆంగ్లానువాదాన్ని అనుసరించి రాయప్రోలు సుబ్బారావు గారు 'మధు కలశము' అనే తెలుగు అనువాదాన్ని కూర్చారు. అందులో నుంచి తీసిన ఈ కింది పద్యాలను చదవండి.

లెమ్ము! నిశాంకముండలు తలిన్ పడగా విసరెన్ ప్రభాతమం
దమ్ముల దిఙ్మణిన్ చకిత తారకలావల బాఱ, కాంతిసూ
త్రమ్ముల యుచ్చులొడ్డెను సుతారపు తూరుపు వేటకాడుర
మ్యమ్మగు పాదుషా కనకహర్మ్య శిఖాకలశాలిచుట్టునన్.

చదలనుషః కుమారి చెయిచాయలు తోపగ కల్వరించుచున్
మెదలక యాలకించితి సమీప సురాభవనమ్ము నందిటుల
నిదురలు మాని మేలుకొని యింపుడు పాత్రలు చిన్నలార! త
త్పదమల జీవనార్ద్రి మధుధారలు ఎండకమున్నె బుంగలన్.
ఆ మధుశాల ముందట ప్రియాన నిలంబడి కోడి కూయగా

నీమెయి చప్పటుల్ చరచి రెండుల కూరక ఆలసింత్రు రా
రేమికనౌన్ని యేండ్లకును, ప్రజ్వలిలాసవమెండు నింతలోన్

గత దివస ప్రపీడనయు గాఢ భవిష్యదపోహ భీతియున్
హతమొనరించు ఈ మధువు నందవు గిన్నియనిండ నింపుమీ
వితమున రేపురేపని తపించెద వుగ్మలి! ఎన్ని 'రేపు'లో
క్షితిపయి నిన్నలందు కలిసెన్ గతకాల మయాబ్ధిరాశిలోన్.

ఈ పద్యాలకు రామిరెడ్డిగారి పానశాల పద్యాలలో భావసామ్యముంది. ఈ రెంటికీ ఉన్న రచనా భేదాలను గుర్తించండి.

## అభ్యాసాలకు జవాబులు

1. రుబాయత్‌లు లేక రుబాయీలు అంటే ఆంధ్రసాహిత్యంలోని ముక్తకాలవంటివి. వేటికవి స్వతంత్రంగానూ, మొత్తం కలిపి అనుస్యూతమైన ఆలోచనాధారగానూ రుబాయీలు ఉంటాయి. నీతి, తత్వం, వేదాంతం, లోకపరిశీలనం వంటి అంశాలు రుబాయీల్లో కవితా వస్తువులు. నాలుగు పాదాలతో ఉండే ఈ ముక్తక రచనల్లో ఒకటి, రెండు, నాలుగు పాదాలకు అంత్యప్రాస నియమం ఉంటుంది. మూడవ పాదం స్వచ్ఛందంగా ఉండవచ్చు. పారసీక కవి ఉమర్ ఖయ్యామ్ తన కాలం నాటి సూఫీ మత తత్వాన్నీ, లోకపరిశీలనాన్నీ, మానవజీవన విధానాన్నీ ప్రతిబింబింపజేస్తూ రచించిన కవితలు రుబాయీలు. వీటికే తెలుగుసేత, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి రచించిన అనువాద కావ్యం 'పానశాల'.

2. పారసీదేశ కవిపుంగవుడైన ఉమర్‌ఖయ్యాం 'రుబాయత్' కావ్యాన్ని దువ్వూరి రామిరెడ్డి 'పానశాల' పేరుతో అనువదించారు. ఉమర్ ఖయ్యాం క్రీ.శ. 1048లో పారసీక దేశంలోని నైషాపూరులో జన్మించి క్రీ.శ. 1122లో అక్కడే మరణించాడు. ఆ కాలంలో పారసీ దేశంలో 'సూఫీమతం' ప్రబలంగా ఉండేది. సూఫీ తత్వాన్ని తిరస్కరించి ఖయ్యాం పరలోక సౌఖ్యాలను నమ్ముకొని ఇహలోక సౌఖ్యాలను జారవిడుచుకోవద్దనే నూతన తత్వాన్ని ప్రచారం చేశాడు.

   ఉమర్‌ఖయాం గొప్ప విజ్ఞాని, గణిత శాస్త్రవేత్త, జ్యోతిశ్శాస్త్ర పారంగతుడు. ఇంకా రసాయన శాస్త్రం, యూక్లిడ్ జామెట్రికి వ్యాఖ్యానం, రుబాయత్ మొదలైన తొమ్మిది గ్రంథాలను రచించిన పండితుడు. అప్పటి పంచాంగాన్ని సంస్కరించటంలో తోడ్పడిన మేధావి. 'రుబాయత్' వల్ల ఖయ్యాము ఖ్యాతి ప్రపంచమంతటా విస్తరించింది. మనస్సుకు వినోదం కల్పించటానికి ఖయ్యాము అప్పుడప్పుడూ రచించిన పద్యాలు శిష్యుల దగ్గరా, మిత్రుల దగ్గరా, పండిత గోష్ఠులలో చదివేవాడు. అవి 'రుబాయత్' కావ్యరూపం ధరించాయి.

   "ఓ మదిరా తపస్వీ! లే! దిక్కులు చిత్రపటాలుగా మారినవి. ద్రాక్షారసంతో పానపాత్ర నింపుకో! జీవితపు పానపాత్రను ప్రేమసంపదతో నింపుకోవటానికి ఎక్కువ సమయం లేదు" అని ఖయ్యాం ఆనందాన్ని పొందమని ఎలుగెత్తి చాటాడు.

   "ఓ యువతీ! తుమ్మిపూలవంటి నీ వాలిన కనురెప్పలను పైకెత్తిచూడు. సూర్యుడు రాత్రి వైభవాన్ని గెలిచి, విజయచిహ్నంగా బంగారుకాంతుల్ని వెదజల్లే జండా ఎత్తాడు. ఎక్కువకాలం నిద్రలో గడిపి కాలాన్ని వ్యర్థం చేయవద్దు" అని ఖయ్యాం ఉద్బోధించాడు.

   "జీవితం పాదరసంలాగ జారిపోతుంది. పట్టుకున్నా నిలవదు. చైతన్యవంతమైన కాలమంతా నిద్రాదేవి వశమైపోతుంది. యౌవ్వనజ్వాల నీటితో చల్లబడుతుంది. నెచ్చెలీ! తాపంతో మనస్సు కందింది. ఆలసింపక ద్రాక్షారసం ఇవ్వు" అని ఖయ్యాం జారిపోయే జీవితాన్ని పట్టుకొని ఆపే ప్రయత్నం చేయక ఆనందాన్ని పొందమని చెప్పాడు.

BRAOU

" ఈ శరీరస్థితి నశించిపోయేదే. ఈ క్షణం ఎరువుతెచ్చిన సొమ్మని తెలుసుకో. ఈ క్షణాన్ని జారవిడిస్తే మళ్ళీ తిరిగిరాదు. గాజుగిన్నెల్లో చిరుచేదు మద్యం నింపు. ఆస్వాదించు" అని ఖయ్యాం జీవితపు అశాశ్వతాన్ని గురించి హెచ్చరించాడు.

"అనుభవించటానికి ఈ రోజు ఉండగా రేపటి మాటెందుకు? నెచ్చెలీ! నీవలె రాగరంజితమైన తూర్పుదిక్కు ఎర్రనయింది. ముఖంపైన నల్లని ముంగురులు కదలాడుతుండగా, రాత్రి భుజించగా మిగిలిన పానీయాన్ని ఒక పానపాత్రలో ముంచి ఇవ్వు" అని ఖయ్యాం జీవితానందాన్ని అనుభవించమని తొందర చేస్తున్నాడు.

నమాజులు, పూజలు, వ్రతాలతో రోజులు వ్యర్థం చేయక ఆనందమదిరను ఆస్వాదించమనీ, సౌందర్యాన్ని అనుభవించమనీ ఖయ్యాం బోధించాడు.

"తెలుగుందోటలఁ బచ్చబీళ్ళనురక్తిం బానశాలా ప్రతిష్ఠలు గావించి" రామిరెడ్డి రసికాంధ్రప్రీతి గావించారు. "పారసికన్న శ్రావ్యమయి పల్లవ కోమలమై సుధారసం బూరెడు" తెలుగునుడికారంలో ఖయ్యాం బోధనలను రామిరెడ్డి తెలుగువారికి ప్రతిపాత్రం చేశారు.

– డాక్టర్ కె. రామమోహన్‌రాయ్

# భాగం 9 ప్రతిజ్ఞ

**విషయక్రమం**


9.0 ఉద్దేశం
9.1 ప్రవేశిక
9.2 సూచనలు
9.3 పాఠ్యం
    9.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    9.3.2 వ్యాఖ్యానం
    9.3.3 విశేషాంశాలు
అభ్యాసం – 1
అభ్యాసం – 2
9.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
9.6 ఆకలింపు ప్రశ్నలు
    అభ్యాసాలకు జవాబులు


## 9.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను విశదీకరించగలుగుతారు.

- అభ్యుదయ కవిత్వ ప్రతినిధి శ్రీశ్రీ
- శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక దృక్పథం.
- గేయకవిగా శ్రీశ్రీ.

BRAOU

## 9.1 ప్రవేశిక

భావకవిత్వంగా పొటమరించి, అభ్యుదయ కవిత్వంగా వికసించి విప్లవ కవిత్వంగా పరిణమించిన ఆధునికాంధ్ర కవిత్వం శాఖల్లో రెండవది అభ్యుదయ కవిత్వం. నవీన కవిత్వం దృక్పథాలన్నిటికీ సామాజిక స్పృహే మూలకందం ఐనా, సంఘ ప్రగతికీ, మానవాభ్యుదయానికీ, మార్గాలనూ, సామాజిక దురాచారాలకు పరిష్కారాలనూ ప్రభావవంతంగా ప్రదర్శించింది అభ్యుదయ కవిత్వమే. ఈ ప్రక్రియకు ఆద్యుడూ, నవీన కవిత్వయుగకర్తా ఐన శ్రీశ్రీ రచన ప్రస్తుత పాఠ్యాంశం. ఈ భాగం ద్వారా సామాజికాభ్యుదయానికి శ్రీశ్రీ కవిత్వం ఎలా బాటలు వేసిందోమీరు గ్రహిస్తారు.

## 9.2 సూచనలు

ఈ పాఠ్యం చదివే ముందు విద్యార్థులు బి.ఎ. ప్రథమ సంవత్సరం 'మౌలికాంశాలు' పాఠ్యాంశంలో ఉన్న "ఆధునిక కవిత్వ పరిచయం" అనే భాగాన్ని మరొక్కసారి సమగ్రంగా మననం చేసుకోవాలి. దానిలో ప్రధానంగా – "అభ్యుదయ కవిత్వం – అభ్యుదయ కవిత్వానికి బలమైన ప్రతినిధి శ్రీశ్రీ" అనే శీర్షికలను ప్రత్యేకంగా గుర్తు చేసుకోవాలి. ఆ అధ్యయనాన్ని ప్రస్తుత పాఠ్యం 'ప్రతిజ్ఞ'తో సమన్వయించుకోవాలి.

## 9.3 పాఠ్యం

పొలాలనన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ –
జగానికంతా సౌఖ్యం నిండగ –
విరామ మెరుగక పరిశ్రమించే

బలం ధరిత్రికి బలికావించే
కర్షక వీరుల కాయంనిండా
కాలువకట్టే ఘర్మ జలానికి
ఘర్మజలానికి
ధర్మ జలానికి

ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్!
నరాల బిగువూ
కరాల సత్తువ
వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ,
పరిప్లవిస్తూ
ధనిక స్వామికి దాస్యం చేసే
యంత్రభూతముల కోరలుతోమే,
కార్మిక ధీరుల కన్నులనిండా
కణకణమండే,
గలగల తొణకే
వీలాపాగ్నులకు విషాదాశ్రులకు
ఖరీదు కట్టే షరాబు లేడోయ్!
నిరుపేదాధులై దురదృష్టంచే
చెరసాలలోచిక్కే వాళ్ళూ –
లోహ రాక్షసుల పదఘట్టనచే
కొన ప్రాణంతో కనలేవాళ్ళూ –
కష్టం చాలక కడుపుమంటచే
తెగించి సమ్మెలు కట్టే వాళ్ళూ –
శ్రమ నిష్ఫలమై,
జని నిష్ఠురమై,
నూతిని గోతిని వెదకే వాళ్ళూ –
అనేకులింకా అభాగ్యులంతా,
అనాథులంతా,
అశాంతులంతా,
దీర్ఘశ్రుతిలో, తీవ్ర ధ్వనితో
విప్లవ శంఖం వినిపిస్తారోయ్!
కావున – లోకపుటన్యాయాలూ,
కాల్చే ఆకలి, కూల్చే వేదన
దారిద్ర్యాలూ దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే
బాటలు తీస్తూ,
పాటలు వ్రాస్తూ
నాలోకదలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కల్యాణానికి,
శ్రామికలోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా,
సమర్చనంగా,
త్రిలోకాలలో,
త్రికాలాలలో,
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని
కష్టజీవులకు,
కర్మవీరులకు,
నిత్యమంగళం నిర్దేశిస్తూ
స్వస్తి వాక్యములు సంధానిస్తూ –
స్వర్ణవాద్యములు సంరావిస్తూ –
వ్యధార్త జీవిత యదార్థ దృశ్యం
పునాదిగా ఇక జనించబోయే
భావి వేదములు జీవనాదములు
జగత్తుకంతా చవులిస్తానోయ్!
కమ్మరి కొలిమీ, కుమ్మరిచక్రం
జాలరి పగ్గం
సాలెల మగ్గం

శరీర కష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,
సహస్ర వృత్తుల సమస్తచిహ్నాలు –
నావినుతించే,
నా విరుతించే,
నా వినిపించే నవీన గీతికి
నా విరచించే నవీన రీతికి
భావం!
భాగ్యం!
ప్రాణం!
ప్రణవం!

**9.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు**

| | | |
|---|---|---|
| హలాల | = | నాగళ్ళతో |
| ఇలాతలం | = | భూమి |
| హేమం | = | బంగారం |
| ధరిత్రి | = | భూమి |
| కర్షకవీరుల | = | రైతు వీరుల |
| కాయం | = | శరీరం |
| ఘర్మ జలానికి | = | చెమటకు |
| పరిక్లమిస్తూ | = | శ్రమపడుతూ |
| పరిప్లవిస్తూ | = | కదులుతూ |



BRAOU

| | | |
|---|---|---|
| విలాపాగ్నులకు | = | శోకమనే భాష్పాలకు |
| విషాదాశ్రులకు | = | శోక భాష్పాలకు |
| షరాబు | = | బంగారు, వెండి నగల నాణ్యం తెలిసి ఖరీదు కట్టే నిపుణుడు |
| జని | = | పుట్టుక |
| సమర్చనంగా | = | పూజించే విధంగా |
| స్వర్ణవాద్యములు | = | బంగారు వాద్యాలు |
| సంరావిస్తూ | = | ధ్వనిస్తూ |
| వ్యథార్త | = | బాధతో నొచ్చుకొన్న |
| జీవనాదములు | = | జీవంతో వున్న ధ్వనులు |
| వినుతించే | = | స్తుతించే |
| విరుతించే | = | ధ్వనించే |
| ప్రణవం | = | ఓంకారం, పరబ్రహ్మం. |

**9.3.2 వ్యాఖ్యానం**

శ్రీ వీరేశలింగంపంతులుతో ప్రారంభమయిన నవ్యయుగంలో సంఘంలోని మూఢవిశ్వాసాలను, దురాచారాలను రూపు మాపే కవిత్వం వెలువడింది. వీరేశలింగం, గురజాడ అప్పారావు కావ్యాల్లో సామాజిక శ్రేయస్సే ప్రధాన లక్ష్యం. గురజాడ కవితాశిల్పాన్ని, సమాజ ప్రయోజనాన్ని రెండుకళ్ళుగా చేసుకొని భవిష్యత్తులోకి దృష్టి సారించారు. ఆయన తర్వాత వచ్చిన కవులు ఆయనంతటి ముందుచూపుగలవారుకారు.

రాయప్రోలు నేతృత్వంలో రూపుదిద్దుకొనిన భావకవిత్వం స్వేచ్ఛావాయువుల్ని వీచింది. స్త్రీకి గౌరవ స్థానం కల్పించింది. ఆత్మాశ్రయమైన భావ కవిత్వంలో వ్యక్తి వాదానికి ప్రాముఖ్యం వచ్చింది. సామాన్య మానవుని అనునిత్యం వేధిస్తున్న ఆకలి, నిరుద్యోగం సమస్యలను భావకవిత్వం నిర్లక్ష్యం చేసింది.

1920 తర్వాత జాతీయ భావప్రేరణతో సంఘంలో అట్టడుగున ఉన్న, దీనజనుల స్థితి బాగుపడాలని కోరుతూ తెలుగుజాతి మహేతిహాసమనదగిన ఉన్నవవారి 'మాలపల్లి' వచ్చింది. తురగా పుండరీకాక్షుడు రచించిన జాతీయ భావప్రచార నాటకాలు వచ్చాయి. వీటిని బ్రిటిషు ప్రభుత్వం నిషేధించింది. స్వాతంత్ర్య సంగ్రామంలో మట్టిబొమ్మలను మహావీరులుగా నడిపించిన గరిమెళ్ళ గీతాలు వచ్చాయి.

"రైతుకూలీల సమస్యల గురించి ఆలోచించేవారు,పీడిత జనుల పక్షాన నిలువదలచినవారు మాలపల్లిని తమ మేనిఫెస్టోగా ఎంచుకున్నారు" (తుమ్మల వెంకటరామయ్య - అభ్యుదయ కవిత్వం - ఆంధ్రప్రదేశ్ దర్శిని - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్)

1930 తర్వాత ప్రపంచమంతటా ఆర్థికమాంద్యం అలముకొన్నది. మధ్యతరగతి పేదప్రజలు జీవితం దుర్భరం కాజొచ్చింది. ఒకనాడు రసస్ఫూర్తిని కలిగించిన మాటలే తియ్యనై, అతి తియ్యనై వెగటు కలిగించాయి.

ప్రపంచ దేశాలలో పరిస్థితులు వడివడిగా ఆందోళనాభరితంగా మారిపోయాయి. ఆకటిబాధతో ప్రజలు అలమటించి పోతున్నప్పుడు తెలుగుదేశంలో ఊహాప్రేయసి కోసం ప్రణయగీతాలు ఆలపిస్తున్న కవులు యువతరానికి నేరస్థులుగా కన్పించసాగారు. 'టెర్రరిస్టు' రాజకీయోద్యమంలో ప్రాణాలను త్యాగం చేసిన భగత్ సింగ్, 'మన్యం పితూరీ' నడిపించిన అల్లూరి సీతారామరాజు యువకులకు ఆదర్శంగా నిలిచారు.

అభ్యుదయ సాహిత్య కేంద్రం నెలకొల్పబడింది. ఆంధ్రదేశంలో జమిందారులు, భూస్వాములు పేదరైతులను కూలీలను పీడించటాన్ని సహించలేకజమిందారీ వ్యతిరేకోద్యమం వచ్చింది. శ్రీగోగినేని రంగా సంపాదకత్వంలో 'రైతువిభజనావళి' వెలువడింది.

లండన్ భారతీయ రచయితలు మేధావులు మార్క్సిజాన్ని అధ్యయనం చేయసాగారు. 'ఇండియన్ ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్' స్థాపించారు. పారిస్‌లో అంతర్జాతీయ అభ్యుదయ సాహిత్యకేంద్రం నెలకొల్పబడింది. 1935లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది.1936 ఏప్రిల్‌లో లక్నోలో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన దీని ప్రథమ మహాసభ జరిగింది. ఈ సంఘంలో సజ్జాద్‌జహీర్, ముల్క్‌రాజ్ ఆనంద్, కైఫీ ఆజ్మీ, కె.ఏ. అబ్బాస్ మొదలయిన ప్రసిద్ధ రచయితలు సభ్యులు. 1943లో ఆంధ్రలో అభ్యుదయ

BRAOU

రచయితల సంఘం స్థాపించబడింది. తాపీధర్మారావు అధ్యక్షతన తెనాలిలో ఆంధ్ర అభ్యుదయ రచయితల ప్రధమ మహాసభ జరిగింది.

"అభ్యుదయ రచయితల సంఘం రాజకీయ సంఘం కాదు. కాని రాజకీయాలను స్పృశించడమే మహాపరాధంగా భావించదు"అని తన ప్రణాళికలో స్పష్టం చేసింది.

"పీడింపబడేవాళ్ళు పీడించేవాళ్ళు వున్న ఈ వర్గసమాజం ఉండాలని ఎవరూ కోరరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించే వారు ఎప్పుడూ అభ్యుదయవాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయం. ఇది మనస్సులో పెట్టుకుని వ్రాసేది అభ్యుదయ రచన" అని కృష్ణశాస్త్రి అభ్యుదయ సాహిత్య స్వరూపాన్ని వివరించారు. (తృతీయ అభ్యుదయ రచయితల మహాసభ – అధ్యక్షోపన్యాసము – దేవులపల్లి కృష్ణశాస్త్రి – 1946 మార్చి – తెలుగు తల్లి).

**అభ్యుదయ కవిగా శ్రీ శ్రీ పరిణామం**

కాల్పనికోద్యమంలో విశ్వనాథ, కృష్ణశాస్త్రి ప్రభావంతో శ్రీ శ్రీ 'ప్రభవ' అనే కావ్యం రచించారు (1928). డిగ్రీ చదువు పూర్తిచేసుకొని విశాఖపట్టణం చేరుకున్న శ్రీ శ్రీ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దేశదేశాల కవుల గ్రంథాలు చదివి మనస్సుకు పట్టించుకున్నారు. 1933లో శ్రీ శ్రీ రచించిన 'జయభేరి' – "నేను సైతం/ ప్రపంచాగ్నికి సమిధనొక్కటి/ఆహుతిచ్చాను" అనేది అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. ఆంగ్ల సాహిత్యంలో New Signatures (1932), ఫ్రెంచి జాతీయగీతం, హరీన్ ఛటోపాధ్యాయ ఘరూ హువాహై జంగ్ గీతం, నజ్రుల్ ఇస్లాం గీతాలు, ఎడ్గార్ ఎలన్‌పో, గురజాడ, కవికొండల గేయాలు 'మహా ప్రస్థాన గేయానికి మార్గదర్శకమయ్యాయని చెప్పుకున్నారు. అది శంకరుల 'భజగోవిందమ్' తన 'మరో ప్రపంచం' గీతం నడకకు తోడ్పడిందని కూడా ఆయన తెలిపారు. 1933 నుంచి 1939 వరకు శ్రీ శ్రీ చేసిన కావ్యరచనలు "ఏక కాలంలోనే పండితపామరులుభయులని" రంజింపచేశాయి. తర్వాతి కవులందరూ శ్రీ శ్రీ మార్గాన్ని అనుసరించారు. "తన తర్వాతి కవులంతా తన నోట్లోంచి ఊడిపడినట్లుగా తన మానస పుత్రుడైనట్లుగానో అనురక్తులైనట్లుగానో ఏ కవి నిండుగా నిర్భరంగా, స్పష్టంగా బలంగా రాసిపోతాడో – ఏ కవి యొక్క ఆవిర్భావంవల్ల ఈ ప్రపంచం ఇంకో అడుగుముందుకు వేస్తుందో – ఆ కవి మహాకవి అయేట్లుంటే నిస్సంశయంగా 'మహాప్రస్థాన' కవి మహాకవి. (గండభేరుండం – కె.వి. రమణారెడ్డి సాహిత్యం – 1969).

**శ్రీ శ్రీ జీవిత కవితా విశేషాలు**

శ్రీరంగం శ్రీనివాసరావు (1910 – 1983) క్రీ.శ. 1910లో విశాఖపట్టణంలో జన్మించారు. అప్పన్న కొండ వెంకటరమణయ్యలు వీరి తల్లిదండ్రులు. ఎనిమిదవ ఏటనే పొడుగు పొట్టి పాదాల కంద పద్యం రచించారు. సావిత్రీ సత్యవంతుల అనే పద్య నాటకాన్ని, వీరసింహ విజయసింహులు అనే నవలను తన కవితా సాధన దశలో రచించారు. పదిహేనవ ఏట వీరు రచించిన పరిణయ రహస్యము అనే నవల ముద్రితమైంది. శ్రీనివాసరావు పద్దెనిమిదవ ఏట వారు రచించిన 'ప్రభవ' కావ్యం వెలువడింది. దీనికి శ్రీపురిపండా అప్పలస్వామి పీఠిక రచించారు. ఈ కావ్యంపైన కాల్పనికోద్యమ ప్రభావం ఉన్నది.

శ్రీ శ్రీ 1928 – 31 సంవత్సరాలలో మద్రాసులో బి.ఏ. చదివి డిగ్రీ తీసుకున్నారు. 1930లో టైఫాయిడ్ జ్వరంతో రెండు నెలలు బాధపడ్డారు. ఆ సమయంలో శ్రీ శ్రీ ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. కవిత్వానికి ఛందస్సు ఆవశ్యకమనే భావం తొలగిపోయింది. దేశదేశాల కవుల రచనలను చదవటంతో ఆయన ఊహాపరిధి విస్తృతమైంది.

శ్రీ శ్రీ బ్రతుకుతెరువు కోసం రకరకాల ఉద్యోగాలు చేశారు. మొదట మిసెస్ ఏ.వి.యన్. కాలేజీ – విశాఖపట్టణంలో డిమాన్‌స్ట్రేటరుగా, హార్బర్‌లో గుమాస్తాగ, 'విశాఖ' పత్రికలో రిపోర్టర్‌గా, ఆంధ్రప్రభలో సబ్ – ఎడిటర్‌గా, ఆలిండియా రేడియోలో ఉద్యోగిగా, ఆనందవాణిలో సబ్-ఎడిటర్, నైజాం కొలువులో ఉద్యోగిగా, సినిమా రచయితగా ఎన్నో ఉద్యోగాలు చేశారు.

1926లో పురిపండా వద్దాది సీతారామాంజనేయులుతో కలిసి కవితా సమితిని స్థాపించారు. 1933లో బరంపురంలో జరిగిన అఖిలాంధ్ర కవి పండిత సభకు హాజరయ్యారు. ఆ సభ తర్వాత కాలంలో 'నవ్యసాహిత్య పరిషత్తు' రూపం ధరించింది.

BRAOU

గీతాలను చాలవరకు 1933 - 42 మధ్య సంవత్సరాలలో రచించారు. 'ప్రతిజ్ఞ' గీతాన్ని 1937లో రచించారు. వివిధ పత్రికలలో వెలువడిన శ్రీశ్రీ రచనలు చదివి యువతరం కవులు ఉత్తేజితులయ్యారు.

స్టీఫెన్ స్పెండర్, డబ్ల్యు. ఎచ్. ఆడెన్, ఎడ్గార్ ఏలన్‌పో, బాదలేర్, మయకోవస్కీ, స్విన్‌బర్న్, టెనిసన్ మొదలైన విశ్వవిఖ్యాత కవుల ప్రభావమూ, స్పానిష్ అంతర్యుద్ధమూ శ్రీశ్రీ ఆలోచనపై రచనా రీతిపై ప్రభావాన్ని చూపాయి. 1930 - 40 దశాబ్దంలో ప్రపంచమంతా పేద, మధ్యతరగతి ప్రజల జీవితం దుర్భరంగా సాగింది. ఈ కాలాన్ని చరిత్రకారులు Hungry Thirities అని పిలుస్తారు. తెలుగు సాహిత్యం వరకు చూస్తే "Infant Terrible of Hungry Thirties" గా శ్రీశ్రీ అవతరించాడు.

గురజాడతో ప్రారంభమైన కవితా విప్లవం శ్రీశ్రీతో ముందంజ వేసింది. ప్రభవ రచించే నాటికి శ్రీరంగం శ్రీనివాసరావుగా ఉన్న కవి 'సుప్తాస్థికలు' తర్వాత 'శ్రీశ్రీ' అనే కలంపేరుతో ప్రసిద్ధుడయ్యారు. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపించానని శ్రీశ్రీ ఒక సందర్భంలో పలికారు. "ఈ శతాబ్దం నాదే" అని కూడ శ్రీశ్రీ సగర్వంగా పలికారు.

1950లో 'మహాప్రస్థానం' కవితాసంపుటి చలం యోగ్యతాపత్రంతో వెలువడింది. అప్పటికే ఇది సాహిత్యలోకంలో సంచలనం కలిగించింది. యువ నవకవులకు శ్రీశ్రీ ఆరాధ్యుడయ్యాడు. తర్వాత వచ్చిన కవులు శ్రీశ్రీ ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తి"గా మహాప్రస్థాన కావ్యసంపుటిని చలం కొనియాడారు.

కవితారంగంలో కళలలో వచ్చిన అనేక నూతన ప్రయోగాలపై మనసుపడి శ్రీశ్రీ 'సర్రియలిజమ్ (అధి వాస్తవికత) వంటి కవితారూపాలను తెలుగులో ప్రవేశపెట్టారు. విశ్వవిఖ్యాత రచయితల రచనలకు అనువాదాలు చేశారు. కథలు, నాటికలు, వ్యాసాలు, లిమరిక్కులు మొదలైన పెక్కు సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. 'చరమరాత్రి, చతురస్రం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, గురజాడ, మరోప్రస్థానం, వారంవారం, శ్రీశ్రీ వ్యాసాలు, పాడవోయి భారతీయుడా! అనంతం - మొదలైనవి వీరి ఇతర రచనలు.

కవిత్వరంగంలో ఎప్పుడు ఏ కొత్తదనం వచ్చినా దాన్ని ఆదరించటం శ్రీశ్రీ స్వభావం. తెలుగులో వచ్చిన దిగంబర కవిత్వాన్ని ఆయన సమర్థించారు. సాయుధపోరాటమే సాంఘిక సమస్యలకు పరిష్కార మార్గమని నమ్మిన విప్లవ రచయితల సంఘానికి ఆయన సంస్థాపకులు; అధ్యక్షులు. బ్రతుకులో నిరంతరం ఎక్స్‌పెరిమెంటు, విదూషకుని టెంపర్‌మెంట్ తనలో ఉన్నాయని శ్రీశ్రీ Self Portraitలో చెప్పుకున్నారు. ఆయన రకరకాల కవితాప్రయోగాలు చేశారు; హాస్యగీతాలు రచించారు.

ఆధునికాంధ్ర సాహిత్యంలో యుగకర్త శ్రీశ్రీ. ఆయన రచనల తర్వాత తెలుగు సాహిత్య స్వరూపంలో సమూలమైన మార్పువచ్చింది. చలం చెప్పినట్లు "ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటోదీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ".

ప్రతిజ్ఞ గేయం చెబుతోన్నదిదిః పొలాలన్నిటినీ హలాలతోదున్ని భూమిలోనుండి బంగారాన్ని వెలికి తీస్తూ, ఎడతెగక శ్రమపడుతూ బలాన్ని భూమికి బలిపెంచే, రైతువీరుల శరీరాలనిండా కాలువలుకట్టే చెమటకు, శ్రామిక శక్తికి (ధర్మ జలానికి) ఖరీదుగట్టే షరాబు లేడు. నరాల బిగువును, కరాల సత్తువను వరాల వర్షం కురిపించాలని, ప్రపంచభాగ్యం వర్ధిల్లాలని గనులలో, తోటల్లో, కార్ఖానాల్లో శ్రమపడుతూ, కదులుతూ ధనికస్వాములకు దాస్యంచేస్తూ, యంత్ర భూతముల కోరలు తోమే కార్మిక ధీరుల కన్నులనిండుగా కణకణ మండుతూ, గలగల తొణకే శోకాగ్నులకు, శోక భాష్పాలకు ఖరీదుగట్టే షరాబులేడు. నిరపరాధులైనా దురదృష్టంచేత చెరసాలల్లో చిక్కేవాళ్ళూ, యంత్రాలనే లోహరాక్షసుల పాదాలకిందపడి కొనప్రాణంతో కొట్టు కునేవాళ్ళూ, శ్రమపడినా ఫలితం దక్కక తెగించి సమ్మెలు కట్టేవాళ్ళూ, చేసిన శ్రమఅంతా నిష్ఫలంకాగా పుట్టుకే ఒక శాపమై నూతిని గోతిని వెతికే స్త్రీలూ, అనాధులూ, అశాంతులూ దీర్ఘశృతిలో తీవ్ర ధ్వనితో 'విప్లవం' అనే శంఖ ధ్వానాన్ని వినిపిస్తారు.

కాబట్టి లోకంలో జరిగే అన్యాయాలూ, కడుపుకాల్చే ఆకలి, కూల్చేబాధలూ దారిద్ర్యాలూ పరిష్కరించే, బహిష్కరించే బాటలుతీస్తూ పాటలు రాస్తారు. నాలో కదిలే నవ్యకవిత్వాన్ని కార్మికలోకపు కల్యాణానికి శ్రామికలోకపు సౌభాగ్యానికి అర్పణగా, అర్చనగా నివేదిస్తాను. మూడు లోకాలలో, మూడు కాలా లలో 'శ్రమయే జీవన సౌందర్యం' అనే భావనకు సమానమైనది లేనేలేదని, కష్టజీవులకు కర్మ వీరులకు నిత్య మంగళం నిర్దేశిస్తూ, శుభవాక్యాలు సమకూరుస్తూ, బంగారు వాద్యాలు ధ్వనింపజేస్తూ, బాధలతో పల్లవిస్తున్న నిజజీవిత దృశ్యాలు పునాదిగా భావివేదములు, జీవనాదములు లోకానికంతటికీ నోరూరించేటట్లుగా చేస్తాను.



BRAOU

కమ్మరి కొలిమీ, జాలరి పగ్గం, సాలెలమగ్గం, శరీర కష్టాన్ని స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి శ్రమపడే సమస్త చిహ్నాలూ కూడ నేను స్తుతించే, భావాలకు చిహ్నం. నేను ధ్వనింపజేసే పాటకు భాగ్యం: నేను వినిపించే నవీనగీతికి ప్రాణం: నేను రచించే నవీన రీతికి ఓంకారం.

లండన్ నుండి వెలువడిన "అభ్యుదయ రచయితల మేనిఫెస్టో" చదివి ఆ భావాలు మనస్సులో మెదులుతుండగా శ్రీశ్రీ ఈ గీతం రచించినట్లు తెలిపారు. 'ప్రతిజ్ఞ' చదవగానే శ్రీ అబ్బూరి రామకృష్ణారావు ఆనందంతో "అభ్యుదయ రచయితల మేనిఫెస్టో అంతా ఇందులో దించేశావు" అని శ్రీశ్రీని మెచ్చుకున్నారట. శ్రీశ్రీ దాన్ని తనకు గొప్ప ప్రశంసగా భావించుకున్నారు.

**9.3.3 విశేషాంశాలు**

**ఆధునికాంధ్ర కవిత్వంపై 'ప్రతిజ్ఞ' గీతం ప్రభావం**

ఆర్థిక మాంద్యం వ్యాపించి పరిస్థితులు దుర్భరమైపోయిన 1930-40 మధ్యకాలంలో రచయితలలో ఆర్థిక వ్యత్యాసాలు తొలగిపోవాలనే కోరిక బలపడసాగింది. 1937 లో శ్రీశ్రీ రచించిన 'ప్రతిజ్ఞ' గీతం సమకాలిక తెలుగు రచయితల గుండెలలో సెగలూ పొగలు కక్కుతున్న ఆవేదనలకు అక్షర రూపమిచ్చినట్లయింది. కార్మిక కర్షక క్షేమమూ, వివిధ వృత్తుల వల్ల జీవించే శ్రామికుల క్షేమమూ కోరటం ఆవశ్య కర్తవ్యమని రచయితలు గుర్తించారు. ఊహా ప్రేయసుల గురించీ, ప్రకృతి సౌందర్యం గురించీ, దేశభక్తి గురించీ కవిత్వం రచించి ప్రయోజనం లేదని తెలుసుకున్నారు. "The working men have no country" అని మార్క్స్, ఏంగెల్స్‌లు "కమ్యూనిస్టు మేనిఫెస్టో" లో చెప్పిన సూక్తిని రచయితలు శిరోధార్యంగా తలచారు. 'ప్రతిజ్ఞ' గీతం సామాన్య మానవుణ్ణి కథానాయకుణ్ణిచేసి, శ్రమ జీవికి ఉచితాసనం ఇచ్చింది. దీనితో తెలుగు సాహిత్య స్వరూపమే మారిపోయింది.

**లయ - ఛందస్సు**

శ్రీశ్రీ "ఛందస్సుల సర్పపరిష్వంగాలను" వదిలేశానన్నారు. ఆధునిక భావ వ్యక్తీకరణకు సాంప్రదాయికమైన ఛందస్సులు ఆటంకాలని శ్రీశ్రీ భావన. ఆయన మహాప్రస్థాన గీతాల్లో చాలా గీతాల్లో మాత్రా ఛ్ఛందస్సులు వాడుకున్నారు. మాత్రా ఛ్ఛందస్సులు గతిప్రధానమైనవి. అంటే లయబద్ధమైనవి.

మాత్రా ఛ్ఛందస్సులలో త్రిశ్రగతి, చతురస్రగతి, ఖండ గతి, మిశ్రగతి ముఖ్యమైనవి. శ్రీశ్రీ ఈ అన్ని గతులలోనూ రచన చేశారు. చతురశ్ర గతిలో ఆయన ముఖ్యమైన గేయాలున్నాయి.

మాత్రా గణాల్లో లఘువు గురు క్రమంలో అక్షరాలు ఎన్నుకోటం ద్వారా సాధించే లయను విలోమగతి అంటారు. శ్రీశ్రీ గేయాల్లో ఈ విలోమ గతి గణాల వాడకం ఎక్కువ.

పొలాల నన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో
హేమంపిండగ
జగాని కంతా
సౌఖ్యం నిండగ

పై భాగంలో 'ఇటాలిక్స్' లో వున్న పదాలవద్ద లఘువు - గురువు క్రమంలో అక్షరాలు వచ్చే 'జ' గణం వాడటం ద్వారా విలోమగతి సాధ్యమయింది. అది శ్రీశ్రీకి ప్రీతి పాత్రం. అట్లాగే సరిగణాల్లోగానీ, బేసి గణాల్లోగానీ, సమాక్షరాలు ఉండే గణాలు వాడటం శ్రీశ్రీ రచనలో ఒక పద్ధతి. పైన పాదాల్లో ఈ పద్ధతి చూడవచ్చు.

శ్రీశ్రీ పదప్రయోగం ఇంతకు ముందు లేనిది. కర్మశాలాసికి, యంత్ర భూతములు, ఖరీదుకట్టే షరాబు, లోహ రాక్షసులు, శ్రమైక జీవన సౌందర్యం - వంటి పదప్రయోగాలు శ్రీశ్రీ సొంతం. ఇట్లాంటి ప్రయోగాలను ఇంగ్లీషులో డిక్షన్ అంటారు.

BRAOU

## అభ్యాసం – 1

అభ్యుదయ కవిత్వ లక్షణాలు తెలపండి ?

---

## అభ్యాసం – 2

'ప్రతిజ్ఞ' లో శ్రీ శ్రీ వివరించిన "శ్రమైక జీవన సౌందర్యం" ఏమిటి ?

---

BRAOU

## 9.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో అభ్యుదయ కవిత్వ పద్ధతికి సంబంధించింది 'ప్రతిజ్ఞ'.
- అభ్యుదయ కవిత్వ యుగకర్త శ్రీ శ్రీ.
- ధనిక దరిద్ర భేదం సమసిపోయి ఆర్థిక సమానత్వం సమాజంలో నెలకొని ఉండాలన్న సామాజిక స్పృహతో రచించిన గేయం 'ప్రతిజ్ఞ'.
- కార్మిక క్షేమం, కర్షక సంక్షేమం సంఘక్షేమానికీ, మానవాభ్యుదయానికీ అత్యావశ్యకమని తీవ్రంగా ప్రతిపాదించే ప్రబోధాత్మక గేయం 'ప్రతిజ్ఞ'.
- ప్రపంచంలోని సర్వమానవ సంక్షేమాన్నీ అభ్యుదయ కవిత్వదృక్పథంతో సంకల్పించే మానవతా వాద గేయం 'ప్రతిజ్ఞ'.
- శ్రమశక్తి విలువనూ, సమకాలిక సమాజంలోని ఆర్థిక దుస్సంప్రదాయాలనూ అధిక్షేపిస్తూ, సామాన్య మానవుణ్ణీ, విశ్వనరుణ్ణీ, కవిత్వ వస్తువుగా చిత్రించిన అభ్యుదయ గీతం 'ప్రతిజ్ఞ'.

## 9.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

శ్రీ శ్రీ అభ్యుదయ కవి అనే అంశాన్ని 'ప్రతిజ్ఞ' ద్వారా నిరూపించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

'ప్రతిజ్ఞ' ప్రతిపాదించే సామాజికాంశాలను పేర్కొనండి ?

## 9.6 ఆకళింపు ప్రశ్నలు

1. శ్రీశ్రీ కవిత్వం మీద, ఛందస్సు మీద సృజన, కళాకేళి, అరుణతార, భారతి వంటి పత్రికల్లో చాలా వ్యాసాలు వచ్చాయి. వాటిలో కొన్నిటినైనా సంపాదించి చదవండి.

2. శ్రీశ్రీ సన్మాన సంఘం వారు 1970 లో అప్పటి వరకూ వచ్చిన శ్రీశ్రీ రచనలు అచ్చేశారు. అవి చదవండి.

3. ఈ కింద శ్రీశ్రీ రచనల్లో నుంచి కొన్ని భాగాలు ఇవ్వబడినాయి. వాటిల్లో భావపరంగా గాని, లయ పరంగా గాని కనిపించే సామ్యాలు వెతికి 'ప్రతిజ్ఞ'తో పోల్చండి.

a) కదం తొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం. (1934)

b) విభాతవేళా
శుభానిలంలో
పికాంగనా క్రా
వ్యకూజితంలో
అమాత్యమణి నీ
వివాహమని ఈ
సమస్తలోకం పలికింది.

### అభ్యాసాలకు జవాబులు

1. "పీడింపబడే వాళ్లూ, పీడించేవాళ్ళూ వున్న ఈ వర్గసమాజం ఉండాలని ఎవరూ కోరరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటధారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటించే వారు ఎప్పుడూ అభ్యుదయవాదులు కాజాలరు. ఈ ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయ రచన" (తృతీయ అభ్యుదయ రచయితల మహాసభ - అధ్యక్షోపన్యాసము - దేవులపల్లి కృష్ణశాస్త్రి) - 1946 మార్చి, తెలుగు తల్లి). పై భావాల్లో అభ్యుదయ కవిత్వ దృక్పథం వెల్లడౌతున్నది. సామాన్య మానవుడిని కథానాయకునిగా చేస్తూ, సంఘంలో ఆర్థిక సమానత్వాన్నీ, కర్షక కార్మిక సంక్షేమాన్నీ పాదుకొల్పేది అభ్యుదయకవిత్వం. "అభ్యుదయ రచయితలు తెచ్చిన విప్లవం రసావిష్కరణకు, రసాస్వాదనకు సంబంధించినది. సాహిత్యం ఒక భోగవస్తువుగా పరిగణించే దృక్పథంమీద వీరు (అభ్యుదయ రచయితలు) తిరుగబడుతున్నారు. అనే శ్రీశ్రీ మాటల్లో (అభ్యుదయ రచయిత విప్లవదృష్టి - శ్రీశ్రీ, తెలుగుతల్లి, మార్చి, 1946). అభ్యుదయ కవిత్వానికి సంబంధించిన రచనాశిల్పం సారస్వత దృష్టి కూడా తెలియవస్తున్నాయి.

2. అభ్యుదయోద్యమ కవితా ప్రవక్త శ్రీశ్రీ రచించిన "మహాప్రస్థానం" కావ్య సంపుటిలో 'ప్రతిజ్ఞ' గీతం ఒకటి. ఈ గీతంలో అనాథులూ, అశాంతులంతా కలిసి దీర్ఘ శ్రుతిలో తీవ్ర ధ్వనితో విప్లవ శంఖం వినిపిస్తారని శ్రీశ్రీ భావించారు. కాల్పనికోద్యమంలో విశ్వనాథ, కృష్ణశాస్త్రిల ప్రభావంతో శ్రీశ్రీ 'ప్రభవ' కావ్యసంపుటి రచించారు. తర్వాత ప్రపంచదేశాలలోను, సాహిత్యంలోను వస్తున్న మార్పుల్ని శ్రద్ధగా అధ్యయనం చేశారు. స్పెండర్, ఆడెన్, మయకోవస్కీ, ఎడ్గార్ ఏలన్‌పో, నజ్రుల్ ఇస్లాం మొదలైన కవుల రచనలను చదివి సమసమాజ నిర్మాణం కోసం కవులు చేస్తున్న కృషిని గమనించారు. మార్క్సిజం మూల సూత్రాలను ఆయన సాహిత్యం ద్వారా అర్థం చేసుకోగలిగారు.



BRAOU

శ్రీశ్రీ గారు 1929లో రెండు నెలల పాటు టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డారు. ఆ తర్వాత ఆయన ఆలోచనారీతిలో మార్పు వచ్చింది. అంతర్జాతీయంగా స్పానిష్ అంతర్యుద్ధం శ్రీశ్రీని బాగా కదిలించింది. దేశంలో ఎటు చూస్తే అటు ఆకలి, నిరుద్యోగం – ప్రజలు పడుతున్నపాట్లు తెలుసుకున్నారు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న దారిద్ర్యం, నిరుద్యోగం, అశాంతి ఆయన కవితారీతిలో చాలా మార్పు తెచ్చాయి. 'సుప్తాస్థికలు' అనే గీతం ఆయన ఆలోచనలలో వచ్చిన మార్పును తెలుపుతుంది.

భావకవిత్వం ప్రభావం నుండి బయట పడి శ్రీశ్రీ తన కవిత్వాన్ని సమాజ శ్రేయస్సుకు అంకితం చేశారు. 1930 దాకా తెలుగు కవితవం తనను నడిపిస్తే ఆ తరవాత తానే తెలుగు కవిత్వాన్ని నడిపించినట్లు శ్రీశ్రీ ఒక సందర్భంలో తెలిపారు. "ఈ శతాబ్దం నాదే" అని కూడ శ్రీశ్రీ సగర్వంగా పలికారు. అవును. 1929–39 సంవత్సరాల మధ్య ఆయన రచించిన గీతాలు తెలుగు కవిత్వాన్ని సమూలంగా మార్చివేశాయి. ఆయనను అభ్యుదయ కవిత్వ యుగ కర్తగా నిలిపాయి. తర్వాత వచ్చిన కవులందరికీ త్రోవ చూపాయి. చలం అన్నట్లు "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వ శక్తి" మహాప్రస్థాన గీతాలలో ఉన్నది. "కవులని విర్రవీగిన కవులు ప్రతివొక్కరూ శ్రీశ్రీ నీడ కిందనించుని తమ ఉనికిని సమర్థించుకోవలసిన" స్థితి వచ్చింది.

శ్రీశ్రీ ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో దేశదేశాల కవుల రచనలను అధ్యయనం చేస్తున్నప్పుడు అబ్బూరి రామకృష్ణారావు లండన్ నుండి వెలువడిన అభ్యుదయ రచయితల మేనిఫెస్టోను శ్రీశ్రీకి ఇచ్చారు. ఆ మేని ఫెస్టోలో భావాలను జీర్ణించుకుని శ్రీశ్రీ వాటికి 'ప్రతిజ్ఞ' గీతంలో కవితా రూపమిచ్చారు.

కార్మికుల, కర్షకుల, ఇంకా వివిధ వృత్తుల శ్రామికులకు వారి శ్రమకు తగిన ఫలితం లభించటం లేదని శ్రీశ్రీ ప్రతిజ్ఞ గీతంలో తన ఆవేదనను వెల్లడించారు. పొలాలనన్నిటిని నాగళ్ళతో దున్ని, నేలలో నుండి బంగారం పండిస్తూ లోకానికి సౌఖ్యాన్ని సమకూర్చేవాళ్ళు కర్షక వీరులు. విరామం లేక శ్రమపడే ఆ కర్షక వీరుల కాయం నిండా కాలువగట్టే చెమటకు, శ్రామిక శక్తికి ఖరీదు కట్టే షరాబు లేడు. వాళ్ల బలం ధరిత్రికి బలి అయిపోతున్నది.

గనిలో వనిలో కార్ఖానాలో శ్రమపడుతూ తమ శ్రమనంతా యంత్ర భూతముల కోరలు తోమటానికి వినియోగించి లోహ రాక్షసుల పాదాల కింద పడి నలిగే కార్మికులకు శ్రమఫలితం దక్కటంలేదు. ఈ కార్మిక ధీరుల కన్నుల నిండా కణ కణ మండే, [illegible] తోణకే విలాపాగ్నులకు విషాదాశ్రువులకు ఖరీదు కట్టే షరాబు లేడు.

BRAOU

కష్టం చాలక కడుపు మంట చేత సమ్మెలు కట్టేవాళ్ళూ, చేయని నేరాలకు చెరసాల పాలయ్యే అభాగ్యులూ, వాళ్ల శ్రమ నిష్ఫలం కాగా, పుట్టుకే నిష్ఠురం కాగా నూతిని గోతిని వెతుకుతున్నారు.

శ్రామికులింక యీ అన్యాయాలను సహించబోరు. అనాథులూ అశాంతులూ దీర్ఘశ్రుతిలో తీవ్ర ధ్వనితో విప్లవ శంఖం వినిపిస్తారు. ఈ శ్రామికలోకపు కల్యాణానికి శ్రీశ్రీ తనలో కదిలే నవ్య కవిత్వాన్ని సమర్పణంగా సమర్పిస్తానన్నారు.

'ప్రతిజ్ఞ' గీతంలో శ్రీశ్రీ వ్యథార్త జీవిత యథార్థ దృశ్యాలను చూపారు. తెలుగు పాఠకులకు కవులకు కళ్ళు తెరిపించారు. సమాజ శ్రేయస్సును మించిన పరమ లక్ష్యం ఆధునిక కవికి మరేదీ లేదని స్పష్టం చేశారు. తెలుగు కవిత్వ మార్గాన్ని, అభ్యుదయ మార్గంలో సమసమాజ లక్ష్యం వైపు నడిపించిన 'ప్రతిజ్ఞ' తెలుగు సాహిత్యంలో ధ్రువనక్షత్రం వంటిది. త్రోవ తప్పి తిరుగాడుతున్న కవులకు సరియైన త్రోవను నిర్దేశించిన 'ప్రతిజ్ఞ' నిస్సందేహంగా ఉత్తమ గీతం.

– డాక్టర్ కె. రామమోహన్ రాయ్

# భాగం 10 ఆర్తగీతి

## విషయక్రమం


10.0 ఉద్దేశం
10.1 ప్రవేశిక
10.2 సూచనలు
10.3 పాఠ్యం
  10.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  10.3.2 వ్యాఖ్యానం
  10.3.3 విశేషాంశాలు

**అభ్యాసం**

10.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
10.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
10.6 ఆకలింపు ప్రశ్నలు
  అభ్యాసాలకు జవాబులు


## 10.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- 'ఆర్తగీతి'లోని భావ - అభ్యుదయ కవిత్వ దృక్పథాలు.
- 'ఆర్తగీతి' ప్రతిపాదించే మానవతావాదాంశం.

## 10.1 ప్రవేశిక

BRAOU

ఏ తత్వానికీ, ఇజానికీ కట్టుబడక స్వాతంత్ర్యప్రియత్వంతో కళాసౌందర్యాన్నీ, మానవాభ్యుదయాన్నీ తన కవితలద్వారా వెలువరిస్తూ సాగిపోయిన కవి బాలగంగాధర తిలక్. ఈయన కవితాధోరణి, భావకవిత్వాన్నీ అభ్యుదయ కవిత్వాన్నీ కలబోసుకొని మానవతావాద ప్రబోధాన్ని కొనసాగించింది. ఆధునికాంధ్ర కవిత్వంలో అనుపమానమైన కావ్యం ఈయన రచించిన "అమృతం కురిసిన రాత్రి". ఆ కావ్యంలో ప్రస్తుత పాఠ్యం 'ఆర్తగీతం' ద్వారా మీరు తిలక్ కవితారీతులను గ్రహిస్తారు.

## 10.2 సూచనలు

తిలక్ కవిత్వంలోని భావకవిత్వచ్ఛాయలూ, అభ్యుదయ భావాలు గమనిస్తూ ఈ పాఠ్యానికి ముందు విద్యార్థులు ఆయన కావ్యం "అమృతం కురిసిన రాత్రి" ఆసాంతం జాగ్రత్తగా చదవాలి.

## 10.3 పాఠ్యం

నా దేశాన్ని గూర్చి పాడలేను, నీ ఆదేశాన్ని మన్నించలేను
ఈ విపంచికకు శ్రుతి కలపలేను
ఈ రోజు నాకు విషాద స్మృతి, విధి తమస్సులు మూసిన దివాంధ రుతి
నా యెడద మ్రోడైన ఒక దుస్థితి.

నీ కొత్త సింగారమ్ము వలదు, ఉదాత్త సురభిళాత్త శయ్యాసజ్జితమ్ము వలదు,
రసప్లావితము వలదు
చిత్ర శిల్ప కవితా ప్రసక్తి వాంచింపను, తత్వసూత్ర వాదోక్తి చలింపను
సుందర వధూ కదుష్ణ పరిరంభముల రసింపను
గత చారిత్రక యశః కలాపమ్ము వివరింపకు,

బహుళ వీరానేక గాథా సహస్రమ్ము వినిపింపకు,
ఇంక నన్ను విసిగింపకు
నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను,
సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగును
మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను.

పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్పవలసిన వాణ్ణి
రసాతల మంట శిరస్సు, వంచినవాణ్ణి
ఈ రోజా నేను చూసినదేమి? విధియిన్ని కత్తులను దూసిన దేమి?
జాగృతి హేతివాదరల రుధిర మేమి?

నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలి వాణ్ణి;
నేను చూశాను. నిజంగా నీరంధ్ర వర్షాన వంతెన కింద
నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని
నేను చూశాను నిజంగా తల్లిలేక, తండ్రిలేక తిండిలేక ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతులు కన్నులు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే
నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి
నేను చూశాను నిజంగా పిల్లలకు గంజి కాచి పోసి తాను నిరాహారుడై
రుద్ధ భాష్పాకులితనయనుడై ఆఫీసుకు వచ్చిన వృద్ధుని, ప్యూన్ వీరన్నని
నేను చూశాను నిజంగా క్షయగ్రస్త భార్య యిక బ్రతకదని డాక్టరు చెప్పినపుడు
ప్రచండ వాతూల హత నీప శాఖ వలె గజ గజ
వణికిపోయిన అరక్త అశక్త గుమాస్తాని

అయిదారుగురు పిల్లలు గలవాణ్ణి;
నేను చూశాను నిజంగా మూర్తీభవత్ దైన్యాన్ని, హైన్యాన్ని
క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛతో శవాకార వికారుల్ని
ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి

ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి?
ఇంక నన్ను నిర్బంధించకు నేస్తం ఈ రాత్రి నేను పాడలేను;
ఈ కృత్రిమ వేషాన్ని అభినయింపలేను
మానవతలేని లోకాన్ని స్తుతింపలేను

మానవునిగా శిరసెత్తుకు తిరగలేను
ఈ నాగరికతారణ్యావాసం భరించలేను.
ఒక్క నిరుపేద వున్నంత వరకు, ఒక్క మలినాశ్రు బిందువొరిగినంత వరకు
ఒక్క ప్రేగు ఆకలి కనలినంతవరకు

ఒక్క శుష్కస్తన్య సన్నిధిని క్షుధార్తివేడ్చు పసిపాప ఉన్నంత వరకు
ఒక్క తల్లి నీరవాక్రోశరవమ్ము విన్నంత వరకు
ఒక్క క్షతదుఃఖిత హృదయమూరడిల్లనంత వరకు
నాకు శాంతిగలుగదింక నేస్తం, నేను నిగర్వినైనాను

ఈ సిగ్గులేని ముఖాన్ని చూపించలేను
ఈ గుండెగూడుపట్లు ఎక్కడో కదిలినవి, ఈ కనులు వరదలై పారినవి
ఈ కలలు కాగితపు పేలికలై రాలినవి.
ఈ ఆర్తి ఏ సాధాంతరాలకు పయనింపగలదు?

ఏ రాజకీయవేత్త గుండెలను
స్పృశించగలదు?

BRAOU

ఏ భోగవంతుని
విచలింపచేయగలదు?
ఏ భగవంతునికి
నివేదించుకొనగలదు.... ?

### 10.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| విపంచిక | = | వీణ |
| తమస్సులు | = | చీకట్లు |
| దివాంధరుతి | = | గుడ్లగూబ కేక |
| ఉదాత్త సురభిళాత్తశయ్యా సజ్జితమ్ము | = | ఘాటైన సువాసనలతో కూడి అలరింపబడిన పడక |
| రసాప్లావితము | = | రసముచేత తడపబడినది |
| సుందర వధూకదుష్ణపరిరంభముల | = | అందమైన స్త్రీల నులివెచ్చని కౌగిలింతలకు |
| రసింపను | = | ఒప్పను |
| యశఃకలాపము | = | కీర్తి అనే ఆభరణం |
| రసాతలము | = | పాతాళలోకం |
| హేతివాదరలు | = | కత్తి అంచులు |
| ప్రచండవాతూలహత | = | తీవ్రమైన గాలి తాకిడి తగిలిన |
| నీపశాఖవలె | = | కడిమిచెట్టు కొమ్మలాగ |
| క్షుభితాశ్రుకల్లోల నీరధుల్ని | = | కలత పడిన కన్నీటి కల్లోల సముద్రాలను |
| గచ్ఛతో శవాకారకారుల్ని | = | కదులుతున్న శవాల్లాంటివికారులను |
| శుష్కస్తన్య సన్నిధిని | = | ఎండిపోయిన రొమ్ము దగ్గర |

### 10.3.2 వ్యాఖ్యానం

"నా కవిత్వం కాదొక తత్వం" అని తిలక్ 'నా కవిత్వం' అనే గీతంలో అన్నారు. కాని అప్పటి సారస్వత లోకంలో స్థిరంగా ఉన్న కవిత్వ తత్వాలలో తన కవిత్వం దేనికీ చెందదనేదే భావం. ఏ తత్వమూ లేని కవి కవేకాడు.

BRAOU

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"

అని కవి తన కవిత్వారంభంలోనే (1941) స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించుకొని, సుమారు రెండున్నర దశాబ్దాలపాటు చేపట్టిన ప్రతి వస్తువునూ కవితామయంచేసి నవ్యకవిత్వంలో వెలుగును విరజిమ్మిన కవి దేవరకొండ బాలగంగాధర తిలక్. తిలక్ కవిత్వ సీమ సౌందర్య పీమ.

"గాజుకెరటాల వెన్నెల సముద్రాలూ
జాజిపువ్వుల అత్తరు దీపాలూ
మంత్రలోకపు మణిస్తంభాలూ
నా కవితా చందనశాలా సుందర చిత్ర విచిత్రాలు"

అని తిలక్ తన కవిత్వ లోకాన్ని వర్ణించాడు. ఆధునిక కవులలో శ్రీ శ్రీ తర్వాత వచ్చిన కవులలో తిలక్ భావుకుడైన కవి.

ఒక తత్వానికి కట్టుబడక నిరంతరాన్వేషియై శిఖరారోహణ చేసిన కవి తిలక్. 'ఇజా'లలో 'ఇంప్రిజన్' కావటం ఆయనకు ఇష్టంలేదు. ఆయన స్వేచ్ఛాప్రియుడు. సౌందర్యమూ, అభ్యుదయమూ ఆయనకు రెండు ఊపిరితిత్తులు. కారుణ్యం ఆయన కంఠంలో నుండి వెలికురికి కరుణరసమై రసజ్ఞులను కదిలించింది. తిలక్ ప్రధానంగా అనుభూతివాది. మానవత్వం ప్రబోధం ఆయన కవితల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

కృష్ణశాస్త్రి భావనాశక్తి, శ్రీశ్రీ అభ్యుదయానురక్తి తిలక్ కవితలో అంతర్వాహినిగా కనిపిస్తాయి. తన కాలం నాటి కవిత్వోద్యమాల అంతస్తత్వాన్ని గ్రహించి, వాటి ఝంఝూ ప్రభంజనాలకు తట్టుకొని, కవిగా తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు.

జీవితాన్ని గురించి, కవిత్వాన్ని గురించి  తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" కావ్య సంపుటిలో వెల్లడించిన భావాలను పరిశీలిస్తే తిలక్ కవితాతత్త్వం చాలవరకూ బోధపడుతుంది. జీవితంలో సుఖంకోసం, శాంతికోసం పరితపించే పాటిమానవుని మనుగడను తలచి, విలపించి, జీవితంలో బీభత్సానికి భయపడి, జీవితాన్ని ఒక సాహసయాత్రగా స్వీకరించమని ప్రబోధించిన కవి తిలక్. బ్రతుకులోనుండి "దుఃఖాన్నీ చావునీ వెళ్ళిపొమ్మ"న్నాడు - బ్రతుకును "లలిత లలిత లతాంతమాల"గా భావించాడు.

తిలక్ దృష్టిలో కవిత్వం "అంతరాంతర" జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి; విస్తరించాలి చైతన్య పరిధి; అగ్నిజల్లినా అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి.

తిలక్ భావకవిత్వాన్ని అభ్యుదయ కవిత్వాన్ని మేళవించి మానవతా ప్రబోధంతో ఒక నూతన మార్గాన్ని ఏర్పరచి నవ్యకవులపై తన ప్రగాఢమైన ప్రభావాన్ని కలిగించారు. వచన కవిత్వంలో లయాన్వితమైన ఒక చక్కని కొత్తబాణీని ప్రవేశపెట్టారు. ఆధునికాంధ్ర కవిత్వంలో "అమృతం కురిసిన రాత్రి" కావ్య సంపుటి ఒక దీప స్తంభం. కవితాసతినొసట నిత్యరసగంగాధర తిలకం.

**తిలక్ కవిత్వంలో భావకవిత్వపు ఛాయలు**

భావకవిత్వమపు ఉచ్ఛదశ అంతా 1910 - 30 సంవత్సరాల మధ్యనే గడిచింది. తిలక్ కవిత్వ రచనకు పూనుకొన్నది 1941లో. అప్పటికి భావకవిత్వానికి కాలదోషం పట్టినట్లుగా విమర్శకులు భావిస్తున్నారు. తిలక్ ప్రకృతినీ, ప్రణయాన్నీ వర్ణించే రసగీతాలను రచించారు. ఆయన రచనలలో భావ కవిత్వం పునరుజ్జీవనం పొందింది. భావ కవితా యుగానికి చివరి గొప్ప ప్రతినిధి తిలక్.

ఉదాత్త ప్రణయ భావన తిలక్ రచనల్లో "అమృతం కురిసిన రాత్రి; యుగళ గీతిక; నగరం మీద ప్రేమగీతం; ఈ రాత్రి; అదృష్టాధ్వగమనం; ప్రవష్లిక; వానలో నీతో; విరహోత్కంఠిత; చిన్నారికి చిన్నమాట; అద్వితీయం; ఆ రోజులు; నీవు లేవు నీ పాటవుంది" మొదలైన గీతాల్లో కన్పిస్తుంది. వయ్యారంగా పరుగెత్తుతూ పృథు వక్షోజనితంబ భారంతో యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్న అప్సరసలు 'అమృతం కురిసిన రాత్రి'లో కన్పిస్తారు. అమృతాన్ని దోసిళ్ళలతో తాగి, జీవితాన్ని హసన్మందారమాలగా ధరించి, దుఃఖాన్నీ, చావునీ వెళ్ళిపొమ్మన్న కవి స్వాప్నికలోకం అందంగా కళ్ళముందు మెదలుతుంది.

"ఆకాశాన్ని మేఘం నల్లని కంబళిగా కప్పుకుంది, ఆనందం మనస్సులో మయూర బర్హంలా విప్పుకుంది, అరటితోట నడుంచుట్టి కాలువ ఏటవాలుగా మలుపు తిరిగింది, నారికేళ వనాంతాన ప్లాటినం సంకేతంలా మెరుపు మెరిసింది" (వానలో నీతో) అనే గీతంలో భావన ప్రకృతినీ, ప్రణయాన్నీ కలగలిపిన ఉత్తమ ఖండ కావ్యం.

భావకవిగా తిలక్ ప్రకృతిని కొత్త కోణాలనుండి, వర్ణోజ్వల చిత్రాలుగా ప్రదర్శించారు. "సంధ్య; దృశ్య భావాలు; ఈ రాత్రి; రాజమండ్రి పాటలు; రాత్రివేళ; అద్వితీయం; ప్రాతఃకాలం; వేసవి" గీతాల్లో ప్రకృతి, దృశ్యానికనుగుణంగా ఆహార్యాన్ని మార్చుకునే నాట్యకత్తెలాగ దర్శనమిస్తుంది.

ఆధునికాంధ్ర కవిత్వంలో అపురూపమైన ప్రకృతి చిత్రం – 'సంధ్య'.

సంజె పెదవుల ఎరుపు కడలి అంచుల విరిగి
సంజె పరికిణి చెరగు ఎడద లోతుల మెరసి
ఏటి కొంగల నిదుర ఎర్రగా ప్రాకింది
బాతురెక్కల నీడ బరువుగా సోలింది"

అనే వర్ణనను గమనిస్తే తిలక్ భావనలోని సౌందర్యం బోధపడుతుంది.



BRAOU

దీనుల వేదనను, సైనికుల బాధలను, పతితుల విలాపాన్ని, మోసపోయిన అభాగ్యుల గోడును తిలక్ తన గీతాల్లో వర్ణించారు. 'ఆర్తగీతం'; 'ప్రార్థన' గీతాలు ఆయన హృదయావేదనను వినిపింపజేసే ఉత్తమ రచనలు.

చాలా మంది అభ్యుదయ కవులకు ప్రేరణ కలిగించిన మార్క్సిజమ్ తిలక్‌ను ప్రభావితం చేయలేదు. కష్టాల్లో చిక్కుకున్న దీనులపట్ల సాటి మానవుడిలాగ ఆయన ప్రతి స్పందించారు. 'ప్రార్థన' గీతంలో దేవుడా, రక్షించు నాదేశాన్ని, పవిత్రుల నుండి పతివ్రతల నుండి పెద్దమనుషుల నుండి, పెద్ద పులుల నుండి, లక్షలాది దేవుళ్ళ నుండి, శ్రీ మన్మద్గురు పరంపర నుండి" అని వ్యంగ్యంగా దేశ దుస్థితిని ప్రస్తావించి "దేవుడా, నలభై కోట్ల మనుష్యుల, నిజమైన, ప్రాణం వున్న మనుష్యులతో నిండిన దేశం నాది, రక్షించు నా దేశాన్ని" అని ప్రార్థించాడు. ఈ కవితలో వ్యంగ్యం సమకాలిక సంఘంలో ప్రజలను ఆలోచింపజేసింది. సమస్యకు పరిష్కార మేమిటో చెప్పకుండానే చెప్పింది.

అభ్యుదయమంటే సమసమాజ నిర్మాణమని గాక, ఆకలీ ఈతిబాధలూ లేని చల్లని లోకమని తిలక్ భావించారు. ఆయన అభ్యుదయ భావాలకు వ్యతిరేకి మాత్రం కారు. 1942లో బొంబాయిలో జరిగిన భారత అభ్యుదయ రచయితల మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యారు. ఆ సంవత్సరమే ఆయన 'మేగ్నకార్టా' అనే సుప్రసిద్ధమైన గీతం రచించారు. "పాతలోకపు గుండెలో శతఘ్ని పగిలించి, భావికాలపు చంద్రకాంత శిలల కరిగించి, పాటపాటకి సోకు స్వర్గంలాగ, మాటమాటకి దూకు సింహంలాగ, మేం నిలుస్తాం, మేం పిలుస్తాం, మేం మనుష్యులం, మాకు దాస్యం లేదు, మాకు శాస్త్రం లేదు మాకు లోకం ఒక గీటురాయి, మాకు కరుణ చిగురుతురాయి" అని స్పష్టంగా స్వేచ్ఛను కోరారు. సనాతనమైన, అభివృద్ధి నిరోధకమైన భావాలను ఆయన ఎన్నో చోట్ల ఏవగించుకొన్నారు.

అభ్యుదయ భావాలతో సామాజిక ప్రగతిని కోరే గీతాలు "మేగ్నకార్టా; దీపం; శిక్షాపత్రం; స్వేచ్ఛా విహారం; గొంగళిపురుగులు; సి.ఐ.డి. రిపోర్టు" మొదలైనవి 'అమృతం కురిసిన రాత్రి'లో ఉన్నాయి, "ఒక్క దుఃఖితుడు నవ్వినప్పుడు, ఒక్క పతితుడు కన్నువిప్పినప్పుడు, అక్కడ నా అడుగుజాడ గుర్తించగలవు" అన్నచోట అభ్యుదయ కవితా ఛాయలను గుర్తించగలం.

యుద్ధ బీభత్సం తిలక్‌గారి గుండెల్ని ఘూర్ణిల్లి చేసింది. పదేపదే ఆయన యుద్ధాన్ని నిరసించారు. అభ్యుదయ కవులు యుద్ధకాలంలో ప్రజల కష్టాలను వర్ణించారే గాని యుద్ధ భయంకరత్వాన్ని వర్ణించలేదు. తిలక్ యుద్ధ బీభత్సాన్ని కవితలో చిత్రించి శాంతిని ప్రబోధించారు.

సంఘంలో అన్యాయాలకు గురిఅవుతున్న పేదజనులు తిరగబడాలని తిలక్ ఎక్కడా ప్రబోధించలేదు. పేదల కష్టాలను చూచి హృదయం ద్రవించి కరుణ రసభరితమైన గీతాలను మాత్రం రచించారు.

**తిలక్ జీవిత కవితా విశేషాలు**

దేవరకొండ బాలగంగాధర్ తిలక్ పశ్చిమ గోదావరిజిల్లా తణుకులో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించి కూడ ఉద్యోగమేదీ చేయలేదు. ప్రాక్పశ్చిమ దేశాల సారస్వతాన్ని, తెలుగులో ప్రాచీన అధునాతన సాహిత్యాన్ని శ్రద్ధగా అధ్యయనం చేశారు. కవిత్వానికి కావలసిన ప్రతిభ, వ్యుత్పన్నత, అభ్యాసాలు ఆయనలో పుష్కలంగా ఉన్నాయి. ఉజ్జ్వలమైన భావుకశక్తి ఆయన కవిత్వంలో అద్భుతంగా కన్పిస్తుంది.

1941 లో 'నా కవిత్వం' అనే గీతంతో ప్రారంభమైన ఆయన కవితా వ్యవసాయం 1966 లో హఠాత్తుగా ఆయన మరణించటంతో ఆగిపోయింది. ఈ ఇరవై అయిదేళ్ల కాలంలో 1945-1955 మధ్య ఒక దశాబ్దం కాలం అనారోగ్య కారణంగా తిలక్ రచనలేమీ చేయలేదు.

చిన్నవయసులోనే పద్యకవిత్వం రచించి తిలక్ కవిగా పేరు తెచ్చుకున్నారు. 'ప్రభాతము - సంధ్య' అనే పద్య కావ్యం ఆయన తొలి రచన. తర్వాత చాలామంది ఆధునిక కవుల లాగే ఆయన ఛందోనియమాలను వదిలివేసి 'వచన కవిత్వం' రచించారు. అయితే చివరకు తిలక్ పద్యకవిత్వాన్ని పూర్తిగా



BRAOU

విడిచిపెట్టలేదు. అప్పుడప్పుడు ఆయన రచించిన "ఊర్మిళ, విషణ్ణవైదేహి; అద్వైతమాన్మథము, ఆటవెలది" మొదలయిన ఖండకావ్యాలు సాహిత్య పత్రికలలో ముద్రితమయినాయి. ఆయన వచన గేయాలు మాత్రం ఆయన మరణానంతరం 'అమృతం కురిసిన రాత్రి' (1968) అనే కావ్యసంపుటిగా వచ్చాయి. ఆర్తగీతం ఆ సంపుటిలో నుంచి గ్రహించిందే, కవిగా ఎంతటి ప్రసిద్ధులో కథా రచయితగా కూడ ఆయన అంత ప్రసిద్ధులు, ఆయన కథలు, తిలక్ కథలు, సంపుటిగా వచ్చాయి. ఇంకా "సుప్తశిల; సుచిత్ర ప్రణయం; సుశీల పెళ్లి" అనే నాటికలు కూడ తిలక్ రచించారు.

కవిత్వాన్ని గురించి తిలక్‌కు నిర్దిష్టమైన, ఖచ్చితమైన కొన్ని అభిప్రాయాలున్నాయి. వాటిని ఆయన అందంగా వెల్లడించారు కూడ. "మన లోపల్లోపల జరిగే ఒకానొక అనుభూతి విశిష్టత కవిత్వానికి ఆధారం" అని తిలక్ అభిప్రాయపడ్డారు. ('కవిత్వం అంటే' - వ్యాసం - ఆనందవాణి - శ్రీ తిలక్ సంచిక).

"కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసు, కాళిదాసుకు తెలుసు, పెద్దన్నకు తెలుసు, కృష్ణశాస్త్రికి తెలుసు, శ్రీశ్రీకి తెలుసు" అని తిలక్ కవితా కళను రసవాద విద్యతో పోల్చారు. "కవితవున్నప్పుడే నవత రాణిస్తుంది, అసలు కవితలోనే నవత కూడా వుంది." కవిత్వంలో ఆబ్స్క్యూరిటీ కొన్ని సందర్భాలలో వుండొచ్చును. కాని పాఠకుడికి నీ అనుభూతి ఆకారం హత్తుకోవాలి. అది ట్రాన్స్‌పరెంట్ చీకటై వుండాలి, నిన్ను పలకరించాలి. కవిత కొత్త అను ్వాల కాంతి పేటికను తెరవాలి, కదిలించాలి". ఈ కాలంలో బ్రతుకు, యీ ప్రపంచాన్ని ప్రతిఫలించు, ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు, నువ్వు చెప్పేదేదైనా నీదైవుండాలి. నీలోంచి రావాలి - చించుకుని రావాలి" "కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చెయ్యాలి, విస్తరించాలి చైతన్య పరిధి. అగ్నిజల్లినా, అమృతం కురిసినా, అందం, ఆనందం దాని పరమావధి" (కవిత-నవత) అని కవితా కళను గురించి తన అభిప్రాయాల్ని వెల్లడించారు. కవిత్వాన్ని గురించి కవితాత్మకంగా చెప్పిన ఆధునిక కవులలో శ్రీశ్రీ తర్వాత తిలక్ ఎన్నదగినవాడు.

జీవితాన్ని గురించి తిలక్ ఊహలు రమ్యమైనవి. బ్రతుకును 'ఊగే [illegible] ఉయ్యాలగా', ఉలిపిరి కాగితం చందంగా', 'దేవతల దరస్మితంగా', 'లలిత లలిత లతాంతమాలగా' భావించిన తిలక్ జీవితంలోని చీకటి కోణాలను చూచి 'ఆర్తగీతం' రచించటం చెప్పుకోదగిన విశేషం. జీవితంలోని వెలుగునీడల్ని రెండింటినీ చూడగలిగిన కవే ఏ కాలంలోనైనా ఆదర్శప్రాయుడు.

మధ్య వయస్సులో హఠాత్తుగా మరణించిన తిలక్‌పై శ్రీశ్రీ, ఆరుద్ర, కాళోజీ, ఇస్మాయిల్, నార్ల చిరంజీవి మొదలైన ఆధునిక కవులు స్మృతిగీతాలు (Elegies) రచించారు.

లోకంలో ఉన్న దుఃఖాన్ని చూచి కవి తిలక్ [illegible] మానవతా దృష్టితో రచించిన గీతం 'ఆర్తగీతి,' లోకంలో తన కళ్లెదుట కన్పిస్తున్న దుర్భర దృశ్యాలను కవి కరుణామయంగా ఉత్తమ పురుషలో వర్ణించారు.

"ఈ రోజు నాకు విషాదస్మృతి. విధి చీకట్లు క్రమ్మజేసి గుడ్లగూబలు అరచిన స్థితి. నా మనస్సు మోడైపోయిన దుస్థితి ఇటువంటి స్థితిలో నా మనస్సు సుఖాలు కోరదు. ప్రియురాలి సింగారము వద్దు. గొప్ప పరిమళభరితమైన శయ్యవద్దు. రసానందంవద్దు. చిత్రశిల్ప కవిత్వ ప్రసక్తికోరను. తత్వసూత్రాల చర్చలకు చలింపను. అందమైన స్త్రీల నులివెచ్చని కౌగిలింతలను కోరను. గత చరిత్ర కీర్తికలాపములను నాకు వివరింపవద్దు. అనేక వేల వీర గాథలను వినిపింపవద్దు. నన్ను ఇంక విసిగింపవద్దు."

"నేడు నేను కన్నీరుగా కరిగిన గీతాన్ని, సిగ్గుతో రెండుగా చీలిన వెదురుబొంగును. మంటలో లోలోపల దగ్ధమైన బూడిదను. పైన దైవానికి, కింద మానవుడికి జవాబు చెప్పవలసినవాణ్ణి. పాతాళ లోకంలోకి శిరసువంచినవాడిని."

'ఈ రోజు నేను చూసిన దేమి? విధి ఇన్ని కత్తులను దూసినదేమి? కత్తి అంచున రక్తమేమిటి? అని కవి తన మనస్సులోని ఆవేదనను వెల్లడించారు. ఆ ఆవేదనకు కారణమైన దుర్భర దృశ్యాలను కవి వివరించారు.

ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాడిని; తల్లిలేక తండ్రిలేక తిండిలేక ఏడుస్తూ, ముంజేతులతో కళ్ళు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కన నిద్రించిన మూడేళ్ల పసివాడిని; తనకు ఆహారం



BRAOU

లేకపోయినా పిల్లలకు గంజిపోసిన ప్యూన్ వీరన్నని; క్షయ రోగపు భార్య బతకదని డాక్టరు చెప్పగావిని, సుడిగాలిలో కడిమిచెట్టుకొమ్మలాగ వణికిపోయిన ఐదారుగురు పిల్లలున్న గుమాస్తాని; మూర్తీభవించిన దైన్యాన్ని, హైన్యాన్ని శవాకార వికారులనూ చూశానని కవి ఆ దుర్భర దృశ్యాలను కళ్ళకు కట్టేలాగ వర్ణించారు.

పై దుర్భర దృశ్యాలను వివరించాక కవి "ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి? ఏ బుద్ధదేవుని జన్మభూమికి గర్వస్మృతి?" అని ప్రశ్నించారు. దుర్భర దృశ్యాలను చూసిన కవి కుంగిపోయి "ఈ రాత్రి ఇంక నేను పాడలేను; ఈ కృత్రిమ వేషాన్ని అభినయించలేను. ఇంకనన్ను నిర్బంధించవద్దు; మానవతలేని లోకాన్ని స్తుతింపలేను; మానవునిగ శిరసెత్తుక తిరగలేను; ఈ నాగరికతారణ్యవాసం భరించలేను" అంటున్నారు.

ఒక్క నిరుపేద ఉన్నంతవరకు, ఒక్క ఆకలి పేగు కనలినంతవరకు, ఒక్క మలిన అశ్రు బిందువు వొలికినంతవరకు, ఒక్క ఎండిపోయిన రొమ్ము చెంత ఆకలితో ఏడ్చేపాప ఉన్నంతవరకు, ఒక బాధా తప్తమైన హృదయం ఊరడిల్లనంతవరకు నాకు శాంతి కలుగదు. ఈ గుండె గూడుపట్లు కదిలినవి. నా ఆర్తి ఏ సౌధాంతరాలకు పయనింపగలదు? ఏ రాజకీయ వేత్త గుండెలను స్పృశించగలదు? ఏ భగవంతునికి నివేదించుకొనగలదు?" అని వాపోతున్నారు.

### 10.3.3 విశేషాంశాలు

'ఆర్తగీతి' గొంతెత్తి చదవదగిన వచన గీతం. వచన కవిత్వంలో ఏవో కొన్ని రచనలు తప్ప ఎక్కువ భాగం గానయోగ్యమైనవి. భావాన్ని అనుసరించి పాఠకుని ఉత్సుకతను ఏమాత్రం పడలనివ్వని లయ ఈ గీతానికి ప్రాణం. "శైలిలో, ఉక్తి విధానంలో, కొన్ని చోట్ల కావ్య వస్తువులో కూడ" ఆర్తగీతం భావ కవిత్వాన్ని తలపిస్తుంది. గీతం వాడుక భాషలో ఉన్నట్లనిపించినా "ఉదాత్తసురభిళాత్త శయ్యాసజ్జితము; ప్రచండ వాతూలహతనీపశాఖ" మొదలైనవి గ్రాంథికఛాయను సూచించే సమాసాలే. సగం వ్యావహారికం సగం గ్రాంథికం ఛాయలను కలగలిపిన ఈ శైలి తిలక్ ప్రతిభ[illegible] రమణీయంగా రూపొందింది. తర్వాతి కవులకు మార్గదర్శకమైంది.

"విధి తమస్సులు మూసిన దివాం[illegible]రుతి ఉదాత్తసురభిళాత్త శయ్యాసజ్జితము; సుందర వధూ కదుష్టపరిరంభములు; రాత్రీముఖరుది[illegible]కంఠ నాళము; ప్రచండ వాతూల హతనీపశాఖ" మొదలైన పదంబధాలు అన్వయక్లిష్టమైనవి కా[illegible]. ప్రాచీన కవులలో నన్నయ్య కవిత్వంలోని సమాసాలవలె సులభంగా అర్థం చేసుకోవటానికి వీలైనవే.

BRAOU

### అభ్యాసం – 1

'ఆర్తగీతి' లో కవి సామాజిక పరిస్థితులకు పొందిన ఆవేదననూ, వెలువరించిన మానవతావాద దృక్పథాన్నీ వివరించండి ?

### 10.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వం సంప్రదాయంలో మానవతావాద సద్ధతికి సంబంధించిన పాఠ్యం 'ఆర్తగీతం'.
- ఈ పాఠ్య రచయిత బాలగంగాధర తిలక్

- భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం దృక్పథాలను మేళవించి, సర్వమానవ సంక్షేమాన్ని సంకల్పిస్తూ పోయే కవితాధోరణి తిలక్‌ది.

  ఈ పాఠ్యంలో సమకాలీన సమాజంలోని కుళ్ళునూ, దౌర్బల్యాలనూ అనితరసాధ్యమైన మానవతావాద కవితా పద్ధతిలో చిత్రించారు తిలక్.

- అధికార వర్గం, సంపన్నవర్గం పీడిత జనానీకానికి చేదోడువాదోడుగా నిలిచి, ఆదరణను, ఆప్యాయతనూ పంచిపెట్టాలని కరుణాత్మకంగా, కాంతాసమ్మితంగా ప్రబోధించారు తిలక్ ఈ పాఠ్యంలో.

## 10.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

'ఆర్తగీతి' ఆధారంగా తిలక్ కవిత్వ దృక్పథాన్ని చిత్రించండి ?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

'ఆర్తగీతి' లోని కవిత్వ సౌందర్యాన్ని వివరించండి ?

## 10.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఆర్తగీతిలోని సమాసాల పట్టిక తయారు చేయండి.
2. తిలక్ కవిత్వంలోని భావ, అభ్యుదయ, మానవతావాద కవిత్వాంశాలను గుర్తించండి.

### అభ్యాసానికి జవాబు

1. దేవరకొండ బాలగంగాధర తిలక్ 'ఆర్తగీతి' లో కరుణామయమైన పెక్కు దృశ్యాలను వర్ణించారు. తిలక్ ప్రధానంగా అనుభూతివాది. భావకవిత్వం తన చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చి కనుమరుగౌతున్న దశలో కలంపట్టిన కవి తిలక్. ఆయన 1941-66 సంవత్సరాల మధ్య రచించిన వచన కవిత్వం 'అమృతం కురిసిన రాత్రి' కావ్యసంపుటిలో ఉన్నది.

"వచనకవితా ప్రక్రియను పురిపుష్టం చేసిన కొద్దిమందిలో తిలక్‌కు ప్రత్యేకస్థానం ఉంది. ఈనాడు చాలావరకు పరిపక్వమైన వచనగేయపు శైలికి అతను ఎంతో దోహదం చేశాడు. వచనగేయపు శైలిలో తిలక్ చూపిన ఒడుపు వల్ల ఆ ప్రక్రియ సంప్రదాయ కవితాభిమానులను కూడా చాలావరకు వశపరుచుకుంది" అని శ్రీ కుందుర్తి ఆంజనేయులు భావించారు (మావాడు - మహగట్టివాడు - 'అమృతం కురిసిన రాత్రి' పీఠిక).

'ఆర్తగీతి' ని కవి తాను పొందిన వేదనతో ప్రారంభించారు. "నాదేశాన్ని గూర్చిపాడలేను నీ ఆదేశాన్ని మన్నించలేను" అన్నారు. "ఏదేశమేగినా ఎందుకాలిడినా ఏవ్వరెదురైన పొగడరా నీతల్లి భూమిభారతిని" అన్న రాయప్రోలు వారి ప్రబోధానికి 'ఆర్తగీతి' జవాబులాగ అనిపిస్తుంది. తనదేశాన్ని గూర్చి పాడలేక పోవటానికి కారణం కవిమనస్సును ఆవహించిన విషాదం. ఈ విషాదసమయంలో చిత్రశిల్ప కవితాప్రసక్తి, ఉదాత్త సురభిళాత్త శయ్యాసజ్జితము, సుందరవధూకదుప్ప పరికంభము ఏవీ వద్దం టున్నాడుకవి. పైనదైవానికి, కిందమానవులకి జవాబు చెప్పవలసిన తనబాధ్యతను గుర్తు చేసుకున్నాడు. ఆ రోజు తాను చూసిన దుర్భరదృశ్యాలను ఏకరువుపెట్టాడు.

ఆకలితో అల్లాడి మర్రిచెట్టుకింద మరణించిన ముసలివాడు; నీరంధ్రవర్షంలో వంతెన కింద నిండుచూలాలు ప్రసవించి మూర్ఛపోయిన ఒక దృశ్యం; తల్లిలేక తండ్రిలేక ఏడుస్తూ ఆకలితో మురికి



BRAOU

కాల్వపక్కన నిద్రించిన మూడేళ్లపసివాడు; తనకు తిండి లేకపోయినా పిల్లలకు గంజికాచిపోసి నిరాహారుడై ఆఫీసుకు వచ్చిన ఫ్యూన్ వీరన్న; క్షయరోగపు భార్య బతకదని తెలిసినప్పుడు కడిమిచెట్టు కొమ్మలాగ గజగజ వణకిపోయిన అయిదారుగురు పిల్లలున్న గుమాస్తా కవికి కనిపించి ఆయన హృదయాన్ని ముక్కలుగా కోసినవారు. ఆ వేదనా శకలాలే 'ఆర్తగీతి' లో కనిపించే దృశ్యాలు.

ఇటువంటి దౌర్భాగ్యస్థితి బుద్ధదేవుని జన్మభూమికి గర్వస్మృతి కాదని తీవ్రస్వరంతో తిలక్ హెచ్చరించారు. ఒక్క ఆకలి ప్రేగు కనలినా తన హృదయం శాంతించదన్నారు. ఒక శుష్కస్తన్యసన్నిధిలో క్షుధార్తితో ఏడ్చేపాప ఉన్నా తన గుండెగూడుపట్లు సడలిపోతాయన్నారు. అయినా తనవేదన రాజకీయ నాయకులకు, చివరికి భగవంతుడికైనా వినిపిస్తుందా ? అని ఆర్తనాదం చేశారు.

"కవిత్వం ఒక ఆల్కెమీ : దాని రహస్యం కవికే తెల్సు" అన్నారు తిలక్. కవితా రహస్యం తెలిసిన కవి ఆయన. అగ్నిజల్లి అమృతం కురిపించి అందాన్ని ఆనందాన్ని అందివ్వ గలిగిన తిలక్ ఆధునికాంధ్ర కవులలో దీపస్తంభంలాంటి వాడు.

– డాక్టర్ కె. రామమోహన్ రాయ్

BRAOU

# భాగం 11 రెండు లోకాలు

విషయక్రమం

11.0 ఉద్దేశం
11.1 ప్రవేశిక
11.2 సూచనలు
11.3 పాఠ్యం
    11.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    11.3.2 వ్యాఖ్యానం
    11.3.3 విశేషాంశాలు
అభ్యాసం
11.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
11.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
11.6 ఆకలింపు ప్రశ్నలు
    అభ్యాసానికి జవాబులు

## 11.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది అంశాలను వివరించగలుగుతారు.

- కుందుర్తి వచన కవితా రీతులు.
- 'రెండు లోకాలు' లోని అభ్యుదయ కవిత్వాంశ.

BRAOU

## 11.1 ప్రవేశిక

వచన కవిత్వ పద్ధతిలో ప్రాశస్త్యం ఉన్న కథాకావ్యాలు రచించిన అభ్యుదయకవి కుందుర్తి ఆంజనేయులు. పద్యం, గేయం కంటే వచనకవిత్వమే ఎక్కువగా ఆమోద యోగ్యమైన ప్రక్రియ అని ఈయన విశ్వాసం. పండిత పామరులందరినీ అలరించే ప్రక్రియ - ప్రభావశీలమైన, విస్పష్టమైన భావ ప్రకటనకు విశేషంగా సహకరించే ప్రక్రియ-వచనకవిత్వమని కుందుర్తి గట్టినమ్మకం. కవి ఆశించిన సామాజిక సంస్కరణలనూ, అభ్యుదయ మానవతావాదదృక్పథాన్నీ ఈ భాగంద్వారా మీరు అవగతం చేసుకుంటారు.

## 11.2 సూచనలు

ఈ పాఠ్యం చదివేముందు విద్యార్థులు కుందుర్తి రచించిన "తెలంగాణ, యుగేయుగే, నగరంలో వాన, నాలోని నాదాలు, కుందుర్తి కృతులు" అనే కావ్యాలు పరిశీలించాలి. అందువల్ల విద్యార్థులకు కుందుర్తి కవితారీతులూ, అభ్యుదయ రచనా భావాలూ అవగతమౌతాయి. ఆ అధ్యయనాన్ని సమన్వయపరచుకుంటూ విద్యార్థులు ఈ పాఠ్యం చదువుకోవాలి.

## 11.3 పాఠ్యం

ఇక్కడ ఒక లోకం :-

చరమసంధ్యకు విడాకులిచ్చి, రవిజేసిన చీకటి తప్పు
చరిత్రనిర్మించిన ధరిత్రి కమలవనానికి ముప్పు

ఇక్కడి మనుషులు :-

హేతువును జీర్ణించుకోలేని మనసులు
చిలకల మూతులు బిగిస్తారు

పంజరాల అధికోత్పత్తికి ప్రణాళికలు వేస్తారు.
మంచినీటి బావుల్లో మందు కలిపి తాగిస్తారు.

ఇక్కడి వాళ్ళు :–

సర్కస్ డేరాల్లో ఆడే పులులు
చెరువులో చేపల్ని పట్టుకోలేని వలలు
చక్రవడ్డీ పరిధుల్లో అసువులుబాసిన అసళ్ళు
కన్నీళ్లు కార్చే మొసళ్ళు

ఎటుపోయిన అడవి మృగాలు తిరిగే జాడలు
మిణుగురులను నిరంతరం వేటాడే చీకటి
అజ్ఞాతవాసుల ఆచూకీ యిచ్చే కొండ శిఖరాలు
అప్పుడప్పుడు మరతుపాకీ కాల్చే యోగులు.

ఉపోషాలు చేసే భోగులు, వీధుల్లో పెంటపోగులు.
ఇక్కడిబ్రతుకులు అక్షరాన్ని పూర్తిగా పలకలేని ద్రుతాలు
సంఘంబాగుకు సత్యనారాయణ వ్రతాలు; మతాలు కల్పించిన నిమ్నోన్నతాలు
ఇక్కడ లాభాలు పెరిగినకొద్దీ కంపెనీలు దివాలా తీస్తై

జీవాలు గొంతుపట్టుకొని నూతుల్లోకి చూస్తై
పరిశ్రమల పావుకోళ్ల కింద ముడిసరుకులు నలుగుతై
ప్రతినిత్యం ధరవరలు ప్రజల మీద అలుగుతై
నదులూ సముద్రాలూ పొంగి ఇతరుల పొలాలు ఆక్రమించుకుంటై

ఇక్కడ మిన్నుకూ మన్నుకూ మధ్య మేఘం గోడలు కట్టింది.
వ్యక్తికీముక్తికీ మధ్య హరివిల్లు గిరిగీసి పెట్టింది.
ఎక్కడ చూసినా ఓడిన హోదాలు – వాడిపోయిన వినాదాలూ
ఏనుగును వర్ణించిన జనుషాంధుల వాదాలు.

ఒక ప్రక్క యెన్ని గండాలు గెలిచినా తీరని రణదాహం
యెన్నిగండాలు వచ్చినా ఆరని పదవీ వ్యామోహం.
యెదురుగా గాలిమేసి ముడుచుకు పడుకున్న పాముల ఫణాలు

మానని మానభంగాల వ్రణాలు !
ఇక్కడ అణుబాంబులు – రాచరికం వీపులమీద పుండ్లు
శాంతికి – చరిత్రతీసుకొనే విశ్రాంతికి – గండ్లు.
ఇక్కడ తిండిలేని వాళ్ళకు కందమూలాల కోసం
ధీరులు అడవికి పోతారు.

ఇంటివద్ద బొడ్రాయి చుట్టూ దిగంబరులు ఆటవిక నృత్యం చేస్తారు.
ఇక్కడ అన్నిటికీ స్వేచ్ఛ
నీతిని ఇంట్లో కట్టేసి అధికారులు ఆఫీసుకు రావచ్చు.
అభిమానాన్ని నెట్టేసి నాయకులు కారుల్లో ఊరేగొచ్చు.

ఖర్చుల దుబారాను లేపుకొచ్చి ఖజానాలో కాపురం చెయ్యొచ్చు
దినపత్రికల రైళ్ళమీద ఊరూరికీ పుకార్లు షికార్లు చెయ్యొచ్చు.
ఇక్కడికి అందరూ రావచ్చు – ఇది పాతాళానికి మచ్చు
వెల్తురు చాలక చెడిపోయిన ఫోటో – వెనుకటి తరాలకు డిటో

BRAOU

అక్కడ ఒక లోకం :-

వికసించిన వేకువలో పూసిన ఉదయం పువ్వు
చరిత్ర పెదవులపైన తొలిసారిగా విరిసిన నవ్వు

అక్కడి మనుష్యులు :-

చేసిన యోగాభ్యాసం సిద్ధించిన మనసులు
తెల్లని పావు రాళ్లను పెంచుతారు
మెడలో చీటీలు కట్టి మిన్ను మీదికి వదుల్తారు
పంజరాల ఉత్పత్తి నిషేధిస్తారు.

అక్కడి వాళ్ళు :-

సంకెళ్ళు లేని కాళ్ళు
నిర్బంధప్రాస నియమాల్తో నిమిత్తం లేని కవిత్వాలు
ధనగిరుల గర్వాన్ని అణచిన ముని శిఖామణులు
కిరాతకుడి బాణం పలికించిన ఉత్తమ శ్లోకాలు

జాతివైరాలు మాని ఆశ్రమాల్లో నివసించే సాధుమృగాలు
యిరులు మ్రింగి వెన్నెలంతగా పెరిగిన మిణుగురు పురుగులు
వానమబ్బుల్ని ఆకర్షించుకొనే కొండ శిఖరాలు.

అక్కడి పరిశ్రమలు లాభాలకు విడాకులిచ్చి
ప్రజలకు పెండ్లి చేసుకుంటై
ధరలన్నీ జలాంతర్గాముల్లో ఉద్యోగాలకు కుదురుతై
నెలనెలా వచ్చే వరుమానాలు కొలమానాలకు అందవు
అక్కడ మేఘాలు కట్టిన లేమి గోడల విరిగి భూమి మీద పడితే
వాటి వానల మేనాల మీద సమృద్ధి గిరులు దాటి పారుతుంది.

అది ఒక వింత నిర్బంధాల సంత –
ఆదర్శవంతమైన అభిప్రాయాల విక్రయాలు రద్దు చేస్తారు.
గ్రామాల్లో వీధులన్నీ గుడిసె గుర్తుల్ని చెరిపేస్తే
శాస్త్రం చేసే నిరంకుశాజ్ఞకు లోబడి
అందరికీయెండ అన్నం నండి పెడుతుంది.

సాగరం వెనక్కి మళ్ళి భూమిని విశాలంచేస్తుంది
నదులు అభిసారికలై పంట పొలాల్ని వెదుక్కుంటై
చెప్పినట్లు వినే మంచి పిల్లవాడిలా
అణువు రైళ్ళు నడుపుతుంది–గని గర్భం తొలుస్తుంది

ఆరు ఋతువులు మొక్కలకు దాస్యం చేస్తై
మనిషినాటిన శ్రమచెట్టువిరివిగా, సరిగా తప్పని సరిగా ఫలిస్తుంది.
చీకటి చేత ఉద్యమానికి బలవంతంగా రాజీనామా పెట్టిస్తారు.
వెలుక్కి ప్రతియింట్లోను వెట్టిచాకిరి శాసిస్తారు.

అక్కడ మానవుడి తలంపులు తారలను వెక్కిరిస్తై
రాకెట్లవేగాన్ని, అభివృద్ధి యెద్దుబండితో పోలుస్తుంది
అక్కడి అందరూ పోవచ్చు – భూదేవి ధరించిన బంగారపు జడకుచ్చు
వెన్నెల తీగల రాగాల "మాటో" – చీకటికి "వీటో".



BRAOU

### 11.3.1. కఠిన శబ్దాలకు అర్థాలు

చరమసంధ్య = మునిమాపు
ధరిత్రి = భూమి
కమలవనం = తామరపువ్వులతోట
అసువులు = ప్రాణాలు
ద్రుతాలు = నకారపొల్లులు
జనుషాంధులు = పుట్టు గుడ్డివాళ్ళు
అభిసారిక = ప్రియుని వెదక్కొంటూ వెళ్ళే స్త్రీ
'మాటో' (Motto) = దీక్షావాక్యం
వీటో (Veto) = నిషేధం

### 11.3.2 వ్యాఖ్యానం

కుందుర్తి ఆంజనేయులు (1922-1982) నర్సరావుపేట సమీపంలో ఉన్న కుందుర్తివారి పాలెంలో జన్మించారు. వినుకొండలో, నర్సరావుపేటలో, గుంటూరులో చదివి బి.ఏ. పట్టం పొందారు. జాషువా సాంఘిక విప్లవభావాలు, విశ్వనాథ భావుకవైచిత్రీ కుందుర్తికి కవితాప్రేరణ కల్పించాయి. విద్యార్థిదశలో "సౌప్తికము" అనే పద్యకావ్యం రచించారు. తర్వాత తన భావప్రకటనకు అనువైనది వచన కవిత్వమేనని తలచారు. బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారలతో కలిసి 'నయాగరా' (తొలి తెలుగు వచన కవితా సంకలనం) వెవరించారు (1944). తర్వాత తెలంగాణ (1956) ఆశ (1957) యుగే యుగే (1959) నగరంలో వాన (1967) నాలోని నాదాలు (1967) కుందుర్తి కృతులు (*975) అనే కావ్యాలు రచించారు. 1982లో కుందుర్తి మరణించారు. ఆయన మరణానంతరం ఆయన రచనలు "హంస ఎగిరి పోయింది; తీరానేనుకాస్తా ఎగిరిపోయాక; మేఘమాల" అనే సంకలనాలుగా వచ్చాయి.

1956లో కుందుర్తి 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' స్థాపించి వచనకవితా వికాసానికి ఎంతో దోహదం చేశారు.

నిరాడంబరమైన శైలి నిత్యజీవితంలో అందరి ఊహలకూ అందే చక్కని ఉపమానాలు సంస్కరణాత్మకమైన అభ్యుదయ దృక్పథమూ కుందుర్తి కవిత్వాన్ని ఆస్వాదయోగ్యంగా చేస్తాయి.

వర్తమానకాలంలో మనదేశ దుస్థితిని వర్ణించి, భవిష్యత్తులో మనం పొందవలసిన ఒక ఆనందమయలోకాన్ని గురించి కవి కలగనటం ఈ గీతంలో విషయం.

సూర్యుడు మునిమాపుకు విడాకులిచ్చి చీకటి తప్పుచేస్తే అది చరిత్రను నిర్మించిన తామరవనానికి ముప్పుగా పరిణమించిందన్నారు. అంటే దేశంలో చీకటిమయమైన నిరాశవ్యాపించి ఉన్నదని కవి ధ్వనిస్తున్నారు. ప్రజలు అజ్ఞానంలో ఉన్నారు. హేతువును జీర్ణించుకో లేకుండా ఉన్నారు. కోరి కోరి నిర్బంధాలను కొని తెచ్చుకుంటున్నారు.

ఇక్కడి ప్రజలు నిస్సహాయులు, చక్రవడ్డీలు కడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్న నిర్భాగ్యులు వీళ్ళపై జాలి ఉన్నట్లు నటించే మనుషులు మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఎవరైనా తిరుగుబాటు చేసి అడవులలో కొండలలో దాక్కున్నా, వాళ్ళ ఆచూకీ పట్టి ఇచ్చేసే అజ్ఞానులు ప్రజలు. తిరుగుబాటుదారుల్ని కాల్చేసి 'డ్యూటీ' చేసినట్లు ప్రవర్తించే యోగులు అధికార్లు. ప్రజాసమస్యలకోసం రాజకీయనాయకులు ఉపవాసాలు చేస్తున్నట్లు నటిస్తున్నారు. దారిద్ర్యం ఎప్పటిలాగే ఉన్నది. ఎన్ని సత్యనారాయణ వ్రతాలు చేసినా బాధలు తీరటం లేదు.

ఒక పక్క ఎటు చూసిన దేశాల మధ్య రణదాహం; నాయకులపదవీ వ్యామోహం; నిస్సహాయులైన స్త్రీల మానభంగాలు, నీతిని ఇంట్లో విడిచి అధికారులు ఆఫీసుకు రావటం, నాయకులు అభిమానాన్ని వదిలివేసి కార్లల్లో ఊరేగడం, దినపత్రికలు పుకార్ల ప్రచారం చేయటం - వీటన్నిటితో దేశం నానాబీభత్సంగా ఉన్నది. ప్రస్తుతపరిస్థితులలో దేశం వెనుకటి తరాలకు నకలుగా వెలుతురు చాలక చెడిపోయిన ఫోటోలాగ ఉన్నది.

ఇక భవిష్యత్తులో మనం పొందబోయే లోకం "వికసించిన వేకువలో పూజిన పువ్వు లాంటి ఉదయం" లాగ ఉంటుంది. "చరిత్రపెదవులపై తొలిసారిగా విరిసిన నవ్వు"లా ఉంటుంది. అక్కడి మనుషులు స్వేచ్ఛనూ శాంతినీ ప్రేమిస్తారు.

అక్కడి మనుష్యులు "నిర్బంధప్రాసనియమాల్తో నిమిత్తం లేని కవిత్వం" లాంటి వాళ్ళు. "కిరాతకుడి బాణం పలికించిన ఉత్తమ శ్లోకాల" లాంటి వాళ్ళు.

అక్కడ వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. పరిశ్రమలు ప్రజోపయోగకరంగా నడుస్తాయి. ఉత్పత్తులు విరివిగా ప్రజలకు లభిస్తాయి. గ్రామాలలో పూరిళ్ళు వుండవు. సూర్యశక్తి అందరికీ అన్నంవండి పెడుతుంది. నదులు సముద్రంలోకి కాక పంట పొలాల్లోకి ప్రవహిస్తాయి; అణువు రైళ్ళు నడుపుతుంది. గనిగర్భం తొలుస్తుంది.

ఆరు ఋతువులూ పంటలు పండటానికి అనువుగా ఉంటాయి. ప్రజలకు శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. అభివృద్ధి రాకెట్ల వేగంతో సాగుతుంది. ఆ లోకం అందరికీ అనుభవయోగ్యమే. అది "భూదేవి ధరించిన బంగారపు జడకుచ్చు; వెన్నెల తీగెల రాగాల "మాటో" చీకటికి వీటో.

**కవిదృక్పథం**

ఇప్పుడున్న వర్గ సమాజంలో మనుషులు మనుషుల్లా బ్రతకటం లేదు. అడుగడుగునా దోపిడీ; ప్రజలు బానిస బతుకు బతుకుతున్నారు. స్వేచ్ఛ లేదు. పండిన పంటలు, పరిశ్రమల ఉత్పత్తులు అన్నీ కలవాళ్ళకే దక్కుతున్నాయి. అవినీతి స్వేచ్ఛగా ఊరేగుతున్నది. అనారోగ్యం అవిద్య అజ్ఞానం తాండవం చేస్తున్నవి. ఇది ప్రస్తుత సమాజపు తీరు అని కుందుర్తి 'రెండు లోకాలు' లో మొదటి లోకం ఎలా ఉన్నదో వర్ణించారు.

సమసమాజ నిర్మాణం జరిగిన తర్వాత సోషలిస్టు సమాజంలో ప్రజలు శాంతి సౌఖ్యాలతో జీవిస్తారని కవి ఆశిస్తున్నారు. సోషలిస్టు సమాజానికి పునాది అయిన మార్క్సిస్టు తత్త్వాన్ని కవి అభిమానించారు. సాధారణంగా మార్క్సిజాన్ని నమ్మిన కవులు, రచయితలు ఉపయోగించే సాంకేతిక పదాలను కుందుర్తి ఉపయోగించక పోవటం గమనార్హం.

పేదలు, దీనులు బాధలకు గురిఅవుతున్న సమాజాన్ని మొదటి లోకంలోనూ; సమసమాజం ఏర్పడిన శ్రామిక లోకపు స్వర్గాన్ని రెండవ లోకంలోను కవి వర్ణించారు.

### 11.3.3 విశేషాంశాలు

**లయ, ఛందస్సు, అలంకారాలు, పదచిత్రాలు**

వచన కవిత్వంలో కుందుర్తి తనదైన ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకున్నారు. అందులో సమాసాడంబరత ఉండదు. వ్యవహారంలో లేని సంస్కృత పదాలుండవు. చదవను, రాయను వచ్చిన సామాన్య లందరికీ అర్థమయ్యే పదాలను, పద బంధాలను ఆయన ఉపయోగిస్తారు. నిరాడంబరంగాఉండి కూడ కుందుర్తి వచన గీతం గొంతెత్తి చదవటానికి వీలైన లయతో ఉంటుంది; ఆహ్లాదకరమైన శబ్ద విన్యాసం ఉంటుంది. సంప్రదాయ వాసన వదలని కొందరు వచన కవుల గీతాల్లోలాగ కుందుర్తి వచన కవిత్వంలో తెగిపోయిన పద్య పాదాలుండవు. ఛందస్సును విడిచిపెట్టినా కవిత్వ గమన సౌందర్యానికి లోటుండదని కుందుర్తి నిరూపించారు. "ఇక్కడివాళ్ళు కన్నీళ్ళు కార్చే మొసళ్ళు" అన్న చోట కవి ఉపమాలంకారాన్ని ఉపయోగించారు. "ఉపోషాలు చేసే భోగులు", "ఇక్కడి బ్రతుకును పూర్తిగా పలకలేని ద్రుతాలు" మొదలైనవి ఇటువంటివే.

"మరతుపాకికాల్చే యోగులు, ఉపోషాలుచేసే భోగులు; అక్షరాన్ని పూర్తిగా పలుకలేని ద్రుతాలు; వెన్నెల తీగల రాగాలు" మొదలైనవి కుందుర్తి భావనాశక్తికి చక్కని నిదర్శనాలు.

**ఆదనపు సమాచారం**

**1. వచన కవితా వికాసం : కుందుర్తి**

1930 తర్వాత తెలుగు కవిత్వపు బహిరాకృతిలో వచ్చిన మార్పు 'వచన కవిత్వం'. ఛందోబంధాలను వదిలించుకోవటానికి భావ కవులు ప్రయత్నించినా, వారు స్వేచ్ఛకోసం పరితపించారే గాని నియమాలను తెంచి వేయలేదు. ఈ స్వేచ్ఛతో సరిపెట్టుకోకుండ



BRAOU

దరిదాపు గద్య కవిత్వమనదగిన రచనలు చేశారు. మల్లవరపు విశ్వేశ్వరరావు కూడ కొన్ని 'వచన గేయాలు' రచించారు.

వచన కవితకు ఆద్యుడుగా పేర్కొనదగినవాడు శిష్ట్లా ఉమామహేశ. ఆయన 1936-38 దాకా రాసిన వచన గీతాలు 'విష్ణుధనువు', 'నవమి చిలుక' కావ్య సంపుటులుగా వచ్చాయి. శిష్ట్లా తన వచన గీతాలను "ప్రాహ్లాద కవిత్వమనిపించారు. 1939లో పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' అనే కావ్య సంపుటి వచ్చింది. "నా వచన పద్యాలనే దుడ్డుకర్రతో పద్యాల నడుములు విరగదంతాను" అని పఠాభి తిరుగుబాటును ప్రకటించారు.

ముద్దు కృష్ణ నడిపిన 'జ్వాల' పత్రిక, తర్వాత "ఉదయిని, ప్రతిభ, కృష్ణా పత్రిక" మొదలైన పత్రికలు వచన కవిత్వాన్ని ఆదరించాయి. తొలితరం వచన కవులలో ముద్దుకృష్ణ, నారాయణబాబు, శ్రీశ్రీ, పురిపండా, పఠాభి, పాలగుమ్మి పద్మరాజు ప్రసిద్ధులు. జరుక్‌శాస్త్రి), తిలక్, సంపత్, సింగరాచార్య మొదలైనవారు వచన కవితకు మరింత సొగసులు దిద్దితీర్చారు.

'నయాగరా' కవులు (బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, కుందుర్తి ఆంజనేయులు) అజంతా, బైరాగి, కాళోజీ, దాశరథి, ఆరుద్ర, వరద రాజేశ్వరరావు, అనిశెట్టి, సోమసుందర్, రమణారెడ్డి, గంగినేని, చిరంజీవి మొదలైన వారువచన కవిత్వానికొక స్థిరమైన ఆకృతి నివ్వటంలో తోడ్పడ్డారు.

ఛందోరహితమైన కొత్త కవిత్వానికి "వచనగేయం; వచన పద్యం; వచన కవిత; ఫ్రీవర్స్; వర్స్‌లిబరే; ముక్తచ్ఛంద కవిత" మొదలైన పేర్లు వ్యాప్తిలోకి వచ్చాయి. వీటిలో 'వచన కవిత' అనే పేరే ఎక్కువగా వాడుకలో ఉంది.

వచన కవిత్వంలో కవికి బాధ్యత మరీ ఎక్కువ. తన భావ దారిద్ర్యాన్ని ఛందస్సు మాటున దాచుకొనే వీలు వచన కవిత్వంలో ఉండదు. కవిత్వానికి మూలద్రవ్యాలుగా ఆలంకారికులు భావించిన రసం, ధ్వని, ఔచిత్యం మొదలైనవి వచన కవిత్వానికి కావాలి. వీటితో పాటు జీవిత విమర్శ మరీ అవసరం.

ఛందస్సును ధిక్కరించిన వచన కవులు అంత్య ప్రాసలకు లొంగిపోయారని వీరిమీద ఒక ఆరోపణ ఉంది. సమర్థులైన కవులు అంత్యప్రాసకోసం పాకులాడరు. వచన కవులలో శక్తి హీనులలో మాత్రమే ఈ దౌర్బల్యం కన్పిస్తుంది.

కుందుర్తి ఆంజనేయులు తన కవిత్వారంభ దశలో 'సాప్తికం' అనే పద్య కావ్యం రచించారు. తర్వాత తన భావ ప్రకటనకు వచన కవిత్వమే తగిందని తలచి యీ ప్రక్రియలో నిర్విరామ కృషి చేశారు.

తెలుగులో ప్రచురింపబడిన తొలి వచన కవితా సంకలనం 'నయాగరా' లో కుందుర్తి, బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంగార్లతోకలిసి వచన కవిత్వాన్ని శక్తిమంతంగా వెలువరించారు. కుందుర్తి రచించిన 'తెలంగాణ' వచన కవిత్వంలో వచ్చిన తొలి సమగ్ర కావ్యం. మహాభారతంతలోలాగ కవి యీ కావ్యాన్ని పర్వాలుగా విభజించారు. 'తెలంగాణ'లో కూడ పద్దెనిమిది పర్వాలే ఉన్నాయి. కోటి మంది తెలంగాణ ప్రజల కడగండ్లను వర్ణించిన ఉత్తమ కావ్యం 'తెలంగాణ'.

అభ్యుదయ రచయితల సంఘం కార్యకలాపాలు మందగించిన తర్వాత 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక, హైదరాబాదు కార్యరంగంగా వచన కవిత్వం మళ్ళీ చైతన్యవంతమై విస్తరించింది. ఈ ఉద్యమానికి నేత కుందుర్తి, ఆయన నాయకత్వాన 'ఫ్రీవర్స్ ఫ్రంట్' ఏర్పడి వచన కవిత్వంలో వైవిధ్యానికి, అభ్యుదయ భావ ప్రచారానికి కృషి చేసింది. వచన కవిత్వాన్ని ఉద్యమ మనడం కొందరికి నచ్చలేదు. బహిరాకృతి (Form) ని ఉద్యమ మనటం సరికాదని వారి వాదన. "సంప్రదాయచ్ఛందోలంకారాది పూర్వ సాధనములను వదలి నిరాడంబరంగా రసావిష్కరణ చేయడానికి గల అవకాశాలను గురించే గత 30 సంవత్సరాలుగా పరిశోధన జరిగింది. ఆ ప్రయోగశాలలో మనం సృష్టించిన నూతన మార్గమే యీ వచన కవితా మార్గము" అని గోపాల చక్రవర్తి 'వచన కవిత్వం ఒక ఉద్యమమా?" అనే సందేహానికి తావులేదనీ, కవితాత్మ ఏకాలంలోనైనా మారదనీ, బాహ్య రూపం మాత్రం మారుతుందని జవాబిచ్చారు.

వైవిధ్యం లేనిదే కవిత్వం నిలవదనీ, వచన కవిత్వంలో కథా కావ్యాలు రావాలని కుందుర్తి ఆశించారు. వచన కవిత్వంలో బృహత్కావ్యాలు వచ్చే అవకాశం ఉన్నదని కుందుర్తి తలచారు. కథా కావ్యాలు రావాలనే వాదనను శ్రీశ్రీ, తిలక్, మొదలైన కవులు సమ్మతించలేదు. ఆధునిక కవి దృష్టి ఒక లాంతరు పట్టుకొని

నలుమూలలకూ వెళ్ళి ఓపికగా పరిశీలించడం లాంటిది కాదు. వస్తు స్వరూపాలకూ, సంఘర్షణలకూ, శక్తులకూ మూలమైన కీలక స్థానం మీద శక్తిమంతమైన బ్యాట్రీలైటు ఫోకస్ వెయ్యటం లాంటిదని తిలక్ అభిప్రాయపడ్డారు.

వచన కవిత్వంలో ప్రయోగాలు జరగాలనే ఉద్దేశ్యంతో కుందుర్తి 'ఆశ', 'శిక్ష ఏమిటి?' అనే నాటికలీ ప్రక్రియలో వెలువరించారు. లేఖా రూపంలోవచన గీతాలురచించారు. చరిత్రలో విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రజల నుద్బోధించారు. కథా కావ్యాలు రావాలనే తలంపుతో "అజ్ఞాత శైశవం; ఆరంభ యౌవనం; అసమర్థకౌమారం; అవసాన వార్థక్యం" అనే గీతాలు రాశారు.

పద్యం రాజ్యమేలుతున్న కాలంలో వచన కవిత్వం రాసి, పండితుల్ని కూడ మెప్పించి "మేం మాత్రం పద్యమే కవిత్వమంటున్నామా? ఏమి?" అనే దాకా తీసుకు వచ్చిన ఖ్యాతి వీరిదే. సుమారు ఇరవై వచన కవితా సంకలనాలకు పీఠికలు రాసి, వచన కవిత్వ స్వరూపాన్ని తెలియజెప్పారు. వచన కవిత్వంలో ఆహ్వానించదగిన మార్పులను, వదలిపెట్టవలసిన భాషా భేషజాన్ని, ఆంగ్ల, సంస్కృత శబ్దాడంబరాన్ని, అయోమయమైన ఆలోచనలను అంత్యప్రాసలకు బంది అయిపోవటాన్ని గురించి పదే పదే హెచ్చరించారు.

## అభ్యాసం – 1

కుందుర్తి నిర్వచించిన రెండులోకాల వ్యత్యాసాన్ని నిరూపించండి?

## 11.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం.

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో వచనకవితా పద్ధతికి సంబంధించిన భాగం ఇది.
- వచన కవిత్వం పద్ధతిలో మహాకావ్య నిర్మాణం సాధ్యమేననీ, అభ్యుదయ కవిత్వం దృక్పథానికి సరియైన వాహిక వచనకవిత్వమేననీ నిరూపించిన కుందుర్తి ఆంజనేయులు రచన "రెండు లోకాలు".
- కవి ఆశించిన అభ్యుదయ సమాజానికీ, అనేక సామాజిక దురాచారాలలో కుళ్ళిపోయి ఉన్న నేటి సమాజానికీ ఉన్న భేదాన్ని చిత్రించడం ఈ రచన ఉద్దేశం.
- ప్రస్తుత సమాజ లోపాలను వర్ణిస్తూ ప్రగతిశీలమైన సామ్యవాద సమాజ స్థాపనను ప్రబోధించడం ఈ రచనలోకవి సంకల్పించిన ప్రధానాంశం.

## 11.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.
కుందుర్తి తిలక్‌ల కవిత్వ పద్ధతులను మీ పాఠ్యాంశాల ఆధారంగా పోల్చండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.
వచన కవిత్వ ప్రక్రియకు కుందుర్తి చేసిన సేవలను సమీక్షించండి?



BRAOU

## 11.6 ఆకళింపు ప్రశ్నలు

1. వచన కవితా వికాసాన్ని తెలుసుకోవటానికి "వచన కవిత్వం; పథాలూ, దృక్పథాలూ" అనే "ప్రివర్స్ ఫ్రంట్ ప్రచురణ" చదవండి.
2. వచన పద్యంలో లక్షణ చర్యను అధ్యయనం చెయ్యటానికి "వచన పద్యం - లక్షణ చర్య" చేకూరి రామారావు, సంపత్కుమారలు రచించిన గ్రంథం చదవండి.
3. కుందుర్తి కవిత్వంలో వచ్చిన క్రమక్రమానుగతమైన అభివృద్ధిని తెలుసుకోవటానికి "కుందుర్తి కృతులు, హంస ఎగిరిపోయింది. తీరా నేను కాస్తా ఎగిరి పోయాక, మేఘమాల" చదవండి.

### అభ్యాసానికి జవాబు

కుందుర్తి సమసమాజం ఏర్పడాలని ప్రగాఢంగా వాంఛించారు. ప్రస్తుత సమాజంలో ఉన్న రుగ్మతలకు సోషలిస్టు వ్యవస్థ మాత్రమే తగిన చికిత్స అని ఆయన భావించారు. మార్క్సిజాన్ని అనుసరించటం వల్ల నూతనమైన ఒక ఆదర్శ లోకం ఏర్పడుతుందని ఆయన తలచారు.

ముందుగా రెండు లోకాలలో మొదటి లోకంలో ఉన్న అనర్థాలను వర్ణించారు. హేతువాదాన్ని జీర్ణించుకోలేని మనుష్యులు అజ్ఞానంతో, అవిద్యతో, అనారోగ్యంతో, దారిద్ర్యంతో, బానిసత్వంతో అలమటించి పోతున్నారన్నారు. ఈ భావాన్ని కవి అలంకారికంగా తెలిపారు. "సూర్యుడు చీకటి తప్పు చేయబోయే ముందు మునిమాపుకు విడాకులిచ్చాడు. కమలవనానికి ముప్పు తెచ్చాడు" అని వర్ణించారు.

ప్రస్తుత సమాజంలో బాధల్ని భరించలేక ఎవ్వరైనా తిరుగుబాటు చేసి అడవులలో కొండలలో, తలదాచుకొంటే వాళ్ళ ఆచూకీని తెల్పే అజ్ఞానంలోఉన్నారు ప్రజలు అని వాపోయారు; విప్లవ వీరులను కాల్చి వేసి తమ విధిని నెరవేర్చామనుకొనే అధికార్లు; మొసలి కన్నీళ్ళు కార్చే నాయకులు; సిగ్గులేక ఊరేగే నాయకులు; నీతిని ఇంటి దగ్గర వదలి వచ్చిన అధికార్లు; 'ఉపోషలుచేసే భోగులు' కోకొల్లలుగా ఉన్నారీ సమాజంలో, [illegible] దారిద్ర్యం నానాటికీ హెచ్చవుతూంది. ఈ సమాజంలో ఉద్యోగులకు తగిన జీతాలుండవు. పరిశ్రమలలో లాభాలు కలవాళ్ళకే దక్కుతాయి, ఇది పాతాళ లోకానికి నకలుగా ఉంది. [illegible] తరాలకు 'నకలు'గా ఉంది. ఇది వెలుతురు చాలక చెడిపోయిన 'ఫొటో' లాగ ఉంది.

ఒక సామ్యవాద సమాజంలో లోకం వేకువలో వికసించిన పువ్వు లాగ ఉంది. చరిత్ర పెదవులపై తొలిసారి [illegible] నవ్వులాగ ఉంది. ఈ సమాజంలో శాంతి సౌఖ్యాలకు లోటు లేదు. స్వేచ్ఛ పుష్కలంగా ఉంది. నిర్బంధాలు లేవు. కిరాతుడి బాణం పలికించిన ఉత్తమ శ్లోకాలలాగ, నిర్బంధ ప్రాసనియమాలతో నిమిత్తం లేని కవిత్వం లాగ యీ లోకం ఆహ్లాదకరంగా ఉంది.

ఇక్కడ వానలు సమృద్ధిగా కురుస్తాయి. పరిశ్రమలలో లాభాలు శ్రామికులకు దక్కుతాయి. నిత్యావసర వస్తువుల ధరలు ఎప్పుడూ పెరగవు. ఈ లోకంలో పూరిళ్ళు ఉండవు. నదుల జలాలు సముద్రంలోకి కాక పంట పొలాల్లోకి ప్రవహిస్తాయి. అణువు రైళ్ళు నడుపుతుంది. గని గర్భం తొలుస్తుంది. ఇక్కడ వెలుగుకు లోటుండదు. ఇక్కడ అందరూ సమానమే. అభివృద్ధి రాకెట్ల వేగం కంటె ఎక్కువ వేగంగా జరుగుతుంది.

ఈ లోకం భూదేవి ధరించిన బంగారపు జడ కుచ్చులాగుంటుంది. ఇక్కడ వెన్నెల తీగల రాగాల దీక్షా నినాదం వినిపిస్తుంది. చీకటికి నిషేధం అమలు జరుగుతుంది.

ప్రస్తుత సమాజంలో పేదలు, బలహీనులు అనుభవిస్తున్న బాధలేవిధంగా ఉన్నాయో మొదటి లోకంలోను, సామ్యవాద సమాజం ఏ విధంగా ఉంటుందో రెండవ లోకంలోను వర్ణించి రెండిటికీ గల వ్యత్యాసాన్ని స్పష్టం చేశారు.

**— డాక్టర్ కె. రామమోహన్‌రాయ్**



BRAOU

# భాగం 12 నాక్కొంచెం నమ్మకమివ్వు

**విషయక్రమం**


12.0 ఉద్దేశం
12.1 ప్రవేశిక
12.2 సూచనలు
12.3 పాఠ్యం
    12.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    12.3.2 వ్యాఖ్యానం
    12.3.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
12.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
12.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
12.6 ఆకలింపు ప్రశ్నలు
    అభ్యాసాలకు జవాబులు


## 12.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- మనిషికీ మనిషికీ మధ్య ఉండవలసిన అత్యావశ్యక మానవసంబంధాలు, మనిషికి తోటి మనిషి మీదా సమాజం మీదా ఉండాల్సిన విశ్వాసం
- సంఘంకోసం పాటుపడే దృక్పథం.

## 12.1 ప్రవేశిక

ఈ పాఠ్యం సుప్రసిద్ధ ఆధునిక కవి ఆలూరి బైరాగి రచన. మనుషులందరి జీవితాలూ ఒకరి కోసం మరొకరు శ్రమించేవిగా సాగాలనే ఉద్దేశ్యంతో పరస్పర ప్రోత్సాహకంగా సాగాలనే లక్ష్యంతో బైరాగి రచించిన కవితను ఈ భాగంలో మీరు అధ్యయనం చేస్తారు.

BRAOU

## 12.2 సూచనలు

ఈ పాఠ్యం చదివే ముందు విద్యార్థులు బైరాగి రచించిన 'నూతిలో గొంతుకలు; ఆగమగీతి" అనే కవిత్వ గ్రంథాలను పఠించాలి. అందువల్ల మీకు బైరాగి కవితా రీతులతోపాటు, సమకాలీన సమాజంలో మానవతా వాదకవిత్వ పరంగా ఆయన రేకెత్తించిన సంచలనంకూడా అవగతమౌతుంది.

## 12.3 పాఠ్యం

నాక్కొంచెం నమ్మకమివ్వు!
    కొండలు పిండి కొట్టేస్తాను
    చితికిన టొమేటోలాంటి సూర్యుణ్ణి
    ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణి
    ఆకాశపు ఎంగిలి పళ్ళెంలోంచి నెట్టేస్తాను!
    నాదగు బాహు బంధనంలో ఈ విశాల బ్రహ్మాండాన్ని చాపలా చుట్టేస్తాను!
    నిస్సహాయ మానవేయుని నొసటివ్రాలు
    ఒక్క కలం పాటు తోటి కొట్టేస్తాను
    జీవిత సభా భవన ద్వారం నుంచి
    అన్యాయాన్ని, అక్రమాన్ని మెడబట్టి గెంటేస్తాను

ఇంకా ఎన్నో ఎన్నెన్నో చేసేస్తాను
కాని ఒక్కటి -

నాక్కొంచెం నమ్మకమివ్వు
కాలుని మీద కలబడతాను
పరమ శివుని శూలాగ్రాన తలక్రిందుగ నిలబడతాను
ఇంటింటా గగన కుసుమాలు మూడు పూవులుగా
నందన నికుంజాల అమృత ఫలాలు ఆరు కాయలుగా
పూయిస్తాను, కాయిస్తాను,
కొయ్య తుపాకి దొరనౌతాను,
బావులు పూడ్పిస్తాను, చెరువులు తవ్విస్తాను
ఆకాశపు పందిరి క్రింద
నయాగరా నిర్ఝరాల చలివేంద్రాలు స్థాపిస్తాను
ప్రపంచమనే మహాసత్రం నిండిపోతే
మరో సత్రం కట్టిస్తాను
ఆకాశపు ఊదారంగు తాను చించి
చొక్కాల్లేని వారందరికి కుట్టిస్తాను
ఒకటేమిటి, ఏదైనా చేసేస్తాను
కాని ఒకటి -

నాక్కొంచెం నమ్మకమివ్వు
నమ్మకం లేని బొంది ఖాళీ సిగరెట్టు టిన్ను
నమ్మకంలేని ఆత్మ పుల్లలు లేని అగ్గిపెట్టె
నమ్మకంలేని బ్రతుకు కాలిన సిగరెట్టు బూడిది
అన్నీ ఉన్నాయి కానీ, నమ్మకమొకటే లేదు

నాక్కొంచెం నమ్మకమివ్వు!
నమ్మకమివ్వు!
నమ్మకమివ్వు!

### 12.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

బాహుబంధనం = కౌగిలి
కాలుడు = మరణ దేవుడైన యముడు
నిర్ఝరం = ప్రవాహం

### 12.3.2 వ్యాఖ్యానం

ఆలూరి బైరాగి (1925 - 1982) తెనాలిలో జన్మించారు. సరస్వతి, వెంకట్రాయుడు వీరి తల్లి దండ్రులు. వీధి బడిలో ఒకటి రెండు తరగతులు మాత్రం చదివారు. సంపాదించిన పాండిత్యమంతా స్వార్జితమే.

సుప్రసిద్ధ హిందీ ప్రచారకులు ఎలమంచలి వెంకటప్పయ్య, వ్రజనందనశర్మల వద్ద బైరాగి హిందీ భాషను అభ్యసించారు. తన పదమూడవ ఏట బైరాగి ఉత్తర భారతదేశం వెళ్ళి అక్కడ నాలుగు సంవత్సరాలుండి హిందీ భాషా సాహిత్యంలో విద్వత్తు సంపాదించారు. తన 15వ ఏట ప్రప్రథమంగా హిందీలో కవిత్వం రాసి, కవి సమ్మేళనంలో పాల్గొని మెప్పుపొందారు. కొన్ని హిందీ పత్రికలు ఆయన కవితల్ని ప్రచురించాయి. ఒక దక్షిణ భారతదేశపు బాలుడు హిందీలో చక్కని కవిత్వం రాసినందుకు అక్కడి పండితులు మెచ్చుకొని ప్రోత్సహించారు. 1941లో స్వగ్రామానికి తిరిగి వచ్చిన బైరాగి ఎం.ఎన్. రాయ్ నెలకొల్పిన 'రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ' సిద్ధాంతాలవైపు ఆకర్షితులయ్యారు.

1946 ప్రాంతంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆ రోజుల్లో తాను రచించిన "చీకటి నీడలు" ప్రకటించారు. అది సహృదయుల మెప్పు పొందింది. తర్వాత చందమామ (హిందీ) సంపాదకునిగా పనిచేశారు. చందమామలో చక్కని 'బాల గేయాలు' రచించారు. హిందీలో 'పలాయన్' అనే కవితా సంకలనం వెలువరించారు.

తర్వాత బైరాగి 'నూతిలో గొంతుకలు' అనే విశిష్టమైన కావ్య సంపుటి ప్రకటించారు. ఇది ఆయనకు విశేషమైన కీర్తిని ఆర్జించి పెట్టింది. మేధావులు తలయూచి తెలుగు కవిత్వంలో 'నూతిలో గొంతుకలు' ప్రత్యేకతను గుర్తించారు.

దివ్య భవనం (కథల సంపుటి) పాప కోసం (నవల) ఆగమగీతి (కావ్య సంపుటి) అనేవి బైరాగి రచనలలో కొన్ని.

"శబ్దాల అసమర్థత ప్రతి కవికీ ఏదో ఒక సందర్భంలో తట్టే ఉంటుంది. కవితా కామిని చేలాంచలాల కొసవిసురు ఎప్పుడూ ఒక బారెడు దూరాన్నే మాయమైనట్లు అగుపిస్తాయి" అన్నారు బైరాగి. కాని "బైరాగికి మాత్రం ఆ కొసవిసురులు దూరాన మాయమైనట్లుగాక, దగ్గరగా వచ్చినప్పుడు అతనిని నిలువునా నిమిరి అంతరంగాన్ని పలకరించేవి" అని దేవులపల్లి కృష్ణశాస్త్రి బైరాగి కవితా శక్తిని కొనియాడారు.

బైరాగి కవితల్లో మిక్కిలి ప్రసిద్ధమైన గీతం ఇది. సూటిగా, స్పష్టంగా ఉంటూనే గంభీరమైన ఆలోచనను రేకెత్తించే శక్తిగల గీతమిది.

మనిషికీ మనిషికీ ఉండవలసిన ప్రేమబంధం తెగిపోయి, ఇరుగువాడు పొరుగువాణ్ణి నమ్మని దుస్థితి సమాజంలో ఉంది. తల్లీ, తండ్రీ, అన్న, తమ్ముడు, భార్య, భర్త, స్నేహితుడు, అన్ని సంబంధాలూ డబ్బుతో ముడిపడిన సంఘంలో అనురాగబంధాలకు చోటులేకుండ పోతోంది. మనిషి మీద మనిషికి నమ్మకం సడలి పోతోంది. అటువంటి ఘోరమైన స్థితి మారాలంటే మనిషిని మనిషి నమ్మాలి; ప్రేమించాలి; ఒకరికోసం ఒకరు అనేతత్వం బలపడాలి. అందుకే బైరాగి "నాక్కొంచెం నమ్మకమివ్వు" అని మనిషిని వేడుకుంటున్నారు. నమ్మకం ఉంటే మనిషి సాధించలేనిదిలేదు అనే విశ్వాసాన్ని కలుగజేస్తున్నారు.

"నాకు కొంచెం నమ్మకమివ్వు. ఇస్తే కొండలు పిండి కొట్టేస్తాను. చితికిన టొమేటోలాంటి సూర్యుణ్ణీ, ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణీ, ఆకాశపు ఎంగిలిపళ్ళెంలోంచి విసిరేస్తాను!" అన్నారు బైరాగి. "టొమేటో లాంటి సూర్యుణ్ణీ, ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణీ, ఆకాశపు ఎంగిలిపళ్ళెం" అనే పదచిత్రాలు పాఠకులను కలవరపెడతాయి. ఇది కవి ఊహావైచిత్రి. "నమ్మకం ఉంటే సూర్యచంద్రుల లెక్కేమిటి? భూమ్యాకాశాలు మనవే" అనే నమ్మకాన్ని కలిగించటం కోసం చితికిన టొమేటోను, ఆరిన అప్పడాన్ని, ఎంగిలి పళ్ళేన్ని ఉపమానాలుగా తీసుకువచ్చారు. ఎంగిలిపళ్ళెంలో అప్పడాన్ని, టొమేటోను విసిరిపారేసినట్లు మనిషి అపరిమిత శక్తిమంతుడై సూర్యచంద్రులను లోబరుచుకోగలడని కవి భావిస్తున్నారు. నమ్మకం కలిగిన మనిషి బాహుబంధంలో యీ విశాల బ్రహ్మాండాన్ని చాపలా చుట్టేయగలడని ఆశిస్తున్నారు.

బ్రహ్మదేవుడు నొసటరాసిన రాతను ఎవరూ తప్పించలేరని మెట్టవేదాంతులు చెబుతుంటారు. కర్మ సిద్ధాంతంతో కట్టిపడేసి మనిషిని నిస్సహాయుణ్ని చేసేస్తుంటారు. కాని మనిషిపై నమ్మకం చిక్కిన మనిషి నిస్సహాయుడైన మానవుని నొసటివ్రాలును ఒక్కకలం పోటుతో కొట్టివేయగలడన్నారు. మానవుడిల మహానుభావుడు. అతని నొసట ఎవ్వరూ ఏరాతా రాయలేదు. మనిషి భవిష్యత్తును దిద్దుకోవలసింది మనిషేనని కవితాత్పర్యం. బైరాగి మానవతా వాదానికి ఇది మచ్చుతునక.

నమ్మకముంటే అసంభవాలు సంభవాలౌతాయని ఆశ కల్పించారు. జీవిత సభాభవన ద్వారం నుంచి అన్యాయాన్ని, అక్రమాన్ని మెడబట్టి గెంటేస్తాననీ, ఇంకా ఎన్నో చేసేస్తాననీ వాగ్దానం చేశారు. యముడి మీద కలబడతాననీ, పరమశివుని శూలాగ్రాన తలకిందుగా నిలబడతానని నమ్మబల్కిన కవి అంతలోనే "ఇంటింటా గగనకుసుమాలు మూడుపూవులుగా, నందన నికుంజాల అమృతఫలాలు ఆరుకాయలుగా పూయిస్తాను, కాయిస్తాను; కొయ్య తుపాకి దొరవౌతాను, బావులు పూడ్పిస్తాను, చెరువులు త్రవ్విస్తాను" అని ఆశ్చర్యంగా నమ్మశక్యం కానట్టు పలికారు. నమ్మకం ఉంటే అసంభవాలు సంభవాలౌతాయని వ్యంగ్యంగా కవి తెలిపారు.

BRAOU

మనిషిపై నమ్మకం కలిగితే తాను చేయగలిగిన పనులను ఆ తర్వాత బైరాగి అందంగా చెప్పారు. "ఆకాశపు పందిరికింద నయగరా నిర్ఝరాల చలివేంద్రాలు స్థాపిస్తాను; ప్రపంచమనే మహాసత్రం నిండిపోతే మరో సత్రం కట్టిస్తాన"ని తన విశాలహృదయాన్ని చాటుకున్నారు.

ఉత్తమ కవిగా బైరాగి ఊహాశక్తిని తెలిపే భావం- "ఆకాశపు ఉదారంగు తాను చించి/చొక్కాల్లేని వారందరికి కుట్టిస్తాను".

నమ్మకంలేకపోతే అన్నీ శూన్యమే. "నమ్మకం లేని బ్రతుకు కాలిన సిగరెట్టుబూది". అన్నీ ఉన్నా నమ్మకం లేకపోతే ఏమీలేనట్టే. ఇక్కడ బైరాగి ఎన్నుకున్న ఉపమానాలు -- ఖాళీ సిగరెట్టు టిన్ను; పుల్లల్లేని అగ్గిపెట్టె; కాలిన సిగరెట్టు బూది -- సరియైనవి, అందరికీ సులభంగా తెలిసేవి కూడా.

**కవి ఉద్దేశించిన ప్రధాన భావం; దృక్పథం**

మనిషికి మనిషిపై నమ్మకం ఉండాలి. నమ్మకం ఉంటే సూర్యచంద్రుల్నైనా లెక్కచేయనక్కరలేదు. నమ్మకం ఉంటే బ్రహ్మాండాన్ని చాపలా చుట్టేయచ్చు. మనిషినొసటి వ్రాలు అనేది అబద్ధమనీ, మనిషిపై నమ్మకం ఉంటే కర్మసిద్ధాంతాన్ని తప్పించవచ్చుననీ కవి భావించారు. నమ్మకం ఉంటే జీవితంలోంచి అన్యాయాన్నీ, అక్రమాన్నీ పారద్రోలవచ్చు. అసంభవాలను సంభవం చేయవచ్చు. నమ్మకం చిక్కిన లోకాన్ని ఆనందింపజేసే మంచి పనులెన్నైనా చెయ్యవచ్చునని కవిభావం. అన్నీ ఉన్నా నమ్మకంలేకపోతే బ్రతుకు వ్యర్థమనీ తలచారు.

మనవునిపై అపరిమితమైన ప్రేమతో మనిషికీ మనిషికీ సేతువును నిర్మించేది నమ్మకమేనని కవి భావం.

### 12.3.1 విశేషాంశాలు

**లయ, ఛందస్సు, అలంకారాలు, పదచిత్రాలు**

కావ్యోపన్యాసంలాంటి శైలి 'నాకొంచెం నమ్మకమివ్వు' గీతంలో కన్పిస్తుంది. లయకంటె భావాన్ని శక్తిమంతంగా వెల్లడించిన వచన కవిత్వమిది. ఛందస్సును విడిచిపెట్టిన వచన గీతమిది. అక్కడక్కడా అంత్యప్రాస కన్పిస్తుంది. ఈ గీతంలో అంత్యప్రాస తెచ్చిపెట్టుకున్నట్లుగాక సహజంగా అమిరింది. "చితికిన టొమేటో లాంటి సూర్యుడు, ఆరిన అప్పడంలాంటి చంద్రుడు, ఖాళీ సిగరెట్టు పెట్టె, కాలిన సిగరెట్టుబూది" అనే ఉపమాలంకారాలు కవిస్వతంత్రమైన భావుక శక్తిని వెల్లడిస్తున్నాయి. ఇతరకవులెవ్వరూ ఉపయోగించని ఉపమానాలివి.

BRAOU

## అభ్యాసం – 1

ఈ భాగంలో కవి ఆశించిన 'నమ్మకం' ఎలాంటిదో వివరించండి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 12.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో మానవతావాదానికి సంబంధించిన పాఠ్యాంశం ఇది.
- వచనకవిత్వ పద్ధతిలో తనదైన ఒక స్వంత బాణీని నిలుపుకున్న ఆలూరి బైరాగి ఈ పాఠ్య రచయిత

- మానవులందరూ సుఖశాంతులతో ఐకమత్యంతో మానవప్రగతీ, సమాజాభ్యున్నతీ సాధించా లన్నది ఈ పాఠ్యంలో కవి ఆశయం.
- సమాజంలో ఒకరిపై ఒకరికి విశ్వాసం అత్యంతావశ్యకమని ప్రభావవంతంగా ప్రతిపాదిస్తూ ఈ పాఠ్యం ద్వారా కవి – ఆ 'నమ్మకం' తనకు కలిగించమని సామాన్య మానవుణ్ణి కోరుతున్నాడు.
- కవి చిత్రించిన 'సామాన్య మానవుడు' విశ్వమానవునికి ప్రతీక.

## 12.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

బైరాగి కవితా విశేషాలను వివరించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

ఆధునిక వచనకవులలో బైరాగి ప్రత్యేకత వివరించండి?

## 11.6 ఆకళింపు ప్రశ్నలు

1. బైరాగి వ్యక్తిత్వ అవగాహనకోసం "ఆలూరి బైరాగి సంస్మరణ సంచిక" చదవండి.
2. బైరాగి కవితా పరిణామాన్ని గ్రహించడానికి ఆయన రచించిన "చీకటి నీడలు, నూతిలో గొంతుకలు, ఆగమగీతి" పరిశీలించండి.

### అభ్యాసానికి జవాబు

1 ఆలూరి బైరాగి ఆధునికాంధ్ర కవులలో మిక్కిలి లోతైన తాత్త్విక చింతనాపరుడు, మేధావి, నవ్య మానవతా వాది (Radical Humanist). సంఘంలోని అన్యాయాలను, అక్రమాలను ప్రతిఘటించమని ఎలుగెత్తి చాటిన విప్లవవాది.

శబ్దశక్తి, భావుకవైచిత్రి పుష్కలంగా ఉన్నకవి. కాని మానవ సమాజంలో మార్పురావటంలేదని నిస్పృహ చెంది నిరాశకు లోనయ్యారు. ఆపదలలో ఉన్న మానవుడు యీ లోకంలో నిస్సహాయుడని కవి బాధపడ్డారు. నిస్సహాయుడైన దీన మానవుల ఘోషను 'నూతిలో గొంతుకలు' కావ్యంలో వర్ణించారు.

"పిల్లలవంటి తెల్లని మనస్సు, హిమాచలంవంటి స్థైర్యం, నయాగరావంటి కరుణ, శరదాకాశసారళ్యం, జాహ్నవీజలంవంటి, వహ్నివంటినైర్మల్యంగల" మానవుని కోసం తపించి 'ఆగమగీతి' రచించారు. కుష్ఠురోగిని కూడ కౌగిలించుకోగలిగిన విశాలహృదయం మానవులలో పెంపొందాలని వాంఛించారు. మానవలోకం బాగు పడాలంటే మనిషికి మనిషిపై నమ్మకం ఉండాలంటారు బైరాగి. "వాక్కొంచెం నమ్మకమివ్వు" అని సాటి మానవుణ్ణి వేడుకున్నారు. నమ్మకం ఉంటే సాటి మనిషి సాధించలేనిది లేదని తలచారు. సూర్యుణ్ణి చితికిన టొమాటోలాగ, చంద్రుణ్ణి ఆరిన అప్పడంలాగ ఆకాశపు ఎంగిలికంచంలో విసరిపారవేయవచ్చునని అపరిమిత విశ్వాసంతో పలికారు.

నమ్మకం ఉంటే జీవితంలోని అక్రమాల్నీ, అన్యాయాన్నీ తొలగించవచ్చునని ఆయన గాఢంగా విశ్వసించారు. నమ్మకం ఉంటే తాను కాలునిమీద కలబడతాను, పరమశివును శూలాగ్రంమీద నిలబడతానని ఆత్మవిశ్వాసంతో పలికారు. నమ్మకం ఉంటే అసంభవాలను సంభవం చేయవచ్చునని తలచారు.

నమ్మకం చిక్కిన తర్వాత "ఆకాశపు నయాగరాన్నిర్తరాల చలివేంద్రాలు స్థాపిస్తాను, ప్రపంచమనే మహా సత్రం నిండిపోతే మరో సత్రం కట్టిస్తాను. ఆకాశపు ఉదారంగు తాను చించి చొక్కాల్లేని వారందరికి కుట్టిస్తాను. ఒకటేమిటి ఏదైనా చేసేస్తాను" అని ధీమాగా పలికారు.

ఎన్ని ఉన్నా నమ్మకం లేకపోతే బతుకు వ్యర్థమే. "నమ్మకంలేని బొంది ఖాళీసిగరెట్టు టిన్ను; నమ్మకంలేని ఆత్మ పుల్లలులేని అగ్గిపెట్టె, నమ్మకంలేని బ్రతుకు కాలినసిగరెట్టు బూది"గా బైరాగి భావించారు.

**– డాక్టర్ కె. రామమోహన్‌రాయ్**

# భాగం 13 అయిదూ చిటిగోలుసూ

విషయక్రమం


13.0 ఉద్దేశం
13.1 ప్రవేశిక
13.2 సూచనలు
13.3 పాఠ్యం
    13.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    13.3.2 వ్యాఖ్యానం
    13.3.3 విశేషాంశాలు
అభ్యాసం
13.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం
13.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
13.6 ఆకలింపు ప్రశ్నలు
    అభ్యాసానికి జవాబు


## 13.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- ఆరుద్ర కవిత్వంలో సామాజికాభ్యుదయాంశ.
- జానపదబాణీలో కార్మిక కర్షక ప్రగతిని ప్రబోధించే కవితారీతి.

## 13.1 ప్రవేశిక

ఈ పాఠ్యాంశం ప్రముఖకవి, విమర్శకుడూ, పరిశోధకుడూ ఐన ఆరుద్ర కవితాసంకలనం. "గాయాలూ – గేయాలూ" లోనిది. వర్గకలహం ద్వారా, శ్రామిక విప్లవం ద్వారా సమసమాజ నిర్మితి సాధించడం సంభవమనే అభ్యుదయ కవిత్వ లక్షణాలను ఈ గేయం ద్వారా ప్రదర్శించారు ఆరుద్ర. ఆధునిక కవిత్వ దృక్పథాన్ని ఈ గేయంలోని జానపద బాణీలో కవి నిర్వహించిన విధానాన్ని ఈ భాగంలో మీరు అధ్యయనం చేస్తారు.

BRAOU

## 13.2 సూచనలు

ఈ భాగం చదివేముందు విద్యార్థులు ఆరుద్ర రచనలు "త్వమేవాహం, సినీవాలి" వంటి కవిత్వ గ్రంథాలను పరామర్శించాలి. దాని ద్వారా ఆరుద్ర కవితారీతులతో పరిచయం ఏర్పడుతుంది. వాటిని ఆయన తన కవిత్వంలో విన్యసించే వినూత్న పద్ధతులతో కూడిన మంచి అవగాహన కలుగుతుంది. అప్పుడే ఈ పాఠ్యాంశంలో అనాది ఐన జానపదబాణీ ద్వారా సాధించ తలపెట్టిన సామాజిక ప్రబోధ రీతి స్పష్టమౌతుంది.

## 13.3 పాఠ్యం

చాంగు భళారే చాంగు భళా
జంకెల గొంకెల చాంగు భళా
చెరసాల ద్వారాలు తెరిచారు పౌరాలు
ధరలోన యిక మీద చాంగు భళా
చెరసాల ఉండవు చాంగు భళా!

హుంకరించెను విప్లవాంకురము మృత్యువై
కంకాళములు సమర ఘీంకారములు జేసె

ఢంకా బజాయించి చాంగు భళా
సంకెళ్ళు విరిగేయి చాంగు భళా

భూతాలు వైప్లవ్య గీతాలు పాడేయి
ప్రేతాలు 'లావా'కు ఏతాము తోడేయి
చేతనముతో వేగ చాంగు భళా
ఛాతీలు విరుచుకొని చాంగు భళా!

మలయ పవనము కాదు మరణ ఝుంఝులు రేగె
విలయ రుద్రుని యాన వీరభద్రుని సేన
విజయసాధనకే చాంగు భళా
విశ్రమించుటలేదు చాంగు భళా!

పిరికి గుండెలు పేల్చు, కరుకు గుండెలు కాల్చు
నరకాన్ని నరకాలి చాంగు భళా!
దొరకాలి స్వర్గమే చాంగు భళా!
చాంగు భళారే! చాంగు భళా!
జంకేల గొంకేల చాంగు భళా!

ఈ పొలము నీదే యీ హలము నీదే
ఈ ఇల్లు నీదే యీ మిల్లు మనదే
గనులన్ని మనవే కదరా భళా!
పనిముట్లు మనవే పదరా భళా!

### 13.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| పారాలు | = | కావలి వారు |
| విప్లవ + అంకురము | = | విప్లవాంకురము = తిరుగుబాటు అనే మొలక |
| కంకాళము | = | పుర్రె |
| సమరము | = | యుద్ధం |
| వైప్లవ్యం | = | విప్లవానికి సంబంధించింది |
| భూతాలు/ప్రేతాలు | = | జవచచ్చిన వ్యక్తిత్వాలు |
| చేతనము | = | చైతన్యం/సజీవ లక్షణం |
| విలయరుద్రుడు | = | ప్రళయ సమయంలో విజృంభించిన శంకరుడు |
| నరకం | = | దోపిడీ సమాజం (ప్రతీక) |
| స్వర్గం | = | శ్రామికుల రాజ్యం |
| హలము | = | నాగలి. |

BRAOU

### 13.3.2 వ్యాఖ్యానం

ఆరుద్ర అసలు పేరు భాగవతుల శంకరశాస్త్రి (1925) అభ్యుదయ కవిగా, ప్రయోగశీలిగా తన కవితా సాధనను ప్రారంభించారు. 1949లో త్వమేవాహం (త్వమ్ + ఏవ + అహమ్ = నువ్వే నేను) అనే కావ్య సంపుటితో కవిగా పరిచయమయ్యారు. ఆ తరవాత సినీవాలి, గాయాలు, గేయాలూ వంటి కవితా సంపుటాలు ప్రకటించారు. ప్రాచీన ఛందస్సుల్లో అలవోకగా పద్యాలు రాయగల నేర్పుంది. జానపద రీతిలో చక్కని పాటలు రాశారు. మాత్రా ఛందస్సుల్లో గేయాలూ, వచన కవితలూ చాలా రాశారు. 'సమగ్ర సాహిత్యం' అనే సాహిత్య గ్రంథ సంపుటాలు వీరి పరిశోధనాభిలాషను వ్యక్తం చేస్తున్నాయి. పత్రికల్లో నిరంతరం పరిశోధక వ్యాసాలు రాస్తూనే, పరిశోధన భారం కవితా రచన మీద పడకుండా కవితా సాధన చేస్తున్న కవుల్లో ఆరుద్ర మొదటగా చెప్పుకోదగినవారు. ఈ పాఠ్యం "గాయాలూ - గేయాలూ" నుంచి తీసుకున్నది. భూమి, మిల్లు మొదలైన ఉత్పత్తి సాధనాలు దోపిడీ వర్గం చేతిలో ఉన్నాయనీ, కూలీలూ కార్మికులు వాటిని సొంతం చేసుకొని కార్మిక కర్షక స్వర్గం నిర్మించాలనీ, అందుకు వర్గ కలహమూ, విప్లవమూ అవసరమనీ అభ్యుదయ కవులు నమ్ముతారు.

ఆ భావాలే ఈ గీతంలోనూ కనిపిస్తాయి. జానపద రీతిని ఎన్నుకోవటం ఇందులో ఒక విశేషం. 'చాంగు భళా' అనేది బుర్రకథల్లో ఊతపదం. 'తందనానా పురే, తందనానా బలే' అనే ఊతపదాలను మీ పాఠ్య గ్రంథంలోని సంకీర్తనలో కూడా అన్నమాచార్యులు వాడుకున్నాడు, చూడండి. అలాంటిదే "అయిదూ చిటిగొలుసూ"లోని 'చాంగుభళా' అనే ఊత పదం.

అభ్యుదయ కవిత్వయుగంలో కవిత్వం రాయడం ప్రారంభించిన ఆరుద్ర ఈ పాఠ్యంలో విప్లవ మూలకమైన అభ్యుదయాన్ని ప్రబోధిస్తున్నారు. 'అయిదూ చిటిగొలుసూ' అనే ఈ కవితలోని 'చెరసాల లుండవు' అనే పదబంధం దేశంలో నేరస్తులుండరనీ, అనవసర నిర్బంధాలు తొలగిపోతాయనీ సూచిస్తున్నది. "కంకాళములు సమరఘంకారములుజేసె" అనే పాదం బానిసల, బాధితుల తిరుగుబాటును సూచిస్తున్నది. "మలయ పవనము కాదు, మరణ ఝంఝులు రేగె విలయరుద్రునియాన వీరభద్రునిసేన విజయసాధనకై చాంగుభళా, విశ్రమించుటలేదు చాంగుభళా" అనే పంక్తుల్లో పీడితవర్గ విప్లవం సూచిస్తున్నారు. "నరకాన్ని నరకాలి" అంటూ విప్లవ మూలకమైన అభ్యుదయ భావాన్ని ప్రేరేపిస్తూ అంధకారాన్నీ, అజ్ఞానాన్నీ, బానిసత్వాన్నీ నాశనం చేయాలని బోధిస్తున్నారు. ఇలా అభ్యుదయ దృక్పథంతో కవిత సాగిస్తూ ఈ పొలము నీదే, ఈ హలము నీదే, యీ మిల్లు మనదే అనటంలో దున్నేవాడిదే భూమి, శ్రమించే వాడిదే ఫలితం అన్న భావాల్ని సూచిస్తూ కర్షక, శ్రామిక స్వామ్యాలను ప్రతిపాదిస్తున్నారు. అంతేకాక ఆయా ఉత్పత్తి పరికరాలు యజమానులకుకాక శ్రామికులకే చెందాలని "గనులన్ని మనవే కదరా భళా పనిముట్లు మనవే పదరా భళా" అనే పంక్తుల్లో నిర్దేశిస్తున్నారు. ఆరుద్ర రాసిన ఈ కవితలో ఆయన కవితరాసే కాలంనాటి తెలుగు సాహిత్యంలో పరిపూర్ణంగా వికసించి ఉన్న "అభ్యుదయ కవిత్వ ప్రభావం" సుస్పష్టంగా కనిపిస్తున్నది.

### 13.2.3 విశేషాంశాలు

### లయ, ఛందస్సు

ఈ గేయం ఖండగతిలో 5 మాత్రలు కలిగిన గణాలతో నడిచింది. ఒక్కొక్క పాదానికి నాలుగు గణాలున్నాయి. ఇందులోని లయ జానపద కవిత్వలయను అనుసరిస్తూ లిపిలో ఉన్న అక్షరాలకు అక్కడక్కడా దీర్ఘాలు పెట్టుకోవలసిన అవసరాన్ని కల్పించింది. ఉదాహరణకు–

పల్లవి: చాంగు భళారే చాంగుభళా జంకేల గొంకేల చాంగుభళా– అని ముద్రణలో ఉంది. పై పల్లవిలో "జంకేల గొంకేల" అనే పదబంధాలు ఖండగతిని స్పష్టంగా సూచిస్తున్నాయి. వాటి ననుసరించే తక్కిన పాదాలు ఉన్నాయి. కాబట్టి పల్లవిని ఇలా పాడుకోవాలి.

"చాంగు భళారే చాంగుభళా
జంకేల గొంకేల చాంగుభళా"

పై దీర్ఘాల్లోని భాగాలను 5 మాత్రలు వచ్చేటట్టు పాడుకుంటే తప్ప గేయంలోని లయలో ఏకతరాటు. మొత్తం గేయంలో ఇలా అక్షరాలు తగ్గించి లయలో వైచిత్రిని చూపించడం గుణంగానే భావించవచ్చు. తక్కిన పాదాల్లో కూడా అక్కడక్కడా పై విధంగా లయను సవరించుకోవలసిన అవసరం ఉన్నది.

## అభ్యాసం

"అయిదూ చిటిగొలుసూ" గేయంలోని ప్రధాన దృక్పథం ఏమిటి?

BRAOU

## 13.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో అభ్యుదయ కవిత్వ దృక్పథాన్ని ప్రదర్శించే పాఠ్యాంశం ఇది.
- ప్రముఖాంధ్రకవీ, విమర్శకుడూ, పరిశోధకుడూ సాహిత్యవేత్తా ఐన ఆరుద్ర ఈ గేయ రచయిత.
- ఇది ఆయన గేయసంపుటి "గాయాలూ - గేయాలూ"లోనిది.
- శ్రామికవిప్లవం సాధనంగా సామాజిక ప్రగతిని సాధించాలని ఈ గేయంద్వారా ప్రబోధిస్తున్నారు కవి.
- ఆధునిక కవిత్వ రీతుల్లో ప్రముఖమైన అభ్యుదయ కవిత్వ దృక్పథాన్ని అనాదిగా, అనూచానంగా వస్తూవున్న జానపద బాణీలో విన్యసించడం ఈ గేయంలోని విశిష్టత.

## 13.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

"అయిదూ చిటిగొలుసూ" గేయంలోని అభ్యుదయ కవిత్వ దృక్పథాన్ని నిరూపించండి?

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి?

ఆధునిక కవుల్లో ఆరుద్ర స్థానాన్ని వివరించండి?

## 13.6 ఆకళింపు ప్రశ్నలు

1. గేయంలో లయ సరిగా వ్యక్తంకాని చోట్లను గుర్తించండి.
2. అభ్యుదయ కవిత్వ పద్ధతులను అధ్యయనం చేయండి.
3. "ఒక్కా ఓ చెలియా!
   రెండూ రోకళ్ళూ!
   మూడూ ముచ్చిలుకా!
   నాలుగు నందన్నా!
   అయిదూ చిటి గొలుసూ!
   ఆరుందారాలూ!
   ఏడుం బేడీలూ!
   ఎనిమిది మనమందా!
   తొమ్మిది తోకుచ్చు!
   పదీ పట్టేడా"

ఆరుద్ర "గాయలూ, గేయాలూ"లోని ఈ గేయంలోని లయను గుర్తిస్తూ, ఈ గేయం గేయ వాఙ్మయంలోని ఏ శాఖకు చెందుతుందో తెలపండి.

### అభ్యాసానికి జవాబు

ఈ గేయంలోని ప్రధాన దృక్పథం - అభ్యుదయ దృష్టి. దళితుల, శ్రామికుల, కర్షకుల అభ్యుదయాన్ని ఈ కవిత ద్వారా ఆకాంక్షిస్తున్నారు ఆరుద్ర. విప్లవ మూలకమైన అభ్యుదయాన్ని పీడితవర్గం సాధించాలనేది ఆరుద్ర ప్రబోధం. ఈ గేయంలో "చెరసాలలుండవు, ప్రేతాలు లావాకు ఏతాము తోడాయి. కంకాళములు సమర ఘీంకారములు జేసె" మొదలైన పదబంధాల్లో స్వేచ్ఛనూ, తిరుగుబాటునూ ప్రబోధిస్తు న్నారు. 'ఈ పొలము నీదే' 'ఈ హలము నీదే' అనటంలో కర్షకస్వామ్యాన్ని ప్రతిపాదిస్తున్నారు. "ఈ మిల్లు మనదే, గనులన్నీ మనవే కదరాభళా" అనటంలో శ్రామికస్వామ్యం ఉన్నది. 'స్వామ్యం' అంటే అధికారాన్ని పొంది ఉండటం. "ఈ ఇల్లు నీదే"- అనటంలో పై స్వామ్యాలతో తిండి గుడ్డా కలుగుతుండగా కర్షకులకూ, శ్రామికులకూ ఇంటి వసతులు కూడా పూర్తిగా లభించాలని ఆకాంక్షిస్తున్నారు. "దున్నేవాడిదే భూమి, శ్రమించే వాడిదే ఫలితం" అని పై పంక్తులు సూచిస్తే, కేవలం కర్షక శ్రామిక భాగస్వామ్యమే కాదు, ఉత్పత్తి సాధనాలు కూడా శ్రామికులవే అనే భావాన్ని "పనిముట్లు మనవే పదరాభళా" అనే పాదం సూచిస్తున్నది. "ఈ విధంగా దళితవర్గం, శ్రామికవర్గం సుఖంగా ఉండాలి. అవసరంవస్తే ఆ సుఖంకోసం విప్లవమైనా తేవాలి. అభ్యుదయ పథంలో దేశం పురోగమించాలి" అనే మూడు భావాలూ ఈ గేయం ప్రధాన దృక్పథంలోని అంశాలు.

**–డాక్టర్ రావికంటి వసునందన్**



BRAOU

# భాగం 14 ఉషస్సంధ్య

## విషయక్రమం


14.0 ఉద్దేశం
14.1 ప్రవేశిక
14.2 సూచనలు
14.3 పాఠ్యం
    14.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    14.3.2 వ్యాఖ్యానం
    14.3.3 విశేషాంశాలు
అభ్యాసం
14.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
14.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
14.6 ఆకలింపు ప్రశ్నలు
    అభ్యాసానికి జవాబు


## 14.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- దాశరథి కవిత్వంలో అభ్యుదయ కవితా రీతులు
- దాశరథి కవితా శిల్పం

## 14.1 ప్రవేశిక

తెలంగాణా స్వతంత్ర పోరాటంలో ప్రత్యక్షంగా నిరంతరం పాల్గొని "అగ్నిధార, రుద్రవీణ" వంటి కావ్యాల ద్వారా ప్రభావవంతమైన ప్రబోధాన్ని అందించిన రాష్ట్రీయ కవి, జాతీయ కవి దాశరథి. భావకవిత్వోద్యమకాలంలో కలం ధరించి ప్రజాస్వామ్య భావాలను పద్యం వాహికగా ప్రచారం చేసి నిజాం ప్రభుత్వ పతనాన్ని ఆకాంక్షించిన దాశరథి కావ్యం 'పునర్నవం' లోనిది ప్రస్తుత పాఠ్యం. ఈ భాగం ద్వారా దాశరథి కవితారీతిని మీరు తెలుసుకుంటారు.

## 14.2 సూచనలు

ఈ పాఠ్యానికి ముందు మీరు దాశరథి ఇతర రచనలు "అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, కవితా పుష్పకం, అమృతాభిషేకం, తిమిరంతో సమరం, ధ్వజమెత్తిన ప్రజ" వంటి కావ్యాలు పరిశీలించాలి. దాని వల్ల మీకు దాశరథి కవితా రీతులతో పాటు, ఆయన కవిత్వ దృక్పథం కూడా అవగాహనకు వస్తాయి. ఈ పాఠ్యం అధ్యయనానికి ఆ కావ్యాల పఠనం పూర్వరంగంగా తోడ్పడుతుంది.

## 14.3 పాఠ్యం

ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ
ఒక్క మాటు చూచిందిటు,
తమస్సు పాషాణకిరీటం తీస్తూ
    ఒక్క పరుగు తీసిందటు.
అటు – ఉల్కలు, ఉన్మాదమ్ములు
ఆక్రందనలాఘాతమ్ములు
జీర్ణాలయ శివరూపమ్ములు
    శిథిల వనాంతర కూపమ్ములు

అటు – రాజులు, రాచరికాలు
శాసనాలు, చట్టాలు, జైలు
ఆకలి, ఆరాటం, వేదన
    ధనాధిపుల ఘన సంపాదన
అటు – క్రౌర్యం, కౌటిల్యం, కపి
మారణాయుధాల్, మంటలు, మసి
చెడిపోయిన ధాన్యపురాసులు
    వాటి నీడలో క్షుథా ప్రవాసులు



BRAOU

అటు – రణాలు, వ్రణాలు, మరణాలు,
ఖాతాలు, ఖామందులు, కరణాలు
సిండికేట్లు, మాగ్నేట్లు, సేట్లు
నిరుపేదలకు మూసిన గేట్లు.

అటు – భీషణ క్షుధాగ్ని గీతం
దుర్భర హైమాచల శీతం
– రక్తపాతం
కాలానికి పెద్ద జలపాతం.

ఇటు – జలపాతానికి నాంది
విద్యుదగ్ని ప్రభవించకేముంది ?
కుళ్ళిన సమాజపు దుర్గంధం
కొట్టుకొని పోయే నీటి చందం !

గొంతుదాటి పలకని శబ్దాలు
దాగున్నై ఇన్ని శతాబ్దాలు !
ఇక విందాం ప్రజాగళ గర్జన
దుష్టులలో తర్జన, భర్జన.

చనిపోయిన యోధుల గుండెలు
తరుణ పయోజమ్ముల దండలు
అవి తెచ్చును ప్రభాకిరీటం
అవి తెచ్చును ఉషఃకవాటం.

ఎత్తండి కాంతిపతాకాలు
ఒత్తండి శాంతిబాకాలు
పదండి అగామిపథమ్ముల,
పాడండి అందాల పదమ్ముల.

ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ
ఒక్కమాటు చూచిందటు;
తమస్సు పాషాణ కిరీటం తీస్తూ
ఒక్క పరుగు తీసిందటు.

**14.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు**

| | | |
|---|---|---|
| ఉషస్సు | = | వేకువ |
| కిర్మీరం | = | విచిత్రకాంతి |
| తమస్సు | = | చీకటి/రాత్రి |
| పాషాణం | = | రాయి |
| ఉల్కలు | = | తోకచుక్కలు |
| ఆఘాతములు | = | దెబ్బలు |
| జీర్ణాలయ | = | నశించిన గుడుల యొక్క |
| శివ | = | శుభప్రదమైన |
| కూపములు | = | బావులు |
| కౌటిల్యం | = | వక్రబుద్ధి |
| క్షుధాప్రవాసులు | = | ఆకలికి తాళలేక పారిపోయిన వారు |
| వ్రణాలు | = | గాయాలు/పుండ్లు |
| ఖాతాలు | = | లెక్కలు |
| ఖామందులు | = | భూస్వాములు |
| సిండికేట్లు | = | దుష్టకూటమికి ప్రతీక |
| మాగ్నేట్లు | = | బిజినెస్ మాగ్నెట్లు అన్న అర్థంలో వాడిన ప్రతీక |
| హైమాచలము | = | మంచుకొండ |
| శీతం | = | చలి |
| విద్యుదగ్ని | = | విద్యుత్తు అనే అగ్ని |
| చందం | = | విధానం/పోలిక |
| గళము | = | గొంతు |
| తరుణపయోజములు | = | చక్కగా విచ్చిన తామరపూలు |
| ప్రభాకిరీటం | = | కాంతి అనే కిరీటం |
| ఉషఃకవాటం | = | వేకువ అనే తలుపు |
| ఆగామిపథము | = | రానున్న త్రోవ/ముందున్నబాట |

BRAOU

### 14.3.2 వ్యాఖ్యానం

క్రీ.శ. 1925లో జన్మించిన దాశరథి కృష్ణమాచార్యగారు "తెలంగాణా విముక్తి" కోసం సాహిత్యంలోనూ, జీవితంలోనూ పోరాడిన మహాకవి. స్వరాజ్యోద్యమానికి సమాంతరంగా ఆంధ్ర రాష్ట్రోద్యమం కూడా సాగింది. ఆ సమయంలో తెలంగాణా ప్రాంతాన్ని పాలిస్తున్న నిజాం నవాబును ఎదిరించి తెలంగాణా విముక్తికోసం పోరాడి జైలుపాలైన జాతీయ కవి దాశరథి. 1951లో పోలీస్ చర్య జరిగి తెలంగాణ నవాబు అఖండ భారతదేశానికి తలవంచిన తర్వాత రాసిన కవిత ఇది. "మా నిజాం రాజా జన్మ జన్మాల బూజు" అని నొక్కి చెప్పిన దాశరథి 'ఉషస్సంధ్య'కు కవితా వస్తువు నిజాం ప్రభుత్వ పతనమే. వీరి ఇతర కావ్యాలు "అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, అమృతాభిషేకం, కవితాపుష్పకం, తిమిరంతో సమరం, గాలిబ్ గీతాలు (అనువాదం)" మొదలైనవి. ఈ పాఠ్యం "పునర్నవం" అనే కావ్యం లోనిది.

"ఉషస్సంధ్య"లో కవి ప్రతీకాత్మకంగా నిజాం నవాబు పతనాన్ని సూచిస్తూ, ప్రజలను పురోగమించమని ప్రబోధిస్తున్నారు. కాబట్టి, ఇది అభ్యుదయ కవితా దృక్పథానికి చెందిన గేయం. పాదాల చివర అంత్యాను ప్రాసం, అనేక చోట్ల మధ్యమ ప్రాసం కనబడుతూ లయను సృష్టిస్తున్నది కాబట్టి ఈ గేయాన్ని 'వచన పద్యం' (Free Verse) గా చెప్పవచ్చు. నిజాం ముష్కర పాలనతో నిరంతర పోరాటం సాగించిన దాశరథి జీవితదృక్పథం, అనుభవం గేయంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఆ పాలనలోని క్రౌర్యాన్ని ఎత్తిచూపుతూ దాని ఫలితమైన తిరుగుబాటును నిర్దేశిస్తూ, అభ్యుదయ మార్గాన్ని ఆదేశిస్తున్నది.

"ఉషస్సు కిర్మీరకవాటంతోస్తూ
ఒక్కమాటు చూచిందిటు,
తమస్సు పాషాణ కిరీటం తీస్తూ
ఒక్క పరుగు తీసిందటు"

అన్నచరణం గేయం వస్తువును నిర్దేశిస్తున్నది. వింతకాంతిఅనే వాకిలిని తోసుకుంటూ వేకువ/మెలకువ ఒక్కసారి ఇటు-పీడిత తెలంగాణావైపు చూసింది. తమస్సు-ముష్కరపాలకవర్గం పాషాణకిరీటం తీస్తూ (దురధి కారాన్ని తొలగించుకుంటూ) వెనుతిరిగి అటు పాలకుల వైపు ఒక్కసారిగా పరుగుతీసింది. కిర్మీర కవాటం-వింతకాంతి అనే వాకిలిఅనేది ఈ చరణంలోని ముఖ్యమైన ప్రతీక. ఎన్నో బాధలు సహిస్తూ అతిదీనులై పడిఉన్న ఆనాటి తెలంగాణా ప్రజలలో చైతన్యం [illegible]కళ్ల వింత. అందుకే ఆ చైతన్యాన్ని వింత కాంతి (కిర్మీరం) గా పోల్చుకుంది గేయం. 'అటు' అనేది పాలకులకూ, 'ఇటు' అనేది పీడితులకూ నిర్దేశించబడిన శబ్దాలు.

మొదట పాలక వర్గ దుర్మార్గాన్ని వర్ణిస్తూ ఐదు చరణాలు రాశారు దాశరథి. లోక చుక్కల్లా విరుచుకుపడి కాల్చుకుతినే అధికారులూ, వారి వెర్రెత్తిన చేష్టలూ, కొట్టే దెబ్బలూ, జనం ఆర్తనాదాలూ, కూల్చే గుళ్ళూ గోపురాలూ, ఉద్యానవనాల్లోని బావులూ అటు వైపున్నాయి. రాజులూ, వారి రాచపోకిళ్ళూ, శాసనాలూ, చట్టాలూ, జైలుశిక్షలూ, వాటి కారణంగా ప్రజ అనుభవించే ఆకలీ ఆరాటం, ఆవేదనా వీటితోపాటు ధనమదాంధుల అక్రమ సంపాదనా ఉన్నాయి. వక్రబుద్ధీ, క్రూరత్వం, కసీ, మారణాయుధాలూ, మంటలూ, బూడిదకుప్పలుగా మారిన ధాన్యపురాసులూ - వాటిని నమ్ముకుని ఆకలి మంటలపాలైన వాళ్ళూ ఉన్నారు. ఆకస్మికమైన దాడులూ, గాయాలూ, మరణాలూ, డబ్బు దొంగిలించే బందిపోట్లూ, నేలను అపహరించే భూస్వాములూ, వారికి వత్తాసుపలికే కరణాలూ, దుష్టగ్రహాలూ, నిరుపేదలకు మూసిన గేట్లవంటి సేట్లూ ఉన్నారు. ఈ అన్నిటి ఫలితంగా భయంకరమైన ఆకలి మంటలూ, ఆర్తనాదాలూ, ఇల్లూవాకిలీ లేని బలహీనుల పాట్లూ, నిరంతరమైన రక్తపాతం. ఇది కాలానికే పెద్ద జలపాతం.

ఇలా దురధికారాన్ని వర్ణించి వారు పెట్టిన బాధల ఫలితంగా పుట్టిన జలపాతంలో విద్యుదగ్ని (విప్లవం) ఎందుకు ప్రభవించదు? అనిప్రశ్నిస్తున్నారు కవి. అధికారం కొట్టిన దెబ్బల ఫలితంగా ఇటు కుళ్ళి పోయిన సమాజపు దుర్గంధం, కొట్టుకుపోయే నీటిలాగా ఆగక దూకుతుందని చెపుతున్నారు. ఇన్ని శతాబ్దాలుగా గొంతుదాటి పలకని శబ్దాలు ఇప్పుడు ఆ ప్రజల గొంతులలోనే గర్జనలై హుంకరించి ఆ దుష్టుల్లో తర్జన భర్జనలు రేపుతున్నాయి. చనిపోయిన యోధుల గుండెలే నేటి పోరాటం సాగించే వారికి పద్మాలదండలై, ప్రభాకిరీటాన్ని (కాంతినీ, తేజస్సునూ) తెచ్చి పెడతాయి. శ్రేయస్సనే వేకువ వాకిలిని తీస్తాయి. అందుకే చైతన్యమనే కాంతి జెండాలను ఎత్తండి. శాంతికి పునాదులు వేసే బాకాలను పూరించండి. అభివృద్ధి మార్గాల్లో ఆడుతూ పాడుతూ సాగండి.



BRAOU

ఈ విధంగా అభ్యుదయ పథాన్ని ఆదేశిస్తూ మళ్ళీ మొదటి చరణంతోనే గేయాన్ని ముగిస్తారు. ఇది గేయంలోని ఆద్యంతాలకు కూడిక, ఆర్తుల అభివృద్ధే తన ఆశయమనీ కవి చేసే సూచన.

### 14.3.3 విశేషాంశాలు

| | | |
|---|---|---|
| ఉషస్సు | = | అభ్యుదయానికి ప్రతీక |
| కిర్మీరం | = | వింతవెలుగు (పుట్టదనుకున్న విప్లవం పుట్టిన వింత పరిస్థితికి ప్రతీక) |
| తమస్సు | = | కిరాతకపు పాలనకు ప్రతీక |
| పాషాణ కిరీటం | = | దౌర్జన్యానికి ప్రతీక |
| ఉల్కాలు | = | విరుచుకుపడే అధికార్లకు ప్రతీక |
| ఖాతాలు | = | ఆక్రమదనానికి ప్రతీక |
| సిండికేట్లు | = | దుష్టశక్తుల కూటమికి ప్రతీక |
| జలపాతం | = | విప్లవం తెచ్చే కాలానికి ప్రతీక |
| విద్యుదగ్ని | = | విప్లవానికి ప్రతీక |
| ప్రభాకిరీటం | = | శ్రీ శ్రీ పాడిన 'అగ్నికిరీటం' లాంటిది. అభ్యుదయానికి ప్రతీక. |

## అభ్యాసం

'ఉషస్సంధ్య'లో కనిపించే పోరాట దృక్పథాన్ని సోదాహరణంగా వివరించండి.

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

## 14.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలోఅభ్యుదయ కవిత్వ దృక్పథాన్ని ప్రదర్శించే పాఠ్యం ఇది.
- రాష్ట్రోద్యమంలో స్వయంగా పాల్గొన్ని తెలంగాణా పోరాటాన్ని ప్రతిబింబించే అనేక కావ్యాలు రచించిన దాశరథి ఈ పాఠ్య రచయిత.
- దాశరథి కావ్యం 'పునర్నవం' లోనిది ఈ కవిత.
- "నిజాంరాజు జన్మ జన్మాల బూజు" అని ఎలుగెత్తిన దాశరథి – ఈ కవితలో తెలంగాణా స్వాతంత్ర్య పోరాటాన్ని చిత్రిస్తున్నారు.
- నిజాం ముష్కరపరిపాలన అంతం కావాలనీ ఉషోదయంలాంటి స్వాతంత్ర్యం జనులకు లభించాలనీ ఆశిస్తున్నారు.

## 3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

'ఉషస్సంధ్య'లోని 'ఇరువర్గాల' పోలికలు సముచితంగా ఉన్నాయా? చర్చించండి.

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

తెలంగాణా పోరాటం స్వరూప స్వభావాన్ని మీ పాఠ్యం ఆధారంగా **నిరూపించండి.**



BRAOU

## 5.6 ఆకళింపు ప్రశ్నలు

1. దాశరథి 'పునర్నవం' కావ్యం సమగ్రంగా చదివి కవిలోని స్వాతంత్ర్య ప్రవృత్తి, సమరయోధుని లక్షణాలు పరిశీలించండి.

2. దాశరథి ఇతరకావ్యాలకూ 'పునర్నవం' కావ్యానికీ ఉన్న పోలికలు గుర్తు పట్టండి?

### అభ్యాసానికి జవాబు

'ఉషస్సంధ్య' గురించి రాసేటప్పుడు దాని కర్త దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణా పోరాటంలో స్వయంగా పాల్గొని (కవిత్వం రాయడమే కాకుండా) జైళ్ళలో తన లక్ష్యసాధనకై కష్టాలు అనుభవించిన జాతీయ కవి అని ముఖ్యంగాచెప్పుకోవాలి. ఆ అనుభవం, ఆవేశం 'ఉషస్సంధ్య'లోని ప్రతి చరణంలోనూ కొట్టవచ్చినట్లుగా కన్పిస్తాయి. 'ఉషస్సంధ్య'లోని మొదటి చరణం చివరి చరణం ఒక్కటే కావడాన్ని 'ఏకసూత్రత' అని అలంకార శాస్త్రపరంగా అంటారు.

"బహు ఉద్వేగ ప్రకృతి. నిప్పులో దూకే వీరశైవులకి, పీరీలుమోసే తురకలకి నాకూ ఇందులో తేడాలేదు. క్షోభా, ఉద్వేగం కలిసి నాతో ఏవేవో రాయించాయి".

అంటూ దాశరథి తన రచనామౌలికాంశాల్ని 'పునర్నవం' మీద పీఠికగా రాసుకున్న 'మననం' అనే భాగంలో తానే చెప్పుకున్నారు. ఈ గుణం అక్షరాలా 'ఉషస్సంధ్య' కవితలో కన్పిస్తుంది.

ఉషస్సు-తెలంగాణా అభ్యుదయం. తమస్సు-ముష్కర పరిపాలనం. ఈ ప్రతీకలు ప్రధానంగా ఈ కవిత రాసిన దాశరథి "అటు-ఇటు" అనే మరో రెండు ప్రతీకల ద్వారా "పాలక-పీడిత" వర్గాల్ని సూచించారు. అటు- వరుసగా పాలకుల దురాక్రమణలనూ, దౌర్జన్యాలనూ, డబ్బు దోపిడీలనూ, దురధికారమదాన్నీ చిత్రించారు.

ఇటు-శతాబ్దాలుగా గొంతైనా దాటి రాని శబ్దాలు ఇప్పుడు సింహగర్జనలై ప్రజాగళాల్లో విప్లవ సంరంభంతో విజృంభిస్తున్నాయని చెప్పారు. 'అటూ-ఇటూ'లకి మధ్య పుట్టే 'కాల జలపాతం' విప్లవమనే విద్యుదగ్నిని పుట్టిస్తుందని చమత్కారంగా సమర్థిస్తూ; విరోధిపక్షాలను గేయ నిర్వహణలో సాహితీ పరంగా ఏకసూత్రనిబద్ధం చేశారు.

అంతటితో ఆగక "ఎత్తండి కాంతి పతాకాలు, ఒత్తండి శాంతి బాకాలు, పదండి ఆగామి పథమ్ము"ల అంటూ ప్రబోధిస్తూ జాతి పురోగమనాన్ని నిర్దేశించారు.

కాబట్టి 'ఉషస్సంధ్య'లోని ప్రధాన దృక్పథం "అభ్యుదయపథం" అని చెప్పవచ్చు.

**– డాక్టర్ రావికంటి వసునందన్**

BRAOU

# భాగం 15 కర్పూరవసంతరాయలు – లకుమనృత్యం

## విషయక్రమం


15.0 ఉద్దేశం
15.1 ప్రవేశిక
15.2 సూచనలు
15.3 పాఠ్యం
    15.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
    15.3.2 వ్యాఖ్యానం
    15.3.3 విశేషాంశాలు
అభ్యాసం
14.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
14.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
14.6 ఆకళింపు ప్రశ్నలు
    అభ్యాసానికి జవాబు


## 14.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- కాల్పనికతావాదానికి సంబంధించిన గేయకవిత లక్షణాలు
- నైతిక మానవతావాద దృక్పథం

## 14.1 ప్రవేశిక

BRAOU

సుమధురగేయరీతులకూ, నవ్య కవిత్వంలోని అనేక విలక్షణ ప్రయోగాలకూ నిధి డా. సి. నారాయణ రెడ్డి   వీరి కవితా ప్రస్థానం భావకవిత్వ యుగంలో అంకురించి, అభ్యుదయ కవిత్వ దృక్పథంతోవిస్తరించి, మానవతా వాదరీతులతోఫలప్రదంగా, జయప్రదంగా సాగుతున్నది. ఈ మహాకవి కృతుల్లోని మొదటి దశకంలోని కావ్యం "కర్పూర వసంత రాయలు". ఇది అర్ధచారిత్రికం. కథానాయిక లకుమ పాత్రను సమాజానికి అతీతంగా చిత్రించడంతో కాల్పనికతావాదాన్ని (Romanticism) కూడా సంతరించుకున్నది. వ్యక్తిక్షేమాన్నీ, సంఘ సంక్షేమాన్నీ తన ఆత్మాహుతితోసాధించ తలపెట్టిన 'లకుమ' ప్రవర్తనం –కావ్యంలో నైతిక మానవతా వాద దృక్పథాన్ని (Ethical Humanisim) చిత్రిస్తున్నది. పై వాదాలనూ, నారాయణరెడ్డి నిరుపమాన గేయకవితా రీతిలోని సుమధుర నాదాలనూ ఈ భాగం ద్వారా మీరు గ్రహిస్తారు.

## 14.2 సూచనలు

ఈ పాఠ్యం 'కర్పూర వసంతరాయలు' లోనిది. ఈ కథాకావ్యం నైతిక మానవతావాద దృక్పథానికి ఒక అక్షరాకృతి. డా. సి. నారాయణరెడ్డి   రచించిన కథాకావ్యాల్లోని మానవతావాద రీతులను విద్యార్థులు ఈ పాఠ్యాంశం అధ్యయనానికి ముందు తెలుసుకోవాలి. దాని వల్ల ఆయన కవితా నిర్మాణ దృక్పథం విద్యార్థుల అవగాహనకు వస్తుంది. ఆయా కథా కావ్యాలు వాటిలోని మానవతా వాదాలూ ఇవి :-

| | | | |
|---|---|---|---|
| 1. | స్వప్నభంగం | – | తాత్త్వికమానవతావాదం |
| 2. | విశ్వనాథనాయుడు | – | చారిత్రిక మానవతావాదం |
| 3. | నాగార్జున సాగరం | – | మత/మతాతీత మానవతావాదం |
| 4. | ఋతుచక్రం | – | సాహిత్య మానవతావాదం |
| 5. | జాతిరత్నం | – | సాంఘిక మానవతావాదం |

ఈ కావ్యాల పఠనంతో విద్యార్థులకు ఆయన కవితా నిర్మాణంతో పరిచయం మాత్రమే కాక, సుమధుర పద విన్యాసంతో, విశిష్ట భావ ప్రకటనా రీతితో, చమత్కారమయమైన శిల్పంతోకూడిన ఒక పదవగాహన కూడా కలుగుతుంది.

ఇంతలో యవనికాభ్యంతరమ్మున నుండి
వినిపించె వాద్యమేళమ్ము.

తోటలో విదురమత్తునన్నుడు గడ్డిపో
చలు లేచి చూచినవి సుమ్ము.

తొలగె ప్రక్కకు మబ్బువలెనున్న తెరయంత
నిలిచె వేదిక మెరుపువలెనున్న ఒక కాంత.

చకితుడై రాయడా జవ్వనిని గాంచె
కాటవేముడు ప్రభుముఖమ్ము పరికించె.

గరుడుని గరుత్తులటు కరములెత్తి పతాక
హస్తముద్రను చూపినది నర్తకి.

కటకాముఖమ్ము నొక్కటపట్టి చూపె ప
ల్లవ హస్తముద్ర లీలగ నర్తకి.

తనపైన పారిజాతములు జలజల కురిసి
నటుల పులకించె నా అవనీపతి.

అంతట మ్రోగెను అలలై సాగెను
పంచమతాళము వసంతరాగము
జడప్రకృతికే యిడె గిలిగింతలు
సమస్త వాద్య క్రమసంయోగము

"తాం తాం తాం తాం
తాం తాం తాం
తై తై తై తై తై తై తై తై
తాం తాం తైతాం
తకతాం తైతాం
తళాంగు తకధిమి
తధిగిణతోం ..."

మృదంగనాదము హృదంతముల రస
నదమ్ములను కదలించె
విపంచికారుతి అపారనాద
ప్రపంచమును పలికించె.

కన్నులరమూసి ఆ కలువకన్నుల పడుచ
ముకుళముద్రను చూపెనపుడు
బొమల నించుక వంచి రమణీయముగ నర్త
కిని చూడసాగె నృపుడు.

బొమలెత్తి మెడను సొంపుగ ద్రిప్పి భ్రమర హ
స్తము పట్టి ఆమె నిల్చినది
రేని కొకభృంగి యెదలోన చొరబారి ఝుం
కృతి చేసినట్లు తోచినది.

మురజమ్ముపై నంత మ్రోగిపోయినవి బం
భరగీతి వంటి ముక్తాయింపులు
ప్రకృతి ప్రత్యణువులో ప్రతినాద మిచ్చినవి
"తాం తకిటతాం" అనెడు వాయింపులు.

ఆ వాదలహరి రా
జాంతరగమున నిండినదపుడు
నర్తకియె తప్ప అ
న్యము కానబడదు రాజానకపుడు.

రేని ముగ్ధమనస్సులోన మన్మథుని ఆ
రవ బాణమవతరించినది
రేని స్నిగ్ధహృదంతరాన అమృతాంశు పదు
నేడవకళ స్ఫురించినది.

ఎటులనో తన చూపులిటుత్రిప్పి కాటవే
ముని పైన ప్రసరించె రేడు
ఇంగితజ్ఞుడు చెప్పెనేదో? రేని యెడంద
లో నిల్చె వర్ణములు మూడు.

రాజు పెదవులమీద 'లకుమా'యనెడు అక్ష
రము లయత్నముగ నొల్కినవి
లకుమ చరణానద్ధ రత్నకింకిణులు మె
ల్లగ 'ప్రభూ' యంచు పల్కినవి.

రాణి అధరోష్ఠమ్ము పైన ఒక సోగ వె
న్నెల తున్క జారిపోయినది.
లకుమ ఓఢ్యాణస్థ రత్నముకురముల చం
ద్రిక తన ముఖమ్ము జూచినది.

నిమిష కాలము వాద్యములుమం
త్రిత భుజంగములట్లు నిల్చెను
సన్ననౌ మురళీస్వనమ్మది
శాంతముల నెవ్వరినో పిల్చెను.

వేణురుతి ఆరోహణస్థితి నందగా
ఆ పురోద్యానమ్ము మారెను బృందగా

ముకుళభావన నభినయించిన
లకుమ మారెను రాధగా
చూచువారికి అభినయమ్మది
తోచె నొక రసగాథగా.

మురళికాస్వర సంశ్రవణమున
మొదట స్తంభించినది రాధిక
త్రుటిని పూర్వస్థితిని గని ఉ
త్సుకత చూపించినది రాధిక.



BRAOU

పాట నాపడు రూపుచూపడు
బాలగోపాలకు డదేల?
రాధ దిక్కులుచూడసాగెను.
ప్రొఢయైనను అపుడు బేల.

ఆమె విరహోత్కంఠయై "కృ
ష్ణా" యటంచును పిల్వసాగెను
అన్ని దెస లొకట్లై మరల "కృ
ష్ణా" యనుచు ఘోషింపసాగెను.

ఆమె గద్గద కంఠియై "కృ
ష్ణా" యనుచు విలపింపసాగెను
తోటలో ఒక మూల కోయిల
బోటి జాలిగ కూయసాగెను.

మురళికాస్వర మల్లనల్లన
విరిసి తారస్థాయి నందెను
రాధ తీయనిబాధతో నే
త్రములు మూసి ప్రశాంతి నందెను.

ఆమె మెరిసెడి కనులతో జ్యో
త్స్నాభిసారికగా స్ఫురించెను
ఆమె వెన్నెల యౌనా? వెన్నెల
ఆమెయో? యన కానుపించెను.

పసుపు మించుల చోళమేదీ
పసిడియంచుల చేలమేదీ
కర్ణతాటంకమ్ములేవీ
కాంచనౌఢ్యాణమ్మదేదీ?

ఆమె వెన్నెల యౌనా? వెన్నెల
ఆమెయో? యన కానుపించెను
కాదు; వెన్నెల తరుణివేషము
కట్టెనో యనగా స్ఫురించెను.

ఆమె నల్గడలాలకించెను
అమరగానము సాగుచుండెను
ఆమె యెదురుగ మూపుదించెను
అమృతరూపము వెల్గుచుండెను.

పరవశుండగు రాజు వెన్నెల
తరగలంబడి తేలిపోయెను.
పరవశుండగు రాజుబృందా
పరిసరమ్ముల నిల్చిపోయెను.

రసజగత్తునకీశ్వరుండగు
రాజునకు తనుతాను కృష్ణ
స్వామిగా రూపొందినటు ఏ
దో మహానుభవమ్ము కల్గెను.

లకును రాజును చూచినంతనె
ఒక నిమేష మ్మామె తనుగత
పంచభూతమ్ముల కెదో కిలి
కించితమ్మైనట్టు లయ్యెను.

పంచవాద్యము లొక్క మారుగ
పరవశమ్మై ఆలపించెను.
వేదిపై కృష్ణయ్య గజ్జెల
పాదములు మాత్రము నటించెను.

దొంగకృష్ణుని పైన కోపము
పొంగివచ్చెను రాధకు
లేని బిబ్బోకమ్ము బుగ బుగ
లేచి వచ్చెను రాధకు.

మురళి యొక పరి మురజమొకపరి మ్రోగెను
కాలిగజ్జెలు ఘల్లనగ మును సాగెను.
నడిచె ఖండితనాయికగ ఆ రాధిక
ముడిచె మోవిని ముడిచె మోమును రాధిక.
గోపబాలుండేమి చేయును పాపము
చూపె తన సర్వాంగసుందర రూపము.

నంగనాచియైన కృష్ణు
డింగనగా అల్ల పొంగి
మోహపక్షము దిప్పి యిటుల
పాడ నట్టెనెను రాధ.

'నీకెట నిలువెల్ల రూపు
గైకొనినటులున్న వాడ
నిను తాకిన వెన్నెల మా
యను పొమ్మో మొరటుకాడ!'

ఈ పొడుపులకే ఉత్తర
మిడు రాదాలోలుడు
హేలగ చిరునవ్వు నవ్వె
లీలాగోపాలుడు.

మంచుముద్ద వోలె రాధ
మనసు కరిగి పోసాగెను
ఆమె ముఖములోని రాగ
మంతరంగమున మూగెను.

ఆమె పెదవులరవిప్పి 'ప్రి
యా' యని సంబోధించెను.
అతడు కన్నులరమూసి 'ప్రి
యా' యని సంభావించెను.

ఎడమ వైపు రాధ నిల్చె
కుడివైపున కృష్ణుడుండె



BRAOU

ఇరువురికిని నడిమి చోటు
కరిగి మాయమగుచునుండె.

అతని వామహస్తమామె
అంసమ్మున అద్దియుండె
అతని దక్షిణకర మామె
అలకల సరిదిద్దుచుండె.

అతడామెను చూచుచుండె
ఆమె అతని చూచుచుండె
ఆది దంపతుల మాదిరి
ఆ చూపులు తోచుచుండె.

సామాజిక లోకము ని
స్తరంగ దుగ్ధాబ్ధియయ్యె
చేతనాజడమ్ములు స
చ్చిదానందమయములయ్యె.

అంతట మృదంగము 'ధణాధణ'మ్మని మ్రోగె
ఇరువురి పదమ్ము లొకవరుస నాడగసాగె.

తకతకిట తకతకిట
పదములిట పదములట
ఘలుఘల్లు ఘలుఘల్లు
గజ్జెలిట గజ్జెలట

ఎల్లవాద్యములు పల్కినవి 'కృష్ణా' యంచు
ఎల్లరాగములు పిల్చినవి 'రాధా' యంచు
అప్పుడందరి మనసుటద్దమ్ములందు చి
త్రముగ కన్పడిరి రాధాకృష్ణులే.

ఆగిపోయెను వేణు గానము
ఆగెను విపంచినిక్వాణము.

సాగినదొకే ఒక మృదంగము
మ్రోగినది దాని సర్వాంగము.
ద్రుతలయను పల్కెను మృదంగము
ఆడినది అకుమ చరణాంగము.

ప్రభువు తన్మయుడయ్యె
ప్రభువు చిన్మయుడయ్యె
ప్రభువు అకుమాలగ్న
పంచప్రాణుండయ్యె.

ఆతడామెనుజేర అడుగు నించుక లేపె
రాణి ఆతని భుజాగ్రాన చేయిని మోపె.

ఒక్కమారుగ ప్రభువు
ఉలికిపడి తను తానుచూచికొనె
ఒక్క మారుగ అకుమ
ఒయ్యారముగ తా నిలిచిపోయె

ఒక్కమారుగ జన
మ్ముప్పొంగి హర్షధ్వనులు చేసె.
ఒక్కమారుగ పవను
డూర్చి తనువార్చి యూలలు వేసె.

అకుమ కించిన్నతశిరస్కయై శ్వాసధా
రాముహుస్పందితోరస్కయై నిల్చుండె.

### 15.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| యవనిక | = | తెర |
| అభ్యంతరము | = | వెనుకనుంచి |
| వాద్యమేళము | = | నాట్యానికి సహకరించే సంగీత వాద్యాల చప్పుడు |
| గరుత్తు | = | రెక్క |
| పతాకహస్తముద్ర | = | చేతి అన్ని వేళ్లనూ నిలువుగా, దగ్గరగాచాచి, ఒక్కబొటన వేలును మాత్రం చూపుడు వేలు మొదటికి ఆనించిపట్టే హస్త ముద్ర |
| కటకాముఖం | = | చేతి బొటనవేలు, చూపుడు వేలు కొనలు ఒకదానికొకటి తగిలేలా పట్టి, నడిమి వేలు అరచేతికి ఆనుకునేలా వంచి, చివరి రెండు వేళ్ళూ అరచేతికి ఆనకుండా కొంచెం వంచి పట్టే హస్తముద్ర |
| పల్లవహస్తం | = | రెండు పతాక హస్తాలనూ మణికట్టుల దగ్గర కలిపి పైకి చాచి చూపే హస్తముద్ర |
| ముకుళ ముద్ర | = | చేతివేళ్లను మొగ్గలాగా మడిచి ఊర్ధ్వముఖంగా పట్టి చూపే హస్త ముద్ర |
| భ్రమరహస్తం | = | చేతినడిమివేలూ, బొటనవేలూ కొసలు తాకేలాగా ముందుకు వంచి, చూపుడు వేలు కొసను పైరెండు వేళ్ళ నడిమి ఖాళీజాగాలో ఆనేటట్టుగా వంచి, చివరి రెండువేళ్ళనూ నిట్టనిలువుగా చాచి పట్టే హస్తముద్ర |

(డా. పోణంగి శ్రీరామఅప్పారావుగారి 'నాట్యశాస్త్రము' అనే డాక్టరేట్ గ్రంథంలోని 291-313 పేజీలు చూడండి).



BRAOU

హృదంతము = గుండె కుదురు
రసనదము = రసప్రవాహం
విపంచిక = వీణ
భృంగి = ఆడ తుమ్మెద
మురజము = మృదంగం, మద్దెల
నాదలహరి = నాదమనే ప్రవహం
అమృతాంశుడు (హిమాంశుడు) = మంచు వంటి చల్లని వెల్లని కిరణాలు కలవాడు - చంద్రుడు (బహువ్రీహి సమాసం)
ఇంగితజ్ఞుడు = మనస్సులోని అభిప్రాయాలు తెలుసుకోగలిగిన శక్తి కలవాడు
చరణానద్ధ (చరణ+ఆనద్ధ) = కాళ్ళకు కట్టబడిన
ఓఢ్యాణము = స్త్రీలు నడుముకు ధరించే ఆభరణం - ఒడ్డాణం
మంత్రితము = మంత్రించబడినది
సంశ్రవణము = చక్కగా వినడం
ప్రౌఢ = శృంగార విలాసాల్లో ఆరితేరిన స్త్రీ
జ్యోత్స్నాభిసారిక = వెన్నెల్లో ప్రియుని కలుసుకోవడానికి తెల్లటి వలువలూ, పూలూ, నగలూ ధరించే వెళ్ళే స్త్రీ
కర్ణతాటంకము = చెవి కమ్మ
బిబ్బోకము = గర్వాతిశయంచేత, ప్రియుని మీద కూడా ముఖ కవళికల ద్వారా, అంగచాలనం ద్వారా అనాదరభావం చూపే శృంగార చేష్ట
నిస్తరంగము = అలలు రేగనిది
దుగ్ధాబ్ధి = పాలసముద్రం
ద్రుతలయ = వేగమైన నాదం
పంచమతాళము = 'తకతకిట' అనే విధంగా ఐదు మాత్రలతో, ఖండగతితో నడిచే తాళగతి
అంసము = నడుము
అలికలు = ముంగురులు

### 15.3.2 వ్యాఖ్యానం

'నవ్వని పువ్వు' నుంచి 'ప్రపంచపదులు వరకు ఇప్పటికి 45 పైగా రసవత్కృతులు రచించిన డా. సి. నారాయణరెడ్డి 1931లో జన్మించారు. వారి మొదటి కృతుల్లోనిది ప్రస్తుత చారిత్రిక కథా కావ్యం 'కర్పూర వసంతరాయలు'. ప్రసిద్ధ చారిత్రిక పరిశోధకులైన శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి 'History of Reddy Kingdoms' అనే ఆంగ్ల గ్రంథం ఈ కావ్యరచనకుప్రోత్సాహాన్నిచ్చిందని రెడ్డిగారు పీఠికలో తెలిపారు. ఆకావ్యంలోనిదే ఈ పాఠ్యం "కర్పూర వసంతరాయలు-లకుమనృత్యం".

కొండవీటి రెడ్డిరాజులలో చివరితరానికి చెందినవాడు కొమరగిరిరెడ్డి. పరిమళ ద్రవ్యాల మీద మక్కువ ఎక్కువ ఉన్న ఈ రాజుకు 'కర్పూర వసంతరాయలు' అని బిరుదు. కావ్యంలో 'రాయడు' అని ఈయనకు చిన్న పేరు పెట్టుకున్నారు కవి. రాయడు సంస్కృతాంధ్రాల్లో పండితుడు. కావ్యకళారసికుడు, కళాపోషకుడు, 'వసంతరాజీయం' అనే నాట్య శాస్త్ర గ్రంథాన్ని మన పాఠ్యంలోని నాయిక 'లకుమ' అభినయప్రభావంతో రచించిన ఆలంకారిక చక్రవర్తి. ఆయన ఆస్థాన నర్తకి ఐన ఈ 'లకుమ' ను అనురాగమూర్తిగానే కాక, త్యాగమూర్తిగా కూడా ఈ కావ్యంలో చిత్రించారు నారాయణ రెడ్డి.

సాధారణంగా వేశ్యలంటేనే ధనసంపాదన ప్రధానంగా కలవారు. ఇది అనాదిగా ప్రసిద్ధమైన విషయం. అలాంటి సందర్భంలో మానవతా దృక్పథంతో ధనాన్నీ, రాజునే కాదు - తన ప్రాణాన్నే రాజ్యక్షేమానికి బలి పెట్టిన త్యాగమూర్తిగా 'లకుమ' పాత్రను చిత్రించారు కవి. కావ్యనేపథ్యం చారిత్రకమే ఐనా ఈ పాఠ్యంలోప్రధాన పాత్ర వహించిన 'లకుమ' ను ఆదర్శమూర్తిగా చిత్రించడంతో ఈ కావ్యం కాల్పనికతా (Romanticism) లక్షణాన్ని సంతరించుకున్నదని చెప్పాలి.



BRAOU

"వ్యాసవాహిని, మా వూరు మాట్లాడింది, సమీక్షణం" వంటి వ్యాస సంకలనాల ప్రకటనం ద్వారా నారాయణరెడ్డిగారిలోని సునిశిత విమర్శనాశక్తిని మనం గమనించవచ్చు. ఇవేకాక "విశ్వగీతి, మథనం, మృత్యువు నుంచి, మంటలూ-మానవుడూ, భూమిక" మొదలైన కావ్యాల్లో మానవతావాద (Humanistic) దృక్పథాన్ని కవితాముద్రికలతో ప్రదర్శించారు నారాయణరెడ్డి. ఈ దృష్టి విశ్వరూపాన్ని ధరించింది ఎన్నో పురస్కృతులను అందుకున్న ఇటీవలి "మానవతావాదకావ్యం" 'విశ్వంభర'లో ఆచార్య సి. నారాయణరెడ్డి డాక్టరేట్ పరిశోధనా గ్రంథం "ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు".

అపారమైన వ్యుత్పత్తి, ప్రాచీన నవీన సాహిత్య అధ్యయనం ఉన్న కవి కాబట్టి నారాయణరెడ్డి గేయ శైలి అలంకారమయంగా ఉంటుంది. తదితర గేయరచయితల్లో సాధారణంగా పాదం చివరికి విరిగిపోవడం కనిపిస్తుంది. కాని, పైన చెప్పిన కారణాల వల్ల నారాయణరెడ్డి గారి గేయం పాదం చివరిలో విరగదు. అఖండంగా సాగి, చెప్పదలచుకున్న భావం పూర్తైనప్పుడే విరుగుతుంది. ఇది వీరి గేయంలోని విలక్షణత.

"ఆమె మెరసెడి కనులతో జ్యో
త్స్నాభిసారికగా స్ఫురించెను"

అనే మీ పాఠ్యంలోని పై పంక్తులు దీనికి ఉదాహరణ.

'దృశ్య చిత్రీకరణ' వీరి కవితలోని మరొక లక్షణం. మీ పాఠ్యంలోని -

"కన్నులరమూసి ఆ కలువకన్నుల పడుచు
ముకుళముద్రను చూపెనపుడు
బొమల నించుక వంచి రమణీయముగ నర్త
కిని చూడసాగె నృపుడు."

అనే పంక్తుల్లో ఈ దృశ్య చిత్రీకరణ లక్షణాన్ని, పాత్రలను చిత్రాలుగా, శిల్పాలుగా కనులముందు నిలిపే తత్వాన్ని చూడవచ్చు.

ఈ పాఠ్య అధ్యయనంలో విద్యార్థులు 'మానవతావాదం' అంటే ఏమిటో, ముఖ్యంగా ఈ పాఠ్యానికి సంబంధించిన "నైతిక మానవతా వాదం" అంటే ఏమిటో తెలుసుకుంటారు.

BRAOU

**ఆ వాదాల నిర్వచనాలివి**

**1. మానవతావాదం (Humanisim)**

మానవుని సర్వశక్తిమత్వాన్నీ, స్వాతంత్ర్యాన్నీ పరమ ప్రమాణంగా భావిస్తూ; అతని ధార్మిక, వైజ్ఞానిక, కళాత్మక, ఆధ్యాత్మిక రంగాల వికాసానికీ; మానవాభ్యుదయానికీ, సంఘశ్రేయస్సుకూ మానవ సామర్థ్యాన్నే మూలంగా ప్రతిపాదించే వాదం - మానవతావాదం".

ఈ నిర్వచనంలో శక్తివంతుడై, స్వతంత్రుడైన మనిషి నిర్నిబంధంగా మానవప్రగతికి తోడ్పడినప్పుడే అది 'మానవతావాదం' ఔతుందన్న నిబంధనను మీరు గుర్తుంచుకోవాలి.

**2. నైతిక మానవతావాదం (Ethical Humanisim)**

"నైతిక పరిధులను మానవపురోగమన కారకంగా నిమించేది - కవిత్వంలోని నైతిక మానవతావాదం."

ఏ సాంఘిక సూత్రాల ప్రమేయంగానీ, ఏ అధికారశక్తుల భయంగానీ లేకుండానే మనిషి తనకు తాను నిర్మించుకున్న నైతిక వర్తనంతో మానవాభ్యుదయానికి పాటు పడటమే నైతికమానవతా వాదం - అన్న భావాన్ని తెలుపుతున్నది ఈ నిర్వచనం. ఎవరి ప్రోద్బలంగానీ, భయంగానీ లేకుండానే రాజ్యక్షేమానికై అసువులు ధారవోసిన 'లకుమ' నైతిక మానవతా వాద స్వరూపిణి.

"పాఠ్యంలో వివరించబడిన ఘట్టాలూ, వాటి వర్ణనా 'కర్పూర వసంతరాయలు' కావ్యంలోని ప్రధాన దృక్పథానికి పూర్తిగా విభిన్నమైనవి." మీరు ఈ విషయాన్ని చాలా స్పష్టంగా గుర్తించాలి. 'కర్పూర వసంత

రాయలు' కావ్యం చారిత్రికమైనా, దానిలోని 'లకుమపాత్రను ఉదాత్తంగాచిత్రించి, కాల్పనికత (Romanticism) ను సంతరించుకున్నది. లకుమ రాజ్యక్షేమం కోసం, రాణి సంతృప్తికోసం తన ప్రాణాలను తానే తీసుకున్నది. ఈ లక్షణాన్ని 'త్యాగవీరం' అనవచ్చు. ఆమె ప్రాణత్యాగం చేసిన సందర్భంలో –

"శిబి దధీచులను మించిన లకుమ త్యాగ శీ
లమ్మునకు ప్రభుతనువు లజ్జాపిహిత మయ్యె.
ఓ లకుమ! ఎటనుంటివో నీవు? ఇంకెచట?
పరమ సాధ్వీ జగత్ సింహాసనముపైన."

అంటూ కావ్యం చివరలో 'రాయని' గుండె పొరలు చీల్చుకొని చిమ్ముకొచ్చిన భావాలు ఆమె మహో వ్యక్తిత్వానికి నిదర్శనాలు.

కాని, మన పాఠ్యంలోని ప్రధాన విషయాలు – మొదటనే అనుకొన్నట్లుగా లకుమ సౌందర్య నాట్యాలూ, ఆమె పట్ల రాయడు ఆకర్షితుడు కావడమూ. అవి ఈ కింది విధంగా ఉన్నాయి.

తెర వెనుక నుంచి వాద్య సమ్మేళనం విన్పించడంతో పాఠ్యం ప్రారంభమౌతుంది. కేవలం ఆ చప్పుడుతోనే నిదురమత్తులోఉన్న తోటలోని గడ్డి పోచలు కూడా లేచి తలలెత్తి చూసాయి. మబ్బు వంటి తెర తొలగగానే, మెరుపు లాగా రంగం మీద 'లకుమ' అవతరించింది.

ఆశ్చర్యంతో 'రాయడు' (కొమరగిరి రెడ్డి) ఆ విలాసిని చూశాడు. ఆయన బావమరిదీ సర్వసైన్యాధిపతీ ఐన కాటయవేముడు అంతలోనే ప్రభువు ముఖంలోని మార్పును పరికించాడు. ఈ ఒకటి రెండు భావాల్లోనే లకుమ చక్కదనం ఎంతదో; అంతలోనే ప్రభువు ఎంతగా ఆకర్షితుడయ్యాడో ధ్వనిమంతంగా వర్ణించడం కన్పిస్తుంది. అంతేకాక కాటయవేముడు ఎంత ఇంగితజ్ఞుడో కూడా తెలుస్తుంది. "కాటవేముడు ప్రభు ముఖమ్ము పరియించె" అనే పంక్తుల ద్వారా.

నాట్యం ప్రారంభించిన లకుమ పతాక ముద్రనూ, కటకాముఖాన్నీ ప్రదర్శించగానే (పతాకముద్ర, రాజుకు విజయాన్ని ఆకాంక్షించేది. కటకా ముఖం పూలు వెదజల్లే ముద్ర. అందుకే 'రాయడు' తనపైన పారిజాతాలు కురిసినట్టుగా వర్ణించారు కవి) తనపైన పారిజాతాల జల్లు కురిసినట్టుగా పులకించిపోయాడు రాయడు.

ఆ తర్వాత నాట్య భంగిమలకు అనుగణంగా పంచముఖి (కటతకిట)లో మృదంగం మ్రోగి సభికుల హృదయాల్లో రసనదులను పొంగించడం, వీణ మధురనాదాన్ని ఒలికించడం జరిగింది. అరమూసిన కన్నులతో ఆ పడుచు ముకుళ ముద్రను చూపుతుంటే, కొద్దిగా కనుబొమ్మలను వంచి ఆ నర్తకి వికసించే సౌందర్యాన్ని చూశాడు ప్రభువు. ఆమె భ్రమర ముద్రను పట్టగానే రాయనికి తన గుండెలో ఆడతుమ్మెద చొచ్చుకొని పోయి ఝుంకారం చేసినట్లుగా అనిపించింది. ప్రకృతిలోని అణువణువులో మృదంగం ప్రతిధ్వనించింది. ఆ నాదలహరి రాజు హృదయాంతరంలో నిండిపోయి నర్తకి ఆకృతే తప్ప ఇంకేదీ ఆయనకు కనపడలేదు. ముగ్ధుడైన రాజు మనస్సులో మన్మథుని 'ఆరవబాణం' లాగా, చంద్రుని 'పదునేడవకళ' లాగా 'లకుమ' సాక్షాత్కరించింది. (మన్మథునికి ఆరవబాణం లేదు. చంద్రునికి 'పదునేడవ కళ లేదు 16 తప్ప. కాబట్టి ఆమె ఎంతటి సౌందర్యమూర్తో వర్ణించడమే కవి దృక్పథం.) పై రెండు అతిశయోక్తుల ద్వారా 'లకుమ' మన్మథ బాణానికన్నా, చంద్రకళ కన్నా అందమైనదనే ధ్వని పుడుతున్నది. ఆమెపై నుండి మరలని తన చూపులను అతి ప్రయత్నంతో ఎలాగోమరలించుకొని కాటయవేముని వైపు చేశాడు రాజు. ఇంగితజ్ఞుడైన కాటయవేముడు రాజు చెవిలో ఏదో చెప్పితే, ఆయన హృదయంలోమూడే అక్షరాలు ముద్రితమైనాయి. అప్రయత్నంగా రాయని పెదవుల మీద 'లకుమా!' అనే పిలుపు ఒలికింది. లకుమ చరణమంజీరాల్లోని రత్నాల మువ్వలు 'ప్రభూ!' అని మెల్లగా పిలిచాయి. రాణి క్రింది పెదవి నుండి మందహాసంలో ఒక వెన్నెల తునుక రాలి పండింది, ఆ చంద్రికే లకుమ ఒడ్డాణంలోని రత్నముకురంలో మెరుపులీనింది. ఈ వాక్యాల ద్వారా ప్రభువులోని మనోవికారాన్ని రాణి కూడా కనిపెట్టిందని తెలుస్తున్నది.

నిమిషంపాటు వాద్యాలన్నీ నిలిచిపోయాయి. ఒక్క మురళీనాదం మాత్రమే వినిపించి, రంగం 'బృందావనం'గా మారిపోయింది. రాధాకృష్ణుల రసమయ గాథను అభినయించడం ప్రారంభించింది లకుమ. ఆ



BRAOU

రసజగత్తుకు తానే 'ఈశ్వరుణ్ణి' అనుకొన్న రాయనికి తానే 'కృష్ణస్వామి' ఐనట్లుగా ఏదో తెలియని మహానుభూతి కలిగింది. అలాంటి రాజాను చూచిన లకుమకు శరీరంలోని పంచభూతాలూ పులకించి పోయినట్టనిపించింది. తామిద్దరే 'రాధా కృష్ణులు'గా మారినట్టుగా ఇద్దరూ భావించసాగారు. వాద్య తాళాల సమ్మేళనంలో తిరిగి లకుమ అభినయం సాగించింది. 'రాధ'గా ముగ్ధగా, ఖండిత నాయిక (ప్రియుని మీద కోపించే యువతి)గా, లకుమ అభినయించింది. అతడు ఆమెనుచూస్తుండగా, లకుమ రాజాను చూస్తుండగా పరస్పరం ఆ చూపులు 'ఆది దంపతుల' (శివపార్వతుల) చూపుల్లా అనిపించాయి. చైతన్యం ఉన్న సామాజికులు నిశ్చలత్వం పొందారు. జడప్రకృతులు (చెట్లూ, చేమలూ, లతలూ, లతాంతాలూ) చైతన్యం పొంది, సచ్చిదానందాన్ని (అచ్చమైన రసానందాన్ని) అనుభవించాయి. లకుమనృత్యం ఎంత గొప్పదో ఈ 'ఉత్ప్రేక్ష' వివరిస్తున్నది. అందరి మనస్సుల్లోనూ రాధాకృష్ణులే నిండిపోయారు. ఆ నాట్యాన్ని చూస్తూ రాయడు తన్మయత్వం పొందాడు. రసానందాన్ని పొందాడు. పంచప్రాణాల్లో లకుమే వ్యాపించిన అనుభూతి పొందాడు. ఆ మైమరపులో లకుమను సమీపించే ఉద్దేశంతో సింహాసనం నుంచి కొంచెంగా కదిలాడు రాయడు. ఇదంతా మొదటినుంచీ గమనిస్తున్న రాణి, ఆయన భుజంపై చేయి వేసింది. ఉలిక్కిపడి రాయడు బహిస్స్మృతిని పొందాడు. అంతటితో ఒక్కమారుగా లకుమ నాట్యం ఆగిపోయింది. సామాజికులు హర్షధ్వానాలు చేశారు. లకుమ కొంచెంగా తలవంచి ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఎగిసిపడే వక్షంతో నిలిచిపోయింది.

### 15.3.3 విశేషాంశాలు

**అలంకారం – ఛందస్సు**

లకుమ నృత్యహేలావర్ణనలతో సాగిన పాఠ్యంలో "మన్మథుని ఆరవబాణం, చంద్రుని పదునేడవ కళ, పురోద్యానం బృందావనంగా మారడం," మొదలైన పదచిత్రాలు 'ఉత్ప్రేక్ష' అలంకారాన్ని సమకూరుస్తున్నాయి. లోకంలోని పద్ధతిని మించి చెప్పిన కవితా పద్ధతిని "ఉత్ప్రేక్ష అలంకారం" అంటారు. "వెన్నెల తరుణి వేషము కట్టెనో"; "చీకటి నిలువెల్ల రూపుగైకొనినటులున్నవాడ" అనేవి కూడా ఉత్ప్రేక్షలే.

"ఎడమవైపు రాధనిల్చె
కుడివైపున కృష్ణుడుండె
ఇరువురికిని నడిమి చోటు
కరిగి మాయమగుచుండె"

అనే పంక్తుల్లో రాజు లకుమకు మానసికంగా ఎంత దగ్గరైనాడో చమత్కారంగా వర్ణితమైంది. పాఠ్యం కొంత త్రిశ్రగతిలోనూ, కొంత చతురశ్రగతిలోనూ, కొంత ఖండగతిలోనూ, మరికొంత మిశ్రగతిలోనూ సాగింది.

a) చతురశ్ర

అంతట | మ్రోగెను | అల్లలై | సాగెను
పంచమ | తాళము | వసంత | రాగము.

b) ఖండ

తకతకిట | తకతకిట
పదములిట | పదములట

c) మిశ్ర

ఆమె వెన్నెల | యౌనా? వెన్నెల |
ఆమెయోయన | కానుపించెను

d) త్రిశ్ర

మంచు | ముద్ద | వోలె | రాధ
మనసు కరిగి | పోసాగెను

BRAOU

## అభ్యాసం

కర్పూర వసంతరాయలులోని 'రాధామాధవీయం' సోదాహరణంగా వివరించండి?

## 15.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో కాల్పనికతా వాదం (Romanticism) ప్రతిబింబించే కథాకావ్యం 'కర్పూర వసంతరాయలు'.
- ఈ కావ్యం కేవలం చారిత్రకమే కాకుండా "నైతిక మానవతావాద" (Ethial Humanism) ప్రబోధకం.
- ఈ కావ్యంతో పాటు డా. సి. నారాయణరెడ్డి "జాతిరత్నం, విశ్వనాథనాయడు, స్వప్నభంగం, ఋతుచక్రం, నాగార్జున సాగరం" అనే మానవతావాద ప్రబోధక కావ్యాలు కూడా రచించారు.
- ఈ పాఠ్యాంశంలోని లకుమనృత్యం భరతనాట్య వైభవాన్ని కాక, రమణీయమైన "రాధా మాధవీయం" నాట్యాన్ని కూడా సంతరించుకున్నది.
- త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్ర గతులకు సంబంధించిన గేయరీతులన్నీ ఈ పాఠ్యాంశంలో సుమధుర పదవిన్యస్తంగా వినిపిస్తున్నాయి.

BRAOU

## 15.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబు రాయండి.

మీ పాఠ్యం ఆధారంగా డా. సి. నారాయణరెడ్డి కవితా లక్షణాలనూ, రీతులనూ వివరించండి.

II. ఈ కింది ప్రశ్నకు పదిహేను పంక్తుల్లో జవాబు రాయండి.

ఈ పాఠ్యంలోని గేయరీతులు సోదాహరణంగా తెలపండి ?

## 15.6 ఆకళింపు ప్రశ్నలు

1. "నాగార్జునసాగరం, స్వప్నభంగం, విశ్వనాథ నాయడు, జాతిరత్నం, ఋతుచక్రం, కర్పూర వసంతరాయలు" తో పాటుగా డా. సి. నారాయణరెడ్డి రచించిన ఇతర కథాకావ్యాలు. వాటిని సంపాదించి చదివి, వాటి విభిన్న ధోరణులు పరిశీలించండి.
2. డా. వానమామలై వరదాచార్యులు "పోతన చరిత్రము" లో భోగినీ నృత్యఘట్టం ఉన్నది. డా. పుట్టపర్తి నారాయణాచార్యులు "శివతాండవము" పూర్తిగా నాట్యమయమే. ఈ రచనలను లకుమనృత్యంతో సమన్వయ పూర్వకంగా అధ్యయనం చెయ్యండి.

## అభ్యాసానికి జవాబు

మృదంగం ఆగిపోయి మురళీనాదం వినిపించగానే రాధగా అభినయించడం ఆరంభించిన లకుమ ఒక్క క్షణం ఆగిపోయింది. అంతలోనే తేరుకొని తిరిగి అభినయం ఆరంభించింది. పాట ఆపకుండా, తనరూపు చూపకుండా బాలగోపాలుడు ఇలా వేధిస్తున్నాడేమిటా? అని నిజానికి ప్రౌఢైనా, బేలగా మారిపోయింది రాధ (లకుమ). విరహంతో 'కృష్ణా!' అంటూ రాధ విలపిస్తే తోటలోని ఒకమూల ఆడకోయిల జాలిగా కూసింది. మురళీరవం అంతకంతకూ తారస్థాయిని అందుకోగా తీయని బాధతో పరవశించి, కన్నులరమూసిందిరాధ. తరుణివేషం కట్టిన వెన్నెల్లాంటి లకుమ సౌందర్య ప్రవాహంలో కొట్టుకు పోతున్న రాజు మానసికంగా తానే కృష్ణుడిని అనుకొని మనసాకల్పితమైన ఆ బృందావన పరిసరాల్లో నిలిచిపోయాడు. అంతలో ఆ దొంగ కృష్ణుణ్ని చూసిన రాధ, కోపంతో ఖండిత నాయికలాగా మోవి ముడిచి ముందుకు నడిచింది. అంతవరకూ స్పష్టాస్పష్టంగా ఉన్న గోపబాలుడు తన సర్వాంగ సుందరమైన రూపాన్ని చూపాడు. ఐనా కోపం తొలగని రాధ "చీకటిముద్దలాగా ఉన్న ఓ మొరటుకాడా! నిన్ను తాకితే వెన్నెలవంటి నామేను మాసిపోతుంది. నా దగ్గరికి రాకు తొలగి పొమ్మంది." ఆ మాటలకు కోపించక, మారాడక, ఊరికే చిరునవ్వుతో ఉండిపోయాడు కుహనాగోపాలుడు. ఆ మందహాసానికి కరిగిన మంచు ముద్దగా మారిపోయింది రాధ. పెదవులరవిచ్చి 'ప్రియా!' అని పిలిచింది. ఎడమవైపురాధా, కుడివైపు కృష్ణుడూ దూరంగా నిలిచిపోయినా ఇద్దరి మధ్యలోని దూరం కరిగి మాయమైనట్లు పరస్పరం భావించారు.

అతని ఎడమచేయి ఆమె నడుమును చుట్టింది. కుడిచేయి ముంగురులను సవరించింది. వారిద్దరూ ఒకరినొకరు ఆదిదంపతుల్లా (శివపార్వతుల్లా) గా చూసుకున్నారు. ఆ నాట్య విన్యాసాన్ని దర్శించి చేతనాలు జడత్వాన్ని పొందాయి. జడాలన్నీ చైతన్యాన్ని పొందాయి. మద్దెల, వీణ మొదలైన వాద్యాలన్నీ 'కృష్ణా!' అని పలికాయి. తీగసాగే రాగాలన్నీ 'రాధా!' అని పలవరించాయి. సామాజికులందరి మనస్సుల్లోనూ రాధాకృష్ణులే నిండిపోయారు.

'కర్పూర వసంతరాయలు' కావ్యంలో ఒక ఉపాఖ్యానంలాగా సాగిన ఈ "రాధామాధవీయం" లకుమా, రాయడూ సృష్టించుకొన్న ఊహా జగత్తు. ఒక సౌందర్య సౌఖ్య స్వర్గం. దాన్ని రమణీయంగా, కమనీయ కవితా శిల్పంలో మలిచి చూపించారు ఆచార్య సి. నారాయణరెడ్డి గారు.

– డాక్టర్ రావికంటి వసునందన్

BRAOU

# భాగం 16 నరుడు కక్కుతున్న విషం

**విషయక్రమం**

16.0 ఉద్దేశం
16.1 ప్రవేశిక
16.2 సూచనలు
16.3 పాఠ్యం
  16.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు
  16.3.2 వ్యాఖ్యానం
  16.3.3 విశేషాంశాలు
అభ్యాసం – 1
16.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకొందాం.
16.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
16.6 ఆకలింపు ప్రశ్నలు
  అభ్యాసానికి జవాబు

## 16.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- బోయి భీమన్న కవిత్వతత్త్వం.
- ఈ పాఠ్యంలోని సాంఘిక మనవతా వాద స్పృహ.

## 16.1 ప్రవేశిక

జాషువాలాగానే డా. బోయి భీమన్న  కూడా కులమత వ్యవస్థకు వ్యతిరేకంగా, వర్ణ వర్గ రహిత సమాజాన్ని కాంక్షించి మానవతావాద స్ఫూర్తితో కూడిన ఆవేశంతో, కవితా దర్శనంతో కవిత్వం చెప్పినవారు. ప్రస్తుత రాజకీయ, సాంఘిక పరిస్థితులకు కుమిలిపోయి, సాంఘిక దురాచార ప్రక్షాళన పూర్వకంగా డా. బోయి భీమన్న రచించిన చదువుతారు.

BRAOU

## 16.2 సూచనలు

ఈ పాఠ్యానికి ముందుగా విద్యార్థులు డా॥ బోయి భీమన్న  కృతులు "గుడిసెలు కాలిపోతున్నాయ్, దీపసభ, మధుగీత, పాలేరు, కూలిరాజు (ఈ రెండూ నాటకాలు)" వంటి వాటిని చదవాలి. అందువల్ల విద్యార్థులకు భీమన్న  కవితా శిల్పంతో చక్కని పరిచయం కలుగుతుంది. ఈ పాఠ్యం అధ్యయనానికి అది తోడ్పడుతుంది.

## 16.3 పాఠ్యం

నవ యువకుల నీతిని పూడ్చి కట్టిన సమాధులపై
బాక్సాఫీసులు పెట్టుకుంటున్న ప్రభూ!
సంపెంగ మొగ్గలపైకెగదోలి, తుమ్మెద నిసుగుల్ని
అకాలాగ్నికి బలిపెడుతున్న ప్రభూ!

ఎడమచేత గుండెల్ని వేపుడు చేసి
కుడిచేత మెదడుకు తినిపిస్తున్న ప్రభూ!
చర్మాన్ని వొలిచి బుష్‌కోట్లు కుట్టి
నెత్తురు కళేబరాలకు అమ్ముతున్న ప్రభూ!

అమృతాన్ని నిషేధించి, హాలాహలం త్రాగించి
పెండ్లి పాడెపై దక్షిణ మూటగట్టుకొంటున్న ప్రభూ!
నాగరికతా కత్తితో నాడుల్ని నారతీసి
నమ్మించి గొంతుకురిత్రాళ్ళు పేనుతున్న ప్రభూ!
నీ వెవరివో తెలియని ఓ ప్రభూ!
మానవుని ప్రగతి పథం ఇదేనా? ప్రభూ!

అయ్యో –
ఎవర్ని నేను ప్రభువంటున్నది?
ఎవరితో నేను మొరపెట్టుకొంటున్నది?
నా మనస్సులోని అభిలాషకు
నేనే ఒక రూపం కల్పించుకొని,
దానిని విగ్రహంగా చెక్కుకొని
వీధి మొగలో నిలుపుకొని
దానినేనా నేను ప్రభువంటున్నది?
అది నేనే కాదా?
నాకు నేను ప్రభువునా?
అయ్యో – ఈ గోలంతా
నన్ను గురించి నేను
నాతో మొర పెట్టుకొంటున్నదేనా?

అయ్యో –
మానవ ప్రగతి పథం నిండా
పచ్చి విషం కక్కుతున్న వాణ్ని
మానవుణ్ణయిన నేనేనా?

### 16.3.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| బాక్సాఫీసులు | = | దేవాలయాలు |
| నిసుగులు | = | కూనలు/శిశువులు |
| అభిలాష | = | కోర్కె |
| ప్రగతిపథం | = | సమాజ అభ్యున్నతి |

BRAOU

### 16.3.2 వ్యాఖ్యానం

క్రీ.శ. 1911లో హరిజన వర్ణంలో జన్మించారు. డా. బోయి భీమన్న. ఇక్కడ ఆయన కులం ఎందుకు పేర్కొనవలసివచ్చిందంటే, సాంఘికంగా ఆయన తనకులం కారణంగా పడిన బాధలూ, అవమానాలూ కవితలో మానవీయ దృక్పథానికి దారితీశాయి. జాషువాలాంట అనుభవమూ, ఆవేశమూ, కవితా దర్శనమూ ఉన్న మరో కవి బోయి భీమన్న. "అజ్ఞానం కాలిపోతున్నది మానవచేతన మేలుకుంటున్నది" అనే ధ్వనితో రాసిన భీమన్న కావ్యం "గుడిసెలు కాలిపోతున్నై"లోంచి తీసుకున్నది ఈ పాఠ్యం. దీపసభ, మధుగీత, రాగవాశిష్ఠం, పైరుపాట, రాఖీలు, పిల్లీ శతకం మొదలైన కావ్యాలూ; పాలేరు, కూలిరాజు మొదలైన నాటకాలూ వీరి ఇతర రచనలు. ఈ పాఠ్యంలో ప్రస్తుత రాజకీయ, సాంఘిక పరిస్థితుల చిత్రణతోపాటు మానవతావాదాన్ని ప్రతిబింబించే కవిత్వం ఉంది.

#### సాంఘిక మానవతావాదం

డా. బోయి భీమన్న కవితా దృక్పథం సాంఘిక మానవతావాదం. "వైజ్ఞానిక, సాంకేతిక, రాజకీయ, ఆర్థిక, న్యాయ, పరిపాలనా రంగాలకు సంబంధించిన సర్వతోముఖాభివృద్ధిని సామాజిక శ్రేయస్కరంగా అనువర్తించేది. కవిత్వంలోని సాంఘిక మానవతావాదం (Social Humanism). భీమన్న" కవిత్వావేశం సామాజిక

ప్రగతి దర్శన పూర్వకమైంది. కాబట్టి ఈ పాఠ్యంలోని కవిత్వ దృక్పథం సాంఘిక మానవతావాద పూర్వకం.

ఈ భాగంలో బోయిభీమన్న దళితవర్గాల ప్రతినిధి కవి. ఈ పాఠంలో తామూ, తన కులమూ పడే బాధలేకాక ప్రపంచంలోని అందరి బాధలూ వస్తువు. ఇలా ఎదిగి, వస్తువు అంతరాళంలోకి చూడటాన్నే ఆలంకారికులు సాధారణీకరణం (Universelization) అంటారు. పరమాత్మను సంబోధించి ప్రపంచంలోని అక్రమాలను ఏకరువు పెడుతూ, చివరికి "ఎవరిని నేను ప్రభువంటున్నది? అది నేనే కాదా?" అంటూ ప్రపంచంలోని నేరాలన్నీ తమ నెత్తిమీదకే ఎత్తుకుని ఈ పాఠానికి "నరుడు కక్కుతున్న విషం" అని నామకరణం చేశారు.

నవచేతన (మార్పు) ను అరికట్టి, ఆ నీతిపై బాక్సాఫీసులు (ఆలయాలు) కట్టుకుంటున్న ప్రభూ! అంటూ మొదలుపెట్టి వరుసగా సాంఘిక దురాగతాలను భగవంతునికే అంటగడుతున్నారు మొదట్లో. సంపెంగలకూ, తుమ్మెదలకూ, పడిరాదని కవిసమయం. దాన్ని ప్రతీకగా గ్రహించి విద్యార్థులు - దుష్ట రాజకీయాలు కానీండి; లేదా నవయువకులు - దురలవాట్లు కానీండి తుమ్మెదకూనలవంటి ఈ సమూహాన్ని పై దురాచారాలనే సంపెంగమొగ్గల పైకి తోలి అకాల మృత్యువుకు బలిచేస్తున్నావా అగ్నిప్రభూ? అంటున్నారు.

మరో చరణంలో ఎడమ కుడిచేయి - రెండు మతాలు/వర్గాలు/ పార్టీలుగా గ్రహించి ఒక వర్గంచేత జాతి గుండెల్ని వేపుడుచేసి గుండెలే లేని మరోవర్గం మెదడుకు తినిపిస్తున్నావా ప్రభూ! అంటారు. చర్మాన్ని ఒలిచి అనే చరణంలో పొట్టకూటికై శరీరాన్ని అమ్ముకునే పడుచులను బుష్‌కోట్లుగా కుట్టి నెత్తురే తప్ప మనస్సులేని సజీవకళేబరాలకు అమ్ముతున్నావా ప్రభూ? అంటారు.

ఇలా దురాచారాలను నెమరువేసుకొన్న కవే - ఇంతకీ నువ్వెవరివో తెలియని ప్రభూ! మానవుని ప్రగతి పథం ఇదేనా? అంటూ చివరి ప్రశ్న వేస్తారు.

అంతలోనే తాము ప్రశ్నిస్తున్న ప్రభువు విశ్వాత్ముడనీ, సంఘం చెక్కిన తాత్విక శిల్పమనీ గుర్తుకురాగా ఇలా అంటారు. నా మనస్సులోని అభిలాషకు రూపం కల్పించుకొన్న విగ్రహాన్నేనా నేను ప్రభువంటున్నది? అలా ఐతే ఆ ప్రభువు నేనే కాదా? అయ్యో! ఈ గోలంతా నన్ను (విశ్వాన్ని) గురించి, నాతో నేనే పెట్టుకుంటున్న మొరేనా? అని ఆలోచిస్తారు. ఈ చరణంలో - జాతి నా[illegible]కి [illegible]యుడే కారణమనే సందేశం కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నది.

ఇంతవరకూ పై నేరాలన్నీ ప్రభువే చేస్తున్నాడని నిందించినందుకు పరితపిస్తూ, అందరి నేరాలూ తమపైనే వేసుకుని ఇలా అంటారు ఆఖరి చరణంలో.

"అయ్యో!-
మానవ ప్రగతిపథం నిండా
పచ్చి విషం కక్కుతున్నవాణ్ని
మానవుణ్ణయిన నేనేనా?"

ఇది విశ్వమే తానుగా రూపొందిన కవి ఉత్తమగుణం. పై చరణంలోని 'మానవుడు' - దురాచారాలు చేసే సంఘశక్తులకు ప్రతీక. వేరెవర్నీ నిందించక ఆ మానవుణ్ని తానే అనుకుని "పచ్చి విషం కక్కేవాడు అచ్చమైన మనిషికాజాలడు" అనే సందేశాన్ని అందిస్తున్నారు. జాతి అనుభవించే కష్టాలకు స్పందించిన సహానుభూతీ, వేదనా, విశ్వ మానవీయ దృక్పథం ఈ పాఠ్యంలోని ప్రతి పంక్తిలోనూ ఉన్నాయి. కాబట్టి ఇది మానవతావాదాన్ని ప్రతిబింబించే కవిత. దోషాన్నీ, గుణాన్నీ ఎవరిపైనా మోపక తమపైనే వేసుకున్న కవితా లక్షణంతో ఈ కవితలో "అనన్వయం" అనే అలంకారం స్ఫురిస్తుంది.

### 16.3.3 విశేషాంశాలు

సాంఘికమానవతావాద దృక్పథంతో రచించిన ఈ పాఠ్యంలోని అలంకారం 'అనన్వయం' అనన్వయాలంకారమంటే "ఒకదానితో పోలికచెప్పడానికి సరిసాటి వస్తువు దొరకనప్పుడు, దానితోనే దాన్ని పోల్చి చెప్పడం". నరుడు కక్కుతున్న విషం అనే ఈ పాఠ్యంలో కవి =

BRAOU

" అయ్యో!–
ఎవర్ని నేను ప్రభువంటున్నది?
ఎవరితో నేను మొరపెట్టుకుంటున్నది?
..................................
అది నేనే కాదా?
నాకు నేనే ప్రభువునా?
అయ్యో– ఈ గోలంతా
నన్ను గురించి నేను
నాతో మొరపెట్టుకొంటున్నదేనా?"

అని రాసిన పంక్తులు అనన్వయాలంకారాన్ని సూచిస్తున్నాయి.

### అభ్యాసం

ఈ భాగంలోని కవిత్వ దృక్పథం ఏమిటి?

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

______________________________

## 16.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ఆధునిక కవిత్వ సంప్రదాయంలో సాంఘిక మానవతా వాద (Social Humanism)దృక్పధాన్ని ప్రదర్శించేరచన ఇది.
- ఈ పాఠ్యరచయిత డా॥ [illegible].
- సాంఘిక దురాచారాలనూ, వర్ణవర్గభావపూరితమైన సామాజిక అసమానతలనూ ఈ పాఠ్యం తీవ్రంగా నిరసిస్తున్నది.
- మానవునిలోని వేదన, బాధ, దుఃఖం నశించి, సర్వసమానత్వం నెలకొనాలని ఈ రచన ఆకాంక్షిస్తున్నది.
- సాంఘిక వ్యవస్థల పేరిటా, సంప్రదాయాల నెపంతో సంఘంలో మానవత్వస్పృహ, నశించకూడదని ఈ పాఠ్యం ప్రబోధిస్తున్నది.

## 16.5 మాదిరి పరీక్షాప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నకు ముప్పై పంక్తుల్లో జవాబురాయండి.

మీ పాఠ్యంలోని ప్రతీకలనూ, సాంఘిక దురాచారాలనూ వివరించండి?

II. ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులురాయండి.

1. కవితానే ప్రభువునని ఎందుకు భావించాడో తెలపండి?

2. సాంఘిక మానవతావాదాన్ని నిర్వచించి, పాఠ్యానికి అన్వయించండి?



BRAOU

## 16.6 ఆకళింపు ప్రశ్నలు

1. బోయి భీమన్న "గుడిసెలుకాలిపోతున్నయ్" కావ్యాన్ని పూర్తిగా పఠించి ఆయనకవిత్వ దృక్పథాన్ని గమనించండి.

2. జాషువా, తిలక్ కవిత్వాలకూ భీమన్న కవితా పద్ధతికి ఉన్న పోలికలను మీ అధ్యయనం ద్వారా గమనించండి.

### అభ్యాసానికి జవాబు

సంఘం అనేక దురాచారాలతో పతనమై పోతున్నదనే అంశం పాఠ్యానికి వస్తువు. ఈ పతనానికి కారణం "కర్మ సిద్ధాంతం భగవంతుడు" అని కొందరు వాదిస్తారని ధ్వని గర్భితంగా చెప్పడానికే భీమన్న కవిత మొదట్లో అన్యాయాలన్నీ నీవే చేయిస్తున్నావని 'ప్రభువు'ను నిందిస్తారు. ఆ వెంటనే దాన్ని ఖండిస్తూ మనిషే శత్రువు కాని, మరేదీ కాదని ఇలా చెపుతారు.

"అయ్యో
మానవ ప్రగతిపథం నిండా
పచ్చి విషం కక్కుతున్నవాణ్ని
మానవుణ్నయిన నేనేనా?"

ఇది చాలా శక్తిమంతమయిన చరణం. "విషం కక్కేవాడు మనిషి కాడనే సందేశం" స్పష్టంగా ఈ పంక్తుల్లో కనిపిస్తుంది. ఆ మనిషిని తానేనని కవి అనుకోవడం తాను- విశ్వమానవుణ్ణని చెప్పడానికే. పై పరిస్థితులకు తాను నిరంతరం పరితపించి పోతున్నాననీ, ఆ యాతనలు మనిషే సంఘంలోంచి తొలగించాలనీ ఉపదేశించడానికే.

"గుడిసెలు కాలిపోతున్నాయ్" పీఠిక- దండోరా- లో భీమన్న "దేవుడికే నాకున్నపాటి హృదయం వుంటే?" అనే ప్రశ్నార్థక శీర్షికలో ఇలా అంటారు. "ఈనాటి మానవులలో ఎంత వేదన! ఎంత బాధ! ఎంత దుఃఖం! నా తోడిమానవుల బాధల్నీ, యాతనల్నీ, దారిద్ర్యాన్నీ చూస్తుంటే - నా హృదయమే ఇంతగా విలవిలలాడిపోతున్నదే! ఈ సృష్టికి, కనీసం ఈ మానవ సృష్టికి, అధిపతుడైన భగవంతుడనబడేవాడే ఒకడుండి వుంటే - అతడి హృదయం ఏమై పోవాలి?

నాకున్న హృదయంలో లక్షోవంతు అంతైనా భగవంతుడికున్నదా?"

నిజానికి ప్రపంచంలోని, మనుషుల్లోని గుణదోషాలకు భగవంతుడు కారణమని భీమన్న నమ్మరు. ఇదంతా మనుషులు చేసుకునే స్వయంకృతమనే భావమే వారి విశ్వాసమని ఈ పాఠ్యం చాటుతున్నది. 'దండోరా'లో ఆయన భగవంతుడి పేరుతీసుకోవడం కేవలం అవరోహణక్రమంలో సాంఘిక నేరాలన్నిటికీ భగవంతుడు కారణం కాదని చెప్పడానికే.

తానే విశ్వమానవుడై, విశ్వాత్మకుని స్వరూపాన్ని వివరించి, విశ్వకళ్యాణానికై పరితపించిన భీమన్న కవిత "నరుడు కక్కుతున్న విషం"లోని ప్రధానదృక్పథం "సాంఘిక మానవతావాదం".

**– డాక్టర్ రావికంటి వసునందన్**

BRAOU

# భాగం 17 రహదార్లు

విషయక్రమం

17.0 ఉద్దేశం
17.1 ప్రవేశిక
17.2 సూచనలు
17.3 పేరడీ అంటే
17.4 పేరడీ ఆవిర్భావం
 17.4.1 పేరడీ లక్షణాలు
 17.4.2 పేరడీల లక్ష్యం
 17.4.3 తెలుగులో పేరడీకారులు
17.5 పాఠ్యం
 17.5.1 కఠిన శబ్దాలకు అర్థాలు
 17.5.2 వ్యాఖ్యానం
 17.5.3 విశేషాంశాలు
**అభ్యాసం – 1**
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
17.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
17.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు
17.8 ఆకళింపు ప్రశ్నలు
 అభ్యాసాలకు జవాబులు
 చదవదగిన పుస్తకాలు

## 17.0 ఉద్దేశం

BRAOU

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ క్రింది విషయాలను వివరించగలుగుతారు.

- తెలుగులో పేరడీ
- పేరడీ లక్షణాలు
- పేరడీ లక్ష్యం
- తెలుగులో పేరడీకారులు
- 'రహదార్లు' ఎలాంటి పేరడీ
- మాచిరాజుదేవీ ప్రసాద్ రచనా విధానం

## 17.1 ప్రవేశిక

ఆధునికయుగంలో తెలుగుసాహిత్యంలో వికసించిన కథానిక, వ్యాసం, నవలవంటి ప్రక్రియల్లో 'పేరడీ' ఒకటి. ఇది ఒక కవిత్వ ప్రక్రియ. వెక్కిరింపుగానో, మెచ్చుకోలుగానో ఒక రచనను అనుకరిస్తూ 'పేరడీ' రచన సాగుతుంది. ఇంతవరకూ మీరు ఆధునిక కవిత్వంలోని భావ, అభ్యుదయ, మానవతావాద కవిత్వ పద్ధతులు అధ్యయనం చేశారు. గేయ కథాకావ్య రీతులనూ, వచనకవితా ప్రక్రియలనూ పఠించారు. ఈ భాగంలో 'రహదార్లు' అనే పేరడీ ప్రక్రియకు సంబంధించిన పాఠ్యం అధ్యయనం చేస్తారు. పేరడీ లక్షణాలను తెలుసుకుంటారు.

## 17.2 సూచనలు

మీరు పాఠ్యంగా చదవబోతున్న ఈ పేరడీ రచయిత మాచిరాజు దేవీప్రసాద్ పేరడీ లక్షణాలను వివరిస్తూ ఒక వ్యాసం రాశారు. అది "మాచిరాజు దేవీప్రసాద్ పేరడీలు" అనే గ్రంథం (సంపాదకుడు

బూదరాజు రాధాకృష్ణ, ప్రచు. శ్రీశ్రీ స్మారక సంస్థ, హైదరాబాద్, 1986) లో లభిస్తుంది. ఈ పాఠ్యం సమగ్రావగాహన కోసం ముందుగా ఆ వ్యాసం చదవాలి.

## 17.3 పేరడీ అంటే

పేరడీ అనే ఇంగ్లీషు మాటకు మూలం పేరోడియో (Parodeia) అనే గ్రీకుపదం. మరొకపాట పక్కనే పాడే పాటనో, ఎగతాళి పాటనో పేరోడియో అంటారు. ప్రాచీన గ్రీకు సాహిత్యయుగంలో కొన్ని గంభీరమైన కృతులకు కొందరు పనిగట్టి పరిహాస కృతులను కవిగట్టి పాడేవాళ్ళు. పేరుపొందిన ఒక కవి ఒక గీతంరాస్తే, మరొకవి ఆ గీతంలోని మాటలనూ, రచనా పద్ధతినీ ఆడంబరమైన భాషలో, ఛందస్సులో అనుకరిస్తూ, పనికి మాలినవి అనుకునే కవితా వస్తువుల మీద కవిత్వం అల్లేవాడు. ఆరోగ్య ప్రదాయని ఐన నవ్వును సామాజికులకు కల్గించే ఒక కవితా వినోదం ఇది. ప్రాచీన నాటకాల్లో విదూషకుడు కొన్ని సన్నివేశాల్లో కన్పించడం ఇటువంటి పద్ధతిలోనే. ఆధునిక సాహిత్యంలో ఈ రకం కవితా వినోదం వ్యంగ్య సాధకమై ఒక రచనా ప్రక్రియగా రూపొందింది. సమకాలిక రచయితలను విమర్శించే సాధనంగా పెంపొందింది.

ఈ రచనా ప్రక్రియ కేవల హాస్యరచనలకూ, దూషణరచనలకూ, వ్యంగ్యరచనలకూ భిన్నమైంది. కేవల హాస్య, ధూషణ, వ్యంగ్య, చమత్కార రచనలు రాసే దానిపట్ల అంటే రచనావస్తువుపట్ల రచయిత వైఖరిని తెలియజేస్తాయి. అవి ఆయా రచయితలు స్వంతంగా రాసేవి. వాటిలోని నిర్మాణం, శైలి, ఛందస్సు మొదలైనవన్నీ ఆయా రచయితలు కల్పించినవే. వీటిని స్వతంత్ర రచనలు అనవచ్చు. ఇవికాక దేన్ని గురించి అయినా స్వతంత్ర రచనలు వెలువడవచ్చు.

పేరడీ అచ్చంగా స్వతంత్ర రచనకాదు. అది ఆభాస స్వతంత్ర రచన. అంటే ఒక సాహిత్యరచనను (అదికవిత్వం కావచ్చు, వచన రచనకావచ్చు) ఆధారంగా చేసుకొని పుట్టే అనుకరణ రచన. మాతృకకు పుత్రికలాంటిది. జీవశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే పేరడీ పరభాగ్యోప జీవి (Parasite) లాంటిది. పరభాగ్యోప జీవి ఇతర జీవి మీద ఆధారపడి బతుకుతున్నట్లే, పేరడీ ఇతర సాహిత్య రచన మీద జీవిస్తుంది.

పేరడీ అనుకరణ రచన అన్నాము. అనుకరణకు ఆధారమైన స్వతంత్ర రచనలోని ఏ అంశాలను అది అనుకరిస్తుందో తెలుసుకుందాం.

అనుకరణ రచన విలక్షణంగా ఉంటుంది. వికటంగా ఉంటుంది. వెక్కిరింపుగానో, మెచ్చుకోలుగానో ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కేరికేచర్ (caricature) రూపంలో ఉంటుందన్నమాట. స్వతంత్ర రచనల్లోని వస్తు గాంభీర్యాన్నీ, శైలీ గాంభీర్యాన్ని అనుకరించి కేరికేచరు చేస్తుంది. అంటే స్వతంత్ర రచనలోని వస్తుస్థానంలో, మనం పరమచెత్త అనుకునే లేదా అంత ముఖ్యంకాదనుకునే సాహిత్య వస్తువును పేరడీకారుడు తన అనుకరణరచనలో పోటీగా ప్రవేశపెడతాడు. ప్రవేశపెట్టి వస్తుగాంభీర్యాన్ని అకటా వికటం చేస్తాడు. అట్లాగే స్వతంత్ర రచనలోని నిర్మాణాన్ని అనుకరిస్తూ ఛందస్సు స్థానంలో శైలి స్థానంలో అదేరకం ఛందస్సునూ శైలినీ పోటీగా అనుకరిస్తాడు. స్వతంత్ర రచనలోని పదాలలాంటి పదాలను వాడో వాటిని మార్చివేసో, తారుమారు చేసో, మొత్తం శైలిని అనుకరించో పోటీపడతాడు. పోటీలో శైలీ గాంభీర్యాన్ని వికటం చేస్తాడు. అంటే వస్తువుకూ రచనా పద్ధతికీ మధ్య ఉండే సమన్వయాన్ని విరూపం చేస్తాడన్నమాట.

మనదికాని మరొక రచన విరూపంచేసి రాయడమెందుకు? ప్రయోజనమేమిటి? బఫూనరీ, మిమిక్రీ, కార్టూన్లు మీకు తెలుసు. వీటిద్వారా మనకు వినోదం కలుగుతుందని మీకు తెలుసు. కార్టూనులో వినోదంతో పాటు విమర్శదృష్టి, సంస్కరణ దృష్టి ఉన్నాయని మీరు గమనించే ఉంటారు. పేరడీ లక్ష్యంకూడా సరిగ్గా కార్టూను లక్ష్యంలాంటిదే. అందుకే పేరడీకారుడు తనదికాని మరొక రచనను విరూపం చేసి తీవ్రగంభీరస్థాయి రచనను అపహసిస్తూ, మనకు వినోదం కల్గిస్తాడు. విమర్శిస్తాడు. సంస్కరణ దృష్టినికూడా ప్రదర్శిస్తాడు. తను అనుకరిస్తూ, విరూపంచేసే రచనమీద గౌరవంతోనే ఈ పని చేస్తాడు. రచయిత మీద వ్యక్తిగత ద్వేషంతో ఈ పని సాధారణంగా చెయ్యడు.

## 17.4 పేరడీ ఆవిర్భావం

ఆధునిక తెలుగు సాహిత్యంలో పేరడీ ఒక ప్రక్రియగా ఆవిర్భవించడానికి, వికసించడానికిగల హేతువులు మూడు అవి : 1. తెలుగు ప్రాచీన సాహిత్యంలోని అపహాస్యకృతులు, ధూషణకృతులు, చాటువులు, (భీమకవి 

BRAOU

నుంచి కూచిమంచి జగ్గకవి దాకా ఈ రకం సంప్రదాయం ఉంది. జరుక్‌శాస్త్రి పేరడీలు భూమికలోను, ఈ పాఠం చివర ఉన్న అదనపు సమాచారంలోనూ వివరంగా చూడండి). 2. యూరోపియన్ సాహిత్యాల్లోని పేరడీ రచనల పరిచయం, వాటి మీద వచ్చిన విమర్శ ప్రభావం 3. సాహిత్య వినోదాన్నీ, సాహిత్య వివాదాలనూ ప్రోత్సహించే పత్రికలూ రచయితల బృందాలు, ప్రాచీన కవులకంటె భిన్నమైన ఆధునిక రచయితల సాహిత్య వినోద దృష్టి, విమర్శక దృక్పథమూ.

### 17.4.1 పేరడీ లక్షణాలు

1. స్వతంత్ర రచన కాకూడదు, కాదు.
2. మరొకరి రచననుండి పుడుతుంది. అంటే ఇది ఒక మాతృకకు ఒక అనుకరణ రచన.
3. మాతృక ఏ రూపంలో ఉంటే అనుకరణ అదే రూపంలో ఉండాలి. కవిత్వం కూడా పద్యమయితే పద్యంలో, గేయమైతే గేయంలో, వచన రచన విషయంలో కూడా అంతే. మాతృకను బట్టే పుత్రిక. కథ అయితే కథ. నవల అయితే నవల, నాటిక అయితే నాటిక.
4. కేరికేచరు రూపంలో ఉంటుంది.
5. మాతృకలోని గంభీరవస్తు స్థానంలో ప్రాముఖ్యంలేని వస్తువు చోటు చేసుకుంటుంది.
6. మాతృకలోని నిర్మాణం, ఛందస్సు, శైలి, బాణీ అనుకరణ జరుగుతుంది.
7. మాతృకలోని వస్తువుకూ రచనా పద్ధతికీ మధ్య ఉండే సమన్వయం విరూపమై పోతుంది.
8. వినోదం, విమర్శ, సంస్కరణ దృష్టి ఉంటాయి.
9. మాతృక మీద గౌరవంతో జరిగే రచనేకానీ, మాతృక రచయితమీద వ్యక్తిగత ద్వేషంతో సాధారణంగా జరిగే రచనకాదు.

ఈ లక్షణాలను దృష్టిలో పెట్టుకుంటే పేరడీని మనం ఈ రకంగా నిర్వచించుకోవచ్చు: పేరడీ అంటే ఒక స్వతంత్ర సాహిత్య రచనను ఆధారంగా చేసుకొని, ఆ రచనలోని వస్తు గాంభీర్యాన్నీ, శైలీగాంభీర్యాన్నీ అకటా వికటం చేసి వినోదం, విమర్శ, సంస్కరణ లక్ష్యంగా సాగే ఒక విరూప, అనుకరణ పరిహాస రచన.

BRAOU

(కె.వి. రమణారెడ్డిగారు సంకలనం చేసిన జరుక్‌శాస్త్రి పేరడీలు ఇతర రచనలు అనే పుస్తకం 'జరుగ్వేదనా భూమికలో' పేరడీకి ఒక నిర్వచనం ఇచ్చారు. "మాతృకలాగానే వుంటూ అర్థాన్ని లఘువు చేస్తూ అపహసిస్తూ తల్లి వేలితో తల్లికన్నే పొడిచేలా రూపొందే రచనా పుత్రికను 'పేరడీ' అనవచ్చు" అని.

#### పేరడికి తెలుగు మాట :

మనకు తెలుగు సాహిత్యంలో ఎన్నో చాటు పద్యాలు కన్పిస్తాయి. వాటిలో పైన వివరించిన కొన్ని లక్షణాలు కన్పించవచ్చు. అయితే పేరడీ అనే మాటకు చాటువును సమానార్థకంగా భావించలేము. నోరి నరసింహశాస్త్రిగారు పేరడీని 'కోతి కొక్కిరాయి కవిత్వం' అని అన్నారంటే అదికూడా సమానార్థకం కాదు. అదనపు సమాచారం కింద ఇచ్చిన మాచిరాజు దేవీప్రసాద్ వ్యాసంలో పేరడీని 'ఒక ముక్కలో వికట కవిత్వం' అనవచ్చునంటాడు. ఆచార్య జి.యన్. రెడ్డి సంపాదకత్వం కింద తెలుగు అకాడమి 1978 లో వెలువరించిన ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులో పేరడీకి వికట కవిత్వం అనే అర్థంతోపాటు, పరిహాసకృతి అనే అర్థం కూడా లభిస్తుంది. ఈ మాటల్లో వికట కవిత్వం అనేది పేరడీకి చాలా దగ్గర పదం. తెనాలి రామలింగడికి వికట కవి అనే బిరుదేదో ఉంది అనే విషయం జ్ఞాపకం వస్తే, ఆయన రాసిన పద్యాలు పేరడీలు అనుకోవలసి వస్తుంది. కాబట్టి పేరడీ అనే మాటనే ఇంగ్లీషు నుంచి తెలుగులోకి తెచ్చుకోవడం, దానికి తగిన అర్థం ఇచ్చుకోవడం మంచిది.

## అభ్యాసం – 1

రచనా ప్రక్రియగా పేరడీ స్వరూపం ఏమిటి ?

### 17.4.2 పేరడీల లక్ష్యం

తెలుగులో పేరడీలు మొదలై యాభై ఏండ్లు పైబడింది. భావ కవితా ధోరణికి, అభ్యుదయ కవితా ధోరణికి చెందిన ప్రముఖ కవుల రచనలకు తెలుగులో పేరడీలు వెలసాయి. అట్లాగే వివిధ రచయితల వైయక్తిక భావ వ్యక్తీకరణ పద్ధతిని అనుకరిస్తూ, పేరడీలు వచ్చాయి. భావ కవిత్వంలోని సుకుమార భావన, విషాద ప్రణయమాధుర్యానుభూతులూ, పదలాలిత్యమూ పేరడీకి గురి అయ్యాయి. అభ్యుదయ కవిత్వంలోని ప్రాపంచిక దృక్పథమూ, తీవ్రానుభూతులూ, జలపాత సదృశ పదవిన్యాసమూ కొత్త కవితా సంప్రదాయాలు పేరడీకి గురి అయ్యాయి. నవీన కవితా ప్రక్రియల అనుకరణా, సాహిత్య వినోదం ద్వారా పాఠకులను గిలిగింతలు పెట్టడం పేరడీల లక్ష్యం.

### 17.4.3 తెలుగులో పేరడీకారులు

BRAOU

దేవులపల్లి కృష్ణశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ వంటి కవుల రచనల మీద ప్రధానంగా పేరడీలు వచ్చాయి. చలం, విశ్వనాథ సత్యనారాయణ, మొక్కపాటి నరసింహశాస్త్రి, రంగనాయకమ్మ రాచకొండ విశ్వనాథశాస్త్రి వంటి వచన రచయితల శైలులను అనుకరిస్తూ పేరడీలు వెలువడ్డాయి. తొలితరం పేరడీ కవులలో ప్రసిద్ధులు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, మాచిరాజు దేవీప్రసాద్. మలితరం పేరడీ రచయితలలో ప్రముఖుడు శ్రీరమణ.

## అభ్యాసం – 2

తెలుగులో వచ్చిన ఒక పేరడీని సమగ్రంగా చర్చించండి ?

## రహదార్లు

[ శ్రీశ్రీ వ్రాసిన విలక్షణమైన "దేశ చరిత్రలకు" సలక్షణమైన వికట కవిత్వ పరివర్తనం]

ఏ రోడ్డు చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
రహదార్ల చరిత్ర సమస్తం
ధూళి ధూసర పరిన్యస్తం.

రహదారి చరిత్ర సమస్తం
యాతాయాత జన సంయుక్తం :
రహదారి చరిత్ర సమస్తం
పథిక వాహన ప్రయాణసిక్తం.

భూంకార గర్జిత దిగ్భాగం,
చక్రాంగ జ్వలిత సమస్తాంగం !
రహదారి చరిత్ర సమస్తం
పైజమ్మాలను పాడుచేయడం.

పెనుదారులు కాలిబాటల
సామంతుల కావించెను :
హైరోడ్డులు అశోకుల్లై
చరిత్రమున ప్రసిద్ధికెక్కెను.

బాటలు తీరని పట్నం భూ
స్థలమంతా వెదికిన దొరకదు :
పురమంతా తీరును సీధులు,
కాకుంటే కోయును పధ్యా.

దుమ్మెక్కిన సితభిత్తికలూ,
సళ్ళిచ్చిన పృథువేదికలూ,
ఇహలోకపు వైతరణీ
పురవీధుల భూషించెను.

చిన్‌షెన్‌క్యా, దంతపుకట్టూ,
చైనా షాపూ, గోవిందప్పా,
గిడ్డంగులు గుచ్ఛూ, కోనేళ్ళూ,
వీధుల భాగ్యం నిరూపించినవి.

లారీ రాజం భారీ బస్సూ
రోడ్డు రోలర్ బ్రెన్‌గన్‌కారీర్,
ట్రాంకారూ, ఏవైతేనేం ?
ఒత్తేయును టూత్పేస్టుల ట్యూబల్లె

జమీందారూ గుఱ్ఱపు సార్టూ,
సర్కిల్ శకటపు ఘుర్ఘురనాదం,

పేరడీకి మాతృక

### శ్రీశ్రీ

### దేశ చరిత్రలు

ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.

నరజాతి చరిత్ర సమస్తం
పరస్పరాహరణోద్యోగం :
నరజాతి చరిత్ర సమస్తం
రణరక్త ప్రవాహ సిక్తం.
బీభత్సరస ప్రభావం,
పిశాచగణ సమవాకారం :
నరజాతి చరిత్ర సమస్తం
దరిద్రులను కాల్చుకుతినడం.

బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి

రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెదకిన దొరకదు
గతమంతా తడిసె రక్తమున,
కాకుంటే కన్నీళులతో.

చల్లారిన సంసారాలూ,
మరణించిన జన సందోహం,
అసహాయుల హాహాకారం
చరిత్రలో మూలుగుతున్నవి.

వైషమ్యం, స్వార్థపరత్వం,
కౌటిల్యం, ఈర్ష్యలు, స్పర్థ
మాయలతో మారుపేర్లతో
చరిత్రగతిని నిరూపించినవి.

జెంఘిజ్ ఖాన్, తామర్లేనూ,
నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ.
సికందరో ఎవడైతేనేం ?
ఒకొక్కడూ మహాహంతకుడు.

వైకింగులు, శ్వేతహూణులూ,
సిథియన్లూ, పారశీకులూ,

యుద్ధపు సైన్య పాద విఘాతం
నాడుల నన్నిటి స్పందించును.

వామహస్తపు వక్రీకరణం,
భటవేదిక కర్ధీభ్రమణం,
కుచోద్గారిత తీవ్రధ్వానం
పుట్టిన వెన్నో రక్షణకై,

ఆకసమెక్కే మీటర్ బ్రిడ్జీ
ప్రక్కన పరిచిన పథవేదికలూ
పచ్చని యెర్రని దీపక్కాంతీ
తగ్గించును ప్రాణాపాయం ?

ఒక కారును వేరొక కారూ
ఒక లారిని యింకొక లారీ
చుంబించె క్షణమందున
రూల్సన్నీ దాగును యెచ్చట ?

ఈ నడివీధికి సంగముందా ?
ఆ రహదారీ వాలంబెంతది ?
పోసిన రాళ్ళూ, నడిపిన గుళ్ళూ
యివి కావోయి బాటల భాగ్యం

శృంగాటక కింకరు నాట్యం,
బంగాళా దీపపు తేజం,
క్రాసింగుల కేటాయింపులు
యివి కావోయ్ బాటల శాస్త్రం.

వింధ్యధరా విపిన శ్రేణుల
భీకరకానల చిందులు త్రొక్కే
మార్గాలెన్నో కావాలిప్పుడు !
మరణించిన మరణించని సత్యం.

ఏథెన్సున ఫియిడీ పైడ్సు
బర్మా దేశపు కాందిశీకులు,
లంఘించిన వాయుతనూజుడు,
దారెరుగని ధీరులందరూ—

ధృవాంతరస్కేటర్, యెస్కిమో,
పంథాలెరుగని పాదచారులు
మార్గాటవి గమ్య విశేషం,
గ్రోలింతురు గోల్డ్స్మి కల్లే.

రహదారుల మధ్యదారిలో
అగుపించే హంతకు లెవ్వరు ?
ప్రక్కన పెట్టిన రోలర్ కాదోయ్.
దాని గ్రుద్దిన బండ్లెన్నీ ?

నల్లమలా కనుమల మధ్యన
జల్లించిన వంకర లెచ్చట ?

పిండారులు, ఠగ్గులు కట్టి
కాలానికి కత్తుల వంతెన.

అజ్ఞానపు బంధయుగంల
ఆకలిలో, ఆవేశంలో –
తెలియని ఏ తీవ్రశక్తుల
నడిపిస్తే నడిచి మనుష్యు

అంతా తమ ప్రయోజకత
తామే భువికధినాథులమని
స్థాపించిన సామ్రాజ్యాలూ
నిర్మించిన కృత్రిమ చట్ట

ఇతరేతర శక్తులు లేస్తే
పడిపోయెను పేక మేడ
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టి

చిరకాలం జరిగిన మో
బలవంతుల దౌర్జన్యా
ధనవంతుల పన్నాగా
ఇంకానా, ఇకపై చెల్లవు

ఒక వ్యక్తిని మరొక్క వ్య
ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మ
ఇంకానా? ఇకపై సాగదు.

చీ...లో ...లా,
చెక్ దేశపు గనిపనిమనిషి,
...డున ఓడ కళాసీ,
అణగారిన ఆర్తులందరూ—

హాటెన్‌టాట్, జూలూ, నీగ్రో
ఖండాంతర నానా జాతులు
చారిత్రక యథార్థతత్త్వం
చాటిస్తారొక గొంతుకతో.

ఏ యుద్ధం ఎందుకు జరిగెన
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో ?
తారీఖులు, దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం.

ఈ రాణీ ప్రేమ పురాణం,
ఆ ముట్టడికైన కర్చులూ
మతలబులూ, కైఫీయతు
ఇవి కావోయ్ చరిత్ర సార

ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించ

మైలున్నర కృత్తపెరందున
గోళ్ళను లేపని రాళ్ళెన్ని ?

కార్కోరం, లక్ష్మణఝూలా,
టర్కీలో గృహాంతర మార్గం.
హూగ్లీ బ్రిడ్జి, థెర్మాపైలే,
యమునా స్థంభిత ఘట్టంలో -

చారిత్రక విభాత సంధ్యల
మార్గ వినిర్గత శాస్త్రం బెట్టిది ?
ఏ గీతం ? ఏ కాలంలో ?
సాధించినదీపరిపూర్ణం ?
ఏజల సూత్రం ? ఏకలవింకం ?
చూపించిరి యీ వికటత్వం ?

యెగతాళుల ప్రతిబింబం ?
ఈ భావం ? ఈ కిష్కింధం ?
ఈ భాష్యం ? ఈ బాంధవ్యం ?

కథలన్నీ కావాలిప్పుడు !
దాచేస్తే దాగని సత్యం.

నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది ?
తాజమహల్ నిర్మాణానికి
రాళ్లెత్తిన కూలీలెవ్వరు ?

సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహసమెట్టిది ?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్,
అది మోసిన బోయీలెవ్వరు ?

తక్షశిలా, పాటలిపుత్రం,
మద్యధరా సముద్రతీరం,
హరప్పా, మొహెంజొదారో,
క్రో-మాన్యాన్ గుహాముఖాల్లో

చారిత్రక విభాతసంధ్యల
మానవకథ వికాసమెట్టిది ?
ఏ దేశం ఏ కాలంలో
సాధించిన దేపరమార్థం ?

ఏ శిల్పం? ఏ సాహిత్యం ?
ఏ శాస్త్రం ? ఏ గాంధర్వం ?
ఏ వెల్గులకీ ప్రస్థానం ?
ఏ స్వప్నం ? ఏ దిగ్విజయం ?

### 17.5.1 కఠిన శబ్దాలకు అర్థాలు

| | | |
|---|---|---|
| ధూళిధూసర పరివ్యస్తం | = | దుమ్మూ, గడ్డిగాదంతో బాగా నిండింది. |
| యాతాయాత జన సంయుక్తం | = | వచ్చేపోయే జనంతో కూడింది |
| సితభిత్తికలు | = | తెల్లటి గోడలు |
| పృథువేదికలు | = | పెద్ద అరుగులు |
| వైతరణి | = | నరకంలోని నది |
| గుఱ్ఱపు సార్టు | = | గుర్రాల దండు సార్టు (Sartie) |
| శృంగాటకకింకరు నాట్యం | = | నాలుగు దోవలు కలిసిన దారిలో దాసుడి నాట్యం |
| స్కేటర్ | = | (మంచుపై జారే ఆటగాడు) Skater |
| థెర్మాపైలే | = | Theropylae స్పార్టన్లకూ, పర్షియన్లకూ క్రీ. పూ. 480 జరిగిన యుద్ధం |
| విభా | = | ప్రాతఃకాలం |
| జలసూత్రం | = | ప్రముఖ పేరడికవి జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి (1914 - 1968) |
| కలవింకం | = | ఒక అజ్ఞాత సంస్కృత, విదూషక కవి అట |
| భాష్యం | = | సూత్రవ్యాఖ్యాన గ్రంథం (వ్యాఖ్యానం) |

BRAOU

## 17.5.2 వ్యాఖ్యానం

'రహదార్లు' పాఠ్య రచయిత మాచిరాజు దేవీప్రసాద్ (1922 - 1974). దేవీప్రసాద్ పరిహాస రచనలకు ప్రసిద్ధుడు. ప్రఖ్యాత తెలుగు రచయితల రచనల బాణీలను అనుకరించడమనే కళలో ఆరితేరినవాడు. సాహిత్యంలో తనది విదూషకపాత్ర అని చాటుకున్న విశిష్ట సాహిత్యకారుడు.

1932-52 మధ్య కాలంలో కృష్ణాపత్రిక, భారతి, చిత్రాంగి, ఆంధ్రపత్రిక, నవోదయ వంటి పేరుమోసిన పత్రికల్లో దేవీప్రసాద్ రచనలు ప్రచురితమయ్యాయి. ప్రముఖ కవి అనిసెట్టి సంకలనం చేసిన కల్పన (1952) ఆధునిక కవితా సంకలనంలో దేవీప్రసాద్ రాసిన సంక్రాంతి కానుకలు, రహదార్లు, నేర్చుకోండి, మా వాహనం రాజకీయ బాధితుడు అనే కవితా ఖండికలు లభిస్తాయి.

దేవీప్రసాద్ చేపట్టిన ప్రక్రియలు పద్యం, గేయం, నాటిక, కథానిక, నవల. ఆధునిక తెలుగు సాహిత్యంలోని పేరడీ అనే కొత్త ప్రక్రియలో సిద్ధహస్తుడు. పేరడీ రచనలో (వివరాలకు విశేషాంశాలలో చూడండి) దేవీప్రసాద్‌ది ప్రధానంగా సాహిత్య వినోదదృష్టి. ఒక రకంగా సాహిత్య విదూషక దృష్టి. ఏ రచనను పేరడీ చేస్తున్నా, ఆ రచనలాగే మరొక రచనను సృష్టించగల శబ్ద మాంత్రికుడు. భావకవుల్లో రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నాయని, వేదుల, శివశంకరశాస్త్రిల కవితాఖండికలకు పేరడీలు రాశాడు. అభ్యుదయ కవుల్లో శ్రీశ్రీని పేరడీ చేశాడు.

శ్రీశ్రీ 'దేశచరిత్రలు' అనే గేయానికి ఈ పాఠ్యం ఒక పేరడీ. పాఠ్యమైన 'రహదార్లు' గేయాన్ని ఎడమవైపు ఇస్తున్నాము. శ్రీశ్రీ దేశచరిత్రలు గేయాన్ని కుడివైపు ఇచ్చాము. ముందు రహదార్లు చదవండి. తర్వాత రహదార్లను దేశచరిత్రలుతో పరిశీలనగా పోల్చుకుంటూపోతూ చదవండి. ఒకటికి రెండుమార్లు చదవండి. విశేషాంశాలు చదివి మళ్ళీ పాఠ్యం చదవండి. పేరడీ అంటే ఏమిటి ? పేరడీ ఎందుకు రాస్తారు ? పేరడీకి తెలుగు మాట ఏది ? ఈ ప్రక్రియ ఆవిర్భావానికీ, వికాసానికీ హేతువులేవి ? ఈ ప్రక్రియను తెలుగులో చేపట్టిన వాళ్ళెవరు? వాళ్ళు ఏ ధోరణుల జోలికి వెళ్ళారు? మాచిరాజు దేవీప్రసాద్ ప్రత్యేకత ఏమిటి? రహదార్లు రచనా వైశిష్ట్యం ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు స్థూలంగా తెలుసుకుంటారు.

శ్రీశ్రీ దేశచరిత్రలు ఖండికలోని కవితా వస్తువు చరిత్ర. ఒక గంభీరమైన తాత్త్విక దృష్టితో వస్తు నిర్వహణ సాగింది. చరిత్ర పట్ల కవికుండే అవగాహనను ప్రస్ఫుటం చేస్తూ సాగింది. తీవ్రమైన అనుభూతితో గేయం నడిచింది. ఇంతవరకూ నడిచిన దేశచరిత్రలు ప్రధానంగా వర్గ సమాజాల చరిత్రలనీ. వర్గ సమాజాల్లో ఆర్థిక సాంఘిక శక్తులమీద అధికారం ఉన్న వర్గాలు, అవిలేని వర్గాన్ని కాల్చుకతిన్నాయనీ, రక్తప్రవాహంలో ముంచాయనీ, ఈ వర్గ సమాజం ఇక చెల్లదనీ, చెల్లకూడదనీ, శ్రీశ్రీ ఒక చారిత్రక అవగాహనను కల్పిస్తున్నాడు. ఒక అనివార్యమైన ఆగ్రహాన్ని కల్గించడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఇంత గంభీరమైన తాత్త్విక వస్తువు స్థానంలో దేవీ ప్రసాద్ తన పేరడీ రహదార్లు ఖండికలో ప్రత్యామ్నాయంగా ప్రవేశపెట్టిన కవితావస్తువు రోడ్లు. అంటే, మాతృకలోని కవితా వస్తువుకు, కావాలని ఒక మామూలు వస్తువుతో పోటీపెట్టి వికటం చేస్తున్నాడు. ఎగతాళి చేస్తున్నాడు. "కిష్కింధం" (కోతి పని) చేస్తున్నాడు.

పేరడీ కవి, కవితా వస్తువు తీసుకున్న రోడ్డును మాతృక కవితలాగా గంభీరంగా నిర్వహించలేదు; వర్ణించలేదు. చమత్కారం, పరిహాసం, వ్యంగ్యం ప్రతి మాటలోనూ దట్టిస్తూ రోడ్డు చరిత్రలను పేరడీకారుడు అనుసృష్టించాడు. వర్గ సమాజాల పాశవిక చరిత్రతో పోలిస్తే, రోడ్ల చరిత్ర ప్రముఖమైందికాదు. కానీ పేరడీ కవి పనిగట్టుకొని సాహిత్య వినోదం కోసం హేళన చేస్తున్నాడు.

దేశచరిత్రలు మాత్రా ఛందస్సులో నడిచిన గేయం. నాలుగేసి పాదాల వరుసలు ఉన్నాయి. ఆరు పాదాల వరుస కన్పించదు. రహదార్లు కూడా మాత్రఛందస్సులో నడిచింది. పాద విభజన నాలుగేసి పాదాల చొప్పున కాకుండా, ఒకచోట ఆరేసి పాదాల వరుస కన్పిస్తుంది. "కార్కోరం, లక్ష్మణ క్రమాన్ని పూర్తిగా పేరడీ కర్త అనుసరించినట్లు కనపడదు. ఐతే ఎక్కువ భాగం అనుసరించాడు. దేశచరిత్రలులో నాలుగు పాదాల వరుసలు మొత్తం 24. అంటే మాతృక 96 పాదాల రచన. పేరడీలో నాలుగు పాదాల వరుసలు మొత్తం 20+6 పాదాల వరుస ఒకటి + 3 పాదాల వరుస ఒకటి పేరడీ 89 పాదాల రచన.

BRAOU

దేశ చరిత్రలులో కవి భావాల్లో ఒక క్రమం ఉంది. కవి చెప్పదలచుకున్న జీవిత సత్యానికి అనుగుణంగా ఆయా పదచిత్రాలు ఒక తర్క క్రమంలో సాగుతాయి. పేరడీలో పేరడీ కవి అదే పదచిత్రాలను, అనుకరిస్తూ తను పాఠకులకు అందివ్వాలనుకున్న వినోదాన్నీ, పరిహాసాన్నీ, అందిస్తున్నాడు.

ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
నరజాతి చరిత్ర సమస్తం
పర పీడన పరాయణత్వం

అనే దేశ చరిత్రలు లోని ఎత్తుగడ ఒక ప్రశ్నతో, దానికి సమాధానంతో మొదలవుతుంది. దేశచరిత్రలు గేయానికి ఈ ఎత్తుగడ ఒక భూమిక. మధ్యలో ఈ భూమికను అనేక దృష్టాంతాలతో నిరూపిస్తాడు.

ఏ శిల్పం ? ఏ సాహిత్యం ?
ఏ శాస్త్రం ? ఏ గాంధర్వం ?
ఏ వెల్గులకీప్రస్థానం ?
ఏ స్వప్నం ? ఏ దిగ్విజయం ?

అంటూ ముగింపులో ప్రశ్నలతో తను నిరూపించిన అంశంపట్ల పాఠకులలో ఆలోచనలు రేకెత్తిస్తాడు. పేరడీకవి కూడా ఎత్తుగడలో, మధ్య దృష్టాంతాలలో, ముగింపులో ఇదే నిర్మాణ పద్ధతిని అవలంబిస్తున్నట్లు చూడగలం. అందివ్వాలనుకున్న సందేశంలో, అనుభూతిలో తేడా ఉంది కానీ, నిర్మాణంలో తేడా అంత కన్పించదు. మాతృకలోని ఆయువుపట్టులోనే నిర్మాణం కూడా.

### 17.5.3 విశేషాంశాలు

**ఛందస్సు :**

శ్రీ శ్రీ గేయం మిశ్రగతిలో ఉంది. 6 + 8 మాత్రల మిశ్రగతి ఇది. 3 + 3 + 4 + 4 మాత్రల విభజన కూడా ఈ గతిలో ఉండవచ్చు. పేరడీకారుడు ఛందస్సును అనువదించినా, నియమోల్లంఘనలు కూడా చేశాడు.

ఉదాహరణకు :

"భూంకార పూరిత దిగ్భాగం
చక్రాంగ జ్వలిత సమస్తాంగం" (పేరడీ)

అనే రెండు పాదాలలోని మాత్రాసంఖ్యను

"భీభత్స రస ప్రధానం
పిశాచ గణ సమవాకారం ! (మాతృక)

అనే రెండు పాదాలలోని మాత్రా సంఖ్యతో పోల్చి చూడండి మాతృకలోని మాత్రాసంఖ్య కంటే పేరడీలోని మాత్రా సంఖ్య ఎక్కువ.

**శైలి :**

ఒకరి శైలిలోని ఆయువుపట్టు మరొకరు తెలుసుకోవడమే ఒక్కొక్కసారి కష్టం. అట్లాంటప్పుడు స్వంత శైలికి పేరుపడిన ఒక రచయిత రచనా విధానంలో మరొక రచయిత పరకాయప్రవేశం చేయడమంటే మాటలు కాదు. పేరడీకవి ప్రతిభ ఇక్కడే వ్యక్తమయ్యేది.

శ్రీ శ్రీ పదసంయోజన వాక్య సంయోజన ఒక ప్రత్యేక బాణీకి చెందినవి.

శ్రీ శ్రీ శైలిలోని ప్రధానగుణం ఉద్వేగం. ఆ ఉద్వేగం భావనలో, వస్తుతత్వంలో కన్పిస్తుంది. దానిని అనుసరించే పద సంయోజనమూ, వాక్య సంయోజనమూ ఉంటాయి. సంస్కృత సమాసాలు వాడినా, తేట తెనుగు మాటలు వాడినా, ప్రశ్నార్థకాలు ఉపయోగించినా, ఆశ్చర్యార్థకాలు ఉపయోగించినా, అవి భావస్ఫోరకంగా ఉంటాయి.

 గేయ నిర్మాణంతో లయతో సంబంధం కలిగి ఉంటాయి.

BRAOU

రహదార్లు గేయంలో శ్రీశ్రీ శైలికి చాలా సన్నిహితమైన అనుకరణ కన్పిస్తుంది. పేరడీ మౌలిక లక్షణం వినోదం కాబట్టి మాచిరాజు దేవీప్రసాద్ పదసంయోజనమూ, వాక్య సంయోజనమూ అందుకు అనుగుణంగా సాగడం మీరు చూడవచ్చు.

మాతృక రచయిత భావనాబలంతో, శబ్దశక్తితో పోటీ పడగలిగిన సృజనసామర్థ్యం, మాతృక రచయితను తలపించే నిర్మాణ కౌశలం ఉంటే తప్ప మంచి పేరడీ రచన సాధ్యం కాదు. అన్నిటికీ మించి మాతృక మీద అపార గౌరవమో, అనంత తిరస్కారమో ఉండాలి. మాచిరాజు దేవీప్రసాద్ సృజనశక్తికీ, నిర్మాణ కౌశలానికి, శ్రీశ్రీ మీద గౌరవానికి రహదార్లు ఒక తార్కాణం.

### అభ్యాసం – 3

'రహదార్లు' రచయిత ప్రదర్శించిన నైపుణ్యాన్ని చర్చించండి ?

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 17.6 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- పేరడీ అనే ఇంగ్లీష్ పదానికి మూలం పెరోడియా (Parodia) అనే గ్రీక్ భాషా శబ్దం.
- మూలరచనలోని శైలినీ, ఛందస్సునూ, భావచిత్రాలనూ వెక్కిరిస్తూనో, మెచ్చుకుంటూనో కేరికేచర్ (Caricature) రూపంలో రాసే అనుకరణ రచన కవిత్వరూపంలో ఉండే పేరడీ.
- ప్రాచీనాంధ్ర సాహిత్యంలోని చాటువులు, యూరోపియన్ రచనల్లోని పేరడీలు, సహృదయులలోని సాహిత్య వినోదదృష్టి తెలుగులో పేరడీ రచనకు నాంది పలికాయి.
- పేరడీ కవిత్వ లక్షణాలు తొమ్మిది.
- ఆధునిక కవిత్వం ప్రక్రియల అనుకరణ, పాఠకులకు ఆనందం కలిగించడం పేరడీ రచనల లక్ష్యం.
- జరుక్ శాస్త్రి, మాచిరాజు, శ్రీరమణ పేరడీ రచయితలలో ముఖ్యులు.
- ఆధునికాంధ్ర కవిత్వంలో గ్రంథరూపంగానే కాక, విడివిడిగానూ ఎన్నో పేరడీలు వచ్చాయి.
- శ్రీశ్రీ 'దేశచరిత్రలు' కవితకు పేరడీ మాచిరాజు 'రహదార్లు'.
- 'రహదార్లు' మాతృకను శైలిలో, ఛందంలో అనుకరిస్తూనే తన ప్రత్యేకతను కూడా నిలబెట్టుకుంది.
- తెలుగు పేరడీ కవుల్లో సమున్నత స్థానం అధివసించినవాడు మాచిరాజు.

## 17.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు ముప్పై పంక్తుల్లో జవాబులు రాయండి.

1. పేరడీని నిర్వచించి, దాని లక్ష్య లక్షణాలను వివరించండి.
2. మాచిరాజు 'రహదార్లు' వైశిష్ట్యాన్ని తెలపండి.



BRAOU

II. ఈ కింది ప్రశ్నలకు పదిహేను పంక్తుల్లో జవాబులు రాయండి.

1. తెలుగులో ప్రముఖ పేరడీకారులు ఎవరు ? వారెవరెవరిని అనుకరించారు ? క్లుప్తంగా తెలపండి.
2. చాటువుకూ పేరడీకి తేడా ఏమిటో సోదాహరణంగా వివరించండి ?

## 17.8 ఆకళింపు ప్రశ్నలు

1. 'మహాభావకవి బచ్చు పిన వీరారెడ్డి' అనే ఆయన గోలకొండ 6-7-1936 (ఈ గేయాన్ని సేకరించి ఇచ్చినవారు శ్రీ జయధీర్ తిరుమలరావు) నాటి పత్రికలో ఈ గేయాన్ని రాశాడు. మహాప్రస్థానం చదివి ఇది ఏ గేయానికి పేరడీనో గుర్తించండి. ఆ మాతృక వెలువడిన కాలాన్ని కూడా గమనించండి. 50 ఏళ్ల కిందటి రచన అని మరచిపోకండి.

    కుచ్చుటోపిల్
    పెట్టుకోని
    పట్టు షేర్వానీల్ తొడిగి
    నైను సైతం ముల్కినంటూ
                గర్వపడతాను

    తెలుగు తల్లికీ
    స్వస్తి చెప్పి
    'దేశభాష' ని ఉర్దునేర్చి
    నైను సైతం ముల్కినంటూ
                గర్వపడతాను.

    తెలుగు బిడ్డనని
    చెప్పుకోకా
    మతము మతమని గోలపెట్టా
    నేను సైతం ముల్కినంటు
                మురిసిపోతాను.

   ఈ గేయంలో వస్తువు ఏమిటి ? మాతృక నిర్మాణాన్ని ఛందస్సునూ శైలినీ పేరడీ కవి ఎట్లా అనుకరించాడు. పరిశీలించండి.

2. ప్రఖ్యాత పేరడీకవి జలసూత్రం రుక్మిణీ నాథశాస్త్రి (జరుక్‌శాస్త్రి) పేరడీలు ఇతర కవితలను కె.వి. రమణారెడ్డిగారు సంకలనం చేశారు. (నవోదయ పబ్లిషర్స్) విజయవాడ, మే 1982) ఈ సంకలనంలోని హితోపదేశం రాయప్రోలు శతక పద్యశైలికి పేరడీ. పదాలు లేని అర్థం కృష్ణశాస్త్రి రచనకు పేరడీ. సరదాపాట, విశిష్టాద్వైతం శ్రీ శ్రీ గేయాలకు పేరడీలు. మల్లవరపు విశ్వేశ్వరరావు రచన శంఖనాదంను కష్ కష్ అని పేరడీ చేశాడు. వాటినీ వాటి మాతృకలనూ సంపాదించి చదవండి. వాటి రచనలో పేరడీకారుడికి రచయితల మీద ద్వేషం ఏమైనా కన్పిస్తూ ఉందేమో చూడండి.

3. శ్రీ రమణ పేరడీలు పరిశీలించండి.

## అభ్యాసాలకు జవాబులు

1. ఆధునికాంధ్ర సాహిత్యంలో పొడసూపిన నవీన సాహిత్య ప్రక్రియల్లో పేరడీ ఒకటి. పేరడీ అంటే ఒక ప్రఖ్యాత కవి రచనను వెక్కిరిస్తూనో, మెచ్చుకుంటూనో కవిత్వరూపంలోనే అనుకరించడం. ఈ అనుకరణలో మాతృకలోని శైలి, ఛందం, సమాసవిన్యాస పద్ధతి మొదలైనవన్నీ పేరడీ రచయిత అనుకరిస్తూనే తన ప్రత్యేకత నిలుపుకుంటాడు. అత్యుదాత్తంగా మాతృక వర్ణించిన వస్తువుతో, పేరడీ అతి సామాన్య వస్తువును సమాంతరంగా ప్రదర్శిస్తూ సాహిత్యరూపంలో విన్యసిస్తుంది. పేరడీలో చాటుపద్యలక్షణం, యూరోపియన్

BRAOU

పేరడీల ప్రభావం, సాహిత్య వినోదదృష్టి అంతర్భూతంగా ఉన్నాయి. కాబట్టి నేటి తెలుగు కవిత్వంలో పేరడీ ఒక విలక్షణమైన సాహిత్య ప్రక్రియ. తెలుగులో ఈ ప్రక్రియను నిర్వహించిన వారిలో జరుక్ శాస్త్రి, మాచిరాజు దేవీప్రసాద్, శ్రీరమణ ముఖ్యులు. ఆనంద వినోదాలను కలిగించడం ఈ సాహిత్య ప్రక్రియ ప్రధాన లక్ష్యం.

2. ఆధునికాంధ్ర సాహిత్యంలో సంప్రదాయ కవితా మార్గ రచనకు ప్రసిద్ధుడు విశ్వనాథ సత్యనారాయణ. ఆయన పద్యరచన ప్రౌఢ సమాసాలతో, సంక్లిష్టమైన భావచిత్రణ పద్ధతిలో అల కారికులు చెప్పిన నారికేళ పాకంలో ఉంటుంది. దీన్ని 'పాషాణ పాకం' గా అభివర్ణిస్తూ పేరడీ చేస్తాడు పేరోడిస్టు. ఆ పేరడీ ఇది :

కించిత్తిక్త కషాయషాడబరసక్షేపాతిరేకాతి వా
క్పంచార ప్రచయావకాశములలో కవ్యుద్ధ; గండాశ్మముల్
చంచల్లీల నుదాత్త వాగ్గరిమతో సాధించి, వేధించు మా
పంచారించి ప్రవహ్లికాకృతిని ఓ పాషాణపాకప్రభూ !

శార్దూల వృత్తంలో - ఇది ఒక చాటు పద్యంలాగా చెప్పినా, నడకలో విశ్వనాథ పద్య శైలి కనపడుతుంది. "పాషాణపాకప్రభూ!" అనే సంబోధన కారికేచర్ (Caricature) రూపంలో పేరడీ లక్షణాన్ని వ్యంజింపజేస్తున్నది. వాగ్ధాటి అనే అర్థంలో "వాక్ + గరిమ" అనే పదబంధం; కవులలో శ్రేష్ఠుడా! అనే అర్థంలో వాడిన "కవి + ఉద్ధ" అనే సమాసం - మూలమూలలా వెదికి, విలక్షణ పదబంధాలను ఏర్చికూర్చే విశ్వనాథసత్యనారాయణ స్వభావాన్నీ, రచనా పద్ధతినీ స్ఫురింపజేస్తున్నది. కాబట్టి తెలుగు పేరడీల్లో ఇది ఒక ముఖ్యమైన పేరడీ.

3. 'రహదార్లు' పేరడీ రచయిత మాచిరాజు దేవీప్రసాద్, శ్రీశ్రీ రాసిన 'దేశచరిత్రలు' కవితను మాతృకగా స్వీకరించాడు. శైలిలో ఛందంలో మాతృకను అనుకరిస్తూనే ప్రత్యేకతను నిలుపుకున్నాడు. ఉదాహరణకు: మాతృక 6 + 8 (3 + 3 + 4 + 4) మాత్రల మిశ్రగతి. దీన్ని అనుకరిస్తూనే మాచిరాజు అక్కడక్కడా ఎక్కువ మాత్రలు ప్రయోగించాడు.

బీభత్స రసప్రధానం
పిశాచగణ సమవాకారం (మాతృక)
భూంకార గర్జిత దిగ్భాగం (15)
చక్రాంగజ్వలిత సమస్తాంగం (16) (పేరడీ)
"ఏదేశ చరిత్ర చూచినా - ఏమున్నది గర్వకారణం ?
నరజాతి చరిత్ర సమస్తం - పరపీడన పరాయణత్వం"

అంటూ తాత్వికంగా, అనుభవదృష్టితో, పరిశీలన దృష్టితో మాతృక కవితాఖండికను ప్రారంభిస్తే, దాన్ని కళాపరంగా అనువదిస్తూ - కవితాఖండిక సంకల్పాన్నే, అన్యముఖంగా మలుస్తూ పేరడీ చేస్తాడు మాచిరాజు.

ఏ రోడ్డు చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
రహదార్ల చరిత్ర సమస్తం
ధూళి దూసర పరివ్యస్తం - అంటూ

ఈ పేరడీలోని శబ్దవిన్యాసంలో శ్రీశ్రీ కవిత్వ పద్ధతిలోని పదాల పొందికే అక్షరాక్షరంలోనూ ప్రతిబింబిస్తున్నది. అంతేకాక కవిత్వంకానీ, కళకానీ మనిషికి వినోదాన్నీ, ఆనందాన్నీ, వికాసాన్నీ కలిగించాలని కూడా సూచిస్తున్నది. అనుకరణలోనూ ఈ విధంగా తన అభిప్రాయలనే ప్రధానంగా ప్రదర్శించడం పేరోడిస్టుగా దేవీప్రసాద్ చూపిన మెలకువ.



BRAOU

**ఈ పాఠ్యాంశ అధ్యయానికి చదవదగిన పుస్తకాలు :**


సి. నారాయణరెడ్డి : ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు : ప్రయోగములు, రచయిత, వివేకనగర్, హైదరాబాదు - 20.

సి. నారాయణరెడ్డి : సమీక్షణం, రచయిత, వివేకనగర్, హైదరాబాద్, రెండవ ముద్రణ, 1977.

వెల్చేరు నారాయణరావు : తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, ప్రథమ ముద్రణ, 1978.

డి. లలిత కుమారి : ఆధునికాంధ్ర కవిత్వము, 27-4-42, మెయిన్ రోడ్, విజయవాడ - 2 ప్రథమ ముద్రణ, 1980.

కె. వి. ఆర్. నరసింహం : ఆధునికాంధ్ర కవితా సమీక్ష, గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ - 2 ప్రథమ ముద్రణ, 1982.

జి. నాగయ్య : తెలుగు సాహిత్య సమీక్ష, 2 Vol, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి, ప్రథమ ముద్రణ, 1983.

కె. రామమోహన్‌రాయ్ : తెలుగు కవితా వికాసం, ఆం. ప్ర. సాహిత్య అకాడమి, ప్రథమ ముద్రణ, 1982.

మద్దూరి సుబ్బారెడ్డి : తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, రాగసుధా ప్రచురణలు, తిరుపతి, ప్రథమ ముద్రణ, 1982.

ఎన్. నిర్మలాదేవి : కృష్ణశాస్త్రి కృతులు - పరిశీలన, సుధాంశ్ ప్రచురణలు, ఆంధ్ర మహిళా సభ కళాశాల, హైదరాబాదు - 7. ప్రథమ ముద్రణ, 1985.

బి. భాస్కర చౌదరి : జాషువా కృతుల సమాలోచన, రచయిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు, ప్రథమ ముద్రణ, 1982.

కె. వి. రమణారెడ్డి : కవికోకిల, కవి కోకిల గ్రంథమాల, నెల్లూరు, ప్రథమ ముద్రణ, 1965.

విశాలాంధ్ర ప్రచురణలు : శ్రీ శ్రీ రచనలు, 3 Vol. హైదరాబాదు, 1970.

విశాలాంధ్ర ప్రచురణలు : బైరాగి సంస్మరణ సంచిక, విజయవాడ, ప్రథమ ముద్రణ, 1979.

డి. లలిత కుమారి : దాశరథి కవితా దర్శనము, 27-4-42, మెయిన్‌రోడ్, విజయవాడ - 2. ప్రథమ ముద్రణ 1981.

నవోదయ ప్రచురణ : ఆరుద్ర రచన; గురజాడ గురుపీఠం (వ్యాస సంకలనం), విజయవాడ - 2. ప్రథమ ముద్రణ, 1985.

టి. శ్రీనివాసాచార్యులు : నారాయణరెడ్డి సాహితీమూర్తి, యువభారతి, కింగ్స్‌వే, సికింద్రాబాద్ - 3. ప్రథమ ముద్రణ 1980.

కె.కె. రంగనాథాచార్యులు (సం) : ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న ధోరణులు, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్, ప్రథమ ముద్రణ, 1982.

పాలేరునుంచి పద్మశ్రీ వరకు : హైమవతి, సుఖేలానికేతన్, ఎర్రమంజిల్ కాలనీ, హైదరాబాదు, ద్వితీయ ముద్రణ, 1982.

నవోదయ ప్రచురణలు : శ్రీరమణ పేరడీలు, విజయవాడ - 2. ప్రథమ ముద్రణ, 1980.

David Lodge : 20th Century literary criticism, Longman group Ltd., Burnt, Mill, Harlow, Essee, UK Second inpression, 1983.


BRAOU

# డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ / బి.ఎస్.సి / బి.కాం. రెండవ సంవత్సరం

## తెలుగు కోర్సు–1 కావ్యకళా పరిచయం

### నమూనా అభ్యాసాలు

### అభ్యాసం – 3

**సూచనలు :**

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాలనుంచి యథాతథంగా జవాబులు రాయకూడదు.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

### ప్రథమ విభాగం

1. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

    1. 'మాతృగీతాలు' లో కన్పించే స్మృతి కవిత్వం లక్షణాలు చర్చించండి?
    2. 'ఆర్తగీతం' భావకవిత్వమా? అభ్యుదయకవిత్వమా? చర్చించండి?

### ద్వితీయ విభాగం

2. ఈ కింది ప్రశ్నకు 15 పంక్తులలో జవాబు రాయండి.

    1. "అయిదూ చిటి గొలుసూ" గేయం గేయకవిత్వంలోని ఏ శాఖకుచెందిందో సోదాహరణంగా నిరూపించండి?

BRAOU

# డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ / బి.ఎస్.సి / బి.కాం. రెండవ సంవత్సరం

## తెలుగు కోర్సు-1 కావ్యకళా పరిచయం

### నమూనా అభ్యాసాలు

### అభ్యాసం – 2

**సూచనలు :**

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాలనుంచి యథాతథంగా జవాబులు రాయకూడదు.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

### ప్రథమ విభాగం

1. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

   1. వేమన శతకంలో కన్పించే సాంఘిక దృక్పథాన్ని సవివరంగా చర్చించండి?
   2. 'యయాతి చరిత్ర' లో కన్పించే అచ్చ తెలుగు గుణం ఏమిటి?

### ద్వితీయ విభాగం

2. ఈ కింది ప్రశ్నకు 15 పంక్తులలో జవాబు రాయండి.

   1. "శ్రీ కాళహస్తీశ్వర శతకము"లో కన్పించే రాజ నిరసనం వివరించండి.

BRAOU

# డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ / బి.ఎస్.సి / బి.కాం. రెండవ సంవత్సరం

## తెలుగు కోర్సు-1 కావ్యకళ పరిచయం

### నమూనా అభ్యాసాలు

### అభ్యాసం - 1

**సూచనలు :**

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాలనుంచి యథాతథంగా జవాబులు రాయకూడదు.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

### ప్రథమ విభాగం

1. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

   1. కథాగేయం అంటే ఏమిటో తెలిపి, చారిత్రిక కథాగేయాన్ని సోదాహరణంగా చర్చించండి?
   2. మార్మిక గేయం లక్షణాలు తెలిపి, మీ పాఠ్యంతో అన్వయించండి?

### ద్వితీయ విభాగం

2. ఈ కింది ప్రశ్నకు 15 పంక్తులలో జవాబు రాయండి.

   1. 'కన్నీటి పాట' లోని విషాద భరితమైన ఉదంతాలు వివరించండి.

BRAOU

# DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

## FACULTY OF ARTS

B.A. SECOND YEAR (3 YEAR DEGREE COURSE) EXAMINATION

MODEL QUESTION PAPER

**Telugu Literature**

COURSE – 1

(Kavya Kala Parichayam)

Time : 3 Hours

Max. Marks. 100
Mini. Marks. 35

### ప్రథమ విభాగం

ఈ కింది వాటిలో ఏ నాల్గింటికైనా 30 పంక్తులలో జవాబులు రాయండి. 15 × 4 = 60
ప్రతి ప్రశ్నకు 15 మార్కులు.

1. కథాగేయం అంటే ఏమిటి? సోదాహరణంగా వివరించండి?
2. మార్మిక గేయం లక్షణాలు తెలిపి మీ పాఠ్యాంశంతో అన్వయించండి?
3. "మడివాలు మాచయ్య" ద్వారా తెలియవచ్చే వీరశైవ మతతత్వాన్ని చర్చించండి?
4. ప్రబంధ లక్షణాలు వివరించి 'మనుచరిత్ర' లోని సూర్యాస్తమయ వర్ణనాంశాలు చర్చించండి.
5. శతక కవిత్వ లక్షణాలు మీ పాఠ్యాల ఆధారంగా నిరూపించండి?
6. 'దేశభక్తి' గేయంలోని కవిత్వ దృక్పథాన్ని వివరించండి?
7. కృష్ణశాస్త్రి కవిత్వంలోని భావకవిత్వ దృష్టిని సమీక్షించండి?
8. 'ప్రతిజ్ఞ' ఏ కవిత్వ దృక్పథానికి చెందిన పాఠ్యమో సమగ్రంగా చర్చించండి?

BRAOU

### ద్వితీయ విభాగం

ఈ కింది పదింటిలో ఏవైనా ఐదు ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో జవాబులు రాయండి. 8 × 5 = 40
ప్రతి ప్రశ్నకు 8మార్కులు.

1. 'ఏనాది పాట'లో కనిపించే భాషా విశేషాంశాలను వివరించండి?
2. 'ఏతంపాట'లోని ప్రతీకలను చర్చించండి?
3. శ్రీనాథుడు భీమ మండలాన్ని ఎట్లా వర్ణించాడు?
4. 'యయాతి చరిత్ర'లోని అచ్చ తెలుగు లక్షణాన్ని సమీక్షించండి?
5. వేమన పద్యాల్లోని సామాజిక దృక్పథాన్ని సమీక్షించండి?
6. "అన్నమాచార్య సంకీర్తన" ద్వారా పదకవిత్వ లక్షణాలను నిరూపించండి?
7. రాయప్రోలు ఆంధ్రుల కిచ్చిన సందేశం ఏమిటి?
8. 'కష్టజీవి'లో ప్రతిబింబించే మతదృష్టిని చర్చించండి?
9. కుందుర్తి వివరించిన రెండు లోకాలు ఏవి?
10. "కర్పూర వసంత రాయలు"లోని గేయ పద్ధతులు వివరించండి?

BRAOU

BRAOU

BRAOU